వ్యాస
మహాభారతం

(తెలుగు వచనం)

ఉద్యోగ పర్వం -2



డాక్టర్ తిప్పాభట్ల రామకృష్ణమూర్తి

డాక్టర్ సూరం శ్రీనివాసులు

శ్రీ లలితా త్రిపుర సుందరీ ధార్మిక పరిషత్

విజయవాడ - 12.

96358

వ్యాస
మహాభారతం
(తెలుగు వచనం)
ఉద్యోగ పర్వం - 2

డాక్టర్ తిప్పాభట్ల రామకృష్ణమూర్తి
డాక్టర్ సూరం శ్రీనివాసులు

894-82781
కామ-మహా

వ్యాస
మహాభారతం (తెలుగు వచనం)
ఉద్యోగ పర్వం - 2

ప్రథమ ముద్రణ : వికృతి ఉగాది (మార్చి 2010)

18 సంపుటాల వెల : రూ. 720/-



ప్రతులకు :
డాక్టర్ తిప్పాభట్ల రామకృష్ణమూర్తి
శివాలయం వెనుక, **పోలకంపాడు,**
తాడేపల్లి పోస్టు, గుంటూరు జిల్లా - 522501,
ఫోన్ : 08645-272093, సెల్ : 9491727611

ప్రచురణ & ప్రతులకు :
శ్రీ లలితా త్రిపుర సుందరీ ధార్మిక పరిషత్
డోర్ నెం. 76-8/1-28, లలితానగర్,
భవానీపురం, విజయవాడ - 520 012.
ఫోన్ : 0866-2414322, సెల్ : 9440346287

అమ్మనాన్నలు : **కరెడ్ల గోపాలకృష్ణమూర్తి, కమలమ్మ**

జన్మనిచ్చిన తల్లిదండ్రులకు కృతజ్ఞతలతో....

వెంకట సీతారామశాస్త్రి, సుందరశర్మ, శ్రీనివాస్

టైటిల్ ముద్రణకు సహకరించినవారు

శ్రీ కమ్ముల వెంకటేశ్వరరావు దంపతులు

శ్రీనివాస ఆఫ్‌సెట్ ప్రింటర్స్, విజయవాడ.

కీ॥శే॥ పరుచూరు నాగేశ్వరరావు గారు

వారి జ్ఞాపకార్థం

టైటిల్ బోర్డు ఇచ్చినవారు

కుమారులు :

శ్రీయుతులు వెంకటమోహన్ బాబా

వెంకటరామ సురేష్

కీ॥శే॥ కోడిదాసు సోమేశ్వరరావు

వారి జ్ఞాపకార్థం

ప్రింటింగ్ ఖర్చులు ఇచ్చినవారు

కుమారులు :

శ్రీయుతులు శ్రీనివాస్, సత్యనారాయణ (చినబాబు)

భవాని, విశాలాక్షి

ఎందరో మహానుభావులు

ఉద్యోగ పర్వం ఇలా సర్వాంగసుందరంగా సకల జనహితంగా తీర్చిదిద్దడానికి ప్రత్యక్షంగాను, పరోక్షంగాను మాకు సహకరించిన డాక్టర్ కాళ్లకూరి అన్నపూర్ణ, డాక్టర్ రేమెళ్ల వేంకట రామకృష్ణ శాస్త్రి, డాక్టర్ చిర్రావూరి శివరామకృష్ణ శర్మ, డాక్టర్ ఎం.టి. ఆళ్వారు, డాక్టర్ పాలపర్తి శ్యామలానంద ప్రసాద్ గార్లకు మా హృదయపూర్వక కృతాజ్ఞతాంజలులు సమర్పిస్తున్నాము.

ఏ పనికైనా భగవంతుని ఆశీస్సులతో పాటు మానుషదైవముల సహాయ సహకారాలు కూడా అవసరమే. కొంతమంది అవ్యక్తముగా వెనక వుండి సత్ కార్యక్రమ నిర్వహణం చేయడంలో సిద్ధహస్తులై ఉంటారు. వారు భగవదాదేశాన్ని పాటిస్తున్నట్లు తమంతా తామే దైవం మానుషరూపేణా అన్నట్లు వచ్చి అవ్యక్తముగా సహకరిస్తారు. అది అభిగమ్యకృతే దానం అన్నట్లుగా నిర్వహింపబడుతుంది. అటువంటి అవ్యక్త సుందరులు మా కరెడ్ల సుందరశర్మ గారు. వారు దీనివెనుక వెన్నెముకలా వుండి సర్వంతానే అయి వ్యవహరించారు. ఈ విషయంలో మేము వారికి కృతాజ్ఞతాబద్ధులమై నిలుస్తున్నాము. అటువంటి పెద్దల సహకారంతో **శ్రీ లలితా త్రిపుర సుందరీ ధార్మిక పరిషత్** ఏర్పడినది.

పంచమవేదమూ, సకలశాస్త్రసారమూ, భారతీయ సంస్కృతికి మూలకందమూ అయిన వ్యాసభారతం మొత్తం పద్దెనిమిది పర్వాలు యథాతథంగా, ఉన్నదిఉన్నట్లుగా సరళమైన తెలుగు వ్యావహారిక భాషలో సామాన్యపాఠకులకు కూడా అర్థమయ్యేటట్లు **తక్కువ వెలలో** అందించాలని

మా సంకల్పం.

ఈ ఆశయాలతో భారతీయ తత్త్వానికి, ఆధ్యాత్మిక తత్త్వానికి, సాహిత్య వైభవానికి సంబంధించిన గ్రంథాలను ముద్రించి తక్కువ వెలలో ప్రజలకు అందివ్వాలని మా ఆకాంక్ష. దీనిని ఆదరించే అభిమానులందరు మా కృతజ్ఞతకు పాత్రులు. ఈ సంస్థ వివిధ పదవులలో పాలుపంచుకుంటున్న పెద్దలు...

1.	గౌరవాధ్యక్షులు	శ్రీ కరెడ్ల సుందరశర్మ
2.	అధ్యక్షులు	డా॥ తిప్పాభట్ల రామకృష్ణమూర్తి
3.	ఉపాధ్యక్షులు	డా॥ సూరం శ్రీనివాసులు
4.	కార్యదర్శి	డా॥ పాలపర్తి శ్యామలానందప్రసాద్
5.	కోశాధికారి	డా॥ ధూళిపాళ రామకృష్ణ
6.	సహాయకార్యదర్శి	డా॥ ఉపద్రష్ట వెంకట రమణమూర్తి
7.	కార్యవర్గసభ్యులు	శ్రీ యండూరి గోవిందరావు
8.	॥	శ్రీ మల్లాప్రగడ శ్రీమన్నారాయణమూర్తి
9.	॥	శ్రీ జన్నాభట్ల వీరేశ్వరశాస్త్రి

అందరికీ వందనాలు

కార్యదర్శి
శ్రీ లలితా త్రిపుర సుందరీ ధార్మిక పరిషత్

చదివి ముందుకు సాగండి

మనిషికి కోరికలు సహజాతాలు. కోరికలు తీర్చుకొనే ప్రయత్నం సహజాతం. కోరికలు తీరినా, తీరకున్నా ఏదో ఒక దశలో ఏదో ఒక కారణం వల్ల కోరికలు దూరం కావాలన్న ఆలోచనా సహజం. ఈ ప్రవృత్తిని అధ్యయనం చేసి, అనుపానులు గ్రహించి మహర్షులే మార్గదర్శనం చేశారో, వారి బోధనలు గ్రహించి మనిషే అలా మారాడో కానీ భారతీయులు ఆ ప్రవృత్తికి అద్భుతంగా స్పష్టంగా రూపకల్పన చేసికొన్నారు. ఆ ప్రవృత్తినే నాలుగుగా విభజించి పురుషార్థాలని పేరు పెట్టుకొన్నారు. అవే ధర్మ - అర్థ - కామ - మోక్షాలు. వాఙ్మయమంతా ఏదో ఒక కోణంలో ఈ అంశాలనే ప్రస్తావిస్తుంది. ప్రస్తుతిస్తుంది. వాటిలో తలమానికం, ఆ వాఙ్మయానికి మూలకందం శ్రీమహాభారతం. దానికి స్రష్ట, ద్రష్ట, కర్త అన్నీ వ్యాసమహర్షియే. పురుషార్థాలకు సంబంధించి భారతంలో ఉన్నదే మరెక్కడయినా ఉంటుందని, ఇక్కడ లేనిది మరెక్కడ ఉండదని ఘంటాపథంగా చెప్పగలిగాడు వ్యాసమహర్షి.

వేదశాస్త్రాలు దేవఋణం, పితృఋణం, ఋషిఋణమని మూడు ఋణాలతో మనిషి జన్మిస్తాడని చెప్తే వ్యాసమహర్షి మనుమార్గంలో మనుష్యఋణాన్ని కూడా చెప్పారు. సామాజికదృష్టిలో ఇది చాలా అద్భుతమూ, ఆదరణీయమూ, ఆచరణీయమూ అయిన అంశం. ఆ మనుష్యఋణాన్ని తీర్చుకొనే మార్గంలో ఆనృశంస్యాన్ని (భూతదయ) ఉద్బోధించారు వ్యాసమహర్షి. ప్రాణులన్నింటిపై కరుణ చూపగలగటమే మనుష్య ఋణవిముక్తికి మార్గం. ఆ విలువను ప్రతిపాదించటానికి తనవారినే భీష్మ, ధర్మరాజ; ధృతరాష్ట్ర, దుర్యోధనులు ప్రతినిధులనుగా స్వీకరించి భారతాన్ని నిర్మించాడు. తానూ ఆ మహానిర్మాణంలో పాత్ర అయి, తన వారిలోని గుణదోషాలనే హేతుబద్ధంగా ప్రస్తావిస్తూ మనిషి ఎలా ఉండాలో, ఎలా ఉండకూడదో **స్పష్టారుంధతీన్యాయంగా** భారతంలో ప్రదర్శించాడు వ్యాసమహర్షి. అన్నమాటకు ఒదిగి ఉండటంతో పాటు అమ్మమాటకు విలువనివ్వటాన్ని కూడా మానవజాతికి నేర్పాడు. దానికి ఇబ్బంది కలుగుతున్న స్థితిలో తానే స్వయంగా వచ్చి పరిష్కరించాడు (పాండవులందరూ

ద్రౌపదిని పెళ్ళి చేసికొనే విషయంలో ద్రుపదుని ఒప్పించి). అమ్మమాటమేరకు తనకవసరం లేకున్నా బిడ్డలను కన్నాడు. తలచుకొంటే చాలు ప్రత్యక్షమవుతానని అమ్మకు మాట ఇచ్చి దాన్ని నిలబెట్టుకొన్నాడు. మానవుడు సంపాదించవలసిన వాటిల్లో ధనం ముఖ్యం అనుకొంటాం. అంతకన్న ముఖ్యం తపస్సు. లోకకళ్యాణంకోసం ఆ తపస్సును కూడా ఖర్చుచేయటానికి వెనుదీయనివాడు వ్యాసుడు. అందుకే అందరికీ కనువిప్పు కల్గించటానికి భారతమృతవీరులను కూడా చూపించారు.

మహాభారతం మానవజీవనగమనంలో కరదీపిక. ధర్మాధర్మనిర్ణయంలో ఒరపిడిరాయి. కర్తవ్యాకర్తవ్యజ్ఞానాన్ని ఉపదేశించడంలో ఒక ఉత్తమగురువు. నిరాశకు లోను కాకుండా మనిషి బ్రతకటానికి ఒక ఒరవడి. అదుపులేని, అలవిమాలిన ఆశలను తెంచుకోవటానికి ఒక కొడవలి. తనను తాను సజీవశిల్పంగా తీర్చిదిద్దుకొవటానికి ఒక ఉలి.

అయినా భాషకారణంగా దానిని ప్రేమించే వారు, సంశయించే వారు కూడా చాలామంది దానిని చదవలేకపోతున్నారు. అందుకే తెలుగు వారికి ఆ వ్యాసభావాలను యథాతథంగా అందించేందుకే ఈ ప్రయత్నం - వ్యాస మహాభారతం (తెలుగు వచనం).

రామాయణ మహాభారతాలను ఆధ్యాత్మికవాదులు నెత్తికెత్తుకొని మోయటం ప్రారంభమైన తరువాత ఇవి ముసలివాళ్ళకు సంబంధించినవి అన్న భావం లోకంలో ప్రబలింది. ఇది దురదృష్టకరం. యౌవనంలోనే వీటిని చదువగలిగితే జీవితాన్ని సరిగా నడుపుకొనే జవజీవాలు గలుగుతాయి. సర్వమానవసౌభ్రాత్రం, సర్వప్రాణిసమత్వం మనస్సులో మెదిలి నిష్కల్మషంగా నడువగల ప్రవృత్తి కలుగుతుంది. ఇహలోకానికి ఇంతకంటే ఏం కావాలి...?

ఇట్లు
అనువక్తలు

★ మహాభారతం యథాతథంగా అవగా అధికపాఠాలతో సహా ఇచ్చాం. అధికపాఠాలు చిన్నసైజులో, బ్రాకెట్లలో ఇచ్చాం.

విషయసూచిక

అధ్యాయ సంఖ్య	విషయము	పుట సంఖ్య
88.	దుర్యోధనుని కుతంత్రమునకు కోపించి భీష్ముడు సభను వీడిపోవుట. (23)★	17
89.	కౌరవులు శ్రీకృష్ణుని స్వాగతించుట - విదుర ధృతరాష్ట్రుల ఆతిథ్యము. (26)	18
90.	శ్రీకృష్ణుడు కుంతిని ఊరడించుట. (105+1 $\frac{1}{2}$)	20
91.	శ్రీకృష్ణుడు దుర్యోధనుని ఇంటికేగుట విదురుని ఇంట భోజనము చేయుట. (41)	27
92.	కౌరవసభకు పోరాదని విదురుడు కృష్ణునితో చెప్పుట. (30)	30
93.	శ్రీకృష్ణుడు సంధి చేయుటలోని ఔచిత్యమును చెప్పుట. (22)	32
94.	శ్రీకృష్ణ భగవానుడు కౌరవసభలో ప్రవేశించుట. (54+10 $\frac{1}{2}$)	34
95.	శ్రీకృష్ణుడు పాండవుల మాటలను సభలో చెప్పుట. (63)	38
96.	పరశురాముడు దంభోద్భవుని వృత్తాంతము చెప్పుట. (52+1 $\frac{1}{2}$)	42
97.	కణ్వముని మాతలి ఉపాఖ్యానమును ఆరంభించుట. (21)	46
98.	మాతలి నారదునితో కలిసి వరుణలోకమున ఆశ్చర్యకరవస్తువులను చూచుట. (25)	47
99.	నారదమహర్షి పాతాళలోకమును చూపుట. (20)	49
100.	హిరణ్యపుర దర్శనము-వర్ణనము. (19)	50
101.	గరుడలోకమును, గరుడ సంతానమును వర్ణించుట. (16)	52
102.	సురభిని, దాని సంతతిని, రసాతలసుఖమును వర్ణించుట. (15)	53
103.	సుముఖుడను నాగకుమారునకు మాతలి కూతురు నిచ్చుటకు నిర్ణయించుట. (26)	54
104.	ఇంద్రుడు సుముఖునకు దీర్ఘాయు విచ్చుట; గుణకేశి సుముఖుల వివాహము. (30+1)	55

★ బ్రాకెట్లలోని మొదటి సంఖ్య సంస్కృతంలో ఆ అధ్యాయంలోని శ్లోక సంఖ్య. రెండవ సంఖ్య అధికపాఠశ్లోక సంఖ్య

అధ్యాయ సంఖ్య	విషయము	పుట సంఖ్య
105.	విష్ణువు గరుడుని గర్వ మణచుట – దుర్యోధనుడు కణ్వుని హేళనచేయుట. (40)	57
106.	గాలవచరితము. (27)	60
107.	గాలవుడు చింతించుట – గరుడుడు ఊరడించుట. (19)	61
108.	గరుడుడు గాలవునకు తూర్పుదిక్కును వర్ణించి చెప్పుట. (18)	63
109.	దక్షిణ దిక్కును వర్ణించుట. (21)	64
110.	పశ్చిమ దిక్కును వర్ణించుట. (20)	66
111.	ఉత్తర దిక్కును వర్ణించుట. (28)	67
112.	గరుడునిపై కూర్చుండి గాలవుడు తూర్పువైపు ప్రయాణించుట. (22)	69
113.	గాలవ గరుడులు శాండిలిని కలియుట – గురుదక్షిణను గూర్చి చర్చించుట. (23)	70
114.	గరుడ గాలవులు యయాతి దగ్గరకు వెళ్లుట. (20)	72
115.	యయాతి గాలవునకు తన కుమార్తె నిచ్చుట. (21)	73
116.	రెండువందల గుఱ్ఱములనిచ్చి హర్యశ్వుడు పుత్రుని పొందుట. (22+2)	75
117.	దివోదాసుడు ప్రతర్దనుని కనుట. (21)	77
118.	ఉశీనరుడు మాధవియందు శిబిని కనుట. (21)	78
119.	గాలవుడు మాధవిని యయాతికి తిరిగిఇచ్చుట. (24)	79
120.	మాధవి తపస్సు చేయుట – యయాతి స్వర్గమున తేజోహీను డగుట. (22)	81
121.	యయాతి స్వర్గభ్రష్టు డగుట. (28)	82
122.	యయాతి మరల స్వర్గమునకు చేరుట. (18)	84
123.	యయాతి స్వర్గపతన కారణమును నారదుడు దుర్యోధనునకు తెలుపుట. (23+1)	85

అధ్యాయ సంఖ్య	విషయము	పుట సంఖ్య
124.	శ్రీకృష్ణుడు దుర్యోధనునకు బోధచేయుట. (62+½)	87
125.	భీష్మద్రోణవిదుర ధృతరాష్ట్రులు దుర్యోధనునకు నచ్చజెప్పుట. (27+½)	91
126.	భీష్మద్రోణులు దుర్యోధనునకు మరల నచ్చజెప్పుట. (18)	93
127.	శ్రీకృష్ణునకు దుర్యోధనుడు సమాధాన మిచ్చుట. (25)	94
128.	శ్రీకృష్ణుడు దుర్యోధనుని నిందించుట. (50)	96
129.	ధృతరాష్ట్రుడు గాంధారిని పిలిపించుట – ఆమె దుర్యోధనునకు బోధచేయుట. (54)	99
130.	దుర్యోధనుని దురాలోచన సాత్యకి ద్వారా బయటపడుట. (53+8)	103
131.	శ్రీకృష్ణుని విశ్వరూపప్రదర్శనము–నిష్క్రమణ. (41)	107
132.	కుంతీసందేశము. (34)	109
133.	విదులా వృత్తాంతము. (45)	112
134.	విదుల తన పుత్రుని యుద్ధమునకు ప్రోత్సహించుట. (41)	115
135.	విదుల పుత్రునికి జయోపాయములను చెప్పుట. (40)	117
136.	విదులబోధతో సంజయుడు యుద్ధమునకు బయలు దేరుట. (22)	120
137.	పాండవులకు కుంతి సందేశ మిచ్చుట. (32)	121
138.	భీష్మద్రోణులు దుర్యోధనునకు బోధించుట. (27)	123
139.	ద్రోణుడు శాంతికై దుర్యోధనుని మందలించుట. (22)	125
140.	పాండవ పక్షమున చేరు మని శ్రీకృష్ణుడు కర్ణుని ప్రలోభపెట్టుట. (29)	126
141.	తన అభిప్రాయమును కర్ణుడు శ్రీకృష్ణునకు చెప్పుట. (57)	128
142.	పాండవుల విజయము తప్ప దని కృష్ణుడు చెప్పుట. (20)	131
143.	కర్ణుడు పాండవ విజయమును సూచించు తన కలను వర్ణించుట. (52)	132

అధ్యాయ సంఖ్య	విషయము	పుట సంఖ్య
144.	కుంతి కర్ణుని కడ కరుగుట. (31)	135
145.	కర్ణుడు తనకొడుకని కర్ణునితో కుంతి చెప్పుట. (12)	137
146.	కుంతితో కర్ణుని సంభాషణము. (27)	138
147.	భీష్ముని షలుకులను శ్రీకృష్ణుడు ధర్మరాజుకు వినిపించుట. (43)	139
148.	ద్రోణవిదురులు, గాంధారి చెప్పిన మాటలను శ్రీకృష్ణుడు ధర్మరాజుకు చెప్పుట. (36)	142
149.	పాండవుల కర్దరాజ్య మిమ్మని ధృతరాష్ట్రుడు దుర్యోధనునికి చెప్పుట. (36)	144
150.	కౌరవుల పట్ల దండనీతియే తగిన దని కృష్ణుడు చెప్పుట. (20)	146
	సైన్యనిర్యాణ పర్వము (9)	
151.	పాండవపక్షసేనానిని ఎన్నుకొనుట - పాండవసేనలు కురుక్షేత్రమును చేరుట. (71+$\frac{1}{2}$)	148
152.	కురుక్షేత్రములో పాండవసేనలు - శిబిరనిర్మాణములు. (18)	153
153.	కౌరవసేన యుద్ధయాత్రకు వెడలుట. (27)	154
154.	కృష్ణుడు చెప్పిన కర్తవ్యము - అర్జునుని సమర్థనము. (27)	155
155.	దుర్యోధనుడు సేనాపతులను నియమించుట. (35)	157
156.	దుర్యోధనుడు భీష్ముని ప్రధాన సేనాధిపతిగా అభిషేకించుట. (36)	160
157.	ధర్మరాజు సేనాపతులను నియమించుట, బలరాముని ఆగమనము. (35)	162
158.	రుక్మిసహాయమును కౌరవులు, పాండవులు తిరస్కరించుట. (40+$\frac{1}{2}$)	164
159.	ధృతరాష్ట్ర సంజయ సంవాదము. (15)	166
	7. ఉలూక దూతాగమనపర్వము - 5	
160.	ఉలూకుని ద్వారా దుర్యోధనుడు పాండవులకు సందేశము పంపుట. (125)	167

అధ్యాయ సంఖ్య	విషయము	పుట సంఖ్య
161.	ఉలూకుడు దుర్యోధనుని సందేశమును పాండవులకు వినిపించుట. (43)	175
162.	పాండవుల ప్రతిసందేశము. (63)	178
163.	దుర్యోధనుడు తన సైన్యమును యుద్ధమునకు ఆదేశించుట. (57)	182
164.	పాండవసేన యుద్ధమున కేగుట. (12)	185
	8. రథాతి రథ సంఖ్యాన పర్వము - 8	
165.	భీష్ముడు కౌరవసేనలో రథాతిరథులను నిర్ణయించుట. (33)	185
166.	కౌరవ రథాతిరథ సంఖ్యానము - 2. (22)	188
167.	కౌరవ రథాతిరథ సంఖ్యానము - 3. (38)	190
168.	భీష్మ కర్ణ సంవాదము. (42)	192
169.	పాండవ పక్షమున రథాతిరథ సంఖ్యానము. (28)	196
170.	పాండవ రథాతిరథ సంఖ్యానము - 2. (14)	198
171.	పాండవ రథాతిరథ సంఖ్యానము - 3. (27)	199
172.	పాండవ రథాతిరథ సంఖ్యానము - 4. (21)	201
	9. అంబోపాఖ్యాన పర్వము - 24	
173.	భీష్ముడు కాశీరాజు దుహితలను అపహరించి తెచ్చుట. (23+1)	202
174.	అంబ సాళ్వుని కడకు ఏగుటకు భీష్ముని అనుమతి కోరుట. (10)	203
175.	అంబ సాళ్వునిచే తిరస్కరింపబడి తపోవనమునకు చేరుట. (45+1$\frac{1}{2}$)	204
176.	హోత్రవాహన, అకృతవ్రణులతో అంబ సంభాషించుట. (59)	207
177.	అకృతవ్రణుడు, పరశురాముడు అంబతో సంభాషించుట. (42)	211
178.	భీష్మ పరశురాములు యుద్ధమునకు సిద్ధమై కురుక్షేత్రము చేరుట. (195)	214
179.	పరశురామునితో భీష్ముని యుద్ధము ప్రారంభమగుట. (39)	220

అధ్యాయ సంఖ్య	విషయము	పుట సంఖ్య
180.	భీష్మ పరశురాముల యుద్ధము. (38)	222
181.	భీష్మ పరశురాముల యుద్ధము – 2. (16)	224
182.	భీష్మ పరశురాముల యుద్ధము – 3. (30)	226
183.	భీష్మునకు వసువులు ప్రస్వాపనాస్త్రమిచ్చుట. (19)	227
184.	భీష్మపరశురాముల అస్త్ర ప్రయోగములు. (23)	229
185.	భీష్మ పరశురాముల యుద్ధసమాప్తి. (37)	230
186.	అంబ కఠోరతపము చేయుట. (41)	232
187.	అంబ మహాదేవుని వరము పొంది చితాగ్నిలో ప్రవేశించుట. (19)	235
188.	అంబ స్త్రీగా పుట్టి శిఖండి పేరుతో కుమారునిగా పెరుగుట. (20)	236
189.	శిఖండి వివాహము – ఆమె స్త్రీ అని తెలిసి మామ కోపించుట. (23)	237
190.	ద్రుపదుడు భయపడి తనరాణిని ఉపాయ మడుగుట. (22)	238
191.	శిఖండి స్థూణాకర్ణుడను యక్షుని కలిసికొనుట. (30)	240
192.	శిఖండి పుంస్త్వమును పొందుట. (70+½)	242
193.	దుర్యోధనునకు భీష్మాదులు తమ తమ శక్తులను ఎరిగించుట. (22)	246
194.	అర్జునుడు ధర్మజునికి తమవారి యొక్క శక్తులను వివరించుట. (22)	248
195.	కౌరవసేన యుద్ధమునకు బయలుదేరుట. (19)	249
196.	పాండవసేన యుద్ధమునకు బయలుదేరుట. (35)	250

॥ శ్రీమాత్రే నమః ॥

వ్యాస
మహాభారతం
(తెలుగు వచనం)
ఉద్యోగ పర్వం - 2

88. దుర్యోధనుని కుతంత్రమునకు కోపించి భీష్ముడు సభను వీడి పోవుట.

దుర్యోధనుడిలా అన్నాడు. "అచ్యుతుడైన శ్రీకృష్ణుని విషయంలో విదురుడు చెప్పినదంతా సత్యమే. శ్రీకృష్ణుడు పాండవులపై అనురక్తి గలవాడు. వారినుండి ఆయనను వేరుచేయటం కుదరదు. రాజేంద్రా ! శ్రీకృష్ణునకు సత్కారపూర్వకంగా వివిధ ధనరత్నాదులను ఇవ్వదలచుకొన్నారు. కానీ ఎప్పుడూ కూడా వాటి నివ్వవలసిన అవసరం లేదు. శ్రీ కృష్ణుడు ఆ సత్కారానికి తగడని కాదు కానీ దేశకాల పరిస్థితులు ఇప్పుడు దానికి తగినవి కావు. తనను చూచి భయపడి పూజచేస్తున్నట్లుగా ఆయన భావించవచ్చు. తెలివిగల క్షత్రియుడు తనకు అవమానం కలిగే ఏ పనీ చేయరాదని నా నిర్ణయం. శ్రీకృష్ణుడు ఈ లోకంలోనే కాదు, మూడులోకాలలో కూడా పూజ్యతముడు. ఆ విషయం సర్వవిధాలా నాకు తెలుసు. ప్రభూ ! శ్రీ కృష్ణుడు అంతటివాడైనా ప్రస్తుతం ఆయనకు ఏమీ బహూకరించకూడదు. కార్యగతి ఆ విధంగా ఉంది. యుద్ధం ప్రారంభమయిన తర్వాత యుద్ధంతో తప్ప మరే ఇతరమార్గాలవలననూ శాంతి కుదరదు." సుయోధనుని ఆ మాటలు విని కురుపితామహుడైన భీష్ముడు ధృతరాష్ట్రునితో ఇలా అన్నాడు. "సత్కరించినా, సత్కరించకపోయినా శ్రీకృష్ణుడు కోపించడు. కానీ ఆయనను అవమానించటం తగదు. అవమానింపదగినవాడు కాదు శ్రీకృష్ణుడు. శ్రీ కృష్ణుడు ఏదైనా చేయాలని సంకల్పించితే మరెవ్వరూ కూడా, ఎన్ని ఉపాయాలు ప్రయోగించినా దానిని మార్చలేరు. ఆ శ్రీకృష్ణుడు చెప్పిన దానిని సంశయించకుండా చేయటం మంచిది. వాసుదేవుని మధ్యస్థునిగా చేసి, వెంటనే పాండవులతో సంధి చేసికొనవలసినది. ధర్మాత్ముడైన జనార్దనుడు ధర్మార్థాలకు

అనుకూలం గానే మాటాడుతాడు. కాబట్టి నీవూ, నీ బంధువులూనూ ఆయనతో ప్రియమైన మాటలనే పలకాలి."

దుర్యోధనుడిలా అన్నాడు. "పితామహా! నేను జీవితాంతమూ పాండవులతో కలిసి ఈ రాజ్యసంపదలన్నీ అనుభవిస్తాననే మాటకు ఎటువంటి అవకాశమూ లేదు. ప్రస్తుతం నేను చేయదలచుకొన్న గొప్పపనిని చెపుతాను విను. పాండవులకు పెద్ద దిక్కైన జనార్దనుని ఇక్కడ బంధిస్తాను. ఆ శ్రీకృష్ణుని బంధిస్తే యదువంశస్థులు, సమస్తభూమండలమూ, పాండవులూ నాకు విధేయు లవుతారు. శ్రీకృష్ణుడు రేపుదయమే ఇక్కడకు రాబోతున్నాడు గదా! ఈ ఆలోచనను శ్రీకృష్ణుడు గ్రహించకుండునట్లూ, మనకు ఏ అపాయం లేకుండునట్లు మంచి ఉపాయాలను తమరు నాకు చెప్పండి."

శ్రీకృష్ణుని వంచింపదలపెట్టిన ఆ సుయోధనుని ఘోరమైన మాటను విని ధృతరాష్ట్రుడు అమాత్యులతో సహా కలతపడి ఖిన్నుడయ్యాడు. అప్పుడు ధృతరాష్ట్రుడు దుర్యోధనునితో ఇలా అన్నాడు- "అలా మాటాడవద్దు. ఇది సనాతన ధర్మం కాదు. శ్రీకృష్ణుడు దూత, మనకు బంధువూ, ప్రియమైన వాడు కూడా, కౌరవులకు ఎటువంటి కీడూ చేసిన వాడుకాదు. ఆయనను బంధింపబూనటం అసంబద్ధం" వెంటనే భీష్ముడిలా అన్నాడు. "ధృతరాష్ట్రా! బుద్ధిహీనుడైన నీ కుమారుడు కాలపాశంలో చిక్కుకొన్నాడు. శ్రేయోభిలాషులైన మిత్రులు ఎంతచెప్పినా వినకుండా ప్రయోజనాలను వదలి అనర్థాలనే కొని తెచ్చుకొంటున్నాడు. నీవు కూడా హితైషుల మాటలను వినకుండా, పాపులతో కూడి, పాపానురక్తి కలిగి దారి తప్పిన నీకొడుకు మాటలనే అనుసరిస్తున్నావు. తేలికగా పనులను చక్కబెట్టుకొనగల శ్రీకృష్ణుని ఎదిరిస్తే దుర్మార్గు డయిన నీ కొడుకు మంత్రులతో సహా క్షణంలో నశిస్తాడు. ఈ సుయోధనుడు ధర్మాన్ని విడిచాడు. పాపబుద్ధితో క్రూరంగా ప్రవర్తిస్తున్నాడు. అనర్థహేతువులైన ఇతని మాటలను ఏవిధంగానూ నేను ఇక వినదలచుకొనలేదు." ఈ విధంగా పలికి భరతశ్రేష్ఠుడూ, వృద్ధుడూ, సత్యపరాక్రముడూ అయిన భీష్ముడు చాలా కోపించి, అక్కడనుండి లేచి వెళ్ళిపోయాడు.

89. కౌరవులు శ్రీకృష్ణుని స్వాగతించుట - విదుర ధృతరాష్ట్రుల ఆతిథ్యము.

శ్రీకృష్ణుడు ప్రాతఃకాలంలోనే లేచి నిత్యకృత్యాలన్నీ ముగించి బ్రాహ్మణుల అనుమతి తీసికొని నగరానికి బయలుదేరాడు. వృష్ణులనివాసులు ఆయనను అనుసరించి,

ఆపై ఆయన అనుమతితో వెనుదిరిగారు. దుర్యోధనుడు తప్ప మిగిలిన ధృతరాష్ట్ర కుమారులు, భీష్మద్రోణకృపాదులందరూ చక్కగా అలంకరించుకొని తమ వద్దకు వస్తున్న శ్రీకృష్ణునికి ఎదురేగారు. రాజా! ఎందరో పౌరులు శ్రీకృష్ణుని చూడగోరి కొందరు వివిధవాహనాలతో, మరికొందరు కాలినడకతో బయలుదేరారు. భీష్ముడూ, ద్రోణుడు, ధార్తరాష్ట్రులు మార్గమధ్యంలో కలిసి, తనను చుట్టినడుస్తూఉండగా శ్రీకృష్ణుడు నగరానికి వెళ్ళాడు. శ్రీకృష్ణుని గౌరవార్థం నగరాన్ని చక్కగా అలంకరించారు. రాజమార్గాన్ని రత్నాలతో అందంగా తీర్చిదిద్దారు. వాసుదేవుని చూడాలన్న కోరికతో ఆ సమయంలో స్త్రీలు కానీ, వృద్ధులు కానీ, చిన్న పిల్లలు కానీ ఒక్కరు కూడా ఇంటిలో ఉండలేక పోయారు. శ్రీకృష్ణుడు ప్రవేశించిన సమయంలో పౌరు లందరూ రాజమార్గంలోనే నేలపై నిలిచి, శ్రీకృష్ణుని స్తుతింప నారంభించారు. పెద్దపెద్ద మేడలుకూడా అందమైన స్త్రీలతో నిండాయి. అవి ఆ భారంతో భూమిపై కదలుతున్నట్లు అనిపిస్తున్నాయి. ఆ విధంగా పౌరులతో నిండిన ఆ రాజమార్గంలో పరువెత్తుతున్న శ్రీకృష్ణుని గుర్రాలగమనం ముందుకు సాగలేదు. ఆ శ్రీకృష్ణుడు ప్రాసాదాలతో ప్రకాశిస్తున్న ధృతరాష్ట్రుని భవనాన్ని ప్రవేశించాడు. కేశవుడు ఆ రాజభవనం యొక్క మూడుసింహద్వారాలను దాటి ధృతరాష్ట్ర మహారాజును సమీపించాడు.

కీర్తిమంతుడూ, ప్రజ్ఞాచక్షువూ అయిన ధృతరాష్ట్రమహారాజు శ్రీకృష్ణుడు సమీపించగానే ద్రోణభీష్ములతో కలిసి పైకి లేచాడు. కృపుడూ, సోమదత్తుడూ, బాహ్లీకమహారాజు ఇతరులందరూ కూడా జనార్దనుని గౌరవిస్తూ తమతమ ఆసనాల నుండి లేచారు. ఆపై శ్రీకృష్ణుడు ధృతరాష్ట్ర మహారాజును కలిసి వెంటనే ఆదరపూర్వక వచనాలతో భీష్ముని గౌరవించాడు. ధర్మానుసారంగా వారిని గౌరవించిన తర్వాత మధుసూదనుడు వయస్సు ననుసరించి క్రమంగా అక్కడున్న రాజులను పలుకరించాడు. ఆ తరువాత శ్రీకృష్ణుడు కీర్తిమంతుడైన ద్రోణుని, అశ్వత్థామను, బాహ్లీకుని, కృపుని, సోమదత్తుని కలిశాడు. అక్కడ ధృతరాష్ట్రుని ఆదేశం మేరకు ఏర్పాటుచేసిన సంపన్నమైన, స్వర్ణమయమైన గొప్ప సింహాసన మున్నది. దానిపై శ్రీకృష్ణుడు కూర్చున్నాడు. అటుతర్వాత ధృతరాష్ట్ర పురోహితులు శాస్త్రోక్తంగా ఆవునూ, మధుపర్కాన్నీ, నీటినీ శ్రీకృష్ణుని సత్కారంకోసం తీసికొనివచ్చారు. ఆతిథ్యం పూర్తి అయిన తర్వాత కౌరవుల మధ్యనున్న శ్రీకృష్ణుడు నవ్వుతూ, సంబంధానుసారంగా అందరినీ పలుకరిస్తూ కూర్చొన్నాడు.

ధృతరాష్ట్రుని పూజలందుకొనిన శ్రీకృష్ణుడు ఆయన సెలవుతీసికొని నిష్క్రమించాడు. కౌరవసభలో కౌరవులను మర్యాదానుసారంగా కలిసికొని, ఆ తర్వాత శ్రీకృష్ణుడు రమణీయమయిన విదురనివాసానికి వచ్చాడు. విదురుడు తన ఇంట నిలచిన శ్రీకృష్ణుని స్వాగతించి సమస్తమంగళ ద్రవ్యాలతో, సముచిత భోగాలతో శ్రీకృష్ణుని అర్చించాడు. విదురుడిలా అన్నాడు – "పుండరీకాక్షా! నీదర్శనం వలన నాలో కలిగిన ఆనందాన్ని ఏమని చెప్పగలను? ప్రాణులందరకు అంతరాత్మవు నీవే కదా!" సర్వధర్మవేత్త అయిన విదురుడు గోవిందుని సత్కరించి ఆ మధుసూదనుని పాండవుల క్షేమాన్ని అడిగాడు. విదురుడు బుద్ధిమంతుడు. అంతా కనులారా చూస్తున్న శ్రీకృష్ణుడు నిత్యమూ ధర్మార్థతత్పరుడై రోషశూన్యుడై, ప్రేమరూపియై, మతిమంతుడై తనకు మిత్రుడైన విదురునకు పాండవుల వ్యవహారాన్నంతా సవిస్తరంగా చెప్పాడు.

90. శ్రీకృష్ణుడు కుంతిని ఊరడించుట.

జనార్దనుడు విదురుని కలిసికొన్న తర్వాత అపరాహ్ణవేళలో తన మేనత్త అయిన కుంతిదగ్గరకు వెళ్లాడు. నిర్మలమైన సూర్యుని వంటి తేజస్సు గల కృష్ణుడు తన దగ్గరకు రాగానే కుంతి చూసి, మెడపట్టి కౌగిలించి, తన కొడుకులను తలచుకొంటూ విలపించింది. శక్తిశాలులయిన తన కొడుకుల మధ్యలో తిరిగే వృష్ణివంశజుని గోవిందుని చాలా కాలానికి చూచి పృథ కంట నీరుపెట్టింది. శ్రీకృష్ణునకు ఆమె ఆతిథ్యాన్ని ఇచ్చింది. శ్రీకృష్ణుడు ఆసీనుడయ్యాడు. అప్పుడు నోరెండిపోతుండగా, కన్నీరు కంఠాన్ని గద్గదం చేస్తుండగా కుంతి ఇలా అన్నది. "నా కుమారులు పాండవులు చిన్ననాటినుండి గురుశుశ్రూషయందు ఆసక్తిగలవారు. ఒకరిపై ఒకరు స్నేహం గలవారు. అందరిచేత ఔ ననిపించుకొనినవారు. సమానభావన గలవారు. శత్రువుల వంచనచే రాజ్యాన్ని కోలుపోయి, జనావాసానికి తగినవారై కూడా నిర్జనారణ్యాల పాలయ్యారు.

క్రోధహర్షాలను జయించినవారు. బ్రాహ్మణులకు హితాన్ని చేకూర్చేవారు. సత్యసంధులు. అయినా ప్రియ జనాన్ని, సుఖాన్ని, పరిత్యజించి, రోదిస్తున్న నన్ను వీడి అరణ్యాలకు వెళ్ళిపోయారు. అరణ్యాలకు వెళ్ళే వేళలో పాండవులు సమూలంగా నా హృదయాన్ని పెకలించుకొని పోయారు. మహానుభావులయిన వాళ్ళు వనవాసానికి తగనివారు. అయినా వారికీ కష్టం ఎలా కలిగింది? నాయనా ! పాండవులు చిన్నతనంలోనే

తండ్రిని కోల్పోయారు. నా చేతనే ఎప్పుడూ లాలింపబడినవారు. సింహాలు, పులులు, ఏనుగులతో నిండిన ఆ మహారణ్యాలలో ఎలా నివసించారు.? తల్లిదండ్రులు ఇద్దరూ లేకుండా ఎలా జీవించగలిగారు? కేశవా ! చిన్ననాటినుండి శంఖదుందుభుల గంభీరధ్వనులతో, మృదంగవేణువుల మధురనాదాలతో నిద్రలేచేవారు పాండవులు. (పాండవులు తమ రాజధానిలో) ప్రాసాదాలపైభాగంలో జింక చర్మాలతో చేసిన పడకలపై పరుండినప్పుడు ఏనుగుల ఘీంకారాలతో అశ్వాల సకిలింపులతో, రథాల ఇరుసుల శబ్దాలతో, శంఖభేరీ నినాదాలతో, వీణా వేణునిస్వనాలతో వారు నిదురలేచే వారు. బ్రాహ్మణులు పుణ్యాహవచనాలతో వారి నాదరించేవారు. ఆ బ్రాహ్మణుల మంగళాశీస్సులు విని వారు లేచేవారు. గౌరవింపదగినవారు, గౌరవింపబడినవారూ వారి గుణాలను గానంచేస్తూ అభినందించేవారు. వారు లేచి రత్నవస్త్రాభరణాలతో ఆ బ్రాహ్మణులను సత్కరించేవారు. జనార్దనా! అటువంటి పాండవులు మహారణ్యాలలో క్రూరజంతువుల అరుపులవలన సుఖనిద్రకు కూడా నోచుకోకపోయి ఉండవచ్చు. వారు ఎప్పుడూ అటువంటి దురవస్థల ననుభవించవలసినవారు కాదు. మధుసూదనా ! భేరీమృదంగధ్వనులతో, శంఖవేణునినాదాలతో, స్త్రీల మధురగీతస్వనాలతో, వందిమాగధ సూతస్తోత్రాలతో మేల్కొంటున్న వారు మహారణ్యాలలో, క్రూరజంతువుల అరుపులతో ఎలా నిదుర లేచేవారో !

కృష్ణా ! యుధిష్ఠిరుడు బిడియంగలవాడు, సత్యసంధుడు, జితేంద్రియుడు, భూతదయగలవాడు, కామద్వేషాల నదుపులో నిలుపుకొని సత్పురుషుల మార్గంలో నడిచేవాడు. అంబరీషుడు, మాంధాత, యయాతి, నహుషుడు, భరతుడు, దిలీపుడు, శిబి మొదలయిన ప్రాచీన రాజర్షుల వలె సదాచారపాలన చేస్తూ, ధరింపశక్యం కాని ధర్మభారాన్ని మోసేవాడు. శీల సదాచారసంపత్తి గలవాడు. ధర్మవేత్త, సత్యపాలకుడు. ఈవిధంగా సర్వగుణ సంపన్నుడైనందువలన. మూడులోకాలకూ రాజు కాదగినవాడు. అజాతశత్రువు, ధర్మతత్పరుడు, తన ధర్మ జ్ఞాన సత్ప్రవర్తనల కారణంగా కౌరవులందరిలో శ్రేష్ఠుడు, నిర్మల మైన బంగారు వన్నె కలవాడు, ప్రియదర్శి, మహాబాహువు. ఆయన ఎలా ఉన్నాడు?

మధుసూదనా ! పదివేల ఏనుగుల బలం గలవాడు. మహాశక్తి సంపన్నుడు, వాయువేగం గలవాడు, సహనం లేకపోయినా యుధిష్ఠిరునకు ప్రియమైనవాడు, సోదరులకు

హితం చేకూర్చేవాడు, సోదరులతో సహా కీచకుని చంపినవాడు, శూరుడు, క్రోధవశులను, హిడింబుని, బకుని సంహరించిన వాడు, పరాక్రమంలో ఇంద్రతుల్యుడు, బలంలో వాయుసమానుడు, కోపంలో రుద్రునితో సమానుడు, యోధశ్రేష్ఠుడు, కోపం, బలం, అసహనం కలిగికూడా జితేంద్రియుడై అన్న ఆదుపులో ప్రవర్తించేవాడు, భీమసేనుడు. మహాత్ముడు, తేజో రాశి, శ్రేష్ఠుడు, మహాతేజస్వి, చూచుటకు భయంకరమైనవాడు, బలవంతుడు, పరిఘబాహువు అయిన మధ్యమ పాండవుడు వృకోదరుడు ఇప్పుడెలా ఉన్నాడో చెప్పు?

కృష్ణా ! అర్జునుడు రెండు భుజాలే గల వాడయినా ప్రాచీనుడయిన సహస్రబాహువుతో - కార్త వీర్యార్జునునితో - ఎప్పుడూ పోటీపడేవాడు. అయిదు వందల బాణాల నయినా సమానవేగంతో ప్రయోగించగలవాడు. విలువిద్యలో కార్తవీర్యచక్రవర్తితో సమానుడు, తేజస్సులో సూర్యసదృశుడు, ఇంద్రియనిగ్రహంలో మహర్షి వంటివాడు, ఓర్పులో భూదేవితో సమానుడు, పరాక్రమంలో మహేంద్రతుల్యుడు, లోకంలో ప్రఖ్యాతమై, ప్రకాశిస్తున్న ఈ విశాల కౌరవసామ్రాజ్యాన్ని తన పరాక్రమంతో సాధించినవాడు. పాండవుల కందరకూ అర్జునుని బాహుబలమే ఆసరా, శత్రువిక్రముడయిన ఆ అర్జునుడు రథికులందరిలో శ్రేష్ఠుడు ! రణభూమిలో అతని వెదిరించి ప్రాణాలతో బయటపడగలవాడు ఎవ్వడూ లేడు. సర్వప్రాణులను జయించిన జయశీలుడతడు. తన నెవ్వరూ జయించలేరు. దేవతలకు ఇంద్రునివలె పాండవులకు అర్జునుడే ఆశ్రయం. అటువంటి ఆ అర్జునుడు; నీకు సోదరుడు, నెచ్చెలి అయినవాడు ఎలా ఉన్నాడు ?

మధుసూదనా ! శ్రీ కృష్ణా! సహదేవుడు సమస్త ప్రాణుల యందు దయగలవాడు, బిడియం గలవాడు, మహాస్త్రవేత్త, కోమలుడు, సుకుమారుడు, ధార్మికుడు, నాకు మిక్కిలి ఇష్టమయిన వాడు. గొప్ప విలుకాడూ శూరుడూ, వీరుడూ, అయిన సహదేవుడు రణరంగానికే వన్నె తేగలవాడు, సోదరు లందరకూ సేవకుడు, ధర్మార్థవివేచన గలవాడు, యువకుడు కూడా. శుభలక్షణాలతో కూడిన సహదేవుని నడవడిని సోదరులు ఎల్లప్పుడూ అభినందిస్తుంటారు. పెద్ద అన్నపై ప్రేమ గలవాడు, సేనానాయకుడు, నా సేవయం దనురక్తుడునూ అయిన సహదేవుడు ఎలా ఉన్నాడో చెప్పు. కృష్ణా ! సుకుమారుడూ, యువకుడూ, శూరుడూ, అందమయినవాడూ, సోదరులకందరకూ బహిఃప్రాణం

వంటివాడూ, యుద్ధకళ లెరిగిన వాడూ, మహాబలుడూ, గొప్ప విలుకాడూ, నేను అల్లారుముద్దుగా పెంచిన నకులుడు కుశలమే గదా ! మహాబాహుడా ! కృష్ణా ! సుఖానికే తగినవాడు, కష్టాలు పడరాని వాడు, సుకుమారుడు, మహారథుడు అయిన నకులుని మరల ఎప్పటికయినా చూడగలనా ? వీరా ! రెప్పపాటుకాలం కూడా నకులుడు లేకుండా ధైర్యంగా నిలువలేనిదాన్ని. ఇప్పుడు నకులుడు దగ్గర లేకపోయినా జీవిస్తున్నాను. చూడు నేనెంత కఠినాత్మనో !

జనార్దనా ! నా కుమారులందరి కన్న నా కిష్టమైనది ద్రౌపది. ఆమె ఉన్నతవంశంలో పుట్టింది. అందమైనది. సర్వసద్గుణాలతో కూడినది. ఆ ద్రౌపది పుత్రలోకం కన్నా పతి లోకాన్ని మిన్నగా భావించి ఆ మార్గాన్నే కోరి ప్రియసుతులను కూడా వీడి పాండవులను అనుసరిస్తోంది. అచ్యుతా ! ఆ ద్రౌపది ఉత్తమవంశజాత. తన కోరికలు నన్నింటినీ తీర్చుతూ నాచే ఆదరించబడినది. ఆ మహారాణి, మంగళరూపిణి ఇప్పుడు ఎలా ఉన్నది ? శూరులు, యుద్ధ నిపుణులు, అగ్నిసమానులు, గొప్ప విలుకాండ్రు అయిన అయిదుగురు భర్తలున్నా ఆ ద్రౌపది కష్టాల ననుభవించవలసి వచ్చింది. అరిందమా ! పుత్రవియోగంతో బాధపడుతున్న, సత్యవాదిని అయిన ద్రౌపదిని చూడక ఇది పదునాలుగవ సంవత్సరం. అంతటి ద్రౌపది కూడా నిలకడగా సుఖంగా ఉండలేక పోతోందంటే పుణ్యకర్మవలన మనిషి సుఖపడతాడని చెప్పటానికి వీలు లేకపోతున్నది. నాకు యుధిష్ఠిరుడు కానీ, భీముడు కానీ, అర్జునుడు కానీ, నకుల సహదేవులు కానీ ద్రౌపది కన్న ప్రియమైనవారు కాదు. అటువంటి ద్రౌపది కౌరవసభలో నిస్సహాయంగా నిలచినపుడు నేను పొందిన దుఃఖం అంతకు ముందెప్పుడూ అనుభవించలేదు. క్రోధానికీ, లోభానికి లొంగిపోయిన దుర్మార్గుడు దుర్యోధనుడు రజస్వలయై, ఏకవస్త్రయై ఉన్న ద్రౌపదిని సభకు రప్పించి అత్తమామల సన్నిధిలో నిలిపాడు. అప్పుడు కౌరవులంతా ఆమెను చూశారు. అక్కడే ధృతరాష్ట్రుడు, బాహ్లికమహారాజు, కృపుడు, సోదరులు ఇతరకౌరవులు దుఃఖమగ్నులై నిలిచారు.

ఆ సభలోని వారందరిలో విదురుని మాత్రమే నేను గౌరవిస్తున్నాను. నడవడి చేతనే వ్యక్తి గొప్పవాడు కాగలడు కానీ డబ్బు వలననో, చదువు వలననో గొప్పవాడు కాలేడు. కృష్ణా ! మహాత్ముడు, గొప్ప బుద్ధికలవాడు. గంభీరస్వభావుడైన ఆ విదురునకు శీలమే ఆభరణం. అది లోకమంతా వ్యాపించిన విషయం. పూర్వకాలంలో చెడ్డ రాజు

లెందరో జూదాన్ని, వేటనూ పరిపాటిగా చేశారు. అదేమైనా వారికి సుఖాన్ని కల్గించిందా? సభలో కౌరవుల సమక్షంలో ధృతరాష్ట్రుని కొడుకులు ఆ విధంగా, ఎవ్వరికీ మంగళకరం కాని విధంగా కష్టపెట్టారు. అది నన్ను దహించి వేస్తోంది. పరంతపా ! జనార్దనా ! పాండవులు నగరం నుండి నిష్క్రమించటం, సన్యాసులై అరణ్యవాసానికి వెళ్ళటం– ఒకటేమిటి రకరకాల కష్టాలను చవిచూశాను. పరంతపా ! మాధవా ! నా బిడ్డలు పాండవులు అజ్ఞాతవాసం కూడా చేయవలసివచ్చింది. ఇప్పుడు రాజ్యాన్ని పొందటానికి అవరోధ మేర్పడుతోంది. నాకూ, నాకుమారులకూ ఇంత కష్టం కలగాలా ? నా కుమారులు దుర్యోధనుని చేత మోసగింపబడ్డారు. ఇది పదునాలుగవ సంవత్సరం. పుణ్యఫలక్షయమే సుఖానుభవ మైతే పాపఫల క్షయం దుఃఖానుభవ మవుతుంది. ఇప్పుడు దుఃఖాలను అనుభవిస్తున్నారు కాబట్టి ఇక సుఖం కలగాలి. కృష్ణా ! ధార్తరాష్ట్రులనూ, పాండవులనూ, నేనెప్పుడూ వేరుగా చూడలేదు. ఆ సత్యం మీద ప్రమాణం చేసి చెప్తున్నాను. నీవు యుద్ధంలో శత్రువులను సంహరించి, పాండవులతో సహా ఈ కష్టాలనుండి బయటపడి, రాజ్యలక్ష్మిచే వరింపబడటాన్ని నేను చూడాలి. పాండవులకు ఓటమి కలుగకూడదు. వారి గుణసంపత్తి అటువంటిది.

నా కష్టాలకు నేను నన్ను గానీ, సుయోధనుణ్ణి గానీ, నిందించటంలేదు. మా నాన్ననే నిందిస్తున్నాను. ఆయనే గదా మామూలు యాచకులకు డబ్బు ఇచ్చినట్టు నన్ను కుంతిభోజునకు సమర్పించింది. నేను అప్పటికి చిన్న పిల్లనే. చేతిలో బంతిపట్టుకొని ఆడుకొంటున్న దాన్ని, అటువంటి నన్ను మీ తాతగారు మిత్ర ధర్మాన్ని పాటిస్తూ తన మిత్రుడూ, మహానుభావుడూ అయిన కుంతిభోజున కిచ్చివేశారు. శ్రీకృష్ణా ! ఆ విధంగా నేను తండ్రిచేత, ఆ తర్వాత అత్తమామల చేతకూడా వంచింపబడ్డాను. అంతులేని దుఃఖాన్ని అనుభవిస్తున్నాను.నా జీవితానికి ఏం ప్రయోజనం! అర్జునుడు పుట్టినప్పుడు పురిటింటిలో అశరీరవాణి నాతో ఇలా అన్నది. ఈ నీ కుమారుడు భూమండలాన్ని జయిస్తాడు. ఇతని కీర్తి స్వర్గలోకాన్ని కూడా తాకుతుంది. ఘోరయుద్ధంలో కౌరవులను చంపి, రాజ్యాధికారాన్ని పొంది, సోదరసహితంగా మూడు అశ్వమేధయాగాలను నిర్వహిస్తాడు. నేను ఆ ఆకాశవాణిని తప్పుపట్టటం లేదు. పరమాత్మ స్వరూపమైన, మహావిష్ణు స్వరూపమైన ధర్మానికి నమస్కరిస్తున్నాను. ధర్మమే జగత్ సృష్ట సకల ప్రజలను పరిపాలించునది కూడా ధర్మమే. వార్ష్ణేయా ! శ్రీకృష్ణా ! ధర్మమే ఉంటే

ఆ అశరీరవాణి పలికిన దానినంతా నీవే సమకూర్చి పెట్టగలవు. మాధవా ! పుత్ర వియోగశోకం నన్ను దహించినట్లు వైధవ్యం కానీ, అర్థనాశనం కానీ, జ్ఞాతులతో శత్రుత్వం కానీ నన్ను బాధించటం లేదు. సమస్త శస్త్ర ధారులలో శ్రేష్ఠుడై, గాండీవధనుర్ధారి అయిన అర్జునుని చూడగలిగే దాకా నా హృదయానికి శాంతి లేదు. గోవిందా ! ధర్మరాజునూ, భీమసేనునీ, అర్జునునీ, నకులసహదేవులనూ చూడక ఇది పదునాలుగవ సంవత్సరం. జనార్దనా ! ప్రాణాలు పోయిన వారికి మానవులు శ్రాద్ధకర్మలు నిర్వహిస్తారు. మరణమంటే కనిపించక పోవటమే అయితే పాండవులకు నేనూ, నాకు పాండవులూ మరణించినట్లే.

మాధవా ! మహారాజు, ధర్మాత్ముడూ అయిన యుధిష్ఠిరునితో నా మాటగా చెప్పు - నాయనా నీ ధర్మానికి హాని కలుగుతోంది. దానిని వ్యర్థంగా పోనివ్వవద్దు. వాసుదేవా! ఇతరుల ఆశ్రయంలో జీవించే స్త్రీ జీవితం నిందార్హం. దీనంగా బ్రతకటం కన్న లేకపోవటమే మంచిది. అర్జునునితోనూ యుద్ధానికి నిత్యం సన్నద్ధుడై ఉన్న భీమసేనునితోనూ చెప్పు. క్షత్రియకాంత ఏ ప్రయోజనం కోసం పిల్లలను కంటుందో ఆ ప్రయోజనం నెరవేర్చే కాలం ఆసన్నమైనదని చెప్పు. ఇటువంటి సమయం సంప్రాప్త మైనప్పుడు కూడా యుద్ధం చేయకపోతే అది చేజారిపోతుంది. మీరు లోకం మెచ్చిన మంచివారు. మీరు దయనీయమైన పనులు చేస్తే, ఆ దీనత్వంతో కూడి ఉన్న మిమ్ములను శాశ్వతంగా వదిలి వేస్తాను. అవసర మైనపుడు ప్రాణాలను విడువటాని కయినా మీరు సిద్ధపడాలి మరి! ఎల్లప్పుడూ క్షాత్రధర్మం మీద ఆసక్తి కలిగిన నకులసహదేవులకు కూడా చెప్పు. ప్రాణాలను ఒడ్డి అయినా పరాక్రమంతో సంపాదించిన భోగాలనే మీరు కోరుకోవాలి. పురుషోత్తమా ! క్షత్రధర్మంతో జీవించే మనుష్యుని మనస్సును ఎప్పుడైనా పరాక్రమంతో సొంతం చేసికొన్న సొమ్మే ఆనందింపజేయ గలుగుతుంది. మహాబాహూ! నీవు వెళ్ళి, సర్వశస్త్ర ధారులలో శ్రేష్ఠుడైన అర్జునునితో ద్రౌపది సూచించిన దారిలోనే నడవాలని చెప్పు. కృష్ణా ! నీకిది బాగా తెలుసు. భీమార్జునులు కోపిస్తే, యమసమానులై దేవతలను సయితం మృత్యుముఖం వైపు నడిపించగలరు. ద్రౌపది సభలో నిలిచి ఉన్నప్పుడు దుశ్శాసనుడు, కర్ణుడు పలికిన పరుషవచనాలు భీమార్జునులకు కూడా అవమానకరాలే. దుర్యోధనుడు కురుముఖ్యుల సమక్షంలో అభిమానవంతుడైన భీమసేనుని పరాభవించాడు. దాని ఫలాన్ని తప్పక

చవిచూస్తాడు. శత్రుత్వమేర్పడితే భీముడెప్పుడూ శాంతించడు. శత్రుకర్శనుడైన ఆ భీమసేనుడు శత్రువుల నందరినీ సంహరించేదాకా ఎంత కాలం గడిచినా సరే ఆ వైరం శాంతించదు. రాజ్యాన్ని కోలుపోవటం కానీ, జూదంలో ఓడిపోవటం కానీ, కొడుకులు అరణ్యాలకు వెళ్ళటం కానీ నాకు దుఃఖాన్ని కల్పించలేదు. కానీ ఆ ఉత్తమురాలు ద్రౌపది ఏకవస్త్రయై కురుసభలో నిలబడి దుర్మార్గుల పరుషవచనాలు వినవలసి వచ్చింది. అంతకన్నా బాధాకరమైనది మరొకటి లేదు. సదా క్షాత్రధర్మాసక్తయైన నా అందమైన కోడలు ద్రౌపది, రజస్వలయై కురుసభలో నిలిచినప్పుడు, అయిదుగురు భర్తలుండి కూడా అనాథ (దిక్కులేనిది) అయినది. పురుషోత్తమా ! బలరాముడూ, ప్రద్యుమ్నుడూ, నీవూ నా కుమారులకూ, నాకూ రక్షకులు. అటువంటి నేను ఎదురులేని భీముడు, పలాయనం తెలియని అర్జునుడు జీవించి ఉండగానే ఇటువంటి కష్టాలను భరించవలసివస్తోంది."

అప్పుడు కుమారులను గురించి చింతిస్తూ శోకంలో మునిగి పోయిన తన మేనత్త కుంతిని పార్థసఖుడయిన శ్రీకృష్ణుడు ఇలా ఊరడించాడు. వాసుదేవుడిలా అన్నాడు. "అత్తా ! లోకంలో నీ అంతటి సౌభాగ్యవతి మరొకర్తె లేదు. నీవు శూరసేన మహారాజ పుత్రివి.. ఆజమీఢ వంశంలో అడుగు పెట్టావు. నీవు ఉన్నతవంశంలో పుట్టావు. ఉన్నత వంశంలో మెట్టావు. ఒక సరస్సు నుండి మరొక సరస్సులోచేరిన కమలం వంటిదానవు. ఒకప్పుడు నీవు సకల కళ్యాణవతివి. మహారాణివి, భర్తచే మన్ననల నందినదానవు. నీవు వీరపత్నివి, వీరపుత్రివి, సర్వసద్గుణ సంపన్నురాలవు. వివేకవతీ! నీవంటివారు తప్ప మరెవరు సుఖదుఃఖాలను భరించగలుగుతారు ?

నీ కుమారులందరూ నిద్రనూ, అలసటనూ, క్రోధాన్నీ, హర్షాన్నీ, ఆకలిదప్పులను, చలి ఎండలనూ, అన్నింటినీ జయించి నిత్యమూ వీరోచితంగానే సుఖాసక్తులై ఉన్నారు. నీ కుమారులు గ్రామ్య (సాధారణ) సుఖాలను వదలి, నిత్యమూ వీరోచిత సుఖాలనే శిష్టపడుతున్నారు. మహాబలం, మహోత్సాహం గలవారు. అంత తేలికగా తృప్తిపడరు. ధీరులు భోగాల అంతాన్ని చూడాలని భావిస్తారు. మధ్యములు గ్రామ్యసుఖాలపై ఆసక్తి చూపుతారు. ధీరులయిన ఉత్తములు కర్తవ్యనిర్వహణలో వివిధక్లేశాలను సహించి చివరకు మానవాతీత భోగాలను అనుభవిస్తారు. ధీరులు పర్యంత స్థితిలోనే ఆనందిస్తారు కానీ మాధ్యమిక స్థితిలో గాదు. కడముట్టటమే సుఖం, రెండుసుఖాల మధ్యస్థితియే

దుఃఖం అని పెద్దల మాట. పాండవులు ద్రౌపదితో సహా నీకు నమస్కరిస్తున్నారు. తమ క్షేమాన్ని తెలియజేసి తమ స్వస్థతను కూడా సూచించారు. త్వరలోనే శత్రువులను చంపి, రాజ్యలక్ష్మిని చేపట్టి, స్వస్థులై, సిద్ధమనోరథులై, లోకపాలకు లయిన పాండవులను చూడగలవు." పుత్రాదులకు దూరమయిన కుంతి శ్రీకృష్ణునిచే ఈ విధంగా ఊరడింపబడి అజ్ఞానంవలన ఏర్పడిన మోహాంధకారాన్ని తొలగించుకొని ఇలా బదులిచ్చింది.

కుంతి ఇలా అన్నది. "మధుసూదనా ! వారికి ఏది హితమో, ఏరీతిగా హితమని నీవు భావిస్తున్నావో అదంతా ఆ రీతిగా నీవు చేయి. కృష్ణా ! ధర్మభంగం లేకుండా, వంచన లేకుండా కార్యసాధన చేయాలి. నీ సత్య పరాయణత్వం నీ వంశమర్యాదల ప్రభావం నాకు తెలుసు. కార్యవ్యవస్థీకరణలో, మిత్ర సంగ్రహణంలో, బుద్ధిపరాక్రమాలలో నీ ప్రభావం నాకు తెలుసు. మా వంశంలో నీవే ధర్మం, నీవే సత్యం, నీవే తపస్స్వరూపుడవు నీవే రక్షకుడవు, నీవే పరబ్రహ్మవు. నీయందే సర్వమూ ప్రతిష్ఠింపబడి ఉన్నది. నీవు చెప్పినదే నీ సన్నిధిలో సత్యం.

(కేశవా ! కౌరవులకూ, పాండవులకూ, ఈ సమస్తలోకానికీ నీవే దిక్కు, నీ ప్రభావమూ, నీ బుద్ధిబలమూ దానికి తగినవి.")

అని ముగించింది. ఆమె నుండి వీడ్కోలు తీసికొని, ఆమెకు ప్రదక్షిణం చేసి ఆ మహాబాహువయిన గోవిందుడు దుర్యోధనుని ఇంటివైపు బయలు దేరాడు.

91. శ్రీకృష్ణుడు దుర్యోధనుని ఇంటికేగుట - విదురుని ఇంట భోజనము చేయుట.

శ్రీకృష్ణుడు కుంతి దగ్గర సెలవు తీసికొని, ఆమెకు ప్రదక్షిణం చేసి దుర్యోధనుని ఇంటికి వెళ్ళాడు. ఇంద్రభవనంతో సమానంగా ఉన్న దుర్యోధనుని ఇంటిలోనికి శ్రీకృష్ణుడు ప్రవేశించాడు. ద్వారపాలకులు శ్రీకృష్ణుని అడ్డగించలేదు. ఆ భవనం యొక్క మూడు సింహద్వారాలను అతిక్రమించి, ప్రాసాదంపైకి ఎక్కాడు శ్రీకృష్ణుడు. ఆ ప్రాసాదం ఆకాశంపై వ్యాపించిన శరత్కాలమేఘాలవలె తెల్లనై, పర్వత శిఖరం వలె ఉన్నతమై అద్భుతంగా ప్రకాశిస్తోంది. ఆ ప్రాసాదంపై వేలకొలది రాజులు, కౌరవులు చుట్టుముట్టి ఉండగా సింహాసనంపై కూర్చొని ఉన్న మహాబాహు వయిన దుర్యోధనుని చూశాడు. అక్కడే దుర్యోధనునకు దగ్గరగా ఆసనాలపై కూర్చొని ఉన్న దుశ్శాసనునీ, కర్ణునీ,

సౌబలుడైన శకునిని కూడా చూశాడు. శ్రీ కృష్ణుడు వస్తుండగా దుర్యోధనుడు మధుసూదనుని గౌరవిస్తూ, మంత్రులతో సహా లేచి నిలిచాడు. మంత్రి సహితుడైన సుయోధనుని కలసిన తర్వాత శ్రీకృష్ణుడు వయస్సులను బట్టి, తగిన రీతిగా అక్కడున్న రాజులను కలిశాడు. అక్కడ చక్కగా అలంకరింపబడి రకరకాల, పరుపులు పరచిన స్వర్ణమయమైన మంచం ఉన్నది. శ్రీకృష్ణుడు దానిపై కూర్చున్నాడు. అప్పుడు దుర్యోధనుడు జనార్దనుని సత్కరిస్తూ గోవునూ, మధుపర్కాన్నీ, నీటిని, ఇంటినీ, రాజ్యాన్నీ కూడా నివేదించాడు. నిర్మలమైన సూర్యతేజస్సువంటి తేజస్సుతో ఆ పర్యంకం మీద ఆసీనుడయిన శ్రీకృష్ణుని దగ్గర కౌరవులు రాజులందరితో వచ్చి కూర్చున్నారు. ఆ తరువాత దుర్యోధనుడు శ్రీ కృష్ణుని భోజనానికి ఆహ్వానించాడు. కానీ శ్రీకృష్ణుడు అంగీకరించలేదు.

అప్పుడు దుర్యోధనుడు కర్ణునితో సలహా పడి, మాటల్లో మార్దవం, భావనలో కపటత్వం వ్యక్త మవుతుండగా ఆ కౌరవసభలో శ్రీకృష్ణునితో ఇలా అన్నాడు. జనార్దనా! నీకోసం సమకూర్చిన అన్నాన్ని, పానీయాలనూ, వస్త్రాలనూ, శయ్యలను నీవెందుకు స్వీకరించటంలేదు?

నీవు ధర్మార్థాలను యథార్థంగా, పరిపూర్ణంగా తెలిసికొనినవాడవు. అయినా కూడా నా ఆతిథ్యాన్ని తిరస్కరించావు. దానికి కారణమేమిటి ? వినాలని ఉంది."

దుర్యోధనుడు ఆ విధంగా ప్రశ్నిస్తే మహామనస్వి, శ్రీకృష్ణుడు విశాలమైన తన భుజాన్ని పైకి లేపి నిండు మేఘాల ధ్వనివంటి కంఠస్వరంతో సుయోధనునకు ప్రత్యుత్తర మివ్వసాగాడు. ఆయనమాట ఉత్తమమై, తర్కసహమై, గంభీరమై, స్పష్టమై ఉంది. స్థానభ్రష్టత, సంకీర్ణత, మొదలయిన దోషాలు లేవు. "దుర్యోధనా ! దూతలు తాము వచ్చిన పనిలో కృతార్థు లయినపుడు భోజన, పూజాదులను స్వీకరిస్తారు. నీవు కూడా నా పని ముగిసినతర్వాత మంత్రులందరితో కలిసి నన్ను సత్కరించవచ్చు." జనార్దనుడీ విధంగా పలుకగానే ధార్తరాష్ట్రుడు శ్రీ కృష్ణునితో ఇలా అన్నాడు. "మాతో ఈ తీరుగా అనుచితంగా మాటాడటం నీకు తగదు. నీవు కృతార్థుడవు అయినా కాకపోయినా నిన్ను సత్కరించాలనే మేము ప్రయత్నిస్తున్నాము. కానీ సత్కరించలేక పోతున్నాము. పురుషోత్తమా! నీపై ప్రీతితో మేము సమర్పిస్తున్న పూజను అంగీకరించక పోవటానికి కారణం మాకు తెలియడం లేదు. గోవిందా ! నీతో మాకు శత్రుత్వం

లేదు. యుద్ధమూ లేదు. అదంతా నీవు ఆలోచించాలి. ఇటువంటి మాటలు పలుకదగదు."

దుర్యోధనుని మాటలు విని దాశార్హుడైన జనార్దనుడు దుర్యోధనునివైపూ, ఆయన మంత్రుల వైపూ చూచి నవ్వుతూ ఇలా ప్రత్యుత్తర మిచ్చాడు. "నేను కామంవలన కానీ, క్రోధంవలన కానీ, ద్వేషం వలన కానీ, స్వార్థసిద్ధికోసం కానీ, లోభంవలన కానీ, హేతువాదదృష్టితో కానీ ధర్మాన్ని ఎప్పుడూ విడువను. రాజా ! ప్రీతికారణంగా కానీ, ఆపద కారణంగా కానీ ఇతరుల ఇంట భోజనం చేస్తాం. నీకు నాపై ప్రేమలేదు. నేను ఏ ఇబ్బందిలోనూ చిక్కుకొనలేదు. పాండవులు నీ సోదరులు, సర్వసద్గుణ సంపన్నులు. ఇష్టమైన వారిని వెన్నంటి ఉండేవారు. అటువంటి వారిని నీవు పుట్టిననాటి నుండీ నిష్కారణంగా ద్వేషిస్తున్నావు. నిష్కారణంగా పాండవులను ద్వేషించటం తగదు. వారు స్వధర్మమందే నిలిచేవారు. వారిని గురించి మరొక విధంగా ఎవ్వరూ మాటాడలేరు. **పాండవులను ద్వేషించినవారు నన్ను కూడా ద్వేషించినట్లే. పాండవులకు అనుకూలంగా ఉన్నవారు నాకూ అనుకూలంగా ఉన్నట్లే. ధర్మానువర్తు లయిన ఆ పాండవులతో ఏకాత్మ భావాన్ని పొందిన వానినిగా నన్ను తెలుసుకో.*** కామక్రోధాలను ఆశ్రయించి, మోహంతో యుద్ధం చేయాలని కోరినా, గుణవంతులను ద్వేషించినా వాడు పురుషాధముడుగా వ్యవహరింపబడతాడు. సద్గుణవంతు లయిన దాయాదులను కూడా మోహలోభదృష్టితో చూస్తుంటే, తన మనస్సునూ, కోపాన్నీ అదుపులో నుంచుకొనలేని ఆ మనుష్యుని వద్ద రాజ్యలక్ష్మి ఎక్కువ కాలం నిలవదు. తనకు నచ్చక పోయినా, గుణసంపన్నులను ప్రేమతో లోబరుచుకొన్న వాడు చిరకీర్తిని పొందగలడు. ద్వేషించేవాని అన్నాన్ని తినకూడదు. ద్వేషబుద్ధి గలవానికి అన్నం పెట్టకూడదు. నీవు పాండవులను ద్వేషిస్తున్నావు. కానీ వారు నాకు ప్రాణాలు. నీ అన్నమంతా దుర్భావాలచే కలుషితమైంది. కాబట్టి నేను నీ అన్నం తినలేను. విదురుని ఇంట అన్నాన్నే నేను తింటాను. ఇది నా నిర్ణయం." అమర్షశీలుడైన దుర్యోధనునితో ఆ రీతిగా పలికి ఆ సుయోధనుని భవనం నుండి నిష్క్రమించాడు శ్రీకృష్ణుడు. వాసుదేవుడు అక్కడనుండి బయటపడి విడిదికై మహాత్ముడైన విదురుని ఇంటివైపు బయలు దేరాడు. ద్రోణుడు, కృపుడు, భీష్ముడు, బాహ్లికుడు, ఇతరకౌరవులు మహాబాహువయిన

---

* **యస్తాన్ ద్వేష్టి న మాం ద్వేష్టి యస్తానను న మామను ।**
ఐకాత్మ్యం మాం గతం విద్ధి పాండవైర్ధర్మచారిభిః ॥ 28

శ్రీకృష్ణుని అనుసరించారు. విదురగృహంలో ఉన్న యదువంశ వీరుడు – శ్రీకృష్ణునితో ఆ కౌరవులిలా అన్నారు. "శ్రీకృష్ణా! రత్నాదులతో కూడిన మా ఇండ్లను నీకు నివేదిస్తాము." మహాతేజస్వీఅయిన మధుసూదనుడు "మీరు నాకు చేయవలసిన సత్కారం ముగిసినట్టే. ఇక మీరంతా ఇళ్ళకు వెళ్ళండి" అని వారితో అన్నాడు. కౌరవులంతా నిష్క్రమించగానే విదురుడు ప్రయత్నపూర్వకంగా శ్రీకృష్ణుడు కోరిన వన్నీ ఇచ్చి, సత్కరించాడు. ఆ తరువాత విదురుడు రుచి, శుచి గల ఎన్నోరకాల అన్నపానాదులను మహాత్ముడయిన కేశవునికి నివేదించాడు. మధుసూదనుడు అన్నపానాదులతో ముందు బ్రాహ్మణులను తృప్తి పరచాడు. ఆ వేదవేత్తలకు గొప్పధనాలను కూడా దానం చేశాడు. ఆ తరువాత దేవతలతో కూడిన ఇంద్రునిలాగా తన అనుయాయులతో కలిసి విదురుడు నివేదించిన శుచి, రుచిగల ఆ అన్నపానాలను శ్రీకృష్ణుడు భుజించాడు.

92. కౌరవసభకు పోరాదని విదురుడు కృష్ణునితో చెప్పుట.

ఆ రాత్రి శ్రీకృష్ణుడు భోజనం చేసి, విశ్రమించిన తరువాత విదురుడు శ్రీకృష్ణునితో ఇలా అన్నాడు. "కేశవా ! నీవు ఇక్కడకు రావటం నాకంత సమంజసంగా కనిపించటం లేదు. జనార్దనా! దుర్యోధనుడు మందమతి. ధర్మార్థాలను అతిక్రమించినవాడు. కోపిష్ఠి. ఇతరుల అభిమానాన్ని దెబ్బతీసేవాడు. తాను మాత్రం అభిమానాన్నే కోరుకొంటాడు. పెద్దల ఆదేశాలను అతిక్రమిస్తాడు. ధర్మశాస్త్రాల విధులను కూడా అతిక్రమించేవాడు. మూఢుడు. దుర్మార్గుడు. మొండిపట్టు గలవాడు. శ్రేయోమార్గం వైపు అతనిని మళ్ళించటం సాధ్యం కాదు. సుయోధనుడు భోగాసక్తిగలవాడు, తనను తాను పండితునిగా భావించుకొనేవాడు, మిత్రద్రోహి, అందరినీ అనుమానించేవాడు. తాను ఎవ్వరికీ ఉపకారం చేయడు. తాను పొందిన ఉపకారాలను విస్మరించేవాడు, ధర్మాన్ని పరిత్యజించిన వాడు, అసత్యాలను ఇష్టపడేవాడు. ఆ సుయోధనుడు మూఢుడు, స్థిరచిత్తం లేనివాడు, ఇంద్రియాలను అదుపుచేసికొన లేనివాడు, స్వేచ్ఛననుసరించి పనులుచేసేవాడు. ఏవిషయంలోనూ స్థిరనిర్ణయం లేనివాడు. ఇంతేకాదు. ఇంకా ఎన్నో దోషాలతో కూడినవాడు. నీవు హితవచనాలు చెప్పినా, క్రోధవశుడై ఆ మాటలను స్వీకరించడు. భీష్మ, ద్రోణ, కృప, కర్ణ, అశ్వత్థామ, సైంధవులపై గట్టి నమ్మకంతో ఉన్నవాడు. కాబట్టి మనస్సులో సంధి గురించి ఆలోచన కూడా చేయడు. జనార్దనా ! భీష్మ ద్రోణాదివీరుల వైపు

పాండవులు కనీసం చూడలేరని ధార్తరాష్ట్రులు, కర్ణుడూ నిశ్చయంతో ఉన్నారు. మూర్ఖుడైన దుర్యోధనుడు రాజులసేనలన్నింటినీ సమీకరించి దానితోనే తనను కృతార్థునిగా భావించుకొంటున్నాడు. దుర్బుద్ధి అయిన దుర్యోధనుడు కర్ణుడొక్కడే శత్రువులను జయించగల సమర్థు డని నమ్ముతున్నాడు. అందువలన అతడు సంధికి ఎప్పుడూ అంగీకరించడు. పాండవులకు యథోచితరాజ్యభాగాన్ని ఇవ్వకూడదని ధార్తరాష్ట్రులందరూ భావిస్తున్నారు. అది వారి దృఢనిశ్చయం. ఆ విధంగా నిర్ణయించుకొన్న వారి దగ్గర, సోదరుల మధ్య భ్రాతృభావాన్ని కోరుతూ, సంధికి ప్రయత్నిస్తున్న నీ మాటలు నిరర్థకా లవుతాయి.

మధుసూదనా ! మంచి మాటనైనా, చెడ్డమాటనైనా సమానంగా భావించే వారి దగ్గర పండితుడు ఏమీ చెప్పకూడదు. చెప్తే అది చెవిటివారి ముందు రాగాలాపన చేయటం వంటిదే. మాధవా ! చాండాలుర మధ్యలో బ్రాహ్మణుడు నిలిచి ఉపదేశించటం తగనట్లు హద్దులెరుగని మూర్ఖులు, అజ్ఞానులు అయిన ధార్తరాష్ట్రుల దగ్గర నీవు ప్రసంగించటం మంచిదికాదు. మూఢుడైన ఆ సుయోధనుడు సైన్యాన్ని సమీకరించుకొని తనను శక్తిమంతునిగా భావించుకొంటున్నాడు. అతడు నీ మాట వినడు. అతని దగ్గర నీవు పలికే ప్రతిమాట నిరర్థకమే అవుతుంది. కృష్ణా! వారంతా పాపిష్ఠమైన ఆలోచనలు చేస్తూ కూర్చొని ఉన్నారు. వారి మధ్యకు నీవు వెళ్లటం నాకు రుచించటం లేదు.

దుర్బుద్ధులు, దుష్టచిత్తులు, చెడ్డవారు అయిన అంతమంది మధ్యకు పోయి వారికి నచ్చని మాటలను నీవు చెప్పబూనటం నాకు నచ్చటం లేదు. దుర్యోధనుడు ఎప్పుడూ పెద్దలను సేవించినవాడు కాదు. రాజ్యలక్ష్మిని అనుభవిస్తున్న గర్వంతో మత్తు క్రమ్మిన వాడు. యౌవనగర్వం వలనా, పాండవులపైనున్న అసహనభావం వలనా, నీవు మంచి చెప్పినా తాను స్వీకరించడు. మాధవా ! దుర్యోధనుని దగ్గర ప్రబలమైన సేన ఉంది. పైగా నీ మీద అతనికెప్పుడూ సందేహమే. అందుకే నీవు మంచి మాట చెప్పినా కూడా అతడు దానిని పరిగణించడు. జనార్దనా ! దేవతలందరితో కలిసి ఇంద్రుడే ఎత్తివచ్చినా ప్రస్తుతం తమ దగ్గరున్న సేనను యుద్ధంలో ఓడించలేడని ధార్తరాష్ట్రులు అందరూ విశ్వసిస్తున్నారు. కామక్రోధాదిదుష్టభావాల వెంట నడుస్తున్న ఆ ధార్తరాష్ట్రులు ఆ విధంగా నిశ్చయించుకొని ఉంటే నీ మాట యుక్తియుక్తమైనా

అది నిరర్థక మవుతుంది. రథిక-ఆశ్విక-గజ-పదాతి సేనల మధ్యలో నిలిచి భయరహితుడై మూఢుడూ, మందమతి అయిన దుర్యోధనుడు ఈ భూమండలమంతా తన చేత జయింపబడినట్లు భావిస్తున్నాడు. దుర్యోధనుడు సమస్త భూమండలాన్ని శత్రురహిత సామ్రాజ్యాన్ని చేసికోవాలని ఆశపడుతున్నాడు. ద్యూతంలో గెలిచికొన్న ధనం, రాజ్యం ప్రస్తుతం తన అధీనంలోనే ఉన్నాయన్న భావనతో ఉన్న దుర్యోధనునితో సంధికై చేసే ప్రయత్నం సఫలం కాదు.

ఈ నేల కాలపరిపక్వమై నశించి పోయే రోజు వచ్చింది. కాకపోతే భూమండలంలోని సమస్త రాజులూ, క్షత్రియసేనలు దుర్యోధనుని కోసం పాండవులతో యుద్ధం చేయటానికి సమకూడుతారా ? కృష్ణా! ఇక్కడ చేరిన రాజులు దాదాపు అందరూ గతంలో నీకు శత్రువులై, తమ సంపదలన్నీ నీవల్ల పోగొట్టుకొన్నవాళ్ళు. నీవంటే ఉన్న భయంతో ధార్తరాష్ట్రుల నాశ్రయించారు. కర్ణునితో కలిసి ఒక్కటై పరాక్రమాన్ని ప్రదర్శించబోతున్నారు. దాశార్హవంశవీరుడా ! కృష్ణా ! ఈ యోధులందరూ తమ ప్రాణాలపై ఆశవిడచి, హర్షోత్సాహాలతో పాండవులతో యుద్ధం చేయటానికి సన్నద్ధు లయ్యారు. అటువంటి వారి మధ్యకు నీవు వెళ్ళటం నాకు నచ్చటం లేదు. శత్రుసంహారా ! దుష్టమైన ఆలోచనలతో కూర్చొని ఉన్న ఆ శత్రువుల మధ్యకు ఎలా వెళతావు ? మహాబాహూ! కృష్ణా! దేవతలందరూ కలసినా నీ ఎదుట నిలవలేరు. నీ ప్రభావం, నీ పౌరుషం, నీ బుద్ధి కుశలత నాకు తెలుసు. నాకు పాండవులపై ఉన్నంత ప్రేమ నీ మీద కూడా ఉంది. ఆ ప్రేమతో, గౌరవంతో, ఆదర భావంతో నేనిలా చెప్తున్నాను. పుండరీకనయనా ! నీ దర్శనం వలన నాలో కలిగిన ఆనందాన్ని నీకేమని వివరించగలను ? సమస్త ప్రాణులకూ అంతరాత్మవు నీవే కదా !"

93. శ్రీకృష్ణుడు సంధి చేయుటలోని ఔచిత్యమును చెప్పుట.

మధుసూదనుడు వినయపూర్వకమైన విదురుని మాటలను విని ఈ విధంగా అన్నాడు. "విదురా ! బుద్ధిమంతుడు ఏవిధంగా మాటాడుతాడో, విచక్షణ గలవాడు ఏరీతిగా సలహాల నివ్వగలడో, నావంటి మిత్రునితో నీవంటి శ్రేయోభిలాషి ఏతీరుగా పలుకుతాడో, ధర్మార్థయుక్తంగా ఏ పద్ధతిలో మాట్లాడితే బాగుంటుందో ఆ విధంగా తల్లిదండ్రులవలె నీవు నాతో మాట్లాడావు. నీవు నాతో పలికినది యథార్థం, సమయోచితం,

యుక్తియుక్తం కూడా. అయినా నా రాకకుగల కారణాన్ని సావధానంగా విను. ధార్తరాష్ట్రుల దురాత్మత, క్షత్రియుల శత్రుత్వమూ, ఇదంతా తెలిసికూడా, నేనిప్పుడు కౌరవుల దగ్గరకు వచ్చాను. భూమండలమంతా గుఱ్ఱాలు, రథాలు, ఏనుగులతో సహా వినాశోన్ముఖమై ఉంది. ఆ మృత్యుపాశం నుండి దానిని తప్పించే ప్రయత్నం చేసినవాడు ఉత్తమధర్మాన్ని పొందగలడు. **మనుష్యుడు తనశక్తిననుసరించి ధర్మకార్య సాధనకై ప్రయత్నిస్తూ విఫలుడయినా కూడా తప్పక పుణ్యాన్ని పొందగలడు.** ఈవిషయంలో నాకు సందేహం లేదు. మనసా పాపాన్నే తలపోసినా, అది ఇష్టంలేక, దానిని క్రియారూపంలో పెట్టని వాడు ఆ పాపఫలితాన్ని పొందడని ధర్మవేత్తలు భావిస్తున్నారు. కాబట్టి విదురా ! యుద్ధంలో నశించటానికి సిద్ధంగా ఉన్న కౌరవులకూ, పాండవులకూ సంధి సమకూర్చాలని నేను నిష్కపటంగా ప్రయత్నిస్తున్నాను.

అత్యంత భయంకరమైన ఈ ఆపద కర్ణదుర్యోధనుల కారణంగా కౌరవులలోనే పుట్టింది. ఈ రాజులందరూ ఆ ఇద్దరి మార్గాన్నే అనుసరిస్తున్నారు. **వ్యసనాలలోగానీ, ఆపదలలోగానీ ఇబ్బంది పడుతున్న మిత్రుని, యథాశక్తిగా అనునయించి ఉద్ధరించలేని వాడు క్రూరకర్ముడని పండితులు అంటుంటారు.** యథాశక్తి ప్రయత్నించి జుట్టు పట్టుకొని అయినా మిత్రుని అకృత్యాలనుండి మరలించినవాడు ఎవ్వరి నిందకూ గురికాడు. కాబట్టి విదురా ! దుర్యోధనునకూ, మంత్రులకూ శుభకరమూ, యుక్తియుక్తమూ, ధర్మార్థ సహితమూ, హితకరమూ అయిన నా మాటను తప్పక చెప్పాలి. ధార్తరాష్ట్రులకూ, పాండవులకూ, లోకంలోని సకల భూపాలురకూ హితాన్ని చేకూర్చటానికి నిష్కపటంగా నేను ప్రయత్నిస్తాను. హితసాధనకై ప్రయత్నిస్తున్న నన్ను కూడా సుయోధనుడు అనుమానించినా, నా మనస్సుకు తృప్తియే కాక కర్తవ్యభారం నుండి నాకు విముక్తికూడా లభిస్తుంది. దాయాదుల మధ్య భేదభావం ఏర్పడితే ఉభయులకు మిత్రుడైన వాడు సర్వవిధాలా ప్రయత్నించి, సమైక్యసాధనకై మధ్యస్థుడుగా వ్యవహరించకపోతే, ఆ మిత్రుడు మిత్రుడే కాదని పండితభావన. లోకంలోని పాపాత్ములూ, మూఢులూ, శత్రువులూ కృష్ణుడు సమర్థుడై కూడా, క్రోధావిష్టులయిన కౌరవ పాండవులను యుద్ధంనుండి ఆపలేదని నన్ను అనే అవకాశ ముండదు. ఉభయ పక్షాలకూ, కార్యసిద్ధిని సాధించాలనే నేను ఇక్కడకు వచ్చాను. దానికై పూర్తిగా ప్రయత్నం చేస్తే లోకులు నన్ననుకొనే పని ఉండదు.

ధర్మార్థసంయుక్తమూ, క్షేమకరమూ అయిన నా మాటను విని కూడా, స్వీకరించక పోతే మూర్ఖుడైన దుర్యోధనుడు కాలానికి చిక్కుపడతాడు. మహాత్మా ! పాండవుల స్వార్థానికి దెబ్బ తగలకుండా కౌరవపాండవులకు సంధి చేయగలిగితే నేను గొప్ప పుణ్యం చేసినట్లే. అంతే గాక కౌరవులుకూడా మృత్యుపాశం నుండి బయట పడతారు. నేను శాంతికై పండితసమ్మతమై, ధర్మార్థ సంగతమై, హింసాశూన్యమయిన మాటను చెప్తాను. ధార్తరాష్ట్రులు నా మాటపై దృష్టిపెడితే, శాంతిస్థాపనకై వచ్చిన నన్ను వారు తప్పనిసరిగా సమాదరిస్తారు. సింహం ముందు ఇతరమృగాలు నిలవలేనట్లు, కోపించిన నా ఎదురుగా నిలవటానికి రాజులందరూ ఒక్కటై వచ్చినా చాలరు." శ్రీకృష్ణుడు విదురునితో ఇలా మాటాడి సుఖస్పర్శ గల శయ్యపై పడుకొన్నాడు.

94. శ్రీకృష్ణభగవానుడు కౌరవసభలో ప్రవేశించుట.

బుద్ధిమంతులయిన శ్రీకృష్ణవిదురులు ఆ విధంగా మాటాడుకొంటూ ఉండగానే నక్షత్ర శోభిత మయిన ఆ శుభరాత్రి గడచి పోయింది. మహాత్ముడైన శ్రీకృష్ణుడు ధర్మార్థ కామాలకు సంబంధించి వివిధ విషయాలు చెప్పుతున్నాడు. ఆ మాటలు విచిత్రమైన అర్థాలతో, పదాలతో, అక్షరాలతో కూడి ఉన్నాయి. విదురుడు వాటిని ఆసక్తితో వింటున్నాడు. ఈ విధంగా తేజస్సంపన్నుడైన శ్రీకృష్ణుడు, విదురుడూ ఇద్దరూ కూడా తమ మనస్సులకు నచ్చిన కథాలాపాలతో తన్మయు లయ్యారు. వారికి తెలియకుండానే ఆ రాత్రి గడచిపోయింది. ఆ తరువాత స్వరసంపదలు గల సూతులు, మాగధులు ఎందరో శంఖ దుందుభినినాదాలతో శ్రీకృష్ణుని మేల్కొలిపారు. శ్రీకృష్ణుడు లేచి ప్రాతఃకాలంలో అవసరమైన కృత్యాల నన్నింటినీ ముగించాడు. సంధ్యాతర్పణాన్నీ, జపాన్నీ ముగించి, అగ్ని కార్యాన్ని పూర్తిచేసి, చక్కగా అలంకరించుకొని శ్రీకృష్ణుడు సూర్యోపాసన చేశాడు.

ఆ సమయంలో దుర్యోధనుడూ, శకునీ కలిసి సంధ్యోపాసన చేస్తున్న (అపరాజితుడయిన) శ్రీకృష్ణుని దగ్గరకు వచ్చి "గోవిందా! ధృతరాష్ట్రమహారాజు కొలువు దీరి ఉన్నాడు. భీష్ముడు మొదలయిన కురుప్రముఖులు, ఇతరరాజులందరూ అక్కడే ఉన్నారు. దేవతలు స్వర్గంలో ఇంద్రుని ఆహ్వానించినట్లు భీష్మాదులు నీ దర్శనాన్ని అభ్యర్థిస్తున్నారు" అని చెప్పారు. ఆ మాటలు విని శ్రీకృష్ణుడు మధుర ప్రియభాషణలతో

వారిని అభినందించాడు. నిర్మలమయిన సూర్యుడు ఉదయించిన తరువాత శ్రీకృష్ణుడు బ్రాహ్మణులకు బంగారం, వస్త్రాలు, గోవులూ, గుఱ్ఱాలూ దానం చేశాడు. అనేక రత్నాలను దానం చేసి, నిలిచి ఉన్న శ్రీకృష్ణుని సమీపించి, సారథి నమస్కరించాడు. ఆ తరువాత సిరిమువ్వలచేత అలంకరింపబడి, మేలు జాతి గుఱ్ఱాలు పూన్పబడి, నిర్మలంగా ప్రకాశిస్తున్న విశాలమైన రథాన్ని తీసికొని త్వరగా దారుకుడు శ్రీకృష్ణుని సమీపించాడు.

(శ్రీకృష్ణుని కొరకు సమకూర్చబడిన ఆ విశ్వవిఖ్యాత శ్రేష్ఠరథం శైబ్య, సుగ్రీవ, మేఘపుష్ప, వలాహకా లనబడే నాలుగు గుఱ్ఱాలతో చక్కగా ప్రకాశిస్తోంది. శైబ్యం చిలుకరెక్కల వలె పచ్చగా ఉంది. సుగ్రీవం పలాశకుసుమంలా ఎఱ్ఱగా ఉంది. మేఘపుష్పం మేఘవర్ణంలో ఉంది. వలాహకం తెల్లగా ఉంది. శైబ్యం కుడివైపు, సుగ్రీవం ఎడమ వైపు, మేఘపుష్ప వలాహకాలు వాటి వెనుక పూన్పబడి ఉన్నాయి. సత్త్వగుణానికి ఆశ్రయమైన ఆ శ్రీకృష్ణుని రథంపై నున్న ధ్వజపతాకంపై సూర్యుని తాకుతున్నట్టుగా గరుడు డున్నాడు. యశస్వి అయిన శ్రీకృష్ణుని శ్రేష్ఠరథం ఉజ్జ్వలమై ప్రకాశిస్తున్న గరుడధ్వజంతో ఎంతో శోభిస్తోంది.

సువర్ణ పతాకలు, సువర్ణ ధ్వజమూ కలిగి ఆ రథం ప్రళయకాలంలో ఉదయించిన సూర్యునిలాగా వెలుగుతూ ఉంది.

ఆ రథాన్ని విశ్వకర్మ నిర్మించాడు. గరుడ ధ్వజపు చాందినీలతో, బంగారు కిటికీలు గల మధ్యభాగంతో, విడివిడిగా వైడూర్యాలు, ముత్యాలు, బంగారు ఆభరణాలతో, వందలకొలది సిరిమువ్వలతో, పగడపు దండలతో ఆ రథంలోపలి భాగం అందంగా ఉన్నది. బంగారు తామరలు, బంగారు చెట్లు, పులులు, సింహాలు, వరాహాలు, వృషభాలు, మృగాలు, పక్షులు, నక్షత్రాలు, సూర్యుడు, ఏనుగులు వాని స్వర్ణ ప్రతిమలతో ఆ రథం శోభిస్తోంది. ఆ రథం నొగలోని సంధులలో వజ్రం, అంకుశం, విమానాల ఆకృతులు అందగిస్తున్నాయి.)

నిండు మేఘాల గర్జనవంటి గంభీర ధ్వని గల్గి, సర్వరత్నాల చేత అలంకరింపబడిన ఆ దివ్యరథం వచ్చినట్టు తెలిసికొని అగ్నికీ, బ్రాహ్మణులకూ ప్రదక్షిణంచేసి, మెడలో కౌస్తుభమణిని ధరించి, పరమ కాంతితో ప్రకాశిస్తూ, కృష్ణుడు ప్రకాశించాడు. తనచుట్టూ, కౌరవులు నిలువగా, యాదవులు రక్షకులై నిలిచారు. సమస్త యాదవులకూ ఆనందాన్ని కలిగిస్తూ శ్రీకృష్ణుడు రథాన్ని ఎక్కాడు. సర్వప్రాణుల యందును సర్వబుద్ధిమంతుల యందును శ్రేష్ఠుడైన ఆ శ్రీకృష్ణుని తరువాత సకల ధర్మవేత్త అయిన విదురుడు ఆ రథాన్ని అధిరోహించాడు. ఆ తరువాత దుర్యోధనుడూ, సుబలసుతుడు శకునీ మరోరథంలో శ్రీకృష్ణుని అనుసరించారు. సాత్యకీ, కృతవర్మా, యదువంశస్థులైన

ఇతర రథికులూ, రథాలపై, ఏనుగులపై, గుఱ్ఱాలపై కూర్చొని శ్రీకృష్ణుని వెనుక బయలు దేరారు. రాజా ! వారంతా ప్రయాణిస్తున్న సమయంలో స్వర్ణాభరణాలతో అలంకరించబడ్డాయి శ్రేష్ఠమైన అశ్వాలు. వానితో పూన్చబడి గంభీరంగా ధ్వనిస్తూ ఆ రథాలు ప్రకాశిస్తున్నాయి. ధీమంతుడైన శ్రీకృష్ణుడు తన శరీరశోభతో ప్రకాశిస్తూ ప్రాచీన రాజర్షులు సంచరించిన ఆ రాజమార్గంలోనికి సకాలంలో ప్రవేశించాడు. ఆ రాజమార్గం చక్కగా చిమ్మి, నీళ్ళుచల్లబడి ఉంది.

శ్రీకృష్ణుడు బయలుదేరగానే డోలు, శంఖం, ఇంకా ఇతర వాద్యాలూ ఒక్కసారిగా మ్రోగాయి. శత్రువులకు సంతాపాన్ని కల్గించగల వారూ, సింహ విక్రములు, లోకప్రఖ్యాతులూ, యువకులు అయిన వీరులు శ్రీకృష్ణుని రథాన్ని చుట్టి వస్తున్నారు. శ్రీకృష్ణునకు ముందుగా కొన్ని వేలమంది సైనికులు నడుస్తున్నారు. వారు విచిత్రవస్త్రాలను ధరించి ఉన్నారు. కత్తి, బల్లెం మొదలయిన ఆయుధాలను చేతబట్టి ఉన్నారు. శ్రీకృష్ణుడు బయలుదేరగా ఐదువందల ఏనుగులూ, వేలకొలదీ రథాలు అనుసరించాయి. ఆ సమయంలో శ్రీకృష్ణుని చూడాలన్న కోరికతో బాలురూ, వృద్ధులూ, స్త్రీలూ, సమస్త హస్తినాపురమూ రాజమార్గంలో నిలిచింది. ఇంటి ముందున్న అరుగులపై చేరిన లెక్కకు మించిన స్త్రీలచేత ఆక్రమింపబడిన భవనాలు బరువుతో కదిలిపోతున్నట్లున్నాయి. ఆశ్రీకృష్ణుడు కౌరవులచే సత్కరింపబడుతూ, మధురభాషలు వింటూ, యథోచితంగా వారలను సత్కరిస్తూ అంతటా పరికిస్తూ మెల్లగా వెళ్ళసాగాడు. ఆ తర్వాత కౌరవసభను సమీపించిన కేశవుని అనుయాయులు, సేవకులు, శంఖవేణునాదాలతో దిక్కులను ధ్వనింపజేశారు. అమితతేజస్సుగల ఆ రాజుల సమూహం శ్రీకృష్ణుని రాకను కోరుతున్నందువలన ఆనందంతో పులకించి పోయింది. శ్రీకృష్ణుడు దగ్గరవుతుండగా, మేఘగర్జనతో సమానమైన ఆ రథఘోషను విని రాజులందరూ పరమానంద పడ్డారు. శౌరి సభాద్వారాన్ని చేరి కైలాస శిఖరంలాగా ఉన్న రథం నుండి దిగాడు. ఆ తరువాత నూతన మేఘాల వలె శ్యామలవర్ణమై, తేజస్సుతో ప్రకాశిస్తూ మహేంద్రభవనం వలె ఉన్న ఆ సభలో ప్రవేశించాడు. రాజా! మహాయశస్వి అయిన శ్రీకృష్ణుడు విదుర సాత్యకుల చేతులు పట్టుకొని, సూర్యుడు తన తేజస్సుతో తారల నన్నింటినీ కప్పివేసినట్టు, తన కాంతితో కౌరవుల నందరినీ కప్పివేశాడు. శ్రీకృష్ణుని ముందు కర్ణదుర్యోధనులూ, శ్రీకృష్ణుని వెనుక యాదవులూ, కృతవర్మ ఉన్నారు. అప్పుడు భీష్మద్రోణాదులందరూ

శ్రీకృష్ణుని గౌరవిస్తూ, ధృతరాష్ట్రునితో సహా తమ తమ ఆసనాలలో కదిలారు. దశార్హనందనుడైన శ్రీకృష్ణుడు రాగానే మహాయశస్కుడు, జ్ఞాననేత్రుడు అయిన ధృతరాష్ట్ర మహారాజు భీష్మద్రోణులతో కలిసి పైకి లేచాడు. ధృతరాష్ట్ర మహారాజు లేవగానే అన్నివైపులా ఆసీనులై ఉన్న వేలకొలది రాజులు కూడా లేచారు. అక్కడ ధృతరాష్ట్రుని శాసనం మేరకు బంగారుతో అలంకరింపబడిన సర్వతోభద్రమనే ఆసనం శ్రీకృష్ణుని కొఱకు ఏర్పాటు చేయబడి ఉంది. అప్పుడు ధర్మ స్వరూపుడైన శ్రీకృష్ణుడు నవ్వుతూ ధృతరాష్ట్రునీ, భీష్మద్రోణులనూ, ఇతరులను కూడా వారి వారి స్థాయి ననుసరించి పలుకరించాడు. అక్కడ సభకు అరుదెంచిన శ్రీకృష్ణుని రాజులూ, కౌరవు లందరూ చక్కగా సత్కరించారు. పరంతపుడూ, శత్రునగరజయశీలుడు అయిన శ్రీకృష్ణుడు ఆ రాజుల మధ్యలో నిలిచి ఆకాశంలో నిలిచిఉన్న మునులను చూశాడు. నారదాది ఋషులను చూచి శ్రీకృష్ణుడు మెల్లగా భీష్మునితో ఇలా అన్నాడు. "రాజా! ఈ రాజ సభను చూడాలని మహర్షులెందరో విచ్చేశారు. వారిని సత్కారపూర్వకంగా ఆసీనులను చేసే ఏర్పాటు చేయండి. వారు కూర్చొనకపోతే మరెవ్వరూ ఆసీనులు కాలేరు. పవిత్రమనస్కు లయిన ఈ మహర్షులను త్వరగా అర్చించండి." శంతనుకుమారుడు భీష్ముడు మహర్షులను చూచి సభాద్వారందగ్గర సన్నిహితులై ఉన్న భృత్యులను తొందరపెడుతూ "ఆసనాలు తెండి" అని ఆదేశించాడు.

అప్పుడు సేవకులు మణికాంచనాలతో అలంకరింపబడి, నిర్మలములూ, విశాలములూ అయిన ఆసనాలను తెచ్చివేశారు. భారతా ! ఆ మహర్షులు ఆ ఆసనాలపై ఆసీనులయి అర్ఘ్యాన్ని స్వీకరించిన తర్వాత శ్రీకృష్ణుడు, ఇతర రాజులు ఆసనాలపై కూర్చున్నారు. దుశ్శాసనుడు సాత్యకికి మంచి ఆసనాన్ని చూపించాడు. వివింశతి కృతవర్మకు స్వర్ణమయమైన ఆసనాన్ని ఇచ్చాడు. అసహనశీలులయిన మహానుభావులు కర్ణ దుర్యోధనులు శ్రీకృష్ణునకు దగ్గరగా ఒకే ఆసనంపై కూర్చున్నారు. జనమేజయా ! గాంధారరాజయిన, శకుని సైనికరక్షణలో కుమారునితో సహా ఆసీనుడయ్యాడు. మహాప్రాజ్ఞుడైన విదురుడు శ్రీకృష్ణుని ఆసనానికి తగులుతూ ఉన్న మణిపీఠం మీద తెల్లని మృగచర్మం పరచిన ఆసనంపై కూర్చున్నాడు. అక్కడున్న రాజులంతా ఎంతో కాలం తర్వాత శ్రీకృష్ణుని చూచినందువలన అమృతం త్రాగుతున్నట్లు ఆయనవైపు చూస్తున్నారు. అయినా వారికి తృప్తి కలగటం లేదు.

అవిసె పూలవలె శ్యామవర్ణంగల శ్రీకృష్ణుడు పీతవసనుడై బంగారు పాత్రపై ఉంచబడిన నీలమణిలాగా ఆ సభామధ్యంలో విరాజిల్లాడు. అక్కడ అప్పుడు అందరిమనస్సులూ శ్రీకృష్ణుని మీదనే లగ్నమయ్యాయి. ఏ ఒక్క మనిషీ ఏమీ మాటడలేదు.

95. శ్రీకృష్ణుడు పాండవుల మాటలను సభలో చెప్పుట.

ఆ సభలో ఆసీనులయిన రాజులందరూ మౌనంగా ఉండగా చక్కని పలువరస గలిగిన శ్రీకృష్ణుడు దుందుభి స్వరంతో మాట్లాడనారంభించాడు. గ్రీష్మఋతువు చివరలో మేఘం గర్జించినట్టుగా, ధృతరాష్ట్రుని వైపు చూస్తూ అందరికీ వినిపించేటట్టు ఇలా అన్నాడు. "భారతా ! క్షత్రియవీరులు నశించకుండానే కౌరవపాండవులలో శాంతిని కల్పించాలని భావించి, దానిని ప్రార్థించటానికి నీ దగ్గరకు వచ్చాను. రాజా ! ఇంతకన్నా నేను చెప్పదగిన మంచి మాట మరొకటి లేదు. నీవు తెలియవలసినదంతా తెలిసినవాడవు. రాజా ! సమస్తరాజవంశాలలో ఇప్పుడు ఈ కురువంశమే శ్రేష్ఠమైనది. ఇది శాస్త్రజ్ఞాన సదాచారాలతో సంపన్నమైనది. సద్గుణాలన్నింటితో కూడినది. దయ, జాలి, కరుణ, క్రౌర్య రాహిత్యం, ఋజుత్వం, ఓర్పు, సత్యం - ఈ సద్గుణాలన్నీ ఇతర రాజవంశాలలో కన్న కురువంశంలో ఎక్కువ. ఇటువంటి ఉన్నత గుణసంపన్నమైన, ప్రతిష్ఠగల వంశం నీ కారణంగా అనుచిత కార్యాలవైపు నడవటం తగినది కాదు. తండ్రీ ! కురుశ్రేష్ఠా! కౌరవులలో ఎవరయినా ప్రత్యక్షంగా కానీ, రహస్యంగా కానీ, తగనిరీతిగా ప్రవర్తిస్తే కురువంశ శ్రేష్ఠుడవైన నీవే వారిని మంచి మార్గం వైపు మరలించాలి. కురునందనా! దుర్యోధనుడు మొదలుగా గల నీ కుమారులు ధర్మార్థాలను వెనక్కునెట్టి క్రూరులవలె ప్రవర్తిస్తున్నారు. నీకుమారులు లోభానికి లొంగి, మర్యాదల నతిక్రమించి, సన్నిహిత బంధువులతో కూడా హీనంగా ప్రవర్తిస్తున్నారు. నీ కా విషయం తెలిసినదే. ఈ ప్రమాదకరమైన ఆపద కౌరవులలోనే పుట్టింది. దీనిని నిర్లక్ష్యం చేస్తే మొత్తం భూమండలాన్ని నాశనం చేస్తుంది. భరతశ్రేష్ఠా ! నీవు తలచుకొంటే ఈ ఆపదను నివారించవచ్చు. ఈ ఉభయపక్షాల మధ్య సంధిని కూర్చటం దుష్కరకార్యమని నేను భావించటంలేదు.

రాజా ! సంధి చేయటం నీ చేతుల్లోనూ, నా చేతుల్లోనూ ఉంది. నీవు నీ కుమారులను నిలువరిస్తే, ఇతరులను (పాండవులను) నేను నియంత్రిస్తాను. రాజేంద్రా!

నీ పుత్రులు తమ అనుయాయులతో పాటు నీ ఆజ్ఞను పాటించాలి. నీ శాసనాన్ని పరిపాలిస్తే వీరికి ఎంతో గొప్ప మేలు జరుగుతుంది. రాజా ! సంధికోసం ప్రయత్నిస్తూ నీవు నీ కుమారులను శాసించదలచినచో అది నీకూ, పాండవులకూ కూడా హితకారి అవుతుంది. నరనాథా ! పాండవులతో వైరం నిష్ఫలం. ఏవిధంగానూ మంచి పరిణామం కాదు. దాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రయత్నం చేయి. జనపాలా ! ఆ విధంగా చేస్తే పాండవులు నీకే సహాయకులు కాగలరు. రాజా ! నీవు పాండవుల సంరక్షణలో ధర్మార్థాలను ఆచరించు. ఎంత ప్రయత్నం చేసినా అటువంటి సంరక్షకులను మరో రీతిగా పొందలేవు. మహాత్ము లయిన పాండవులచే నీవు రక్షింపబడుతూ ఉంటే, దేవత లందరితో కూడిన ఇంద్రుడైనా నిన్నెదిరించలేడు. ఇక మామూలు రాజాలను గురించి చెప్పవలసిన దేముంది? భీష్ముడు, ద్రోణుడు, కృపుడు, కర్ణుడు, వివింశతి, అశ్వత్థామ, వికర్ణుడు, సోమదత్తుడు, బాహ్లికుడు, సైంధవుడు, కలింగుడు, కాంబోజుడు, సుదక్షిణుడు, యుధిష్ఠిరుడు, భీమసేనుడు, అర్జునుడు, నకుల సహదేవులు, సాత్యకి, మహారథుడు యుయుత్సుడు ఉన్న పక్షంతో యుద్ధం చేసే విపరీత బుద్ధి ఎవ్వడూ ఉండడు. ధృతరాష్ట్రా! కౌరవ పాండవులతో కూడిన నీవు మరల సమస్త లోకానికీ రాజువు కాగలవు. శత్రువులకు అజేయుడవు కూడా కాగలవు. రాజా! ఆ స్థితిలో ఉన్న నీతో, నీతో సమానులైన రాజులు, నిన్నుమించిన రాజులు కూడా సంధిచేసికొంటారు. అటువంటి నీవు పుత్ర పౌత్రులతో, పితరులతో, సోదరులతో, మిత్రులతో కూడా అన్ని విధాలా సురక్షితుడవై జీవితాన్ని సుఖంగా గడపవచ్చు. రాజా ! ఇంతకుముందు వలె ఆదరించి, వారినే ముందుంచు కొనగలిగితే సమస్త భూమండలాన్ని నీవు అనుభవించవచ్చు.

భారతా ! ఈ పాండవులందరితోనూ, నీ కుమారులతోనూ కూడా నీవు ఇతర శత్రువులను జయించగలవు. ఇది నీకు పూర్తిగా స్వప్రయోజన సిద్ధి అవుతుంది.

నరాధిపా ! అమాత్యులతో సహా నీ పుత్రులందరితో కలసి ఉంటే వారు సంపాదించిపెట్టిన భూమిని నీవు అనుభవించవచ్చు. మహారాజా! యుద్ధం జరిగితే ఎంతో నాశనం జరుగుతుంది. రాజా! ఇరుపక్షాలూ నశిస్తే ఇకనీవు పాటించే ధర్మ మేముంటుంది? భరతశ్రేష్ఠా ! యుద్ధంలో పాండవులు మరణించినా, బలసంపన్ను లయిన నీ కుమారులే మరణించినా నీవు సుఖపడేది ఏముంటుంది ? ఆ విషయం

చెప్పు. పాండవులూ, నీ కుమారులూ కూడా అందరూ శూరులు, అస్త్రవిద్యాపారంగతులు. యుద్ధాన్ని కోరుకొంటున్న వారిని ఆ భయంనుండి నీవే రక్షించాలి. యుద్ధాన్ని గురించి ఆలోచిస్తే, సమస్త కురు పాండవులూ నశించే అవకాశం కనిపిస్తోంది. ఉభయ పక్షాలలోనూ శూరులయిన రథికులు రథికులచే చంపబడి నశించి పోవచ్చు. రాజశ్రేష్ఠా ! భూమండలంలోని రాజులందరూ అసహనానికి లోనయి ఒక్కచోట గుమిగూడారు. ప్రజల నందరినీ నాశనం చేస్తారు. రాజా ! ఈ ప్రజలు నశించకూడదు. ఈ లోకాన్ని కాపాడు. నీవు కుదుటపడితే అందరూ కాపాడబడతారు. రాజా ! ఈ రాజులందరూ నిర్మలులు, వదాన్యులు, లజ్జాశీలులు, పూజ్యులు, పవిత్రవంశ సంజాతులూ, పరస్పర సహాయకులు. అటువంటి వారిని ఈ భయం నుండి కాపాడు. ఈ రాజులందరూ స్నేహపూర్వకంగా ఒకరితో ఒకరు కలిసి, కలిసి భుజించి, త్రాగి, ఎవరి ఇంటికి వారు మరలిపోవాలి అని నా అభిలాష. ఆ విధంగా ప్రయత్నం చేయి. భరతశ్రేష్ఠా! ఈ రాజులందరూ మంచి బట్టలు ధరించి, మంచి హారాలను అలంకరించుకొని అమర్షాన్నీ, వైరాన్నీ కాలదన్ని సత్కారపూర్వకంగా మరలిపోవాలి. నీ ఆయువు కూడా తగ్గుతోంది. ఈ స్థితిలో పాండవులపై నీకు పూర్వమున్న స్నేహభావమే ఇప్పుడు కూడా ఉండాలి. కాబట్టి సంధి సమకూర్చు. చిన్న తనంలోనే తండ్రిని కోల్పోయిన వారిని నీవే పెంచి పోషించావు. కాబట్టి వారినీ, నీకుమారులనూ కూడ న్యాయంగా పాలించు. పాండవులను నీవు ఎల్లప్పుడూ కాపాడాలి. ప్రత్యేకించి ఇబ్బందులలో ఉన్నప్పుడు రక్షించాలి. అలా చేయవట్లయితే నీకు ధర్మహానీ, అర్థహానీ కూడా వీర్పడుతుంది.

రాజా ! పాండవులు, నీకు నమస్కరించి, ప్రసన్నుని చేసికొని ఈ విధంగా చెప్పమన్నారు. 'తండ్రీ ! నీ ఆదేశాన్ని అనుసరించి అనుచరులతో సహా కష్టాల ననుభవించాం. పండ్రెండు సంవత్సరాలు మాకు వనవాసంలో గడిచి పోయాయి. పదమూడవ సంవత్సరం జనసముదాయంలో అజ్ఞాతంగా గడిచిపోయింది. తండ్రీ ! నీవు మా పెదతండ్రివి. మాట మీద నిలుస్తావని నమ్మి ఉన్నాం. ఆ నమ్మకంతోనే ఆరణ్యవాస అజ్ఞాతవాసనియమాల నెప్పుడూ అతిక్రమించలేదు. మాతో ఉన్న బ్రాహ్మణులకు ఆ విషయం తెలుసు. భరతశ్రేష్ఠా! మాట మీద నిలబడిన మా విషయంలో నీవు కూడా మాటను కాపాడుకో ! రాజా ! మేము ఎప్పుడూ కష్టాలనే అనుభవిస్తున్నాం. మా రాజ్యభాగాన్ని మా కివ్వు. నీవు ధర్మార్థాలు చక్కగా తెలిసినవాడవు.

కాబట్టి మమ్ములను కాపాడాలి. నీలో గురుత్వాన్ని చూచి మేమెన్నో కష్టాలను మౌనంగా భరించాం. ఇప్పుడు నీవు కూడా తల్లిదండ్రుల వలె మాతో ప్రవర్తించాలి. గురుజనుల విషయంలో శిష్యులు ఎలా ప్రవర్తించాలో అలా మేము నీపట్ల ప్రవర్తించాము. నీవు కూడా శిష్యులపై గురువు ప్రవర్తించవలసిన రీతిగా మాతో ప్రవర్తించు. పిల్లలము మేము తప్పు చేస్తే తండ్రి వయిన నీవు సరియైన దారిలో పెట్టాలి. కాబట్టి మమ్ములను సరి అయిన దారిలో నిలిపి, ధర్మబద్ధమయిన సన్మార్గంలో నీవు కూడా నిలువు ?

భరతశ్రేష్ఠా! నీ కుమారులు ఈ సభాసదులకు కూడా ఒక విన్నపం చేస్తున్నారు. మీరు సభలో ఉండగా అనుచిత కార్యాలకు అవకాశమివ్వటం తగదు. **అందరూ చూస్తుండగా అధర్మం చేత ధర్మమూ, అసత్యం చేత సత్యమూ బాధింపబడుతుంటే, ప్రేక్షకులయిన ఆ సభాసదులు కూడా నశించిపోయినట్లే !*** అధర్మంచేత భంగపడిన ధర్మం పదిమంది మధ్యకు వచ్చినప్పుడు అక్కడున్న సభ్యులు అధర్మరూపమైన ఆ ముల్లును విరిచి పైకి తీయక పోతే ఆ ముల్లుతో ఆ సభ్యులు కూడా గాయపడినట్లే. నది తన ఒడ్డున ఉన్న చెట్లను పెకలించి వేసినట్లు ఆ భంగపడ్డ ధర్మమే సభాసదులను నశింపజేస్తుంది. భరతశ్రేష్ఠా ! ఆ పాండవులు ధర్మం మీదనే దృష్టి నుంచి ఎప్పుడూ దానినే ఆలోచిస్తూ మిన్న కున్నారు. వారు రాజ్యాన్ని తిరిగి పొందటం సత్యమూ, ధర్మసమ్మతమూ, న్యాయ సమ్మతమూ కూడా. నరపతీ! పాండవులకు రాజ్యాన్ని తిరిగి ఇమ్మని తప్ప నీకు మరేమి చెప్పగలను ? ధర్మార్థాలను విచారించి ఈ సభలోని భూపాలురు ఎవరైనా నేను సత్యం చెపుతున్నానో లేదో చెప్పవచ్చు. పురుషశ్రేష్ఠా! ఈ క్షత్రియులను మృత్యుపాశం నుండి రక్షించు. క్రోధానికి లొంగకుండా శాంతంగా ఉండు. పాండవులకు పైతృక మైన రాజ్యభాగాన్ని యథోచితంగా ఇచ్చి, ఆపై నీవూ, నీకుమారుడూ సఫలమనోరథులై స్వేచ్ఛగా భోగాలను అనుభవించండి.

నరేశ్వరా ! అజాతశత్రువైన యుధిష్ఠిరుడు ఎప్పుడూ సత్పురుషుల ధర్మమార్గం లోనే నడుస్తాడు. ఆయన నీతో, నీకుమారులతో ప్రవర్తించే తీరుకూడా నీకు తెలుసు. లక్క ఇంటిలో తగులబెట్టబడ్డాడు. రాజ్యం నుండి వెళ్ళ గొట్ట బడ్డాడు. అయినా మరలా నిన్నే ఆశ్రయిస్తున్నాడు. రాజా! నీకుమారులతో కలిసి నీవే ఆ యుధిష్ఠిరుని

* యత్ర ధర్మో హ్యధర్మేణ సత్యం యత్రానృతేన చ ॥ 48
హన్యతే ప్రేక్షమాణానాం హతాస్తత్ర సభాసదః ।

ఇక్కడ నుండి తప్పించి, ఇంద్రప్రస్థానికి పంపావు. అక్కడ ఆ యుధిష్ఠిరుడు నివసిస్తూ సమస్త రాజులనూ లొంగదీసికొని నీవైపు త్రిప్పాడు. అయినా కూడా యుధిష్ఠిరుడెప్పుడూ నీ ఆదేశాన్ని అతిక్రమించలేదు. ఈ విధంగా ప్రవర్తిస్తూ యుధిష్ఠిరుని రాజ్యాన్నీ, ధనధాన్యాలనూ అపహరించాలని శకుని జూదపు పేరుతో గొప్ప ఎత్తు వేశాడు. అటువంటి దయనీయస్థితిలో ఉండి, సభలోనికి ఈడ్చుకొనిరాబడిన ద్రౌపదిని చూచికూడా మహాత్ముడైన ఆ యుధిష్ఠిరుడు క్షత్రధర్మాన్ని తప్ప లేదు. భారతా ! నేను మీకూ, పాండవులకూ శుభాన్నే కోరుకొంటున్నాను. ప్రజలను ధర్మ - అర్థ సుఖాలకు దూరం చేయవద్దు. ప్రస్తుతం అనర్థాన్ని అర్థంగానూ, అర్థాన్ని అనర్థంగానూ భావిస్తున్నావు. రాజా ! లోభంలో తగుల్కొన్న నీ కుమారులను అదుపు చేయి. అరిందము లయిన పాండవులు నీకు సేవ చేయటానికైనా సిద్ధమే. యుద్ధం చేయటానికయినా సిద్ధమే. నీకు హితకరమైన మార్గాన్ని నీవు అవలంబించు." శ్రీకృష్ణుని మాటను అక్కడున్న రాజులందరూ మనసా అభినందించారు. అక్కడ ఎవరూ మరేమీ మాట్లాడటానికి ముందుకు రాలేదు.

96. పరశురాముడు దంభోద్భవుని వృత్తాంతము చెప్పుట

మహాత్ముడైన కేశవుడు ఆ మాట పలుకగానే అక్కడున్న సభాసదులందరూ చకితులై ఆనందంతో పులకించిపోయారు. ఈ శ్రీకృష్ణుని మాటలకు ఎవ్వరూ సమాధానం చెప్పలేరని రాజులందరూ మనస్సులలో అనుకొని మిన్నకున్నారు. జమదగ్ని కొడుకు పరశురాముడు కురుసభలో ఈ మాట అన్నాడు. "రాజా ! నీవు సంశయించకుండా సోదాహరణంగా చెపుతున్న నా మాట విను. ఆ మాట విని మంచిదని నీవు భావిస్తే దానిని స్వీకరించు. ఒకప్పుడు దంభోద్భవుడనే సార్వభౌముడు ఉండేవాడు. ఆయన సమస్తపృథివినీ అఖండంగా అనుభవించాడని మేము విన్నాం. ఆయన ప్రతి రోజూ ఉదయాన్నే లేచి బ్రాహ్మణులనూ, క్షత్రియులను ఇలా అడిగేవాడు. 'ఈ లోకంలో క్షత్రియు డయినా, వైశ్యు డయినా, శూద్రు డయినా, ఆయుధం చేతబట్టిన బ్రాహ్మణుడైనా యుద్ధంలో నా అంతవాడు కానీ, నన్ను మించినవాడు కానీ ఉన్నాడా?' ఆ విధంగా మాట్లాడుతూ ఆ దంభోద్భవ మహారాజు గర్వోన్మత్తుడై ఎవ్వరిని గురించీ ఏమీ ఆలోచించకుండా తిరుగసాగాడు. ఆ సమయంలో ఏవిధంగానూ భయంలేని వేదవేత్త

లయిన బ్రాహ్మణులు తనను తాను పొగడుకొంటున్న ఆ రాజును నిందించారు. బ్రాహ్మణులు నిషేధించినా మాటిమాటికీ ఆ విధంగానే అడిగేవాడు. ఆయనకు అహంకారం పెరిగింది. ఐశ్వర్యంతో మత్తుడయ్యాడు. రాజు పదే పదే అడుగుతూఉంటే వేదవేత్తలు, తపస్సంపన్నులు, మహాత్ములు అయిన బ్రాహ్మణులు కోపంతో మండిపడుతూ రాజుతో ఇలా అన్నారు. 'రాజా ! యుద్ధంలో అనేకులను జయించిన పురుషశ్రేష్ఠులు ఇద్దరున్నారు. వారితో నీవు ఎప్పటికీ సమానుడవు కాలేవు.'

ద్విజులు ఆ రీతిగా పలుకగానే ఆ దంభోద్భవుడు 'ఆ వీరు లెక్కడ ? వారి జన్మస్థాన మెక్కడ ? వారేం చేస్తుంటారు? వారి పేర్లేవి ?' అని మరల ఆ బ్రాహ్మణుల నడిగాడు. బ్రాహ్మణులిలా అన్నారు. 'రాజా ! వారు నరనారాయణులని పేరుగల తాపసులని విన్నాం. ప్రస్తుతం వారు మానవలోకానికే వచ్చి ఉన్నారు. వారితో యుద్ధం చేయి. నరనారాయణు లనే మహాత్ములిద్దరూ గంధమాదన పర్వతంపై మాటలకు అందనంత ఘోరమయిన తపస్సు చేస్తున్నారని విన్నాం.' ఆ మాటలను సహించలేని ఆ రాజు (దంభోద్భవుడు) షడంగాలతో (రథ, గజ, అశ్వ, పదాతి, శకట, ఉష్ట్ర సేనలు షడంగాలు) కూడిన గొప్ప సేనను సిద్ధం చేసికొని అపరాజితు లయిన ఆ నరనారాయణు లున్న చోటికి వెళ్ళాడు. ఆ దంభోద్భవుడు వారిని వెదుకుతూ దుర్గమమయిన గంధమాదన పర్వతాన్ని ఎక్కి, అరణ్యంలో ఉన్న ఆ తాపసుల దగ్గరకు చేరాడు. ఆ పురుషశ్రేష్ఠ లిద్దరూ ఆకలిదప్పుల వలన కృశించి ఉన్నారు. నరాలు పైకి కనిపిస్తున్నాయి. చలిగాలి, ఎండలవలన వారు బక్కచిక్కి ఉన్నారు. దంభోద్భవుడు వారి దగ్గరకు చేరి పాదాలకు నమస్కరించి, కుశల ప్రశ్నలు వేశాడు. వారూ ఆ రాజును అర్చించి, ఆసీనుని చేసి భోజనార్థం దుంపలను, పండ్లనూ, నీటిని ఇచ్చి, "తమకేమి చేయగల" మని ప్రశ్నించారు. అప్పుడు దంభోద్భవుడు జరిగిన విషయాన్నంతా వారికి వివరించాడు. 'నేను భుజబలంతో సమస్త భూమండలాన్ని జయించాను. సర్వశత్రువులనూ సంహరించాను. మీతో యుద్ధం చేయాలన్న కోరికతో ఈ పర్వతానికి వచ్చాను. ఇదే నా చిరకాలవాంఛ. ఆతిథ్యరూపంతో మీరు నాతో యుద్ధం చేయండి.'

నరనారాయణులు ఇలా అన్నారు. 'రాజశ్రేష్ఠా ! ఈ ఆశ్రమం క్రోధ లోభాలకు దూరమైనది. ఈ ఆశ్రమంలో యుద్ధానికి కానీ, శస్త్రాస్త్రాలకు కానీ, కుటిలత్వంతో

కూడిన వారికి కానీ తావులేదు. ఈ భూమిలో క్షత్రియు లెందరో ఉన్నారు. అక్కడకుపోయి వారితో యుద్ధాన్ని కోరుకో.' నరనారాయణులు పదేపదే అదే విషయాన్ని చెప్పి, క్షమాపణను కోరి, ఆయనను అనునయించారు. అయినాకూడా దంభోద్భవుడు యుద్ధాన్నే కోరుతూ ఆ తాపసులను యుద్ధానికే ఆహ్వానించసాగాడు. భారతా ! అప్పుడు నరుడు పిడికెడు గడ్డి పోచలను తీసికొని 'యుద్ధ కాముకా ! క్షత్రియా ! రా! యుద్ధం చేయి. నీ ఆయుధాలను అన్నింటినీ తీసికో ! సేననంతా సమకూర్చుకో ! కవచాలను ధరించు, నీకున్న ఇతర సాధనాల నన్నింటినీ తెచ్చుకో. ఎంతో పొగరుతో నీవు బ్రాహ్మణులు మొదలగు వారినందరినీ యుద్ధానికి ఆహ్వానిస్తున్నావు. నేటి నుండీ నీ యుద్ధాసక్తిని నేను పోగొడతాను.' దంభోద్భవుడిలా అన్నాడు. 'తాపసా ! మీరు ఈ అస్త్రాన్నే నాతో పోరాడటానికి తగినదని భావించినా నేను మీతో యుద్ధం చేస్తాను. నేను యుద్ధం కోసమే గదా వచ్చింది.'

ఆ విధంగా పలికి సైనికులతో కలిసి దంభోద్భవుడు నరుని చంపాలని సంకల్పించి అన్నివైపుల నుండి బాణవర్షాన్ని కురిపించ నారంభించాడు. శత్రువుల శరీరాలను ఛేదించగల ఆ దంభోద్భవుని బాణాలను లెక్కచేయకుండా ఆ నరుడు గడ్డిపోచలతో వాటిని ఛేదించాడు. ఓటమి నెరుగని ఆ మహర్షి భయంకరమైన ఐషీకాస్త్రాన్ని ప్రయోగించాడు. అది తిరుగులేనిది. ఆ సంఘటన అద్భుతంగా కనిపించింది. ఈవిధంగా గురిచూచి కొట్టగల ఆ నరుడు మాయతో గడ్డిపోచలతోనే ఆ దంభోద్భవుని సేనల కళ్లనూ, చెవులనూ, ముక్కులనూ కూడా ఛేదించాడు. గడ్డిపోచలతో నిండి తెల్లగా కనిపిస్తున్న ఆకాశాన్ని చూచి దంభోద్భవుడు ఆ మునిపాదాలపై పడి 'నాకు మేలు చేయండి' అని ప్రార్థించాడు. రాజా ! శరణన్న వారికి శరణాన్ని ఇచ్చే ఆ నరుడు ఆ రాజుతో ఇలా అన్నాడు. 'నేటినుండి బ్రాహ్మణశ్రేయోభిలాషివై, ధర్మాత్ముడవై ఉండు. మరల ఇటువంటి సాహసం చేయవద్దు. రాజశ్రేష్ఠా ! శత్రునగరాలను జయించిన వీరు లయినా క్షాత్రధర్మాన్ని స్మరిస్తూ మనసులో కూడా నీవలె ప్రవర్తించరు. ఇంకెప్పుడూ కూడా గర్వంతో నీకన్న తక్కువ వారిని కానీ, నిన్ను మించిన వారిని కానీ ఆక్షేపించవద్దు. ఈ విషయాన్నే నీవు సావధానంగా గ్రహించాలి. రాజా ! నీవు వినీతబుద్ధివై; లోభాన్ని, అహంకారాన్ని వదిలి; అభిమానవంతుడవై, ప్రజలను పరిపాలించు. బలాబలాలను గ్రహించకుండా ఎవ్వరినీ ఆక్షేపించవద్దు. నీకు మేలు కలుగుతుంది.

అనుమతిస్తున్నాను. వెళ్ళు, ఇంకెప్పుడూ ఇలా ప్రవర్తించవద్దు. మామాటగా నీవు బ్రాహ్మణుల క్షేమాన్ని అడుగుతూ ఉండు."

అపుడు ఆ రాజు - దంభోద్భవుడు ఆ మహాత్ముల పాదాలకు నమస్కరించి తన నగరానికి మరలి వచ్చాడు. విశేషంగా ధర్మాన్ని అనుసరించ సాగాడు. పూర్వం మహాత్ముడైన నరుడు ఆ గొప్పకార్యాన్ని సాధించాడు. అనేక గుణాలలో నారాయణుడు అతనిని మించినవాడు. కాబట్టి రాజా ! అర్జునుడు గాండీవాన్ని ఎక్కుపెట్టకముందే నీవు అభిమానాన్ని వీడి అర్జునునితో చేరు. (అర్జునుని దగ్గర) కాకుదీకం, శుకం, నాకం, అక్షిసంతర్జనం, సంతానం, నర్తకం, ఘోరం, ఆస్యమోదక మనే ఎనిమిది అస్త్రాలున్నాయి. ఈ అస్త్రాలు తగిలితే ఎవరైనా మరణించవలసిందే. ఈ ఎనిమిది అస్త్రాలు కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాన, మాత్సర్య, అహంకారాలకు ప్రతీకలు. ఈ అస్త్రాల ప్రయోగానికి ఎరయైన వారు కొందరు ఉన్మత్తులై పిచ్చిగా ప్రవర్తిస్తారు. కొందరు చైతన్యాన్ని కోల్పోయి నిశ్చేష్టులవుతారు. కొందరు నిదురపోతారు. కొందరు ఎగురుతారు. కొందరు కుంటుతారు. కొందరు మలమూత్రాలు విసర్జిస్తారు. కొందరు నవ్వుతూ ఏడుస్తూ ఉంటారు. రాజా ! సర్వలోకసృష్టి కర్త, సర్వకర్మవేత్త అయిన నారాయణుని బంధువు అయిన ఆ అర్జునుని యుద్ధంలో ఎదిరించడం అసాధ్యం. భారతా ! యుద్ధంలో అసమానుడై, కపిధ్వజుడై, జయశీలుడైన వీరుడు అర్జునుడు. అర్జునుని ఎదిరించటానికి మూడులోకాలలో ఎవ్వరూ సాహసించరు. అర్జునుడు లెక్కలేనన్ని సద్గుణాలు గలవాడు. జనార్దనుడు ఆయనను మించినవాడు. అర్జునుని గురించి నీకు కూడా బాగా తెలుసు. నరనారాయణులుగా ప్రఖ్యాతు లయిన వారే అర్జున శ్రీకృష్ణులు. మహారాజా ! వారిద్దరూ గొప్ప వీరులూ, పురుషోత్తములూ అని గ్రహించు. భారతా! నీకు ఈ విషయం సరిగా అర్థమయితే, నాపై సందేహం లేకపోతే, గొప్ప మనస్సును ఆశ్రయించి, పాండవులతో సంధి చేసుకో. భరతశ్రేష్ఠ ! మనం విడిపోకూడదని నీవు భావిస్తే, శ్రేయస్కరమని నీ కనిపిస్తే సంధినే చేసికో. యుద్ధం వైపు మనస్సును మరలనివ్వవద్దు. కురుశ్రేష్ఠ ! మీ వంశం ఈ లోకంలో ప్రతిష్ఠ గలది. ఆ ప్రతిష్ఠను అలాగే నిలుపు. నీకు మేలు కలుగుతుంది. స్వప్రయోజనాన్ని గురించియే ఆలోచించుకో."

97. కణ్వముని మాతలి ఉపాఖ్యానమును ఆరంభించుట.

పరశురాముని మాటలు విని పూజ్యుడైన కణ్వమహర్షి కూడా కౌరవసభలో దుర్యోధనుని కిలా చెప్పాడు. "లోకపితామహుడైన బ్రహ్మ అక్షయుడు, అవ్యయుడు అయినట్లే పూజ్యులయిన నరనారాయణ మహర్షులు కూడా అక్షయులూ, అవ్యయులూ. అదితిపుత్రు లందరిలో విష్ణువు ఒక్కడే గెలువరానివాడు. అవ్యయుడు, శాశ్వతుడు, సర్వసమర్థుడైన సనాతన పరమేశ్వరుడూ. మిగిలిన వారందరూ – చంద్రుడూ, సూర్యుడూ, భూమి, నీరు, వాయువు, అగ్ని, ఆకాశం, గ్రహాలు, నక్షత్రసమూహాలూ ఏదో కారణంగా నశించేవారే. జగత్తు నశించినపుడు సూర్యచంద్రాదు లన్నీ మూడులోకాలనూ పరిత్యజించి నశిస్తాయి. సృష్టికాలంలో మరల అన్నీ సృష్టింపబడతాయి. మిగిలిన మనుష్యులు, జంతువులూ, పక్షులూ జీవలోకంలో చరిస్తున్న మిగిలిన జంతుజాతులూ అన్నీ స్వల్పకాలంలోనే నశించిపోయేవి. ఎందరో రాజులు కూడా రాజ్యసౌఖ్యాల ననుభవించి, ఆయువు నశించి, మరణించిన తరువాత తమతమ పుణ్యపాపఫలాలను అనుభవించటానికి మరలా జన్మిస్తుంటారు. రాజా ! నీవు ధర్మపుత్రు డయిన యుధిష్ఠిరునితో సంధి చేసికొనటం మంచిది. పాండవులూ, కౌరవులూ కలిసి భూమిని పరిపాలించుదురు గాక ! పురుషశ్రేష్ఠా ! సుయోధనా ! నేనే బలవంతుడనని భావించ రాదు. ఎందుకంటే బలవంతులకన్నా బలవంతులు లోకంలో కనిపిస్తుంటారు. కౌరవా ! బలవంతుల మధ్య సైనికబలం బలంగా భావింపబడదు. పాండవు లందరూ దేవతలతో సమానమైన బలం గలవారు కాబట్టి నీకన్న బలవంతులు.

ఈ సందర్భంలో మాతలి కన్యాదానం చేయాలని కోరుతూ వరునికై అన్వేషిస్తున్న ప్రాచీన కథను ఉదహరిస్తారు. త్రిలోకాధిపతి అయిన ఇంద్రునకు మాతలి అనే సారథి ఉన్నాడు. ఆయనకు ఒక్కతే కుమార్తె. ఆమె అందం లోక ప్రసిద్ధిని పొందింది. దివ్యరూపంగల ఆ కాంత పేరు గుణకేశి. ఆమె తన శరీర సౌందర్యం చేత, రూపం చేత అప్పటి స్త్రీల నందరినీ మించింది. రాజా ! ఆమె పెళ్ళియీడు సమీపించిందని గ్రహించిన మాతలి ఆ విషయం మీదనే దృష్టిపెట్టి ఆలోచిస్తూ భార్యతో చర్చిస్తూ ఉండేవాడు. 'గొప్ప శీలస్వభావాలు గలిగి, కీర్తి గలదై, కోమల మనస్తత్వం గల ఉన్నత వంశంలో ఆడపిల్ల పుట్టడం ఇబ్బందిని కలిగిస్తుంది. కన్య మాతృ వంశాన్నీ, పితృవంశాన్నీ, మెట్టినింటిలోని సత్పురుషులనూ కూడా సందేహంలో పడవేస్తుంది.

నేను మానవదృష్టి ననుసరించి దేవలోకంలోనూ, మానవ లోకంలోనూ అంతా తిరిగి వెతికాను. కానీ ఏ ఒక్క వరుడూ నాకు నచ్చలేదు.' మాతలి వరునికోసం దేవతలలో, రాక్షసులలో, గంధర్వులలో, మనుష్యులలో, మహర్షులలో ఎంతో వెదికాడు. కానీ ఎవరూ నచ్చలేదు. అప్పుడొక రాత్రి మాతలి తన భార్య అయిన సుధర్మతో చర్చించి, నాగలోకానికి వెళ్ళాలని భావించాడు. దేవతలలో గానీ, మానవులలో గాని గుణకేశికి తగిన రూపవంతు డయిన వరుడు కనబడలేదు. నాగలోకంలో తగిన వరుడు తప్పక ఉండవచ్చు. సుధర్మతో ఆ విధంగా చర్చించి మాతలి ఇష్ట దేవతలకు ప్రదక్షిణంచేసి, కూతురి శిరస్సును ఆఘ్రాణించి భూతలంలో ప్రవేశించాడు.

98. మాతలి నారదునితో కలిసి వరుణలోకమున ఆశ్చర్యకర వస్తువులను చూచుట.

మాతలి దారిలో నడుస్తూ అనుకోకుండా నారదమహర్షిని కలిశాడు. అప్పుడు నారదుడు వరుణుని దర్శనానికై వెళుతున్నాడు. నారదుడు "దేవసారథీ ! ఎక్కడకు వెళ్తున్నావు? సాంతపని మీద వెళ్తున్నావా లేక ఇంద్రుని ఆదేశంతో వెళ్తున్నావా?" అని అడిగాడు. నారదుడు ఆ విధంగా అడగగానే మాతలి తన పనిని గురించి పూర్తిగా, ఉన్నదున్నట్లుగా నారదునికి చెప్పాడు. అప్పుడు నారదమహర్షి మాతలితో "కలిసివెళదాం. నేను కూడా వరుణ దర్శనంకోసం స్వర్గలోకం నుండి వస్తున్నాను. నేను నీకు భూలోకానికి క్రింద ఉన్న సమస్తలోకాలనూ చూపిస్తూ అక్కడున్న అన్నింటినీ పరిచయం చేస్తాను. మాతలీ! తగిన వరుని ఎవరినైనా చూచి ఎన్నుకొందాం" అన్నాడు. ఆ తరువాత మహాత్ములైన ఆ నారద మాతలులిద్దరూ భూమి క్రిందకు పోయి లోకపాలకుడైన వరుణుని దర్శనం చేశారు. అక్కడ దేవమునికి తగినట్లుగా నారదుడూ, దేవేంద్రునితో సమానంగా మాతలీ పూజా సత్కారాలను పొందారు. ఆ మాతలినారదు లిద్దరూ ఆనందించి తమ పనిని ఆయనకు నివేదించి, ఆయన అనుమతితో నాగలోకంలో తిరుగసాగారు. నారదునకు పాతాళలోకంలో నివసిస్తున్న సర్వప్రాణులను గురించీ తెలుసు. ఆయన మాతలికి అక్కడి సమస్తవిషయాలనూ, సమగ్రంగా చెప్పనారంభించాడు.

నారదుడిలా అన్నాడు. "సారథీ ! పుత్రులూ, పౌత్రులూ చుట్టు ముట్టి ఉన్న వరుణుని చూశావు కదా ! చూడు! ఇది సర్వసంపత్సమేత మయిన వరుణుని

నివాసస్థానం. దీనిపేరు సర్వతోభద్రం. ఈయన గోపతి అయిన వరుణుని కొడుకు. మహాప్రజ్ఞావంతుడు. శీలం, నడవడి, తన పవిత్రత కారణంగా విశిష్టస్థానాన్ని పొందినవాడు. ఈతడు వరుణదేవుని ప్రియపుత్రుడు, తామరపూలవంటి కన్నులు కలవాడు, అందగాడు, చూడముచ్చటయిన వాడు. పేరు పుష్కరుడు. సోముని కుమార్తె ఈయనను భర్తగా వరించింది. సోముని రెండవ కూతురు జ్యోత్స్నికాలి. రూపంలో మరొక లక్ష్మివంటిది. అదితి పెద్ద కొడుకైన సూర్యుని భర్తగా స్వీకరించింది. మొత్తం బంగారుతో నిర్మించ బడిన ఈ వరుణదేవుని భవనాన్ని చూడు. దేవతలు ఇక్కడకు వచ్చిన తరువాతనే నిజంగా దేవతలు అవుతారు. మాతలీ ! వరుణునికి ఓడిపోయి రాజ్యాలు పోగొట్టుకొన్న దైతేయుల సమస్తాయుధాలూ ఇటు కన్పిస్తున్నాయి చూడు. ఈ శస్త్రాస్త్రాలన్నీ అక్షయాలు. ప్రయోగించిన తరువాత శత్రువును చంపి మరల యజమాని దగ్గరకే చేరుతాయి. మొదట దైత్యులచే ప్రయోగింపబడిన వీటిని ఇప్పుడు దేవతలు తమ ప్రాపులో ఉంచుకొన్నారు. మాతలీ! ఈ ప్రాంతంలో రాక్షసజాతులూ, దైత్య జాతులూ నివసిస్తుంటారు. దైత్యులు తయారు చేసిన గొప్ప గొప్ప అస్త్రాలు ఇక్క డున్నాయి.

మహాతేజస్వి అయిన అగ్నిదేవుడు వరుణుని సరోవరంలో ప్రకాశిస్తుంటాడు. పొగ లేని ఈ అగ్ని విష్ణుమూర్తి సుదర్శన చక్రాన్ని సయితం అడ్డగించాడు. ఈ చాపం గాండీమయమైనది. అందుకే ఇది గాండీవం (వజ్రాయుధపు కణుపులకు 'గాండి' అని పేరు). జగత్సంహారం కోసం ఇది నిర్మించబడింది. దేవతలు దీనిని ఎప్పుడూ రక్షిస్తుంటారు. ఈ ధనుస్సు అవసర మయినపుడు తనశక్తిని లక్షరెట్లు ఎక్కువ చేసుకొంటుంది. ఎప్పుడూ తిరుగులేని దిది. బ్రహ్మవాది అయిన బ్రహ్మదేవుడు దీనిని మొదట నిర్మించాడు. రాక్షసులవంటి రాజులలో అయినా అలవికాని వారిని ఇది అణచివేస్తుంది. ఈ ధనుస్సు రాజులకు గొప్ప ఆయుధం. చక్రంవలె ప్రకాశిస్తుంటుంది. మహాభ్యుదయకారి అయిన దీనిని వరుణుని కుమారులు ధరిస్తుంటారు. ఛత్రగృహంలో వరుణదేవుని ఛత్రం ఒకటుంది. అది మేఘంలాగా అన్ని వైపులనుండి చల్లని నీటిని చిమ్ముతూఉంటుంది. ఈ గొడుగునుండి జారిపడేనీరు చంద్రుని వలె నిర్మల మయినది. చీకటితో కప్పబడి ఉంటుంది. కాబట్టి అది కనిపించదు. మాతలీ ! ఈ వరుణలోకంలో చూడదగిన అద్భుతవస్తువులు చాలా ఉన్నాయి. కానీ నీ పనికి ఆటంకం కలుగుతుంది

కాబట్టి మనం త్వరగా నాగలోకానికి వెళదాం."

99. నారద మహర్షి పాతాళలోకమును చూపుట.

నారదుడిలా అన్నాడు- "నాగలోకానికి నాభిస్థానంలో (మధ్య భాగంలో) ఉన్న ఈ నగరం పాతాళమన్న పేరుతో ప్రసిద్ధం. ఇక్కడ దైత్యులూ, దానవులూ నివసిస్తారు. భూలోకంలోని జంగమప్రాణులు నీటితోపాటు కొట్టుకొని వచ్చి ఈ నగరానికి చేరగానే భయపీడితులై పెద్దగా అరుస్తారు. నీటిని ఆహారంగా స్వీకరించే ఆసురాగ్ని ఇక్కడ ఎప్పుడూ మండుతుంటుంది. ప్రయత్నపూర్వకంగా అది హద్దులో నిలుపబడింది. దేవతలద్వారా నియంత్రింపబడిన ఆ అగ్ని ఎప్పుడూ వ్యాపించదు. దేవతలు శత్రువులను సంహరించి, అమృతాన్ని సేవించి, మిగిలిన దానిని ఇక్కడ భద్రపరచుకొన్నారు. అందువలన అమృతమయమైన సోమం నశించినా మరలా పెరుగుతూ ఉంటుంది. (చంద్రుని కళలు తరుగుతూ, పెరుగుతూ ఉంటాయి) ఇక్కడ అదితినందనుడైన హయగ్రీవ విష్ణువు సువర్ణమయకాంతిధారియై, ప్రతి పర్వమునందునూ వేదధ్వనులతో జగత్తును నింపుతూ పైకి లేస్తాడు. జలస్వరూపం గల సమస్తవస్తువులూ పూర్ణరూపంతో ఇక్కడ పడుతుంటాయి. అందుకే ఈ శ్రేష్ఠనగరానికి పాతాళమని పేరు. లోకాలకు మేలు చేయటానికై సముద్రం నుండి పుట్టే వర్షాకాలపు గాలి ఇక్కడ నుండి చల్లని నీటిని కొనిపోయి మేఘాల్లో నిలుపుతుంది. దానిని దేవేంద్రుడు వర్షంగా కురిపిస్తాడు. రకరకాల ఆకారాలు, అనేక రూపాలూ గల జలచరాలయిన తిమింగలాలు ఇక్కడ చంద్రకిరణాలను త్రాగి, నీటిలో నివసిస్తుంటాయి. మాతలీ! ఈ పాతాళ వాసులయిన ప్రాణులు పగలు సూర్యకిరణతాపం వలన మృత ప్రాయాలవుతాయి. కాని రాత్రి అమృతమయమైన చంద్రకిరణాల స్పర్శవలన మరల లేస్తుంటారు. ఇక్కడ ప్రతిదినమూ ఉదయిస్తున్న చంద్రుడు తన కిరణా లనే బాహువులతో అమృతాన్ని తాకి, ఆ కిరణస్పర్శతో మృత్యుముఖంలో ఉన్న ప్రాణులను ఉజ్జీవింపజేస్తాడు. అధర్మపరాయణులయిన దైత్యులు తమ సంపదలను దేవేంద్రునిచేత కోలుపోయి, కాలానికి లొంగి, బాధలుపడుతూ ఈ పాతాళంలోనే నివసిస్తుంటారు.

సర్వభూతమహేశ్వరుడయిన భూతనాథుడు సమస్తప్రాణుల సమృద్ధికై ఇక్కడ ఘోరమైన తపస్సు చేశాడు. వేదాధ్యయనం చేత కృశించి, ప్రాణాలను కూడా

లెక్కచేయకుండా స్వర్గలోకాన్ని జయించిన బ్రాహ్మణమహర్షిగణం గోవ్రతాన్ని స్వీకరించి ఇక్కడే నివసిస్తుంటుంది. **ఎక్కడ అవకాశముంటే అక్కడ నిదురించటం, ఏది దొరికితే దానినే తినటం, ఎటువంటి వస్త్రాలు లభిస్తే వాటినే ధరించటం - ఇది గోవ్రత స్వరూపం.** గజరాజయిన ఐరావతమూ, వామనమూ, కుముదమూ, అంజనమూ అనేపేర్లతో ప్రసిద్ధికెక్కిన గొప్పగొప్ప ఏనుగులు, సుప్రతీక వంశంలో పుట్టినవి, ఇక్కడ ఉన్నాయి. మాతలీ! చూడు, ఇక్కడ గుణవంతుడైన వరుడుగా నీకెవరయినా నచ్చితే ప్రయత్నపూర్వకంగా నేను పోయి వరించి తెస్తాను. చూడు. ఇక్కడ నీటిలో ఒక గ్రుడ్డు ఉంది. అది తన కాంతితో ప్రకాశిస్తోంది. సృష్టి ప్రారంభం నుండి ఇది ఇక్కడ ఇలాగే ఉంది. బ్రద్దలు కాదు, కదలదు. దీని జాతిని గురించి కానీ, స్వభావాన్ని గురించి కానీ ఎవ్వరూ చెప్పగా నేను వినలేదు. దీని తల్లిదండ్రులను గురించి కూడా ఎవరికీ, ఏమీ తెలియదు. మాతలీ! ప్రళయకాలంలో ఈ గ్రుడ్డు నుండి మహాగ్ని పుట్టి చరాచర ప్రాణులతో సహా మూడులోకాలనూ దహించి వేస్తుందని అంటుంటారు." నారదుని మాటలు విని మాతలి ఇలా అన్నాడు - "ఇక్కడ నాకు ఒక్కడూ నచ్చలేదు. వెంటనే మరెక్కడకయినా పద."

100. హిరణ్యపుర దర్శనము - వర్ణనము.

నారదుడిలా అన్నాడు - "వందలకొలదీ మాయలతో సంచరించే దైత్యదానవుల స్థాన మిది, హిరణ్యపురం. ఇది విశాలమైన గొప్పనగరంగా ప్రసిద్ధి చెందింది. అసురుల విశ్వకర్మ అయిన మయుడు తన మనస్సంకల్పాన్ని అనుసరించి గట్టి ప్రయత్నంతో పాతాళలోకంలో ఈ నగరాన్ని నిర్మించాడు. వేలకొలదిగ మాయలను ప్రయోగించ గల బలపరాక్రమసంపన్నులు, శూరులూ అయిన దానవులు ఇక్కడ నివసిస్తున్నారు. వారికి చావులేకుండా ఉండే వర ముంది. ఇంద్రుడూ, యముడూ, వరుణుడూ, కుబేరుడూ మరెవ్వరు గానీ వీరిని లొంగదీసికొనలేరు. మాతలీ! పూజ్యుడైన విష్ణువు పాదాల నుండి పుట్టిన కాలఖంజులనే రాక్షసులూ, బ్రహ్మపాదాల నుండి పుట్టిన నైర్ఋత, యాతుధానులూ ఈ నగరంలో నివసిస్తారు. ఈ నైర్ఋతయాతుధానులు పెద్దపెద్దకోరలు గలవారు. ప్రచండవేగం గలవారు. వాయువేగంతో పరాక్రమించగలవారూ, మాయాబలసంపన్నులూ. యుద్ధోన్మాదం గల నివాత కవచులనే దానవుల నివాసం

ఇదే. ఇంద్రు డయినా వీరిని బాధించలేడు. నీకు తెలుసుగదా! మాతలీ! నీవూ, నీ కుమారుడు గోముఖుడూ, శచీపతి అయిన ఇంద్రుడూ, ఆయన కొడుకూ ఎన్నోసార్లు నివాతకవచుల ముందు నిలువలేకపోయారు. మాతలీ! ఈ బంగారు వెండిమేడల శోభను చూడు. ఇవన్నీ శాస్త్రీయ విధానంతో నిర్మింపబడి ఒకదానితో ఒకటి కలిసి ఉన్నాయి.

ఈ భవనాలు వైదూర్యమణులు పొదిగినవి, అందమైనవి. పగడాలను కూడా అలంకరించటంతో మరీ అందంగా ఉన్నాయి. జిల్లేడుపూలు, స్ఫటికమణుల లాగా స్వచ్ఛమైన వజ్రాలతో అలంకరింపబడి ప్రకాశిస్తున్నాయి. కొన్ని ఇళ్ళు మట్టితో కట్టినట్లున్నాయి. కొన్ని పద్మరాగనిర్మితాలు. కొన్ని కొండరాళ్ళతోనూ, మరికొన్ని కొయ్యతోనూ నిర్మింపబడినవి. కొన్ని ఇళ్ళు సూర్యుడిలాగా, మరికొన్ని జ్వలించే అగ్నిలాగా కనిపిస్తున్నాయి. మణుల తోరణాలతో విచిత్రకాంతి గలిగిన ఇవి చాలా ఎత్తుగా దట్టంగా కనిపిస్తున్నాయి. ఈ భవనాలు ఎంత అందమైనవో, ఏ పదార్థాలతో నిర్మింపబడినవో చెప్పటం చాలా కష్టం. తమ స్థాయిని బట్టి ఇవి ప్రసిద్ధ మయినవి. నిర్మాణ ప్రమాణాలను బట్టి కూడా ఇవి ప్రశంసాపాత్ర మైనవి. ఈ దైత్యుల ఉద్యానాలు, క్రీడాస్థలాలూ చాలా అందమైనవి. శయ్యలు కూడా తదనుగుణ మైనవే. వీరు వాడే పాత్రలూ, ఆసనాలూ కూడా రత్నమయాలై గొప్పవిలువ గలవి. ఇక్కడి పర్వతాలు మేఘసముదాయంలా కనిపిస్తున్నాయి. వాటిపైనుండి సెలయేళ్ళు పడుతున్నాయి. ఇక్కడి చెట్లను చూడు. అవి కోరుకొన్న పూలనూ, పండ్లనూ ఇస్తాయి. స్వేచ్ఛగా చరిస్తాయి. మాతలీ! ఇక్కడ కూడా నీకు నచ్చే వరు డెవరైనా ఉండవచ్చు. నీవు కావాలంటే ఈ ప్రదేశంలోనే మరో దిక్కుకు పోదాం." అలా మాటాడుతున్న నారదుని మాటలు విని మాతలి ఇలా అన్నాడు- "దేవర్షీ! దేవతలకు నచ్చని పని ఏదీ నేను చేయను. సోదరులయిన దేవతలూ, దానవులూ ఎప్పుడూ శత్రుత్వాన్ని వహించి ఉండేవారు. శత్రుపక్షంతో వియ్యమందటం నాకెలా నచ్చుతుంది? మరో తావుకు వెళ్ళటమే మంచిది. దానవులను చూడా లనిపించటం లేదు. ఏదో గొడవకు దారి తీయటానికి నీ మనస్సు కోరుకొంటోందని కూడా నాకు తెలుసు."


A C.No.....

101. గరుడలోకమును, గరుడసంతానమును వర్ణించుట.

నారదు డిలా అన్నాడు- "ఇది పాములను ఆహారంగా స్వీకరించే గరుడపక్షుల లోకం. పరాక్రమించటంలో, ఎంత దూరమయినా ఎగరటంలో, ఎంత బరువైనా మోయటంలో వీటికి కొంచెంకూడా శ్రమ ఉండదు. మాతలీ! సుముఖుడు, సునాముడు, సునేత్రుడు, సువర్చస్కుడు, సురుచుడు, సుబలుడు అనే పేర్లుగల ఆరుగురు గరుత్మంతుని కుమారులు ఇక్కడ తమ వంశాలను విస్తరించి ఉన్నారు. వినతా వంశవర్ధనులు, కశ్యపకుల సంజాతులు, సంపత్సంవర్ధకులు అయిన ఈ ఆరుగురు గరుడజాతిని వందలు, వేలు శాఖలుగా విస్తరింపజేసి ఉన్నారు. వీరందరూ లక్ష్మీసంపన్నులు, శ్రీవత్సలాంఛనం గలవారు. ఐశ్వర్యాన్ని కోరుతూ ఎంతో బలాన్ని ధరించి ఉన్నవారు. బ్రాహ్మణవంశంలో పుట్టినవారైనా వీరు క్షత్రియకర్మను పాటించేవారు. వీరు దయాహీనులూ, సర్ప భక్షకులూ. ఈ విధంగా తమ దాయాదు లయిన సర్పాలను నాశనం చేసినందువలన వీరికి బ్రాహ్మణత్వం లభించలేదు. మాతలీ! నేనిప్పుడు వీరిలో ప్రాధాన్యాన్ని అనుసరించి కొందరి పేర్లను చెప్తాను, విను. విష్ణుమూర్తి పరివారంలో చేరి ఈ వంశం ప్రశంసనీయ మయింది. వీరికి విష్ణువే దేవుడు, విష్ణువే పరమాశ్రయం. వీరి మనస్సులలో ఎప్పుడూ విష్ణువు ఉంటాడు. వీరికి ఎల్లప్పుడూ విష్ణువే గతి. సువర్ణచూడుడు, నాగాశి, దారుణుడు, చండతుండకుడు, అనిలుడు, అనలుడు, విశాలాక్షుడు, కుండలి, పంకజిత్తు, వజ్రవిష్కంభుడు, వైనతేయుడు, వామనుడు, వాతవేగుడు, దిశాచక్షువు, నిమేషుడు, అనిమిషుడు, త్రిరావుడు, సప్తరావుడు, వాల్మీకి, ద్వీపకుడు, దైత్యద్వీపుడు, సరిద్ద్వీపుడు, సారసుడు, పద్మకేతనుడు, సుముఖుడు, చిత్రకేతువు, చిత్రబర్హుడు, అనఘుడు, మేషహృత్తు, కుముదుడు, దక్షుడు, సర్పాంతుడు, సహభోజనుడు, గురుభారుడు, కపోతుడు, సూర్యనేత్రుడు, చిరాంతకుడు, విష్ణుధర్ముడు, కుమారుడు, పరిబర్హుడు, హరి, సుస్వరుడు, మధుపర్కుడు, హేమవర్ణుడు, మాలయుడు, మాతరిశ్వుడు, నిశాకరుడు, దివాకరుడు- ఈ విధంగా సంక్షేపంగా నేను గరుడ సంతతిని వర్ణించాను. వీరంతా కీర్తిసంపన్నులూ, మహాబలులు. మాతలీ! వీరిలో ఎవ్వరూ నచ్చకపోతే రా, పోదాం. తప్పక ఎవరో ఒకరు నీకు నచ్చే ప్రదేశానికి నిన్ను తీసికొనిపోతా."

102. సురభిని, దాని సంతతిని, రసాతలసుఖమును వర్ణించుట.

నారదుడిలా అన్నాడు - "ఇది ఏడవదైన అధోలోకం. దీనిపేరు రసాతలం (పాతాళం). అమృతంతో పుట్టిన గోమాత సురభి ఇక్కడ నివసిస్తుంటుంది. ఇది ఎల్లప్పుడూ తన పొదుగునుండి పాలను ప్రవహింపజేస్తుంది. ఆ పాలు పృథివీసారంగా పుట్టినవి. ఆరు రుచుల సమ్మేళనంతో ఏర్పడిన ఏకరసస్వరూప మైనవి. శ్రేష్ఠమైనవి. పూర్వం అమృతపానం చేసి తృప్తిపడిన బ్రహ్మ త్రేన్చగా, ఆ సమయంలో ఆయన నోటినుండి పుట్టిన పవిత్ర ఈ సురభి. నిరంతరంగా భూమిపై పడిన ఈ సురభిక్షీరధారతో ఏర్పడిన పెద్దమడుగే క్షీరసాగరం. ఇది పరమపవిత్ర మైనది. ఈ క్షీరసాగరంనుండి వచ్చే నురుగు పువ్వులవలె కనిపిస్తుంది. అది తీరంపై వ్యాపిస్తుంది. దానిని త్రాగుతూ ఫేనపులని ప్రసిద్ధులయిన మహర్షులు ఈ రసాతలంలో నివసిస్తుంటారు. మాతలీ! ఫేనాన్ని (నురుగును) ఆహారంగా చేసికొనినందువలన ఆ మహర్షులు ఫేనపులని ప్రసిద్ధి కెక్కారు. వారు తీవ్రతపస్సులో లగ్నమై ఉంటారు. దేవతలు కూడా వారిని చూచి భయపడతారు. మాతలీ! ఈ సురభికి కుమార్తెల వంటివి మరో నాలుగు ధేనువు లున్నాయి. అవి అన్ని దిక్కులలో నివసిస్తాయి. ఆ దిక్కులలో ధారణ పోషణలను అవి కల్గిస్తాయి. సురూప అనుపేరుగల సౌరభి తూర్పుదిక్కున ఉంటుంది. హంసిక అనే పేరుగల సౌరభి దక్షిణ దిక్కున ఉంటుంది. మాతలీ! గొప్పప్రభావంగలిగి, విశ్వరూప అయిన సుభద్ర వరుణుని దిక్కయిన పశ్చిమాన్ని ధరించి ఉంటుంది. మాతలీ! నాలుగవ ధేనువుపేరు సర్వకామదుఘ. అది ధర్మయుక్తమై కుబేరునకు సంబంధించిన ఉత్తర దిక్కును ధరిస్తుంది. మాతలీ! దేవదానవులు మందర పర్వతాన్ని కవ్వంగా చేసి, ఈ సురభిపాలతో కూడిన క్షీరసాగరాన్ని మథించారు. దాని నుండి వారుణి, లక్ష్మి, అమృతం, అశ్వశ్రేష్ఠమయిన ఉచ్చైశ్రవం, మణిరత్న మయిన కౌస్తుభం ఉద్భవించాయి. ఈ సురభి స్రవింపజేసే పాలు పాలుత్రాగే వారికి పాలుగానూ, స్వధను భుజించే పితరులకు స్వధగానూ, అమృతాన్ని భుజించే దేవతలకు అమృతంగానూ ఉంటాయి. ఇక్కడున్న రసాతల నివాసులు పాడుకున్న పురాతన గీతం ఇప్పటికీ లోకంలో వినిపిస్తుంటుంది. ఇప్పటికీ ధీమంతులు దానిని చెప్పుకొంటూనే ఉంటారు. ఆ గాథ ఇది. నాగలోకంలో కానీ, స్వర్గలోకంలో కానీ, స్వర్గలోక విమానంలో గానీ నివసించినా రసాతల నివాసంలోని సుఖం లభించదు."

103. సుముఖుడను నాగకుమారునకు మాతలి కూతురు నిచ్చుటకు నిర్ణయించుట.

నారదుడిలా అన్నాడు. "ఇది వాసుకి పరిపాలించే భోగవతీ పురం. దేవేంద్రునకు అమరావతి ఎటువంటిదో వాసుకికి ఈ భోగవతి అటువంటిది. ఇది ఆదిశేషుడనే సర్పం. లోకప్రసిద్ధమైన తన తపోబలంతో ప్రభావభరిత మయిన ఈ సమస్తభూమినీ ఎప్పుడూ ధరించి ఉంటుంది. ఈ శేషుని శరీరం కైలాసపర్వతం వంటిది. తలలు వేయి, నాలుకలు అగ్నిజ్వాలల వంటివి. మహాబలుడైన ఈ శేషుడు దివ్య మయిన ఆభరణాలు ధరించి ఉంటాడు. ఇక్కడ వివిధాకారాలతో, వివిధాలంకారాలతో సురసకొడుకు లయిన నాగులు నిశ్చింతగా జీవిస్తుంటారు. ఆ నాగులు వేలకొలదిగా ఉన్నారు. వీరంతా బలవంతులు, స్వాభావికంగానే భయంకర మయిన వారు. వీరిలో కొందరి శరీరాలపై మణుల గుర్తులు, కొందరి శరీరాలపై స్వస్తిక చిహ్నాలు, మరికొందరి శరీరాలపై చక్ర చిహ్నాలు, మరికొందరి శరీరాలపై కమండలుచిహ్నాలు ఉంటాయి. వీరిలో కొందరు వేయి తలలవారు, మరికొందరు ఆయిదువందల తలలు గలవారు. వంద తలలు గలవారు కొందరు. మూడే తలలు గలవారు కొందరు. కొందరు పదితలలు గలవారు. మరికొందరు ఏడుముఖాలు గలవారు. కొందరు పెద్దపడగగలవారు. కొందరు పెద్దశరీరం గలవారు. మరికొందరు కొండంత స్థూలశరీరం గలవారు. వీటిలో ఒక్కొక్క వంశంలో వేలకొలదిగ, ఒక్కొక్క వంశంలో లక్షలకొలదిగ, ఒక్కొక్క వంశంలో ఆర్బుదాల కొలదీ నాగు లుంటాయి. పైస్థాయినుండి వాటిని పరిచయం చేస్తాను విను.

వాసుకి, తక్షకుడు, కర్కోటకుడు, ధనంజయుడు, కాలియుడు, నహుషుడు, కంబలుడు, అశ్వతరుడు, బాహ్యకుండుడు, ఆపూరణుడు, ఖగుడు, వామనుడు, ఏలపత్రుడు, కుకురుడు, కుకుణుడు, ఆర్యకుడు, నందకుడు, కలశుడు, పోతకుడు, కైలాసకుడు, పింజరకుడు, ఐరావతుడు, సుమనోముఖుడు, దధిముఖుడు, శంఖుడు, నందుడు, ఉపనందుడు, ఆప్తుడు, కోటరకుడు, శిఖి, నిష్ఠూరికుడు, తిత్తిరి, హస్తిభద్రుడు, కుముదుడు, మాల్యపిండకుడు, పద్ముడు అనుపేర ఇద్దరూ, పుండరీకుడు, పుష్పుడు, ముద్గరపర్ణకుడు, కరవీరుడు, పీఠరకుడు, సంవృత్తుడు, వృత్తుడు, పిండారుడు, బిల్వపత్రుడు, మూషికాదుడు, శిరీషకుడు, దిలీపుడు, శంఖశీర్షుడు, జ్యోతిష్కుడు, అపరాజితుడు,

కౌరవ్యుడు, ధృతరాష్ట్రుడు, కుహురుడు, కృశకుడు, విరజుడు, ధారణుడు, సుబాహుడు, ముఖరుడు, జయుడు, బధిరుడు, అంధుడు, విశుండి, విరసుడు, సురసుడు- మరెంతోమంది కశ్యపుని కుమారులు. వీరిలో ఎవరైనా నచ్చుతారేమో చూడు." అప్పుడు మాతలి స్థిరంగా ఒక నాగునివైపు అదే పనిగా చూచి, ప్రసన్నుడై, లేచి నారదునితో ఇలా అన్నాడు. మాతలి ఇలా అన్నాడు - "అదిగో! ఆ కౌరవ్యార్యకుల ముందు నిలబడి ఉన్న నాగకుమారుడు కాంతిమంతుడూ, చూడముచ్చటయిన వాడూ. అతడు ఏ వంశానికి చెందినవాడు? అతని తండ్రి ఎవరు? తల్లి ఎవరు? తాత ఎవరు? వంశానికి పతాకాయమానుడై నిలిచిన ఇతని వంశమేది? దేవర్షీ! తన ఏకాగ్రత, ధైర్యం, రూపం, వయస్సూ నా మనస్సుకు బాగా నచ్చాయి. ఇతడే గుణకేశికి తగిన వరుడు." మాతలి సుముఖుని చూచి ఆనందించటాన్ని చూచి నారదమహర్షి అప్పుడు ఆ సుముఖుని జన్మ, కర్మ, మాహాత్మ్యాలను వివరించ నారంభించాడు. నారదుడిలా అన్నాడు. "ఇతడు ఐరావత వంశంలో పుట్టిన నాగరాజు. పేరు సుముఖుడు, ఆర్యకుని పౌత్రుడు, వామనుని దౌహిత్రుడు. మాతలీ! చికురుడను పేరుగల నాగుడు ఇతని తండ్రి. ఈ మధ్యనే ఆయన గరుడునకు ఆహారమయ్యాడు." ఆ మాటలు విని ఆనందించిన మాతలి నారదునితో ఇలా అన్నాడు. "తండ్రీ! ఈ సుముఖుడు నాగశ్రేష్ఠుడు. నా అల్లుడు కాదగినవాడుగా నాకు నచ్చాడు. ఇతనికోసమే ప్రయత్నించు. మా అమ్మాయిని ఈ సుముఖునకే ఇవ్వాలనుకొంటున్నాను."

104. ఇంద్రుడు సుముఖునకు దీర్ఘాయు విచ్చుట; గుణకేశీ సుముఖుల వివాహము.

(మాతలి మాటవిని నారదుడు నాగరాజయిన ఆర్యకునితో ఇలా అన్నాడు.)

"ఇతడు ఇంద్రుని ప్రియ మిత్రుడూ, సారథి అయిన మాతలి. ఇతడు పవిత్రుడు, శీల గుణసంపన్నుడు, తేజోవంతుడు, బలపరాక్రమ సంపన్నుడూ. ఇంద్రునకు మిత్రుడూ, మంత్రి, సారథి కూడా ఇతడే. యుద్ధసమయంలో ఇంద్రునకు తోడుగా ఉంటాడు. దాదాపు ఇంద్రుని అంతటివాడు. ఇతడు దేవాసుర సంగ్రామ సమయంలో వేయి గుఱ్ఱాలను పూన్చిన జయశీలమైన శ్రేష్ఠమయిన రథాన్ని మనస్సుతోనే నియంత్రిస్తాడు. మాతలి ముందుగా తన అశ్వాలతో గెలిచిన వారినే ఇంద్రుడు తన బాహుబలంతో

జయిస్తాడు. శత్రువులను మాతలి దెబ్బకొట్టిన తరువాతనే ఇంద్రుడు దెబ్బకొడతాడు. ఈ మాతలి కుమార్తె గుణకేశి. ఎంతో అందమయినది. భూమండలంలో ఆమెవంటి అందగత్తెలు లేరు. సత్యమూ, శీలమూ మొదలయిన సద్గుణాలు గలది. నాగరాజా! ఆమెకు తగిన వరునకై ఎంతో పూనికతో మూడులోకాలను తిరుగుతున్న ఈ మాతలికి నీ పౌత్రుడు సుముఖుడు తన కుమార్తెకు తగినవాడుగా నచ్చాడు. ఆర్యకా! నీకు కూడా ఇష్టమైతే ఆలస్యం చేయకుండా వెంటనే ఈయన కుమార్తెను స్వీకరించటానికి నిశ్చయించు. విష్ణువు వంశంలో లక్ష్మిలాగా, అగ్నికి స్వాహాదేవిలాగా నీవంశంలో గుణకేశిని నిలుపుకో. కాబట్టి నీవు నీ పౌత్రుని కొరకు గుణకేశిని స్వీకరించు. ఇంద్రునికి శచీదేవిలాగా యోగ్యుడైన నీ పౌత్రునకు తగినది గుణకేశి. నీ మీదా, ఐరావతుని మీదా మాకెంతో గౌరవం. సుముఖుడు శీలం, పవిత్రత, ఇంద్రియ సంయమనం మొదలయిన గుణాలు కలవాడు. కాబట్టి తండ్రిలేని వాడయినా గుణాల కారణంగా సుముఖుని వరిస్తున్నాము. మాతలి తనంతతానుగా వచ్చి కన్య నివ్వటానికి సిద్ధపడుతున్నాడు. కాబట్టి నీవు కూడా అతని అభిప్రాయాన్ని మన్నించాలి."

ఆ ఆర్యకుడు ఆనందించి, దీనంగా నారదునితో ఇలా అన్నాడు. "దేవర్షీ నారదా! పుత్రుడు మరణించాడు. పౌత్రుడు అదే విధంగా మృత్యువుచే వరింపబడి ఉన్నాడు. ఈ స్థితిలో గుణకేశిని కోడలుగా ఎలా స్వీకరించేది? మహర్షీ! నీమాట నాకు ఇష్టంలేదని కాదు. ఇంద్రునకు మిత్రుడైన ఈ మాతలితోడి సంబంధాన్ని ఎవరు ఇష్టపడరు? కానీ మహామునీ! తగిన కారణం వలన కలిగిన దౌర్బల్యంతో నేను ఆలోచించవలసి వస్తోంది. కాంతిమంతుడా! ఈ సుముఖునకు తండ్రి అయిన నా కుమారుని గరుత్మంతుడు భక్షించాడు. దానితో మేము దుఃఖంలో ఉన్నాం. మరలిపోతూ గరుడుడు "ఒక నెలలో సుముఖుని కూడా తింటా"నని చెప్పి వెళ్ళాడు. స్వామీ! అది తప్పక జరుగుతుంది. ఆ గరుత్మంతుని పట్టుదల అందరికీ తెలుసు. ఆ గరుత్మంతుని మాటతో నా ఆనందం నశించిపోయింది."

అప్పుడు మాతలి ఆర్యకునితో ఇలా అన్నాడు. "నేను ఈ విషయాన్ని గురించి ఆలోచించాను. నీ పౌత్రుని - సుముఖుని- అల్లునిగా నేను వరించాను. కాబట్టి ఈ సుముఖుడు నాతో, నారద మహర్షితో కలిసి త్రిలోకాధిపతి, సురపతి అయిన ఇంద్రుని సందర్శిస్తాడు. సాధుశ్రేష్ఠా! ఆ తర్వాత నేను మరికొంత పని ముగించి ఇతని

ఆయువుకు హామీని తీసికొంటాను. సుపర్ణుడు ఇతనిని చంపలేనట్లుగా కూడా ప్రయత్నిస్తాను. నాగరాజా! నీకు మేలు కలుగుతుంది. సుముఖుడు మాకభీష్టమైన కార్యసంసిద్ధికోసం మాతో దేవేంద్రుని దగ్గరకు రావాలి." ఆ తరువాత తేజోమూర్తులయిన వారందరూ సుముఖుని తీసికొని కాంతిమంతుడై, సింహాసనాసీనుడై ఉన్న దేవేంద్రుని సందర్శించారు. దైవికంగా అక్కడే విష్ణువు కూడా ఉన్నాడు. నారదుడు మాతలికి సంబంధించిన ఆ సమస్త వృత్తాంతాన్ని అక్కడ చెప్పాడు. అప్పుడు విష్ణువు త్రిలోకాధిపతి అయిన ఇంద్రునితో ఇలా అన్నాడు- "ఈ సుముఖునకు అమృతాన్ని ఇచ్చి అమరులతో సమానుని చెయ్యి. వాసవా! మాతలి, నారదుడు, సుముఖుడూ వీరంతా నీ అభీష్టాన్ని అనుసరించి అమృతదానాన్ని పొంది తమ మనోరథాన్ని సఫలం చేసికోవాలి." అపుడు దేవేంద్రుడు గరుత్మంతుని పరాక్రమాన్ని తలచుకొని "తమరే ఇవ్వండి" అని విష్ణువుతో అన్నాడు. విష్ణువు ఇలా అన్నాడు. - "స్వామీ! సర్వలోకాలలోని చరాచర ప్రాణులకన్నింటికీ నీవే పాలకుడవు. నీవు ఇచ్చిన దానిని కాదనటానికి ఎవడు సాహసించగలడు?" అప్పుడు దేవేంద్రుడు సుముఖునకు మంచి ఆయువును అనుగ్రహించాడు. కానీ అమృతాన్ని ఆరగించనీయలేదు. ఇంద్రుని వరాన్ని పొంది సుముఖుడు సుముఖుడయ్యాడు. పెండ్లి చేసికొని స్వేచ్ఛగా ఇంటికి వెళ్ళిపోయాడు. నారదుడూ, ఆర్యకుడూ కూడా కృతకృత్యులై ఆనందంతో దేవేంద్రుని అర్చించి వెళ్ళిపోయారు."

105. విష్ణువు గరుడుని గర్వమణచుట- దుర్యోధనుడు కణ్వుని హేళనచేయుట.

కణ్వుడిలా అన్నాడు - "భారతా! మహాబలుడయిన గరుడుడు దేవేంద్రుడు సుముఖునకు ఆయువు నిచ్చిన విషయాన్ని యథాతథంగా విన్నాడు. గరుడుడు అది విని, కోపించి, తీవ్రమయిన తన రెక్కల గాలితో మూడులోకాలనూ కంపింపజేస్తూ ఇంద్రుని దగ్గరకు వచ్చాడు. "స్వామీ! నన్ను అవహేళన చేస్తూ నా జీవికను మీరు అడ్డగించారు. ఒకమారు నాకు స్వేచ్ఛాచారిత్వాన్ని వరంగా ప్రసాదించి ఇప్పుడు మరల దానిని తప్పారు. సమస్త ప్రాణులకూ సృష్టికర్త అయిన బ్రహ్మ సర్వప్రాణులనూ సృష్టించే సమయంలోనే నా ఆహారాన్ని నిర్ణయించాడు. దానిని మీరెందుకు వారిస్తున్నారు? స్వామీ! నేను ఆ మహానాగాన్ని ఆహారంగా ఎన్నుకొన్నాను. దానికి కాలాన్నికూడా

నిశ్చయించాను. ఆ ఆహారంతోనే నేనూ నా కుటుంబాన్ని అంతా పోషించవలసి ఉంది. దేవరాజా! నేను ఆహారంగా ఎంచుకొనిన ఆ పాము దీర్ఘాయువు అయితే దానికి బదులుగా నేను మరొకదానిని హింసించలేను. స్వేచ్ఛాచారిత్వాన్ని సొంతం చేసికొని ఇష్టంవచ్చినట్లు ప్రవర్తిస్తున్నావు. వాసవా! నేనిప్పుడు ప్రాణత్యాగం చేస్తాను. నా పరిజనులూ, నా ఇంటిలో ఉన్న భృత్యులూ అందరూ ప్రాణాలు విడుస్తారు. నీవు మాత్రం ఆనందంగా ఉండు. దేవేంద్రా! మూడు లోకాలనూ శాసించగలవాడవై ఉండికూడా, ఇతరులను సేవించటానికి సిద్ధపడిన నాకు ఇది తగిన మర్యాదయే. దేవేశ్వరా! నీవున్న కారణంగా నా జీవిక నిరోధింపబడటానికి విష్ణువు కారణమని నేను భావించటం లేదు. వాసవా! మూడులోకాల రాజ్యభారమంతా నీమీదే గదా ఉంటుంది. నాతల్లి కూడా దక్షప్రజాపతి కూతురే. నా తండ్రి కశ్యపమహర్షి. నేను కూడా చాలా తేలికగా సర్వలోకాల భారాన్నీ వహించగలను. సర్వభూతాలూ ఒక్కటైనా కూడా సహించలేనంత విస్తారంగా నాకు బలముంది. దైత్యులతో యుద్ధం చేసే సమయంలో నేను కూడా ఎంతో గొప్ప పరాక్రమాన్ని ప్రదర్శించాను. నేను కూడా శ్రుతశ్రీనీ, శ్రుతసేనునీ, వివస్వంతునీ, రోచనాముఖునీ, ప్రసృతునీ, కాలకాక్షునీ సంహరించాను. అయినా నేను రథపతాకంపై నిలిచి ప్రయత్నపూర్వకంగా నీ సోదరుని సేవిస్తూ, వాహనమై మోస్తున్నాను. అందుకని నన్ను తక్కువగా చూస్తున్నావు. నేను తప్ప విష్ణువు భారాన్ని భరించగలవాడు మరొకడు ఎవ డున్నాడు? నా బలాన్ని మించిన బలం కలవాడె వడున్నాడు? అంత విశిష్టమైన శక్తి సంపదగలవాడనై కూడా సబాంధవంగా ఈ విష్ణువును మోస్తున్నాను. వాసవా! నన్ను చిన్నచూపు చూసి నా ఆహారాన్ని తొలగించావు. దానితో నా గౌరవం భంగపడింది. దీనికి నీవూ, విష్ణువూ కారణం. స్వామీ! విష్ణూ! అదితి గర్భాన పుట్టిన దేవతలలో బలదృష్టితో అందరికన్నా బలవంతుడవు నీవే. తండ్రీ! అటువంటి నేను నారెక్కలలో ఒక ప్రక్క కూర్చోబెట్టుకొని ఏ శ్రమా లేకుండా మిమ్ము మోస్తున్నాను. నెమ్మదిగా ఆలోచించండి. ఇక్కడ అందరికన్నా బలవంతు డెవడో? గమనించండి."

గరుత్మంతుని మాటలు దారుణ పరిణామాలకు దారి తీసేవిగా ఉన్నాయి. విష్ణుమూర్తి ఆ మాటలు విన్నాడు. ఎవ్వరూ మందలించలేని గరుత్మంతుని మందలిస్తూ ఇలా అన్నాడు విష్ణువు - "గరుత్మంతుడా! నీవు చాలా బలహీనుడివి. కానీ నీవు

గొప్ప బలవంతుడను అనుకొంటున్నావు. అండజా! మా సమక్షంలో ఆత్మస్తుతు లిక చాలు. మూడు లోకాలూ ఒక్కటైనా నా శరీరభారాన్ని మోయలేవు. నన్ను నేను మోసుకొంటూ నిన్ను కూడా మోస్తున్నాను. సరే ! ముందు నీవు నా ఎడమచేతి బరువును మోయి. ఈ పాటి బరువును నీవు మోయగలిగితే నీ ఆత్మస్తుతి సార్థకమవుతుంది." ఆ మాటలు చెప్పి పూజ్యుడైన విష్ణువు తన చేతిని గరుడుని భుజంపై పెట్టాడు. దానితో గరుడుడు ఆ బరువును మోయలేక కలతపడి పడిపోయాడు, స్పృహ తప్పాడు. పర్వతాలతో సహా ఈ భూమి మొత్తం ఎంత బరువుంటుందో, అంత బరువు విష్ణువు శరీరంలో భాగమైన ఆ భుజం ఉన్నట్లు గరుడునికి అనిపించింది. అత్యంతబలశాలి అయిన ఆ విష్ణువు ఆ చేతిని అంతబలంగా పెట్టలేదు. అందుకని గరుడుడు ప్రాణాలు కోల్పోకుండా నిలువగలిగాడు. ఆ బరువుకు గరుడుడు నోరు తెరిచాడు. అతని శరీరమంతా శిథిలమైంది. కలతపడి, స్పృహతప్పి తన రెక్కలను వదిలివేశాడు. కలతపడి నిశ్చేష్టుడై ఉన్న ఆ వైనతేయుడు తేరుకొని, తలవాల్చి పాదాలపై బడి, విష్ణుమూర్తికి నమస్కరించి, దీనంగా ఇలా అన్నాడు. "స్వామీ! లోకంలోని సారమంతా ఆకృతి ధరించినట్లున్న తమ భుజాన్ని యథాలాపంగా నా శరీరంపై ఉంచితేనే పొడిపొడియై నేలకూలాను. దేవా! తమ ధ్వజంపై నున్న ఒక పక్షిని నేను. తమ బలతేజస్సులతో మండిపోయి కలతపడిన అల్పబుద్ధిని నేను. నా తప్పును క్షమించాలి. ప్రభూ! నాకు తమ మహాశక్తి తెలియదు. అందువలననే నా బలపరాక్రమాలు అసామాన్యమైనవని నేను గొప్పగా భావించాను." అన్నాడు. అప్పుడు విష్ణుమూర్తి గరుడుని క్షమించి, ప్రసన్నుడై "మరల ఎప్పుడూ ఇలా ప్రవర్తించవలదని" స్నేహపూర్వకంగా మందలించాడు. రాజేంద్రా! తన కాలి బొటనవ్రేలితో సుముఖుని ఎత్తి గరుడుని వక్షఃస్థలంపై ఉంచాడు. అప్పటినుండి గరుడుడు ఆ సర్పాన్ని ఎప్పుడూ తనతోనే ఉంచుకొన్నాడు. రాజా! ఈ విధంగా బలవంతుడు, మహాయశస్వి, వినతాసుతుడైన గరుడుడు విష్ణుమూర్తి బలానికి లొంగి తన అహంకారాన్ని విడిచిపెట్టాడు."

కణ్వుడిలా అన్నాడు – "నాయనా! దుర్యోధనా! నీవు కూడా అలాగే రణరంగంలో వీరులయిన ఆ పాండవుల ఎదుట పడేదేకా జీవించి ఉండగలవు. భీముడు వాయునందనుడు. అర్జునుడు ఇంద్రకుమారుడు. వారిద్దరూ కలిసి యుద్ధంలో ఎవరిని చంపలేరు? విష్ణువు, వాయువు, ఇంద్రుడు, యముడు, అశ్వినులు ఈ దేవతలంతా

నీకు వ్యతిరేకులు. నీవు ఏ బలం చూచికొని వారివైపు చూచే సాహసం చేస్తున్నావు? రాజకుమారా! శత్రుత్వం చాలు. సంధి చేసికో, శ్రీకృష్ణుని సహకారంతో నీ వంశాన్ని రక్షించుకో. మహాతపస్వి అయిన ఈ నారదుడు నాటి విష్ణుమాహాత్మ్యాన్ని ప్రత్యక్షంగా చూచినవాడు. చక్రగదాధరుడైన ఆ విష్ణువే ఈ కృష్ణుడు." దుర్యోధనుడు ఆ మాటలు విని, కనుబొమలు ముడివేసి, నిట్టూర్చుతూ కర్ణునివైపు చూసి పెద్దగా నవ్వసాగాడు. కణ్వమహర్షి మాటలను హేళన చేసి దుర్మతియైన ఆ దుర్యోధనుడు ఏనుగుతొండంలాగా ఉన్న తన తొడను కొట్టి ఇలా అన్నాడు. "మహర్షీ! ఈశ్వరుడు నన్నెలా సృష్టించాడో, ఏది జరగబోతోందో, నాకు ఏగతి వ్రాసి ఉన్నదో దాని కనుగుణంగా నేను ప్రవర్తిస్తున్నాను. ఇటువంటి ప్రలాపాలు నిష్ప్రయోజనాలు". అన్నాడు.

106. గాలవచరితము.

నారదుడిలా అన్నాడు – "మంచివారి మాటలను ఆసక్తితో వినే శ్రోత దొరకడు– హితాన్ని కోరే మంచిమిత్రులు దొరకటం కూడా కష్టం. బంధువులు కూడా సహకరించలేని సందర్భంలో మిత్రుడే తోడు నిలవగలడుకురునందనా! నీవు నీ మిత్రుల ఉపదేశాన్ని వినవలసిన అవసర మున్నదని నాకు అనిపిస్తోంది. కాబట్టి పట్టుదలకు పోవద్దు. దురాగ్రహం భయంకరపరిణామాలకు దారితీస్తుంది. ఈ విషయంలో పట్టుదలకు పోయి పరాజయం పాలయిన గాలవునకు సంబంధించిన ప్రాచీనగాథను పెద్దలు చెప్తుంటారు. ఒకప్పుడు సప్తర్షులతో ఒకడైన వసిష్ఠుని రూపాన్ని ధరించి ధర్ముడు ఆకలికి నకనకలాడుతూ భోజనాపేక్షతో విశ్వామిత్రుని ఆశ్రమానికి వచ్చాడు. విశ్వామిత్రుడు కంగారుపడి అతిథికి పరమాన్నాన్ని పెట్టాలన్న ప్రయత్నంతో చరుపాకాన్ని ప్రారంభించాడు. కానీ ఆ అతిథి అంతవరకు ఆగలేకపోయాడు. ఇతర మహర్షులు పెట్టిన అన్నాన్ని ఆ అతిథి ఆరగించాడు. అప్పుడు విశ్వామిత్రుడు వేడివేడిగా ఉన్న అన్నాన్ని తీసికొనివచ్చాడు. అప్పుడా అతిథి 'నేను భోజనం చేశాను. నీవు అక్కడే ఉండు" అంటూ అక్కడ నుండి వెళ్ళిపోయాడు. మహాతేజస్వి అయిన విశ్వామిత్రుడు ఆ మాటతో అక్కడే అలాగే నిలిచాడు. చేతులతో అన్నాన్ని నెత్తిపై పెట్టుకొని అదే తీవ్రవ్రతంగా భావించి విశ్వామిత్రుడు ఆశ్రమ సమీపంలోనే నిశ్చేష్టుడై స్థాణువు వలె నిలిచాడు. ఆ స్థితిలో గాలి మాత్రమే ఆయనకు ఆహారం. ఆ విశ్వామిత్రుని మీది గౌరవంతో, ఆదరంతో,

ఆత్మీయతతో ఆయన అనుగ్రహాన్ని పొందగోరి గాలవముని ప్రయత్నపూర్వకంగా విశ్వామిత్రుని శుశ్రూష చేశాడు. ఆ తరువాత వందసంవత్సరాలకు యమధర్మరాజు మరల వసిష్ఠుని రూపాన్ని ధరించి భోజనాపేక్షతో విశ్వామిత్రుని దగ్గరకు వచ్చాడు. విశ్వామిత్ర మహర్షి వాయుభక్షణ చేస్తూ తలపై అన్నాన్ని మోస్తూండటాన్ని చూచి ఆ ధర్ముడు అప్పటికీ వేడిగా, తాజాగా ఉన్న ఆ అన్నాన్ని తీసికొని తిని - "బ్రహ్మర్షీ! పరమానందంగా ఉంది" అని చెప్పి వెళ్ళిపోయాడు. క్షత్రభావం నుండి దాని పై మెట్టయిన బ్రహ్మభావం పొందిన ఆ విశ్వామిత్రుడు ధర్ముని మాటతో ఎంతో ఆనందించాడు.

విశ్వామిత్రుడు తన శిష్యుడూ, తపస్వి అయిన గాలవుని శుశ్రూషవలన, భక్తివలన సంతుష్టుడై ఇలా అన్నాడు. "నాయనా! గాలవా! నేను అనుమతిస్తున్నాను. స్వేచ్ఛగా వెళ్ళవచ్చు" - మధురమయిన ఆ మాటతో సంతోషించిన గాలవుడు తేజోమూర్తీ, మునిసత్తముడూ ఐన విశ్వామిత్రునితో ఇలా అన్నాడు. "గురుదక్షిణగా తమ కేమివ్వమంటారు? దక్షిణలతో కూడిన కర్మయే సఫల మవుతుంది. దక్షిణల నిచ్చినవాడే సిద్ధి పొందగలుగుతాడు. దక్షిణల నిచ్చినవాడే స్వర్గలోకంలో యజ్ఞఫలాన్ని పొందగలడు. వేదం కూడా దక్షిణనే శాంతిప్రదంగా చెప్పింది. కాబట్టి గురుదక్షిణగా ఏమివ్వమంటారో తమరు చెప్పాలి" అన్నాడు. గాలవుని సేవాశుశ్రూషలతో విశ్వామిత్రుడు అతని అధీనమైపోయాడు. కాబట్టి ఆ ఉపకారాన్ని మనస్సులో నుంచుకొనియే విశ్వామిత్రుడు "వెళ్ళు వెళ్ళు" అని పంపివేయబోయాడు. విశ్వామిత్రుడు పదే పదే "వెళ్ళు వెళ్ళు" అని అంటున్నా, గాలవుడు పట్టుదలతో "ఏమివ్వమంటారు చెప్పండి" అని మళ్ళీ అడిగాడు. తపస్వి అయిన గాలవుడు తీవ్రంగా పట్టుపట్టడంతో కొంత కోపించిన విశ్వామిత్రుడు గాలవునితో ఇలా అన్నాడు. "గాలవా! చెవులు ఒకవైపు నల్లగా ఉండి చంద్రసమాన కాంతితో తెల్లగా ఉన్న ఎనిమిది వందల గుఱ్ఱాలను తెచ్చి ఇవ్వు. వెళ్ళు. ఆలస్యం చేయవద్దు."

107. గాలవుడు చింతించుట - గరుడుడు ఊరడించుట.

నారదుడిలా అన్నాడు - "ధీమంతుడయిన విశ్వామిత్రుడు ఆ విధంగా గురుదక్షిణ అడుగగా గాలవముని అప్పటి నుండి ఎక్కడా నిలవలేకపోయాడు, శయనించలేక

పోయాడు. ఆహారాన్ని కూడా స్వీకరించలేకపోయాడు. చింతలో, శోకంలో మునిగిపోయిన ఆ గాలవుడు పాలిపోయాడు. శరీరంపై చర్మం ఎముకలు మాత్రం మిగిలాయి. ఎక్కువగా శోకిస్తూ, చింతతో రగిలిపోతూ గాలవుడు దుఃఖంతో విలపించనారంభించాడు. ధనవంతు లయిన మిత్రులు నా కెవ్వరున్నారు. నాకు డబ్బెక్కడిది? నాకోసం ఎవరు కూడబెట్టి ఉన్నారు. చంద్రునిలాగా తెల్లగా ఉన్న ఎనిమిది వందల గుఱ్ఱాలు నాకెలా లభిస్తాయి? నాకు భోజనంపై ఆసక్తి లేదు. సుఖపడాలన్న ఆశ ఎక్కడనుండి వస్తుంది? జీవితం మీదకూడ నాకు శ్రద్ధ నశించిపోయింది. ఇక నా జీవిత మెందుకు? నేను సముద్రతీరానికి కానీ, భూమండలంలో ఎక్కడికో గానీ పోయి శరీరత్యాగం చేస్తాను. ఇక నేను బ్రతికి ఉండీ ప్రయోజన మేముంది ? డబ్బులేని వాడు, కోరికలు తీరనివాడు, వివిధ కర్మఫలవంచితుడు, ఋణగ్రస్తుడూ అనాసక్తతతో జీవించిమాత్రం సుఖ మేముంది? ఇష్టానుసారంగా ప్రణయసంబంధాన్ని ఏర్పరచుకొని, మిత్రుల ధనాన్ని అనుభవించి, ప్రత్యుపకారం చేయలేనివాడు జీవించటం కంటె మరణించటం మంచిది. 'చేస్తాను' అని ప్రతిజ్ఞ చేసి, పనిని చేయటానికి ఒప్పుకొని అది చేయలేని వాడు అసత్యభాషణచే దహింపబడినవాడు. అటువంటి మనుష్యుని ఇష్టాపూర్తాలు కూడా నశిస్తాయి. **మాట తప్పినవాడు ఉండికూడా లేవట్లే. అసత్యభాషికి సంతానం కూడా ఉండదు. అసత్యవాదికి ఆధిపత్యం లభించదు.** ఇక పుణ్యగతులకు అవకాశమెక్కడిది? **కృతఘ్నుడికి కీర్తిలేదు. స్థానం లేదు. సుఖంలేదు.** కృతఘ్నుడు **నమ్మదగని వాడవుతాడు. కృతఘ్నుడికి విష్కృతి లేదు.** ధనహీనుడూ, పాపి అయిన **వాడికి జీవితం లేవట్లే. పాపికి కుటుంబనిర్వహణ కూడా కష్టమే.** పాపాత్ముడు ఆర్జించిన పుణ్యాన్ని నశింపజేసికొంటూ తానుకూడా తప్పక నశిస్తాడు. నేను పాపిని, కృతఘ్నుణ్ణి, కృపణుణ్ణి, అసత్యవాదిని కూడా. గురువు దగ్గర నా పనిని పూర్తి చేసికొని స్వయంగా గురు దక్షిణ నిస్తానని మాట ఇచ్చి దానిని పూర్తిచేయలేకపోతున్నాను.

కాబట్టి నేను ఏదైనా గట్టి ప్రయత్నమే చేసి ప్రాణత్యాగం చేస్తాను. ఇంతవరకు నేను దేవతలను ఏమీ అడగలేదు. దేవత లందరూ కూడా యజ్ఞంలో నన్నెంతో ఆదరంగా చూస్తారు. ఇప్పుడు నేను త్రిభువనేశ్వరుడై, జంగమ జీవులకందరకూ ఉత్తమాశ్రయమై, దేవతా శ్రేష్ఠుడై, సచ్చిదానంద ఘనుడైన విష్ణుభగవానుని శరణుకోరుతాను. సురాసురుల కందరకూ ఎవని దయ భోగాలను కల్పిస్తుందో, ఆయనను- అవ్యయుడూ,

పరమయోగి అయిన విష్ణువును- వినయభావంతో సందర్శించాలనుకొంటున్నాను." గాలవుడిలా భావించగానే ఆయన మిత్రుడూ, వినతాపుత్రుడూ ఆయన గరుడుడు ప్రసన్నుడై, గాలవునకు మేలు చేయాలని భావించి ప్రత్యక్షమై ఇలా అన్నాడు. "నీవు నాకు ప్రియమిత్రుడవు. నా మిత్రులకు కూడా ప్రియమిత్రుడవు. తన దగ్గర డబ్బు ఉంటే తన మిత్రుల కోరికలను తీర్చటం మిత్రుల కర్తవ్యం. బ్రాహ్మణా! నాకున్న గొప్పసంపద ఇంద్రసోదరుడైన విష్ణుమూర్తియే. నేను నీకోసం ఇంతకుముందే ఆయనను అభ్యర్థించాను. ఆయన కూడా నా ప్రార్థనను మన్నించి నా కోరిక తీర్చాడు. కాబట్టి బయలుదేరు. ఇద్దరం వెళదాం. గాలవా! సముద్రానికి ఆవలవైపున కైనా, భూమిలోనికి అయినా నిన్ను సుఖంగా తీసికొని వెళ్ళగలను. లే ! ఆలస్యం చేయవద్దు."

108. గరుడుడు గాలవునకు తూర్పుదిక్కుమ వర్ణించి చెప్పుట.

సుపర్ణుడిలా అన్నాడు - "గాలవా! నీకు సహకరించమని విష్ణుమూర్తి నన్ను ఆదేశించాడు. నీ ఇష్టం. ముందు ఏ దిక్కువైపు వెళదామో చెప్పు. గాలవా! తూర్పు, దక్షిణం, పడమర, ఉత్తరం వీటిలో ఏదిక్కువైపు వెళ్ళమంటావో చెప్పు. ద్విజశ్రేష్ఠా! ఇది తూర్పుదిక్కు, పగటికీ, సూర్యమార్గానికీ ఇది ద్వారం. సమస్త జగత్తునూ ప్రభావితం చేసే సూర్యుడు ఈ దిక్కుననే ఉదయిస్తాడు. సంధ్యాకాలంలో సాధ్యులు తపస్సు చేసేది ఈ దిక్కుననే. ఈ దిక్కుననే బుద్ధి జనించి లోకమంతా వ్యాపించింది. ధర్మానికి కళ్ళవంటి సూర్యచంద్రులు ఈ దిశలోనే ఉదయిస్తారు. ధర్మప్రతిష్ఠ ఈ దిక్కులోనే. పవిత్రమైన హవిస్సును ముందు ఈ దిక్కుననే హోమం చేస్తారు. ఆ తర్వాత అది అన్నిదిక్కులకూ వ్యాపిస్తుంది. ఈ దిక్కుననే దక్షప్రజాపతిసంతతి అదితి మొదలగువారు తొలిగా సంతతిని కన్నారు. కశ్యప ప్రజాపతిసంతానం కూడా ఈ దిక్కుననే వర్ధిల్లింది. బ్రహ్మర్షీ! దేవతల ఐశ్వర్యానికి మూలస్థానం ఈ దిక్కే. ఇంద్రుడు తొలిగా దేవాధిపతిగా పట్టాభిషేకాన్ని ఈ దిక్కుననే పొందాడు. దేవతలు ఈ దిశలోనే తపస్సు చేశారు. బ్రహ్మస్వరూపా! ఈ కారణాలచేతనే దీనిని పూర్వదిక్కు అంటారు. ప్రాచీన కాలంలోనే ముందుగా దేవతలచే ఈ దిక్కు నిండిపోయింది. అందుకనే అందరికీ ఇది తొలిదిక్కు అయినది. **సుఖాన్ని అభిలషించే వారెవరైనా ఏ పనినైనా ముందు ఈ దిక్కుననే చేయాలి.** లోకసృష్టికర్త అయిన బ్రహ్మ

ముందుగా ఈ దిక్కుననే వేదగానం చేశాడు. **సవితృదేవత బ్రహ్మవాదులకు ఈ దిక్కువనే సావిత్రీమంత్రాన్ని ఉపదేశించింది.** ద్విజశ్రేష్ఠా! ఈ దిక్కులోనే సూర్యుడు యాజ్ఞవల్క్యునకు యజుర్వేదాన్ని ఇచ్చింది. దేవతలకు యాగాలలో సోమపానం చేసే వరం ఈ దిక్కుననే లభించింది. ఈ దిక్కునందే యజ్ఞతృప్తు లయిన అగ్నిదేవతలు తమకు కారణరూపమైన నీటిని త్రాగుతారు. ఈ దిక్కుననే వరుణుడు పాతాళాన్ని ఆశ్రయించి ఐశ్వర్యాన్ని పొందాడు.

ద్విజశ్రేష్ఠా! పురాతను డయిన వసిష్ఠ మహర్షి యొక్క పుట్టుక, ప్రతిష్ఠ, మరణం కూడా ఇక్కడే సంభవించాయి. ఈ దిక్కులోనే వేదం యొక్క సహస్రశాఖలూ పుట్టాయి. ధూమపానం చేసే మహర్షులు హవిష్యధూమాన్ని ఈ దిక్కుననే పానం చేస్తారు. దేవేంద్రుడు యజ్ఞభాగసిద్ధి కోసం అరణ్యంలోని అడవిపందులు మొదలయిన క్రూరజంతువులను సంప్రోక్షించి దేవతలకు అప్పగించినది ఈ దిక్కుననే. **ఈ దిక్కున పుట్టిన సూర్యుడు కీడుచేసే వారూ, కృతఘ్నులూ అయిన మనుష్యులనూ; రాక్షసులనూ క్రోధంతో వశింపచేస్తాడు.** త్రిలోకాలకూ, స్వర్గానికీ, సుఖానికీ ఈ పూర్వదిగ్భాగమే ద్వారం. నీకిష్టమయితే మనమిద్దరం ఇక్కడ ప్రవేశిద్దాం. నా యజమాని అయిన విష్ణుమూర్తికి ఇష్టమైన పనిని నేను తప్పక చేయాలి. కాబట్టి గాలవా! చెప్పు. తూర్పుదిక్కుకు వెళదామా ! మరో దిక్కును గురించి కూడ వినుము."

109. దక్షిణ దిక్కును వర్ణించుట.

గరుడుడిలా అన్నాడు. – "పూర్వకాలంలో సూర్యుడు శాస్త్రోక్తంగా యజ్ఞం చేసి ఆచార్యుడైన కశ్యపునకు ఈ దిక్కును దక్షిణగా ఇచ్చాడు. అందువలన ఇది దక్షిణ దిక్కు అయింది. బ్రాహ్మణా! మూడులోకాలకు సంబంధించిన పితృగణానికి ఇది ప్రతిష్ఠాస్థానం. ఊష్మపులనే పేరుగల దేవతలకు కూడా ఇదే నివాసస్థాన మంటారు. పితృదేవతలతో పాటు విశ్వేదేవులూ ఎప్పుడూ ఇక్కడే ఉంటారు. లోకపూజితులై శ్రాద్ధకర్మలలో పితరులతో సమానంగా భాగాన్ని పొందుతారు విశ్వేదేవులు. బ్రాహ్మణా! ధర్మదేవత కిది రెండవ ద్వార మంటారు. 'త్రుటి" 'లవం' మొదలయిన సూక్ష్మ కాలాంశాలను కూడా లెక్కించి ప్రాణుల ఆయువును నిర్ణయించేది ఇక్కడే. ఇక్కడ దేవర్షులు, పితృలోకఋషులు, రాజర్షులు అందరూ ఎల్లప్పుడూ నిశ్చింతగా నివసిస్తారు.

విప్రోత్తమా! ప్రాణుల ధర్మ, సత్య, సాధారణ కర్మలవిషయాలన్నీ ఇక్కడే లెక్కింప బడతాయి. మరణించిన ప్రాణులకు ఈ దిక్కే దిక్కు. ద్విజశ్రేష్ఠా! మరణానంతరం సమస్త ప్రాణులూ ఈ దిక్కువైపే వెళ్ళాలి. ఇది అజ్ఞానాంధకారంతో నిండి ఉంటుంది. కాబట్టి సుఖంగా ప్రయాణించలేరు. ద్విజర్షభా! ఈ దిక్కుననే ప్రతికూల స్వభావంగల వేలకొలది రాక్షసులు ఉన్నారు. వారు అపవిత్ర హృదయులకే కనిపిస్తారు. ఈ దిక్కుననే మందర పర్వతం మీది పొదరిండ్లలో, మున్యాశ్రమాలలో నిలిచి గంధర్వులు మనస్సునూ, బుద్ధినీ ఆకర్షించగల గాథలను పాడుతూంటారు. గతంలో రైవతుడనే రాజు ఇక్కడ గాథల రూపంలో సామగానాన్ని విని భార్యనూ, మంత్రులనూ, రాజ్యాన్నీ వీడి అరణ్యాలకు వెళ్ళిపోయాడు.

బ్రాహ్మణా! ఇక్కడే సావర్ణిమనువు – యవక్రీతుని కొడుకు సూర్యగమనానికి హద్దులను నిర్ణయించాడు. సూర్యు డిప్పటికీ వాటిని అతిక్రమించడు. పులస్త్యవంశంలో పుట్టిన మహనీయుడు, రాక్షసరాజు అయిన రావణుడు తపస్సు చేసి దేవతల నుండి అమరత్వాన్ని కోరుకొనిన దిక్కు ఇదే. ఈ దిక్కున జరిగిన సంఘటన వలననే వృత్రుడు ఇంద్రునితో శత్రుత్వాన్ని తెచ్చికొనినాడు. ఇక్కడకు చేరిన తర్వాత ప్రాణుల ప్రాణాలు మరలా ఐదుగా విడిపోతాయి. గాలవా! పాపాత్ము లయిన మనుష్యులు ఇక్కడే అగ్నిలో పచనం చేయబడతారు. ఇక్కడే వైతరణీనది (అక్కడ ఉండదగిన) పాపులతో నిండి ఉంటుంది. సుఖం కానీ, దుఃఖం కానీ పరిపక్వమయ్యేది ఇక్కడే. ఈ దిక్కుకు మరలిన తరువాతనే సూర్యుడు స్వాదనీయ మయిన జలాన్ని వర్షిస్తాడు. మరల వసిష్ఠసేవితమయిన ఉత్తరదిక్కును చేరి మంచు కురిపిస్తాడు. గాలవా! ఒకప్పుడు నేను ఆకలితో బాధపడుతూ, చింతకులోనయి ఇక్కడే యుద్ధం చేస్తున్న పెద్ద ఏనుగునూ, తాబేటినీ పొందాను. సూర్యునివలె తేజోమూర్తి అయిన కర్దమునకు పుట్టిన చక్రధను మహర్షి ఈ దిక్కుననే ఉంటాడు. ఆయన నంతా కపిలుడు అంటారు. సగరకుమారులను దగ్ధం చేసినది ఆ కపిలుడే. ఇక్కడ 'శివ'నామం గల సిద్ధ బ్రాహ్మణులు కొందరు వేదవేత్త లుండేవారు. వారు సకలవేదాలనూ అభ్యసించి అక్షయమోక్షసిద్ధిని పొందారు. ఈ దిక్కుననే వాసుకిచేత పాలింపబడుతూ, తక్షక-ఐరావతులచేత రక్షింపబడుతున్న 'భోగవతి' అనే నాగనగరం ఉన్నది. మరణానంతరం ప్రయాణంలో ఈ దిక్కుననే గాఢాంధకారం అలముతుంది. అది సూర్యునకూ,

అగ్నికీ కూడా అభేద్య మయినది. గాలవా! నా సేవలందుకొంటున్న నీకు ఈ దక్షిణ దిక్కును గూర్చి చెప్పాను. ఇటు వెళ్దామంటావా? లేకపోతే పడమటి దిక్కును గురించి విను."

110. పశ్చిమ దిక్కును వర్ణించుట.

గరుడుడిలా అన్నాడు - "ఇదిగో ఈ దిక్కు జలాధిపతి అయిన వరుణరాజుకు ఎప్పుడూ ఇష్టమైనది. ఆయన జన్మస్థానం. ఆయనకు ఆశ్రయం కూడా ఇదే. ద్విజశ్రేష్ఠా! పగటితర్వాత సూర్యుడు ఈ దిక్కుననే తన కిరణాలను స్వయంగా ఉపసంహరించుకొంటాడు. కాబట్టి ఇది పశ్చిమ దిక్కు అని ప్రసిద్ధిచెందింది. పూజ్యుడైన కశ్యపప్రజాపతి జలాన్ని, జలజంతువులనూ రక్షించటానికి ఈ దిక్కున వరుణునకు పట్టాభిషేకం చేశాడు. చీకట్లను తొలగించే చంద్రుడు ఈ వరుణుని సన్నిధిలో ఆరు రకాల రసాలను పూర్తిగా పానం చేసి, శుక్లపక్షప్రారంభంలో నూతనత్వాన్ని పొంది, ఈ దిక్కుననే ఉదయిస్తాడు. బ్రాహ్మణా! ఇక్కడే ఒకప్పుడు వాయుదేవుడు ప్రచండవేగంతో యుద్ధంచేసి దైత్యులను ఓడించి, బంధించి, పీడించాడు. వారు నిట్టూర్పులు విడుస్తూ పడిపోయారు. ఇక్కడే అస్తాద్రి ఉన్నది. అది తనకు ప్రీతిపాత్రు డైన సూర్యుని ప్రతిదినమూ గ్రహిస్తుంది. అక్కడనుండి సంధ్య ప్రసరిస్తుంది. ఈ దిక్కుననే పగలుపూర్తి కాగానే రాత్రి, నిద్ర ఉద్భవిస్తాయి. సమస్త ప్రాణుల ఆయువులోనూ సగభాగాన్ని ఇవి అపహరిస్తాయి. ఈ దిక్కులోనే ఇంద్రుడు గర్భవతియై నిద్రిస్తున్న దితి గర్భాన్ని విచ్ఛిన్నం చేశాడు. ఆ గర్భం నుండియే మరుత్తులు ఉద్భవించారు. ఈ దిక్కుననే హిమవంతుని మూలభాగం మందరాచలం దాకా వ్యాపించి, దానిని స్పృశిస్తుంది. వేల సంవత్సరాలు గడచినా అది ముగిసిపోయే పరిస్థితి లేదు.

ఈ దిక్కుననే బంగారుకొండ, బంగారుతామరలు గల క్షీరసాగరం తీరాన్ని చేరి సురభి పాలను స్రవిస్తుంది. సూర్యచంద్రులను సంహరించాలని సంకల్పించిన సూర్యసమానుడైన రాహువు యొక్క కబంధం (మొండెం) ఈ దిక్కులోనే సముద్రంలో ఉంటుంది. ఈ దిక్కునందే పింగళవర్ణంతో ప్రకాశించే వెండ్రుకలు కలిగి, అప్రమేయ ప్రభావశాలి అయిన సువర్ణశిరస్క మహర్షి అదృశ్య రూపుడై సామగానం చేస్తుంటాడు. ఆ ధ్వని స్పష్టంగా వినిపిస్తుంటుంది. ఇక్కడే హరిమేధసుని పుత్రి ధ్వజవతి ఉంటుంది.

"నిలు-నిలు" అన్న సూర్యుని ఆదేశం మేరకు ఆమె అక్కడే నిలిచిఉంటుంది. గాలవా! గాలి, అగ్ని, నీరు, ఆకాశం, ఇవన్నీ రాత్రింబవళ్ళయొక్క దుఃఖకరమైన స్పర్శను పరిత్యజిస్తాయి. ఇక్కడ నుండియే సూర్యుని తిరోగతి ప్రారంభ మవుతుంది. ఈ దిక్కుననే తారకలన్నీ సూర్యమండలంలో ప్రవేశించేది. అభిజిత్తుతో కూడిన 28 నక్షత్రాలు ఒక్కొక్కటిగా 28 రోజులు సూర్యునితో కలిసి సంచరించి అమావాస్య తర్వాత మరల సూర్యమండలంనుండి విడిపోతాయి. ఈ దిక్కుననే నిరంతరంగా నదులు పుట్టి తమనీటితో సాగరాన్ని నింపుతుంటాయి. ఇక్కడే వరుణాలయంలో మూడు లోకాలకూ ఉపయోగపడే నీరు నిలువ చేయబడుతుంది. ఈ దిక్కుననే నాగరాజయిన అనంతుని నివాసం. ఆద్యంత రహితుడైన విష్ణువు యొక్క ఉత్తమస్థానం కూడా ఇదే. అగ్నికి మిత్రుడైన వాయువు నివాసమూ ఇక్కడే. మరీచి కొడుకైన కశ్యపుని నివాసమూ ఇక్కడే. ద్విజశ్రేష్ఠా! నీకీ పశ్చిమ దిక్కును గూర్చి సంక్షేపంగా తెలియజేశాను. గాలవా! చెప్పు. నీ అభిప్రాయమేమిటి? ఎటు వెళ్దాం?"

111. ఉత్తర దిక్కును వర్ణించుట.

గరుడుడిలా అన్నాడు - "బ్రాహ్మణా! ఈ దిక్కులో పయనం మనుష్యుని పాపాలనుండి ఉద్ధరిస్తుంది. మోక్షసుఖాన్ని కలిగిస్తుంది. ఇలా ఉద్ధరింపగల (ఉత్తారణ) బలం కారణంగా ఇది ఉత్తరదిక్కు అనబడుతోంది. గాలవా! ఇది ఉత్కృష్ట నిధులకు నివాసస్థానం. తూర్పు పడమర దిక్కులకు మధ్యది కనుక మధ్యమ మనికూడా దీని నంటారు. ద్విజశ్రేష్ఠా! ఈ ఉత్తరదిక్కు శ్రేష్ఠమైనది. సౌమ్యస్వభావం లేనివారికి, మనోనిగ్రహంలేని వారికి, అధర్మపరులకు ఈ దిక్కున తావులేదు. ఈ దిక్కుననే బదరికాశ్ర మమున్నది. అక్కడ సచ్చిదానందరూపు డయిన నారాయణుడు జయశీలుడైన నరుడు, శాశ్వతుడైన బ్రహ్మ నివసిస్తారు. ఈ దిక్కుననే హిమవత్పర్వతంపై ప్రళయాగ్నివంటి కాంతి గలవాడూ, అంతర్యామి అయిన మహేశ్వరుడు ఉమతో కలిసి నిత్యం నివాస ముంటాడు. ఆ మహేశ్వరుడు నరనారాయణులకు తప్ప మరెవ్వరికీ కనిపించడు. మహర్షులు కానీ, దేవతలు కానీ, దేవేంద్రుడు కానీ గంధర్వయక్షసిద్ధులు కానీ ఆయనను చూడలేరు. ఇక్కడ సహస్రశీర్షుడు, సహస్రాక్షుడు, సహస్రచరణుడు, అవ్యయుడు అయిన శ్రీమహావిష్ణువు మాత్రమే మాయావిశిష్టుడైన

ఆ మహేశ్వరుని చూడగలడు. విప్రశ్రేష్ఠా! ఈ ఉత్తర దిక్కుననే చంద్రుడు ద్విజరాజుగా అభిషిక్తు డయ్యాడు. ఇక్కడే ఆకాశం నుండి పడుతున్న గంగను పరమేశ్వరుడు శిరసావహించి మానవలోకానికి అందించాడు.

ఇక్కడే పార్వతి పరమేశ్వరుని వివాహ మాడగోరి తపస్సు చేసింది. ఈ దిక్కుననే మహేశ్వరుని మోహింపజేయదలచిన కాముడు నిలిచింది. ఆ మదనుని దహించిన క్రోధం ఇక్కడే పుట్టింది. ఆ సమయంలో హిమవంతుడు, పార్వతి కూడా ఇక్కడే ఉన్నారు. గాలవా! ఈ దిక్కుననే కైలాస పర్వతం మీద రాక్షసయక్షగంధర్వాధిపతిగా కుబేరునకు పట్టాభిషేకం జరిగింది. రమణీయ మయిన చైత్రరథ మనే ఉద్యానవనం, వైఖానసమహర్షుల ఆశ్రమం ఇక్కడే ఉన్నాయి. ద్విజశ్రేష్ఠా! ఇక్కడే ఆకాశ గంగ- మందాకినీ- మందరపర్వతం ఉంటాయి. ఈ దిక్కుననే సౌగంధికవనాన్ని రాక్షసులు రక్షిస్తుంటారు. పచ్చపచ్చని ఆకులతో ప్రకాశించే కదలీవనమూ, కల్పవృక్షమూ ఇక్కడే ఉంటాయి. గాలవా! ఇక్కడే నిరంతరమూ నిగ్రహాన్ని పాటిస్తూ స్వేచ్ఛాచారు లయిన సిద్ధుల విమానాలు తిరుగుతుంటాయి. అవి వారికి అనుకూల మయినవీ, స్వేచ్ఛగా అనుభవింపదగినవి కూడా. ఇక్కడే సప్తర్షులు, వసిష్ఠ పత్ని అరుంధతి ప్రకాశిస్తుంటారు. స్వాతి నక్షత్రం ఇక్కడే ఉదయిస్తుంది. ఇక్కడే ఉంటుంది. బ్రహ్మ యజ్ఞాన్ని చేస్తూ స్థిరంగా ఇక్కడ నివసిస్తాడు. నక్షత్రాలూ, చంద్రసూర్యులూ ఇక్కడ నిత్యం పరిభ్రమిస్తుంటాయి. విప్రోత్తమా! ఈ దిక్కుననే సత్యవాదులుగా ప్రసిద్ధికెక్కిన 'ధామ'నామకులు అయిన మహర్షులు గంగా మహాద్వారాన్ని సంరక్షిస్తుంటారు. వారి రూపం కానీ, ఆకారం కానీ, తపోబలం కానీ ఎవ్వరికీ తెలియవు. వేలకొలది ప్రళయాలు ముగిసి పోయినా వారి ఆయువు వారి అధీనంలోనే ఉంటుంది.

ద్విజశ్రేష్ఠా! మనుష్యుడు ఏయే గంగామహాద్వారం ముందుకు వెళతారో ఆయా ద్వారాల దగ్గరున్న హిమరాశిలో లీనమవుతాడు. భగవంతుడైన నారాయణుడు, విజయశీలి, అయిన నరుడు తప్ప మరే మనుష్యుడూ గంగామహాద్వారం దాటి ముందుకు పోలేడు. ఈ దిక్కుననే కుబేరనివాసమైన కైలాసగిరి ఉన్నది. ఈ దిక్కుననే విద్యుత్ప్రభలు అనుపేరుగల పదిమంది అప్సరలు పుట్టారు. బ్రాహ్మణా! మూడులోకాలనూ ఆక్రమించే వేళలో నారాయణుడు ఈ దిక్కున పాదం మోపాడు. ఆ విష్ణుపాద చిహ్నం ఈ నాటికీ ఈ దిక్కున కనిపిస్తోంది. ద్విజోత్తమా! ఇక్కడే సువర్ణసరస్సుగల 'ఉశీరబీజ' ప్రాంతంలో మరుత్త మహారాజు యజ్ఞం చేశాడు. బ్రహ్మర్షి, మహాత్ముడు అయిన

జీమూతుని సమక్షంలోనే హిమాలయంలో పవిత్రమూ, నిర్మలమూ అయిన స్వర్ణనిధి ఈ దిక్కుననే లభించింది. ఆ సంపూర్ణధనరాశిని ఆయన బ్రాహ్మణులకు బహూకరించి సద్వినియోగం చేశాడు. అయితే ఆ నిధి తనపేర వ్యవహరింపబడాలని మాత్రం కోరాడు. అందుకే ఆ నిధికి జైమూత మని పేరు. ద్విజశ్రేష్ఠా! గాలవా! ఈ దిక్కుననే లోకపాలకు లందరూ ప్రతినిత్యమూ ఉదయమూ, సాయంకాలమూ సమావేశమై ఎవరికి ఏ అవసరమున్నదో చర్చించుకొంటారు. ద్విజశ్రేష్ఠా! ఈ కారణాల చేతనూ, ఇతరేతర గుణాల చేతనూ కూడా ఈ దిక్కు శ్రేష్ఠమయినది. సమస్త శుభకర్మలకు కూడా ఇది మంచిది. కాబట్టే దీనికి ఉత్తర అనిపేరు. నాయనా! ఈ విధంగా నాలుగు దిక్కులను గురించి క్రమంగా వివరంగా నీకు చెప్పాను. ఏ దిక్కునకు వెళ్ళదలచుకొన్నావో చెప్పు. ద్విజశ్రేష్ఠా! నీకు దిక్కులనూ, సమస్తభూమండలాన్ని కూడా చూపించటానికి నేను సిద్ధంగా ఉన్నాను. నామీద కూర్చో."

112. గరుడునిపై కూర్చుండి గాలవుడు తూర్పువైపు ప్రయాణించుట.

గాలవుడిలా అన్నాడు. – "గరుత్మంతుడా! ధర్మానికి కన్నులవంటి సూర్యచంద్రులు ప్రకాశించే తూర్పుదిక్కునకు నన్ను ముందుగా తీసికొనివెళ్లు. ఇక్కడ దేవతల సాన్నిధ్యం కూడా ఉందన్నావు కదా! ఇక్కడ సత్యధర్మాల ఉనికిని గురించి చక్కగా చెప్పావు గరుడా! నేను ఆ దేవతల నందరినీ కలిసి మరల మరలా వారిదర్శనం చేయాలనుకొంటున్నాను. వెంటనే గరుత్మంతుడు "నాపై ఎక్కికూర్చో" అని గాలవునితో అన్నాడు. గాలవుడు గరుడునిపైకెక్కి కూర్చుని ఇలా అన్నాడు. "గరుడా! ఆకాశంలో ఎగురుతున్న నీ రూపం తొలిజాములో సహస్ర కిరణాలతో ప్రకాశిస్తూ భువన భాస్కరమయిన సూర్యుని రూపంలాగా కనిపిస్తోంది. నీ రెక్కలగాలికి పైకిలేచిన చెట్లు వెనక్కు వెనక్కు వస్తున్నాయి. వీటి తీవ్రమైన వేగాన్ని చూస్తుంటే మనతోపాటు రావటానికి బయలుదేరినట్టుంది. నీ రెక్కలగాలితో సముద్రజలరాశి, పర్వతాలు, తోటలు, అరణ్యాలతో సహా ఈ సమస్త భూమినీ పైకి లాగుతున్నట్లుంది. నిరంతరంగా రెక్కలను ఊపటంవలన పుట్టిన పెనుగాలి చేపలు, ఏనుగులు, మొసళ్ళతో పాటు సముద్రజలాన్ని ఆకాశం మీదికి తెస్తున్నట్టు అనిపిస్తోంది. ఒకే రూపం, ఒకేవిధమైన ముఖమూ గల చేపలూ, తిమితిమింగలాలూ, ఏనుగులూ, గుఱ్ఱాలూ, మనుష్యుల

వంటి జలజంతువులు నలిగిపోతూ కనిపిస్తున్నాయి. మహాసముద్రపు ఘోషతో నా చెవులు దిమ్మెత్తిపోతున్నాయి. నాకేమీ వినిపించటం లేదు. కనిపించటం లేదు. నన్ను నేను ఎలా కాపాడుకోవాలో తెలియటం లేదు. నాయనా! గరుడా! నెమ్మదిగా పద. లేకపోతే బ్రహ్మహత్య జరిగిపోతుంది. ఇప్పుడు నాకు సూర్యుడు కానీ, దిక్కులు కానీ, ఆకాశం కానీ కనిపించటం లేదు.

పక్షిరాజా! చీకటి తప్ప మరేమీ కనిపించటంలేదు. నీ శరీరం కూడా కనిపించటం లేదు. నీ కళ్ళు రెండు జాతి రత్నాలవలె నాకు కనిపిస్తున్నాయి. నీ శరీరంకానీ, నా శరీరం కానీ కనిపించటం లేదు. పదే పదే నీ శరీరం నుండి వెలువడుతున్న పైకెగసిన నిప్పు మాత్రమే కనిపిస్తోంది. ఆ నిప్పు కన్నులకు మిరుమిట్లు గొలిపి వెంటనే ఆరిపోతోంది. వినతా కుమారా ! గమనంలోని మహావేగాన్ని నియంత్రించు. మహానుభావా! ఇంత వేగంగా వెళ్ళటంలో నాకేమీ ప్రయోజనం కన్పించటం లేదు. వెనకకు మరలు. నీ వేగాన్ని నేను సహించలేను. చంద్రునివలె తెల్లగా ఉండి, ఒకవైపు చెవి నల్లగా ఉన్న ఎనిమిదివందల గుఱ్ఱాలను ఇస్తానని గురువుగారికి మాట ఇచ్చాను. ఆ గుఱ్ఱాలను ఇచ్చే దారి నాకేదీ కనిపించటం లేదు. కాబట్టి నేను నాజీవితాన్ని పరిత్యజించే దారిని ఎన్నుకొన్నాను. నా దగ్గర కొంచెం కూడా ధనం లేదు. పోనీ డబ్బున్న మిత్రుడూ నాకు లేడు. ఇదేమో ధనరాశి లేకుండా అయ్యే పనీ కాదు." ఈ విధంగా ఎంతో దీనంగా మాటాడుతున్న గాలవుని మాటలు విని గరుత్మంతుడు ప్రయాణం కొనసాగిస్తూనే నవ్వుతూ ఇలా అన్నాడు. "ద్విజశ్రేష్ఠా! నీవు ప్రాణత్యాగం చేయాలనుకొంటున్నావంటే అమాయకుడి వని అర్థం. ఎందుకంటే మృత్యువు పరమేశ్వర స్వరూపమే కానీ ఎవరూ కృతిమంగా కల్పించేది కాదు. నీవు ఇంతకుముందే నాకీ విషయ మెందుకు చెప్పలేదు? నీ కార్యం సిద్ధించే గొప్ప ఉపాయమొకటుంది. గాలవా! ఇదిగో ఇది సముద్రానికి దగ్గరగా ఉన్న ఋషభ పర్వతం. ఇక్కడ విశ్రమించి భుజించి వెనుకకు మరలుదాం."

113. గాలవ గరుడులు శాండిలిని కలియుట - గురుదక్షిణను గూర్చి చర్చించుట.

ఆ తరువాత గాలవుడూ, గరుడుడూ ఋషభపర్వత శిఖరంపై దిగి బ్రహ్మజ్ఞానిని, తపస్విని అయిన శాండిలిని చూశారు. గరుడుడు ఆమెకు నమస్కరించాడు. గాలవుడు

ఆమెను సత్కరించాడు. ఆమె వారికి స్వాగతం చెప్పి ఆసీనులను కమ్మంది. వారిరువురూ ఆసనాలపై కూర్చున్నారు. అభిమంత్రితమై వైశ్వదేవశేషమయిన సిద్ధాన్నాన్ని ఆమె వారికి సమర్పించింది. వారు తృప్తిగా భుజించి నేలపై పడుకొని నిదురించారు. రెండుగడియల కాలం తర్వాత ప్రయాణం ప్రారంభించాలని లేచిన గరుడుడు తన శరీరానికి రెండు రెక్కలూ లేకపోవటాన్ని గమనించాడు. గరుత్మంతుడు ముఖమూ, పాదాలు కనిపిస్తున్నా రెక్కలు లేనందున మాంసపిండంలాగా కనిపించాడు. అటువంటి గరుత్మంతుని చూసి గాలవుడు బాధపడి ఇలా అడిగాడు. "ఇక్కడకు వచ్చి నీవు ఇటువంటి ఫలితాన్ని పొందావేమిటి? ఇక్కడ మనమెంతకాలం ఉండవలసి వస్తుంది? ధర్మదూషణరూపమైన ఏ అశుభాన్ని అయినా మనసా స్మరించావా? ఎందుకంటే ధర్మ విరుద్ధమైన స్వల్పకార్యాన్ని అయినా నీవు చేయవని నా భావన." అప్పుడు సుపర్ణుడిలా అన్నాడు. "బ్రాహ్మణా! నేను ఈ సిద్ధతపస్వినిని ఇక్కడనుండి బ్రహ్మ, మహాదేవుడు, సనాతనుడైన విష్ణువూ, ధర్మమూ, యజ్ఞమూ ఉన్నచోట నివాసానికై కొనిపోవాలని మనస్సులో అనుకొన్నాను. తనకు మంచి చేయాలనే ఆమెను కొనిపోవాలని, నేను మనసా ధ్యానించినట్టు చెప్పి ఆమె పాదాలపై పడి ప్రార్థిస్తాను." వెంటనే గరుడుడు శాండిలితో "తమపై ప్రత్యేకమైన గౌరవభావంతోనే నేనిలా చేయాలని భావించాను. తమకది ఇష్టం కాలేదు. నా ఆలోచన పాపమో, పుణ్యమో - ఏదైనా తమ మాహాత్మ్యంతో క్షమించాలి." అన్నాడు.

అప్పుడు ఆమె ఆనందించి ఆ గరుడగాలవుల నుద్దేశించి ఇలా అన్నది - "సుపర్ణా! భయపడవద్దు. నీవు సుపర్ణుడవే అవుతావు. కంగారుపడ నవసరంలేదు. నాయనా! నీవు నన్ను నిందించావు. నింద నెప్పుడూ నేను సహించను. ఎవడైనా నన్ను నిందించి పాపం చేస్తే వాడు వెంటనే పుణ్యలోకాలనుండి పడిపోతాడు. అవలక్షణాలకు దూరమై, అనిందిత ప్రవర్తనతో సదాచారాన్ని పాటిస్తున్నందువలననే నేను ఈ ఉత్తమ సిద్ధిని పొందాను. ఆచారమే ధర్మాన్ని సఫలం చేస్తుంది. ఆచారమే ధనరూప మయిన ఫలితాన్ని ఇస్తుంది. ఆచారం వలననే సంపదలు లభిస్తాయి. అశుభ లక్షణాలను ఆచారమే నశింపజేస్తుంది. కాబట్టి చిరంజీవి! పక్షిరాజా! ఇక్కడ నుండి మీ ఇష్టమైన తావునకు వెళ్ళండి. నీవు నన్ను నిందించవద్దు. స్త్రీల నెప్పుడూ నిందించకూడదు. ఇంతకుముందులాగానే బలపరాక్రమాలు గలవాడవవుతావు" శాండిలి ఇలా అనగానే గరుడుని రెక్కలు అంతకుముందున్న బలం కన్న ఎక్కువ బలాన్ని పొందాయి.

వారు శాండిలి అనుమతి తీసికొని పూర్వంవచ్చిన బాటనే వెళ్ళారు. గాలవుడు అడిగిన లక్షణాలు గల గుఱ్ఱాలు మాత్రం ఎక్కడా దొరకలేదు.

గాలవుడు ప్రయాణమైపోతుండగా మార్గమధ్యంలో వాగ్మి అయిన విశ్వామిత్రుడు గమనించి, గరుడుని సమక్షంలో గాలవునితో ఇలా అన్నాడు. "బ్రాహ్మణా! నీఅంత నీవుగా నాకిస్తానని ప్రతిజ్ఞ చేసిన గురుదక్షిణను ఇవ్వటానికి కాలం సమీపిస్తోంది. ఆవిషయాన్ని ఆలోచిస్తున్నావా? నేనింతవరకు నిరీక్షిస్తున్నాను. ఇక మీదట కూడా నీకోసం చూస్తుంటాను. బ్రాహ్మణా ! నీ కార్యం సిద్ధించే ఉపాయాన్ని ఆలోచించుకో." ఆమాటలు విని గాలవుడు బాధపడ్డాడు. దీనుడై బాధపడుతున్న గాలవునితో గరుడుడిలా అన్నాడు - "ద్విజశ్రేష్ఠా! విశ్వామిత్రుడు అన్న మాటలు నేను కూడా విన్నాను గదా! రా! ఇద్దరం కలిసి ఆలోచిద్దాం. నీవు నీ గురువుకు గురుదక్షిణ మొత్తం ఇచ్చేదాకా మిన్నకుండే అవకాశం లేదు."

114. గరుడ గాలవులు యయాతి దగ్గరకు వెళ్ళుట.

పక్షిశ్రేష్ఠుడైన గరుడుడు దీనంగా ఉన్న గాలవునితో ఇలా అన్నాడు - "భూమిలోపల గల భూసారతత్త్వాన్ని తపింపజేసి, అగ్ని తయారు చేసినదాన్ని వాయువు శుభ్రం చేశాడు. అదే హిరణ్యం (బంగారం). ఈ జగత్తంతా హిరణ్మయం అందుకే దీనికి హిరణ్యమని పేరు. ఈ జగత్తు ధరించేదీ, ధరింపజేసేది కూడా ధనమే. అందుకే సువర్ణానికి ధనమని వ్యవహారం. ఈ ధనం మూడులోకాలలోనూ స్థిరంగా ఉంటుంది. ద్విజశ్రేష్ఠా! పూర్వాభాద్రా ఉత్తరాభాద్ర నక్షత్రాలలో దేనితో అయినా శుక్రవారం కలిసినరోజు అగ్నిదేవుడు కుబేరునికోసం సంకల్పించి ధనాన్ని తయారుచేసి మనుష్యుల కిస్తాడు. పూర్వాభాద్ర కధిపతియైన అజైకపాదుడూ, ఉత్తరాభాద్రకధిపతి అయిన అహిర్బుధ్న్యుడూ, కుబేరుడూ దాన్ని సంరక్షిస్తారు. ఎవరికైనా ఆ ధనం లభించకపోతే అది ప్రారబ్ధఫలమే. ధనం లేకపోతే నీకిప్పుడు నీవు కోరుతున్న గుఱ్ఱాలు దొరకవు. కాబట్టి నీవు రాజర్షి వంశంలో పుట్టిన- ఏ రాజునయినా ధనంకోసం యాచించు. ప్రజలను బాధించకుండానే ధనమిచ్చి మనలను కృతార్థులను చేయవచ్చు.

మిత్రమా! చంద్రవంశంలో పుట్టిన ఒకరాజు- నా మిత్రు డున్నాడు. అతని దగ్గరకు మనం వెళదాం. ఆయన సంపన్నుడు. ఆ రాజర్షిపేరు యయాతి. నహుషుని

పుత్రుడు. సత్యవిక్రము డాయన. నీవు స్వయంగా యాచించి, నేను వివరంగా చెపితే తానే ధనాన్ని ఇవ్వగలడు. ఆయన కుబేరుడంత ధనవంతుడు. పండితుడా! ఈ విధంగా దానం పట్టి గురుదక్షిణా ఋణవిముక్తుడివి కమ్ము!" ఆ విధంగా వారు మాటాడుకొంటూ, తగిన ఉపాయాన్ని గురించి ఆలోచించుకొంటూ, ప్రతిష్ఠానపురమందలి యయాతి మహారాజు సన్నిధికి వచ్చారు. శ్రేష్ఠమయిన అర్ఘ్యపాద్యాదికాలతో కూడిన అతిథిసత్కారాన్ని స్వీకరించాడు గరుడుడు. యయాతి అడిగితే తన రాకకు కారణాన్ని ఇలా వివరించారు. "మిత్రమా! యయాతీ! ఇతడు నా మిత్రుడు గాలవుడు. ఈయన తపోనిధి, విశ్వామిత్రుని శిష్యుడుగా వేల సంవత్సరాలు గడిపాడు. ఇతని సేవలందిన విశ్వామిత్రుడు తగిన ఉపకారం చేద్దామని ఇంటికి వెళ్ళమని అనుమతించాడు. అప్పుడు స్వామీ! గురుదక్షిణగా ఏమివ్వమంటారని విశ్వామిత్రుని అడిగాడు. పదేపదే అలా అడగగా కొంచెం కోపించిన విశ్వామిత్రుడు గాలవుడు ధనవంతుడు కాదని తెలిసి కూడా "తీసికొనిరా గురుదక్షిణ! మేలు జాతి గుఱ్ఱాలను ఎనిమిది వందలు తీసికొని రా ! అవి చంద్రవర్చస్సుతో ప్రకాశిస్తూ ఉండాలి. వాటి చెవి ఒకవైపు నల్లగా ఉండాలి. నామాటను మన్నించదలిస్తే ఈ గురుదక్షిణను తెచ్చి ఇయ్యి" అని కోపంతో ఆదేశించాడు. ఈ విప్రశ్రేష్ఠుడు గాలవుడు వాటిని సంపాదించటంలో అశక్తుడై ఎంతో బాధపడిపోతున్నాడు. నీ శరణుకోరి వచ్చాడు. పురుష శ్రేష్ఠా! నీనుండి ఆ భిక్షను స్వీకరించి, గురుదక్షిణను సమర్పించి ఆ పై నిశ్చింతగా ఎంతో తపస్సు చేసికొంటాడు ఈ గాలవుడు. తన తపస్సులో కొంతభాగాన్ని నీకు కూడా ఇస్తాడు. నీవు రాజర్షిగా తపస్సు చేసినవాడవే. ఇప్పుడు ఈ బ్రహ్మర్షితపోభాగం కూడా దానికి కలుస్తుంది. మహారాజా! దానం చేసిన అశ్వం శరీరంపై ఎన్ని రోమాలుంటాయో అన్ని గుఱ్ఱాలు పరలోకంలో దాతకు లభిస్తాయి. స్వీకరించటానికి తగిన ప్రతిగ్రహీత ఈయన. ఈయదగిన దాతవు నీవు. శంఖంలో పాలను పోసినట్టు ఈయన చేతబెట్టిన దానానికి కూడా శోభ కలుగుతుంది."

115. యయాతి గాలవునకు తన కుమార్తె నిచ్చుట.

నారదుడిలా అన్నాడు - గరుడుడు ఈ విధంగా యథార్థమూ, శ్రేష్ఠమూ అయిన మాటను చెప్పగా విని, సహస్రయజ్ఞాలను అనుష్ఠించిన యయాతి మహారాజు

సావధానుడై, పలుమార్లు ఆలోచించి, ఒక నిర్ణయానికి వచ్చి ఇలా అన్నాడు. యయాతి మహారాజు ముందుగా తన చెంతకువచ్చిన ప్రియమిత్రుడైన గరుడునీ, ద్విజశ్రేష్ఠుడయిన గాలవునీ చూచి, గరుడుడు చెప్పిన ఆ భిక్షాస్వరూపాన్ని మనసా మెచ్చుకొని- సూర్యవంశంలో పుట్టిన రాజులనందరినీ కాదని నాదగ్గరకు వీరు వచ్చారు- అన్న ఆలోచనను కూడా మనసులో ఉంచుకొని ఇలా అన్నాడు "అనఘా! గరుడుడా! నేడు నా జన్మ సఫలమైనది. నేడు నా వంశ ముద్ధరింపబడింది. ఈ నా రాజ్యం కూడా ఈనాడు నీచే ఉద్ధరింపబడింది. మిత్రమా! ఒక్క విషయం చెప్పదలచుకొన్నాను. ఇంతకుముందు నీవెరిగినట్టు ఇప్పుడు నేను సంపన్నుడను కాను. నా ధనమంతా తరిగిపోయింది. గరుడా! నీ రాకను సార్థకం చేయటానికి ఇప్పుడు నాకు శక్తి లేదు. ఈ ద్విజశ్రేష్ఠుని ఆశను విఫలం చేయటమూ నాకిష్టం లేదు. కాబట్టి మీ పని సానుకూలమయ్యేటట్లుగా ఒకటిస్తాను. దగ్గరకు వచ్చిన యాచకుడు హతాశుడయి మరలిపోతే వంశం నాశనమవుతుంది. గరుడా! దేహి అని అడగవలసి రావటం కానీ, 'నాస్తి' అని చెప్పవలసి రావటం కానీ పాపిష్ఠవచనాలు. ఈ విధంగా **యాచకునకు ఆశాభంగం కలిగిస్తే వచ్చే పాపంకన్నా, ఎక్కువ పాపాన్ని తెచ్చే విషయు మేదీ ఉండదు.** యాచించి, హతాశుడై, అకృతార్థుడైనవాడు చచ్చినవానితో సమానం. అంతేకాదు అతడు తనను హతాశుని చేసిన వాని పుత్రులనూ, పౌత్రులనూ కూడా నశింపజేస్తాడు. కాబట్టి, ఇదిగో ఈమె నా కుమార్తె. నాల్గు వంశాలనూ ఉద్ధరించగలది. దేవకాంత వంటిది. సర్వధర్మాలనూ వర్ధిల్లజేయగలది. గాలవా! ఈమె రూపాన్ని చూచి, ఎప్పుడూ దేవతలూ, మనుష్యులూ, అసురులూ ఈమెను పొందాలని కోరుతుంటారు. ఈమెను నీవు స్వీకరించు. ఈమెకోసం శుల్కంగా రాజులు రాజ్యాలనయినా ధారవోస్తారు. ఇక నల్లని చెవులు గల ఎనిమిది వందల గుఱ్ఱాలు ఏపాటి? స్వామీ! నీవు ఈ నాకుమార్తెను - మాధవిని - తీసికో. అయితే నేను దౌహిత్రుడు గల వాడనయ్యే వరాన్ని మాత్రమివ్వు." గాలవుడు ఆ కన్యను స్వీకరించి మరలా కలుద్దామని చెప్పి ఆ కన్యతో, గరుడునితో కలిసి నిష్క్రమించాడు.

గరుత్మంతుడు కూడా గుఱ్ఱాలను సంపాదించగల మార్గం దొరికిందని చెప్పి, గాలవుని యొద్ద సెలవుతీసికొని తన నివాసానికి వెళ్ళిపోయాడు. గరుడుడు నిష్క్రమించగానే గాలవుడు " ఈకన్యకు తగిన మూల్యాన్ని చెల్లించగల రాజెవరు" ? అని ఆలోచిస్తూ

ప్రయాణం సాగించాడు. ఆయన బాగా ఆలోచించి చతురంగ బలసమన్వితుడై అయోధ్యలోనున్న ఇక్ష్వాకు వంశస్థుడైన హర్యశ్వమహారాజు దగ్గరకు వెళ్లాడు. ఆ హర్యశ్వుడు కోశం, ధాన్యం, బలం బాగా కలవాడు. పురజనులకు ఇష్టమైనవాడు.ద్విజులను ఆదరించేవాడు. ప్రజాక్షేమాన్ని కోరుకొనేవాడు. శాంతమనస్కుడు. గొప్పతపస్వి. ఆ హర్యశ్వమహారాజు దగ్గరకు వచ్చి, ఆ విప్రుడు గాలవుడు ఇలా అన్నాడు – "రాజేంద్రా! ఈ నా కన్య తన సంతానంతో వంశాన్ని ఉద్ధరించగలది. తగిన శుల్కాన్ని చెల్లించి ఈమెను భార్యగా చేసికో. ఆ శుల్కమేమిటో వివరిస్తాను" విని నిర్ణయించుకో.

116. రెండువందల గుఱ్ఱములనిచ్చి హర్యశ్వుడు పుత్రుని పొందుట.

ఆ తరువాత నృపశ్రేష్ఠుడయిన హర్యశ్వ మహారాజు సంతానాన్ని పొందాలన్న కోరికతో అనేకవిధాలుగా ఆలోచించి, వేడి నిట్టూర్పులు విడిచి గాలవునితో ఇలా అన్నాడు. "ఈమెకు ఉన్నతంగా ఉండవలసిన ఆరు అవయవాలు ఉన్నతంగా ఉన్నాయి. సూక్ష్మంగా ఉండవలసిన అయిదు అవయవాలు సూక్ష్మంగా ఉన్నాయి. గంభీరంగా ఉండవలసిన మూడు అవయవాలు గంభీరంగా ఉన్నాయి. ఎఱ్ఱబారి ఉండవలసిన అయిదు అవయవాలు ఎఱ్ఱగా ఉన్నాయి.

(రెండు నితంబాలు, రెండు పిక్కలు, లలాటం, నాసిక ఉన్నతంగా ఉండవలసిన ఆరు; వ్రేళ్ళ కణుపులు, కేశాలు, రోమాలు, గోళ్ళు, చర్మం సూక్ష్మంగా ఉండవలసిన ఐదు; స్వరం, అంతఃకరణం, నాభి లోతుగా ఉండవలసిన మూడు; అరచేతులు, అరికాళ్ళు, కుడి,ఎడమ కనుగొనలు, గోళ్లు ఎఱ్ఱగా ఉండవలసిన ఐదు).

ఈమె దేవదానవులలో చాలామందికన్న అందమైనది. గాంధర్వ విద్యనెరిగినది. అనేక శుభలక్షణాలు గలది. బహుసంతానాన్ని పొందగలది. చక్రవర్తి కాగల కుమారుని కనగలిగిన దీమె. విప్రోత్తమా ! నా వైభవాన్ని గమనించి ఈమెకు తగిన శుల్కాన్ని చెప్పు." గాలవుడిలా అన్నాడు. "గొప్పదేశంలో, గొప్పవంశంలో పుట్టి శరీర సౌష్ఠవం గలిగి చంద్రకాంతివలె తెల్లనివై ఒక వైపు నుండి చెవి నల్లగా ఉన్న ఎనిమిదివందల గుఱ్ఱాలను ఇయ్యి. అప్పుడు విశాలాక్షి, శుభాంగి అయిన ఈమె అగ్నికి అరణివలె నీ కుమారులకు తల్లి కాగలదు." ఈ మాటలు విని కామమోహితుడై ఉన్న హర్యశ్వరాజర్షి దీనంగా ఆ మునివర్యుడైన గాలవునితో ఇలా అన్నాడు. "నీవడిగిన లక్షణాలు గల గుఱ్ఱాలు ఇప్పుడు నా దగ్గర రెండు వందలే ఉన్నాయి. ఇతర జాతికి చెందిన

వయితే వందలకొలది ఉన్నాయి. కాబట్టి నేను ఈమె యందు ఒక్క పుత్రుని మాత్రమే కంటాను. నా ఈ కోరికను మన్నించాలి."

ఈ మాటలు విని ఆ కన్య (మాధవి) గాలవునితో ఇలా అన్నది – "ఎవరో ఒక మహాత్ముడు వేదవేత్త నాకొక వరమిచ్చాడు. సంతానాన్ని పొందిన తరువాత కూడా నా కన్యాత్వం చెడదనేది ఆ వరం. కాబట్టి తమరు రెండువందల గుఱ్ఱాలను తీసికొని నన్ను రాజుకు ఇవ్వవచ్చు. నలుగురు రాజులనుండి రెండు వందల లెక్కన గుఱ్ఱాలను తీసికొంటే తమకు అవసరమైన ఎనిమిదివందల గుఱ్ఱాలు సమకూరుతాయి. నాకు నలుగురు కుమారు లుంటారు. విప్రశ్రేష్ఠా ! ఈ విధంగా తమరు గురుదక్షిణను సమీకరించు కొనవచ్చు. నేను చేసి పెట్టగలిగిన దిదే. ఆపై తమ ఇష్టం." ఆ కన్య (మాధవి) అలా అనగానే గాలవుడు హర్యశ్వమహారాజుతో ఇలా అన్నాడు. "నరోత్తమా! హర్యశ్వా ! ఈమెకు నిర్ణయించిన శుల్కంలో నాలుగవభాగాన్ని ఇచ్చి ఈమెను పరిగ్రహించు. ఒక్క కుమారుని మాత్రమే పొందు." ఆ హర్యశ్వమహారాజు ఆ కన్యను స్వీకరించి, గాలవుని అభినందించి తగిన సమయంలో, తగినచోట ఆమె వలన తాను కోరిన కుమారుని పొందాడు. ఆ తర్వాత ఆ హర్యశ్వుని కుమారుడే వసుమను డన్న పేర ప్రసిద్ధుడయ్యాడు. అతడు వసువులంత కాంతిమంతుడూ, వారికన్నా ధనవంతుడూ అయ్యాడు. మహాదాత కూడా అయ్యాడు.

ఆ తరువాత తగిన సమయంలో ధీమంతుడైన గాలవుడు వచ్చి, ప్రసన్న హృదయుడైన హర్యశ్వునితో ఇలా అన్నాడు "నరశ్రేష్ఠా ! మహారాజా ! సూర్యతేజస్సు గల ఈ బాలుని కుమారునిగా పొందావు. ఈ కన్యతో కలిసి గురుదక్షిణకై గుఱ్ఱాలను యాచించటానికి మరొక నరపాలుని దగ్గరకు వెళ్ళటానికి తగిన సమయమిది." హర్యశ్వమహారాజు సత్యవచనుడు. పౌరుషవంతు డయినా కూడా అటువంటి గుఱ్ఱాలు దుర్లభం కావటంతో మాధవిని గాలవునకు తిరిగి ఇచ్చాడు. మాధవి కూడా మరల తన అభీష్టాన్ని అనుసరించి కన్యయై, అయోధ్యారాజ్యలక్ష్మిని విడిచి, గాలవుని వెంట వెళ్ళింది 'గుఱ్ఱాలను నీ దగ్గరే ఉంచు' అని హర్యశ్వమహారాజుతో చెప్పి గాలవుడు మాధవితో సహా దివోదాసమహారాజు సన్నిధికి వెళ్ళాడు.

117. దివోదాసు ప్రతర్దనుని కనుట.

గాలవుడిలా అన్నాడు. "అమ్మా ! కాశీరాజు భీమసేనుని కుమారుడు దివోదాసుడు. ఆయన మహాపరాక్రమశాలి, ప్రఖ్యాతుడు. ఆయన దగ్గరకు వెళదాం. మెల్లగా నడు. బాధపడవద్దు. ఆ రాజు ధర్మాత్ముడూ సంయమనం గలవాడూ, సత్యపరాయణుడు కూడా." గాలవమహర్షి ఆ దివోదాసు దగ్గరకు పోయి, శాస్త్రోక్తంగా ఆయన సత్కారాన్ని పొంది, శుల్కాన్ని ఇచ్చి, సంతానాన్ని పొందవలసినదిగ ఆయనను ప్రేరేపించాడు. దివోదాసు ఇలా అన్నాడు. "ద్విజశ్రేష్ఠా ! ఈ విషయాన్ని నేను ఇంతకుముందే విని ఉన్నాను. వివరంగా చెప్పనవసరం లేదు. ఆ విషయాన్ని విన్నప్పుడే, నేను కూడా కుమారుని పొందాలని అభిలషించాను. ఇతర మహారాజుల నందరినీ విడిచి నా దగ్గరకే తమరు రావటం నన్ను గౌరవించటమే. తమ పని తప్పక జరుగుతుంది. గాలవా! నా అశ్వసంపద కూడా ఆ పాటియే. కాబట్టి నేను కూడా ఈమెయందు ఒక్క కుమారునే కంటాను." ద్విజశ్రేష్ఠుడైన గాలవుడు అలాగే అని అంగీకరించి, రాజుకు కన్య నిచ్చాడు. ఆ రాజు శాస్త్రోక్తంగా ఆ కన్యను ప్రతిగ్రహించాడు.

ప్రభావతితో సూర్యునివలె, స్వాహాదేవితో అగ్నిదేవునివలె, శచితో ఇంద్రునివలె, రోహిణితో చంద్రునివలె, ధూమోర్ణతో యమునివలె, గౌరితో వరుణునివలె, బుద్ధితో కుబేరునివలె, లక్ష్మితో నారాయణునివలె, జాహ్నవితో సముద్రునివలె, పార్వతితో శివునివలె, వేదితో పితామహునివలె, అదృశ్యంతితో వాసిష్ఠునివలె, అరుంధతితో వసిష్ఠునివలె, సుకన్యతో చ్యవనునివలె, సంధ్యతో పులస్త్యునివలె, లోపాముద్రతో అగస్త్యునివలె, సావిత్రితో సత్యవంతునివలె, పులోమతో భృగువువలె, అదితితో కశ్యపునివలె, రేణుకతో జమదగ్నివలె, హైమవతితో కౌశికునివలె, తారతో బృహస్పతివలె, శతపర్వతో శుక్రునివలె, భూమితో భూమిపతివలె, ఊర్వశితో పురూరవునివలె, సత్యవతితో ఋచీకునివలె, సరస్వతితో మనువువలె, శకుంతలతో దుష్యంతునివలె, దమయంతితో నలునివలె, సత్యవతితో నారదునివలె, జరుత్కారువుతో జరత్కారునివలె, ప్రతీచితో పులస్త్యునివలె, మేనకతో ఊర్ణాయువువలె, రంభతో తుంబురునివలె, శతశీర్షతో వాసుకివలె, కుమారితో ధనంజయునివలె, సీతతో రామునివలె, రుక్మిణితో శ్రీకృష్ణునివలె ఆమెతో దివోదాసు క్రీడించాడు. ఆ విధంగా క్రీడించిన దివోదాసునకు మాధవి ప్రతర్దనుడనే కొడుకును కన్నది. ఆ తరువాత తగిన సమయంలో ఆ గాలవమహర్షి దివోదాసు దగ్గరకు

పోయి ఇలా అన్నాడు. "మహారాజా ! రాజకన్య మాధవిని తిరిగి ఇవ్వండి. గుఱ్ఱాలను తమ దగ్గరే ఉంచండి. గురుదక్షిణకు తగిన శుల్కానికై మరోచోటికి వెళ్తాను." సత్యనిష్ఠుడయిన దివోదాసు అనుకొన్న సమయానికే గాలవునకు మాధవిని తిరిగి ఇచ్చాడు.

118. ఉశీనరుడు మాధవియందు శిబిని కనుట.

యశస్వినియై, సత్యపాలనయందు ఆసక్తిగల ఆ మాధవి కాశీరాజ్యలక్ష్మిని వదలి, కన్యయై, విప్రవరు డైన గాలవునితో పాటు వెళ్ళింది. గాలవుడు తన కార్యసాధనను గురించి ఆలోచిస్తూ ఉశీనరమహారాజును చూడదలచి భోజనగరానికి ప్రయాణం చేశాడు. గాలవుడు సత్యవిక్రముడైన ఆ ఉశీనరమహారాజు దగ్గరకు పోయి "రాజా ! ఈ కన్య నీకు భూపాలకులు కాగల ఇద్దరు కుమారులను ప్రసాదిస్తుంది. రాజా ! ఈమె ద్వారా సూర్యచంద్ర సమానులైన ఇద్దరు కొడుకులను పొంది, నీవు ఇహపరలోకాలలో పూర్ణకాముడవు కాగలవు. సర్వధర్మజ్ఞా ! చంద్రకాంతి గలిగి, ఒక వైపు చెవి నల్లగా ఉన్న నాలుగు వందల గుఱ్ఱాలను నాకివ్వటమే దీనికి తగిన శుల్కం. మహారాజా ! ఇది గురుదక్షిణను ఇవ్వటం కోసమే కానీ, నాకు గుఱ్ఱాలతో పనిలేదు. ఈ శుల్కాన్ని ఇవ్వటం సాధ్యమయితే నిస్సందేహంగా ఉపక్రమించండి. రాజర్షీ ! నీవు సంతానహీనుడవు. సంతానాన్ని పొందు. పుత్రు డనే నావతో నిన్ను, నీ పితరులను తరింప చెయ్యి. రాజర్షీ ! పుత్రోత్పత్తివలన కలిగిన పుణ్యాన్ని పొందినవాడు స్వర్గం నుండి నెట్టివేయబడడు. అంతేగాక సంతానహీనులు పోయే ఘోరనరకాలకు కూడా పోడు" అని అన్నాడు. అనేక విషయాలు చెప్పిన గాలవుని మాటలను విని ఉశీనరమహారాజు ఆయనకిలా సమాధానం చెప్పాడు.

"బ్రహ్మర్షీ ! గాలవా ! తమరు చెప్పినదంతా విన్నాను. విధి బలీయమైనది. ఈమె యందు సంతానాన్ని పొందాలని నా మనస్సు ఉవ్విళ్ళూరుతోంది. ద్విజశ్రేష్ఠా ! అటువంటి గుఱ్ఱాలు నా దగ్గర రెండు వందలు మాత్రమే ఉన్నాయి. ఇతర జాతులకు చెందినవి వేలకు వేలుగా ఉన్నాయి. బ్రాహ్మణా! గాలవా ! నేను కూడా ఈమె యందు ఒక్క కుమారునే పొందగలను. ఇతరులు నడచిన బాటలోనే నేనూ నడుస్తాను. బ్రాహ్మణోత్తమా! నేను గుఱ్ఱాలకు వెలను చెల్లించి తమ ఋణాన్ని మొత్తం

తీర్చివేయగలను. కానీ నా సంపదలు పౌరజానపదుల కొరకే. నా సుఖాల కొరకు కాదు గదా. ధర్మాత్మా ! ఇతరుల ధనాన్ని తన ఇచ్చివచ్చినట్లు దానం చేసిన రాజు ధర్మానికీ, కీర్తికీ కూడా దూరమవుతాడు. కాబట్టి దేవకాంతలవలె సౌందర్యవతి అయిన ఈమెను ఒక్క కుమారుని పొందటానికే ఇవ్వండి. నేను పరిగ్రహిస్తాను." ఈ విధంగా కన్యను గురించి అనేక విధాలుగా (న్యాయ బద్ధంగా) మాటాడుతున్న ఉశీనర మహారాజు మాటలు విని, గాలవుడు ఆయన నెంతో ప్రశంసించాడు. ఉశీనరునకు మాధవిని ఇచ్చి గాలవుడు వనాలకు వెళ్ళిపోయాడు. ఉశీనరుడు ఆమెను స్వీకరించి, పుణ్యాత్ముడు సంపదల ననుభవించినట్లుగా ఆమెతో క్రీడించాడు. పర్వతగుహలలో, నదీతీరాల్లో, సెలయేళ్లలో, విచిత్రమైన ఉద్యానవనాలలో, అరణ్యాలలో, తోటల్లో, అందమైన భవనాలలో, మేడల పైభాగాలలో, గాలిలో ఎగిరే విమానాలలో, భూమిలో నిర్మించిన గర్భగృహాలలో ఆ ఉశీనరుడు మాధవితో క్రీడించాడు. ఆ తర్వాత తగిన సమయంలో బాలభానుని వంటి తేజస్సు గల కుమారుడు కలిగాడు. పెరిగి పెద్దయిన తర్వాత శిబిపేరున ప్రసిద్ధి వహించిన రాజశ్రేష్ఠుడు అతడే. ఆ విప్రుడు గాలవుడు ఉశీనరుని సన్నిధికి వచ్చి మాధవిని తీసికొని ప్రయాణమయ్యాడు. రాజా ! ఆ సమయంలో వైనతేయుడు కన్పించాడు.

119. గాలవుడు మాధవిని యయాతికి తిరిగి ఇచ్చుట.

గరుడుడు గాలవుని చూచి నవ్వుతూ "ద్విజోత్తమా ! అదృష్టం కొద్దీ కృతకృత్యుడవయిన నిన్ను ఇక్కడ చూస్తున్నాను" అన్నాడు. గాలవుడు గరుడుని మాటలు విని "ఆ కార్యంలో ఇంకా నాలుగవ భాగం మిగిలి ఉంది" అని సమాధానం చెప్పాడు. వాగ్మి అయిన గరుడుడు ఇలా అన్నాడు గాలవునితో - "ఇక నీవు ప్రయత్నం చేయవలసిన అవసరం లేదు. ప్రయత్నించినా సఫలం కాదు. ఒకప్పుడు కాన్యకుబ్జంలో ఋచీకుడు గాధిరాజు కుమార్తె సత్యవతిని పరిణయమాడ గోరి వరించాడు. అప్పుడు గాధి ఋచీకునితో ఇలా అన్నాడు. "స్వామీ ! చంద్రవర్చస్సు గలిగి, ఒక చెవి వైపు నల్లగా కనిపించే గుఱ్ఱాలు ఒక వేయి నాకు ఇవ్వాలి. ఇవ్వగలవా !" అన్నాడు. ఋచీకుడు అంగీకరించి, బయలుదేరి, వరుణలోకానికి పోయి, అశ్వతీర్థంలో అటువంటి గుఱ్ఱాలను సంపాదించి గాధిరాజు కిచ్చాడు. ఆయన పుండరీకయాగం చేసి ఆ

గుఱ్ఱాలను బ్రాహ్మణులకు దానం చేశారు. ఆ బ్రాహ్మణుల దగ్గర నుండి రాజులు రెండు రెండు వందల గుఱ్ఱాలను కొనుక్కొని తమ దగ్గర ఉంచుకొన్నారు. ద్విజశ్రేష్ఠా! మిగిలిన నాలుగు వందల గుఱ్ఱాలను తీసికొని పోతుండగా వితస్తానదిని దాటే సమయంలో ఆ గుఱ్ఱాలు నదీప్రవాహంలో కొట్టుకొనిపోయాయి. ద్విజోత్తమా ! గాలవా ! ఈ విధంగా ఈ ఆరువందల గుఱ్ఱాలకన్నా ఎక్కువ ఎక్కడా దొరకవు. కాబట్టి నీవు సాధించలేవు. ధర్మాత్మా మిగిలిన రెండు వందల గుఱ్ఱాల బదులు ఈ కన్యనే ఆరువందల గుఱ్ఱాలతో పాటు విశ్వామిత్రునకు సమర్పించు. అప్పుడు నీ అవస్థలు తొలగి కృతకృత్యుడవు కాగలవు." గాలవుడు అలాగేనని అంగీకరించి గుఱ్ఱాలనూ, మాధవినీ తీసికొని గరుత్మంతునితో పాటు విశ్వామిత్రుని దగ్గరకు వచ్చి ఇలా అన్నాడు. "తమరు కోరిన గుఱ్ఱాలలో ఇవి ఆరువందలు. మిగిలిన రెండువందల గుఱ్ఱాల బదులు ఈ కన్యను స్వీకరించండి. ఈమె యందు ముగ్గురు రాజర్షులు, మువ్వురు పుత్రులను కన్నారు. తమరుకూడా నరోత్తముడైన నాలుగవ కొడుకును కనండి. ఆ విధంగా ఎనిమిదివందల గుఱ్ఱాల గురుదక్షిణ పూర్తి అవుతుంది. మీ ఋణం నుండి విముక్తుడనై నేను సుఖంగా తపస్సు చేసికొంటాను."

విశ్వామిత్రుడు గాలవునీ, గరుడునీ, అందమయిన ఆ కన్యనూ చూచి ఇలా అన్నాడు. "గాలవా ! ఈమెను ఇంతకుముందే నా దగ్గరకు తీసికొని రావలసినది. కులప్రవర్తకులైన ఆ నలుగురు కొడుకులూ నాకే పుట్టేవారు గదా ! ఒక కుమారుని పొందటానికై నీ కన్యను స్వీకరిస్తున్నాను. ఈ గుఱ్ఱాలను నా ఆశ్రమానికి తెచ్చి విడు. స్వేచ్ఛగా అంతటా తిరుగుతాయి." తేజోమూర్తి అయిన విశ్వామిత్రుడు ఆమెతో క్రీడించి కొడుకును కన్నాడు. అతని పేరు అష్టకుడు. ఆ పుత్రుడు పుట్టగానే విశ్వామిత్ర మహాముని అతనిని ధర్మార్థాలతోనూ, ఆ గుఱ్ఱాలతోనూ సంపన్నుని చేశాడు. అప్పుడు అష్టకుడు చంద్రపుర కాంతితో సమానమైన కాంతిగల విశ్వామిత్రుని రాజధానికి వెళ్ళాడు. కన్యను శిష్యునకే ఇచ్చి విశ్వామిత్రుడు అడవులకు వెళ్ళిపోయాడు. గాలవుడు కూడ గురుదక్షిణ నిచ్చి మనస్సులో పరమానందపడి గరుడుని సమక్షంలో మాధవితో ఇలా అన్నాడు. "సుందరీ ! నీ మొదటి కొడుకు దానపతి. రెండవవాడు శూరవీరుడు. మూడవవాడు సత్యధర్మపరాయణుడు. నాలుగవవాడు యజమాని. నీవు ఈ కుమారుల ద్వారా నీ తండ్రిని కూడా తరింపజేశావు. నీ కుమారులను ఉద్ధరించావు. నన్ను

కూడా ఋణవిముక్తుని చేశావు. ఇక పద." అలా అని గాలవుడు గరుత్మంతుని అనుమతి తీసికొని, ఆ కన్యను -మాధవిని-తండ్రి చెంతకు చేర్చి, తాను వనాలకు వెళ్ళిపోయాడు.

120. మాధవి తపస్సు చేయుట - యయాతి స్వర్గమున తేజోహీను డగుట.

నారదుడిలా అన్నాడు. "ఆ యయాతి మహారాజు ఆ మాధవికి మరల స్వయంవరాన్ని ఏర్పాటు చేయదలచి గంగాయమునల సంగమస్థానంలోని తన ఆశ్రమానికి వెళ్ళి ఆలోచించసాగాడు. చేత వరమాలను ధరించిన మాధవిని రథమెక్కించి ఆమె సోదరులు పూరుడూ, యదువూ, ఆశ్రమంలో వరుని కోసం వెదకసాగారు. నాగులూ, యక్షులూ, మనుష్యులూ, గంధర్వులూ, పశు, పక్షిజాతికి చెందినవారూ, గిరిజనులూ, ఆటవికులూ అందరూ అక్కడ సమావేశమయ్యారు. ప్రయాగలోని ఆ వనం అనేక జనపదాలరాజులతో, బ్రహ్మకల్పు లయిన మహర్షులతో నిండిపోయింది. ఆ వరులను గురించి చెపుతూఉంటే ఆ వరవర్ణిని వరులనందరినీ అతిక్రమించి తపోవనాన్నే వరునిగా ఎన్నుకొన్నది. ఆ యయాతిపుత్రి రథం నుండి దిగి, బంధువుల కందరకూ నమస్కరించి, పవిత్రమైన తపోవనాన్ని చేరి తపస్సు చేయసాగింది. రకరకాల ఉపవాసాలతో, వివిధ దీక్షలతో, నియమాలతో రాగద్వేషాలు లేని మనస్సుతో ఆమె అరణ్యంలో మృగంవలె చరించసాగింది. ఈ విధంగా ఆమె వైడూర్యపు మొలకల వంటి శోభగలిగి, పచ్చగా, మృదువుగా, వగరుగా, తీయగా ఉన్న గడ్డిపరకలను భుజిస్తూ, శుభ్రమై, పవిత్రమై, చల్లగా ఉన్న పవిత్రనదీ జలాలను త్రాగుతూ, మృగాలకు నివాసస్థానమైన, పులులూ, దావాగ్ని లేని దుర్గమనిర్జనారణ్యాలలో జింకలతో బాటు జింకవలె సంచరిస్తూ, బ్రహ్మచర్యాన్ని పాటిస్తూ విస్తృతంగా ధర్మపాలన చేసింది.

యయాతి కూడా ప్రాచీనరాజన్యుల మార్గాన్ని అనుసరించి సదాచారాలను పాటిస్తూ, వేల సంవత్సరాలు జీవించి కాలధర్మం చెందాడు. యయాతి కుమారు లయిన పూరువు, యదువు నరోత్తములై వంశోద్ధారకు లయ్యారు. వారి వలన నహుషపుత్రుడు యయాతి ఇహపరలోకాలలో ప్రతిష్ఠను పొందాడు. రాజా ! యయాతి మహారాజు మహర్షులవలె పుణ్యాత్ముడూ, తపస్వి అయి స్వర్గాన్ని చేరి అక్కడ స్వర్గంలోని ఉత్తమస్థాయి ఫలాలను అనుభవించసాగాడు. ఈ విధంగా ఆ స్వర్గలోకంలో కొన్ని

వేల సంవత్సరాలు గడచిపోయాయి. యయాతి తా ననుభవిస్తున్న స్వర్గసుఖాలను చూచి తానే ఆశ్చర్యపోయాడు. ఆయన బుద్ధిని మైకం క్రమ్మింది. తన ప్రక్కన ఎందరో మహాత్ములు, మహోన్నతులైన రాజర్షులు కూర్చొని ఉన్నా మనుష్యులను, దేవతలను, ఋషిగణాన్ని అవహేళన చేయసాగాడు. ఆపై యయాతి పరిస్థితిని బలనిషూదనుడైన ఇంద్రుడు తెలిసికొన్నాడు. రాజర్షులందరూ యయాతిని అసహ్యించు కొనసాగారు. అప్పుడు యయాతిని చూచిన స్వర్గవాసులు ఇలా వితర్కించసాగారు- ఎవరీయన? ఏ రాజు కొడుకు ? స్వర్గానికి ఎలా వచ్చాడు?ఏ పనిచేసి ఈయన సిద్ధిపొందాడు ? ఎక్కడ తపస్సు చేశాడు ? స్వర్గలోకంలో ఈయనకు గల గుర్తింపు ఏమిటి? ఎలా గుర్తింపు పొందాడు?" ఈ విధంగా ఆలోచిస్తున్న స్వర్గ వాసులు ఒకరినొకరు యయాతిని గురించి ప్రశ్నించుకోసాగారు. వందలకొలదిగా ఉన్న విమానరక్షకులనూ, స్వర్గద్వార రక్షకులనూ, సింహాసన సంరక్షకులనూ అడిగారు. అందరూ కూడా "తెలియదనే" సమాధానమిచ్చారు. వారందరి జ్ఞానాన్ని తెరలు కప్పివేశాయి. ఎవ్వరూ కూడా ఆయనను గుర్తించలేకపోయారు. అప్పుడు క్షణకాలంలో యయాతిరాజు తన తేజస్సును కోల్పోయాడు."

121. యయాతి స్వర్గభ్రష్ట డగుట.

ఆ తరువాత యయాతి తన సింహాసనం నుండి పడి, తన స్వర్గస్థానాన్ని కూడా కోల్పోయాడు. మనస్సు కంపించింది. శోకం ఆయనను దహించసాగింది. తాను ధరించిన దివ్యకుసుమమాల వాడిపోయింది. తన జ్ఞానం నశించిపోసాగింది. కిరీటం, అంగదాలు తొలగిపోయాయి. శరీరావయవాలు పట్టుతప్పాయి. ఆభరణాలు, వస్త్రాలు జారిపోసాగాయి. మనిషి గిరగిర తిరగసాగాడు. తానెవ్వరికీ కనిపించటం లేదు. తనకు మాత్రం వారు అప్పుడప్పుడు కనిపిస్తున్నారు. మరలా అదృశ్యమవుతున్నారు. నేలమీదకు పడిపోతూ పూర్తిగా శూన్యమయిన మనస్సులో "నేను ధర్మాన్ని దూషించే ఏ అశుభాన్నో మనసా భావించి ఉంటాను. అందుకే స్థానభ్రష్టుడ నయ్యాను" అని విచారించసాగాడు. అయితే స్వర్గలోకంలో ఉన్న రాజర్షులు, సిద్ధులు, అచ్చరలు ఆ విధంగా భ్రష్టుడై ఆధారాన్ని కోల్పోయిన యయాతిని చూశారు. రాజా! అప్పుడు పుణ్యం తరిగి పోయినవారిని స్వర్గం నుండి గిరవాటువేసే వ్యక్తి ఒకడు వచ్చి దేవేంద్రుని

ఆజ్ఞ ననుసరించి యయాతితో ఇలా అన్నాడు. "రాజకుమారా ! నీవు బాగా పొగరెక్కి ఉన్నావు. స్వర్గంలో నీవు హేళన చేయని మహాత్ము డెవ్వడూ లేడు. ఈ పొగరు వల్ల నీవు స్థానాన్ని కోల్పోయావు. నీవిక ఇక్కడ ఉండదగదు. ఇక్క డెవ్వరూ నిన్ను గుర్తించటం లేదు. పడిపో!" ఆ మాట అతడు అనగానే "నేను మంచి వాళ్ళ మధ్యనే పడాలి' అని ముమ్మారు పలికి యయాతి క్రిందకు పడసాగాడు. జంగమశ్రేష్ఠుడైన యయాతి పడిపోతూ తన గతిని గురించి ఆలోచించసాగాడు. అదే సమయంలో అతడు నైమిశారణ్యంలో నలుగురు రాజశ్రేష్ఠులను చూచి, వారి మధ్య పడసాగాడు. అక్కడ ప్రతర్దనుడు, వసుమనుడు, శిబి, అష్టకుడూ వాజపేయయాగం చేస్తూ దేవేంద్రుని తృప్తి పరుస్తున్నారు. వారి హోమాగ్ని ధూమం స్వర్గానికి ద్వారమన్నట్లుగా వ్యాపించి ఉంది. యయాతి దానిని ఆఘ్రాణించి నేలపై పడసాగాడు. భూమినీ, స్వర్గాన్నీ కలుపుతూ ధూమమయ మయిన నది ప్రవహిస్తున్నట్టుంది. నేలకు దిగుతున్న గంగలా ఆ ధూమం కనిపిస్తోంది. ఆ ధూమ మార్గాన్ని ఆలంబనం చేసికొని, ఆ యయాతి మహారాజు సమానతేజస్కులై, అవభృథస్నాన పవిత్రులై, లోకపాలకులతో సమానంగా ఉన్న తన బంధువులైన ఆ నలుగురి మధ్య పడ్డాడు.

ఆ నలుగురు రాజశ్రేష్ఠులు నాలుగు అగ్నులవలె తేజోవంతులై. ఆహుతులను పొంది ప్రజ్వలిస్తున్నారు. తన పుణ్యం పూర్తికాగానే యయాతి వారి మధ్య పడిపోయాడు. దివ్యకాంతితో శోభిస్తున్న ఆ యయాతితో ఆ రాజులు ఇలా అన్నారు. "నీవెవడవు? ఎవరి బాంధవుడవు? ఏ దేశానికి, ఏ నగరానికి చెందినవాడవు? నీవు యక్షుడవా? దేవతవా ? గంధర్వుడవా ? లేక రాక్షసుడవా ? మానవుడిలాగా కనిపించటం లేదు? నీకేమి కావాలి ?" యయాతి ఇలా అన్నాడు. "నేను యయాతి అనే పేరుగల రాజర్షిని. పుణ్యం తరిగి స్వర్గం నుండి భ్రష్టుడ నయ్యాను. నేలపైపడుతూ మిమ్ములను మంచివారుగా భావించి మీ మధ్య పడ్డాను." రాజులు ఇలా అన్నారు. "పురుషశ్రేష్ఠా! నీ కోరిక సఫలమవుతుంది. మా అందరి యాగఫలితాన్ని, ధర్మఫలితాన్ని నీవు స్వీకరించు." యయాతి ఇలా అన్నాడు. "బ్రాహ్మణుడికి దానం పట్టటమే సంపద కావచ్చు. కానీ నేను క్షత్రియుడను. కాబట్టి నా మనస్సు ఇతరుల పుణ్యాన్ని నా కోసం ఖర్చుచేయటానికి అంగీకరించటం లేదు." నారదుడిలా అన్నాడు. అదే సమయంలో జింకలలో ఒక జింకగా తిరుగుతూ అక్కడకు వచ్చిన తమ తల్లిని- మాధవిని- చూచి రాజులు ఆమెకు నమస్కరించి ఇలా అన్నారు. "తపస్వినీ ! ఏ పనిపడి మా దగ్గరకు వచ్చావు?

మేము ఏం చేయాలి? మేము నీ బిడ్డలం. ఏం చేయమంటావో ఆజ్ఞాపించు."

వారి మాటలను విని మాధవి పరమానందంతో తనతండ్రి అయిన యయాతి చెంతకు చేరి నమస్కరించింది. తన కుమారులను శిరస్సులను స్పృశించి ఆ మాధవి ఇలా అన్నది. "రాజశ్రేష్ఠా ! వీరు నీ దౌహిత్రులు, నా కుమారులు, పరాయివారు కాదు. వీరు నిన్ను తరింపజేస్తారు. దౌహిత్రులు మాతామహులను ఉద్ధరించటం క్రొత్త విషయమేమీ కాదు. నేను నీ పుత్రిని మాధవిని. జింకలా ఈ అడవిలో తిరుగుతుంటాను. నేను కూడా కూడబెట్టిన ధర్మ మున్నది. దానిలో సగభాగాన్ని స్వీకరించండి. రాజేంద్రా ! మనుష్యులంతా తమ సంతతి చేసిన సత్కర్మల ఫలితాన్ని అనుభవిస్తారు. అందుకని వారు తమలాగే దౌహిత్రులను కోరుకొంటారు." అప్పుడు ఆ రాజులందరూ తల్లిపాదాలపై పడి నమస్కరించి, అసాధారణమూ, స్నిగ్ధమూ అయిన పెద్ద కంఠంతో భూమిని ప్రతిధ్వనింపజేస్తూ, స్వర్గభ్రష్టుడైన మాతామహుని తరింపజేస్తూ ఏదో అనబోయారు. అంతలో ఆ అరణ్యం నుండియే గాలవుడు కూడా వచ్చి "నా తపస్సులోని ఎనిమిదవ భాగాన్ని స్వీకరించి, తమరు స్వర్గలోకాన్ని చేరండి" అన్నాడు.

122. యయాతి మరల స్వర్గమునకు చేరుట.

ఆ సజ్జనుల గుర్తింపు పొందగానే నరోత్తముడైన యయాతి భూమిని స్పృశించకుండానే పైకి పోసాగాడు. ఆయనకు దివ్యాకృతి లభించింది. శోకం తొలగిపోయింది. దివ్యా భరణాలు, దివ్యవస్త్రాలు, దివ్యసుమమాలలు, దివ్యపరిమళాలు కలిగి కాలు నేలకు తగులకుండా నిలిచాడు. అప్పుడు అందరికన్నా ముందుగా దానపతిగా ప్రసిద్ధి పొందిన వసుమనుడు బిగ్గరగా యయాతి మహారాజుతో ఇలా అన్నాడు. "నేను లోకంలో ఏ వర్ణాన్ని నిందించకుండా పొందిన పుణ్యాన్ని కూడా తమకిస్తున్నాను. ఆ పుణ్యం మీకు దక్కుతుంది. దానశీలునకు లభించే పుణ్యఫలం, సహనశీలికి లభించే పుణ్యఫలం, అగ్నిస్థాపనాది వేదోక్తకర్మల నాచరించినందువలన నాకు లభించే పుణ్యఫలం అంతా తమరు స్వీకరించండి." అప్పుడు క్షత్రియశ్రేష్ఠుడైన ప్రతర్దనుడు ఇలా అన్నాడు. "నిరతమూ ధర్మతాత్పర్యం కలిగి ఉండటం వలన, నిత్యమూ ధర్మబద్ధమైన యుద్ధాలమీదనే ఆసక్తి చూపినందువలన, లోకంలో క్షత్రియునకు

తగినట్లు కీర్తినీ, పరాక్రమాన్నీ సాధించినందువలన నాకు లభించే పుణ్యఫలం తమకు దక్కుతుంది." ఆపై ఉశీనరకుమారుడూ, బుద్ధిమంతుడూ అయిన శిబి ఇలా మధురంగా పలికాడు. "బాలురతో కానీ, స్త్రీలతో కానీ, పరిహాసయోగ్యులయిన బంధువులతో కానీ, యుద్ధంలో కానీ, ప్రమాదాలలో కానీ ఇబ్బందులలో కానీ నేను అసత్యం పలకలేదు. ఆ సత్యఫలంతో స్వర్గానికి వెళ్ళు. రాజా ! నేను ప్రాణాలనైనా, రాజ్యాన్ని అయినా, కామసుఖాలనయినా వదలగలను కానీ సత్యాన్ని విడువను. ఆ సత్యఫలంతో స్వర్గానికి వెళ్ళు. నా సత్య పరిపాలనతో ధర్మదేవత, అగ్ని, ఇంద్రుడూ సంతృప్తులయితే ఆ సత్య ఫలంతో స్వర్గానికి వెళ్ళు."

ఆ తరువాత మాధవి చిన్నకొడుకూ, కౌశికుడూ, ధర్మజ్ఞుడూ, రాజర్షి అయిన అష్టకుడు వందల యాగాలు చేసిన యయాతి దగ్గరకు వెళ్ళి ఇలా అన్నాడు. "స్వామీ ! నేను వందలకొలదిగ పుండరీక, గోసవ, వాజపేయ యాగాలను చేశాను. వాటి ఫలితాన్ని నీవు పొందు. నా దగ్గర రత్నాలు కానీ, ధనం కానీ, ధాన్యం కానీ మరే సామగ్రీ కానీ లేవు. అవన్నీ యాగాల కొరకే ఉపయోగించాను. ఆ సత్ఫలంతో స్వర్గానికి వెళ్ళు." దౌహిత్రులు యయాతితో ఒక్కొక్కరుగా అంటుంటే యయాతి మహారాజు కొంచెం కొంచెంగా భూమికి దూర మవుతూ స్వర్గలోకంవైపు వెళ్ళాడు. ఈ విధంగా ఆ నలుగురు రాజులూ తమతమ కర్మఫలాలతో స్వర్గభ్రష్ట డయిన ఆ యయాతిని తేలికగా తరింపజేశారు. నాలుగు రాజవంశాలలో పుట్టి వంశ వర్ధనులైన ఆ నలుగురు దౌహిత్రులు తమ ధర్మఫలంతో, యజ్ఞదానఫలంతో మహాప్రాజ్ఞుడూ, మాతామహుడూ అయిన యయాతిని స్వర్గలోకానికి పంపించారు. రాజులు ఇలా అన్నారు. 'రాజా ! రాజధర్మానికి తగిన గుణాలతోనూ, సమస్త ధర్మాలతోనూ, సద్గుణాలతోనూ సంపన్నులమైన మేము నీ దౌహిత్రులం. మా పుణ్యఫలంతో నీవు స్వర్గానికి వెళ్ళు."

123. యయాతి స్వర్గపతన కారణమును నారదుడు దుర్యోధనునకు తెలుపుట.

నారదుడిలా అన్నాడు. "భూరిదక్షిణల నివ్వగల మంచిరాజులచేత యయాతి స్వర్గానికి పంపబడ్డాడు. యయాతి మహారాజు తన దౌహిత్రుల నుండి వీడుకోలు తీసుకొని స్వర్గానికి వెళ్ళాడు. అక్కడ యయాతిపై పరిమళభరితమైన వివిధ కుసుమాల

వాన కురిసింది. సువాసనలు గల పవిత్రవాయువు ఆయనను చుట్టుముట్టింది. తన సత్కర్మల చేత ఎదిగిన యయాతి మహారాజు దౌహిత్రుల పుణ్యఫలంచేత లభించిన నిశ్చలస్థానాన్ని పొంది, గొప్పగా ప్రకాశించాడు. గంధర్వులు, అచ్చరలు ఆయన కీర్తిని గానంచేస్తూ, ఆయన చెంత నాట్యం చేస్తూ ఆనందింపజేశారు. స్వర్గలోకం లోనికి దుందుభి ధ్వనులతో పాటు ప్రేమపూర్వకంగా ఆహ్వానింపబడ్డాడు యయాతి. వివిధ దేవర్షి, రాజర్షి, చారణగణాలు ప్రస్తుతించారు. దేవతలు ఉత్తమమైన అర్ఘ్యాన్ని అందించి ఆయనను పూజించి, అభినందించారు. ఈ విధంగా యయాతి స్వర్గఫలాన్ని పొందిన తరువాత ఆనందంగా, ప్రశాంతంగా ఉన్న ఆయనను మాటలతో సంతృప్తిపరుస్తూ బ్రహ్మ ఇలా అన్నాడు. 'నీవు లోకహితకర మయిన కర్మల ద్వారా నాల్గుపాదాల ధర్మాన్ని ఆచరించావు. అందువలన నీకు అక్షయమైన స్వర్గ సుఖం లభించింది. ఇచ్చట అక్షయకీర్తి కూడా లభించింది. రాజర్షీ ! మరల నీవే నీ పుణ్యాన్ని నశింపజేసి కొన్నావు. ఆ సయమంలో స్వర్గవాసులందరి మనస్సులూ చీకటితో నిండిపోయాయి. అందువలన నిన్ను గుర్తించలేదు. అందువలన స్వర్గభ్రష్టుడవు కావలసివచ్చినది. అయితే నీ దౌహిత్రులు ప్రేమగా నిన్ను తరింపజేశారు. మరలా ఇక్కడకు రాగలిగావు. ఇప్పడు నీవు నీ దౌహిత్రుల ద్వారా పొందిన పుణ్యకర్మల ఫలితంగా నిశ్చలమూ, శాశ్వతమూ, పవిత్రమూ, ఉత్తమమూ, స్థిరమూ, అవ్యయమూ అయిన స్థానాన్ని పొందావు.'

యయాతి ఇలా అన్నాడు. 'స్వామీ ! లోకపితామహా ! నాకొక సంశయమున్నది. దానిని తమరే తీర్చాలి. నేను మరొకరి దగ్గర నా సందేహాన్ని ప్రకటించలేను. నేను కొన్ని వేల సంవత్సరాలు వివిధ క్రతువులు, దానాలూ చేసి పుణ్యఫలాన్ని సంపాదించాను. ప్రజాపాలన రూపమైన ధర్మాన్ని ఆచరించి దానిని వృద్ధి చేసికొన్నాను. అంత పుణ్యఫలం ఇంత స్వల్పవ్యవధిలో ఎలా నశించింది? నన్ను స్వర్గభ్రష్టుణ్ణి ఎలా చేయగలిగింది? స్వామీ ! తేజోమూర్తీ ! నా సత్కర్మల ద్వారా నేను ఏ సనాతన లోకాలను పొందినదీ నీకు తెలుసు. ఆ నా పుణ్యమంతా అంత త్వరగా ఎలా నశించింది?' అనగానే బ్రహ్మ 'రాజేంద్రా ! కొన్ని వేల సంవత్సరాల్లో వివిధ క్రతువులూ, దానాలూ చేసి సంపాదించి, ప్రజాపాలన ధర్మాన్ని పాటించి వృద్ధి చేసికొన్న నీ పుణ్యఫలమంతా అభిమానరూపమైన దోషం వలన నశించింది. అందుకే భ్రష్టుడవు కావలసివచ్చింది. స్వర్గవాసులంతా నిన్ను ధిక్కరించటం జరిగింది. రాజర్షీ ! అభిమానంతో కానీ,

బలంతో కానీ, హింసతో కానీ, మోసంతో కానీ, మాయలతో కానీ ఈ పుణ్యలోకంలో స్థిరత్వాన్ని పొందలేరు. రాజా ! అధములను కానీ, ఉత్తములను కానీ, మధ్యములను కానీ ఎప్పుడూ పరాభవించకూడదు. అభిమానాగ్నిలో మండిపోతున్న వాడికి తాపశాంతికి ఉపాయంలేదు. నీవు స్వర్గభ్రష్టుడవై మరల స్వర్గలోకమున కెక్కిన ఈ కథను చెప్పుకొనినవారు కష్టాలలో పడినా బయటపడతారు. ఈ విషయంలో సంశయం లేదు.'

నారదుడిలా అన్నాడు. "రాజా ! ఈ విధంగా ఆనాడు అభిమానదోషం వలన యయాతి చిక్కుల్లో పడ్డాడు. తన పట్టుదలా, మొండితనం కారణంగా గాలవుడు కూడా చాలా కష్టపడవలసి వచ్చింది. **శ్రేయోభిలాషు లయిన మిత్రులు హితాన్ని కోరుతూ చెప్పినదానిని తప్పక వినాలి. మొండిపట్టుతో ఎప్పుడూ ఉండకూడదు. అది వినాశనానికి దారి తీస్తుంది.** కాబట్టి దుర్యోధనా ! అభిమానాన్నీ క్రోధాన్నీ విడిచిపెట్టు. వీరులయిన పాండవులతో సంధి చేసికో. ఆవేశాన్ని వదిలిపెట్టు.

(నీవు నీ మిత్రుల హితవచనాలనే స్వీకరించు. అసత్యాచరణల వైపు వెళ్ళవద్దు. సమర్థులైన పాండవులతో యుద్ధంచేసి తీవ్రమయిన ఇబ్బందులు పడగలవు.)

రాజా ! దానం చేసినవాడూ, విధిని నిర్వహించినవాడూ, తపస్సు చేసినవాడూ, హోమయాగా ద్యనుష్ఠానం చేసినవాడూ నశించడు. వానికి ఏ లోటూ ఉండదు. ఆ కర్మల ఫలితాన్ని మరెవ్వరూ అనుభవించరు. కర్తయే శుభాశుభకర్మఫలితాల ననుభవిస్తాడు. మహాపండితులై రాగద్వేషాలకు అతీతులైన మహాపురుషుల మహత్త్వాన్ని తెలియజేసే ఉపాఖ్యానమిది. ఇది ఉత్తమమూ, హితకరమూ కూడా. లోకంలో ఎందరో ఎన్నో రకాలుగా పరిశీలించి ధర్మ అర్థ కామాలపై దృష్టి గలవాడే ఈ భూలోక సంపద ననుభవింపగలడని నిర్ధారించారు."

124. శ్రీకృష్ణుడు దుర్యోధనునకు బోధచేయుట.

ధృతరాష్ట్రుడిలా అన్నాడు. "పూజనీయా ! నారదా ! నీవు చెప్పినదంతా నిజమే. నేను కూడా అదే కోరుకుంటున్నాను. కానీ నావల్ల కావటం లేదు." నారదునితో అలా పలికి ధృతరాష్ట్రుడు శ్రీకృష్ణునితో ఇలా అన్నాడు. "కేశవా! నీవు చెప్పినదంతా ఇహలోకంలోనూ, స్వర్గలోకం లోనూ కూడా ధర్మబద్ధమైనది, న్యాయబద్ధమైనది కూడా. నాయనా జనార్దనా ! నేను నా అదుపులో లేను. జరుగుతున్నదంతా నాకు ఇష్టమైనది కాదు. దుర్మార్గులైన నా కొడుకులు నా మాటను లెక్కచేయటం లేదు. పురుషోత్తమా !

శాస్త్రాలను అతిక్రమిస్తూ మూర్ఖంగా ప్రవర్తిస్తున్న దుర్యోధనునికి నచ్చ చెప్పి దారిలో పెట్టే ప్రయత్నం చేయి. మహాబాహూ ! మంచివారి మాటలు వాడు వినడు. హృషీకేశా! గాంధారి, ధీమంతుడైన విదురుడు, శ్రేయోభిలాషులైన భీష్మాదులు, ఇతర మిత్రులూ- ఎవరు చెప్పినా వినడు. దురాత్ముడయిన దుర్యోధనుని బుద్ధి పాపాసక్తమై ఉంది. పాప దృష్టితోనే ప్రవర్తిస్తున్న క్రూరుడూ, అవివేకి ఈ దుర్యోధనుడు. నీవే వాడికి నచ్చజెప్పు. నీవు సంధికి ఒప్పించగలిగితే మిత్రులకోసం నీవు చాలా గొప్ప పనిచేసినట్టే." అనగానే ధర్మార్థ తత్త్వవేత్త అయిన శ్రీకృష్ణుడు అసహనశీలి అయిన దుర్యోధనుని వైపు తిరిగి మధురవచనాలతో ఇలా అన్నాడు.

"కురుసత్తమా ! దుర్యోధనా ! నా మాట విను. భారతా ! నీకూ, నీ బంధుకోటికీ శుభాన్ని కలిగించాలనే ప్రత్యేకంగా చెప్పవలసివస్తోంది. మహాజ్ఞానులవంశంలో పుట్టినవాడవు నీవు. స్వయంగా శాస్త్రజ్ఞానమూ, సద్వ్యవహారమూ తెలిసినవాడవు. ఉత్తమ గుణాలతో కూడినవాడవు. కాబట్టి నా మాటను గౌరవించాలి. నాయనా ! చెడ్డవంశంలో పుట్టిన వాళ్ళూ దుర్మార్గులూ, క్రూరులూ, సిగ్గులేనివాళ్ళు మాత్రమే ఇటువంటి పనులు చేస్తారని నీకు తెలియనిది కాదు. **లోకంలో సజ్జనుల ప్రవర్తన ధర్మార్థాలను విడవకుండా ఉంటుంది. అసత్పురుషుల ప్రవృత్తి పూర్తిగా దానికి భిన్నంగా ఉంటుంది.** నీలో ఈ విపరీత ప్రవృత్తి పదే పదే కనిపిస్తోంది. నీ పట్టుదల అధర్మంతో కూడినది. నిష్కారణమైనది. ఇది అనిష్టహేతువు. తీవ్రంగా ప్రాణనష్టాన్ని కలిగించగలది. దానిని సఫలం చేసికొనటం కూడా అసాధ్యమే. ఆ అనర్థాన్ని తప్పించి నీకూ, నీ సోదరులకూ, సేవకులకూ, మిత్రులకూ కూడా శ్రేయస్సును కల్గించు. ఈ విధంగా చేస్తే నీవు అధర్మం నుండీ, అపకీర్తి నుండీ విముక్తిని పొందుతావు. పండితులూ, శూరులూ, ఉత్సాహపరులూ, అయిన పాండవులతో సంధి చేసికో. ఇది బుద్ధిమంతుడైన ధృతరాష్ట్రునకు కూడా ఇష్టమైనదీ, హితకరమైనదీ అనిపిస్తోంది. పరంతపా ! పితామహుడైన భీష్మునకూ, ద్రోణునకూ, జ్ఞాని అయిన విదురునకూ, కృపునకూ, సోమదత్తునకూ, బాహ్లీకునకూ, అశ్వత్థామకూ, వికర్ణునకూ, సంజయునకూ, వివింశతికీ, నీ కుటుంబీకులకూ, మిత్రులకూ కూడా చాలా ప్రియమైనది. నాయనా ! సంధియే సర్వజగత్తుకూ మేలు చేయగలది. నీవు సద్వంశంలో పుట్టిన వాడవు. బిడియం గలవాడవు. పండితుడవు. సాధుస్వభావుడవు. తల్లిదండ్రుల అనుశాసనంలో ఉండటం మంచిది. భారతా !

తండ్రిమాటయే శ్రేయస్కరమని సజ్జనులు భావిస్తారు. పెద్ద పెద్ద చిక్కులలో పడినవారంతా తండ్రి ఉపదేశాన్నే స్మరిస్తుంటారు. నాయనా! కురుశ్రేష్ఠా! నీ తండ్రికీ, ఆయన మంత్రులకు, పాండవులతో సంధి చేసికొనటమే నచ్చిన పని. నీవు కూడా దానినే ప్రియంగా భావించాలి. **శాస్త్ర సమ్మతమైన మిత్రుల ఉపదేశాన్ని విని కూడా స్వీకరించకపోతే పరిణామకాలంలో అది విషముష్టిని తిన్నట్టు దహించివేస్తుంది.**

మోహానికి చిక్కి, హితవచనాలను ఆదరించని వాడు దీర్ఘ సూత్రుడు. అటువంటివాడు స్వప్రయోజనాన్ని కోలుపోయి పశ్చాత్తాపాన్ని అనుభవిస్తాడు. హితవచనాలను విని ముందుగానే తన దురభిమానాన్ని విడిచి, హితవచనాలను ఆదరించి, ప్రవర్తించినవాడు లోకంలో సుఖంగా ఉన్నతిని పొందగలడు. తన శ్రేయస్సును కోరే వారి మాటలను తనకు ప్రతికూలంగా ఉన్నాయని సహింపక, తనను పొడుచేసే వారి ప్రతికూలవచనాలనే విన్నవాడు శత్రువులకు చిక్కుతాడు. మంచివారి బాటను విడిచి, చెడ్డవారి అభిప్రాయాల ననుసరించి ప్రవర్తించేవాడు వెంటనే బాధలకు లోనవుతాడు. అతనిని చూచి మిత్రులు బాధపడవలసివస్తుంది. ప్రధాను లయిన అమాత్యులను కాదని హీనప్రకృతులను సేవించేవాడు ఘోరమైన ఆపదలలో చిక్కుతాడు. అటువంటివానిని ఉద్ధరించేందుకు ఎవ్వరూ రారు. భారతా ! చెడ్డవారిని సేవిస్తూ, వ్యర్థంగా తిరుగుతూ, మంచి మిత్రుల మాటలను వినక పరులను ఆదరిస్తూ, తన వారిని ద్వేషించే వానిని భూమి పరిత్యజిస్తుంది. అటువంటి నీవు, భరతశ్రేష్ఠా ! ఆ వీరులతో పాండవులతో శత్రుత్వం నెరపుతూ అసమర్థులూ, అశిష్టులూ, మూఢులూ అయిన ఇతరుల నుండి రక్షణను కోరుతున్నావు. ఇంద్రునితో సమానులయి మహారథు లయిన తనవారిని కాదని ఇతరులనుండి రక్షణను కోరేవాడు నీవు తప్ప మరొకడు ఈ లోకంలో ఉండడు. నీవు పుట్టిననాటి నుండీ పాండవులతో వంచనాత్మకంగానే ప్రవర్తిస్తున్నావు. వారు ఎప్పుడూ నీపై కోపగించలేదు. ఆ పాండవులు ధర్మాత్ములు. నాయనా ! నీవు పుట్టిననాటి నుండీ పాండవులతో కపటంగా ప్రవర్తించావు. కానీ కీర్తిమంతులయిన వారు నీ యందు ఎప్పుడూ సద్భావన గలవారే. భరతశ్రేష్ఠా ! నీవు కూడా నీ ముఖ్య బంధువులైన ఆ పాండవులతో ఆ విధంగానే ప్రవర్తించాలి. కోపానికి లోనుకారాదు. ప్రాజ్ఞులు ధర్మ-అర్థ-కామాల కోసం ఏ పనినయినా ప్రారంభిస్తారు. అయితే మూడింటినీ సాధించటం కుదరనప్పుడు ధర్మార్థాలను అనుసరిస్తారు. ప్రత్యేకంగా ధర్మార్థకామాలలో ఏ ఒక్కదానినో పాటించవలసినప్పుడు ధీరుడు ధర్మాన్ని ఎన్నుకొంటాడు. మధ్యముడు

కలహ కారణమైన అర్థాన్ని ఆదరిస్తాడు. మూఢుడు, అధముడు కామాన్ని అనుసరిస్తాడు. ఇంద్రియాలకు లొంగి, లోభవశుడై ధర్మాన్ని పరిత్యజించినవాడు, తగని ఉపాయాలతో అర్థకామాలను పొందగోరుతూ నశిస్తాడు.

కామార్థాలను పొందగోరేవాడు మొదటినుండీ ధర్మాన్నే పాటించాలి. ధర్మాన్ని వదలి అర్థకామాలు ఎప్పుడూ ఉండవు. రాజా ! త్రివర్గమైన ధర్మార్థ కామప్రాప్తికి ధర్మమే ఉపాయం. కాబట్టి **ధర్మం ద్వారా అర్థకామాలను పొందగోరేవాడు ఎండుపొదలో పడిన నిప్పు వలె వెంటనే వృద్ధిపొందుతాడు.** కానీ నీవు సమస్త రాజులలో ప్రఖ్యాతి వహించి, మహోజ్జ్వలంగా ప్రకాశిస్తున్న ఈ విశాలసామ్రాజ్యాన్ని అపమార్గంలో పొందా లనుకొంటున్నావు. రాజా ! చక్కగా వ్యవహరిస్తున్న వారితో అసద్వ్యవహారం కొనసాగించేవాడు గొడ్డలితో అడవిని నరికినట్లు తనను తానే ఖండించుకొంటాడు. మనం పరాభవింపదలచని వ్యక్తుల మనస్సును కలతపెట్టగూడదు. బుద్ధి నశించనప్పుడే మనస్సు శుభకార్యాలలో లగ్నమవుతుంది. భారతా ! అభిమానవంతుడు మూడు లోకాలలోనూ పామరుల నైనను పరాభవించకూడదు. ఇక పాండవుల విషయంలో చెప్పవలసి నదేమున్నది. ఈర్ష్యాసూయలకు లోనైనవాడు ఏ విషయాన్నీ గ్రహించలేడు. చూడు ! ఈర్ష్యాళువు ఎంతటి ప్రమాణాన్ని అయినా విచ్ఛిన్నం చేయాలని చూస్తాడు. నీకు దుష్కార్యులతో మైత్రి కన్న పాండవులతో చెలిమి శ్రేయస్కరం. పాండవులతో ప్రేమతో ప్రవర్తిస్తే నీ కోరికలన్నీ తీరగలవు. రాజశ్రేష్ఠా ! పాండవులు స్థాపించిన రాజ్యాన్ని అనుభవిస్తూ, వారిని వెనక్కునెట్టి నీవు ఇతరుల ద్వారా రక్షణను కోరుతున్నావు. దుశ్శాసనుడు, దుర్విషహుడు, కర్ణుడు, శకుని వీరికి ఆధిపత్యాన్ని అప్పగించి ఔన్నత్యాన్ని పొందా లనుకొంటున్నావు. భారతా ! వీరు జ్ఞాన - ధర్మ-అర్థ విషయాలలో చాలినంతవారు కాదు. పాండవులను ఎదిరించగల పరాక్రమం కూడా వీరికి లేదు. నీవూ, ఈ రాజులందరూ కలిసి కూడా యుద్ధభూమిలో క్రుద్ధుడైన భీమసేనుని ముఖాన్ని చూడను కూడా చూడలేరు.

నాయనా ! నీ దగ్గరున్న ఈ సమస్త రాజబలం, ఈ భీష్ముడు, ద్రోణుడు, కర్ణుడు, కృపుడు, భూరిశ్రవుడు, సోమదత్తి, అశ్వత్థామ, జయద్రథుడు అందరూ కలిసి కూడా అర్జునుని ఎదిరింపలేరు. సమస్త దేవతలూ, రాక్షసులూ, మనుషులు, గంధర్వులూ ఎవ్వరూ కూడా అర్జునుని యుద్ధంలో గెలవలేరు. యుద్ధాన్ని గురించి మనస్సు పెట్టుకొనవలదు. సమస్తరాజుల సేనలలోనూ యుద్ధంలో అర్జునుని ఎదిరించి

క్షేమంగా తిరిగి ఇంటికి చేరగలవారెవరో చూపించు. భారతశ్రేష్ఠా ! జనవినాశనం వలన నీకేమి లాభం? అర్జునుడు ఓడిపోతే పాండవపక్షం మొత్తం ఓడిపోయినట్టే. అటువంటి అర్జునుని గురించి ఆలోచించు. అర్జునుడు ఖాండవవనంలో గంధర్వులు, యక్షులు, అసురులు, నాగులతో కూడిన దేవతల నందరినీ జయించినవాడు. ఆ అర్జునునితో యుద్ధం చేయగలవా డెవడు? అదే విధంగా విరాటనగరంలో అనేకులతో అర్జును డొక్కడే యుద్ధం చేసి గెలిచిన అద్భుతఘటనను వింటూనే ఉన్నాం. భావిపరిణామాన్ని తెలియజేయటానికి నిదర్శనంగా అదొక్కటి చాలు. యుద్ధంలో అర్జునుడు సాక్షాత్తూ పరమేశ్వరునే మెప్పించాడు. అటువంటి అజేయుడూ, ఎదిరింపజాలనివాడూ, జయశీలుడూ, అచ్యుతుడూ, బలశాలి అయిన అర్జునుని యుద్ధంలో గెలవాలని ఆశిస్తున్నావు. అర్జునుడు ఎదురుపడితే సాక్షాత్ దేవేంద్రుడే యుద్ధం చేయాలనుకోడు. మరెవ్వడు అర్జునునితో యుద్ధం చేయదలుస్తాడు ? అర్జునుని సమరంలో గెలవగలవాడు తన చేతులతో భూమిని పైకెత్తి పట్టగలగాలి. కోపంతో సమస్త ప్రజలనూ దహింపగలగాలి. దేవతలనందరినీ స్వర్గం నుండి గెంటి వేయగలగాలి. పుత్రులనూ, సోదరులనూ, దాయాదులనూ, బంధువులనూ అందరినీ గమనించు. నీ కోసం ఈ భారతవంశశ్రేష్ఠులంతా నశించకూడదు. రాజా ! కౌరవవంశం మిగలాలి. ఈ వంశం చిన్నపోగూడదు. కీర్తిని పోగొట్టుకొని నీవు వంశనాశకుడ వనిపించుకోవద్దు. మహారథులయిన ఆ పాండవులు నిన్నే యువరాజును చేస్తారు. నీ తండ్రి ధృతరాష్ట్ర నరపాలుడు మహారాజుగా ఉంటాడు. నాయనా ! నీ ఇంట అడుగుపెట్ట దలచిన రాజ్యలక్ష్మిని పరాభవించవద్దు. పాండవులకు సగభాగాన్ని ఇచ్చి మిగిలిన విశాల సంపదను నీవు పొందు. పాండవులతో సంధి చేసికొని, హితుల మాటలను పాటిస్తూ, మిత్రులతో ఆనందంగా గడుపుతూ చిరకాలం శుభంగా ఉండు."

125. భీష్మద్రోణవిదుర ధృతరాష్ట్రులు దుర్యోధనునకు నచ్చజెప్పుట.

శ్రీకృష్ణుని మాటలు విని శంతనుసుతుడైన భీష్ముడు అసహనశీలి అయిన దుర్యోధనునితో ఇలా అన్నాడు. "నాయనా ! సోదరుల మధ్య సంధిని కోరుతూ శ్రీకృష్ణుడు చెప్పిన మాటలను స్వీకరించు. క్రోధానికి లొంగిపోవద్దు. మహాత్ముడైన

శ్రీకృష్ణుని మాటలను తిరస్కరించి శ్రేయస్సును కానీ, సుఖాన్ని కానీ, శుభాన్ని కానీ ఎప్పుడూ పొందలేవు. నాయనా ! మహాబాహువయిన శ్రీకృష్ణుడు ధర్మార్థసమ్మత మయిన మాట చెప్పాడు. రాజా ! దాన్ని పాటించు. ప్రజావినాశనం చేయవద్దు. ఈ భారతవంశరాజ్యలక్ష్మి సమస్తరాజలోకంలో ప్రకాశిస్తున్నది. కానీ నీవు, ధృతరాష్ట్రమహారాజు జీవించి ఉండగానే నీ దుర్మార్గంతో పతనం కలిగిస్తున్నావు. నీ అహంకారబుద్ధి కారణంగా నీవు, పుత్రులు, సోదరులు, బంధువులు, అమాత్యులతో సహా జీవితాన్ని పతనం చేసికొంటున్నావు. భారతశ్రేష్ఠ ! శ్రీకృష్ణుని మాట సత్యమూ, సార్థకమూ కూడా. దానినీ, నీ తండ్రి మాటనూ, ధీమంతుడైన విదురుని మాటనూ కాదని దారి తప్పవద్దు. వంశనాశకుడవై, దుర్మతివై తల్లిదండ్రులను కూడా శోకసాగరంలో ముంచవద్దు." అప్పుడు అసహనానికిలోనై, పదే పదే నిట్టూరుస్తున్న దుర్యోధనునితో ద్రోణుడు ఇలా అన్నాడు. "నాయనా ! శ్రీకృష్ణుడు నీకు ధర్మార్థసంగత మయిన మాట చెప్పాడు. రాజా ! శంతనుసుతుడు భీష్ముడు కూడా ఆ విధంగానే చెప్పాడు. దానిని విను. రాజా ! ప్రాజ్ఞులూ, మేధావులూ, జితేంద్రియులూ, పండితులూ, నీ హితాన్ని కోరేవారూ అయిన శ్రీకృష్ణభీష్ములు హితకరమైన మాట చెప్పారు. దానిని గ్రహించు. మహాప్రాజ్ఞా! కృష్ణ భీష్ములు చెప్పిన మాటలను ఆచరించు.

(అల్పబుద్ధుల మాటలపై ఆధారపడవద్దు)

బుద్ధి చలించి శ్రీకృష్ణుని అవమానించవద్దు. నిన్ను యుద్ధానికి ప్రోత్సహిస్తున్న వారెవరూ ఎన్నడూ పనికి వచ్చేవారు కాదు. యుద్ధకాలంలో శత్రుత్వభారాన్ని ఇతరులమెడలపై పడవేసేవారే. సమస్త ప్రజలనూ, పుత్రులనూ, సోదరులనూ చంపుకోవద్దు. శ్రీకృష్ణార్జునులు ఉన్న పక్షం యుద్ధంలో అజేయమని గ్రహించు. నాయనా ! నిజంగా నీ హితాన్ని కోరుతున్న కృష్ణభీష్ముల అభిప్రాయ మిదే. ఇప్పుడు స్వీకరించకపోతే తరువాత బాధపడవలసివస్తుంది. అర్జునుడు పరశురాముడు చెప్పిన దానికన్నా ఎక్కువే. దేవకీసుతుడైన శ్రీకృష్ణుడు దేవతలకు కూడా సహింపరానివాడు. భరతర్షభా! నీకు సుఖాన్ని, మేలునూ కల్గించే మాటలు చెప్పి ఏం లాభం. చెప్పవలసినదంతా చెప్పాను. నీకు ఎలా తోస్తే అలా చేసికో. నీకు ఇంతకు మించి చెప్పటానికి నాకు ఉత్సాహం లేదు." ద్రోణుని మాటలు ముగియగానే అసహనశీలి అయిన దుర్యోధనునితో విదురుడిలా అన్నాడు.

"దుర్యోధనా! నీ గురించి నాకు చింత లేదు. కానీ వృద్ధు లయిన నీ తల్లిదండ్రులను గురించి ఆలోచిస్తున్నాను. నీ వంటి దుష్టబుద్ధి సహాయంతో జీవించవలసివచ్చిన వీరు, మిత్రులూ, మంత్రులూ అందరూ మరణించిన తర్వాత అనాథలై రెక్కలు తెగిన పక్షులవుతారు. వంశనాశకుడవు, పాపాత్ముడవూ అయిన నీవంటి చెడ్డకొడుకును కన్నందుకు బాధపడుతూ భిక్షుకులై అడుక్కు తింటూ లోకమంతా తిరగవలసివస్తుంది." అప్పుడు సోదరులతో కలసి రాజుల మధ్యలో కూర్చొని ఉన్న దుర్యోధనునితో ధృతరాష్ట్రమహారాజు ఇలా అన్నాడు. "దుర్యోధనా ! మహాత్ముడైన శ్రీకృష్ణుడు చెప్పినది విను. అది శుభంకరమూ, యోగక్షేమకరమూ, ఎప్పటికైనా ఉపయోగపడునదీ. అనాయాసంగా ఎంతపనినైనా సాధించగల ఈ శ్రీకృష్ణుని సహకారంతో, సమస్త రాజులచేతనూ మన్నింపబడి మన కోరికలను సఫలం చేసికొనవచ్చు. నాయనా ! శ్రీకృష్ణునితో కలిసి ధర్మరాజు దగ్గరకు వెళ్ళు. భారతవంశానికి ఏ వినాశనమూ లేకుండా పరిపూర్ణశుభాలను సాధించుకో. నాయనా ! శ్రీకృష్ణుని సాధనం చేసుకొని సంధి కుదుర్చుకో. ఇదే నీకు ఇప్పటికి తగిన పనిగా నేననుకొంటున్నాను. నా ఆదేశాన్ని అతిక్రమించవద్దు. నీవు నీ హితాన్ని కోరియే, సంధిని అభ్యర్థిస్తూ మాటాడుతున్న శ్రీకృష్ణుని మాటలను తిరస్కరిస్తే, నీకు పరాభవం తప్పదు."

126. భీష్మద్రోణులు దుర్యోధనునకు మరల నచ్చజెప్పుట.

ధృతరాష్ట్రుని మాటలు విని భీష్మద్రోణులు ఒకే తీరున కలతపడుతూ పెద్దల మాటలను అతిక్రమిస్తున్న సుయోధనునితో ఇలా అన్నారు. "నాయనా! కృష్ణార్జునులు యుద్ధానికి సంసిద్ధులు కాకముందే, గాండీవాన్ని ఎక్కుపెట్టక ముందే, ధౌమ్యుడు తన మేధాగ్నితో శత్రుబలాన్ని ధ్వేక్షకముందే, బిడియపడే స్వభావం గల మహాధనుర్ధరుడైన ధర్మరాజు కోపంతో నీ సేనను చూడకముందే జనవినాశనకారణం సమసిపోవాలి. గొప్పవిలుకాడైన భీమసేనుడు తన సేనకు ముందు నిలిచి కనిపించకముందే జనవినాశనసంకల్పం శమించాలి. చేత గదను పట్టిన భీమసేనుడు నీ సేనను సంహరిస్తూ రణభూమిలో వివిధగతులతో సంచరించక ముందే పాండవులతో సంధిచేసికో. భీమసేనుడు శత్రువులను తుదముట్టించగల గదతో ఏనుగుల నెక్కి యుద్ధంచేస్తున్న వీరుల తలలను పండ్లను రాలగొట్టినట్టు రాలగొట్టుతున్నప్పుడు నీ రణాభిలాష నశిస్తుంది.

నకులుడు, సహదేవుడు, ద్రుపదునికొడుకు ధృష్టద్యుమ్నుడు, విరాటుడు, శిఖండి, శిశుపాలుని కొడుకు ధృష్టకేతువు - అస్త్రవిద్యానిపుణులయిన ఈ వీరులందరూ కవచాలు ధరించి మహాసముద్రంలో మొసళ్ళు ప్రవేశించినట్లు నీ సేనలలో ప్రవేశించకముందే నీ జనవినాశన సంకల్పం నశించాలి. ఈ రాజుల సుకుమార శరీరాలపై ఉగ్రస్వరూపం గల బాణాలు పడకముందే నీ యుద్ధసంకల్పం సమసిపోవాలి.

దగ్గర కాకముందే లక్ష్యాన్ని దెబ్బ తీయగలవారూ, వేగంగా బాణాలను ప్రయోగించగలవారు, సుదూరలక్ష్యాన్ని కూడా ఛేదించగలవారూ, అస్త్రవిద్యాధురంధరులూ, అయిన నీ శత్రువీరులు చందనాగరులేపనం గలిగి హారనిష్కాలతో ప్రవేశిస్తున్న నీ సేనల గుండెలపై పెద్ద పెద్ద బాణాల వర్షాన్ని కురిపించకముందే నీ యుద్ధాలోచనను విరమించాలి. నీవు శిరస్సువంచి నమస్కరిస్తే రాజశ్రేష్ఠుడూ, ధర్మనందనుడూ అయిన యుధిష్ఠిరుడు నిన్ను చేతులతో దగ్గరకు తీసికోవాలని మేము ఆశిస్తున్నాము. భరతశ్రేష్ఠా! సుదక్షిణుడు అయిన ధర్మరాజు ధ్వజాంకుశ పతాకల గుర్తులుగల తన దక్షిణ బాహువును జగత్ప్రశాంతికై నీ భుజంపై వేయాలని మా ఆకాంక్ష. నీ దగ్గర కూర్చొని రత్నౌషధులతో కూడిన ఎత్తని తన అరచేతితో యుధిష్ఠిరుడు నీ వీపుపై మెల్లగా నిమరాలి. భరతశ్రేష్ఠా! సాలవృక్షపు బోదెల వంటి భుజాలుగల మహాబాహువు వృకోదరుడు శాంతిస్థాపనకై నిన్ను దగ్గరకు తీసికొని సాంత్వన వచనాలు పలకాలి. రాజా! అర్జున నకుల సహదేవుల ప్రణామాలు స్వీకరించి వారి శిరస్సుల నాఘ్రాణించి ప్రేమపూర్వకంగా వారితో నీవు మాటాడాలి. వీరులూ, నీ సోదరులూ అయిన పాండవులతో నీవు కలిసి ఉంటే చూచి రాజులంతా ఆనంద బాష్పాలను రాల్చాలి. భూపాలుర రాజధాను లన్నింటిలో కౌరవపాండవ వ్యవహారం సుసంపన్నమైనట్లు ప్రకటింపజేయి. నీవూ, యుధిష్ఠిరుడూ సోదర భావంతో రాజ్యాన్ని అనుభవించండి. నీ చింతలన్నీ తొలగించుకో."

127. శ్రీకృష్ణునకు దుర్యోధనుడు సమాధాన మిచ్చుట.

కౌరవసభలో తనకు నచ్చని మాటలను విని దుర్యోధనుడు యశస్వీ, మహాబాహువూ అయిన శ్రీకృష్ణునితో ఇలా అన్నాడు. "శ్రీకృష్ణా! ఇటువంటి విషయాలు చక్కగా పరిశీలించి మాటాడాలి. కానీ నీవు నన్ను ప్రత్యేకంగా దోషిని చేసి మాటాడుతున్నావు. మధుసూదనా! నీవు పాండవుల భక్తిభావానికి విలువనిచ్చి నిష్కారణంగా మమ్ములను

నిందిస్తున్నావు. ఇది మా బలాబలాలను సమీక్షించే చేస్తున్నావా? నీవూ, విదురుడూ, మహారాజూ (ధృతరాష్ట్రుడు), ద్రోణుడూ, భీష్ముడూ అందరూ నన్నే నిందిస్తున్నారు. మరే రాజునూ ఏమీ అనటం లేదు. కానీ నాలో ఏదోషమూ నాకు కనిపించటంలేదు. అయినా ధృతరాష్ట్రమహారాజుతో సహా మీరంతా నన్నే నిందిస్తున్నారు. కేశవా! నేను ఎంతో ఆలోచించి చూస్తున్నాను. అయినా నాకు నాలో చిన్న తప్పుకూడా కనిపించటం లేదు. మధుసూదనా! పాండవులకు జూదం ఇష్టం. అందుకని ఆడారు. శకుని వాళ్ళ రాజ్యాన్ని గెలుచుకున్నాడు. ఇందులో నా తప్పేముంది? మధుసూదనా! పాండవులు జూదంలో పోగొట్టుకొన్న ధనాన్ని అంతా అప్పుడే వారికి తిరిగి ఇచ్చాము. జయశీలా! అజేయులయిన పాండవులు జూదంలో ఓడి పోయి అరణ్యాలకు వెళ్ళవలసివస్తే అందులో మా తప్పేమున్నది. కృష్ణా! మేము ఏం తప్పు చేశామని అశక్తు లయిన ఆ పాండవులు శత్రువులతో కలిసి మమ్ము ద్వేషిస్తున్నారు? పైపెచ్చు సహజశత్రువులవలె ఆనందంగా ఉన్నారు. మేము వారికేం అపకారం చేశాం? మేము ఏ తప్పు చేశామని ఆ పాండవులు స్ంజయులతో కలిసి మమ్ము చంపాలనుకొంటున్నారు? తీక్ష్ణమయిన మాటలకో, చేతలకో భయపడి మేము క్షత్రధర్మాన్ని వీడి, సాక్షాత్తూ ఇంద్రుని దగ్గర అయినా తలవంచలేము. శ్రీకృష్ణా! యుద్ధంలో మమ్ముల నందరినీ జయించాలని సాహసం చేసే క్షత్రియవీరుడు నాకింతవరకు కనిపించలేదు. భీష్మ కృప ద్రోణకర్ణులను యుద్ధంలో గెలవటం దేవతలకు కూడా శక్యంకాదు. ఇక పాండవుల విషయంలో చెప్పేదేముంటుంది? మాధవా! స్వధర్మంమీదనే దృష్టి నుంచి యుద్ధంలో ఏదో సమయంలో ఆయుధాల దెబ్బలకు ఒకవేళ మేము మరణించవచ్చు. అప్పు డయినా స్వర్గప్రాప్తి కలుగుతుంది. జనార్దనా! రణరంగంలో మేము ఒకవేళ అంపశయ్యపై పడుకొన వలసివచ్చినా అది క్షత్రియులమైన మాకు ప్రధానధర్మమే.

మాధవా! ఒకవేళ మేము యుద్ధంలో శత్రువులకు లొంగక వీరమరణాన్ని పొందినా మావాళ్ళెవ్వరూ బాధపడరు. ఉత్తమవంశంలో పుట్టి క్షత్రియధర్మాన్ని అనుసరిస్తూ ఈ విధంగా భయపడి ఎక్కడైనా, ఎప్పుడైనా శత్రువులకు తలవంచే వీరు డుంటాడా? వీరుడు ఉద్యమించాలే కానీ లొంగిపోకూడదు. ఉద్యమమే పౌరుషం. మంచిరోజు కానప్పుడు నష్టపోవచ్చు కానీ ఎప్పుడూ శత్రువులకు తలవంచకూడదు. తమ శ్రేయస్సును కోరుకొనే వారెవరైనా ఈ మాతంగముని వచనాన్నే పాటిస్తారు. **నావంటివాడు**

ధర్మం దగ్గర, బ్రాహ్మణులదగ్గర మాత్రమే తలవంచుతాడు. మరో ఆలోచన లేకుండా జీవితాంతమూ ఇటువంటి ఆలోచనతోనే (ఉద్యమంతోనే) ఉండాలి. అదే క్షత్రియధర్మం. నా అభిప్రాయం కూడా అదే. కేశవా! మా తండ్రి గతంలో నాకిచ్చిన రాజ్యభాగాన్ని నేను జీవించివుండగా మరెవ్వరూ పొందలేరు. జనార్దనా! ధృతరాష్ట్రమహారాజు జీవించినంతకాలం మేమైనా, వారైనా కత్తులు దూయక ప్రశాంతంగా జీవించాలి. వృష్ణినందనా! మొట్టమొదట పాండవులకు రాజ్యభాగమిచ్చారు. ఆనాడే అది తగని పని. కానీ నేనప్పటికి బాలుణ్ణి పరాధీనుణ్ణి. అజ్ఞానం వలననో, భయంవల్లనో నాడు మా తండ్రి ఇచ్చిన రాజ్యాన్ని మరల ఈనాడు పాండవులకు ఇవ్వడం దుర్లభం. కేశవా! ఇప్పుడు మహాబాహుడనైన నేను జీవించి ఉండగా వాడిసూదిమొన మోపినంత భూభాగాన్ని కూడా పాండవులకు వదలను."

128. శ్రీకృష్ణుడు దుర్యోధనుని నిందించుట.

వైశంపాయనుడిలా అన్నాడు. – "దుర్యోధనుని మాటలు విని శ్రీకృష్ణుని కళ్ళు కోపంతో ఎరుపెక్కాయి. ఆపై ప్రశాంతుడై శ్రీకృష్ణుడు కౌరవసభలో దుర్యోధనునితో ఇలా అన్నాడు." నీవు రణరంగంలో వీరశయ్యనే పొందగలవు. నీ ఈ కోరిక తీరగలదు. నీ మంత్రులతో కలిసి ధైర్యంగా ఉండు. తీవ్రంగా జనవినాశనం జరగబోతోంది. మూర్ఖుడా! పాండవుల విషయంలో నీవు చేసిన అపరాధ మేమీ లేదని అనుకొంటున్నావు. దాన్ని పూర్తిగా వివరిస్తాను. రాజులారా! తమరు కూడా సావధానులై వినండి. పాండవుల సంపదలను చూచి ఓర్వలేక శకునితో కలిసి పాండవులతో జూదమాడాలన్న కుట్ర చేశావు. అలా కాకపోతే సరళ స్వభావులై, సాధుసమ్మాన్యులైన నీ శ్రేష్ఠ బంధువులు పాండవులు ఇక్కడ నీవంటి కపటితో అన్యాయమైన జూదాన్ని ఆడటానికి సిద్ధపడతారా? మహాప్రాజ్ఞా! జూదం సజ్జనుల బుద్ధిని కూడా నాశనం చేయగలది. ఇక దుర్జనుల కయితే కలహాలూ, కలతలూ కలుగుతాయి. నీవు సదాచారాన్ని గుర్తించక, పాపాత్ములతో కలిసి తీవ్రమయిన కలతలకు కారణమైన ఈ ద్యూతక్రీడను ఏర్పాటుచేశావు. ద్రౌపదిని సభకు పిలిపించి ఆమెతో నీవు మాటాడిన రీతిగా, అన్న భార్యతో అనుచితాలు మాటాడేవాడు ఇంకెవడైనా ఉంటాడా? ఉన్నతవంశంలో పుట్టి, శీలసంపద కలిగి పాండవుల పట్టమహిషియై, వారి ప్రాణాలకన్న మిన్న అయిన ద్రౌపదినే నీవు అంతగా

పరాభవించావు. శత్రుసంహారం చేయగల ఆ పాండవులు అరణ్యవాసానికి బయలుదేరినప్పుడు కౌరవసభలో దుశ్శాసనుడు వారితో పలికిన కఠోర వచనాలు కౌరవు లందరికీ తెలుసు. ఎల్లప్పుడూ ధర్మాన్ని పాటిస్తూ, పేరాసకు లోనుగాక చక్కని నడవడిగలిగిన బంధువుల దగ్గర మంచివాడెవడైనా అనుచితంగా ప్రవర్తిస్తాడా? నీవూ, కర్ణుడూ, దుశ్శాసనుడూ కలిసి ఎన్నోసార్లు క్రూరులూ, అనాగరకులూ మాటాడినట్టు (పాండవులను గూర్చి) మాటాడారు.

నీవు వారణావతంలో బాలకులైన పాండవులను తల్లితో సహా తగులబెట్టాలని ఎంతో ప్రయత్నించావు. కానీ నీ ప్రయత్నం ఫలించలేదు. అప్పట్లో పాండవులు చాలా కాలం తల్లితోపాటు ఏకచక్రపురంలో ఒక బ్రాహ్మణుని ఇంటిలో దాగి, ఉండవలసివచ్చింది. నీవు (భీమునకు) విషం పెట్టి, పాములతో కరిపించి.... అన్ని ఉపాయాలను వినియోగించి పాండవులను నాశనంచేయాలని ప్రయత్నించావు. అయితే ఆ ప్రయత్నం కూడా ఫలించలేదు. ఈ విధంగా పాండవుల విషయంలో నీవెప్పుడూ కపటంగానే ప్రవర్తించావు. అయినా మహాత్ము లయిన ఆ పాండవుల విషయంలో నీ తప్పేమీ లేదా? పాపాత్ముడా! పాండవులు యాచిస్తుంటే పైతృకమయిన వారి రాజ్యభాగాన్ని వారికివ్వటానికి నిరాకరిస్తున్నావు. కానీ యుద్ధభూమిలో పడిపోయి, అధికారభ్రష్టుడ వైనప్పుడు వారి భాగాన్నే వారి కివ్వవలసివస్తుంది. పాండవుల విషయంలో క్రూరుడిలాగా ఎన్నో అకార్యాలు చేసి నీ కపటతను, అనాగరకతనూ ప్రదర్శించి కూడా ఇప్పుడు ఆ తప్పులేవీ తెలియనట్టు మాటాడుతున్నావు. రాజా! నీ తల్లి, తండ్రి, భీష్ముడూ, ద్రోణుడూ, విదురుడు సంధి చేసికొమ్మని పదేపదే చెపుతున్నా నీవు సంధికి సిద్ధపడటం లేదు. రాజా! శాంతి వలన నీకూ, యుధిష్ఠిరునకూ – ఉభయపక్షాలకూ ఎంతో లాభముంటుంది. కానీ నీవు దాని నిష్టపడటం లేదు. అది నీ తెలివితక్కువతనం కాక మరేమనగలం? రాజా! శ్రేయోభిలాషు లయిన మిత్రుల మాటలను కాదని సుఖపడలేవు. నీవు ధర్మవిరుద్ధంగా అపకీర్తి కలిగేటట్టుగా ప్రవర్తిస్తున్నావు."

అసహనశీలి అయిన దుర్యోధనునితో శ్రీకృష్ణుడు ఇలా అంటున్న సమయంలోనే కౌరవసభలో దుశ్శాసనుడు ఈ విధంగా పలికాడు. "రాజా! నీ అంతట నీవుగా పాండవులతో సంధిచేసికొనకపోతే కౌరవులే నిన్ను బంధించి యుధిష్ఠిరుని చేతిలో పెడతారేమో అనిపిస్తోంది. మనుజశ్రేష్ఠా! భీష్మపితామహుడూ, ద్రోణాచార్యుడూ, మన

తండ్రి కలిసి కర్ణుడినీ, నిన్నూ, నన్నూ, ముగ్గురినీ పాండవుల వశం చేసేస్తారు."

సోదరుడు పలికిన ఈ మాటలను విని సుయోధనుడు కోపించి, పెనుపాములె దీర్ఘనిశ్వాసాలను విడుస్తూ లేచి అక్కడనుండి బయలుదేరాడు. బుద్ధిహీనుడూ, లజ్జాహీనుడూ, పెద్దలను పరాభవించేవాడూ, మర్యాదలెరుగనివాడు, అభిమాని అయిన సుయోధనుడు అనాగరకునివలె విదుర, ధృతరాష్ట్ర, బాహ్లిక కృప, సోమదత్త, భీష్మ, ద్రోణ, కృష్ణులను తృణీకరించి అక్కడనుండి వెళ్ళటానికి ఉద్యుక్తుడయ్యాడు. సుయోధనుడు నిష్క్రమించటాన్ని చూచి సోదరులూ, మంత్రులూ, రాజులూ అందరూ లేచి సుయోధనుణ్ణి అనుసరించారు. సభలో కోపంగా లేచి, సోదరులతో కూడా వెళ్ళిపోవటానికి బయలుదేరిన దుర్యోధనుని చూచి శంతనునందనుడైన భీష్మ డిలా అన్నాడు.

"ధర్మార్థాలను విడనాడి కోపాన్ని అనుసరించినవ్యక్తి అచిరకాలంలోనే కష్టాల పాలవుతాడు. అది చూచి శత్రువులంతా పరిహసిస్తారు. ధృతరాష్ట్రుని కొడుకు ఈ దుర్యోధనుడు దురాత్ముడు. కానిదారిలో కార్యసిద్ధికి ప్రయత్నించేవాడు. క్రోధలోభాలకు లొంగినవాడు. తానే రాజు కావాలని నిరర్థకమైన అభిమానానికి లోనయినవాడు. జనార్దనా! క్షత్రియగణమంతా పండిన పండ్లవలె మృత్యుముఖంలో పడబోతున్నారు. అందువలననే అందరూ తమ తమ మంత్రులతో సహా దుర్యోధనుని అనుసరిస్తున్నారు." భీష్ముని మాటలను విని, పరాక్రమశాలి, పుండరీక నేత్రుడయిన శ్రీకృష్ణుడు భీష్మద్రోణాదులందరితో ఇలా అన్నాడు. "బుద్ధిహీనుడైన దుర్యోధనుని రాజును చేసి ఇప్పుడు బలవంతంగా అయినా అతనిని నియంత్రించలేకపోవటం కురువృద్ధులు అందరూ చేస్తున్న పెద్ద పొరపాటు. దీనికి తగిన సమయోచిత మయిన కర్తవ్యాన్ని నేను ఆలోచిస్తున్నాను. నా మాటమేరకు చేస్తే అందరికీ మంచిది. వివరంగా చెప్తాను వినండి.

అంతా మీరు చూస్తూనే ఉన్నారు. హితవచనాన్ని చెప్పబోతున్నాను. అది అనుకూలంగా ఉన్నదని మీకనిపిస్తే నచ్చితే దానిని పాటించవచ్చు. భోజరాజు ఉగ్రసేనుడు. ఆయన కొడుకు కంసుడు దురాచారుడు, నిగ్రహం లేనివాడు. తండ్రి వృద్ధుడై జీవించి ఉండగానే ఆయన అధికారాన్ని హరించి రాజయ్యాడు. తత్ఫలితంగా మరణించాడు. ఉగ్రసేనుని కొడుకయిన కంసుని బంధువులంతా విడిచిపెట్టారు. ఆ బంధువుల హితాన్ని కోరి నేను ఘోరయుద్ధంలో ఆ కంసుని సంహరించాను. ఆ

తరువాత జ్ఞాతుల మయిన మేమంతా భోజవంశరాజుల ఔన్నత్యాన్ని వర్ధిల్లజేయగల ఉగ్రసేనుని సత్కారపూర్వకంగా రాజును చేశాం. భరతనందనా! వంశ సంరక్షణకై కంసుని ఒక్కని పరిత్యజించి, అంధకవృష్ణివంశస్థులైన సర్వయాదవులూ ఒక్కటై సుఖంగా వృద్ధిపొందుతున్నారు. రాజా! ఇంతేకాదు. ఒకప్పుడు ప్రజాపతి అయిన బ్రహ్మ చెప్పిన దానినే చెప్తున్నాను. దేవాసురులు యుద్ధానికి సిద్ధపడి ఉన్నారు. ఆయుధాలనెత్తి పట్టారు. లోకమంతా రెండు ముక్కలుగా చీలి వినాశానికి సిద్ధమైంది. అప్పుడు సృష్టికర్త, లోకభావనుడైన బ్రహ్మ ఇలా అన్నారు. - ఈ యుద్ధంలో అసురదైత్యదానవులు ఓడిపోతారు. ఆదిత్యులు, వసువులు, రుద్రులు, మొదలయిన దేవతలు గెలుస్తారు. దేవతలు, అసురులు, మనుష్యులూ, గంధర్వులూ, నాగులు, రాక్షసులూ, ఒకరినొకరు చంపుకొంటారు. అని భావించిన పరమేష్ఠి "ఈ దైతేయదానవులను బంధించి వరుణ దేవుని అధీనంలో ఉంచు" అని (యమ) ధర్మరాజును ఆదేశించారు. బ్రహ్మ ఆ విధంగా ఆజ్ఞాపించిన తరువాత ధర్మరాజు పితామహుని ఆజ్ఞ ననుసరించి దైతేయదానవుల నందరినీ బంధించి వరుణునికి అధీనం చేశాడు. జలాధిపతి అయిన వరుణుడు ధర్మపాశాలతోనూ, వరుణపాశాలతోనూ వారిని బంధించి సాగరంలో అనునిత్యమూ సావధానుడై దానవులను హద్దులలోనే నిలుపుతున్నాడు. అదే విధంగా దుర్యోధనునీ, కర్ణునీ, సౌబలుడైన శకునినీ, దుశ్శాసనునీ బంధించి పాండవుల వశం చేయండి.

వంశంకోసం వ్యక్తినీ, గ్రామంకోసం వంశాన్నీ, జనపదం కోసం గ్రామాన్నీ, తనకోసం భూమండలాన్ని అయినా వదిలివేయాలి.* రాజా! దుర్యోధనుని బంధించి ఆ తర్వాత పాండవులతో సంధి చేసికో. పురుషశ్రేష్ఠా! నీ కారణంగా క్షత్రియులు నశించరాదు."

129. ధృతరాష్ట్రుడు గాంధారిని పిలిపించుట - ఆమె దుర్యోధనునకు బోధచేయుట.

శ్రీకృష్ణుని మాటవిని ధృతరాష్ట్రమహారాజు సర్వధర్మవేత్త అయిన విదురునితో వెంటనే ఇలా అన్నారు. "నాయనా! వెళ్ళు. బుద్ధిమతీ ! దీర్ఘదర్శిని అయిన గాంధారిని

* త్యజేత్ కులార్థే పురుషం గ్రామస్యార్థే కులం త్యజేత్ ।
గ్రామం జనపదస్యార్థే ఆత్మార్థే పృథివీం త్యజేత్ ॥ 49

తీసికొనిరా. ఆమెను కలుపుకొని దుర్మతి అయిన సుయోధనునికి నచ్చజెప్పే ప్రయత్నం చేస్తాను. ఆమె అయినా దుష్టబుద్ధిగల ఈ దుర్మార్గుణ్ణి శాంతింపజేయగలిగితే మనమంతా మన మేలుకోరే శ్రీకృష్ణుని మాటను అనుసరిద్దాం. దుర్యోధనుడు లోభానికి లోనయినవాడు. దుర్బుద్ధిగలవాడు. అతని సహాయకులు కూడా దుర్మార్గులే. గాంధారి శాంతికై తగిన మాటలు చెప్పి సుయోధనుని సరి అయిన మార్గంలో పెట్టవచ్చు. ఆ విధంగా జరిగితే దుర్యోధనుని కారణంగా కలిగిన ఈ మహాఘోరవిపత్తునుండి శాశ్వతంగా మనం బయటపడవచ్చు. చిరస్థాయులయిన యోగక్షేమాలను పొందవచ్చు." ధృతరాష్ట్రుని మాటను విని రాజాదేశం మేరకు విదురుడు దీర్ఘదృష్టిగల గాంధారిని తీసికొనివచ్చాడు. ధృతరాష్ట్రుడిలా అన్నాడు "గాంధారీ! ఈ నీ కొడుకు దురాత్ముడై పెద్దల ఆదేశాలను అతిక్రమిస్తున్నాడు. ఐశ్వర్యలోభం వలన ఉన్న ఐశ్వర్యాన్ని, ప్రాణాలనూ కూడా పొగొట్టుకొనబోతున్నాడు. మర్యాదల నతిక్రమించిన ఈ దురాత్ముడు నీ కొడుకు శ్రేయోభిలాషు లయిన మంచివారి మాటలను కూడా లెక్కచేయక పాపాత్ములయిన తన అనుచరులతో కలిసి మూఢుడై సభ నుండి వెళ్ళిపోయాడు." భర్తమాటను విని యశస్విని, రాజపుత్రి అయిన గాంధారి మహాశ్రేయస్సును కాంక్షిస్తూ ఇలా అన్నది.

"రాజ్యకాముకుడై వేగిరపడుతున్న కుమారుని వెంటనే పిలిపించండి. ధర్మార్థాలు లోపించిన చెడ్డవాడెవ్వడూ రాజ్యాన్ని పొందలేడు. అయినా కూడా సర్వవిధాలా అవినీతుడయిన ఆ సుయోధనుడు రాజ్యపీఠాన్ని పొందాడు. మహారాజా! ధృతరాష్ట్రా! ఈ విషయంలో పుత్రప్రేమగల నిన్నే ఎక్కువగా నిందించాలి. వాడు దుర్మార్గుడని తెలిసి కూడా వాడి ఆలోచనలనే అనుసరిస్తున్నారు. రాజా! అటువంటి సుయోధనుడు కామక్రోధాలకు లోనయి ఉన్నాడిప్పుడు. లోభంలో చిక్కుకొని ఉన్నాడు. బలపూర్వకంగా ఇప్పుడు వెనుకకు మరలించటం వీలుకాదు. మూఢుడూ, అజ్ఞానీ, దుర్మార్గుడూ, లుబ్ధుడూ, దుష్టమిత్రుడూ అయిన దుర్యోధనునకు రాజ్యప్రదానం చేసిన దాని ఫలితాన్ని ధృతరాష్ట్రుడు ఇప్పుడు అనుభవిస్తున్నాడు. ఏ రాజయినా తనవారిలోనే విభేదాలు రావటాన్ని ఎలా ఉపేక్షించగలడు? తన వారితో విభేదాలు తెచ్చుకొన్న నిన్ను శత్రువులు అపహాస్యం చేస్తారు. మహారాజా! సామభేదోపాయాలలో ఒకదానితో దాటిపోగల ఆపద విషయంలో తన వారిపై దండోపాయాన్ని ఎవరైనా ప్రయోగిస్తారా?" గాంధారీ ధృతరాష్ట్రుల ఆజ్ఞమేరకు విదురుడు అసహనశీలి అయిన దుర్యోధనుని మరల సభలో ప్రవేశపెట్టాడు.

దుర్యోధనుని కళ్ళు కోపంతో ఎఱ్ఱబారి ఉన్నాయి. పాములాగా బుసకొడుతూ కూడా తల్లిమాట వినాలని మరల సభలో ప్రవేశించాడు. దారితప్పిన తన కొడుకు మరల సభలో ప్రవేశించటాన్ని చూచి, గాంధారి అతనిని అభిశంసిస్తూ శాంతిస్థాపనకై ఇలా అన్నది. "వత్సా! దుర్యోధనా! నా మాట విను. ఇది నీకూ, నీవారికీ కూడా హితాన్ని కల్గించగలది. భవిష్యత్తులో కూడా సుఖాన్ని కల్పించగలది. భరతసత్తమా! మీ తండ్రీ, భీష్ముడూ, ద్రోణుడూ, కృపుడూ, విదురుడూ చెప్పినట్టు చేయి. ఈ నీ హితైషుల మాటలను పాటించు. నీవు శాంతించితే భీష్మునీ, మీ తండ్రినీ, నన్నూ, ద్రోణాదులయిన హితాభిలాషులనూ సత్కరించినట్లే. మహామతీ! రాజ్యాన్ని మన ఇష్టం వచ్చినట్లు పొందటం కానీ, రక్షించటం కానీ అనుభవించటం కానీ కుదిరేది కాదు. **జితేంద్రియుడు కానివాడు చిరకాలం రాజ్యాన్ని అనుభవించలేడు. కాబట్టి తనను తాను జయించిన మేధావియే రాజ్యపాలన చేయాలి.** కామక్రోధాలు పురుషుని అర్థసిద్ధికి దూరం చేస్తాయి. ఆ ఇద్దరు శత్రువులను జయించిన రాజే భూమిపై గెలుపు పొందగలడు. ప్రభుత్వం అన్నది చాలా గొప్పది. రాజ్యమన్న పేరుతో దురాత్ములు ఆ స్థానాన్ని అభిలషిస్తారు. కానీ ఆ రాజ్యాన్ని రక్షించటం వీలుకాని విషయం. మహాస్థానాలను పొందదలచినవాడు తన ఇంద్రియాలను అర్థధర్మాల విషయంలో నియంత్రించాలి. ఇంద్రియాలను అదుపుచేసినప్పుడే ఇంధనంతో అగ్ని మండినట్లు బుద్ధి ప్రజ్వరిల్లుతుంది. పాగరెక్కిన గుఱ్ఱాలను అదుపుచేయలేని కుసారథిని అవి మార్గమధ్యంలోనే చంపగలిగినట్టు ఇంద్రియాలు నియంత్రణలో లేకపోతే మనుష్యుని నశింపజేస్తాయి. తనను తాను గెలువక అమాత్యులను జయించగోరేవాడు, మంత్రులను గెలవకుండా శత్రువులను గెలువగోరేవాడు, వివశుడై వంచితుడు అవుతాడు. ముందుగా తాను తననే శత్రువుగా ప్రకల్పించుకోవాలి. గెలవాలి. ఆ తరువాత అమాత్యులనూ, శత్రువులనూ గెలవాలి. అప్పుడే జయించాలన్న కోరిక వ్యర్థం కాదు.

ఇంద్రియాలను అదుపు చేసికొని, అమాత్యులను వశంలో ఉంచుకొని, అపరాధులను దండించగలుగుతూ, చక్కగా ఆలోచించి పనిచేసే ధీరునికి లక్ష్యం చక్కగా చేకూరుతుంది. చిన్న చిల్లులు గల వలలో చిక్కుపడిపోయిన రెండు చేపలవలె కామక్రోధాలు శరీరంలో నిలిచి మనుష్యుని జ్ఞానాన్ని లోపింపజేస్తాయి. కామక్రోధాలనే ఈ రెండింటి ద్వారానే దేవతలు స్వర్గానికి వెళ్ళదలచిన వారికై ద్వారాలను మూసి ఉంచుతున్నారు. వీతరాగులంతా

స్వర్గానికి వస్తారని భయపడి, స్వర్గప్రాప్తి ప్రతిబంధకా లయిన కామక్రోధాలను దేవతలు వృద్ధిచేశారు. కామ, క్రోధ, లోభ, దంభ, దర్పాలను చక్కగా గెలవటం తెలిసిన రాజే భూమండలాన్ని పరిపాలించగలుగుతాడు. అర్థధర్మాలను, శత్రువుల పరాభవాన్ని కోరుకొంటున్న రాజు ఎల్లప్పుడూ ఇంద్రియాలను అదుపులో ఉంచగలగాలి. కామానికి కానీ, క్రోధానికి కానీ లొంగి తన వారితో అయినా, ఇతరులతో అయినా కపటంగా ప్రవర్తించే వాడికి సహాయం చేసే వాడెవ్వడూ ఉండడు. నాయనా! పాండవులు ఒక్కటిగా ఉన్నారు. బుద్ధిమంతులూ, శూరులూ, శత్రువులను సంహరింపగలవారు. వారితో కలిసి సుఖంగా రాజ్యాన్ని అనుభవించు. శంతనుసుతుడైన భీష్ముడూ, మహారథుడైన ద్రోణుడూ చెప్పినది సత్యమే. శ్రీకృష్ణపాండవులు అజేయులు. అనాయాసంగా మహాకార్యాలు సాధించ గల మహాబాహువైన కృష్ణుని ఆశ్రయించు. ఆయన ప్రసన్నుడైతే ఉభయపక్షాలకూ సుఖాన్ని కల్పించగలడు. తన శ్రేయోభిలాషులైన జ్ఞానులమాట, పండితుల మాట విననివాడు, తదనుగుణంగా నిలువనివాడు కేవలం శత్రువులకు ఆనందాన్ని కల్గిస్తాడు. వత్సా! యుద్ధం చేయటంలో శుభం లేదు. ధర్మార్థాలు లేవు. ఇక సుఖానికి తావెక్కడ? యుద్ధంలో అన్నివేళలా గెలుపే లభిస్తుందన్న నమ్మకం లేదు. కాబట్టి యుద్ధం మీదకు మనస్సు పోనీకు.

మహాప్రాజ్ఞా! అన్యోన్యమైత్రి చెడుతుందన్న భయంతో భీష్ముడూ, మీ తండ్రీ, బాహ్లికుడు పాండుకుమారులకు రాజ్యభాగాన్ని ఇచ్చారు. వారికి రాజ్యభాగ మిచ్చిన ఫలితాన్ని ఇప్పుడు నీవు చూస్తున్నావుగదా! శూరులైన పాండవుల ద్వారా నిష్కంటకంగా చేయబడిన ఈ సమస్త భూమండలాన్నీ అనుభవిస్తున్నావు. నీవు నీమంత్రులతో కలిసి రాజ్యాన్ని అనుభవించా లనుకొంటే పాండుకుమారులకు యథోచితంగా అర్ధరాజ్యాన్ని ఇవ్వు. భారతా! నీవూ, నీ అమాత్యులూ జీవించటానికి నీకు రాజ్యంలోని అర్ధభాగం చాలు. హితైషుల మాటలు విని కీర్తిని కూడా పొందగలవు. నాయనా! బుద్ధిమంతులు, జితేంద్రియులూ అయిన పాండవులతో యుద్ధం గొప్ప సుఖాలనుండి నిన్ను పతనం చేస్తుంది. భరతశ్రేష్ఠా! పాండుకుమారులకు వారి అర్ధరాజ్యాన్ని ఇచ్చి, నీ శ్రేయోభిలాషులలో కలుగుతున్న కోపాన్ని ఉపశమింపజేసి, నీ రాజ్యభాగాన్ని నీవు యథోచితంగా పరిపాలించు. మహాప్రాజ్ఞా! పదమూడు సంవత్సరాలు పాండవులను రాజ్యహీనులను చేయటమే మహాపకారం. అది నీ కామక్రోధాల వల్ల ఇంకా పెరిగింది. ఇప్పుడు సంధితో దాన్ని

ఉపశమింపజేయి. కౌంతేయుల సంపదలను నీవు కోరుకొనినా, వాటిని సాధించుకొనటం నీవలన కాదు. స్థిరక్రోధంగల కర్ణుడూ, నీ సోదరుడు దుశ్శాసనుడు కూడా సాధించలేరు. భీష్ముడూ, ద్రోణుడూ, కృపుడూ, కర్ణుడూ, భీమసేనుడూ, అర్జునుడూ, ధృష్టద్యుమ్నుడూ వీరంతా అలిగితే ప్రజలలో ఎవ్వరూ మిగలరు. ఇది నిశ్చయం. వత్సా! క్రోధానికి లోనయి సమస్త కౌరవవినాశనానికి పాల్పడకు. నీ కోసం ఈ భూమండలమంతా ఊచకోతకు గురి కారాదు.మూర్ఖుడా! భీష్మద్రోణ కృపాదులు సర్వశక్తులూ ఒడ్డి, యుద్ధం చేస్తారని నీవనుకొంటున్నావు. అది ఇపుడు కుదిరే పనికాదు. ఆత్మజ్ఞాను లయిన వీరిదృష్టిలో రాజ్యం మీదైనా, వారిదైనా ఒకటే. మీమీద, పాండవుల మీదా ప్రేమ కూడా వారికి సమానమే. కానీ పాండవుల వైపు ధర్మం మొగ్గుగా ఉంది. నీ అన్నం తిన్నారు కాబట్టి వీరంతా నీకోసం ప్రాణాల నయితే ఇవ్వగలరు కానీ యుధిష్ఠిరుని వక్రదృష్టితో మాత్రం చూడలేరు. లోభంతో అర్థసంపదలను పొందిన నరు లెవ్వరూ లేరు. కాబట్టి నాయనా! లోభాన్ని విడిచిపెట్టు."

130. దుర్యోధనుని దురాలోచన పాత్యకి ద్వారా బయటపడుట.

అర్థవంత మయిన తల్లి మాటలను కూడా లెక్కచేయక దుర్యోధనుడు పాపాత్ములైన తన సహచరుల దగ్గరకు కోపంగా మరలా బయలుదేరాడు. సభ నుండి వెళ్లిపోయి దుర్యోధనుడు అక్షప్రియుడూ, సౌబలరాజు అయిన శకునితో ఆలోచించాడు. దుర్యోధనుడూ, కర్ణుడూ, శకునీ, దుఃశాసనుడూ – ఈ నలుగురి నిర్ణయం ఈ విధంగా ఉంది. ధృతరాష్ట్రమహారాజుతో, భీష్మునితో కలిసి వేగంగా పనులు నిర్వహించగల శ్రీకృష్ణుడు ముందు మనలను బంధింపచేస్తాడు. కాబట్టి మనమే బలప్రయోగం చేసి ఇంద్రుడు బలిని బంధించినట్టు ఆ పురుష శ్రేష్ఠుడైన శ్రీకృష్ణుని బంధిద్దాము. శ్రీకృష్ణుడు బంధింపబడినట్లు తెలిసికొని పాండవులు కోరలు తీసిన పాములవలె నిశ్చేతనులై నిరుత్సాహు లవుతారు. పాండవులకు అందరకు మహాబాహువయిన కృష్ణుడే సంపదా, కవచమూ కూడా. యదువంశశ్రేష్ఠుడూ, వరదాత అయిన శ్రీకృష్ణుని బంధిస్తే పాండవులు సోమకులతో సహా ప్రయత్నరహితు లవుతారు. కాబట్టి మనం ఇక్కడ క్షిప్రకారి అయిన ఈ కేశవుని ధృతరాష్ట్రుడు ఆక్రోశిస్తున్నా సరే- బంధించి శత్రువులతో యుద్ధం చేద్దాం.

దుష్టస్వభావం గల ఆ పాపాత్ముల దురాలోచనను పరుల ఇంగితాన్ని తెలుసుకోగల సాత్యకి వెంటనే గ్రహించాడు. వెంటనే సభనుండి నిష్క్రమించి కృతవర్మను కలిసి ఇలా అన్నాడు. "వెంటనే సేనను సన్నద్ధం చేయి. కవచాన్ని ధరించి సేనను పన్ని, సభాద్వారం దగ్గర నిలు. ఇంతలో నేనీ విషయాన్ని అనాయాసంగా కార్యసాధన చేయగల శ్రీకృష్ణునితో చెప్తాను." కృతవర్మతో ఆ విధంగా చెప్పి వీరుడైన ఆ సాత్యకి సింహం కొండగుహలోనికి ప్రవేశించినట్టు సభలోనికి ప్రవేశించి మహాత్ముడైన శ్రీకృష్ణునకు సుయోధనాదుల అభిప్రాయాన్ని తెలియ జేశాడు. ఆ తరువాత ధృతరాష్ట్రునకూ, విదురునకూ కూడా ఆ విషయాన్ని తెలిపాడు. సాత్యకి తేలికగా నవ్వుతూ సుయోధనాదుల ఆలోచనను ఈ విధంగా వివరించాడు. "ధర్మార్థకామాల దృష్టితో సజ్జనులంతా నిందించే పనిని మూర్ఖులయిన ఆ సుయోధనాదులు చేస్తున్నారు. కాని ఏ రీతిగానూ వారు సఫలులు కాలేరు. లోభక్రోధాలకు లోనయి, కామక్రోధాలచే కొట్టబడిన పాపాత్ములు, మూఢులు కొందరు కలిసి ఇక్కడ పెద్ద తగాదా లేవనెత్తబోతున్నారు. బాలురో, మూర్ఖులో మండుతున్న అగ్నిని వస్త్రంతో బంధించాలని ప్రయత్నించినట్లు అల్పబుద్ధి లయిన వారు ఈ పుండరీకాక్షుని బంధింపగోరుతున్నారు."

సాత్యకి పలికిన ఆ మాటలు విని దీర్ఘదృష్టిగల విదురుడు మహాబాహువయిన ధృతరాష్ట్రునితో కౌరవసభలో ఇలా అన్నాడు. "మహారాజా! పరంతపా! నీ కుమారు లందరూ కాలానికి లొంగిపోయినట్లుంది. కాకపోతే అసాధ్యం, అపకీర్తిహేతువూ అయిన పనిని చేయటానికి సిద్ధపడతారా? దేవేంద్రసోదరుడైన ఈ పుండరీకాక్షుని ఒక్కటై ఎదిరించి బలవంతంగా బంధించాలని అనుకొంటున్నారు గదా! ఈయనను ఎదిరించటం కాదు గదా, సమీపించటం కూడా కష్టం. దగ్గరకు వస్తే విరోధులెవరైనా నిప్పుమీద పడిన మిడతల వలె మాడిపోతారు. ఈ జనార్దనుడు తలచుకొంటే, కోపించిన సింహం ఏనుగులను చంపినట్లు యుద్ధం చేసే వారి నందరినీ యమసదనానికి పంపగలడు. అయితే అచ్యుతుడయిన ఈ పురుషోత్తముడు ఎప్పుడూ నిందింపదగిన పని కానీ, పాపం కానీ చేయడు. ధర్మాన్ని ఎప్పుడూ తప్పడు.

(అశ్వాలు, రథాలు, ఏనుగులతో పాటు వారణాసిని దహించినట్లు, కాశిరాజును బంధువులతో పాటు సంహరించినట్లు, శంఖచక్రగదాధరుడైన శ్రీకృష్ణుడు హస్తినాపురాన్ని తగులబెట్టి, స్వయంగా తాను కాలేశ్వరుడై కౌరవుల నందరినీ నాశనం చేయగలడు. యాదవులకు సుఖాన్ని కల్గించే ఈ కృష్ణుడు పారిజాతాన్ని అపహరించినప్పుడు వసువులందరితో సహా ఇంద్రుడు కోపంగా ఎదిరించినా,

ఏమీ చేయలేకపోయాడు. నిర్మోచనమనే ప్రదేశంలో మురాసురుడు ఆరువేల పాశాలను అడ్డుపెట్టుకొన్నా, శ్రీకృష్ణుడు వాటిదగ్గరకు పోయి అన్నింటినీ త్రెంపివేశాడు. శ్రీకృష్ణుడు సౌభుని ద్వారాన్ని సమీపించి, తన గదతో పర్వతాన్ని బ్రద్దలు చేసి, అమాత్యులతో సహా దుర్మతుణ్ణి సంహరించాడు. కౌరవులకు ఇంకా ఆయువు మిగిలి ఉన్నది కాబట్టి ధర్మానుకూలుడూ పుండరీకనేత్రుడూ అయిన శ్రీకృష్ణుడు సమర్థుడై కూడా పాపకృత్యాలను సహిస్తున్నాడు. ఒకవేళ కౌరవులు తమ సహచర నరపాలురతో కలిసి గోవిందుని బంధించాలనుకొంటే వారంతా ఇప్పుడే యమసదనానికి అతిథు లవుతారు. బలీయమైన గాలికి గడ్డిపరకలన్నీ వశమైనట్లు, చక్రధారి అయిన శ్రీకృష్ణునకు కౌరవులంతా లొంగిపోతారు.")

విదురుడిలా అనగా శ్రీకృష్ణుడు ధృతరాష్ట్రుని చూచి పెద్దలంతా వింటుండగా ఆయనతో ఇలా అన్నాడు. "రాజా! ఈ దుష్టకౌరవులు కోపంతో బలవంతంగా నన్ను పట్టుకొనగలరో లేక నేనే వారిని బంధిస్తానో చూడవచ్చు. వారికి అనుజ్ఞ ఇవ్వు. కోపంతో ఎగిరిపడుతున్న వీరినందరినీ నేను నియంత్రించగలను. కానీ నిందింపదగిన పనిని కానీ, పాపకృత్యాన్ని కానీ నేనెప్పుడూ చేయను. పాండవుల సంపదలను ఆశిస్తూ నీ కొడుకులు తమ సంపదలను సయితం కోల్పోగలరు. వా రదే కోరుకొంటే ధర్మరాజు పని నెరవేరినట్లే. భారతా! నేడు నేను ఈ కౌరవులనూ, వారి అనుచరులనూ బంధించి కౌంతేయుల వశం చేస్తాను. అదేమీ పాపం కాదు. కానీ మహారాజా! నీ సన్నిధిలో కోపంతోనో, పాపబుద్ధితోనో జరిగే ఈ నిందితకృత్యాన్ని నేను ఆచరించలేను. రాజా! ఈ దుర్యోధనుడు ఎలా కోరుకుంటే అలాగే జరగనీ! నేను మాత్రం నీ కుమారులందరికీ అనుమతి ఇస్తున్నాను." ఈ మాటలు విని ధృతరాష్ట్రుడు విదురునితో ఇలా అన్నాడు- "రాజ్యలోభంతో పాపాత్ముడైన ఆ సుయోధనుని వెంటనే తీసికొనిరా. మిత్రులతో, మంత్రులతో, సోదరులతో, అనుచరులతో సహా వానిని సరియైన మార్గంలో పెట్టడానికి ప్రయత్నిద్దాం. కుదిరితే మంచిదే." ఆ తరువాత విదురుడు సోదరులూ, అనుచర రాజులతో సహా ఇష్టంలేకపోయినా సుయోధనుని మరలా సభలో ప్రవేశపెట్టాడు.

అప్పుడు కర్ణదుశ్శాసనులతోనూ, ఇతర రాజులతోనూ కూడివచ్చిన దుర్యోధనునితో ధృతరాష్ట్రుడిలా అన్నాడు. "క్రూరుడా! పాపాత్ముడా! నీచపు పనులు చేసేవారే నీకు సహాయకులు. అటువంటి దుష్టసహాయకులతో కూడి పాపకార్యాలు చేయాలనుకొంటున్నావు. సజ్జనులనిందకు గురియై, అపకీర్తి హేతువై, అసాధ్యమయిన పనులు కులనాశకుడూ, మూర్ఖుడూ అయిన నీవంటివాడు తప్ప మరెవ్వరూ చేయరు. పాపు లయిన సహాయకులతో కలిసి, నీవు ఎదిరించటానికి, కనీసం సమీపించటానికి

కూడా వీలుకాని శ్రీకృష్ణుని బంధించా లనుకొంటున్నావు. బాలుడు చంద్రుని పట్టుకోవాలని కోరినట్లు నీవు మూఢుడవై దేవతలూ, ఇంద్రుడూ కూడా లొంగదీయలేని శ్రీకృష్ణుని బంధించాలని అనుకొంటున్నావు. దేవతలు, మనుష్యులు, గంధర్వులు అసురులు, నాగులు కూడా రణభూమిలో శ్రీకృష్ణుని దాడిని సహింపలేరు. అటువంటి శ్రీకృష్ణుని నీవు తెలిసికొనటం లేదు. గాలిని చేతితోపట్టలేము. చేతితో చంద్రుని తాకలేము. భూమి తలకెత్తుకొనలేము. అదే విధంగా బలవంతంగా శ్రీకృష్ణుని బంధించలేము."

ధృతరాష్ట్రుడిలా అనగానే అసహనశీలి అయిన దుర్యోధనునితో విదురుడిలా అన్నాడు. "దుర్యోధనా! నేనిప్పుడు చెపుతున్న మాటలను గ్రహించు. ద్వివిదుడనే రాక్షసరాజు సౌభద్వారంలో పెద్దరాళ్ళవానతో శ్రీకృష్ణుని కప్పి వేశాడు. పరాక్రమించి అన్నివిధాలా ప్రయత్నించి శ్రీకృష్ణుని బంధించా లనుకొన్నాడు. కానీ బంధించలేకపోయాడు. అటువంటి వానిని నీవు బలవంతంగా బంధించా లనుకొంటున్నావు. శౌరి, ప్రాగ్జ్యోతిషపురానికి వెళ్ళినపుడు నరకాసురుడు దానవులతో కలిసి ఆయనను బంధించా లనుకొన్నాడు. కానీ వీలు కాలేదు. అటువంటి వానిని నీవు బలవంతంగా బంధించా లనుకొంటున్నావు. అనేకయుగాలూ, సంవత్సరాలూ ఆయువు గల నరకుని యుద్ధంలో చంపి, వేలకొలది రాజకన్యలను కొనిపోయి యథావిధిగా పరిణయం చేసికొన్నాడు. నిర్మోచనంలో పెద్దపెద్ద రాక్షసులు ఆరువేల పాశాలను ప్రయోగించి కూడా శ్రీకృష్ణుని పట్టుకొనలేకపోయారు. వానిని నీవు బలవంతంగా బంధించా లనుకొంటున్నావు. ఈ శ్రీకృష్ణుడు బాల్యంలోనే పూతననూ, ఆడకొంగను సంహరించాడు. గోరక్షణకై గోవర్ధనగిరిని ఎత్తాడు. అరిష్టాసురుని, ధేనుకాసురునీ, మహాబలుడైన బాణాసురునీ, అశ్వరాజైన కేశినీ, లోకకళ్యాణానికి ప్రతిబంధకంగా ఉన్న కంసునీ సంహరించాడు. జరాసంధుడూ, దంతవక్త్రుడూ, పరాక్రమశాలి అయిన శిశుపాలుడూ, బాణాసురుడూ శ్రీకృష్ణుని చేతనే మరణించారు. యుద్ధంలో ఎందరో రాజులను అతడు సంహరించాడు. అమితతేజోవంతుడైన శ్రీకృష్ణుడు వరుణుని జయించాడు. అగ్నిని ఓడించాడు. పారిజాతాన్ని అపహరించేవేళ సాక్షాత్తూ ఇంద్రుని కూడా ఓడించాడు. ఏకార్ణవంలో నిదురిస్తూ మధుకైటభులను సంహరించాడు. మరో అవతారమెత్తి హయగ్రీవు డనే రాక్షసుని సంహరించాడు. అన్నింటికీ కర్త శ్రీకృష్ణుడే. మరొక కర్త లేడు. పురుషార్థసిద్ధిలో కారణం కూడా ఈయనయే. తాను చేయదలచిన దేదయినా అప్రయత్నంగా ఈయన

చేయగలడు. తీవ్రపరాక్రమంగలవాడు, జితేంద్రియుడు, అనిందితుడూ, తేజోరాశి అయిన శ్రీకృష్ణుని తెలిసికొనలేకపోతున్నావు. కోపించిన మహాసర్పంవలె భయంకరుడీయన. అనాయాసంగా పనులు సాధించగల మహాబాహు వయిన శ్రీకృష్ణుని ఎదిరిస్తే మంటలో పడిన మిడతలా అయిపోతావు. నీవూ, నీ అమాత్యులు కూడా మిగలరు."

131. శ్రీకృష్ణుని విశ్వరూపప్రదర్శన- నిష్క్రమణ.

విదురుడిలా మాట్లాడగానే శత్రుసంహర్త, పరాక్రమవంతుడూ, అయిన శ్రీకృష్ణుడు దుర్యోధనునితో ఇలా అన్నాడు- "దుష్టబుద్ధీ! సుయోధనా! నీ మోహం వలన నన్ను ఒంటరివాడి ననుకొంటున్నావు. నన్ను పరాభవించి బంధించాలని కోరుకొంటున్నావు. పాండవులంతా ఇక్కడే ఉన్నారు. అంధక, వృష్ణివంశస్థులంతా, ఇక్కడే ఉన్నారు. ఆదిత్యులూ, రుద్రులూ, వసువులూ, మహర్షులూ అంతా ఇక్కడే ఉన్నారు." శత్రుసంహారకుడైన శ్రీకృష్ణుడు ఈ విధంగా మాటాడి పెద్దగా నవ్వాడు. శౌరి ఆ విధంగా నవ్వినపుడు ఆయన శరీరావయవాలలో మెరుపువంటి కాంతిగల మహాత్ములూ, అంగుష్ఠమాత్రులైన దేవతలూ అగ్నిజ్వాలలను వెదజల్లారు. ఆయన నుదుట బ్రహ్మదేవుడూ, వక్షఃస్థలంపై రుద్రదేవుడూ ఉన్నారు. భుజాలపై లోకపాలకులంతా ఉన్నారు. ముఖం నుండి అగ్నిజ్వాలలు చిమ్ముతున్నాయి. ఆదిత్యులూ, సాధ్యులూ, వసువులు, అశ్వినీ దేవతలూ, మరుత్తులూ, ఇంద్రుడూ, విశ్వేదేవులూ, యక్షులూ, గంధర్వులూ, నాగులూ, రాక్షసులూ అంతా శరీరంపై కనిపించారు. ఆయన భుజాలనుండి బలరాముడూ, అర్జునుడూ ఉద్భవించారు. దక్షిణభుజంనుండి ధనుర్ధారి అయిన అర్జునుడు, వామభుజం నుండి నాగలిపట్టిన బలరాముడూ ఉద్భవించారు. ఆయనవెనుక భీముడూ, యుధిష్ఠిరుడూ, నకుల సహదేవులూ ఉన్నారు. అంధకులు, వృష్ణి వంశస్థులూ, ప్రద్యుమ్నుడూ మొదలయిన కృష్ణ వంశీయులూ ఆయుధాలనెత్తి శ్రీకృష్ణుని ముందు నిలిచి ఉన్నారు. శంఖం, చక్రం, గద, శక్తి, శార్ఙ్గం, నాగలి, నందకం (కత్తి) మొదలైన సకలాయుధాలూ ఎత్తిపెట్టబడి అంతటా వెలుగులు చిమ్ముతూ శ్రీకృష్ణుని అనేకబాహువులలో కనిపించాయి. కళ్ళనుండీ, ముక్కులనుండీ, చెవుల నుండీ భీకరాగ్నిజ్వాలలు పొగతోపాటు అన్ని దిక్కులకూ వెలువడసాగాయి. రోమకూపాలనుండీ సూర్యకిరణాల వంటి కాంతులు వెలువడసాగాయి. రాజులందరూ మహాత్ముడైన శ్రీకృష్ణుని ఆ ఘోరస్వరూపాన్ని చూచి

భయపడి కళ్ళు మూసికొన్నారు. ద్రోణుడూ, భీష్ముడూ, విద్వాంసుడైన విదురుడూ, మహాత్ముడయిన సంజయుడు, తపోధనులయిన మహర్షులు మాత్రం కళ్ళు మూయలేదు. శ్రీకృష్ణభగవానుడు వారికి దివ్యదృష్టి అనుగ్రహించాడు. సభాస్థలంలో మహాశ్చర్యకరమైన ఆ శ్రీకృష్ణస్వరూపాన్ని చూచి దేవదుందుభులు మ్రోగసాగాయి. పూలవాన కురిసింది.

ధృతరాష్ట్రుడిలా అన్నాడు.- "పుండరీకాక్షా! నీవే ఈ సమస్త ప్రపంచానికీ హితాన్ని కోరేవాడివి. కాబట్టి యాదవ శ్రేష్ఠా! నీవే ప్రసన్నుడవు కావాలి. భగవంతుడా! నాకు కళ్ళు కనిపించవు. మరల నేను చూపు పోవాలని కోరుకొంటున్నాను. నిన్ను చూడాలని ఉంది. మరి దేనినీ చూడాలని నేను ఉత్సాహపడటం లేదు." అప్పుడు మహాబాహువయిన జనార్దనుడు "కురునందనా! నీకు పరులకు కనిపించని రెండు కళ్లనిస్తున్నాను" అని ధృతరాష్ట్రునితో అన్నాడు. మహారాజా! అది ఆశ్చర్యకరం. ధృతరాష్ట్రుడు కూడా విశ్వరూప సందర్శనం కోసం శ్రీకృష్ణుని ద్వారా రెండు కళ్ళను పొందాడు. సింహాసనాసీనుడైన ధృతరాష్ట్రునికి కళ్ళు వచ్చాయి. అది చూచి రాజులూ, మహర్షులూ ఆశ్చర్యపడి శ్రీకృష్ణుని స్తుతించారు. భరతశ్రేష్ఠా! సమస్త భూమండలం కంపించింది. సముద్రం క్షోభించింది. రాజు లందరూ ఎంతో ఆశ్చర్యాన్ని పొందారు. ఆ తరువాత శత్రుసంహారుడైన పురుషోత్తముడు తన శరీరాన్నీ, దివ్యాద్భుతమై, విచిత్రమైన తన ఐశ్వర్యాన్నీ ఉపసంహరించాడు. ఆ తరువాత ఆ మధుసూదనుడు మహర్షుల అనుమతి తీసికొని సాత్యకి, కృతవర్మల చేతులు పట్టుకొని సభనుండి నిర్గమించాడు. ఆపై నారదాది మహర్షులు అక్కడే అంతర్ధాన మయ్యారు. కోలాహల మంతా ఉపశమించింది. అదంతా అద్భుతంగా అనిపించింది. ఆ శ్రీకృష్ణుడు బయలుదేరటం చూచి రాజులతో సహా కౌరవులంతా ఇంద్రుని దేవతలు అనుసరించినట్లు అనుసరించారు. అయితే అప్రమేయ (కొలత కందనిది) స్వరూపుడైన శ్రీకృష్ణుడు ఆ రాజసమూహాన్ని పట్టించుకొనకుండా పొగతోకూడిన అగ్నిలాగా సభనుండి నిష్క్రమించాడు.

అప్పుడు - శ్రీకృష్ణుడు వెలుపలికి రాగానే - శైబ్య సుగ్రీవాలనే గుఱ్ఱాలను పూన్చిన రథంతో దారుకుడు కనిపించాడు. ఆ రథం ఉజ్జ్వలంగా విశాలంగా ఉన్నది. చిన్న చిన్న ఘంటికలు కనిపిస్తున్నాయి. బంగారు తోరణాలతో అది విచిత్రంగా ఉంది. దాని గమనధ్వని మేఘనాదంలా ఉన్నది. దానిలో అవసరమైన సామగ్రి అంతా ఉన్నది. దానిపై పులి తోలు పరవబడి ఉంది. రథ రక్షణ కవసరమైన ఏర్పాట్లు అక్క

డున్నాయి. అదే విధంగా వృష్ణివంశస్థులు మెచ్చిన వీరుడూ, హృదిక పుత్రుడూ, మహారథుడూ అయిన కృతవర్మ మరొక రథంపై కూర్చొని కనిపించాడు. శ్రీకృష్ణుడు రథమెక్కి బయలుదేరుతుంటే ధృతరాష్ట్రమహారాజు ఆయనతో మరలా ఇలా అన్నాడు. "జనార్దనా! నా కుమారులపై నాకెంత పట్టున్నదో నీవే చూచావు. అంతా ప్రత్యక్షమే. నీనుండి దాచినదేమీ లేదు. కేశవా! కౌరవపాండవుల మధ్య సంధిని కోరుతూ దానికై ప్రయత్నిస్తున్నాను. ఈ పరిస్థితిని గమనించు. నన్ను శంకించవద్దు. కేశవా! నాకు పాండవుల విషయంలో ఎటువంటి దురాలోచనా లేదు. నేను సుయోధనునితో చెప్పిన హితవచనాలు నీ వెరిగినవే గదా! మాధవా! అన్ని విధాలుగా నేను సంధికోసం ప్రయత్నిస్తున్న విషయం పాండవులకూ, కౌరవులకూ, రాజు లందరికీ కూడా తెలుసు" అన్నాడు. అప్పుడు జనార్దనుడు ధృతరాష్ట్రునితో, ద్రోణ భీష్మ, విదుర, బాహ్లికులతో, కృపునితో ఇలా అన్నాడు. "కౌరవసభలో జరిగినది మీరంతా చూచారు. మూర్ఖుడైన దుర్యోధనుడు అమర్యాదగా రోషంతో సభనుండి నిష్క్రమించటం గమనించారు. మహారాజైన ధృతరాష్ట్రుడు తాను అసమర్థుడ నని చెప్తున్నాడు. మీ అందరి దగ్గర సెలవు తీసికొని యుధిష్ఠిరాదుల దగ్గరకు వెళ్తాను." పురుషశ్రేష్ఠా! ఆ విధంగా వీడ్కొని రథమెక్కి బయలుదేరిన శ్రీకృష్ణుని భరత వంశంలోని గొప్ప విలుకాండ్రూ, మహావీరులూ అనుసరించారు. భీష్ముడూ, ద్రోణుడూ, కృపుడూ, విదురుడూ, ధృతరాష్ట్రుడూ, బాహ్లికుడూ, అశ్వత్థామ, వికర్ణుడు, యుయుత్సువు, వీరంతా శ్రీకృష్ణుని అనుసరించిన వీరులు. ఆపై కింకిణులచే అలంకరింపబడి ఉజ్వలంగా ప్రకాశిస్తున్న ఆ విశాలరథంపై శ్రీకృష్ణుడు కౌరవులు చూస్తుండగానే మేనత్త అయిన కుంతిని చూడటానికి వెళ్ళాడు.

132. కుంతీ సందేశము.

శ్రీకృష్ణుడు కుంతి ఇంట ప్రవేశించి, ఆమె పాదాలకు నమస్కరించి, కౌరవసభలో జరిగిన వృత్తాంతమంతా సంక్షేపంగా ఆమెకు చెప్పాడు. వాసుదేవుడిలా అన్నాడు - "నేనూ, మహర్షులూ కూడా హేతుబద్ధంగా స్వీకరణయోగ్యంగా అనేకవిధాలుగా సభలో చెప్పిచూశాం. కానీ దుర్యోధనుడు దానిని అంగీకరించలేదు. దుర్యోధనునకు అధీనమై నిలిచిన రాజుల కందరకూ కాలం సమీపించినట్లున్నది. నీవు అనుమతిస్తే త్వరగా పాండవుల దగ్గరకు వెళ్తాను. బుద్ధిమంతురాలా! నీ మాటగా నేను పాండవులకు

ఏమి చెప్పాలి. అది చెప్పు. నీ మాటలు వినాలని ఉంది."

కుంతి ఇలా అన్నది.- "కేశవా! ధర్మాత్ముడైన యుధిష్ఠిర రాజుతో నామాటగా చెప్పు- ప్రజాపాలన రూపమైన నీధర్మం కుంటుపడుతోంది. ధర్మపరిపాలనావకాశాన్ని వృథా చేసికోవద్దు. రాజా! వేదార్థం తెలియని మందబుద్ధి అయిన వేదపండితుడు మంత్రాలను పఠించటమే పరమధర్మ మనుకొన్నట్లు నీవు శాంతి ధర్మాన్ని మాత్రమే చూస్తున్నావు. నాయనా! బ్రహ్మ నీకోసం ఏర్పరచిన ధర్మాన్ని చూడు. క్షత్రియులు బాహువులనుండి సృష్టింపబడినవారు. భుజపరాక్రమంతో జీవించవలసినవారు. నిత్యమూ యుద్ధంవంటి క్రూరకర్మలూ, ప్రజాపరిపాలన క్షత్రధర్మం. ఈ విషయాలకు సంబంధించి నేను పెద్దల ద్వారా విన్న ఉదాహరణమొకటి చెపుతా, విను. ఒకప్పుడు కుబేరుడు ముచుకుందుడనే రాజర్షికి ఈ భూమిని ఇచ్చాడు. కానీ ముచుకుందుడు దానిని గ్రహించలేదు. నా బాహుబలంతో సంపాదించిన దానినే అనుభవించాలని నా కోరిక- అని కూడా అన్నాడు ముచుకుందుడు. దానితో కుబేరుడు ఆనందాశ్చర్యాలకు లోనయ్యాడు. ఆ తరువాత ముచుకుందుడు తన బాహుపరాక్రమంతో ఆర్జించిన భూమిని క్షత్రధర్మాన్ని అనుసరిస్తూ, చక్కగా పరిపాలించాడు. రాజుచే సురక్షితులైన ప్రజలు ఆచరించిన ధర్మంలో నాలుగవ భాగాన్ని రాజు పొందుతాడు. రాజు ధర్మాన్ని ఆచరిస్తే దేవత్వాన్నే పొందగల్గుతాడు. రాజు అధర్మంగా ప్రవర్తిస్తే నరకానికి పోతాడు. రాజుయొక్క దండనీతి రాజు ద్వారా స్వధర్మానుసారం చక్కగా ప్రయోగింపబడితే అది చతుర్వర్ణాలనూ నియంత్రించి, అధర్మం నుండి మరల్చి గలుగుతుంది. రాజు సంపూర్ణంగా చక్కగా దండనీతిని ప్రయోగించిన రోజు కృతయుగ మన్న పేర శ్రేష్ఠమైన కాలం వస్తుంది. రాజు కాలానికి కారణమా? కాలం రాజుకు కారణమా? అని సంశయించవలసిన పని లేదు. రాజే కాలానికి కారణ మవుతాడు.

రాజే కృతయుగాన్నీ, త్రేతాయుగాన్నీ, ద్వాపరయుగాన్నీ సృష్టిస్తాడు. కలియుగానికి కూడా రాజే కారకు డవుతాడు. కృతయుగాన్ని కల్పించిన రాజు అక్షయస్వర్గాన్ని పొందగలుగుతాడు. త్రేతాలక్షణాలను కల్పించగలరాజు స్వర్గాన్ని పొందగలడు కానీ అది శాశ్వతం కాదు. ద్వాపరలక్షణాలను ప్రవర్తింపజేసిన రాజు పుణ్యపాప ఫలితాలను విడివిడిగా అనుభవిస్తాడు. కలి లక్షణాలను ప్రవర్తింపజేసిన రాజు ఘోరనరకాన్ని పొందుతాడు. ఆ కారణంగా దుష్కర్మలు చేసిన రాజు చాలా సంవత్సరాలు నరకలోకంలో ఉంటాడు. రాజదోషం ప్రజలకు, ప్రజాదోషం రాజుకు సంక్రమిస్తాయి. పితృపైతామహులు

పరిపాలించిన రాజధర్మాలను పరిశీలించు. ఇప్పుడు నీవు నిలువదలచిన స్థానం రాజులకూ, రాజధర్మాలకూ తగినది కాదు. నిత్యమూ దయాభావంతో నిలిచినవాడు వైక్లవ్యాన్ని పొందుతాడు. అటువంటివాడు ప్రజాపాలన సంబంధమైన ఏ పుణ్యఫలాన్నీ ఎప్పుడూ పొందలేడు. ఇప్పుడు నీ బుద్ధి ప్రసరిస్తున్న ఆలోచనల కనుగుణంగా మీ తండ్రి పాండురాజు గానీ, నేను కానీ, పితామహుడు కానీ ఎప్పుడూ ఆశీస్సుల నందజేయలేదు. యజ్ఞం, దానం, తపస్సు, శౌర్యం, ప్రజ్ఞ, సంతానం, మాహాత్మ్యం, బలం, ఓజస్సు నీకు ప్రాప్తించాలని నేనెప్పుడూ కోరుకొనే దాన్ని. శుభాస్పదులైన బ్రాహ్మణులను చక్కగా ఆరాధిస్తే వారుకూడా దేవయజ్ఞ, పితృయజ్ఞ, దీర్ఘాయుర్ధన, పుత్రప్రాప్తికి అనుగుణంగా ఆశీస్సుల నిచ్చేవారు. దేవతలైనా, పితరులైనా తమను ఉపాసించే పుత్రులకు దానం, అధ్యయనం, యజ్ఞం, ప్రజాపరిపాలనం సిద్ధించాలనే కోరుకొంటారు. శ్రీకృష్ణా! నేను చెప్తున్నది ధర్మసంగతమో, అధర్మయుక్తమో నీకు స్వాభావికంగానే తెలుసు. పాండవులు ఉత్తమవంశంలో పుట్టి, విద్వాంసులై కూడా బ్రతుకు తెరువులేక బాధపడుతున్నారు.

ఆకలిగొన్న మానవులంతా దానపతి, శూరుడూ అయిన క్షత్రియుని చేరి, ఆకలి తీరి, సంతుష్టులై వెళ్లటం కంటె గొప్పధర్మమే ముంటుంది? ధర్మబద్ధుడైన వాడు, ముందు రాజ్యాన్ని పొంది ఆపై దానంతో కొందరిని, బలంతో కొందరిని, మంచి మాటలతో కొందరిని- ఈ విధంగా ఎటునుండి వచ్చినవారినైనా తృప్తి పరచి తన వారినిగా చేసికోవాలి. బ్రాహ్మణుడు బిచ్చమెత్తాలి. క్షత్రియుడు పరిపాలించాలి. వైశ్యుడు డబ్బు సంపాదించాలి. శూద్రుడు వారికి పరిచర్యలు చేయాలి. నీకు యాచన నిషిద్ధం. వ్యవసాయం కుదరదు. నీవు క్షత్రియుడవు. ఇతరులను ఇబ్బందులనుండి రక్షించవలసినవాడవు. బాహుబలంతోనే జీవించవలసినవాడివి. మహాబాహూ! శత్రువుల చేత చిక్కి ఉన్న నీపైతృకమైన రాజ్యభాగాన్ని సామ,దాన, భేద, దండోపాయాలతో పునరుద్ధరించుకో. మిత్రులకు ఆనందాన్ని కలిగించే వాడా! నేను నిన్ను కని, ఎవ్వరూ లేని దానివలె, పరులు పెట్టే అన్నం కోసం ఎదురుచూస్తుండటం కన్న ఎక్కువ దుఃఖం ఏముంటుంది. రాజధర్మాన్ని పాటించి యుద్ధం చెయ్యి. పెద్దల పేరు అణగారిపోకుండా చూడు. పుణ్యహీనుడవై, సోదరులతోపాటు పాపాత్ములు పొందే గతిని పొందవద్దు."

133. విదులా వృత్తాంతము.

"ఈ విషయంలో పూర్వం జరిగినదాన్ని గురించి ఇలా చెపుతారు. ఇది విదులకూ ఆమెపుత్రునకూ జరిగిన సంవాదం.

ఇందులో శ్రేయస్కరమయిన ఉపదేశం ఉంది. అది నీవు యుధిష్ఠిరునికి తగినట్లు చెప్పాలి. విదుల అని ఒక క్షత్రియవనిత ఉండేది. ఆమె చక్కని పేరుకలది. అభిమానవతి. సద్వంశంలో పుట్టింది. క్షత్రియధర్మం మీద ఆసక్తి కలది. ఇంద్రియనిగ్రహంతోపాటు చక్కని ముందుచూపు కలది. రాజసభల్లో మంచి ప్రఖ్యాతి పొందింది. ఎన్నో వేద శాస్త్రవిశేషాలు విన్నది. తనకొడుకు సింధురాజు చేతిలో ఓడిపోయి దిగులుతో ఉండగా విదుల కొడుకును ఇలా నిందించింది. నాకు చెడపుట్టావు గదరా ! శత్రువులకు సంతోషం కలిగిస్తావురా! నాకూ, నీ తండ్రికీ ఏపోలికా లేకుండా పుట్టావు. ఎక్కడినుండి వచ్చిపడ్డావురా ! మనిషికి ఉండవలసిన కోపం లేదు. మగతనం లేదు. అసలు మనుష్యుల్లో లెక్కింపదగినవాడవు కాదు. నీ వల్ల జీవిత మంతా నిరాశయే. కొద్దిగా మంచిగా ఉండే బాధ్యత వహించరా ! నిన్ను నీవు అవమానపరచుకోకు. అల్ప సంపదతో జీవితం సరిపెట్టుకోకు. శుభప్రదమయిన మనసు పెట్టు. భయపడకు. అసలు ఆ భయాన్ని ముందు పోగొట్టుకో ! నీచుడా ! శత్రువును సంతోష పరుస్తూ, నిరుత్సాహంతో చుట్టాలకు శోకం కలిగిస్తూ, ఓడిపోయి ఇంట్లో ఇలా పడుకోకు. లే! చిన్నవాగు కొద్ది నీటితోనే నిండిపోతుంది. దొంగయొక్క దోసిలికూడా కొద్ది ధనంతోనే నిండుతుంది. అలాగే నీచుడు అల్పమైన పనులతోనే తృప్తిపడుతాడు. పాము కోరలను పీకి అయినా సరే త్వరగా చావు. బ్రతుకు మీద సంశయం పొంది అయినా సరే పరాక్రమించు. ఆకాశంలో స్వేచ్ఛగా తిరిగే డేగలాగా మౌనంగా కాని, మాట్లాడుతూ కాని (శత్రుశిబిరాల్లో) తిరుగుతూ, శత్రువులకు అనుమానం రాకుండా వారి బలహీనతలను కనిపెట్టాలి. వజ్రాయుధందెబ్బతిన్నట్లు ఇలా చచ్చినట్లు పడుకొంటా వేమిరా? నీచుడా ! శత్రువుకు ఓడిపోయి నిద్రపోకురా ! ముందు లేవరా ! దైన్యంతో చచ్చిపోకు. విధి నిర్వహణంతో ప్రసిద్ధికెక్కు. సామాన్యుడిగా కాని, అల్పుడిగా కాని, అధముడుగా కాని జీవించకు. ఉరుముతూ వెలుగుతూ జీవించు. కొద్దిసేపయినా తుమ్మికి కొరవిలాగా వెలుగులు చిమ్ముతూ బ్రతుకు. ఊక నిప్పులాగా మంటలేకుండా పొగలు కక్కుతూ జీవించా లనుకోకు. చాలాసేపు పొగలు క్రక్కడం కంటె కొద్ది కాలమయినా వెలుగులు

చిమ్మటం శ్రేయస్కరం. ఎవడో ఒక రాజు ఇంట్లో గాడిదలాగా (బరువు మోస్తూ) పుట్టకు.

వీరుడు యథాశక్తిగా యుద్ధం చేసి అయినా సరే పురుష ప్రయత్నం చేస్తే ధర్మానికి అప్పు పడకుండా ఉంటాడు. తనను తాను అపుడు నిందించుకోవలసిన పనిలేదు. ఫలితం పొందినా, పొందకపోయినా జ్ఞాని విచారించడు. అనంతర కార్యాలు వెంటనే ప్రారంభిస్తాడు. ధనంకోసం ప్రాకులాడడు. పౌరుషాన్ని మనసులో నిలుపుకో లేదా ధర్మాన్ని ముందుంచుకొని శాశ్వతగతిని పొందు. (రెండూ లేకుండా) నీవెందుకు జీవిస్తున్నావురా ? పౌరుషహీనుడా ! నీకు ఇష్టాపూర్తాలు లేనే లేవు. కీర్తి అంతా నశించింది. భోగానికి మూలమైన రాజ్యం పోనేపోయింది. ఇంకా ఎందుకు జీవిస్తున్నావురా? తాను మునిగిపోతున్నా, పడిపోతున్నా శత్రువును పిక్క అయినా పుచ్చుకొని లాక్కుపోవాలి. మూలం చెడిపోయినా సరే ఎప్పుడూ శోకింపరాదు. ఉత్తమజాతి గుర్రాన్ని మనసులో పెట్టుకొని భారం వహించాలి. ప్రయత్నించాలి. బలాన్ని ప్రయోగించు. అభిమానాన్ని కూడ గట్టుకో. నీపౌరుషం ఎంతటిదో తెలుసుకో. నీ వల్ల దిగజారిపోతున్న వంశప్రతిష్ఠను ఉద్ధరించు. ఎవని ప్రవర్తనను మానవులు ఉత్తమమూ, అద్భుతమూ అని ప్రశంసించరో వాడు కేవలం సంఖ్యాపూర్తికే పనికి వస్తాడు కాని వాడు స్త్రీ కాదు, పురుషుడూ కాదు.

దానంలో తపస్సులో, సత్యంలో, విద్యలో, ధన సంపాదనంలో పేరు తెచ్చుకొనని వాడు తల్లి వదలిన మలం వంటివాడు. జ్ఞానంతో, తపస్సుతో, సంపదతో, పరాక్రమంతో ఇతర మానవులను దాటిపో గలవాడే పురుషుడు. అంతేకాని నీచులకూ, క్రూరులకూ, మూర్ఖులకూ, తగిన భిక్షావృత్తి నీ వంటి వారికి తగదు. అది అపకీర్తి తెస్తుంది. బంధువు కృశించిపోయి ఉండటానికీ, కట్టుకోటానికీ లేనివాడని లోకమంతటా తెలిసినవాడు, స్వల్పలాభంతో ఆహా ! ఎంతలాభించిందో అని పొంగి పోయేవాడు, హీనుడు, స్వల్పమయిన జీవనం కలవాడు, శత్రువులకు సంతోషం కలిగించేవాడు అయితే వాడి వల్ల ఎవరూ సుఖపడరు. రాష్ట్రంనుండి మనం నిర్వాసితుల మవుతాం. ఏకోరికా తృప్తి ఉండదు. స్థానభ్రష్టులమై, దరిద్రులమై ఏ వృత్తిలేక చచ్చిపోతాం. సంజయా ! సజ్జనుల్లో అనుచితకార్యం చేశావు. జ్ఞాతులకూ, వంశానికీ అప్రతిష్ఠ తెస్తూ ఉన్న నిన్ను కొడుకుగా కన్నాను. ఒక పట్టుదల లేదు, ఉత్సాహం లేదు, పరాక్రమం లేదు, శత్రువులకు

సంతోషం కలిగిస్తావు. ఇటువంటి పుత్రుని ఏ మగనాలూ కనదు. ఊరికే పొగచూరిపోకు, శత్రువు పై పడి భగ్గుమని మండిపోయి వారిని చంపు. ముహూర్తకాలం, చివరకు క్షణమయినా శత్రువు తల మీద మండిపో. ఇలా శత్రువులపై కోపమూ అసహనమూ కలవాడే పురుషుడు. అలా కాక శత్రువుపట్ల సహనంతో కోపం లేనివాడు పురుషుడూ కాదు స్త్రీయూ కాదు (నపుంసకుడు). సంతృప్తి సంపదను నశింపజేస్తుంది. అలాగే అనవసరమయిన కారుణ్యం కూడా. పౌరుషం లేకపోవడం, భయమూ ఈ రెండూ సంపదను నశింపజేస్తాయి. అందుచేత కోరికలేకపోతే గొప్పదనం కలగదు. ఇలా పరాభవం కలిగించే పాపాల నుండి నిన్ను నీవు విడిపించుకో ! మనసు రాయి (ఇనుపముద్ద) చేసికొని నీ సొమ్మును నీవు వెదకు. శత్రువును తట్టుకోగలవాడే పురుషు డనిపించుకొంటాడు. అలా కాకుండా ఆడదానిలాగా బ్రతికేవాడిని వ్యర్థు డంటారు. శూరు డయిన బలవంతుడు సింహపరాక్రమంతో సంచరిస్తూ ఒకవేళ మరణించినా వాని విషయంలో సంతానం కూడా సంతోషిస్తుంది. తన ప్రియాన్నీ, సుఖాన్నీ, విడిచి సంపదలకై అన్వేషించేవాడు త్వరలోనే తన వారికి సంతోషం కలిగిస్తాడు."

అపుడు (సంజయుడు) కొడుకు ఇలా అన్నాడు. "అమ్మా ! నేను లేకపోయాక నీకు ఈ భూమి అంతా లభించినా ప్రయోజనం ఏముంది ? ఈ ఆభరణాలు లభించినా ప్రయోజనం ఏముంది ? ఈ ఆభరణాలు ఎందుకు ? ఈ భోగాలెందుకు? ఈ జీవితం ఎందుకు ?" వెంటనే తల్లి (విదుల) ఇట్లన్నది. "సోమరుల లోకాలను శత్రువులు పొందాలి. ఆత్మగౌరవం కలవారి లోకాలను మన స్నేహితులు పొందాలి. సేవకులందరూ విడిచిపోతూఉంటే పరాన్నం తింటూ, దీనులై, దుర్బలు లైన వారి ప్రవృత్తిని అనుసరించకు. తండ్రీ ! జీవులన్నీ వానదేవునీ, దేవతలంతా ఇంద్రునీ ఆశ్రయించి జీవిస్తున్నారు. అలాగే బ్రాహ్మణులూ, స్నేహితులూ నిన్ను ఆశ్రయించుకొని జీవించాలి. సంజయా ! ఫలాలు కల చెట్టును ఆశ్రయించి పక్షులు బ్రతుకుతాయి. అలాగే అందరూ, అన్ని ప్రాణులూ ఎవనిని ఆశ్రయించి బ్రతుకుతాయో వాని జీవితం సార్థకం. దేవతలు ఇంద్రుని పరాక్రమంతో సుఖం పొందుతున్నట్లు తన పరాక్రమంతో బంధువులు సుఖపడితే ఆ శూరుని జీవితమే గొప్పది, మంచిది. తన భుజబలంతో జీవించే మానవునికి ఈ లోకంలో కీర్తి లభిస్తుంది. పరలోకంలో శుభగతి కలుగుతుంది."

134. విదుల తన పుత్రుని యుద్ధమునకు ప్రోత్సహించుట.

విదుల ఇంకా ఇలా అన్నది. "ఈ దశలో నీవు పౌరుషం వదులుకొనాలనుకొంటున్నావు. త్వరలో నీవు నీచుల మార్గం పట్టిపోతావు. తనకున్న పరాక్రమంతో తేజస్సును ప్రదర్శించకుండా జీవితాశతో వ్రేలాడే క్షత్రియుని 'దొంగ' అంటారు. ప్రయోజన సహితాలూ, హేతుబద్ధాలూ, గుణవంతాలూ అయిన మాటలు చావబోయేవాడికి మందుల వలె నీకు పనికిరావటం లేదు. సింధురాజుపట్ల ప్రజలంతా పూర్వం ఉన్నట్లు సంతుష్టులై లేరు. దుర్బలులై ఏమీ తోచకుండా ఆ రాజుకు కష్టాలు రావాలని ఎదురు చూస్తున్నారు. నీవారు నీకు సహాయ మందించి తగిన సమయంలో పరాక్రమించారు. అయినా నీవు పౌరుషం ప్రకటించకపోతే మిగతా వారు నీకు ద్రోహం చేస్తారు. (శత్రుపక్షంలో చేరి) నీ వాళ్ళతోకలిసి, గిరిదుర్గాల్లో శత్రువుకు కీడుకాలం కోరుకొంటూ సంచరించు. ఆ శత్రువు జరా మరణాలు లేనివాడు కాదుకదా ! పుత్రా! నీపేరు సంజయుడు. ఆ లక్షణం (జయించేలక్షణం) నీలో కనపడటంలేదు. పేరు సార్థకం చేసుకో, వ్యర్థం చేసుకోకు. నీ చిన్నప్పుడు చక్కని దర్శనం, తెలివికల బ్రాహ్మణుడు " వీడు పెద్ద కష్టం పొంది మళ్లీ అభివృద్ధి చెందుతాడు " అని చెప్పాడు. ఆయన మాటను తలచుకొంటూ నీ విజయాన్ని ఆశిస్తున్నాను. పుత్రా ! అందుచేత నీకు ఇంతగా చెపుతున్నాను. మళ్లీ మళ్లీ కూడా చెపుతున్నాను. తన కార్యసాధన వల్ల తన వారు (బంధుమిత్రులు) తృప్తిపడతారు. అలా తృప్తికలిగించేవానికి నీతి మార్గంలోనే తప్పక కార్యం సిద్ధిస్తుంది. పుత్రా ! "జయంకాని, పరాజయం కాని నాకైనాసరే ముందు వారికైనా సరే కలుగుతుంది." అని యుద్ధానికి సిద్ధపడు. అంతేకాని వెనుదిరగకు.

"ఈ రోజుకేకాదు ఈపూటకు కూడా భోజనం లేదు" అనే దురవస్థను మించినదీ ఏదీలేదని శంబరుడు చెప్పాడు. ఈ దారిద్ర్యం అనేది మగడు, పుత్రుడు, చనిపోయిన దానికంటే దుఃఖకరం. నిజానికి మరణానికి మరోపేరు దారిద్ర్యం. నేను గొప్పవంశంలో పుట్టాను. ఒక మడుగు లోంచి మరో మడుగులోకి వచ్చాను. ఎన్నో వైభవాలూ, శుభాలూ అనుభవించాను. భర్త యొక్క ఆదరణ పొందాను. విలువయిన పూలమాలలూ, ఆభరణాలూ, వస్త్రాలూ ధరించి చెలికత్తెలతో తిరిగే నన్ను పూర్వం అంతా ఆనందంతో చూసే వారు. నేనూ, నీ భార్యా మిక్కిలి దుర్బలులమై ఉండటం

చూశాక సంజయా ! నీ జీవితం ఎందుకు ? దాసీపనివారూ, సేవకులూ, ఆచార్యులూ, ఋత్విక్కులూ, పురోహితులూ జీవనోపాధిలేక మనలను వదలి వెళ్లి పోతుంటే, ఆ పరిస్థితిని కళ్లారా చూశాక నీవు ఇంకా జీవించడం ఎందుకురా ? నీవు మళ్లీ ప్రశంసనీయమూ, కీర్తికరమూ అయిన పనులు చేస్తున్నట్లు చూడక పోయాక నా మనసుకు ఎలా శాంతి లభిస్తుంది ?

బ్రాహ్మణునకు 'లేదు" అని చెప్పవలసివస్తే నాగుండె బ్రద్దలయిపోతోంది. బ్రాహ్మణునికి ఎన్నడూ నేనూ, నా భర్తా లేదనే మాట చెప్పలేదు. మనం ఆశ్రయం ఇవ్వదగిన వారమే కాని పొందదగిన వారం కాదు. ఇతరుని ఆశ్రయించి జీవించవలసివస్తే జీవితాన్నే వదిలివేస్తాం. తీరం లేని మమ్మల్ని ఒక ఒడ్డుకు చేర్చు. తెప్పలేని మాకు నీవు తెప్పవు కావాలి. నిలకడలేని మాకు నిలుకడ నియ్యి. చచ్చిపోయిన మమ్ము బ్రతికించు. శత్రువులందరినీ నీవు జయించగలవు. అలా కాక నపుంసకత్వం వహిస్తానంటే అసలు జీవించటానికే అర్హుడవు కావు. నిర్వేదపరుడవై, సంకల్ప రహితుడవై ఈ పాడు బ్రతుకును విడిచిపెట్టు. ఒక్క శత్రువును చంపినా చాలు శూరుడికి పేరు వస్తుంది. ఒక్క వృత్రుని చంపటం వల్లనే ఇంద్రుడు మహేంద్రు డయ్యాడు. మహేంద్రభవనం పొందాడు. ముల్లోకాలకూ రాజయ్యాడు. యుద్ధంలో తనపేరు చెప్పి, కవచం తొడిగిన శత్రువులను పిలిచి, సేనాముఖాన్ని తరిమివేసి కాని, నాయకుని ఒక్కడిని చంపికాని మంచి పేరు తెచ్చుకుంటే శత్రువులు ఎంతో వ్యథ చెందుతారు. లొంగిపోతారు. నీచులు వశం తప్పి తాము నశించి యుద్ధంలో సమర్థుడూ, పరాక్రమవంతుడూ అయిన శూరుని కోరిన సంపదలతో తృప్తి పరుస్తారు. సజ్జనులు రాజ్యం పోయినా, జీవితం సంశయాస్పద మయినా ఒప్పుకొంటారుకాని చేతికి చిక్కిన శత్రువును మిగల్చరు. రాజ్యం స్వర్గద్వారం వంటిది. లేదా అమృత తుల్యమయినది (మరణిస్తే స్వర్గ ద్వారం - చంపితే అమృత తుల్యం) కానిఒక మార్గం మూసి ఉంటుంది అని భావించి మండే కొరవిలాగా శత్రువుల మీద పడు. యుద్ధంలో శత్రువులను సంహరించు. నీ ధర్మాన్ని చక్కగా పాలించు. శత్రువుల భయాన్ని పోగొట్టే నిన్ను (పరమదీనుని) నేను చూడలేను. మనవాళ్లంతా ఏడుస్తూ, శత్రువులు పరిహసిస్తూ, అరుస్తూ ఉంటే పరమ దీనుడిలా ఉన్న నిన్ను చూడలేను.

సౌవీరకన్యలైన నీభార్యలతో సుఖించు. పూర్వంలాగా వారిని సంతోషపెట్టు.

అంతేగాని అవసానదశకు వచ్చి, సైంధవకన్యలకు వశమై పోకు. యువకుడై, రూపమూ, విద్య, సత్కులమూ సమృద్ధిగా ఉండి, మంచిపేరు ప్రఖ్యాతులున్న, నీవంటి వాడు ఇటువంటి పనిచేయరాదు. బరువు మోయలేని ఎద్దు లాగా ఇలా చెయ్యడం మరణంతో సమానం. శత్రువుకు ప్రియంగా మాట్లాడుతూ, వాడి వెంట తిరుగుతున్న నిన్ను చూస్తే నామనస్సుకు శాంతి ఎక్కడి నుంచి వస్తుంది ? ఈ కులంలో పుట్టినవాడెవడూ మరొకని వెనుక తిరగడు. నీవు శత్రువు వెనుక తిరుగుతూ జీవించరాదు. శాశ్వత మయిన క్షత్రియహృదయం నాకే తెలుసును. నీ వంశంలోని పూర్వులూ, ఇంకా ముందు వారూ ఈ క్షత్రియహృదయం శాశ్వతమనీ, తరగని దనీ, ఇది ప్రజాపతి చేసినదనీ చెప్పారు. నీ వారేకాదు. ఇతరులూ, వారిపూర్వులూకూడా ఈ మాటనే చెప్పారు. ఈ సద్వంశంలో పుట్టి క్షత్రియధర్మం తెలిసిన క్షత్రియుడు భయంతోకాని, జీవనోపాధికోసంగాని ఎవరికీ తలవంచకూడదు. ఎల్లప్పుడూ ప్రయత్నం చేస్తూనే ఉండాలి. అంతేకాని తలవంచకూడదు. ఉద్యమమే పురుష లక్షణం. వ్యర్థంగానైనా చచ్చిపోవచ్చును కాని ఎవరికీ తలవంచరాదు. పెద్దమనసుతో మదపుటేనుగులా సంచరించాలి. సంజయా ! కాని బ్రాహ్మణులకు, బ్రహ్మజ్ఞానులకు నిత్యమూ మ్రొక్క వచ్చును. అదయినా ధర్మంకోసం. మిగిలిన వర్ణాల వారిని వారి వారి ధర్మాల్లో నిలుపుతూ, దుర్మార్గులను సంహరిస్తూ, సహాయం ఉన్నా లేకపోయినా జీవితమంతా అలాగే బ్రతకాలి."

135. విదుల పుత్రునికి జయోపాయములను చెప్పుట.

తల్లి బోధ విని కొడుకు ఇలా అన్నాడు. "తల్లీ నీ మనసున దయలేదు. కాని తెలివీ, కోపమూ నిండి ఉన్నాయి. అసలు నీ మనసును నల్లని ఇనుపముద్దగా చేశాడు. ఆహా ! క్షత్రియ ధర్మం ఎంతటిదోకదా ! ఆ క్షత్రియ ధర్మంకోసం పరాయివాడిని తోలినట్లు నన్ను నీవు యుద్ధానికి తోలుతున్నావు. ఒక్కగానొక్క కొడుకును నేను నీకు. నీవు నన్ను ఇలా మాట్లాడుతున్నావు. నేను లేక పోయాక నీకీ భూమి అంతా వశమయినా ఏం లాభం? నీకు ప్రియమైన కుమారుడను కదా ! నేను పోయాక నీకు నగలు కాని భోగాలు కాని జీవితం కాని ఎందుకు ?"

అపుడు తల్లి ఇలా అన్నది. "తండ్రీ! ధర్మమూ, అర్థమూ ఈ రెంటికారణంగానే

పండితులకు కూడా అన్ని అవస్థలూ కలుగుతున్నాయి. సంజయా ! ఆ రెండింటినే బాగా సమీక్షించి నిన్ను ప్రేరేపించాను. బాగా పరీక్షించి పరాక్రమింపదగిన సమయం వచ్చింది అనగానే, ఇపుడు నీవు సముచితమయిన పని చేయకుండా శత్రువుమీద, దేహం మీద దయచూపిస్తున్నావు. ఇలా చేస్తే నీ మొగం ఎవ్వరూ చూడరు సరికదా అపకీర్తి వస్తుంది. నేను ఈవిషయం చెప్పకపోతే ఇది గాడిద వాత్సల్యం అంటారు. (గాడిద తన పిల్లమీద చూపే ప్రేమ ఇహానికీ, పరానికీ కూడా పనికిరాదు) ఈ మార్గాన్ని మూర్ఖులు ఆదరిస్తారు. సజ్జనులు నిందిస్తారు. అందుచేత దాన్ని విడిచిపెట్టు. ఈ మార్గ మనుసరించే వారిలో చాలా అజ్ఞానముంటుంది. నీలో సత్ప్రవర్తన ఉంటే నాకు ఇష్టుడ వవుతావు. నీవు నడిచే దారి ధర్మార్థసహితం కావాలి. సజ్జనులకు ఆచరణీయం కావాలి. దైవమానుషాలు రెండింటికి ఆలంబనం కావాలి. మరోమార్గం ఎన్నడూ ఆచరించకు. వినయంలేని, సోమరియైన దుర్బుద్ధి కొడుకయినా మునిమనుమ డయినా వాడిని చూసి మురిసిపోతే, అది సంతానఫలం దక్కినట్లు కాదు. మంచి పనులు చేయకుండా, తప్పుపనులు చేస్తూ ఉండే పురుషాధములు ఇహ పరాలు రెండిటా సుఖం పొందరు. సంజయా ! క్షత్రియుడు యుద్ధంకోసం, జయంకోసమే సృష్టింపబడినాడు. యుద్ధంలో జయించినా, చనిపోయినా కూడా ఇంద్రునితో సమానస్థితిని పొందుతాడు. శత్రువులను వశపరచుకొని పొందేసుఖం స్వర్గంలో ఇంద్రభవనంలో కూడా లేదు. అభిమానం కల క్షత్రియుడు అపకారంతో కోపంతో దహించుకొని పోతూ, శత్రువులను జయించాలనే పట్టుదలతో దండెత్తి, తాను చచ్చి అయినా సరే, శత్రువును చంపి అయినా సరే శాంతి పొందుతాడు. అంతేకాని క్షత్రియుడు శాంతి పొందటానికి మరో మార్గం లేదు. బుద్ధిమంతు డయిన మానవుడు తనకు అప్రియమయినది చాల తక్కువ ఉండాలనికోరుతాడు. స్వల్పమయిన ప్రియం ఉండే వానికి అప్రియం తప్పక తక్కువగానే ఉంటుంది. ప్రీతి లేని పురుషుడు శుభాన్ని పొందడు. సముద్రంలో కలిసిన గంగ లాగా వాడు తప్పక నశిస్తాడు."

అపుడు కొడుకు ఇట్లన్నాడు. "తల్లీ ! నీవిటువంటి బోధ చేయకూడదు. ముఖ్యంగా పుత్రునికి అసలే చెప్పరాదు. ఈ సందర్భంలో మూఢురాలివలె, మూగిదానిలా కారుణ్య భావాన్నే వహించు." తల్లి యిట్లన్నది. "ఇలా ఆలోచన చేస్తున్నందుకు నాకు చాలా సంతోషంగా ఉంది. నేను నీకేది చేయాలో నాకు నీవు చెపుతున్నావు.

నేను అందుకే నీ కర్తవ్యాన్ని సూటిగా నొక్కి చెపుతున్నాను. సింధుదేశపు రాజులందరినీ చంపి, నీవు కష్టంగా భావించిన విజయం చూస్తేనే నేను నిన్ను ప్రశంసిస్తాను." అపుడు కొడుకు ఇలా అన్నాడు. "నాకు కోశాగారం లేదు. సహాయులు లేరు. ఇక విజయం ఎలా సిద్ధిస్తుంది? ఈ దారుణ మయిన పరిస్థితిని నా అంతట నేను తెలుసుకొన్నాను. పాపి స్వర్గం నుండి వెడలగొట్ట బడినట్లు నా మనసు రాజ్యంనుండి మరలింపబడింది. తల్లీ ! నీకు పండిన తెలివి ఉంది. నీకు తోచిన ఉపాయం చెప్పు. నీవు చెప్పినట్లు అంతా చేస్తాను." తల్లి ఇట్లంది. "కుమారా ! తన్ను తాను ఎవరూ అవమానపరచుకోరాదు. సంపదలు పూర్వం లేకపోయినా వస్తాయి. పూర్వం ఉన్నా ఇపుడు నష్టమయిపోతాయి. తెలివి తక్కువవారు తొందరపాటుతో ధర్మార్థాలను ప్రారంభించరాదు. తండ్రీ ! మనం చేసే కర్మలన్నిటికీ ఫలం వస్తుందో లేదో చెప్పలేము. ఫలం అనిత్యం అని తెలిసిన పండితులు ఆ ఫలితాన్ని పొందవచ్చు, పొందలేక పోవచ్చు. కార్యం చేయనివారికి ఎన్నడూ ఫలితం రాదు. కర్మముల పట్ల ఆసక్తి లేకపోతే ఒకటే గుణం. అదిఫలం నశించటమే. ఆసక్తి ఉంటే ఫలం రావడమో, రాకపోవడమో అని రెండు గుణాలు (సందేహం.) మన ఇష్టాన్ని బట్టి కార్యఫలాలు సిద్ధించవని తెలిసినవాడు ప్రతికూలాలయిన ఆత్మహానిని కాని, శత్రుసమృద్ధిని కాని లెక్క చేయడు. మానవుడు సదా దుఃఖరహితుడై, తప్పక సాధించగలమని మనసు దృఢపరచుకొని మేలు కలిగించే పనులలో ఉద్యమించాలి, మేల్కొని శుభకర్మలలో ఆసక్తుడై ఉండాలి.

పుత్రా ! దేవబ్రాహ్మణులను, మంగళ కృత్యాలను ముందిడుకొని ప్రవర్తించే రాజుకు త్వరగా అభివృద్ధి కల్గుతుంది. తూర్పు దిక్కును సూర్యుడు పొందినట్లుగా లక్ష్మీదేవి అట్టివానిని చేరుతుంది. నీకు చాలా నిదర్శనాలూ, ఉపాయాలూ, ప్రోత్సాహకాలూ, లోకపుతీరులూ చూపించాను. నీవు పౌరుషం చూపించు. చూస్తాను. కోరిన పురుషార్థాన్ని సమీకరించుకో, నీ మీద కోపం కలవారినీ, లోభులనూ, క్షీణించినవారినీ గర్వితులనూ, అవమానితులనూ, పోటీదారులనూ తెలివితో కూడగట్టుకో. వేగం కల గాలి మేఘాలను చెదరగొట్టినట్లు, నీవు శత్రుసేనలను ఛేదించ గలవు. చీల్చి వేయగలుగుతావు. పై వారికి ముందు అన్నీ ఇయ్యి. (భోజనమూ, వేతనమూ మొదలయినవి) న్యాయాన్ని నిలబెట్టు. ప్రియంగా మాట్లాడు. అపుడు వారు నీకు ప్రియం చేస్తారు. బాగా గౌరవిస్తారు.

తన శత్రువు ప్రాణాలకు తెగించి పోరాడుతాడని తెలిసిన వెంటనే శత్రువు భయపడతాడు, ఇంట్లో ఉన్న పాముకు భయపడినట్లు. పరాక్రమించే శత్రువును వశపరచుకొనలేకపోతే మంచి మాటలతో వానిని విజృంభించకుండా చెయ్యాలి. చివరకు (సామోపాయంతో) అలా లొంగదీసుకోవాలి. మంచి మాటలతో స్థానం సంపాదిస్తే ధనం వృద్ధి చెందుతుంది. ధనవంతుడినే మిత్రులు సేవిస్తారు. ఆశ్రయిస్తారు. ధనం కోల్పోయిన వానిని బంధువులు కూడా వదిలివేస్తారు. అంతేకాదు, వాని మీద విశ్వాసం ఉంచరు. అసహ్యించుకొంటారు కూడా. శత్రువు సహాయంపొంది, అతనిని నమ్మితే ఇక రాజ్యం దక్కుతుందనేది అసంభవం.

136. విదులబోధతో సంజయుడు యుద్ధమునకు బయలు దేరుట.

తల్లి ఇలా అంటున్నది. "రాజు ఎన్నడూ ఆపదలో భయపడకూడదు. ఒకవేళ భయపడినా భయపడినట్లు ప్రవర్తించకూడదు. భయపడిన రాజును చూసి సేనఅంతా చెల్లా చెదరు అయిపోతుంది. మంత్రులు కూడ బుద్ధి మార్చుకొని వేరైపోతారు. కొంతమంది శత్రువులలో చేరుతారు. మరి కొందరు నిన్ను వదలి ఎటో పోతారు. పూర్వం నీచేత అవమానింపబడినవారు నిన్ను దెబ్బతీయాలని చూస్తారు. బాగా దగ్గరస్నేహితులు మాత్రం వానిని కొలుస్తూనే ఉంటారు. వారు కట్టివేయబడిన దూడల వలె అశక్తులయి, ఏమీ చేయలేక శుభాన్ని మాత్రం కోరుతారు. పైగా చెడిన బంధువులను ఓదార్చినట్లు, దుఃఖించే వారి దగ్గర ఏడుస్తూ ఉంటారు. నీచేత పూజింపబడిన స్నేహితులు నీకున్నారు గదా ! ఆపద పొందిన రాజుయొక్క రాజ్యం తమదే అని అభిమానించే స్నేహితులు నీకూ ఉన్నారుకదా! భయపడకు నీవు. నీప్రభావాన్ని, పౌరుషాన్ని, తెలివినీ తెలుసుకోవాలనీ, నీకు ధైర్యంచెప్పాలనీ, నీ పౌరుషం రెచ్చ గొట్టాలనీ ఇలా చెప్పాను. సంజయా ! ఈ విషయం నీకు చక్కగా తెలిస్తే, నేను చక్కగా చెప్పి ఉంటే, గుండె దిటవు చేసికొని విజయం కోసం లేచి నిలబడు. నీకు తెలియని గొప్పనిధి మనకు ఉంది. అది నాకు తెలుసును. ఇంకెవ్వరికీ తెలియదు. దానిని నీకు తెచ్చి పెడతాను. సంజయా ! నీకు చాలా మంది స్నేహితు లున్నారు. వారంతా సుఖదుఃఖాలు సహింపగలవారు. యుద్ధం నుండి వెనుదిరగరు. శత్రుమర్దనా ! నీకు మేలు కోరే స్నేహితులూ, మంత్రులూ కొద్దిపాటి ఇష్టమయినా చేయా

లనుకొంటారు."

చక్కని పదాలు, చిత్రమయిన అర్థాలు, అక్షరాలు కల ఆమెమాట విన్న ఆ కుమారునకు మనసులోని చీకటి తొలగిపోయింది. వెంటనే కొడుకు ఇలా అన్నాడు. "అమ్మా! మునిగిపోయే ఈ భూమిని నేను ఉద్ధరించాలి. లేదా యుద్ధమనే లోయలోపడి మరణించాలి. ఏమయినా నా భవిష్యత్సంపదను చూపించి నన్ను నడిపించుతున్నావు. అమ్మా ! నీ మాటలు ఒక దానికంటే మరొకటి చాలా బాగుగా ఉండటం చేత పూర్తిగా వినాలని కొద్ది కొద్దిగా ఊరికే ఎదురు చెపుతూ వచ్చాను. మాతృబంధంతో చాలా కష్టపడి పొందిన అమృతం వంటి ఈ మాటలతో తృప్తి కలగటంలేదు. శత్రువులను నిలిపేందుకు, జయం పొందటానికి ఇదిగో బయలు దేరుతున్నాను." కుంతీదేవి ఇట్లు చెప్పింది. "మాటల బాణాలు బాగా నాటుకొని, అతడు (సంజయుడు) జాతి గుర్రంలా ఉరికి మాట ప్రకారం అంతా చేశాడు. ఈ కథ ఉత్సాహం కలిగిస్తుంది. భయం కరమయినది. పౌరుషం కలిగిస్తుంది. ఉత్తమ మయినది. శత్రుపీడతో మునిగిపోతున్న రాజుకు మంత్రి దీన్ని వినిపించాలి. జయ మనే పేరుగల ఈ ఇతిహాసాన్ని జయం పొందాలనుకొన్నవాడు వినాలి. దీన్ని వింటే వెంటనే శత్రుసంహారం చేసి భూమిని జయిస్తాడు. ఇది వీరు డయిన పుత్రుని ఇచ్చే యజ్ఞం. గర్భవతి వింటే తప్పక వీరుని కంటుంది. విద్యలో, తపస్సులో, దానంలో చురుకైన వానిని, తపస్విని, బ్రహ్మతేజస్సుతో ప్రకాశించే వానిని, సజ్జన సమ్మతుడయిన వానిని కంటుంది. అగ్నివంటి తేజస్సు కలవానిని, బలవంతుని, మహానుభావుని, మహారథుని, పుత్రునిగా పొందుతుంది. ఎవరికీ లొంగని ధైర్యం కలవానిని, పరాజయం ఎరుగని జయశీలుని పుత్రునిగా పొందుతుంది. దుష్టులను శిక్షిస్తూ, ధార్మికులను రక్షిస్తూ, సత్యపరాక్రమం కల వీరుని కుమారునిగా పొందుతుంది."

137. పాండవులకు కుంతి సందేశ మిచ్చుట.

కుంతి ఇలా చెప్పింది – "కేశవా! అర్జునునితో ఇలా చెప్పు. నీ పురిటి సమయంలో ఆశ్రమంలో స్త్రీలంతా నాచుట్టూ ఉండగా ఆకాశంలోంచి మనోహరమయిన ఒక దివ్యవాణి వినిపించింది. "కుంతీ! ఈ నీ కొడుకు దేవేంద్రునితో సమాను డవుతాడు. యుద్ధంలో ఎదురు వచ్చిన కౌరవు లందరినీ భీముని సాయంతో చెల్లాచెదరు చేస్తాడు.

వాసుదేవుని సహాయంతో యుద్ధంలో కౌరవులను సంహరించి భూమిని జయిస్తాడు. వీని యశస్సు ఆకాశ మంటుతుంది. పోయిన తండ్రి భాగాన్ని మళ్లీ సంపాదిస్తాడు. సోదరులతో కలిసి మూడు అశ్వమేధ యాగాలు చేస్తాడు" అని చెప్పింది. అచ్యుతా! బీభత్సు డయిన ఆ సవ్యసాచి ఎంత సత్యసంధుడో, ఎంత బలవంతుడో, ఎంత దురాసదుడో నీకే తెలుసు. కృష్ణా! అది అలాగే కావాలి. ధర్మం అనేది ఉంటే ఆకాశవాణి పలికిన పలుకు సత్యం అవుతుంది. కృష్ణా! ఆకాశవాణి మాటను శంకింపను కాని, ఆ మాట అంతా నిజం చెయ్యటానికి నీవే తగుదువు.

గొప్పదైన ధర్మానికి నమస్కారం - ధర్మమే ప్రజలను ధరింపజేస్తుంది. ఈ విషయం అర్జునుడికీ, నిత్యసన్నద్ధుడైన భీమునికీ చెప్పు. రాజనీత ఎందుకు పుత్రులను కంటుందో అందుకు తగిన సమయం ఆసన్నమయింది. పురుషశ్రేష్ఠులు ఒకసారి వైరం వహించాక దానినుండి సడలిపోరు. కృష్ణా! నీకు భీముని మనస్సు తెలిసినదే కదా! శత్రువును అంతం చేయకుండా శాంతించడు. కృష్ణా! సర్వధర్మాలూ తెలిసిన, పాండుమహారాజుకోడలుతో ఇలా చెప్పు. "సద్వంశంలో పుట్టిన యశస్వినీ! నా కొడుకులందరితో ధర్మం తప్పక ప్రవర్తిస్తావు - ఇది చాలా బాగుంది" - అని. జీవితం కాదు, పరాక్రమించి పొందే భోగాలను కోరుకొమ్మని రాజధర్మం మీద ఆసక్తి కల నకుల సహదేవులకు చెప్పు. విక్రమంతో పొందిన భోగాలు రాజధర్మంతో జీవించే వాని మనస్సుకు సదా తృప్తి నిస్తాయి. సర్వధర్మాలనూ పోషించే మీరు చూస్తూ ఉండగా పాంచాలిని చాలా పరుషంగా (ఆనాడు సభలో) మాట్లాడారు. దానిని ఎవరు క్షమిస్తారు? రాజ్యాన్ని అపహరించినా, జూదంలో పరాజయం పొందినా, కొడుకులు అడవికి వెళ్లినా నాకు అవి దుఃఖం అనిపించలేదు. కాని ఆ సభలో వీరపత్ని ద్రౌపది ఎన్నో నిందలు పొందింది. అది నాకు చాలా దుఃఖం కలిగించింది. ఆమె స్త్రీ ధర్మాలు చక్కగా ఆచరిస్తుంది. రాజధర్మాసక్తి కల ఆమె అక్కడ భర్తలుండికూడా అనాథగా విలపించింది. కృష్ణా! అస్త్రశస్త్ర విశారదుడూ, పురుష శ్రేష్ఠుడూ అయిన అర్జునునితో చెప్పు - "ద్రౌపది మార్గం అనుసరించు" అని. నీకు తెలుసు - కోపించిన యముడూ, మృత్యువూ లాంటి భీమార్జునులు దేవతలనైనా చంపగలరు". ద్రౌపది ఆ సభలోకి వచ్చిందంటే అది భీమార్జునులకు ఎంతో అవమానం. అంతేకాదు. ఆ దుశ్శాసనుడు భీముని చాలా పరుషంగా మాట్లాడాడు. కురువీరులంతా చూస్తూ

ఉండగా అన్న ఆ మాటలను ఒక్కసారి వారికి గుర్తుచెయ్యి. పాండవులనూ, పుత్రసహితయైన ద్రౌపదినీ క్షేమ మడిగినట్లు చెప్పు - నేను కుశలంగా ఉన్నట్లు వారికి మళ్లీ మళ్లీ చెప్పు -కృష్ణా! నీకు మార్గం సుగమ మగుగాక! నా పుత్రులను రక్షించు.

కృష్ణుడు కుంతికి ప్రదక్షిణ నమస్కారాలు చేసి, సింహంలా నడుస్తూ బయలుదేరాడు. తరువాత కురుపుంగవు లయిన భీష్మాదులను విడిచి,కర్ణుని తన రథం ఎక్కించుకొని సాత్యకితో బయలుదేరాడు. కృష్ణుడు వెళ్లాక కురువంశస్థులంతా అతనిని గూర్చి అతని అద్భుత కృత్యాలను గురించి ఆశ్చర్యంగా కలిసి చెప్పుకోసాగారు. 'దుర్యోధనుని మంకుతనంతో ఈ భూమి అంతా మృత్యుపాశానికి వశమైపోయింది. ఇది ఇంక ఎంతోకాలం ఉండదు' అని అనుకొన్నారు. తరువాత పురుషోత్తముడు నగరం నుండి బయటకు వచ్చి కర్ణునితో చాలాసేపు మంతనా లాడాడు. యాదవులకు ఆనందం కలిగించే కృష్ణుడు రాధేయుని వదలి, వెంటనే వేగంగా గుర్రాలను తోలించాడు. దారుకుడు తోలుతున్న ఆ గుర్రాలు మనోమారుత వేగంతో, ఆకాశాన్ని మ్రింగేస్తున్నాయా అన్నట్లు దూకుతున్నాయి. వేగంగా వెళ్లే డేగల్లాగా, ఆ గుర్రాలు చిటికెలో ఆ దారి అంతా గడిచి, కృష్ణుని తీసికొని ఉపప్లావ్య నగరం చేరాయి.

138. భీష్మద్రోణులు దుర్యోధనునకు బోధించుట.

కుంతీదేవి మాట విని, మహారథులయిన భీష్మద్రోణులు పెద్దల మాటలను అతిక్రమించే దుర్యోధనునితో ఇలా అన్నారు. "పురుషవ్యాఘ్రా! కృష్ణుని దగ్గర కుంతి అర్థవంతమూ, ధర్మసహితమూ, ఉత్తమమూ అయిన మాట ఎంత భయంకరంగా మాట్లాడిందో విన్నావుగా ! ఆ కుంతీపుత్రులు కృష్ణునికిష్టమైన ఆ పని పూర్తిచేస్తారు. దుర్యోధనా! రాజ్యం లేకుండా వారు ఎన్నటికీ శాంతించరు. ధర్మపాశానికి కట్టుబడిన కుంతీపుత్రులను నీవు చాలా కష్టపెట్టావు. సభలో ద్రౌపదిని ఎంతగానో బాధించావు. అయినా వారు సహించారు. అర్జునుడు అస్త్ర విద్యావిశారదుడు. ఎపుడో నిశ్చయం చేసుకొన్నవాడు భీముడు (మిమ్మల్ని సంహరించాలని). ఇక గాండీవం, అమ్ములపొదులూ, దివ్యరథమూ, కపి ధ్వజమూ అర్జునుని కున్నాయి. బలపరాక్రమ సంపన్నులయిన నకుల సహదేవు లున్నారు. వాసుదేవుని సహాయం ఉంది. ఇన్నీ ఉండి ఆ యుధిష్ఠిరుడు

నిన్ను క్షమించడు. మొన్ననే విరాటనగరంలో ఆ అర్జునుని చేతిలో మనమంతా యుద్ధంలో ఓడిపోవడం నీవు కళ్లారా చూశావు గదా! దారుణకృత్యాలు చేసే నివాతకవచుల్ని రౌద్రాస్త్రంతో అర్జునుడు దగ్ధం చేశాడు. ఈ కర్ణాదులూ, కవచం తొడిగి రథమెక్కిన నీవూ ఘోషయాత్రలో అర్జునుని వల్లనే విడిపింపబడ్డారు. ఆ నిదర్శనం చాలును. కురుపుంగవా! సోదరులయిన పాండవులతో స్నేహం చెయ్యి- మృత్యువు కోరల్లో చిక్కుకున్న ఈ భూమినంతటినీ రక్షించు.

నీకు అన్న, ధర్మశీలుడు ధర్మరాజు. నీ మీద వాత్సల్యం కలవాడు. ప్రియంగా మాట్లాడేవాడు. మేధావి. (నీ మనసులోని) కల్మషం విడిచి ఆ ధర్మరాజును ఆశ్రయించు. ధనుర్బాణాలు పొగొట్టుకొన్న సమయంలో నీవు ధర్మరాజు చేత చూడబడ్డావు. బొమలు ముడివడని ధర్మరాజు మన వంశానికి ప్రశాంతి చేకూర్చాడు. మంత్రులతో సహా అతని చేరి, కౌగిలించుకొని పూర్వం వలె గౌరవంతో నమస్కరించు. నమస్కరించే నిన్ను ధర్మరాజు సౌహార్దంతో స్వీకరించాలి. సింహం మూపులాంటి ఎగుబుజాలూ, కండలు తిరిగిన పొడుగాటి చేతులూ కల భీముడు నిన్ను ఆలింగనం చేసుకోవాలి. శంఖం వంటి మెడ, పద్మాలవంటి కనులు కల ధనుర్విద్యావేత్త అర్జునుడు నీకు నమస్కరించాలి. నరశ్రేష్ఠులూ, చక్కని సౌందర్యం కలవారు నకుల సహదేవులు. వారు నిన్ను ప్రేమతో గౌరవంతో ఎదురువచ్చి స్వాగతించాలి. కృష్ణాదులయిన రాజులు ఆనందబాష్పాలు వదలాలి. రాజా! అహంకారం విడిచి సోదరులతో కలిసిఉండు. తరువాత సోదరులతో కలిసి భూమినంతా పాలించు. ఈ రాజులందరూ సంతోషంతో పరస్పరం ఆలింగనం చేసికొని మరలిపో(తారు) వుదురుగాక.

నీ స్నేహితులంతా యుద్ధం వద్దు అంటున్నారు. యుద్ధం వల్ల రాజులకు నిశ్చయంగా వినాశమే కలుగుతుంది. అందుచేత యుద్ధం వద్దు. నక్షత్రాలు ప్రతికూలంగా ఉన్నాయి. మృగాలూ, పక్షులూ భయంకరంగా ఉన్నాయి. రాజుల వినాశాన్ని సూచించే ఎన్నో శకునాలు కనపడుతున్నాయి. ముఖ్యంగా మన సేనలో ఈ దుశ్శకునాలు కనిపిస్తున్నాయి. నీ సైన్యంలో మంటలతో కూడిన ఉల్కలు కనిపిస్తున్నాయి. నీ వాహనాలు (గుర్రాలు, ఏనుగులూ) ఏడుస్తున్నట్లుగా మొగాలు వ్రేలాడ వేసుకొని కనిపిస్తున్నాయి. నీ సైన్యాల చుట్టూ గ్రద్దలు తిరుగుతున్నాయి. నీ నగరమూ, రాజభవనమూ పూర్వంలా కనపడటంలేదు-మండే దిక్కుకు మొగంపెట్టి నక్కలు అశుభసూచకంగా

ఏడుస్తున్నాయి. నీ తండ్రీ, తల్లీ, నీ హితం కోరే మేమూ, చెప్పిన మాట విను - శాంతి కాని, శ్రమ కాని నీ చేతిలోనే ఉంది. శత్రుమర్దనా! స్నేహితుల మాటలు నీవు వినకపోతే (యుద్ధంలో) అర్జునుని బాణపు దెబ్బలు తిన్న సైన్యాన్ని చూసి పరితపించక మానవు. నేను చెప్పినమాట నీకు సవ్యంగా అనిపించకపోతే బలవంతు డయిన భీముని మహానాదమూ, గాండీవ ఘోషనూ విని నామాటలు గుర్తు తెచ్చుకొంటావు."

139. ద్రోణుడు శాంతికై దుర్యోధనుని మందలించుట.

వారిలా అనేసరికి దుర్యోధనుడు ప్రక్కచూపులూ, నేలచూపులూ చూస్తూ కనుబొమలు ముడిచేసుకుని ఏమీ మాట్లాడకుండా ఉండిపోయాడు. తాము చెప్పినదానికి దుర్యోధనుడు వ్యతిరేకభావంతో ఉన్నట్లు భీష్మద్రోణులు తెలుసుకొని మళ్లీ యిలా అన్నారు. ముందు భీష్ముడు ఇలా అన్నాడు. "అర్జునుడు పెద్దలమాట వింటాడు. అసూయపడడు, బ్రహ్మణ్యుడు. సత్యమే చెపుతాడు. అటువంటి వానికి ఎదురుగా ఇపుడు పోరాడుతున్నాం. ఇంతకు మించిన దుఃఖం ఏముంటుంది?" తరువాత ద్రోణు డిట్లు అన్నాడు. "నా పుత్రుడు అశ్వత్థామ మీద ఎంత ఇష్టమో అర్జునుని మీద కూడ అంతే ఇష్టం. ఇంకా ఒకపాలు అర్జునుని మీదే ఎక్కువ. పుత్రునికంటే ప్రియమయిన అర్జునుడితో క్షత్రియ ధర్మంతో యుద్ధం చేయవలసి వస్తోంది. ఛీ! క్షత్రియ జీవనం చాలా కష్టం. లోకంలో అర్జునునితో సమానమైన విలుకాడు లేనేలేడు. నా అనుగ్రహంతో అర్జునుడు మిగిలిన విలుకాండ్రకంటె శ్రేష్ఠ డయ్యాడు. మిత్రద్రోహి, దుర్మార్గుడు, నాస్తికుడు, కుటిలుడు, మూర్ఖుడూ అయినవాడు సజ్జనులున్న యజ్ఞానికి వచ్చిన మూర్ఖునిలాగా గౌరవం పొందలేడు. పాపకృత్యాలు చేయవద్దని మిత్రులు నివారిస్తున్నా పాపి పాపాలే చేస్తాడు. అలాగే పుణ్యాత్ముడు పాపుల చేత పురికొల్పబడినా సరే పుణ్యమే చేస్తాడు. పాండవులను నీవు కపటప్రేమతో మోసగించావు. అయినా వారు నీపట్ల ప్రియంగానే ప్రవర్తిస్తున్నారు. నీ దోషాలు మాత్రం విరోధానికి దారితీస్తున్నాయి. భీష్ముడు, నేను, విదురుడు, వాసుదేవుడు నీకు హితం చెప్పాం. కాని దాన్ని నీవు శ్రేయస్సుగా భావించడంలేదు.

'నాకు బలం ఉంది' అనుకొని సాహసంతో వర్షాకాలంలో పొంగి పొరలే, మొసళ్లు తిమింగిలాలు కల గంగానదిని (పాండవసేనను) దాటాలని అనుకొంటున్నావు.

ఇతరులు కట్టుకొన్న వస్త్రాన్ని ఒంటిమీద కప్పుకొని నాదే అని మురుస్తున్నావు. ఇతరులు పెట్టుకొని, తీసి, పారేసిన పూలమాలవలె ధర్మజుని సంపదను లోభంతో పొంది నాదే అనుకొంటున్నావు. చుట్టూరా ఆయుధాలు ధరించిన తమ్ముళ్లతో ద్రౌపదీ సహితంగా నిలిచిన ధర్మరాజును అడవిలో ఉన్నా, రాజపదవిలో ఉన్నా సరే ఎవరు జయించగలరు? రాజులంతా ఆతని ఆజ్ఞను సేవకుల వలె పాటిస్తారు. ఆ ధర్మరాజు కుబేరుని కూడ జయించి ప్రకాశిస్తున్నాడు. పాండవులు కుబేరుని భవనం ప్రవేశించి రత్నాలు పొంది, నీ రాష్ట్రమంతా ఆక్రమించి రాజ్యం ఆక్రమిస్తారు. మే మిద్దరమూ తగినంత దానం చేశాం. హోమాలూ చేశాం. చదువుకున్నాం. సంపదలతో బ్రాహ్మణులను తృప్తిపరచాం. మా ఆయువు చాలా అయిపోయింది. కృతకృత్యుల మయ్యాం. తెలుసుకో. నీవయితే పాండవులతో వైరం పెట్టుకొన్నావు. సుఖం, రాజ్యం, స్నేహితులూ, సంపదలూ విడిచి చాలా కష్టం పొందబోతున్నావు. ఆ ద్రౌపది సత్యవాదిని. తపమూ, వ్రతమూ దీక్షతో చేసినది. ఆమె పాండవుల విజయం కోరుతోంది. ఇక నీవెట్లా జయిస్తావు? ఆ ధర్మరాజుకు మంత్రి కృష్ణుడు. తమ్ముడు సర్వశస్త్రవిద్యాపారంగతుడైన అర్జునుడు. నీవెట్లా ఆ ధర్మరాజును జయించగలవు? ధర్మరాజుకు ధీరులు, జితేంద్రియులూ అయిన బ్రాహ్మణులు సహాయులు - అంతటి తపస్సంపన్నుడు, వీరు డయిన ధర్మరాజును ఎలా జయిస్తావు? స్నేహితుడు కష్టసముద్రంలో మునిగిపోతున్నపుడు వాని అభివృద్ధికోరే మిత్రుడు పునరుక్తి అయినా సరే మళ్లీ మళ్లీ చెప్పాలి. అందుకు చెపుతున్నా. వీరులయిన పాండవులతో యుద్ధం వద్దు. కురువంశ వృద్ధికోసం శాంతించు. పుత్రులతో, మంత్రులతో, బలగంతో పరాభవం పొందకు."

140. పాండవపక్షమున చేరు మని శ్రీకృష్ణుడు కర్ణుని ప్రలోభపెట్టుట.

ధృతరాష్ట్రుడు ఇలా అడిగాడు - "సంజయా! రాజకుమారులు, సేవకులూ చుట్టూ వస్తూ ఉండగా కర్ణుడిని రథమెక్కించుకొని కృష్ణుడు వెళ్లాడు గదా! ఆ కర్ణునితో గోవిందుడు ఏం మాట్లాడాడు? కర్ణునిపై ఏ అనునయ వాక్యాలు ప్రయోగించాడు.? అపుడు కృష్ణుడు మేఘగంభీర స్వరంతో కర్ణునితో మాట్లాడాడు గదా! అది మృదువుగా మాట్లాడాడా? లేక తీవ్రంగా మాట్లాడాడా? నాకు చెప్పు సంజయా !" సంజయుడు చెపుతున్నాడు - "ఊహించటానికి కూడా శక్యంకాని మహిమ కలవాడు కృష్ణుడు.

అతడు కర్ణునితో క్రమంగా కర్కశాలూ, మెత్తనివీ, ప్రియాలూ, ధర్మ సహితాలూ, సత్యాలూ, హితాలూ, హృదయంగమాలూ అయిన మాటలు అన్నాడు – అవి చెపుతాను విను. వాసుదేవుడు ఇలా చెప్పాడు. 'రాధేయా! నీవు వేదవేత్తలయిన బ్రాహ్మణులను సేవించావు – అసూయలేని నియమనిష్ఠలతో తత్త్వార్థాన్ని గురించి వారిని పరిప్రశ్న చేశావు. సనాతన వేదనాదాలు నీకే తెలుసు. ధర్మశాస్త్రాల్లోని సూక్ష్మాలు కూడా నీవెరుగుదువు. కన్యకు పుట్టిన వానిని కానీనుడని, సహోఢుడనీ శాస్త్రవేత్తలు అంటారు. తల్లి భర్తయే వానికి తండ్రి అనీ చెపుతారు. కర్ణా! నీవు అలా పుట్టినవాడివి– ధర్మాన్ని బట్టి పాండురాజు పుత్రుడివి. ధర్మశాస్త్రాన్ని బట్టి నీవు రాజువు అవుతావు. రా ! పురుష పుంగవా! నీకు ఆ కౌంతేయులు తండ్రి వైపు చుట్టాలు. వృష్ణి వంశస్థులు (మేము) తల్లి వైపు చుట్టాలు. ఈ రెండు పక్షాలూ నీవు గ్రహించు. నాతో కలిసి వచ్చే నిన్నిపుడు పాండవులు కుంతి కొడుకుగా, ధర్మరాజుకు అన్నగా గుర్తిస్తారు. ఆ అయిదుగురు పాండవులూ, ఉపపాండవులూ, అభిమన్యుడూ నీ పాదాలు పట్టుకొంటారు. (నీకు పాదాభివందనం చేస్తారు). పాండవులకోసం ఇక్కడ చేరిన అంధక, వృష్ణి వంశస్థులు రాజులూ, రాజకుమారులూ అంతా నీ పాదాలు పట్టుకొంటారు. రాజకుమారులూ, రాజకన్యలూ, నవధాన్యాలూ, రత్నాలూ, పూలమొక్కలు కల బంగారు కుండీలూ, వెండికుండలూ పట్టుకొని నీకు పట్టాభిషేక మంగళ ద్రవ్యాలు తెస్తారు. చక్కని బ్రాహ్మణోత్తముడు ధౌమ్యుడు అగ్నికార్యం నిర్వర్తిస్తాడు. నాలుగు వేదాలూ చదివిన బ్రాహ్మణులు నిన్ను ఈనాడే అభిషేకిస్తారు.

బ్రహ్మకర్మలు చేసే పాండవుల పురోహితుడు ధౌమ్యుడూ, పంచ పాండవులూ, ఉపపాండవులూ, పాంచాలురూ, చేదిరాజులూ, నేనూ, నిన్ను రాజుగా అభిషేకిస్తాం. నీకు ధర్మరాజు యువరాజు అవుతాడు. అతడు నీకు వింజామర పడతాడు. నీవు రథం ఎక్కిన తరువాతనే ధర్మరాజు నీవెంట రథం ఎక్కుతాడు. మహాబలుడయిన భీముడు నీ తలమీద గొడుగు పడతాడు. వందల మువ్వల సవ్వడితో, పులితోలు కప్పి తెల్లని గుర్రాలతో కూడిన నీ రథం అర్జునుడు తోలుతాడు. అభిమన్యుడు కూడా సర్వదా నీ దగ్గరే కనిపెట్టుకొని ఉంటాడు. నకుల సహదేవులూ, ఉపపాండవులు అయిదుగురూ, పాంచాలురూ, మహారథి శిఖండి నీ వెంట వస్తారు. రాజా! నేనూ, అంధక, వృష్ణి వంశస్థులూ, దాశార్హులూ, దశార్ణదేశ రాజులు – అందరమూ నీ

పరివారంగా నీ వెంట వస్తాం. నీ తమ్ములు పాండవులతో కలిసి, జపాలతో హోమాలతో, వివిధ శుభాలతో రాజ్యమంతా అనుభవించు. ద్రావిడులు, కుంతల దేశీయులు, ఆంధ్రులు, తాలచరులు, చూచుపులు, వేణుపులు అంతా నీముందు నడుస్తూ వస్తారు. సూతులూ, మాగధులూ నిన్ను అనేకవిధాల స్తుతులతో స్తుతిస్తారు. పాండవులు వసుషేణుని విజయాన్ని చాటిస్తారు. నక్షత్రాలతో కూడిన చంద్రునిలాగా కౌంతేయులతో కలిసి రాజ్యం పాలించు - కుంతిని సంతోషపెట్టు. నీ మిత్రులు సంతోషింతురుగాక! శత్రువులు వ్యథ చెందుదురు గాక! సోదరులైన పాండవులతో నీ సౌభ్రాత్రం ఇపుడు ప్రవర్తిల్లునుగాక! "

141. తన అభిప్రాయమును కర్ణుడు కృష్ణునకు చెప్పుట.

కర్ణుడిలా సమాధానం చెప్పాడు - "కేశవా! నా మీద సద్భావంతో, చనువుతో, స్నేహంతో, నా శ్రేయోభిలాషివై చెప్పావు - సందేహం లేదు. కృష్ణా! అంతా నే నెరుగుదును- ధర్మాన్ని, ధర్మశాస్త్ర నిర్ణయాన్ని బట్టి నీవనుకొన్నట్లే నేను పాండురాజు కొడుకునే అవుతాను. జనార్దనా ! కన్యయైన కుంతి సూర్యుని వల్ల గర్భం దాల్చింది - సూర్యుని మాట వల్లనే పుట్టిన నన్ను ఆమె విడిచి పెట్టింది. కృష్ణా! అలా పుట్టిన నేను ధర్మాన్ని బట్టి పాండుని పుత్రుడినే అవుతాను. కాని నా క్షేమం చూడకుండా కుంతి నన్ను విడిచిపెట్టింది. సూతు డయిన అధిరథుడు నన్ను చూసి మంచి మనసుతో ఇంటికి తీసికొని వచ్చి రాధకు ఇచ్చాడు. మాధవా! నా పై ప్రేమతో రాధకు వెంటనే పాలు చేపుకువచ్చాయి. ఆమె నా మూత్రమూ, మలమూ ఎత్తింది. ధర్మం తెలిసి ధర్మశాస్త్రాలు వినే ఆసక్తి కల నాబోటివాడు ఆమె ఋణం ఎలా తీర్చుకోవాలి? ఆలాగే సూతు డయిన అధిరథుడు కూడా నన్ను కొడుకుగా చూసుకొన్నాడు. అతని ప్రేమ వల్ల నేను అతనినే తండ్రిగా భావిస్తున్నాను. మాధవా! నాకు ఆ సూతుడే పుత్రప్రీతితో శాస్త్రోక్త విధానంగా జాతకర్మాది సంస్కారాలు చేయించి బ్రాహ్మణులతో వసుషేణుడని పేరు పెట్టించాడు (నామకరణం చేయించాడు). యౌవనం వచ్చాక తన కుల కన్యలను వివాహం చేశాడు. వారి వల్ల నేను పుత్రులనూ, మనుమలనూ కూడా కన్నాను. వారిపై నా మనసు కామబంధంతో ముడివడిపోయింది. గోవిందా! భూమి అంతా వశ మయినా, ఎన్నో బంగారు రాశులు లభించినా, సంతోషంతో

కాని, భయంతో కాని ఆ బంధాన్ని చెరుపుకోలేను. దుర్యోధనుని ఆశ్రయం వల్ల ధృతరాష్ట్రుని దగ్గర పదమూడేళ్లు రాజ్యం నిష్కంటకంగా అనుభవించాను. సూతులతో కలిసి ఎన్నోసార్లు ఎన్నో యజ్ఞాలు చేశాను. ఆ సూతులతో కలిసే ఎన్నో కులధర్మాలూ, వివాహాలూ నిర్వహించాను.

కృష్ణా! దుర్యోధనుడు నన్ను చేరదీసియే యుద్ధానికి సిద్ధమయ్యాడు - అసలు నన్ను చేరదీశాకనే పాండవులతో విరోధం పెట్టుకొన్నాడు. కృష్ణా! అర్జునునితో "ద్వైరథ యుద్ధం" చేయటానికి యుద్ధంలో నన్నే ఎన్నుకొన్నాడు దుర్యోధనుడు. నేను చనిపోయినా సరే, పేగు బంధం వల్లనైనా సరే, భయం చేతనైనా సరే, లోభం చేతనైనా సరే దుర్యోధనునికి అన్యాయం చేయలేను. ఇపుడు సవ్యసాచితో నేను ద్వైరథ యుద్ధం చేయకపోతే... కృష్ణా! అది నాకూ, అర్జునునికీ కూడా అపకీర్తి తెస్తుంది. మధుసూదనా! నిజంగా నీవు మేలు కోసమే ఇలా చెపుతున్నావు. నీ వశంలో ఉన్నారు పాండవులు. అందుచేత నీవు చెప్పినట్లు చేస్తారు. కృష్ణా! ఈ విషయంలో మన ఆలోచనలన్నీ రహస్యంగా ఉంచు- ఇదే మేలని అనుకొంటున్నాను. ధర్మాత్ముడూ, జితేంద్రియుడూ అయిన ధర్మరాజుకు నేను కుంతి యొక్క మొదటి కొడుకు నని తెలిస్తే అతడు రాజ్యం స్వీకరించడు. ఒకవేళ నాకే ఈ రాజ్యమంతా లభిస్తే దానినంతా దుర్యోధనునికే ఇవ్వాలి. **ధర్మాత్ముడయిన యుధిష్ఠిరుడే శాశ్వతంగా రాజు కావాలి. (ఎందుకంటే) అతనిని నడిపేవాడు హృషీకేశుడు, అతనికోసం యుద్ధం చేసేవాడు ధనంజయుడూ కనుక.***

మహారథు డయిన భీముడు, నకులుడు, సహదేవుడు, ఉపపాండవులు, ధృష్టద్యుమ్నుడు, ద్రుపదుడు, సాత్యకి, ఉత్తమౌజుడు, యుధామన్యువు, సత్యధర్ముడు, చేకితానుడు, శిఖండి, కేకయ సోదరులు, కురిభోజుడు, శ్యేనజిత్తు, శంఖుడు, అందరికీ పెన్నిధివి నీవు- ఇలా రాజులంతా ఒకచోటికి చేరారు. ఈ రాజులందరితో కూడిన భూమి అంతా ధర్మరాజుదే కావాలి - అవుతుంది.

కృష్ణా! దుర్యోధనునికి ఆయుధయజ్ఞం జరుగ బోతోంది. ఈ యజ్ఞానికి నీవే ఉపద్రష్టవు అవుతావు. ఈ యజ్ఞంలో నీదే ఆధ్వర్యవం - సన్నద్ధుడైన అర్జునుడు

---

* స ఏవ రాజా ధర్మాత్మా శాశ్వతోఽస్తు యుధిష్ఠిరః ।
నేతా యస్య హృషీకేశః యోద్ధా యస్య ధనంజయః ॥ 23

హోత. గాండీవం స్రుక్కు- వీరుల వీర్యం నెయ్యి, ఐంద్రాస్త్రం, పాశుపతాస్త్రం, బ్రహ్మాస్త్రం, స్థూణాకర్ణాస్త్రం, అనేవి సవ్యసాచి ప్రయోగించే మంత్రాలు. అభిమన్యుడు పరాక్రమంలో అర్జునుని అనుసరిస్తాడు. ఒక విధంగా అతడే అధికుడు కూడా. ఈ శస్త్ర యజ్ఞంలో అతడు ఉద్గాతృకర్మను నిర్వహిస్తాడు. ఏనుగుల సమూహాలను సంహరిస్తూ, పెద్దగా ధ్వనిస్తూ, సామగానాలు చేసే మహాబలుడు భీముడు దీనికి ప్రస్తోత. ధర్మాత్ముడయిన యుధిష్ఠిరుడు జప, హోమాలు చేస్తూ బ్రహ్మ పదవిని కూడా నిర్వహిస్తాడు. శంఖధ్వనులూ, మద్దెలల మ్రోతలు, భేరీ నాదాలు, సింహనాదాలు – ఇవన్నీ సుబ్రహ్మణ్య స్థానం వహిస్తాయి. మాద్రీపుత్రులు నకుల సహదేవులు యజ్ఞ పశువును చంపే కార్యం నిర్వర్తిస్తారు. చిత్రవర్ణ ధ్వజాలు కల రథాల వరుసలు ఈ యజ్ఞంలో యూపస్తంభాలు అవుతాయి. కర్ణి, నాళీకం, నారాచం, వత్సదంతం అనే పేర్లు గల బాణాలు సోమద్రవ్యం చల్లే పాత్ర లవుతాయి. తోమరాలు సోమరసం నింపిన పాత్ర లవుతాయి. ధనుస్సులు పవిత్రాలు అవుతాయి. కృష్ణా! ఆ యజ్ఞంలో కత్తులు కపాలాలు అవుతాయి. తలలు పురోడాశాలు అవుతాయి. నెత్తురే హవిస్సు అవుతుంది. శక్తులు, సమిధ లవుతాయి. గదలు పరిధు లవుతాయి. కృప, ద్రోణుల శిష్యులు సదస్యు లవుతారు. అర్జునుడూ, ద్రోణుడూ, అశ్వత్థామా మొదలయిన మహారథులు ప్రయోగించిన బాణాలు ఈ యజ్ఞంలో పరిస్తోమాలు అవుతాయి. అధ్వర్యుని వెంటనుండి ప్రతిప్రస్థాన కర్మ చేసేవాడు సాత్యకి. ఇక్కడ యజ్ఞ దీక్షితుడు దుర్యోధనుడు. అతని భార్య మహాసైన్యం. మహాబలుడైన ఘటోత్కచుడు అతిరాత్ర మనే యీ యజ్ఞకర్మలో పశువధ చేస్తాడు. వైతానిక మనే శ్రౌత యజ్ఞంలో కర్మముఖంలో అగ్ని నుండి పుట్టిన ధృష్టద్యుమ్నుడే ఈ యజ్ఞానికి దక్షిణ. కృష్ణా! దుర్యోధనుని ప్రీతికోసం పాండవులను పరుషంగా మాట్లాడాను. ఆ తప్పు పనికి పరితపిస్తున్నాను. కృష్ణా! అర్జునుని చేత చనిపోయిన నన్ను చూసినపుడు అదే ఈ యజ్ఞానికి 'పునశ్చిత్తి' అవుతుంది. ఆర్తనాదం చేస్తున్న దుశ్శాసనుని రక్తాన్ని భీముడు త్రాగుతూ ఉంటే అపుడు 'సూయ' మనే కార్యం జరిగినట్లు అవుతుంది. ధృష్టద్యుమ్నుడు ద్రోణునీ, శిఖండి భీష్మునీ పడగొట్టినపుడు అది యజ్ఞావసానం అవుతుంది. మహాబలు డయిన భీముడు దుర్యోధనుని చంపి నపుడు ఈ ధార్తరాష్ట్రయజ్ఞం పరిసమాప్త మవుతుంది.

ధృతరాష్ట్రుని కోడళ్లు, కొడుకుల కోడళ్లు, భర్తలు, కొడుకులూ చనిపోగా

ఒకచోట చేరి గాంధారితో పాటు కుక్కలూ, గ్రద్దలూ, గోరువంకలూ తిరుగుతూ ఉంటే - వారందరి ఏడుపులే ఈ యజ్ఞానికి అవభృథస్నానం అవుతుంది. విద్యావృద్ధులూ, వయోవృద్ధులూ అయిన క్షత్రియులు నీవల్ల వ్యర్థమయిన మరణం పొందకుందురుగాక. మూడులోకాల్లోనూ పుణ్యక్షేత్రమయిన కురుక్షేత్రంలో నిండిన ఈ రాజలోకమంతా ఆయుధమరణం పొందుదురుగాక. కృష్ణా! ఈ రాజుల సమూహం అంతా ఒక్కసారిగా స్వర్గం పొందే ఏర్పాటు చూడు. అదే అందరికీ కావలసినది. పర్వతాలూ, నదులూ నిలిచినంత కాలం ఈ కీర్తి ధ్వని శాశ్వతంగా నిలుస్తుంది. క్షత్రియులు కీర్తి ధనం సంపాదించిన మహాభారత యుద్ధాన్ని బ్రాహ్మణులు సమావేశాల్లో / సభల్లో చెప్పుదురు గాక. కేశవా! ఈ రహస్యాన్ని ఎప్పుడూ బయట పెట్టకుండా అర్జునుని మాత్రం నాతో యుద్ధానికి తీసుకు రా."

142. పాండవుల విజయము తప్ప దని కృష్ణుడు చెప్పుట.

కర్ణుని మాటవిని కేశవుడు చిరునవ్వు నవ్వుతూ ఇలా అన్నాడు. "కర్ణా! రాజ్యం పొందే ఉపాయం నీ మనసుకు నచ్చటం/ అందటం లేదు. నేనిచ్చే భూమిని నీవెందుకు పాలించాలనుకోవటం లేదు? పాండవులకు జయం తప్పదు. ఇందులో ఏ సందేహమూ లేదు. అర్జునుని కపిధ్వజం జయాన్ని సూచించే ధ్వజంగా పైభాగాన ఎత్తుగా కనిపిస్తోంది. ఈ కపిధ్వజాన్ని విశ్వకర్మ దివ్యమైన మాయతో ఇంద్రుని జెండావలె ప్రకాశించేటట్లు చేశాడు. దీనిమీద ఉన్న దివ్య భూతాలు పాండవులకు జయావహంగానూ కౌరవులకు భయావహంగానూ చూస్తున్నాయి. కర్ణా! అర్జునుని ధ్వజం అగ్ని సమానమయిన రూపంతో నిలువుగానూ, అడ్డంగానూ కూడా యోజనం దూరం వ్యాపించి ఉంది. దానివల్ల అది కొండలకూ, చెట్లకూ తగుల్కొనటం లేదు. కృష్ణుడు సారథి కాగా అర్జునుడు ఐంద్రాస్త్రం, ఆగ్నేయాస్త్రం, వాయవ్యాస్త్రం ప్రయోగిస్తూ ఉంటే పిడుగులు పడుతున్నట్లు గాండీవ ధ్వని వినిపిస్తూ ఉంటే - ఆ దృశ్యం చూసినపుడు ఇక త్రేత లేదు- కృతం లేదు- ద్వాపరం లేదు. యుద్ధంలో ధర్మరాజు జపహోమాలతో తన సేనను రక్షించుకొంటూ చూడ శక్యంకాని సూర్యునివలె శత్రుసేనను మాడ్చివేస్తూ ఉంటే... ఆ దృశ్యం నీవు చూస్తే ఇక కృతం లేదు - త్రేత లేదు - ద్వాపరం లేదు. యుద్ధంలో భీమసేనుడు దుశ్శాసనుని రక్తం త్రాగి నృత్యం చేస్తూ మదపుటేనుగు

మరో ఏనుగును చీల్చి చెండాడుతున్నట్లు కనిపిస్తే అపు డిక కృతం లేదు, త్రేత లేదు, ద్వాపరం లేదు. సంగ్రామంలో మోదపడుతున్న ద్రోణునీ, భీష్మునీ, కృపునీ, దుర్యోధనునీ, సైంధవునీ ఒక్క క్షణంలో అర్జునుడు ఆపి వేసిన దృశ్యం నీవు చూస్తే ఇక అపుడు త్రేత లేదు - కృతం లేదు - ద్వాపరం లేదు. యుద్ధంలో మహాబలులైన నకుల సహదేవులు కౌరవ సైన్యాలను ఏనుగుల్లా కలచి వేస్తూ, దట్టంగా బాణాలు వేస్తూ శత్రు రథాల్ని విరగగొట్టుతూ ఉంటే... ఆ దృశ్యం నీవు చూస్తే... ఇక అపుడు త్రేత లేదు - కృతం లేదు - ద్వాపరం లేదు.

కర్ణా! ఇక్కడ నుండి వెళ్లి ద్రోణునికీ, భీష్మునికీ, కృపునికీ ఇలా చెప్పు. 'ఈ మాసం సౌమ్యంగా ఉంది. గడ్డి, కట్టెలు బాగా దొరుకుతాయి. ఓషధులన్నీ బాగా ఉండి అడవులు సమృద్ధిగా ఉన్నాయి. పండ్లు బాగా ఉన్నాయి. ఈగలు తగ్గిపోయాయి. బురద అణగి పోయింది. రసవంతమయిన నీరు దొరుకుతుంది. ఈ కాలం ఎక్కువ వేడీ, కాదు చల్లనిదీ కాదు. సుఖ కరమయిన కాలం. ఇప్పటికి ఏడు రోజుల తరువాత అమావాస్య అవుతుంది. ఆ రోజుకు ఇంద్రుడు అధిదేవత. ఆ రోజున యుద్ధం జరగాలి. అలాగే యుద్ధానికి వచ్చిన రాజులందరికీ ఇలా చెప్పు. 'మీరు కోరిన దాన్ని సంపూర్ణంగా తీరుస్తాను' అని చెప్పు." దుర్యోధనుని వశవర్తులయిన రాజులూ, రాజకుమారులూ శస్త్రమరణం పొంది ఉత్తమగతి పొందుతారు.

143. కర్ణుడు పాండవ విజయమును సూచించు తన కలను వర్ణించుట.

తనను ప్రలోభపెట్టిన కృష్ణుని మాట విని, కర్ణుడు అతనిని గౌరవించి, ఇలా అన్నాడు. "కృష్ణా! తెలిసికూడా నన్నెందుకు మోహపెట్టాలని అనుకొంటున్నావు? ఈ భూమి కంతటికీ వినాశం దాపురించింది. దానికి శకునీ, నేనూ, దుశ్శాసనుడూ, దుర్యోధనుడూ కారణం. పాండవులకూ, కౌరవులకూ ఘోరయుద్ధం రాబోతోంది. దానిలో రక్తపు బురద ఏర్పడుతుంది. సందేహం లేదు. దుర్యోధనుని వశవర్తులయిన రాజులూ, రాజ కుమారులూ ఆ యుద్ధంలో బాణాగ్నిలో దగ్ధమై యమలోకానికి చేరుతారు. భయంకరంగా పీడకలలూ, శకునాలూ, ఉత్పాతాలూ కనిపిస్తున్నాయి. దుర్యోధనునికి పరాజయమూ, యుధిష్ఠిరునికి విజయమూ చెపుతున్నట్లు, గగుర్పాటు కలిగించే కలలు వస్తున్నాయి. తీక్ష్ణగ్రహమైన శని ప్రాజాపత్య (రోహిణి) నక్షత్రాన్ని,

ప్రాణులనూ మిక్కిలి పీడిస్తోంది. అంగారక గ్రహం జ్యేష్ఠానక్షత్రంలో వక్రగతి పట్టింది. మిత్రులను సంహరిస్తూ అనూరాధా నక్షత్రాన్ని చేరుతోంది. కృష్ణా! కౌరవులకు మహాభయం దాపురించింది. తప్పదు. చిత్రా నక్షత్రాన్ని గ్రహం మిక్కిలిగా పీడిస్తోంది. చంద్రరేఖ సన్నగిల్లి మరలింది. రాహువు సూర్యుని చేరుతున్నాడు. ఆకాశం నుండి ఉల్కలు పడుతున్నాయి. పిడుగులు పడుతున్నాయి. భూమి కంపిస్తోంది. ఏనుగులు అనిష్టంగా మూలుగుతున్నాయి. గుర్రాలు కన్నీరు కార్చుతున్నాయి. కృష్ణా! అవి నీరుత్రాగటానికి, గడ్డి తినటానికీ ఇష్టపడటం లేదు. ఇటువంటి దుర్నిమిత్తాలు కలిగినపుడు ప్రాణులు నశించే దారుణభయం వస్తుందని ఫలితం చెపుతారు.

గుర్రాలకూ, ఏనుగులకూ, మానవులకూ కూడా తిండి తక్కువగానూ, మలం ఎక్కువగానూ కనపడుతోంది. మధుసూదనా! దుర్యోధనుని సైన్యాలన్నిటా కనిపిస్తున్న ఈ లక్షణాలకు పరాభవమే ఫలితమని బుద్ధిమంతు లంటారు. పాండవుల వాహనాలు ఉత్సాహంతో గంతులు వేస్తున్నట్లు చెప్పుకొంటున్నారు. అక్కడి మృగాలు ప్రదక్షిణంగా తిరగడం వారికి జయ సూచకం. దుర్యోధనుని సేనదగ్గర మృగాలు అపసవ్యంగా తిరుగుతున్నాయి. రూపాలు కనపడకుండా మాటలు వినిపిస్తున్నాయి. అది పరాజయానికి గుర్తు. మంచి శకునాలయిన నెమళ్లు, హంసలు, బెగ్గురు పక్షులు, చాతకాలు, చకోరాలు (వెన్నెల పులుగులు) వీని గుంపులు పాండవుల దగ్గర సంచరిస్తున్నాయి. గ్రద్దలు, రాబందులు, కొంగలు, డేగలు, రాక్షసులు, తోడేళ్లు, ఈగల గుంపులు - ఇవన్నీ కౌరవుల వెంట పరుగులు తీస్తున్నాయి. దుర్యోధనుని సేనల్లో భేరుల మోత లేనే లేదు. పాండవుల సేనల్లో మోగింపకుండానే తప్పెటలు మ్రోగుతున్నాయి. దుర్యోధనుని సైన్యాల దగ్గరున్న జలాశయాలు ఆవులూ, ఎద్దులూ రంకెలు వేస్తున్నట్లు శబ్దిస్తున్నాయి. అది పరాజయ లక్షణం.

వరుణదేవుడు మాంసంతోనూ, రక్తంతోనూ, వర్షం కురిపించాడు. అలాగే సూర్యుడు గుడికట్టాడు. ఆ గుడి ప్రాకారంతోనూ, అగడ్తతోనూ, కోటతోను తోరణాలతోనూ కూడా కనిపిస్తోంది. సూర్యుని చుట్టూ నల్లని గుడి కట్టింది. ఉదయ సమయంలోనూ, అస్తమయ సమయంలోనూ చాలా భయం కలుగుతోంది. నక్క భయంకరంగా అరుస్తోంది. అది పరాజయ లక్షణం. ఒకే రెక్క, ఒకే కన్ను, ఒకే కాలు కలిగిన పక్షులు అసహ్యంగా రెట్టలు వేస్తున్నాయి. అది పరాజయ లక్షణం. నల్లని కంఠాలతో,

ఎర్రని పాదాలతో పక్షులు భయంకరంగా సంజవేళ ఎదురుగా పోతున్నాయి. అది పరాజయ లక్షణం. కృష్ణా! మానవుడు ముందు బ్రాహ్మణులను (బ్రహ్మవేత్తలను), గురువులనూ ద్వేషిస్తాడు. భక్తి కల సేవకులనూ ద్వేషిస్తాడు. అది పరాభవ లక్షణం. తూర్పు దిక్కు ఎర్రగానూ, దక్షిణ దిక్కు నల్లగానూ, పడమర దిక్కు పచ్చికుండ రంగులోనూ, ఉత్తర దిక్కు శంఖం రంగులోనూ ఉంటాయని ప్రసిద్ధి. కాని దుర్యోధనుని సేనకు దిక్కులన్నీ మండిపోతున్నట్లు కనపడుతూ మహాభయం కలుగబోతోందని తెలుపుతున్నాయి.

అచ్యుతా! ధర్మరాజు తమ్ముళ్లతో కలిసి వేయిస్తంభాల భవనం ఎక్కుతూ నాకు కల చివరలో కనిపించాడు. పాండవులంతా తెల్లని తలపాగలూ, తెల్లని వస్త్రాలూ ధరించి కనిపించారు. వారి అందరి ఆసనాలూ కూడా శుభ్రంగా స్వచ్ఛంగా కనిపించాయి. జనార్దనా! కల చివరలో నీ యీ భూమి (శరీరం) రక్తంతో తడిసి, ఆయుధాలతో చుట్టబడి కనిపించింది. అమిత శక్తికల యుధిష్ఠిరుడు ఎముకల గుట్టనెక్కి, బంగరు పాత్రలో, సంతోషంగా నేతిపాయసం తిన్నట్లు కనపడ్డాడు. యుధిష్ఠిరుడు భూమిని మ్రింగివేస్తూ కనపడ్డాడు. నీ విచ్చిన ఈ భూమిని స్పష్టంగా అతడు అనుభవిస్తా డన్నమాట. భయంకరుడయిన భీముడు గద ధరించి, ఎత్తయిన పర్వతం ఎక్కి, ఈ భూమి నంతటినీ మ్రింగివేస్తున్నట్లు కనిపించాడు. ఆ భీముడు ఈ మహాసంగ్రామంలో మమ్మందరినీ చంపి పారేస్తాడని స్పష్టమవుతోంది. హృషీకేశా! ధర్మం ఎక్కడ ఉంటుందో అక్కడే విజయం ఉంటుందని నాకు తెలుసును. గాండీవం దాల్చిన ఆ అర్జునుడు తెల్లని ఏనుగునెక్కి నీతో పరమశోభతో వెలిగిపోతూ కలలో కనపడ్డాడు. కృష్ణా! దుర్యోధనాది రాజులందరినీ మీరంతా యుద్ధంలో చంపేస్తారు. అందులో నాకు సందేహం లేదు. నకుల సహదేవులూ మహారథుడయిన సాత్యకీ ముగ్గురూ తెల్లని కేయూరాలు, కంఠాభరణాలు, పూలమాలలు, ఉత్తరీయాలు వేసుకొని నరవాహనం ఎక్కి తెల్లని గొడుగూ, వస్త్రాలూ దాల్చి కనపడ్డారు. తెల్లని తలపాగాలు దాల్చి ఈ ముగ్గురూ కనపడ్డారు. ఇక దుర్యోధన సేనలోని వారిని గురించి చెపుతా.. మాధవా! అశ్వత్థామ, కృపుడు, కృతవర్మ, ఇంకా మిగిలిన రాజులంతా ఎర్రని తలపాగలతో కనిపిస్తున్నారు. మహారథులైన భీష్మద్రోణులు ఒంటెల రథాన్ని ఎక్కి నాతోనో, దుర్యోధనునితోనో కలిసి కనిపిస్తున్నారు. ఇలా మేమంతా దక్షిణ దిక్కుకు వెళుతున్నాం.

అచిరకాలంలో మేమంతా యమలోకానికి చేరుతాం. నేనూ, ఈ రాజుల సముదాయమూ అంతా గాండీవాగ్నిలో ప్రవేశిస్తాము. ఇందులో నాకు ఏమీ సందేహం లేదు."

కృష్ణ డన్నాడు- "కర్ణా! నా మాట నీమనసుకు ఎక్కటం లేదు. నిజంగానే ఈ భూమికి వినాశం దాపురించింది. చావు మూడితే ప్రాణు లన్నిటికీ అవినీతి కూడా నీతిగానే అనిపిస్తుంది. మనసులోంచి తొలగదు." అపుడు కర్ణుడిలా అన్నాడు. "ఈ క్షత్రియ వీరుల వినాశానికి కారణమయిన ఈ మహారణం నుండి బయట పడి నిన్ను చూడగలుగుతామా కృష్ణా! లేదా మనకు స్వర్గంలో నయినా కలయిక తప్పదు. అక్కడ మేము నిన్ను కలుస్తాము." కర్ణుడిలా చెప్పి గాఢంగా కృష్ణుని కౌగిలించుకొని, సెలవు తీసికొని రథం దిగాడు. తరువాత కర్ణుడు దీన మయిన మనస్సుతో తన కాంచనరథం ఎక్కి మాతో పాటు వెనుదిరిగాడు. కేశవుడు 'నడునడు' అంటూ సారథిని హెచ్చరిస్తూ సాత్యకితో బయలు దేరాడు.

144. కుంతి కర్ణుని కడ కరుగుట.

కౌరవుల దగ్గర తన అనునయ వాక్యాలు ఫలించక కృష్ణుడు పాండవుల దగ్గరకు వెళ్లిపోయాడు. తరువాత విదురుడు కుంతి దగ్గరకు వచ్చి, బాధపడుతూ మెల్లగా ఇలా అన్నాడు. "జీవపుత్రీ! యుద్ధం రాకుండా చెయ్యాలనే నాభావం నీకూ తెలుసును. నేనెంత మొత్తుకొంటున్నా ఆ దుర్యోధనుడు నామాట వినటం లేదు. ధర్మరాజు ఇపుడు చేది, పాంచాల, కేకయ రాజులతోనూ, భీమార్జునులతోనూ, కృష్ణునితోనూ, సాత్యకితోనూ, నకుల సహదేవులతోనూ కలిసి ఉపప్లావ్యంలో బలవంతుడై ఉన్నాడు. అయినా జ్ఞాతుల మీది సౌహార్దంతో బలంలేని వాని వలె ధర్మాన్నే కాంక్షిస్తున్నాడు. ధృతరాష్ట్ర డయితే వయోవృద్ధ డయినా పుత్రమదంతో ఒళ్లు తెలియక అధర్మమార్గంలో ప్రవర్తిస్తున్నాడే తప్ప శాంతి కోరటం లేదు. సైంధవుడు, కర్ణుడు, దుశ్శాసనుడు, శకుని... వీరి దుర్బుద్ధితో కురుపాండవుల మధ్య భేదమే పొందుతున్నాడు. అధర్మంతో చేసిన ఇటువంటి వికృతపు పని (14వ ఏట రాజ్యం ఇవ్వకపోవడం) వీరికి ధర్మం అనిపిస్తోంది. ఆ ధర్మం త్వరలో ఫలవంత మవుతుంది. కౌరవులు బలవంతాన అధర్మాన్ని ధర్మం చెయ్యాలనుకొంటే ఎవరికైనా బాధకలుగుతుంది. మంచితనం ఫలించక కృష్ణుడు వెళ్లవలసి వచ్చింది. ఇక పాండవులు యుద్ధానికే సిద్ధపడతారు.

దానివల్ల కౌరవ వీరులంతా చనిపోయే ఉపద్రవం వస్తోంది. ఈ విషయం తలచుకొంటుంటే నాకు రాత్రింబవళ్లు నిద్రపట్టటం లేదు."

ప్రయోజన/ పురుషార్థ దృష్టితో చెప్పిన విదురుని మాట విని కుంతి నిట్టూర్పులు కలిగేటట్లు విచారిస్తూ మనసారా ఇలా ఆలోచించింది. 'ఛీ! ధనం చాలా నీచమైంది కదా! దీనివల్లనే కదా ఇంతమంది జ్ఞాతులు చనిపోవలసి వస్తోంది. ఈ యుద్ధంలో స్నేహితులు కూడా పరాభవం పొందవలసి వస్తోంది. పాండవులూ, చేది పాంచాలరాజులూ, యాదవులూ కలసి భరత వంశస్థులతో యుద్ధం చేస్తారు. ఇంతకంటె దుఃఖం ఏముంటుంది? యుద్ధంలో దోషం నిశ్చయంగా కనిపిస్తోంది. యుద్ధం లేకపోతే పరాభవం తప్పదు. ధనంలేని వానికి మరణమే మంచిది. కాని జ్ఞాతుల మరణం మాత్రం విజయం కాదు. ఇలా భావిస్తూ ఉంటేనే మనసులో దుఃఖం కలుగుతోంది. పితామహుడైన భీష్ముడూ, యుద్ధనాయకుడు ద్రోణాచార్యుడూ., కర్ణుడూ దుర్యోధనుని కోసం ప్రవర్తిస్తూ నా భయం పెంచుతున్నారు. ద్రోణుడు హితం చేయాలనే కోరిక గలవాడు. అందుచేత శిష్యులతో ఎన్నడూ యుద్ధం చేయడు. భీష్ముడు కూడా పాండవుల మీద మెత్తని మనసు వహించకుండా ఎలా ఉంటాడు ? ఇక కర్ణు డొక్కడే వ్యర్థభావాలతో దుర్మతియైన దుర్యోధనుని మోహాన్ననుసరించి సదా ప్రవర్తిస్తాడు. అంతేకాదు పాండవులను ద్వేషిస్తాడు కూడా. పాండవులకు పెద్దకష్టం కలగాలని పట్టుబట్టి ఉన్నాడు కర్ణుడు. పైగా బలవంతుడు. అదే ఇపుడు నా మనస్సును దహించివేస్తోంది. పాండవుల పట్ల కర్ణుని మనస్సు ప్రసన్న మవటానికి ఎలాగో అలా అతడిని దర్శించి చెపుతాను. నేను తండ్రి యింట్లో ఉండగా దుర్వాసు డనే మహర్షి నాకు మంత్రసహితంగా దేవతలను ఆహ్వానింపగల వరం ఇచ్చాడు. కుంతిభోజమహారాజు యొక్క అంతఃపురంలో నేను ఉండేదాన్ని. అనేక విధాల ఊహలతో మనసులో ఆలోచించేదాన్ని. స్త్రీని కావడం వల్లనూ, చిన్నతనం వల్లనూ "మంత్రాలకు బలం ఉందా లేదా?" అనీ "బ్రాహ్మణుని మాటలకు బలం ఉందా లేదా?" అనీ పరిపరి విధాల ఆలోచించేదాన్ని. నమ్మకం గల దాది నన్ను రక్షించేది - చుట్టూరా సఖీజను లుండేవారు. దోషాన్ని తొలగించుకొంటూ తండ్రి పేరు, శీలమూ రక్షించేదాన్ని. నాకు పుణ్యం ఎందుకు కలగదు? నేను నిర్దోషి నెట్లా అవుతాను? అని ఆలోచించి ఆ దుర్వాసునకు నమస్కరించాను. కుతూహలంతో ఆ వరం పొందాను. చిన్నతనంవల్ల దేవత్ నాహ్వానించాను. కన్య నైన నేను సూర్యుని

రప్పించాను. అపుడే నా కడుపున కానీనుడుగా పుట్టినవాడే గదా ఈ కర్ణుడు. వానిని కొడుకుగానే భావించాను. అతడు సోదర హితమూ, ఇష్టమూ అయిన నామాటను ఎందుకు చేయకుండా ఉంటాడు?

అని కుంతి ఉత్తమ మయిన కార్యాన్ని నిశ్చయించుకొంది. ఆ పని కోసం గంగానది దగ్గరకు వెళ్లింది. కరుణాపరుడు, సత్యసంధుడు అయిన తన కొడుకు గంగాతీరంలో అధ్యయనం చేస్తున్న వేదధ్వనిని కుంతీదేవి విన్నది. తూర్పు ముఖంగా చేతులు పైకెత్తి నిలిచిన కర్ణునికి వెనుక నిలబడి, తనపనికోసం 'ఆతని జపం ఎప్పుడవుతుందా' అని నిరీక్షించింది. సూర్యుని వేడిమికి కరిగిపోతూ, వృష్ణి వంశపు ఆడపడుచు కుంతీదేవి తామరతీగలాగా వాడిపోతూ కర్ణుని ఉత్తరీయపునీడలో నిలిచింది. వెన్ను వేడెక్కేదాకా (అపరాహ్ణందాకా) జపం చేసుకొని, కర్ణుడు వెనుదిరిగి కుంతిని చూసి, చేతులు జోడించి, నిలిచాడు మహాతేజస్వి,అభిమానవంతుడు, ధార్మికోత్తముడూ అయిన కర్ణుడు యథావిధిగా కుంతికి నమస్కరించి ఆశ్చర్యంతో ఇలా అన్నాడు.

145. కర్ణుడు తనకొడుకని కర్ణునితో కుంతి చెప్పుట.

"రాధ కొడుకును, అధిరథుని పుత్రుడిని, కర్ణుడిని నీకు నమస్కరిస్తున్నాను. పూజ్యురాలా! ఎందుకు వచ్చావు? నేనేమి చెయ్యాలో చెప్పు." కుంతి చెప్పింది. "కర్ణా! నీవు కుంతీ పుత్రుడవు- రాధేయుడవు కావు. నీ తండ్రి అధిరథుడు కాడు- నీవు సూతకులంలో పుట్టలేదు. నా మాట విను. కన్యగా ఉన్నపుడు నీవు నాకు కుంతిభోజుని ఇంట్లో పుట్టావు. నిన్ను కడుపున వహించాను. నీవు పృథా కుమారుడవు. వెలుగునిచ్చే సూర్యుడు శస్త్రధారుల్లో ఉత్తముడ వయిన నిన్ను నాయందు కన్నాడు. నా పితృగృహంలో, కుండలాలతో, కవచంతో దేవగర్భుడవై ఎంతో ప్రకాశంతో నాకు పుట్టావు. అటువంటి నీవు నీ తమ్ముళ్లను తెలియక మోహంతో ధృతరాష్ట్రపుత్రులను సేవిస్తున్నావు. అది నీకు ఏమాత్రం తగదు.

పుత్రా! ప్రాణాలన్నీ కొడుకు మీదే పెట్టుకొన్న తల్లినీ, తండ్రినీ, పితరులనూ సంతోష పెట్టడమే ధర్మనిశ్చయంలో పుత్రునికి ధర్మఫలం. పూర్వం అర్జునుడు సంపాదించిన సంపదను, దుర్మార్గ లయిన ధృతరాష్ట్ర పుత్రులు లోభంతో లాక్కొన్నారు. ఆ ధర్మజుని సంపదను నీవు అనుభవించు. సౌభ్రాత్రంతో నిండిన కర్ణార్జునుల కలయికను ఈనాడు కౌరవులు చూస్తారు. దుష్టులు దాన్ని చూసి క్రుంగి/ వంగిపోతారు.

మనసులు కలిసిన కర్ణార్జునులు ఇద్దరూ బలరామకృష్ణులవలె ఉంటే మీకిక లోకంలో అసాధ్యం ఏముంటుంది? యజ్ఞవేదిక మీద దేవతలతో పరివేష్టితుడయిన బ్రహ్మదేవుని వలె అయిదుగురు తమ్ముళ్లతో కలిసి నీవు తప్పక శోభిస్తావు. మంచిగుణాలన్నీ కలవాడవు. పెద్దవాడవు. ఉత్తము లయిన బంధువుల్లో నీకు సూతపుత్రుడనే పేరు రాకూడదు. నీవు పృథా కుమారుడవు.

146. కుంతితో కర్ణుని సంభాషణము.

అంతలో సూర్యుని నుండి ఒక మాట వెలువడింది. ఆ మాట జవదాట రానిది. ప్రేమతో నిండినది. తండ్రివలె వాత్సల్యంతో సూర్యుడు చెప్పాడు. ఆ మాట కర్ణునకు వినపడింది. "కర్ణా! కుంతి నిజమే చెప్పింది. తల్లిమాట, ఆచరించు. నరోత్తమా! అలా ఆచరిస్తే నీకు సర్వశుభాలూ కలుగుతాయి." ఇలా తల్లీ స్వయంగా తండ్రియైన సూర్యుడూ చెప్పినా సత్యధైర్యాలు కల కర్ణుని మనస్సు చలించలేదు.

కర్ణుడు ఇట్లా చెప్పాడు. "నీ మాట పట్ల నాకు శ్రద్ధ కలగటం లేదు. నీ మాటను పాటిస్తే నేను ధర్మాన్ని విడిచినట్లే. పూజ్యురాలా! నాపట్ల నీవు చేసిన పాపం ఘోర మయింది. తల్లీ ! నన్ను నిర్దాక్షిణ్యంగా విసిరిపారేశావు. అది అపకీర్తికరం. నేను క్షత్రియుడిగా పుట్టితే క్షత్రియ సంస్కారం నాకు లభించిందా? నీవు చేసిన ఈ పాపం నాకు ఏ శత్రువూ చేయడు. క్షత్రియ సంస్కారాలు చేయవలసిన సమయంలో నా మీద దయ చూపలేదు. హీన సంస్కారాలు పొందిన నన్ను ఇపుడు ప్రేరేపిస్తున్నావు. పూర్వం నీవు నాపట్ల తల్లిలాగా హితంగా ప్రవర్తించ లేదు. ఇపుడు నీ హితం కోసం నాకు బోధిస్తున్నావు. కృష్ణ సహితమైన ధనంజయుని వలన యుద్ధంలో వ్యథ చెందని వాడె వడుంటాడు? కౌంతేయులతో యుద్ధానికి సిద్ధపడుతున్న ఈ సమయంలో నేను ఆ వైపు చేరితే నన్ను పిరికివాడు అంటారు. పూర్వం నాకు తమ్ముళ్లు లేరని అందరికీ తెలుసు. యుద్ధం వచ్చేసరికి పాండవులు నాకు తమ్ముళ్ళని ప్రకటించుకొని వారితో చేరిపోతే నన్ను క్షత్రియు డంటారా? ధార్తరాష్ట్రులు నన్ను సుఖప్రదంగా పూజించి అన్ని కోరికలూ తీర్చారు. ఇపు డా సౌఖ్యాన్ని ధార్తరాష్ట్రులకు నిష్ఫలం చేయగలనా ? వారు తమ శత్రువులతో వైరం వహించి నన్ను నిత్యమూ గౌరవిస్తున్నారు. వసువులు ఇంద్రునికి నమస్కరించినట్లు సదా కౌరవులు నాకు నమస్కారాలు చేస్తున్నారు కూడా. నా బలంతో కౌరవులు శత్రువులను జయించుతా మనుకొంటున్నారు. వారి

కోరికను నేనెలా తెంచివేస్తాను? దాటరాని యుద్ధం అనే సముద్రాన్ని కర్ణుడనే నావతో దాటాలనుకొంటున్నారు. నడి సముద్రంలోంచి ఒడ్డు చేరాలని భావించే వారిని ఎలా వదలి వేస్తాను? ధార్తరాష్ట్రులపై ఆధారపడి బ్రతికే వారికి తగిన సమయం వచ్చింది. నేను కూడా ప్రాణాలకు లెక్కించకుండా ఆ ఋణం తీర్చుకోవాలి. రాజువల్ల ఉపకారాలు పొందాక సమయం వచ్చినపుడు ఆ మేలు మరచిపోయి నీచపుపనులు చేసే పాపులకూ, రాజద్రోహులకూ, రాజు ఆహారం అపహరించే వారికీ ఈ లోకమూ లేదు, పరలోకమూ లేదు. నా బలాన్నీ, శక్తినీ పుంజుకొని కౌరవులకోసం నీ కొడుకులతో యుద్ధం చేస్తాను. నీకు అసత్యం చెప్పటం లేదు. సజ్జనులకు ఉచిత మయిన కరుణా స్వభావాన్ని, ప్రవర్తననూ రక్షిస్తూ, అంతకుమించి ప్రయోజనకర మయినా సరే నీ మాట నిపుడు చేయను.

కాని నా మీద నీ ప్రయత్నం వ్యర్థం కాకూడదు. యుధిష్ఠిరుడు, భీముడు, నకుల సహదేవులు వీరు చంపదగిన వారే అయినా వీరిని యుద్ధంలో చంపను- అర్జునుని వదలను. ధర్మరాజు సైన్యంలో నాకు పోటీ అర్జునుడే. యుద్ధంలో అర్జునుని చంపితే చాలు నాకు ఫలితం దక్కినట్లే. అలా కాక సవ్యసాచి చేత నేనే చనిపోతే కీర్తి దక్కుతుంది. యశస్వినీ! ఎపుడయినా నీకు అయిదుగురు కొడుకులే మిగులుతారు. అర్జునుడు పోతే కర్ణునితో పాటు అయిదుగురు. నేను చనిపోతే అర్జునునితో అయిదుగురు." కర్ణుని ఈ మాట విని దుఃఖంతో చలించిపోతూ కుంతి కొడుకును కౌగిలించుకుంది. కర్ణుడు మాత్రం ధైర్యం చలించకుండా నిలిచాడు. అపుడు కుంతి యిలా అంది. "కర్ణా! నీవన్నదే జరగనియ్యి. దీనితో కౌరవులు నశిస్తారు. ఏమయినా విధి బలీయం. యుద్ధంలో విడిచిపెడతానని నీ నలుగురు తమ్ముళ్లకూ అభయం ఇచ్చావు కదా! అది మరిచిపోకు. నీకు శుభం- స్వస్తి" అని కుంతి కర్ణునితో అన్నది. 'అలాగే' అన్నాడు కర్ణుడు. తరువాత వారిద్దరూ వేర్వేరు త్రోవల్లో వెళ్లిపోయారు.

147. భీష్ముని పలుకులను శ్రీకృష్ణుడు ధర్మరాజుకు వినిపించుట.

కేశవుడు హస్తినాపురం నుండి ఉపప్లావ్యానికి వచ్చి జరిగిన దంతా పాండవులకు తెలిపాడు. మళ్లీ మళ్లీ చాలా సేపు చెప్పి, వారిని విడిచి కృష్ణుడు విశ్రాంతి కోసం తన భవనానికి వెళ్లాడు. విరాటుడు మొదలయిన రాజు లందరినీ వారి భవనాలకు పంపి

పాండవు లయిదుగురూ సూర్యాస్తమయ సమయంలో సంధ్యావందన మాచరించారు. కృష్ణునే భావిస్తూ, అతని మీదనే మనసు నిలిపి, కృష్ణుని రప్పించి, మళ్లీ ఆలోచింపసాగారు. యుధిష్ఠిరుడిలా ఆరంభించాడు- 'పుండరీకాక్షా! హస్తినాపురానికి వెళ్లి నీవు సభలో దుర్యోధనునితో ఏమన్నావో చెప్పు.'

వాసుదేవుడిలా చెప్పాడు. "హస్తినాపురం వెళ్లి నేను ఆ దుర్యోధనునికి న్యాయసహితమూ, హితమూ అయిన వాస్తవం చెప్పాను. కాని ఆ దుర్మతి అది గ్రహించలేదు." అనగానే యుధిష్ఠిరుడిలా అడిగాడు. "వాడు అలా దారి తప్పుతుంటే కురువృద్ధుడు భీష్ముడు సహనం లేని దుర్యోధనునితో ఏమన్నాడు? ఆచార్య ద్రోణు డేమన్నాడు? తండ్రి ధృతరాష్ట్రుడే మన్నాడు? గాంధారి ఏమన్నది? మా పినతండ్రి విదురుడు ధర్మవేత్తలలో ఉత్తముడు. కొడుకుల గురించి ఆవేదన చెందుతూ ఉంటాడు. అతడు దుర్యోధనునితో ఏమన్నాడు? సభలోని రాజులంతా ఏమన్నారు? జనార్దనా! అదంతా ఉన్నదున్నట్లు చెప్పు. కౌరవ సభలో నీవూ, కురుముఖ్యులూ ఆ దుర్యోధనునికి అంతా చెప్పి ఉంటారు. కాని ఆ దుర్యోధనుడు కామలోభాలతో నిండిపోయాడు. తెలివి తక్కువ వాడు. పైగా తానే తెలివైన వాడి ననుకొంటాడు. మీ మాటలు వానికి అప్రియంగా ఉంటాయి. వాని మనసులో నిలవవు. వారి వాక్యాలు కూడా వినాలని ఉంది. గోవిందా! కాలం మించిపోకుండా చేయవలసిన దేదో అది చెయ్యి. మాకు గతి నీవే- మాకు నాథుడవు, గురువు కూడా నీవే." అపుడు వాసుదేవుడు ఇలా అన్నాడు "రాజా! కౌరవ సభలో ఆ దుర్యోధనునికి నేను చెప్పిన మాట ఎటువంటిదో విను. నేను చెప్పిన మాట విని, దుర్యోధనుడు బిగ్గరగా నవ్వాడు. అపుడు భీష్ముడు కోపించి ఇలా అన్నాడు.

'దుర్యోధనా! వంశాన్ని రక్షించడం కోసం నేను చెప్పే మాట విను- విని మన వంశానికి హితం చేకూర్చు. నాయనా! నా తండ్రి శంతనుడు లోక విఖ్యాతుడు. ఆయనకు నేనొక్కడినే కొడుకును అయ్యాను. ఆయనకు "మరో కొడుకు నాకు ఎలా పుడతాడా" అని ఆలోచన కలిగింది. ఒకే పుత్రుడు కల వానిని పుత్రులు లేని వానిగానే శాస్త్రకారులు చెపుతారు. "వంశం- విచ్ఛేదం కాకూడదు- నాకీర్తి ఎలా విస్తరిస్తుంది?" అని ఆయన ఆలోచన. దానిని నేను తెలిసికొని సత్యవతిని తల్లిగా తీసుకువచ్చాను. తండ్రి కోసం, వంశం కోసం నేను దుష్కరమైన ప్రతిజ్ఞ చేసి

ఆమెను తెచ్చాను. రాజ్యాన్ని, వివాహాన్ని త్యజించినట్లు నీకు తెలుసును. ఆ ప్రతిజ్ఞను కాపాడుకొంటూ సంతోషంతో జీవిస్తున్నాను. ఆమెకు మహాబాహు వయిన విచిత్రవీర్యుడు పుట్టాడు. అతడు శ్రీమంతుడు - ధర్మాత్ముడు- కురువంశాన్ని ఉద్ధరించాడు. నా తండ్రి స్వర్గస్థుడు కాగానే నేను వానిని రాజుగా నిలిపి, వానికి సేవకుడ నయ్యాను. చాలామంది రాజులను జయించి వానికి తగిన భార్యలను తెచ్చాను. బహుశః అదినీవు వినే ఉంటావు. ఆ తరువాత పరశురామునితో నాకు ద్వంద్వ యుద్ధం కలిగింది. పరశురాముని వల్ల భయంతో నగరంలోని వారంతా నా తమ్ముని దూరంగా తీసుకుపోయారు. భార్యాలోలుడయిన అతనికి క్షయరోగం సంక్రమించింది. రాజ్యం అరాజక మయిపోయింది. వర్షాలు కురవలేదు. అపుడు ప్రజలంతా ఆకలితో, భయంతో బాధపడుతూ నా దగ్గరకు వచ్చారు.

ప్రజలు ఇలా చెప్పారు. 'శంతనువంశవర్ధనా! ప్రజలంతా క్షీణించి పోతున్నారు. జనహితం కోరి మాకు రాజువు కమ్ము. మా ఈతిబాధలు పోగొట్టు. నీకు శుభమగుగాక! గాంగేయా! ప్రజలంతా భయంకర వ్యాధులతో బాధపడుతున్నారు- ఇంక కొద్దిమందే మిగిలిఉన్నారు- వారిని నీవే రక్షించాలి. వ్యాధుల్ని పారద్రోలి, ప్రజలను ధర్మపూర్వకంగా పరిపాలించు. నీవు జీవించి ఉండగా రాష్ట్రం వినాశం చెందకూడదు.'

ప్రతిజ్ఞను నిలుపుకొంటూ, సత్ప్రవర్తనను స్మరించే నా మనస్సు ప్రజలు మొరపెట్టుకొంటున్నా కలత పడలేదు. మహారాజా! అపుడు పౌరులు, తల్లి సత్యవతి, సేవకులు, పురోహితులు, గురువులు, బ్రాహ్మణులు, విద్వాంసులూ చాలా బాధపడుతూ నన్ను రాజువు కమ్మని సతతమూ చెప్పసాగారు. 'పూర్వం ప్రతీపుడు రక్షించిన ఈ రాజ్యం నీ తరంలో నశించిపోతోంది. మహామతీ! ఇపుడు నీవు మా హితం కోసం రాజువు కావాలి.' ఇలా వారు చెప్పేటప్పటికి నేను చాలా బాధపడ్డాను. వారికి అంజలించి, తండ్రి మీది గౌరవంతో పూర్వం నేను చేసిన ప్రతిజ్ఞను వారికి చెప్పాను. 'నేను బ్రహ్మచారిని, రాజును కాను. ఈ వంశం కోసం ముఖ్యంగా నీకోసం తల్లీ ! ఈ ప్రతిజ్ఞ చేశాను. ఈ భారం వహించమని నన్ను ఆజ్ఞాపించకు.' మళ్లీ నేను అంజలించి తల్లి సత్యవతిని ఇలా ప్రార్థించాను. 'తల్లీ! నేను శంతనుని కుమారుడిని. కురువంశభారం వహించి చేసిన ప్రతిజ్ఞను వ్యర్థం చేయలేను. ముఖ్యంగా ఆ ప్రతిజ్ఞ నీకోసమే చేశాను కదా. నేను నీ సేవకుడిని, దాసుడిని, పుత్రప్రేమ కల తల్లీ!' అంటూ ఆమెను,

ప్రజలను మళ్లీ మళ్లీ ప్రార్థించాను. తల్లితో కూడి నేను వ్యాసుని ప్రార్థించి, సోదరక్షేత్రాలలో సంతానం పొందుమని యాచించాను. సంతానం కోసం అతడు అంగీకరించి ముగ్గురు పుత్రులను అనుగ్రహించాడు.

నీ తండ్రి గ్రుడ్డివాడవడం చేత రాజు కాలేదు. మహాత్ముడై, లోక విఖ్యాతుడైన పాండుడు రాజయ్యాడు. అతడు రాజు కావడం చేత అతని పుత్రులు తండ్రి రాజ్యానికి ఉత్తరాధికారులు. అందుచేత నాయనా! వారితో కలహం పెట్టుకోకు. రాజ్యంలో సగభాగం వారికియ్యి. నేను జీవించి ఉండగా రాజ్యం పాలించగల మగవా డెవ్వడున్నాడు? నామాటను అవమానించకు. నేను సదా మీ శాంతిని కోరేవాడిని. కుమారా! నీ మీద, పాండవుల మీద నాకు ఏమాత్రం తేడా లేదు. ఇది నీ తండ్రికీ, తల్లికీ, విదురునికీ కూడా ఇష్టం. పెద్దల మాట వినాలి కదా! నా మాటను శంకించకు. నిన్నూ, భూమినీ, సర్వాన్నీ నాశనం చేసుకోకు."

148. ద్రోణ విదురులు, గాంధారి చెప్పిన మాటలను శ్రీకృష్ణుడు ధర్మరాజుకు చెప్పుట.

వాసుదేవుడు ఇలా చెప్పాడు- "భీష్ముడు ఇలా చెప్పిన తరువాత ప్రవచన సమర్థుడయిన ద్రోణుడు రాజుల మధ్యనున్న దుర్యోధనునితో నీకు శుభం కలిగించే మాట ఇలా చెప్పాడు. 'నాయనా! ప్రతీపకుమారుడు శంతనుడు కులంకోసం ఎలా నిలిచాడో అలాగే దేవవ్రతుడయిన ఈ భీష్ముడూ కులంకోసం నిలబడ్డాడు. పాండురాజు సత్యసంధుడు, జితేంద్రియుడు, కౌరవులకు రాజు, ధర్మాత్ముడు, ఏకాగ్రతతో వ్రతదీక్ష వహించినవాడు. అతడు అన్నయైన ధృతరాష్ట్రునకు రాజ్యం ఇచ్చాడు. అలాగే తమ్ము డయిన విదురునకు రాజ్యభారం ఇచ్చాడు. తరువాత ఈ ధృతరాష్ట్రుని సింహాసనం మీద స్థిరంగా నిలిపి (దిగ్విజయాదులతో), పాండురాజు తన భార్యలిద్దరితో అడవికి వెళ్లిపోయాడు. విదురుడు పురుష సింహుడయినా క్రింద నిలిచి భృత్యుని వలె వింజామర వీస్తూ వీనిని (ధృతరాష్ట్రుని) సేవించాడు. ప్రజలంతా పాండురాజును అనుసరించినట్లే ధృతరాష్ట్రుని కూడా రాజు వలెనే అంగీకరించి అనుసరించారు. విదురునికీ, ధృతరాష్ట్రునికీ రాజ్యం విడిచిపెట్టి పాండురాజు శత్రునగరాలను జయిస్తూ భూమి అంతటా సంచరించాడు. సత్యసంధు డయిన విదురుడు కోశాగారం రక్షిస్తూ, దానాలు చేస్తూ, సేవకులనే

చూసుకొంటూ రాజ్యమంతా భరించాడు. సంధి, విగ్రహాలు నిర్ణయించడం, రాజుల నుండి కప్పాలు గ్రహించడం- ఈ పనులు శత్రుమర్దన సమర్థుడయిన భీష్ముడు చూసుకొన్నాడు. మహాత్ము డయిన విదురుడు దగ్గరుండి సేవిస్తూ ఉంటే బలవంతు డయిన ధృతరాష్ట్రుడు సింహాసనం మీద కూర్చున్నాడు.

ఆతని వంశంలో పుట్టి నీవెందుకు వంశం విచ్ఛేదం చేస్తావు? రాజా! అన్నదమ్ములతో కలిసి భోగాలు అనుభవించు. జాలితో కాని, భయంతో కాని, ధనంకోసం కాని నేనెప్పుడూ చెప్పను. భీష్ముడిచ్చేదే నేను కోరుతాను. కాని నీవిచ్చేది కాదు రాజా! నీనుండి నేను జీవనోపాధి కూడ కోరను. భీష్ముడున్న చోటనే నేనూ ఉంటాను. భీష్ముడు చెప్పిందే చెయ్యి. పాండుకుమారులకు అర్ధరాజ్యం ఇయ్యి. నీకూ పాండవులకూ కూడా నేను సమంగానే సదా ఆచార్యత్వం నిర్వహించాను. నాకు అశ్వత్థామ ఎటువంటి వాడో అలాగే అర్జునుడు కూడా. ఇన్ని మాటలెందుకు? ఎక్కడ ధర్మం ఉంటుందో అక్కడే జయం ఉంటుంది, అమితతేజస్వి అయిన ద్రోణుడు చెప్పిన తరువాత సత్యసంధు డయిన ధర్మవేత్త విదురుడు పూర్తిగా భీష్ముని ముఖం చూసి ఇలా అన్నాడు. 'దేవవ్రతా! నేను చెప్పేమాట విను. పూర్వం ఒకసారి కురువంశం నశించి పోతే, మళ్లీ దాన్ని నీవు ఉద్ధరించావు. నేను ఏడ్చిమొత్తుకొంటూ ఉన్నా నా మాట నీవు పరిగణించటంలేదు. ఈ వంశంలో చెడబుట్టిన వాడు తప్ప అసలీ దుర్యోధను డెవడు? వీడు పెద్దమనిషి కాడు. కృతఘ్నుడు. లోభంతో వీడిమనసు చచ్చిపోయింది. వీడి బుద్ధిని పట్టుకుని నీవు ప్రాకులాడుతున్నావు. ధర్మార్థాలు తెలిసిన తండ్రి మాటను వీడు పాటించటంలేదు. దుర్యోధనుని వల్ల ఈ కౌరవులంతా నశించి పోతున్నారు. మహారాజా! వీరంతా చచ్చిపోకుండా నిలిచే పద్ధతి ననుసరించు. నన్నూ, ధృతరాష్ట్రునీ నీవు పూర్వమే చిత్రంలో బొమ్మల్లా నిలిపావు. (నీ దగ్గర మేము అస్వతంత్రులం). ప్రజాపతి ప్రజల్ని సృష్టించి మళ్లీ సంహరిస్తున్నట్లు వంశనాశం కళ్లారా చూస్తూ ఉపేక్షించకు. ఈ కులక్షయం దాపురిస్తోంది కనుకనే నీ బుద్ధికూడ పనిచేయటం లేదు. నాతోనూ, ధృతరాష్ట్రుని తోనూ నీవు కూడ అడవికి నడు. లేదా మోసగించే ప్రజ్ఞ కల ఈ దుర్మార్గుని బంధించి పాండవుల రక్షణలో వెంటనే రాజ్యం పాలించు. రాజశ్రేష్ఠా! అనుగ్రహించు. పాండవులకూ, కౌరవులకూ, అమిత పరాక్రమవంతులయిన రాజులకూ పెద్దవినాశం కనపడుతోంది, ఇలా అని, విదురుడు దీనంగా ఏదో ఆలోచిస్తూ, తిరిగి

తిరిగి నిట్టూర్పులు పుచ్చుతూ ఊరకుండి పోయాడు.

అపుడు గాంధారి కులం నశించిపోతుందనే భయంతో పాపి, అయిన దుర్యోధనునితో రాజుల ఎదుట కోపంతో ధర్మ, అర్థ సహితంగా ఇలా అంది. 'దుర్యోధనా! మంత్రులతో, సేవకులతో కూడిన పాపివి నీవు. నీ అపరాధం ఏమిటో చెపుతున్నాను. దీన్ని సభలోని రాజులూ, బ్రహ్మర్షులూ, సభాసదులూ అంతా వినాలి. ఈ రాజ్యం కురువంశస్థులు పెద్దవాని క్రమంలో అనుభవిస్తూ వచ్చారు. ఇది పూర్వం నుండీ వచ్చిన ధర్మం. పాపీ! నీ వీనాడు నీతిని విడిచి, కురురాజ్యం అంతా నశింపజేస్తున్నావు. రాజ్యంలో ఉన్నవాడు ధీశాలి అయిన ధృతరాష్ట్రుడు. వానికి తమ్ముడు దీర్ఘదర్శి అయిన విదురుడు. వీరిద్దరినీ దాటి మోహంతో ఇపుడు నీవు రాజత్వం ఎలా కోరతావురా? మహానుభావు లయిన ధృతరాష్ట్ర విదురులు భీష్ముడున్నంత కాలం అస్వతంత్రులే అవుతారు. ఇక ఈ మహాత్ముడు భీష్ముడు ధర్మం ఎరిగినవాడు. అందుకే ఏమీ కోరడు. అసలీ రాజ్యం పాండురాజుది. దీన్ని ఎవరూ కాదనలేరు. దానికి అతని పుత్రులే రాజులు కావాలి- ఇతరులు కారు. ఈ రాజ్యం అంతా పాండవులది. తాత, తండ్రి కొడుకుల వరుసలో వారికే చెందాలి.కురుముఖ్యుడూ, మహాత్ముడూ అయిన దేవవ్రతుడు సత్యసంధుడూ, మహామేధావి కూడా. అతడు చెప్పినది విని మనమంతా మనధర్మాలు చెడకుండా రాజ్యం కాపాడు కోవాలి. మహావ్రతు డయిన ఆ భీష్ముని అనుమతితోనే ఈ రాజయినా, విదురు డయినా మాట్లాడుతారు. స్నేహితులు చెప్పిన ధర్మాన్ని కలకాలం మనం నిలుపుకోవాలి. భీష్ముని ముందుంచుకొని, ధృతరాష్ట్రుని చేత బోధింపబడుతూ ధర్మపుత్రు డయిన ధర్మరాజు న్యాయంగా వచ్చిన ఈ కురురాజ్యం పరిపాలించాలి.'

149. పాండవుల కర్ధరాజ్యమిమ్మని ధృతరాష్ట్రుడు దుర్యోధనునికి చెప్పుట.

గాంధారి ఇలా చెప్పాక ధృతరాష్ట్రుడు సభామధ్యంలో దుర్యోధనునితో ఇలా అన్నాడు. 'పుత్రా! దుర్యోధనా! తండ్రి మీద గౌరవం ఉంటే నేను చెప్పేమాట విని అలా చెయ్యి. నీకు శుభం కలుగుతుంది. మొదట ఈ కురువంశాన్ని వృద్ధి పొందించిన వాడు చంద్రు డనే ప్రజాపతి . అతనికి ఆరవ తరం వాడు నహుషుని కుమారుడు యయాతి. అతనికి రాజర్షి సత్తము లయిన అయిదుగురు కొడుకులు. వారిలో

పెద్దవాడు యదువు. అతడు మహాతేజస్వి, సమర్థుడూను. పూరుడు చిన్నవాడు. అతడే మనవంశం వృద్ధి పొందించాడు. అతడు శర్మిష్ఠకొడుకు. శర్మిష్ఠ వృషపర్వుని కూతురు. యదువు దేవయాని యొక్క కొడుకు. అమిత తేజస్వి అయిన శుక్రుని దౌహిత్రుడు. అతడు యదువంశకర్త, బలవంతుడు, పరాక్రమం కలవాడు. అతడు బుద్ధిలేకుండా గర్వంతో క్షత్రియ జాతిని అవమానించాడు. పరాజయం ఎరుగని యదువు గర్వంతో తండ్రి మాట కూడా వినలేదు. తండ్రినీ, తమ్ముళ్లనూ అవమానించాడు. భూమి అంతటిలోనూ యదువే బలవంతుడయ్యాడు- రాజులందరినీ అతడు వశపరచుకొని హస్తినాపురంలో నివసించాడు. వాని మీద కోపించి యయాతి వానిని శపించాడు. రాజ్యం నుండి కూడా తప్పించాడు. గర్వాంధులై వాని వెంట తిరిగే తమ్ముళ్లను కూడా కోపంతో యయాతి శపించాడు. యయాతి తనకు విధేయుడై తన వశంలో ఉన్న (మాట విన్న) చిన్నకొడుకు పూరుని రాజ్యంలో ప్రతిష్ఠించాడు. ఇలా పెద్దవాడయినా తండ్రిని కాదంటే రాజ్యం పొందలేడు. పెద్దలను గౌరవంతో సేవిస్తే చిన్నవాడయినా రాజ్యం పొందుతాడు.

అలాగే నాతండ్రికి తాత ప్రతీప మహారాజు. అతడు సర్వధర్మాలూ తెలిసినవాడని మూడు లోకాల్లోనూ ప్రసిద్ధికెక్కాడు. ధర్మసహితంగా రాజ్యం పాలించే ఆయనకు దేవసమాను లయిన ముగ్గురు పుత్రులు కలిగారు. దేవాపి పెద్దవాడు. తరువాతి వాడు బాహ్లికుడు. మూడవ వాడు శంతనుడు- మాతాత. మంచి ధైర్యశాలి. దేవాపి మహాతేజస్వి, ధార్మికుడు, సత్యవచనుడు, తండ్రి సేవలు చేయడంలో ఆసక్తి కలవాడు. కాని చర్మదోషం కలవాడు. అతడు పౌరులకు, గ్రామస్థులకూ సమ్మతుడు. సజ్జను లాతనిని సత్కరించే వారు. బాలురకూ, వృద్ధులకూ, అందరికీ అతడు మిక్కిలి మనోజ్ఞంగా ఉండే వాడు. అతడు మంచిదాత, సత్యసంధుడు, సర్వప్రాణులకూ హితం చేయడంలో ఆసక్తి కలవాడు. తండ్రియొక్క, బ్రాహ్మణులయొక్క ఆజ్ఞను నిర్వర్తించేవాడు. ఆ దేవాపి బాహ్లీకునకూ, మహాత్ముడయిన శంతనునకూ కూడా అన్న. వారికి సోదరప్రేమ చాలా ఎక్కువ. కొంతకాలానికి వృద్ధు డయిన మహారాజు విధ్యుక్తంగా అభిషేకం కోసం ఏర్పాటు చేశాడు. అభిషేకానికి కావలసిన సామగ్రి అంతా సమకూర్చాడు రాజు. అపుడు బ్రాహ్మణులు, వృద్ధులు, పౌరులు, జానపదులూ అంతా దేవాపి అభిషేకాన్ని వద్దన్నారు. అభిషేకం పనికిరాదన్న వారి మాట విని

మహారాజు కుమారుని గురించి చాలా దుఃఖించాడు. ఇలా అతడు దాత, ధర్మజ్ఞుడు, సత్యవాది, ప్రజలకు ఇష్టుడూ అయినా చర్మదోషంతో దూషితు డయ్యాడు. అవయవలోపం కలవారిని దేవతలు ప్రశంసించరని విపులాతనిని వద్దన్నారు. అపు డా రాజు పుత్రశోకంతో ఎంతో కృశించిపోయాడు. దేవాపి అడవులకు వెళ్లిపోయాడు. తండ్రినీ, సోదరులనూ, రాజ్యాన్నీ వదిలి బాహ్లీకుడు మేనమామల దగ్గరకు వెళ్లి సంపత్సమృద్ధ మయిన రాజ్యం పొందాడు. బాహ్లీకుని అనుజ్ఞతో శంతనుడు తండ్రి మరణానంతరం రాజై రాజ్యం చేశాడు.

అలాగే జ్యేష్ఠుడ నయినా అంగలోపం కలవాడిని అని రాజ్యం లేకుండా పాండురాజును రాజును చేశాడు. పాండుడు చిన్నవాడయినా రాజ్యం పొందాడు. అతని మరణానంతరం ఈ రాజ్యం అతని పుత్రులకే చెందుతుంది. రాజ్యానికి భాగం నాకే లేనపుడు నీవెట్లా రాజ్యం కోరగలవు. నీవు రాజపుత్రుడవు కావు. నీది కాని ధనం అపహరించాలనుకొంటున్నావు. యుధిష్ఠిరుడు రాజపుత్రుడు, మహాత్ముడు, అతనికి న్యాయ్యంగా వచ్చినదీ రాజ్యం. అతడే ఈ కురువంశానికి భర్త. మహానుభావు డయిన అతడే రాజు. అతడు సత్యసంధుడు, జాగరూకుడు, శాస్త్రానుసారంగా ప్రవర్తిస్తాడు. బంధుజనుల పట్ల సద్భావం కలవాడు. ప్రజలకు హితుడు. స్నేహితుల పట్ల కరుణాపరుడు. జితేంద్రియుడు, సజ్జన రక్షకుడు. ఓర్పు, దుఃఖాలు సహించగలగడం, ఇంద్రియ జయం, ఋజుత్వం, సత్యవ్రతం, శాస్త్రజ్ఞానం, పొరబాటు పడకపోవడం, భూతదయ, ప్రజారక్షణం అనే యీ రాజగుణా లన్నీ ధర్మరాజులో ఉన్నాయి. నీవు రాజు కొడుకువు కావు, దుష్టవర్తనుడవు, లోభివి, బంధులపట్ల పాపాలోచన చేస్తావు. దుర్వినీతా! క్రమంగా వచ్చిన ఈ రాజ్యం పరులది. దాన్ని నీవెలా హరిస్తావు? మోహాన్ని విడిచి, వాహనాలతో, లాంఛనాలతో అర్ధరాజ్యం పాండవులకు ఇయ్యి. అపుడే నీకూ, నీతమ్ముళ్లకూ ఆయువు మిగులుతుంది.'

150. కౌరవుల పట్ల దండనీతియే తగిన దని కృష్ణుడు చెప్పుట.

వాసుదేవు డిలా అన్నాడు. "ఇలా భీష్మద్రోణ విదురులూ, గాంధారీధృతరాష్ట్రులూ చెప్పినా ఆ మందబుద్ధి వినలేదు. కోపంతో, ఎఱ్ఱని కనులతో విదిలించుకొని లేచి వెళ్లిపోయాడు. ప్రాణాల మీద ఆశవదులుకొన్న రాజులంతా అతని వెనుక వెళ్లిపోయారు.

వివేకం లేని ఆ రాజులందరినీ 'ఈ రోజు పుష్యమి- కురుక్షేత్రానికి నడవండి' అంటూ పదే పదే ఆజ్ఞాపించాడు. కాలచోదితు లయిన ఆ రాజులంతా ససైన్యంగా భీష్ముడిని సేనాపతిగా చేసుకొని బయలుదేరారు. పదకొండు అక్షౌహిణుల కౌరవ సైన్యం అక్కడకు చేరింది. అందులో భీష్ముడు చాలా గొప్పగా కనిపించాడు. రాజా! ఉచితమై చేయగలిగినది చెయ్యి. భీష్ముడూ, ద్రోణుడూ, విదురుడూ, గాంధారీ ధృతరాష్ట్రులూ, నా ఎదుట చెప్పినదీ, కురుసభలో జరిగినదీ అంతా చెప్పాను నీకు. కురుపాండవుల సౌభ్రాత్రాన్ని కోరి, వంశం ఛిన్నాభిన్నం కాకూడదని, ప్రజల అభ్యుదయంకోసం ముందుగా సామ వాక్యాలు పలికాను. సామోపాయం పనికిరాకపోయేసరికి భేదోపాయం ప్రయోగించాను. దేవతలకూ, మానవులకూ సంబంధించిన పనులన్నీ ఏకరువు పెట్టాను. సామవచనాలను దుర్యోధనుడు ఆదరించలేదు. అపుడు రాజులందరినీ పిలిచి వారిలో భేదం పెట్టాను. రాజా! అద్భుతాలు, ఘోరాలు, భయంకరాలూ, అమానుషాలు అయిన కృత్యాలు కూడా ప్రదర్శించాను.

ఆ రాజులందరినీ బెదిరించాను. దుర్యోధనుని తృణీకరించి మాట్లాడాను. కర్ణుని, శకునిని భయపెట్టాను. జూదం కారణంగా కౌరవు లందరినీ తప్పు పట్టాను. రాజు లందరినీ మంచి మాటలతోనూ భేదోపాయాలతోనూ బెదిరిపోయేటట్లు చేశాను. మళ్లీ సామ, దాన వాక్యాలు పలికాను. కురువంశం విచ్ఛిన్నం కాకుండా ఉండేందుకు కార్యసిద్ధికోసం ఇదంతా చేశాను. వీరు లయిన ఆ పాండవు లందరూ పట్టుదల విడిచి, నేలపై నిలిచి ధృతరాష్ట్రునీ, భీష్మునీ, విదురునీ సేవిస్తారు. వారు రాజ్యం నీకిచ్చేస్తారు. వారు పాలకులు కావలసిన పనిలేదు. ధృతరాష్ట్రుడూ, భీష్ముడూ, విదురుడూ నీ కే హితం చెప్పారో అలా చెయ్యి. రాజ్యం అంతా నీకే ఉండనియ్యి. అయిదు ఊళ్లు మాత్రం ఇయ్యి. నీ తండ్రి పాండవులను కూడా పోషించాలి గదా! ఇలా ఎన్ని చెప్పినా ఆ దుర్మార్గుడు భాగమే వదల లేదు. ఇంక ఆ పాపుల మీద నాల్గవ దయిన దండమే ప్రయోగించాలనిపిస్తుంది నాకు. మరొకటి పనికిరాదు. ఆ రాజులంతా చావుకోసం కురుక్షేత్రం వెళ్లిపోయారు కూడ. రాజా! కౌరవసభలో జరిగినదంతా నీకు చెప్పాను పాండుకుమారా! యుద్ధం లేకుండా వాళ్లు నీ రాజ్యం ఇవ్వరు. వారంతా వినాశకారకులు. వారికి మృత్యువు పొంచి ఉంది."

151. పాండవపక్షసేనానిని ఎన్నుకొనుట - పాండవసేవలు కురుక్షేత్రమును చేరుట.

శ్రీకృష్ణభగవానుని మాటలు విన్న ధర్మనందనుడు - కేశవుని సమక్షంలో తన తమ్ములను జూచి ఇలా అన్నాడు. "కౌరవసభలో జరిగిన వృత్తాంతమంతా మీరు విన్నారు కదా! అలాగే శ్రీకృష్ణుడు పలికిన దాన్ని కూడా బాగా గుర్తించి ఉంటారు. కాబట్టి వీరులారా ! మీరు మీ సేనలవిభాగాన్ని సిద్ధపరచుకోండి. ఈ ఏడు అక్షౌహిణీ సైన్యాలు ఒక చోట చేరాయి. ఇవి మనకు విజయాన్ని తప్పక చేకూర్చుతాయి. ఈ ఏడు అక్షౌహిణులకు ఏడుగురు సేనాపతుల పేర్లను చెపుతున్నాను. ఆలకించండి. ద్రుపదుడు, విరాటుడు, ధృష్టద్యుమ్నుడు, శిఖండి, సాత్యకి, చేకితానుడు, భీమసేనుడు- వీరందరూ మనకోసం శరీర త్యాగానికైనా సిద్ధపడ్డారు. కాబట్టి వీరే పాండవసేనా నాయకులు. వీరంతా వేదవేత్తలు, శూరులు, ఉత్తమ వ్రతాన్ని పాలించేవారు. వినయమూ, నీతీ కలిగి యుద్ధంలో ఆరితేరినవారు. వీరందరు ధనుర్వేదంలో నిపుణులు. అస్త్ర యుద్ధంలో కూడ సమర్థులు. (వీరిలో) ఏడుగురిలో ఎవరు నేతగా ఉంటారు ? ఎవరు సైన్యవిభాగాన్ని బాగా గుర్తించగలరు ? యుద్ధంలో బాణజ్వాలలతో అగ్నిలా ప్రజ్వలించే భీష్ముని ఎవరు ఎదుర్కొనగలరు. సహదేవా! ముందుగా నీవే నీ అభిప్రాయాన్ని ప్రకటించు. మనలో ప్రధాన సేనాపతిగా వ్యవహరించడానికి సమర్థుడెవరో తెలుపు." సహదేవుడిలా అన్నాడు. "మనకు బంధువు, దుఃఖ సమయంలో మనతో పాటేఉన్న విరాట మహారాజును ఆశ్రయించి, మనం రాజ్యభాగాన్ని పొందగలం. అతడు బలవంతుడై అస్త్రవిద్యలో నైపుణ్యాన్ని ప్రదర్శిస్తూ యుద్ధంలో దుర్మదుడై పోరాడగలడు. అతడు మత్స్యదేశానికి ప్రభువుగా నున్నాడు. ఆ విరాట రాజు యుద్ధభూమిలో భీష్ముని, ఇతర మహారథులను తట్టుకో గలడు." సహదేవుడు ఇలా అన్నాక మాటలలో నేర్పరియైన నకులుడు ఇలా అందుకున్నాడు. "ద్రుపదుడు వయసులోనూ, శాస్త్రజ్ఞానంలోనూ, ధైర్యం లోనూ, కులంలోనూ, బంధువులలోనూ పెద్దవాడు. వినయం, బలం, ఐశ్వర్యం, మూడూ అతనిలో ఉన్నాయి. సమస్త శాస్త్ర విశారదుడు. భరద్వాజ మహర్షినుండి అస్త్రవిద్యను నేర్చు కొన్నాడు. సత్యప్రతిజ్ఞుడని, భేదించుటకు వీలుగాని వీరుడని ప్రసిద్ధి చెందాడు. నిరంతరం మహాబలవంతు లయిన భీష్మ ద్రోణులతో పోటీపడుతూ ఉంటాడు. రాజవంశమందరిముందు వాహినీపతిగా ప్రశంసింపబడినాడు.

పుత్రపౌత్రాదులతో వందల కొమ్మలున్న వృక్షంలా శోభిల్లుతున్నాడు. ఆ మహారాజు రోషంతో ద్రోణాచార్యుని వినాశనాన్ని కోరుతూ భార్యతో సహా ఘోరతపస్సు ఆచరించాడు. యుద్ధభూమిలో, నిలిచిన శూరులకు, వీరులకు, మనలాంటి వారికి తండ్రిలా ఆప్యాయతలను అందిస్తున్నాడు. అట్టి మన మామగారైన భూపాల శిరోమణి ద్రుపదుడే మన సైన్యానికి ప్రముఖనేతగా వ్యవహరించుగాక ! నా అభిప్రాయానుసారంగా ఒక్కుమ్మడిగా వచ్చినా ద్రోణభీష్మాదులను ద్రుపదమహారాజే ఎదుర్కొన గలవాడు. ఎందుకంటే అతడు దివ్యాస్త్ర జ్ఞాన సంపన్నుడైన ద్రోణాచార్యుని స్నేహితుడు కదా !"

మాద్రీకుమారులైన నకుల సహదేవులు తమ అభిప్రాయాన్ని ప్రకటించిన తరువాత కురునందనుడు, ఇంద్ర సమానుడైన ఇంద్రపుత్రుడు సవ్యసాచి అర్జునుడిలా చెప్పాడు. "ధృష్టద్యుమ్నుడు అగ్నిజ్వాలలతో సమానమైన కాంతి కల మహాభుజుడు. తనతండ్రితపః ప్రభావంతోనూ, మహర్షుల దయాప్రసాదంగానూ దివ్య పురుషుడుగా జన్మించాడు. అగ్నికుండంనుండి కవచాన్ని, ధనుస్సును, ఖడ్గాన్ని ధరించి పుట్టాడు. దివ్యమైన ఉత్తమాశ్వాలతో ఉద్భవించిన రథాన్ని అధిరోహించి యుద్ధంకోసం సిద్ధంగా కనబడుతూ ఉంటాడు. అతని రథఘోష మహామేఘధ్వనిని తలపింపజేస్తూ ఉంటుంది. శారీరకలక్షణాలు, పరాక్రమం, హృదయం, వక్షఃస్థలం, బాహువులు, కంఠం – గర్జన- ఇవి అన్నీ అతనికి సింహం వలె ఉంటాయి. మహాబలంతో మహాతేజస్వీగా, మహావీరుడుగా ఉంటాడు. పెద్ద మూపురం, అందమైన పలువరుస, దవడలు, బుగ్గలు, భుజస్కంధాలు, అందమయిన ముఖం కలిగి అలువెరుగని వాడు. అందమైన ఎగు బుజాలు, విశాలనేత్రాలు, సుందరపాదాలు కలవాడు. ఎవరి అస్త్రశస్త్రాలకూ గురికానివాడు. మదపుటేనుగు వంటి పరాక్రమం కలిగి వీరుడైన ద్రోణాచార్యుల వినాశనానికై పుట్టిన వాడు. సత్యవాక్కుతో, జితేంద్రియుడుగా వెలుగొందుతున్నాడు. అట్టి ధృష్టద్యుమ్నుడు ప్రధాన సేనాపతిగా అన్నివిధాలా యోగ్యుడని భావిస్తున్నాను. భీష్మపితామహుని బాణాలు విషకీలలను వెలిగ్రక్కే సర్పాలవంటివి. ఆ బాణాల స్పర్శ – వజ్రంవలె, భయంకరమైన పిడుగుపాటు వలె భరింపశక్యం కాదు. ఆ బాణాలను ఎదుర్కొనటానికి ధృష్టద్యుమ్నుడే సమర్థుడు. భీష్మ పితామహుని బాణాలు పడటంతోనే అగ్నివలె దగ్ధంచేస్తాయి. ప్రకాశిస్తాయి. వేగంలో యమదూతలవలె ప్రాణాలు తీస్తాయి. వజ్రాయుధపు రాపిడివలె గంభీరంగా మ్రోగుతాయి. వాటిని మునుపు పరశురాముడు ధరించాడు. భీష్మపితామహుని ధాటిని

తట్టుకొనడానికి ధృష్టద్యుమ్నుడు తప్ప వేరొక్కరు సమర్థుడుగా నాకు తోచడం లేదు. ఇది నా నిశ్చితాభిప్రాయం. అత్యంత వేగంగా హస్తసంచాలనం చేయగలడు. విచిత్ర పద్ధతుల్లో యుద్ధం చేసే నేర్పరి. బ్రద్దలు కొట్టలేని కవచాన్ని ధరించి ఏనుగుల సమూహంలో సంచరించే గజరాజువలె ప్రకాశించే ధృష్టద్యుమ్నుడే సేనాపతి గా తగ్గవాడు."

(అర్జునుడు ఈ విధంగా చెప్పిన తరువాత భీమసేనుడు అందుకొన్నాడు.)

"రాజేంద్రా! ద్రుపదకుమారుడు 'శిఖండి' భీష్ముని వధకోసం పుట్టినవాడు. ఈ మాట ఇక్కడకు విచ్చేసిన సిద్ధపురుషులు - మహర్షులు చెప్పినది. యుద్ధరంగంలో శిఖండి తన దివ్యాస్త్రాలను ప్రదర్శించగలడు. ఆ సమయంలో ప్రజలంతా అతని రూపం పరశురాముని రూపంతో సమానమైనదిగా దర్శిస్తారు. రాజా ! మహావ్రతాన్ని బూనిన శిఖండి రథారూఢుడై నిలిస్తే, అతనిని ఎవరూ ఛేదించలేరు. ద్వైరథ యుద్ధంలో శూరుడు, వీరుడూ అయిన 'శిఖండి' తప్ప మరొక వీరుడు ఆ పితామహుని తెగటార్చలేరు. కాబట్టి నా అభిప్రాయాన్ననుసరించి ఆ శిఖండియే సేనాపతిగా తగినవాడు."

ధర్మరాజిలా పలుకసాగాడు. "నాయనా ! ధర్మాత్ముడు, భగవంతుడునగు శ్రీకృష్ణుడు ఈ సమస్త జగత్తుయొక్క సారాసారాలూ, బలబలాలూ తెలిసినవాడు. మరి ఈ విషయంలో రాజన్యుల అభిప్రాయాలు కూడా ఆ మహాత్మునికే తెలుసు. కాబట్టి దాశార్హకుల భూషణుడైన శ్రీకృష్ణుడు ఎవరి పేరు చెప్పితే వారే మనకు ప్రధాన సేనాపతిగా ఉండదగినవాడు. ఆ వ్యక్తి అస్త్రవిద్యలో నిపుణుడైనా, కాకపోయినా వృద్ధుడైనా, యువకుడైనా కావచ్చు. (ఈ విషయంలో మనపక్షంలోని వారికి చింత అవసరంలేదు). ఈ శ్రీకృష్ణభగవానుడే మన, జయాపజయాలకు మూలకారణం. మన ప్రాణాలు, రాజ్యం, మన కలిమి, మన లేమి, సుఖదుఃఖాలూ అన్నీ అతనిపై ఆధారపడి ఉన్నాయి. అతడే కర్త. అతడే విధాత. మన కార్యసిద్ధులన్నీ ఆస్వామిపైనే ఉన్నాయి. కాబట్టి శ్రీకృష్ణభగవానుడు ఎవరిపేరు ప్రస్తావిస్తాడో అతడే మన ప్రధాన సేనాపతి. కాబట్టి వక్తలలో శ్రేష్ఠుడైన శ్రీకృష్ణుడు తన అభిప్రాయం చెప్పాలి. రాత్రికాలం పూర్తిఅవుతోంది. మనం మన సేనాపతిని ఎన్నుకొని, రాత్రి గడిచినపిమ్మట అస్త్రశస్త్రాలను గంధమాల్యాదులతో పూజించి, కౌతుకాలను రక్షాబంధనాలను గావించుకొని, స్వస్తి వాచకాలను అనుసరించి శ్రీకృష్ణాధీనులమై యుద్ధరంగానికి వెడదాం." యుధిష్ఠిరుని

మాటల నాలకించిన శ్రీ కృష్ణుడు అర్జునుని వైపు చూసి ఇలా అన్నాడు. "మహారాజా! మీరు చెప్పిన వారంతా సేనాపతులుగా సమర్థులే. ఎందుకనగా మీరు పేర్కొన్న వారంతా మహాపరాక్రమ వంతులయిన యోధానుయోధులే. శత్రువును ఓడించడంలో వీరందరూ శక్తిమంతులే. వీరు యుద్ధరంగంలో ఇంద్రుని కూడా భయపెట్ట గలరు. ఇక పాపాత్ములూ, లోభచిత్తులూ అయిన ధృత రాష్ట్రకుమారుల విషయంలో చెప్పాలా? భరతనందనా ! నేను కూడా ఈ యుద్ధవిషయంలో ఆలోచించి, నీకు మంచిని చేయాలని శాంతిని స్థాపించడానికై ఎంతో ప్రయత్నం చేశాను. ఈ కారణాన మనవారంతా ధర్మబుణం తీర్చుకొనగలిగిన వారం కాగలిగాము. ఇతరుల దోషాలను ఎత్తిచూపేవారు కూడా మనపై నిందలను మోపలేరు. దుర్యోధనుడు యుద్ధం కావాలని తహతహ లాడుతున్నాడు. అతడు మూర్ఖుడు. అయోగ్యుడై తనను అస్త్ర విద్యాపారంగతునిగా భావిస్తున్నాడు. తాను బలహీనుడైనా బలవంతుడ ననే అనుకొంటున్నాడు. కాబట్టి మీరు మీ సైన్యాన్ని యుద్ధానికి సిద్ధం చేయండి. ఎందుకంటే నా అభిప్రాయం ప్రకారం శత్రుసంహారంతో గాని వారు వశం కారు. వీరుడైన అర్జునుడు, యమధర్మరాజుతో సమానులైన నకుల సహదేవులు, సాత్యకిసహితుడైన ధృష్టద్యుమ్నుడు, అభిమన్యుడు, ఉపపాండవులూ, విరాటరాజు, ద్రుపదుడు ఇతర అక్షౌహిణీ సేనానాయకుల పరాక్రమాన్ని చూసి ధృతరాష్ట్ర కుమారులు నిలబడటానికి కూడా సాహసించలేరు. మన సైన్యం మిక్కిలి శక్తిమంతమైనది. అభేద్యం. ఎదిరింపరానిది. మన సేన ధార్తరాష్ట్రుల సేనలను సంహరించ గలదు. ఇందులో సందేహం లేదు. శత్రుమర్దనా! నేను ధృష్టద్యుమ్ననే ప్రధాన సేనాపతిగా అనుకొంటున్నాను."

రాజా! శ్రీకృష్ణుడు ఈ విధంగా చెప్పడంతో నరశ్రేష్ఠ లందరూ ఎంతో సంతోషించారు. వెంటనే వారు "యుద్ధానికి సిద్ధం కండి సన్నద్ధులైరండి" అంటూ సైన్యమంతటినీ మహోత్కంఠతతో పరుగులెత్తించ సాగారు. ఆ సమయంలో ప్రసన్నమనస్కులైన వీరుల యొక్క మహానాదాలు అన్నిదిక్కులూ చెలరేగాయి. అన్నిదిక్కులా అశ్వహేషలు, గజఘీంకారాలు, రథాల చప్పుళ్ళు వినబడసాగాయి. అంతటా శంఖదుందుభుల ధ్వనులు మారుమోగాయి. రథాలు, పదాతి దళాలు, గజబలాలతో నిండిన ఆ సైన్యం భయంకర తరంగాలతో కూడిన మహాసాగరం వలె కల్లోలిత మయింది. పాండవులు, వారి సైన్యాలు అంతటా పరుగిడుతూ యుద్ధానికి

ఆహ్వానిస్తూ కవచాలను ధరిస్తూ రణయాత్రకు బయలుదేరారు. ఆ సైన్యప్రవాహాలు విశాలమై మహాజలంతో నిండిన గంగానదివలే దాటశక్యం కానట్లు కనపడ్డాయి. భీమసేనుడు, నకుల సహదేవులు, అభిమన్యుడు, ఉపపాండవులు ధృష్టద్యుమ్నుడు ప్రభద్రకగణాలు, పాంచాలురు వీరందరూ భీమసేనుని తమకు ముందుంచుకొని బయలుదేరారు. పూర్ణిమనాడు సముద్రమున్నంత కోలాహలంతో, హర్షంతో, ఉత్సాహంతో పొంగిపొరలే ఆ సైన్యంచేసే ఘోష అంతటా వ్యాపించి స్వర్గలోకాన్ని మిన్నుముట్టింది. హర్షాతిరేకంతో కవచాలను ధరించి శత్రుసైన్యాలను చీల్చిచెండాడే సైన్యాల మధ్యలోనుండి ధర్మరాజు నడువసాగాడు. యుద్ధసామగ్రిని మోసే శకటాలు, అంగళ్ళు, గుడారాలు రథాలు మొదలయిన బండ్లు, ధనాగారం, యంత్రాలతో ప్రయోగించే అస్త్రాలు, వైద్యులు, శస్త్రచికిత్సకులు వారితోపాటు పయనించసాగారు. ధర్మరాజు సారోహనులైన సైనికులను, చిక్కిన దుర్బలులను మిగిలిన పరిచారకులను ఉపప్లావ్య నగరంలో ఒకచోట చేర్చి, తాను అక్కడ నుండి బయలుదేరాడు.

ద్రౌపదీదేవి దాస దాసీజనపరివేష్టితురాలై కొంతదూరం వరకూ ధర్మరాజుతో పాటు వెళ్లి, మరల స్త్రీలతో కూడి తిరిగి వచ్చింది. పాండునందనులు దుర్గ రక్షణకు అవసరమైన స్థావర జంగమ ఉపాయాలద్వారా మూల రక్షణ చేసి పెద్దసేనతో బయలు దేరారు. రాజా ! బ్రాహ్మణోత్తములు నాలుగు దిక్కులనుండి వచ్చి పాండవుల గుణాలను కీర్తించసాగారు. పాండవులు వారికి గోవులను, సువర్ణాదులను దానాలుగా సమర్పించారు. ఈ విధంగా పాండవులు మణిభూషిత రథాలపై యాత్ర సాగించారు. కేకయ రాజకుమారులు, ధృష్టకేతువు, కాశీరాజు కుమారుడైన అభిభువు, శ్రేణిమంతుడు వసుదానుడు, శిఖండి, వీరందరూ అలంకారాలు ధరించి కవచధారులై శస్త్రాలు దాల్చి, హర్షంతో ఉల్లాసంగా యుధిష్ఠిరుని సమీపించి అతనితో నడవసాగారు. ఆ మహాసైన్యం వెనుక సగభాగంలో విరాటరాజు, ధృష్టద్యుమ్నుడు, సుధర్ముడు, కుంతిభోజుడు, ధృష్టద్యుమ్నుని కుమారులూ నడువసాగారు. వీరితోపాటు నలుబదివేల రథాలు, రెండు లక్షల గుర్రాలు, నాలుగులక్షల పదాతిదళాలు, అరువది వేల ఏనుగులు ఉన్నాయి. అనాధృష్టి, చేకితానుడు, ధృష్టకేతువు, సాత్యకి వీరందరూ కృష్ణార్జునులను అనుసరించి వెళ్లారు. ఇలా పాండవులు వ్యూహరచనచేసి, యుద్ధానికి సన్నద్ధులై, కురుక్షేత్రం చేరుకొని, మదించిన వృషభాలవలె నినదిస్తూ కనబడ్డారు. వీరులు

కురుక్షేత్రరణరంగం చేరుకొని తమతమ శంఖాలను పూరించారు. అలాగే శ్రీ కృష్ణార్జునులిరువురూ తమశంఖాలను పూరించారు. మెరపులతో కూడిన పిడుగువలె శబ్దించే పాంచజన్య శంఖధ్వని విని, అన్ని వైపులా విస్తరించిన పాండవసైన్యాలు చాలా సంతోషమూ, ఉత్సాహమూ పొందాయి. శంఖ దుందుభులతో కూడిన వీరుల సింహనాదాలు భూమ్యాకాశసముద్రాలలో ఒక్కసారిగా ప్రతిధ్వనించాయి.

152. కురుక్షేత్రములో పాండవసేనలు - శిబిరనిర్మాణములు.

పిమ్మట ధర్మరాజు తనసైన్య మంతటినీ సమతలంగా ఉండి దట్టంగా ఏపుగా గడ్డి ఇంధనాలు పెరిగి ఉన్న ప్రదేశంలో నిలిపాడు. శ్మశానాలను, దేవమందిరాలను, మహర్షుల పుణ్యాశ్రమాలను, తీర్థాలను, సిద్ధక్షేత్రాలను వదిలిపెట్టి దూరంగా, సుక్షేత్రంగా, మనోహరంగా, శుచిగా, పవిత్రంగా ఉండే భూమిని ఎంచుకొని యుధిష్ఠిరుడు తనసైన్యాన్ని నిలిపాడు. వాహనా లన్నిటికీ విశ్రాంతి నిచ్చి తానుకూడా విశ్రాంతిసుఖం పొంది శ్రీ కృష్ణభగవానుడు లేచి భూపాలురతో అర్జునునితో కలిసి ముందుకు నడువసాగాడు. వారందరూ చుట్టూరాఉన్న దుర్యోధనసైనికులకు దూరంగా వెళ్లి అక్కడ ఎన్నో విధాల ఆలోచించారు. ధృష్టద్యుమ్నుడు, ద్రుపదుడు, సాత్యకి శిబిరాన్ని వేయించారు. కురుక్షేత్రంలో "హిరణ్వతి" అనే పవిత్రనది ఉన్నది. అది చాలా నిర్మలమై, విశుద్ధమైన జలంతో నిండి ఉంటుంది. ఆ నదీతీరంలో అనేక సుందరమైన స్నాన ఘట్టాలు ఉన్నాయి. అక్కడ రాళ్ళు లేవు. బురద లేదు. ఆనదికి దగ్గరగా శ్రీ కృష్ణభగవానుడు పరిఖను త్రవ్వించి, కాపలాగా కొందరిని నియమించాడు. పాండవుల కోసం నిర్మించినట్లే మిగిలిన రాజులకు కూడా శిబిరాలు వేయించాడు.

రాజేంద్రా! వేర్వేరుగా రాజులందరి కోసం వేలాదిగా పటిష్ఠమై బహుమూల్యములైన గుడారాలు సిద్ధం చేశారు. ఆ గుడారాల్లో వంటచెరకు మిక్కుటంగా ఉంచారు. భక్ష్య- భోజ్య - అన్నపానాదివ్యవస్థకై ఎంతో సామగ్రి సమకూర్చబడింది. ఆ శిబిరాలన్నీ భూతలంపై విస్తరించిన విమానాలవలె ప్రకాశిస్తున్నాయి. ఆ సైన్యాలలో శిల్పులనూ, విద్వాంసులనూ, వైద్యులనూ వేతనాలిచ్చి నియమించారు. వారంతా అవసరమైన అన్ని ఉపకరణాలతో సిద్ధంగా ఉన్నారు. ప్రతిశిబిరంలోనూ అల్లెత్రాళ్లు, ధనుస్సులు, కవచాలు, అస్త్రశస్త్రాలు, తేనె, నేయి, యక్ష ధూపపు పొడులు - వీటి రాసులు

పర్వతాలవలె కనపడుతున్నాయి. ధర్మరాజు ప్రతీశిబిరంలో పుష్కలంగా నీరు, గడ్డి, ఊక, బొగ్గులు అనువుగా సిద్ధం చేయించాడు. ఆ శిబిరాలలో పెద్దపెద్ద యంత్రాలు, బాణాలు, తోమరాలు, గొడ్డళ్ళు, ధనుస్సులు, కవచాలు, రెండువైపులా పదునుగా ఉండే ఖడ్గాలు, అమ్ముల పొదులు ఉంచబడ్డాయి. సైనికులతోపాటు ముళ్లకవచాలతో పర్వతాలవలె విశాలమైన దేహాలతో ప్రకాశించే ఏనుగులు ఇనుప కవచాల వంటి ఉత్తరీయాలతో కనపడుతున్నాయి. పాండవులు ఈ విధంగా కురుక్షేత్రాన్ని సమీపించి, తమ తమ సైన్యాలను నిలిపారు. ఈ విషయాన్ని తెలుసుకొని పాండవులతో స్నేహాన్ని కోరే రాజులు తమతమ సైన్యాలను తీసుకొని అక్కడికి చేరుకొన్నారు. బ్రహ్మచర్యవ్రతాన్ని ఆచరిస్తూ, భూరిదక్షిణలిచ్చి యజ్ఞాలు చేసిన రాజులు పాండవుల విజయం కోరుతూ కురుక్షేత్రానికి విచ్చేశారు.

153. కౌరవసేన యుద్ధయాత్రకు వెడలుట.

శ్రీకృష్ణుడు తిరిగి వెళ్లాక దుర్యోధనుడు కర్ణునితోనూ, దుశ్శాసనునితోనూ, శకునితోనూ ఇలా అన్నాడు. "శ్రీకృష్ణుడు ఇక్కడ నుండి కార్యవైఫల్యంతో నిష్క్రమించాడు. కాబట్టి ఆతడు క్రోధపూరితుడై పాండవు లందరిని నిశ్చయంగా యుద్ధానికి పురికొల్పక మానడు. నిజానికి పాండవులకూ, నాకూ యుద్ధం జరగాలనే శ్రీకృష్ణుని ఇష్టం. భీమార్జును లిరువురూ శ్రీకృష్ణుని అభిప్రాయంతో ఏకీభవించే వారే ! అజాతశత్రువైన ధర్మరాజు కూడా భీమసేనుని వశమయి ప్రవర్తిస్తాడు. నేను పూర్వం సోదరులందరితో సహా ఆతనిని అవమానించాను. విరాటరాజు, ద్రుపదుడు నాతో పూర్వవైరం కలవారు. వారిద్దరూ వాసుదేవుని ఆజ్ఞప్రకారం పాండవ సేనాపతులుగా వ్యవహరిస్తున్నారు. కాబట్టి మనకు పాండవులతో జరుగబోయే యుద్ధం మహా భయంకరంగా గగుర్పాటు కలిగిస్తుంది. కాబట్టి రాజులారా! మీరందరూ ఏ మాత్రమూ ఏమరుపాటులేక యుద్ధానికి సంసిద్ధం కావలసినది. సమీపంలో సమృద్ధిగా నీరు, కట్టెలు, ఉండేటట్లుగా శత్రువులకు పాడుచేయ శక్యం కాని మార్గాలు, చక్కని కూర్పుకల శిబిరాలు వందలూ, వేలూ ఏర్పరచండి. ఆ శిబిరాలను నానావిధ ఆయుధాలతో నింపండి. అవి ధ్వజ పతాకాలతో శోభిల్లుగాక ! నగరం నుండి వాటి మార్గాలు సమతలాలై శిబిరాలలోనికి ప్రవేశించటానికి వీలుగా ఏర్పరచండి. ఈ రోజే యుద్ధభేరి మ్రోగించి, రేపటి ఉదయమే యుద్ధానికి

ప్రయాణం సిద్ధంచేయండి. అశ్రద్ధ, ఆలస్యం చేయకండి. ఈ ఘోషణను విన్న కర్ణాదివీరులు "ఛాలా మంచిది, ఇదియే జరుగు గాక" అని ప్రతిజ్ఞ చేసి ప్రసన్నులై తెల్లవారుతూ ఉండగనే ఆ రాజుల వసతులకై శిబిరనిర్మాణాలు ఆరంభించారు. అక్కడకు వచ్చిన రాజులు రాజశాసనాన్ని విని, ఆవేశపూర్ణులై, చందనాగరు సుగంధ ద్రవ్యాలు పూసుకున్న గడియలవంటి భుజాలతో, బంగారు భుజకీర్తులతో ప్రకాశించే భుజాలను చరుచుకొంటూ తమ తమ ఆసనాలనుండి లేచి నిలబడ్డారు. ఆ వీరులు తలపాగాలను, ధోవతులను, ఉత్తరీయాలను, ఆభరణాలను ధరించారు. శ్రేష్ఠులైన రథికులు తమరథాలను, అశ్వసంచాలకులు అశ్వాలను, గజరక్షణ విద్యలో నిపుణులైన సైనికులు ఏనుగులను సిద్ధంచేశారు. ఆ వీరులు విచిత్రాలైన ఎన్నో బంగారు కవచాలను, ఎన్నో విధాలయిన శస్త్రాలను సిద్ధం చేశారు. పదాతిదళయోధులు తమ శరీరానికి బంగారు కవచాలను, అనేక శస్త్రాలను ధరించ సాగారు. దుర్యోధనుని హస్తినాపురంలో ఏదో పెద్ద ఉత్సవం జరుగుతున్నట్లు ఉంది. ఉత్సాహంతో ఉరకలు వేసే మనుజులతో నిండి ఆ నగరమంతా కోలాహలంగా హడావిడిగా ఉంది. రాజా ! చంద్రోదయంతో సముద్రం ఎలా తన కెరటాలతో ఎగసెగసి పడుతుందో అలాగే యోధులతో కురురాజైన దుర్యోధనుడనే మహాసముద్రం ఉప్పొంగసాగింది. అంతటా సంచరించే జననమూహం నీటి సుడులవలె ఉంది. రథాలు, ఏనుగులు, గుఱ్ఱాలు ఆ నీటిలో సంచరించే చేపల్లాగా కనిపించాయి. శంఖదుందుభి ధ్వనులు, సముద్ర ఘోషలు, దుర్యోధనుని కోశాగారం రత్నరాశులు, యోధులు ధరించిన విచిత్ర ఆభరణాలు కవచాలు, తరంగాలు, శస్త్రాలు సముద్రం లోని నురుగులు, రాజప్రాసాద పంక్తులే పర్వతాలు, వీథులలో ఉండే దుకాణాలు మడుగులవలె ఉన్నాయి.

154. కృష్ణుడు చెప్పిన కర్తవ్యము - అర్జునుని సమర్థనము.

శ్రీ కృష్ణుని మాటలు విని ధర్మరాజు శ్రీ కృష్ణునితో "వాసుదేవా! బుద్ధిహీనుడైన ఆ దుర్యోధనుడు ఎందుకు (ఎలా) ఆ మాటలు పలికాడు?" అచ్యుతా ! ఈ పరిస్థితుల్లో మాకు ఏది ఉచితం ? మేము ఏవిధంగా మసలుకోవాలి? ఎలా ప్రవరిస్తే మేము స్వధర్మంనుండి దిగజారకుండా ఉండగలం? వసుదేవనందనా ! దుర్యోధన -కర్ణ - శకునుల గూర్చి సోదరులతో కూడిన నా అభిప్రాయాలు నీవు తెలిసినవాడవు.

విదురుని వాక్యాలను, భీష్ముని మాటలను నీవు విన్నావు. మహాబుద్ధిశాలీ! కుంతీమాత అభిప్రాయాలను కూడా నీవు సంపూర్ణంగా ఆలకించావు. మహాబాహూ! వీరందరి మాటలు అభిప్రాయాలు ప్రక్కగాఉంచి ఈ విషయంలో నీవే మళ్లీ మళ్లీ ఆలోచించి మాకు ఏది తగినదో దానిని నిస్సంకోచంగా చెప్పు." అని అడిగాడు. ధర్మార్థాలతో కూడిన ధర్మనందనుని మాటలను ఆలకించిన శ్రీకృష్ణుడు మేఘదుందుభులతో సమానమైన స్వరంతో ఈ విధంగా పలుకసాగాడు.

శ్రీ కృష్ణుడు చెపుతున్నాడు. "ధర్మార్థసహితా లయిన నా మాటలు, కపటాలతో (లో) ఆరితేరిన ఆ దుర్యోధనుని మనస్సులో నాటుకొనలేదు. దుర్మతి అయిన దుర్యోధనుడు భీష్ముని మాటలను గాని, విదురుని మాటలను గాని, నా మాటలను గాని ఆలకించటం లేదు. వాడు ఎవ్వరి మాటలను లెక్కపెట్టలేదు. దురాత్ముడైన దుర్యోధనుడు కర్ణుని అండగా భావించి, అన్నిటిని జయించినట్లు భావిస్తున్నాడు. అందువల్ల అతడు ధర్మాన్ని కాని, కీర్తిని కాని కోరటం లేదు. పాపనిశ్చయుడూ, దురాత్ముడూ అయిన ఆ దుర్యోధనుడు నన్ను బంధించటానికి ఆజ్ఞాపించాడు. కాని వాడు తన కోరికను తీర్చుకొనలేకపోయాడు. అక్కడ వాని కొలువులో భీష్ముడు గాని, ద్రోణుడు గాని ఏమీ పలుక లేదు. ఆ సభలో విదురుడు తప్ప మిగిలిన వారందరూ దుర్యోధనునే అనుసరిస్తున్నారు. శకుని, కర్ణుడు, దుశ్శాసనుడు ఈ ముగ్గురు మూర్ఖులు. మూఢుడు, అసూయాపరుడూ అయిన దుర్యోధనుని చెంతజేరి నీ విషయంలో అనుచితంగా ఎన్నో అన్నారు. ఆ సభలో వారు పలికిన మాటలను మరల నేను ఇక్కడ చెప్పి లాభ మేమిటి ? ఒక చిన్నమాటలో గ్రహించు. ఆ దుష్టుడు మీ విషయంలో తగినట్లు వ్యవహరించలేదు. నీ పక్షాన యుద్ధం చెయ్యాలని వచ్చిన రాజు లెవరిలోనూ లేని పాపబుద్ధి, అశుభప్రవర్తన అంతా ఆ దుర్యోధనునిలో ఉన్నాయి. మనం సర్వస్వాన్ని త్యాగం చేసుకొని, ఎన్నటికీ ఏదశలో గానీ కౌరవులతో సంధిచేసుకోవాలని కోరుకోలేము. కాబట్టి ఇకపై యుద్ధమే తగినది."

భరతనందనా ! శ్రీ కృష్ణుడు పలికిన ఈ మాటలను విన్న రాజులందరూ మారుమాటాడక ధర్మరాజు ముఖం వంక తదేకంగా చూశారు. రాజుల అభిప్రాయాలను తెలుసుకొని భీమార్జున నకుల సహదేవులతో కూడి ధర్మరాజు వారందరిని యుద్ధానికి సిద్ధపడవలసినదిగా ఆదేశించాడు. ఆ సమయంలో 'యుద్ధానికి సిద్ధపడవలసినది'

అనే ఆజ్ఞ సమస్త వీరులలో హర్షాన్ని కలిగించినది. పాండవుల సైనికులందరూ కిలకిలలాడారు. ధర్మనందనుడైన ఆ యుధిష్ఠిరుడు, సైనికుల హర్షధ్వానాలను విని యుద్ధం ప్రారంభిస్తే చంపగూడని వారిని గూడా చంపవలసి వస్తుందనే బాధతో దీర్ఘంగా నిట్టూర్చి భీమార్జునులతో ఇలా అన్నాడు. "దేనిని తప్పించాలని వనవాస కష్టాన్ని స్వీకరించి నానా విధాలైన దుఃఖాలను సహించానో, ఆ అనర్థం నా ప్రయత్నం వల్ల ఆగటం లేదు. అది మనపై వచ్చిపడుతోంది. మనం భయంకరయుద్ధాన్ని ఆపాలని ఎన్నో ప్రయత్నాలు చేసినా యుద్ధాన్ని నివారించలేకపోయాం. అయితే ఏమాత్రం ప్రయత్నం చేయకున్నా ఆ మహాకలి - కలహం తనంత తానుగా వచ్చి మీదపడింది. వధార్హులు కాని వారితో యుద్ధం చేయటం ఎలా ఉచిత మౌతుంది? వృద్ధులను, గురుజనులను వధించి మనం ఎలా విజయాన్ని సాధించిన వారమౌతాము?" ధర్మరాజు మాటలను విని శత్రువులను తపింపజేసే అర్జునుడు శ్రీకృష్ణుని మాటలను వినిపించసాగాడు.

"శ్రీకృష్ణుడు కుంతీ మాతతో, విదురునితో పలికిన మాటలను మీరు పూర్తిగా విని ఉంటారు. ధర్మనందనా ! నా నిర్ణయం ప్రకారం వారిద్దరూ అధర్మవచనాలను పలుకరు. కాబట్టి మనం యుద్ధం నుండి విరమించడం యుక్తం కాదు." అర్జునుని మాటలను విని శ్రీకృష్ణుడు ధర్మరాజు వంక ఆశ్చర్యంగా చూసి "అవును. అర్జునుడు చక్కగా చెప్పాడు" అన్నాడు. జనమేజయ మహారాజా ! అనంతరం సైనికులందరితో కలిసి పాండవులు యుద్ధం చేయడానికి నిశ్చయించుకొని ఆ రాత్రి అక్కడ సుఖంగా నివసించారు.

155. దుర్యోధనుడు సేనాపతులను నియమించుట.

వైశంపాయనుడిట్లన్నాడు. జనమేజయ మహారాజా! ఆ రాత్రి గడచిన తరువాత తెల్లవారుజామున దుర్యోధనుడు తన పదకొండు అక్షౌహిణులను విభజించాడు. దుర్యోధనుడు సైన్యంలోని పాద, హస్తి, రథ, అశ్వదళాలలో ఉత్తమ - మధ్యమ - అధమ శ్రేణులుగా గుర్తించిన వానిని వాటికి తగిన స్థానాలలో నియమించాడు. ఆ వీరులంతా అనుకర్షాలు, పెద్ద అమ్ముల పొదులూ, కవచాలూ, తోమరాలూ, చిన్న అమ్ముల పొదులూ, శక్తులూ, ఉపాసంగాలూ, నిషంగాలూ, ఈటెలు కలిగి ఉన్నారు.

ధ్వజాలు, జెండాగుడ్డలు, వింటితోమరాలు, వింతైన త్రాళ్లు, పాశాలు, (కప్పుకొనే) కంబళ్ళు జుట్టుకు పట్టించి లాగే కర్రలు, నూనె, బెల్లం, ఇసుకలతో కూడిన కుండలు, పాములున్న కుండలు, సర్జరసంతోకూడిన పొడి, సమకూర్చి ఉన్నారు. గంటలతో కూడిన పలకలు, ఇనుము బెల్లం కరిగించిన పాకం, గుళ్లు, శాలాలు, భిందిపాలాలు, తేనె, మైనం, రోకళ్లు సిద్ధం చేశారు. ముళ్లకర్రలు, నాగళ్లు, విషపూరిత తోమరాలు, చేటలు, పెట్టెలు, కొడవళ్లు, ముళ్లతోమరాలు ముళ్లకవచాలు, ఉలులు, పులితోళ్లు, చిరుతపులి తోళ్లు సిద్ధం చేసి ఉన్నారు. చేతితో విసిరే ఆయుధాలు, కొమ్ములు, బల్లెములు, అనేక విధాలయిన ఆయుధాలు, గొడ్డళ్లు, గునపాలు, నేతిగుడ్డలు, నూనెగుడ్డలు - ఆ సైనికులందరూ బంగారు ఆభరణాలను, వివిధ మణులను ధరించి మండుతున్న అగ్నిజ్వాలలవలె ప్రకాశించారు. శస్త్రవిద్యలలో ఆరితేరిన ఆ సైనికులు కవచాలను ధరించారు. సత్కులంలో పుట్టినవారు, గుఱ్ఱాలను గురించి చాలా విషయాలను తెలిసినవారు... ఇలాంటి వారందరినీ రథసారథ్యంలో నియోగించారు. తమతమ రథాలలోని అమంగళాలు తొలగాలని రకరకాల యంత్రాలను, ఔషధాలను కట్టసాగారు. త్రాళ్ళను బిగించారు. తమ రథాలపై రెపరెపలాడే పతాకాలను నిలిపారు. అందంగా కొన్నిరకాల ఆభరణాలు, చిరుగంటలు కట్టారు. అన్ని తావులలో చర్మపుతొడుగులు కల ఖడ్గాలను కూడా సిద్ధపరచుకొన్నారు. ఆ రథాలన్నీ నాలుగేసి గుర్రాలతో కట్టిఉన్నాయి. గుఱ్ఱాలన్నీ ఉత్తమ జాతివి. రథాలనిండా ప్రాస - ఋష్టి అనే ఆయుధవిశేషాలను - మూర్ల సంఖ్యలో నున్న విల్లంబులను సిద్ధపరచారు. రథానికి ఉన్న రెండు రెండు గుఱ్ఱాలకు కలిపి ఒక్క 'రక్షకుణ్ణి' నియమించారు. ఒకొక్క రథానికి ఇద్దరు చక్రరక్షకులను కూడా నియమించారు. ఆ ఇద్దరూ రథికులలో శ్రేష్ఠులే. నాల్గవవాడు రథికుడు. అతడు గుర్రాల తత్త్వం తెలిసినవాడు. ఆ రణరంగ మంతా బంగారు ఆభరణాలతో, బంగరు దండలతో కూడిన వేల రథాలతో కళకళలాడి పోతోంది. శత్రుదుర్భేద్యంగా నున్న ఆ రథాల న్నిటిని నగరాలవలె రక్షింపసాగారు.

రథాలను అలంకరించినట్లు ఏనుగులను కూడా బంగారు దండలతో అలంకరించారు. త్రాళ్లతో బిగించారు. ఒక్కొక్క ఏనుగుపైని ఏడుగురు చొప్పున ఉన్నారు. ఆ ఏనుగులు రత్నాలతో కూడిన పర్వతాలవలె గోచరిస్తున్నాయి. ఆ ఏడుగురిలో ఇద్దరు అంకుశాలను ధరించారు. ఇద్దరు ధనుస్సులను ధరించారు. మరోఇద్దరు

చురకత్తులను ధరించారు. మరో వీరుడు శక్తి అనే త్రిశూలాన్ని ధరించి ఉన్నాడు. రాజా ! మహాత్ముడైన ఆ దుర్యోధనుని సైన్య మంతా కవచాలు, ఆయుధాలు, ఒరలతో, మదించిన ఏనుగులతో కిటకిటలాడింది. కవచాలను ధరించి యుద్ధానికి సిద్ధమై, ఆభరణాలతో ప్రకాశిస్తూ, వేలకొలది సైన్యం గుఱ్ఱాలపై పతాకాలను ఎగురవేస్తూ కనిపించసాగారు. ఆ గుఱ్ఱాలన్నీ ఎట్టి మారాం చేయనివి. అవి ఎప్పుడూ వీరుల వశంలో ఉండేవి. వాటిమీద అలంకారాలు, పట్టాలు వస్త్రాలు కప్పారు. అలాంటి ఉత్తమాశ్వాలు కొన్ని లక్షల సంఖ్యలో ఉన్నాయి. ఆ పదాతిసైన్య మంతా సువర్ణ ఆభరణాలను ధరించారు. వారు ధరించిన కవచాలు, అస్త్రశస్త్రాలు రకరకాలుగా కనబడసాగాయి. ఒకొక్క రథం వెనుక పది పది ఏనుగులు, ఒకొక్క ఏనుగు వెనుక పదిపది గుఱ్ఱాలు, అలాగే గుఱ్ఱాల వెనుక పదిపది చొప్పున పదాతి సైనికులు ఉన్నారు. ఒకొక్కరథం వెనుక ఏబది ఏనుగులు, ఒకొక్క ఏనుగు వెనుక నూరు గుఱ్ఱాలు, ఒకొక్కగుఱ్ఱం వెనుక ఏడుగురు చొప్పున కాలుబలం నియమితు లైనారు. వారు సైన్యాన్ని చెదరకుండా సంధానం చేయసాగారు.

ఐదువందల ఏనుగులు, ఐదువందల రథాలు కలిపితే ఒకసేన అవుతుంది. పదిసేనలు కలిస్తే ఒక పృతన అవుతుంది. పది పృతనలు కలిపితే ఒక వాహిని అవుతుంది. సేనా - వాహినీ, పృతన, ధ్వజినీ, చమువు, వరూధినీ, అక్షౌహిణీ అనే శబ్దాలతో సైన్యం చెప్పబడుతుంది. ఈవిధంగా దుర్యోధనుడు పదకొండు అక్షౌహిణుల సైన్యాన్ని, పాండవులు ఏడు అక్షౌణిణుల సైన్యాన్ని సిద్ధపరచారు. మొత్తం పదునెనిమిది అక్షౌహిణులసైన్యం ఆ కురుక్షేత్రంలో కనిపించింది. పాండవుల సైన్యం కేవలం ఏడు అక్షౌహిణులు, కౌరవుల బలం పదకొండు అక్షౌహిణులుగా ఆ యుద్ధరంగంలో ఒకచోటుకు చేరుకుంది. ఏబది ఐదు పదాతి సైనికులను 'పత్తి' అని అంటారు. అలాంటి మూడు పత్తులు కలిపితే ఒక సేనాముఖం అని వ్యవహరిస్తారు. సేనాముఖానికి మూడు రెట్లు గుల్మ మని అంటారు. మూడు 'గుల్మాలు' ఒక గణం. దుర్యోధనుని సైన్యంలో యుద్ధం చేసే పదాతి సైనికుల గణాలు వేలకొలదీ ఉన్నాయి. అపుడు మహాబాహు వయిన దుర్యోధనుడు బాగా ఆలోచించి బుద్ధిమంతులు, శూరులైన వీరపురుషులను సేనాపతులుగా నియమించాడు. నరోత్తము లయిన అక్షౌహిణీ నాయకు లందరినీ వేర్వేరుగా రప్పించి, వారితో దుర్యోధనుడు చక్కగా సంభాషిస్తున్నాడు.

కృపాచార్యుని, ద్రోణాచార్యుని, అశ్వత్థామను, శల్యుని, జయద్రథుని, కాంబోజరాజు సుదక్షిణుని, కృతవర్మను, కర్ణుని, భూరిశ్రవసుని, శకునిని, బాహ్లీకుని ఆ దుర్యోధనుడు ఒకొక్కరిని ఒకొక్క అక్షౌహిణికి అధినాయకునిగా నిశ్చయించాడు. భారతా ! ఆ దుర్యోధనుడు ప్రతిరోజూ ఆయా వేళల్లో ఆ సేనాపతు లందరినీ తానే ప్రత్యక్షంగా సత్కరించేవాడు. దుర్యోధనుడు తన అనుయాయు లందరినీ వారికి తగిన స్థానాలలో నియమించాడు. ఆ మహారాజుల సైనికు లందరూ దుర్యోధనునికి ప్రియం చేకూర్చాలనే తపనతో తమ తమ కార్యాలలో నిమగ్నులైనారు.

156. దుర్యోధనుడు భీష్ముని ప్రధాన సేనాపతిగా అభిషేకించుట.

తరువాత దుర్యోధనుడు రాజులందరితో కలసి శంతనునందనుడైన భీష్మునికి సమస్కరిస్తూ ఇలా పలికాడు. "పితామహా ! ఎంత సైన్యమున్నా యోగ్యుడైన సేనాపతి లభించకపోతే, సైన్యమంతా చీమలపుట్టవలె చెల్లాచెదరవుతుంది. ఏ ఇద్దరి బుద్ధీ ఎన్నడూ సమానంగా ఉండదు. యోగ్యులైన సేనాపతుల శౌర్యం ఒకదానితో ఒకటి పోటీపడుతుంది. మహామతీ ! ఒకసారి బ్రాహ్మణు లంతాకలసి దర్భలతో చేసిన పతాకాలు ధరించి మహాతేజస్వులైన హైహయవంశ క్షత్రియులను ముట్టడించిన సంగతి మనం విన్నదే కదా ! తాతా ! ఆ సమయంలో బ్రాహ్మణులతోపాటు వైశ్యులు, శూద్రులు కూడా కలసి ఒక పక్షంగాను, రెండవపక్షంగా క్షత్రియనేతలు నిలిచారు. యుద్ధం ప్రారంభం కాగానే, మూడు జాతులవారు ఓడిపోసాగారు. నిజానికి బ్రాహ్మణ వైశ్య శూద్రసైన్య సంఖ్య ఎక్కువగా ఉన్నా క్షత్రియులే విజయాన్ని సాధించారు. ఆ సమయంలో బ్రాహ్మణులంతా కలసి క్షత్రియులనే ఇలా అడిగారు. మేము ఓడిపోవడానికి కారణం ఏమిటి ? వివరించండి అని. దానికి రాజులు యథార్థకారణం ఇదీ అంటూ ఇలా పలుకసాగారు. మేము మాలో బుద్ధిమంతుడైన వానిని సేనానిగా నియమించుకొని యుద్ధంలో అతని వాక్యాన్నే జవదాటకుండా ప్రవర్తిస్తాం. మరి మీరో ఎవరి బుద్ధికి తోచినట్లు వారు వ్యవహరిస్తారు. అపుడు బ్రాహ్మణులుకూడా తమలో ఒకరిని సేనాపతిగా ఎంచుకొని తద్వారా క్షత్రియులపై విజయాన్ని సాధించగలిగారు.

తమ హితాన్ని కోరేవానిని, పాపరహితుని, యుద్ధనిపుణుని సేనాపతిగా నియమిస్తే యుద్ధరంగంలో విజయాన్ని పొందగలుగుతారు. మీరు సదా నా హితాన్నే

కోరుతారు. మీరు శుక్రాచార్యులవంటి వారు. మిమ్ములను సంహరించగలశక్తి ఎవ్వరికీ లేదు. మీరు ధర్మమార్గంలో ఉన్నవారు కాబట్టి మీరే మా ప్రధాన సేనాపతిగా ఉండండి. కాంతిగలవారికి సూర్యునివలె, లతలకు చంద్రునివలె, యక్షులకు కుబేరునివలె, దేవతలకు ఇంద్రునివలె, పర్వతాలకు మేరుపర్వతం వలె, పక్షులకు గరుడునివలె, దేవయోనులకు కార్తికేయునివలె, వసువులకు అగ్నివలె, మీరు మాసేన కంతటికీ అధినాయకులు. దేవతలు ఇంద్రుని వల్ల రక్షింపబడినట్లుగా మేమంతా మీ నాయకత్వంలో దేవగణాలకు కూడా అభేద్యంగా ఉంటాం. కుమారస్వామి దేవగణాల ముందు సాగునట్లుగా మీరు మా సైన్యం ముందర నడచెదరుగాక! ఎద్దుల ననుసరించి ఆవులు నడచునట్లుగా మేమంతా మిమ్ముల ననుసరిస్తాం."

అపుడు భీష్ముడు డిట్లన్నాడు. "దుర్యోధనా ! నీవు అన్నది నిజమే. కాని నాకు నీవు ఎంతముఖ్యమో పాండవులుకూడా అంత ముఖ్యమే ! రాజా ! నేను నీకూ, వారికీ హితవచనాలు చెప్పాలి. యుద్ధం మాత్రం నీవైపునుండే చేస్తాను. ఈ విధంగానే నేను ప్రతిజ్ఞచేశాను కదా ! నాతో పోరాడగల వీరుడు నరోత్తము డయిన అర్జునుడు తప్ప మరొకరిని నేను చూడలేదు. పాండునందనుడు అర్జునుడు మహాబుద్ధిశాలి, అనేక దివ్యాస్త్రాలు తెలిసినవాడు. అయినా అతడు నాముందు నిలచి నాతో యుద్ధం చేయడు. నేను కూడా (అర్జునునివలె) నా శస్త్ర బలంతో దేవతలతోనూ, అసురులతోనూ, రాక్షసులతోనూ నిండిన ఈ జగత్తును క్షణంలో నిర్మానుష్యం చేయగలను. రాజా! నేను పాండుపుత్రులను చంపజాలను. కురునందనా! ఒకవేళ పాండవులు ఈ యుద్ధంలో ముందుగా నన్ను చంపకపోతే నేను నా అస్త్రాలతో ప్రతిరోజూ పాండవ పక్షంలో వారిని పదివేలమంది చొప్పున చంపగలను. నేను ఈ విధంగా వారి సైన్యమంతటిని సంహరించగలను. రాజా ! నేను నా ఇచ్ఛ ననుసరించి నీకు ఒకే ఒక షరతుతో సేనాపతిగా ఉంటాను. ఇపుడు జాగ్రత్తగా విను. రాజా ! ముందుగా కర్ణుడు గాని లేదా నేను గాని యుద్ధం చేస్తాం. ఎందుకంటే ఈ సూతపుత్రుడు ఎప్పుడూ యుద్ధంలో నాతో పోటీపడుతూ ఉంటాడు గదా." కర్ణు డిలా అన్నాడు. "రాజా ! భీష్ముడు జీవించి ఉండగా ఎట్టి పరిస్థితులలోనూ నేను యుద్ధం చేయబోను. పితామహుడు అస్తమించిన తర్వాతనే అర్జునునితో యుద్ధానికి తలపడతాను."

తరువాత దుర్యోధనుడు శాస్త్రప్రకారంగా భూరిదక్షిణ లిచ్చి భీష్ముని

ప్రధానసేనాపతిగా అభిషేకించాడు. దానితో భీష్ముడు ఎంతో ప్రకాశించాడు. తరువాత రాజాజ్ఞతో వాద్యాల వారు, వందలు వేలు భేరులు, శంఖాలు ఉత్సాహంతో మ్రోగించారు. వీరుల సింహనాదాలు, వాహనాల నానాశబ్దాలు మిన్నుముట్టాయి. మేఘాలు లేకుండానే ఆకాశంనుండి రక్తవర్షం కురిసి, బురద బురద అయిపోయింది. ఏనుగుల ఘీంకారాలతో పాటు ఆకాశంలోని పిడుగుల శబ్దాలు వినబడసాగాయి. భూమి కంపించ సాగింది. ఈ ఉత్పాతాలు యుద్ధసైనికులను మూర్ఛిల్లజేశాయి. అశుభసంకేతంగా ఆకాశవాణి వినబడసాగింది. ఆకాశం నుండి ఉల్కలు పడసాగాయి. భయంకర శబ్దాలతో నక్కల కూతలు అమంగళసూచకంగా మాటి మాటికి వినిపించాయి. దుర్యోధనుడు భీష్ముని సేనాపతిగా నియమించగానే ఉత్పాతాలు వందలకొద్దీ సంభవించాయి. భీష్ముని సేనాపతిగా నియమించిన ఆ దుర్యోధనుడు బ్రాహ్మణోత్తములచే స్వస్తివాచనం చేయించాడు. వారికి గోవులను, బంగారు కాసులను భూరిదక్షిణలుగా ఇచ్చాడు. ఆ బ్రాహ్మణు లందరూ విజయ సూచకాలయిన ఆశీస్సులతో దుర్యోధనునకు అభ్యుదయం కలగాలని కోరుతున్నారు. పిమ్మట భీష్ముని ముందుంచుకొని, తన తమ్ములను వెంటబెట్టుకొని సైన్యాలతో హస్తినాపురం నుండి విశాలమయిన(డేరాలతో) శిబిరాలతో ఉన్న కురుక్షేత్రం సమీపించాడు. కర్ణునితో కురుక్షేత్రానికి చేరుకున్న దుర్యోధనుడు ఒక సమతల ప్రదేశంలో శిబిరాన్ని ఏర్పాటు చేశాడు. బీడుభూమికాని మనోహర ప్రదేశంలో మెత్తని పచ్చికబయలు దట్టంగా ఉన్నచోట, దుర్యోధనుని సైన్యశిబిరాలు - హస్తినాపురాన్ని తలపించే రీతిలో వెలిశాయి.

157. ధర్మరాజు సేనాపతులను నియమించుట, బలరాముని ఆగమనము.

ఆపద్ధర్మవిషయాల్లో నేర్పరి, మహాబుద్ధి సంపన్నుడూ అయిన ధర్మరాజు తనతమ్ములనూ, శాశ్వతు డయిన శ్రీ కృష్ణునీ పిలిచి అనునయంగా ఓదార్పుగా ఇలా పలుక నారంభించాడు. "మీరంతా యుద్ధరంగాన్ని కలయజూచి మీ సైన్యాన్ని అదుపులో పెట్టుకోండి. కవచాదులను ధరించి యుద్ధసన్నద్ధులు కండి. ముందుగా మీరు భీష్మపితామహునితో యుద్ధానికి దిగవలసి ఉంది. కాబట్టి మన ఏడు అక్షౌహిణుల సైన్యాన్ని, సేనాపతులను సమీక్షించండి." శ్రీకృష్ణుడిలా అన్నాడు. "భరతకులభూషణా!

ఈ సమయంలో ఏ మాటలు పలకాలో ఆ మాటలనే అర్థవంతంగా పలికావు. నాకు నీ మాటలు బాగా నచ్చాయి. తరువాతి కార్యక్రమం ప్రారంభించు. మన సేనానాయకులను ఏడుగురిని ఇక్కడనే నిశ్చయించు."

ద్రుపదరాజు, విరాటుడు, సాత్యకి, ధృష్టద్యుమ్నుడు, ధృష్టకేతువు, శిఖండి, మగధరాజు సహదేవుడు, అనే ఈ ఏడుగురు మహావీరులను ధర్మనందనుడు శాస్త్రానుసారంగా సేనాపతులుగా అభిషిక్తులను చేశాడు. ధృష్టద్యుమ్నుని మాత్రం సర్వసైన్యాధిపతిగా నియమించాడు. అతడే ద్రోణాచార్యుని సంహరించడానికి జ్వలించే అగ్నినుండి ఉద్భవించాడు. అయితే ధనంజయు డైన అర్జునుని సేనాపతు లందరికీ అధిపతిగా నియమించాడు. అర్జునునకు కూడా అధిపతిగా అతని గుర్రాలు అదుపు చేసే శ్రీకృష్ణుని నియమించాడు.

రాజా ! భయంకర మహాయుద్ధం చేరువకాగా పాండవ భవనానికి బలరాముడు చేరుకొన్నాడు. ఆ మహాత్ముని నేత్రాలు ఎఱ్ఱబారాయి . ఆ బలదేవునితో పాటు అక్రూరుడు మొదలైన యదువంశీయులు, గదుడు, సాంబుడు, ఉద్ధవుడు, ప్రద్యుమ్నుడు, ఆహుకపుత్రులు చారుదేష్ణుడు, మొదలగు వృష్ణివంశీయులు చేరుకొన్నారు. వీరందరితో ఆ బలరాముడు మరుద్గణాలతో కూడిన ఇంద్రునిలాగా ప్రకాశించాడు. బలరాముని చూచి, ధర్మరాజు, శ్రీకృష్ణుడు, భీముడు, అర్జునుడు, ఇంకా అక్కడే ఉన్న మహావీరు లందరూ ఒక్కసారిగా లేచి నిలబడ్డారు. బలరాముని చూచి అందరూ ఆదరించారు. ధర్మనం – దనుడు తనచేతితో బలరాముని ఆదరంతో తాకాడు. శ్రీకృష్ణుడు మొదలైన వారంతా బలరామునికి నమస్కరించారు. పిమ్మట వృద్ధులైన విరాట ద్రుపద రాజులకు బలరాముడు నమస్కరించి, ధర్మరాజుతో కలసి కూర్చున్నాడు. ఆ రాజులంతా చుట్టూరా కూర్చుని యుండగా బలరాముడు శ్రీకృష్ణునిజూచి ఇలా అన్నాడు.

"జరుగబోయే ఈ మహాసంగ్రామం దారుణమైనది. జననష్టాన్ని కలిగిస్తుంది. ఇది దైవసంకల్పం. దీనిని తప్పించుకొనటం కుదరనిది. ఈ మహాయుద్ధాన్ని పూర్తిచేసిన మీరు మీ స్నేహితులందరితో కలిసి, ఎట్టి ఆపదలు పొందక ఆరోగ్యవంతులుగా నుండగలరు. నేను దీనిని తప్పక చూడగలను అని నాకు అనిపిస్తోంది. గుంపులు గుంపులుగా చేరిన రాజు లందరూ కాలాగ్నిలో ఉడికి పోగలరు. జననాశం తప్పదు. ఈ పోరులో రక్త మాంసాలు బురదగా ఏర్పడతాయి. నేను రహస్యంగా శ్రీకృష్ణునికి

"మధుసూదనా ! మన బంధువు లందరిదగ్గర ఒకేపద్ధతిని అవలంబించు. మనకు పాండవు లెట్లాగో దుర్యోధనుడూ అంతే. వానికి కూడా సహాయం చేయి. అతడు మాటి మాటికి మనచుట్టూ తిరుగుతున్నాడు" అని చాలాసార్లు చెప్పాను. కాని ధర్మనందనా ! ఈ కృష్ణుడు నామాటలను పెడచెవిని పెట్టాడు. అంతేకాదు. ధనంజయునిపై విశేషానురాగాన్ని ప్రదర్శించి మిాలో చేరాడు. ఈ యుద్ధంలో పాండవులకే జయం లభిస్తోంది అని నా అభిప్రాయం. శ్రీకృష్ణుని హృదయంలో కూడా ఈ సంకల్పమే బలంగా ఉంది. నేను కృష్ణుని వదలి ఇతర జగత్తును చూడలేను. కాబట్టి కృష్ణుడు చేసే దాన్నే నేనూ అనుసరిస్తాను. గదాయుద్ధంలో ఆరితేరిన భీముడు - దుర్యోధనుడు నాశిష్యులే. కాబట్టి వీరిద్దరిపైన ఒకేవిధమైన వాత్సల్యం నాకున్నది. అందుచేత నేను సరస్వతీ నదీ తీరంలో ఉన్న తీర్థాలు సేవించటానికి వెడుతున్నాను. నశించిపోతున్న కౌరవవంశస్థులను చూస్తూ ఉపేక్షించలేను." ఈ విధంగా పలికి, బలదేవుడు పాండవులనుండి అనుమతి పొంది, శ్రీకృష్ణుని సంతోషపెట్టి తీర్థయాత్రలు చేయటానికి బయలు దేరాడు.

158. రుక్మిసహాయమును కౌరవులు, పాండవులు తిరస్కరించుట.

ఈ సమయంలోనే అతియశస్వి, దక్షిణదేశాధిపతి, భోజవంశీయుడు - ఇంద్రుని చెలికాడు హిరణ్యరోము డనే, భీష్మకుని పుత్రుడు 'రుక్మి' పాండవుల దగ్గరకు చేరుకున్నాడు. రుక్మి గంధమాదన నివాసియైన కింపురుషుడు (ద్రుముని) శిష్యుడుగా చేరి నాలుగుపాదాలతో కూడిన ధనుర్వేదాన్ని అభ్యసించాడు. గాండీవంతో సమానమైన 'విజయ' మనే ధనుస్సును పొందాడు. ఇది శార్ఙ్గధనుస్సుతో సమానం. స్వర్గంలో సంచరించే దేవతల దివ్యధనుస్సులు మూడు. అందులో "గాండీవం" వరుణదేవునిదిగా, 'విజయం' దేవేంద్రునిదిగ, దివ్యతేజోమయమైన శార్ఙ్గధనుస్సు విష్ణుదేవునిదిగా చెప్పబడుతోంది. ఆ శార్ఙ్గ ధనుస్సును శ్రీకృష్ణుడు ధరించాడు. ఖాండవవనదహన సమయంలో అగ్నిహోత్రుని నుండి అర్జునుడు గాండీవ ధనుస్సును పొందగలిగాడు. తేజస్వి అయిన రుక్మి ద్రుముని నుండి విజయమనే ధనుస్సును పొందాడు. శ్రీకృష్ణుడు తన తేజోబలపరాక్రమాలచే మురాసురుని పాశాలను భేదించి, నరకాసురుని, జయించి మణికుండలాలను తిరిగి వశం చేసుకొన్నాడు. పదహారువేల స్త్రీలను - రకరకాల

రత్నాలను స్వాధీన పరచుకున్నాడు. ఆ సమయంలో శార్ఙ్గమనే ఉత్తమ ధనుస్సును కూడా పొందాడు. మేఘగర్జనవలె టంకారం చేసే విజయధనుస్సును రుక్మి పొందాడు. దానితో లోకాన్నంతా భయపెడుతూ పాండవులను సమీపించాడు.

బుద్ధిమంతు డయిన శ్రీకృష్ణుడు చేసిన రుక్మిణీ హరణాన్ని సహించలేకపోయినది ఈ రుక్మియే. సకలశస్త్రాలను బాగా తెలిసిన ఆ రుక్మి కృష్ణుని చంపనిదే తన నగరానికి తిరిగిరానని ప్రతిజ్ఞచేసి కృష్ణుని వెంటపడ్డాడు. అతనితోపాటు ఆయుధాలు, కవచాలతో కూడిన చతురంగ బలాలు, చాలాదూరం వ్యాపించి వృద్ధి పొందుతున్న గంగా ప్రవాహంలా కనబడ్డాయి. రాజా! ఆ రుక్మి యోగేశ్వరుడైన శ్రీకృష్ణభగవానుని వెంబడించి, ఓడిపోయి, సిగ్గుతో మరల కుండినపురానికి చేరుకోలేదు. శ్రీకృష్ణుడు శత్రుసైన్యాన్ని ఓడించిన చోట రుక్మి "భోజకట" మనే పేరుతో ఉత్తమ నగరాన్ని నిర్మించుకొన్నాడు. ఆ రుక్మి ఒక అక్షౌహిణీ సైన్యంతో పాండవుల దగ్గరకు వేగంగా వచ్చాడు. ఆ రుక్మి కవచాన్ని, ధనుస్సును, ఖడ్గశరాసనాలను ధరించి, సూర్యకాంతివంటి ధ్వజంతో పాండవ సేనలను చేరుకొన్నాడు. పాండవులకు అతని రాక తెలిసింది. యుధిష్ఠిరుడు కృష్ణునిప్రీతికోసం అతనికి ఎదురేగి ఆదరసత్కారాలు చేశాడు. పాండుతనయులందరూ రుక్మిని యథావిధిగా సత్కరించి ప్రశంసించారు. రుక్మి కూడా ఆదరపూర్వక సత్కారాలను గైకొని, సైనికులతో సహా విశ్రాంతిని పొందాడు. వీరు లందరి మధ్యలో సుఖాసీనుడైన అర్జునుని జూచి "పాండునందనా! నీవు భయపడితే నేను నీకు యుద్ధంలో సహాయం చేస్తాను. అందుకే ఇక్కడకు వచ్చాను. నీ శత్రువులు నిన్ను ఎదుర్కొన లేనట్లుగా నేను నీకు సహాయపడగలను. ఈ లోకంలో నాతో సమానమైన పరాక్రమవంతుడు లేడు. నీవు యుద్ధంలో నా పాలు చేసిన నీ శత్రువులను సంహరించగలను. నా ఎదుట ద్రోణ కృప, భీష్మ కర్ణాది వీరులెవరైనా ఎదురొడ్డి నిలిస్తే వారందరినీ నేనొక్కడనే సంహరించి ఈ భూమినంతా నీకు సమర్పిస్తాను."

ధర్మరాజూ, కృష్ణుడూ, మిగిలిన రాజులూ వింటూ ఉండగా రుక్మి అలా అన్నాడు. అపుడు అర్జునుడు కృష్ణునీ, ధర్మరాజునూ చూసి మైత్రీ పూర్వకంగా నవ్వుతూ ఇలా అన్నాడు. "వీరుడా! కురువంశంలో పుట్టి, అందునా పాండురాజు తనయుడనై, ద్రోణశిష్యునిగా చెప్పుకొంటూ వాసుదేవుని సహాయం పొందుతూ... గాండీవాన్ని చేబట్టిన నేను భయపడుతున్నానని నీతో ఎలా చెప్పగలను? వీరుడా !

కౌరవుల ఘోషయాత్ర సమయంలో నేను బలవంతులైన గంధర్వులతో యుద్ధం చేశాను. ఆ సమయంలో ఏ మిత్రుడు నాకు సహాయపడ్డాడు? ఖాండవవనంలో దేవదానవ యుద్ధంలో నేను శత్రు సంహారం చేసేటప్పుడు ఎవరు నాకు సహాయపడ్డారు? నివాతకవచులు, కాలకేయులు అనే రాక్షసులతో చేసిన యుద్ధంలో నాకు సహాయంగా ఎవరు వచ్చారు? అలాగే విరాట నగరంలో పెద్ద కౌరవసైన్యంతో చాలామంది వీరులతో చేసిన పోరాటంలో ఒంటరిగా నిలిచిన నాకు ఎవరు సాయం చేశారు ? నేను యుద్ధంలో సాఫల్యం పొందాలని ఇంద్ర, రుద్ర, యమ, కుబేర, వరుణ, అగ్ని, కృపాచార్య, ద్రోణాచార్య, శ్రీకృష్ణులను ఆరాధించాను. నేను తేజోమయమయిన దివ్యగాండీవాన్ని ధరించినవాడను. నా దగ్గర అక్షయబాణాలతో నిండిన అమ్ముల పొదులు ఉన్నాయి. దివ్యాస్త్రాలతో ఉత్తేజితుణ్ణి. నాలాంటి వాడు సాక్షాత్తు ఇంద్రుని ముందు నిలచినా "నేను భయపడినవాడను" అని చెప్పుకొనటం యశోనాశకం. అట్టి మాట ఎలా అంటాను? మహాబాహూ ! నేను భయపడను. నాకు నీ సహాయం అవసరం లేదు. నీవు నీ యిష్ట ప్రకారం వెళ్ళవచ్చును. లేదా ఎక్కడయినా నిలవవచ్చును."

రుక్మి అర్జునుని మాటలను విని, సముద్రంవంటి తనసైన్యాన్ని మరలించుకొని అలాగే దుర్యోధనుని సమీపించాడు. రుక్మి తన సైన్యంతో పాటు దుర్యోధనుని సమీపించి, తన సహాయాన్ని తీసుకోమని అడిగాడు. కాని తనను తాను శూరునిగా భావించే ఆ దుర్యోధనుడు రుక్మిని తిరస్కరించాడు. ఆ యుద్ధంలో వృష్ణివంశవీరుడు బలరాముడు, రుక్మి వీరిద్దరే పాల్గొననివారు. బలరాముడు తీర్థయాత్రలకై వెళ్ళాడు. భీష్మక పుత్రుడు రుక్మి మరలిపోయాడు. పాండవులు మళ్లీ రహస్య సమాలోచనకై కూర్చున్నారు. రాజన్యులతో నిండిన ఆ ధర్మరాజు సభ తారలతో కూడిన చంద్రునితో చిత్రమైన ఆకాశంలా ప్రకాశిస్తోంది.

159. ధృతరాష్ట్ర సంజయ సంవాదము.

ఇలా ఉభయ సైన్యాలు వ్యూహరచనలతో కురుక్షేత్రంలో పోరుకు సిద్ధమయ్యాయి. అపుడు ధృతరాష్ట్రుడు సంజయునితో ఇలా పలికాడు. "సంజయా ! ఇలా రా ! కురుపాండవుల సేనలు కురుక్షేత్రంలో మోహరించాక ఏం జరిగిందో పూర్తిగా నాకు చెప్పు. దైవమే చాలా బలీయమైనదనుకొంటున్నా. దాని ముందు పురుషప్రయత్నాలు వ్యర్థ మౌతాయి. నాకు యుద్ధం వల్ల కలిగే అనర్థాలు పూర్తిగా తెలుసును. ద్యూతక్రీడలో

ఆరితేరి, కపటబుద్ధితో దుష్టద్యూతం ఆడే నా కుమారుని నేను నిరోధించలేను. నేను (నా) ధర్మమైన హితాన్నీ సాధించలేను. సూతా ! నా బుద్ధి పై దోషాల్ని గమనిస్తూనే ఉంది. ఎంత గుర్తించినా దుర్యోధనుని కలిసేటప్పటికి మరల మారిపోతోంది. సంజయా! ఈ పరిస్థితిలో జరుగనున్నది తప్పక జరిగి తీరుతుంది. కాని యుద్ధంలో శరీరాన్ని సమర్పణ చేసే క్షత్రధర్మం ఆచరించడం ద్వారా క్షత్రియునకు గొప్ప గౌరవం కలుగుతుంది కదా !"

అపుడు సంజయుడు అన్నాడు - "మహారాజా ! నీకు తగిన విధంగానే నీవు ప్రశ్నించావు. అది నీకు తగినదే. నీవు తెలుసుకోవా లనుకొంటున్న ప్రశ్నకు సమాధానం నీ దగ్గరే ఉంది. కాని దోషమంతా దుర్యోధనునిపై నెట్టవద్దు. రాజా! నేను దాచకుండా చెప్పే మాట విను. మానవుడు తన చెడుప్రవర్తన ద్వారా పొందే ఫలితాలను కాలంపైనా, దేవతలపైనా మోపడం, నిందారోపణ చేయడం తగదు. మహారాజ ! ఇతరులతో కలసి చెడుప్రవర్తన కలిగి నింద్యవృత్తిని కలిగి ఉండే మానవుడు పాపాత్ముడు. అతడు అందరిచేత సంహరింపదగినవాడే. నీ ఉపేక్ష చేత అపుడు పాండవులూ, వారి అమాత్యులూ జూదంలో ఎన్నో అవమానాలు పొందారు. ఇపుడు జరిగే యుద్ధంలో అశ్వాలు, గజాలు, పరాక్రమవంతులైన రాజులు వినాశం పొందుతారు. ఈ విషయా లన్నిటినీ తెలియజేస్తాను. మహామతీ ! ఈ మహాయుద్ధంలో సంపూర్ణ వినాశం కానుంది. ఆ వృత్తాంతాలు సంఘటనలు ఉన్నవున్నట్లు చెపుతాను. నీవు స్థిరచిత్తంతో సావధానుడవై వినటానికి సిద్ధంగా ఉండు. మానవుడు పుణ్యపాపాలకు తాను కర్తకాడు. స్వతంత్రుడు కాడు. అతడు ప్రారబ్ధ కర్మకు అధీనుడు. కేవలం చెక్కబొమ్మవలె యంత్రారూఢుడై గిరగిర తిరుగుతున్నాడు. కొందరు పరమేశ్వర ప్రేరణచే కార్యాలు సాగిస్తారు. మరికొందరు తమకు తోచినట్లు కర్మల నాచరిస్తారు. మరికొందరు తమ తమ పూర్వకర్మలు త్రిప్పినట్లు తిరుగుతారు. ఇలా ఇది మూడు విధాలుగా కనిపిస్తుంది. అందుచేత అనర్థం పొందిన నీవు స్థిరుడవై విను."

160. ఉలూకుని ద్వారా దుర్యోధనుడు పాండవులకు సందేశము పంపుట.

సంజయుడిలా అన్నాడు - "మహారాజా! మహాత్ము లయిన పాండవులు హిరణ్వతీనదీతీరంలో విడిది చేశారు. కౌరవేయులు యథావిధిగా మరోప్రక్క శిబిరం

వేశారు. దుర్యోధనుడు అక్కడ శక్తిసంపన్నమయిన తన సేనను నిలిపి. రాజులనందరినీ సమాదరించి, వారి రక్షణకై గుల్మాలను నియమించాడు. భారతా! ఈ విధంగా యోధుల రక్షణకు తగిన ఏర్పాట్లు చేసి దుర్యోధనుడు కర్ణునీ, దుశ్శాసనునీ, సౌబలుడయిన శకునినీ పిలిపించి మంతనాలు జరిపాడు. అక్కడ దుర్యోధనరాజు కర్ణునితోనూ, దుశ్శాసనునితోనూ, శకునితోనూ ఆలోచించి, ఉలూకుని ఏకాంతప్రదేశానికి పిలిపించి, ఆయనతో ఇలా అన్నాడు.

"ఉలూకా! నీవు సోమకులతో కూడిన పాండవుల దగ్గరకుపోయి, వాసుదేవుడు వింటుండగా నామాటలు చెప్పు. "సంవత్సరాల తరబడి చర్చలలో నలుగుతున్న లోకభీకర మయిన కౌరవ పాండవయుద్ధం ఇప్పుడు మీదికి వచ్చింది. కౌంతేయా! వాసుదేవుని సహాయాన్ని పొంది, సోదరులతో సహా గర్జనలు చేస్తూ, ఆత్మశ్లాఘాపూర్వకంగా నీవు సంజయునితో పలికినమాటా, సంజయుడు కౌరవసభలో వినిపించిన మాటా నిజమని నిరూపించటానికి సమయ మాసన్నమైనది. దానిని చేసి చూపండి." కౌంతేయులలో జ్యేష్ఠుడయిన ధర్మరాజుతో నామాటగా ఇలా చెప్పు. 'రాజా! నీవు నలుగురు సోదరులూ, సోమకులూ, కేకయులు అందరితో కలిసి ధర్మస్వరూపుడ వయ్యావు. అటువంటివాడివి అధర్మంపై మనస్సు పెట్టవచ్చా? సమస్తప్రాణులకూ నీవు అభయదాతవని నా నమ్మకం. అట్టువంటి నీవు ఇప్పుడు క్రూరునివలె జగత్తునంతా నాశనం చేయాలని చూస్తున్నావు. గతంలో దేవతలు ప్రహ్లాదుని రాజ్యాన్ని అపహరించినప్పుడు ఆయన గానం చేసిన శ్లోకమొకటి వినిపిస్తుంది.

దేవతలారా! సాధారణ ధ్వజంలాగా ధర్మధ్వజం ఉన్నతంగా ఉన్నా, గుప్తంగా పాపాలను కూడా పాటించటాన్ని బిడాలవ్రత మంటారు. రాజా! ఈ విషయంలో మా తండ్రికి నారదుడు చెప్పిన ఒక ఉత్తమమయిన ఆఖ్యానాన్ని నీకు వినిపిస్తాను. ఒకప్పుడు గంగాతీరంలో ఒక చెడ్డపిల్లి ఏ పనీ చేయకుండా చేతులు పైకెత్తి నిలిచి ఉన్నది. అది దేహధారు లందరికీ నమ్మకం కలిగించటానికై అందరితో "నేను మనస్సును శుద్ధిచేసికొన్నాను. ప్రస్తుతం ధర్మాచరణ చేస్తున్నాను." అని చెప్పేది. రాజా ! చాలాకాలానికి పక్షులన్నీ దానిని నమ్మడం మొదలుపెట్టాయి. అవి పిల్లిని సమీపించి అమితంగా పొగడసాగాయి. పక్షులను భుజించే ఆ పిల్లి పక్షులన్నింటిచే పూజింప బడుతూ తాను చేసిన చర్య ఫలించినట్లు, తనపని సిద్ధించినట్లు భావించింది. ఆపై చాలాకాలం

తర్వాత కొన్ని ఎలుకలు అక్కడకు పోయి ధార్మికుడై వ్రతాచరణలో ఉన్న ఆ పిల్లిని చూశాయి. భారతా! దంభంతో పెద్దపెద్ద పనులను ఆచరిస్తున్న ఆ పిల్లిని చూచి ఆ ఎలుకలు ఇలా ఆలోచించాయి. మనం ప్రజలకు మంచిమిత్రులం. ఇప్పుడు ఈ పిల్లి మనకు మేనమామయై ఆబాలవృద్ధంగా మనలను రక్షించాలి. అవన్నీ ఆ పిల్లి దగ్గరకు పోయి ఇలా అన్నాయి- నీ అనుగ్రహంతో మేమంతా సుఖంగా చరించాల నుకొంటున్నాము. నీవే మాకు నిర్భయమైన ఆశ్రయానివి, నీవే మాకు పరమమిత్రుడవు. మేమంతా ఒక్కటై నీ శరణుజొచ్చాము. మహాప్రాజ్ఞా! నీవూ నిత్యమూ ధర్మాసక్తుడవు. ధర్మమందే నిలిచినవాడవు. దేవేంద్రుడు దేవతలను రక్షించినట్లు మమ్ము నీవు రక్షించాలి.

ఆ ఎలుకలన్నీ అలా అనగానే ఎలుకలను చంపే పిల్లి వాటితో ఇలా అన్నది- మీ సంరక్షణా, నా తపస్సూ రెండూ జరగాలంటే కుదిరేది కాదు. కానీ మీ మాటను నేను కాదనరాదు. తప్పని సరిగా మీకు హితాన్ని చేకూర్చాలి. మీరుకూడా నా మాట ఎల్లప్పుడూ పాటించాలి. తపస్సుతో అలసిపోయాను. దృఢంగా నియమపాలన చేస్తున్నాను. ఎంత ఆలోచించినా, ప్రయత్నించినా నడిచే ఓపిక కొంచెం కూడా లేదు. కాబట్టి నాయనా ఇక మీదట నదీతీరానికి మీరే నన్ను తీసికొనిపోవాలి. 'అలాగే' అని ఆ పిల్లికి మాట ఇచ్చి ఆ ఎలుకలు అన్నీ ఆబాలవృద్ధంగా ఆ పిల్లికి లొంగిపోయాయి. ఆ తర్వాత పాపి అయిన పిల్లి ఎలుకలను తింటూ బలిసి, రంగు వచ్చింది. కీళ్ళు కూడా గట్టిపడ్డాయి. అక్కడ ఎలుకల గుంపు చాలా తగ్గిపోసాగింది. తేజోబలాలతో కూడి ఆ పిల్లి బలుస్తోంది. ఆ తర్వాత ఎలుకలు అన్నీ ఒకచోట కూడి పరస్పరం ఇలా అన్నాయి- మేనమామ రోజూ బలుస్తున్నాడు కానీ మనం తగ్గిపోతున్నాం. అప్పుడు వాటిలో ఒక తెలివైన ఎలుక- డిండికం- అనే పేరుగలది ఎలుకల గుంపుతో ఇలా అన్నది. "మీరంతా కలిసి ఒక్కటై నదీతీరానికి వెళ్ళండి. నేను కూడా మాతులునితో కలిసి వెనకే వస్తా." 'బాగుంది-బాగుంది' అంటూ ఎలుకలన్నీ అప్పుడు దానిని అభినందించాయి. ప్రయోజనకారి అయిన ఆ డిండికవచనాన్ని యథాన్యాయంగా పాటించాయి. ఆ తర్వాత ఆ విషయమంతా తెలియని పిల్లి డిండికాన్ని తినివేసింది. ఆ తరువాత అవన్నీ కలిసి రహస్యంగా ఆలోచించాయి. అక్కడ ఒక ముసలి ఎలుక- దాని పేరు కోలికం. అది సాటి ఎలుకల మధ్య నిలిచి ఇలా అన్నది. మాతులుడు ధర్మాసక్తి కలవాడు కాదు. లోకులను మోసం చేయటానికి శిఖ పెట్టాడు.

కంద మూలఫలాలు తినే వారి పురీషం ఎర్రగా ఉండదు. దాని శరీరం బలుస్తోంది. మన గుంపు తగ్గిపోతోంది. ఇప్పటికి ఏడెనిమిదిరోజులనుండి డిండికం కూడా కనిపించటం లేదు. ఇది విని ఎలుకలన్నీ పారిపోయాయి. దురాత్మకుడైన ఆ పిల్లికూడా వచ్చినట్టే వెళ్ళిపోయింది.

అదే విధంగా దురాత్ముడా! నీవుకూడా బిడాలవ్రతాన్ని పట్టావు. ఎలుకల మధ్య పిల్లి తిరిగినట్లు జ్ఞాతులలో నీవు తిరుగుతున్నావు. నీ మాట ఒకటి. చేత మరొకటి. నీ వేదాధ్యయనం. నీ శాంతస్వభావమూ లోక ప్రదర్శనకోసం ప్రగల్భించటమే. రాజా! నీవు ధర్మిష్ఠుడ వైతే ఈ కుహనాతత్త్వాన్ని వదలిపెట్టి, క్షత్రధర్మాన్ని ఆశ్రయించి పనులు చేయి. బాహుపరాక్రమంతో భూమిని సాధించి యథోచితంగా బ్రాహ్మణులకూ, పితరులకూ దానం చేయి. మీ అమ్మ సంవత్సరాల తరబడి కష్టపడుతోంది. ఆమె సుఖాన్ని కోరుకొంటూ ఆమె కన్నీటిని తుడిచి, యుద్ధంలో జయించి, ఆమెకు పరమానందాన్ని కల్గించు. నీవు కేవలం అయిదుగ్రామాల నడిగావు. పాండవులను రెచ్చగొట్టి వారితో యుద్ధం చేయాలన్న సంకల్పంతోనే మేము అవి కూడా ఇవ్వలేదు. మీ కోసమే నేను దుష్టాత్ముడైన విదురుని వదిలిపెట్టాను. లక్క ఇంటిలో మిమ్ములను తగులబెట్టడం గుర్తుతెచ్చుకో. ఇప్పటికైనా పౌరుషాన్ని చూపెట్టు. కౌరవసభకు వస్తున్న కృష్ణునితో "నేను సంధికైనా, సమరానికైనా సంసిద్ధుడనే" అని చెప్పి పంపావు కదా! ఆ యుద్ధకాలం ఇప్పుడు సమీపించింది. యుధిష్ఠిరా! ఆ యుద్ధం కోసమే నేనిదంతా చేశాను. క్షత్రియుడు యుద్ధాన్ని మించిన లాభంలేదని భావిస్తాడు. నీవు క్షత్రియవంశంలో పుట్టి లోకంలో ప్రసిద్ధిని పొంది ఉన్నావు గదా! ద్రోణ కృపుల ద్వారా అస్త్రాలను పొంది, వంశవిషయంలో, బలవిషయంలోనూ మాతో సమానుడవైకూడా శ్రీకృష్ణుని ఆశ్రయాన్ని పొందావు.

ఉలూకా! నీవు పాండవుల సమక్షంలోనే వాసుదేవునితో కూడా ఇలా చెప్పు - నీకోసం, పాండవుల కోసం సన్నద్ధుడవై నన్ను ఎదిరించు. కౌరవసభలో మాయచేసి ఏ రూపాన్ని ప్రదర్శించావో, అదే రూపాన్ని ప్రదర్శించి అర్జునునితో కలిసి నామీద దండెత్తు. ఇంద్రజాలం, మాయా, మోసం, బెదిరింపు- ఇవన్నీ రణరంగంలో ఆయుధం పట్టినవాడిని ప్రతిగర్జనకే ప్రోత్సహిస్తాయి. మేము కూడా మాయతో ఆకాశంలో ఎగరగలం. అంతరిక్షంలోనికి పోగలం. పాతాళంలో అయినా ప్రవేశించగలం. అమరావతి నైనా

చేరగలం. మా శరీరంలో కూడా చాలా రూపాలను ప్రదర్శించగలం కానీ దీని వలన అభీష్టసిద్ధి కలుగదు. శత్రువులూ భయపడరు. ధాత తన సంకల్ప మాత్రం చేతనే ప్రాణులను అదుపు చేస్తాడు. వార్ష్ణేయా! ధృతరాష్ట్రుని కొడుకుల నందరినీ యుద్ధంలో చంపి, ఈ ఉత్తమరాజ్యాన్ని కౌంతేయుల కిస్తానని అన్నావటగదా! నీ మాటలన్నీ నాకు సంజయుడు చెప్పాడు. నేను తోడున్న సవ్యసాచితో మీకు శత్రుత్వమా? అనికూడా అన్నావట గదా! మాటమీద నిలిచి పాండవులకోసం పరాక్రమించు. ఇప్పుడు సన్నద్ధుడవై రణభూమిలో యుద్ధం చేయి. చూద్దాం. పౌరుషాన్ని ప్రదర్శించు. శత్రువును గూర్చి బాగా తెలిసికొని, అకల్మషపరాక్రమాన్ని ఆశ్రయించి, శత్రువులకు శోకాన్ని కల్గించగలవాడే గొప్పగా బ్రతికినట్లు. శ్రీకృష్ణా! అకస్మాత్తుగా నీకు లోకంలో గొప్ప కీర్తి లభించింది. ఇప్పుడు మా కర్థమవుతోంది. పురుషరూపాన్ని ధరించిన షండులు కూడా ఉన్నారు అని. కంసునకొక సేవకుడవయిన నీవంటివానితో నావంటిరాజు యుద్ధం చేయటానికి కవచాన్ని ధరించి యుద్ధ సన్నద్ధుడు కావటం ఏ రీతిగానూ తగదు.

ఉలూకా ! ఆ ఎద్దులాంటి భీముడు బాలుడు, తిండిపోతు, అజ్ఞాని... అతనితో నామాటగా ఒకటికి పదిసార్లు ఇలా చెప్పు– పార్థా! విరాటనగరంలో అజ్ఞాతవాసకాలంలో వల్లవ నామంతో నీవు వంటలవాడి వయ్యావు. అది నా పౌరుష ఫలితమే. గతంలో సభామధ్యంలో ప్రతిజ్ఞ చేశావు. అది తప్పిపోకూడదు. చేతనయితే దుశ్శాసనుడి నెత్తురు త్రాగు. కౌంతేయా! ధార్తరాష్ట్రులను నేను త్వరలో యుద్ధంలో చంపుతానని పలుకుతుంటావు. దానికి తగిన సమయం వచ్చింది. ఎక్కువ తినటంలో, త్రాగటంలో నీకు నేర్పు. కాబట్టి నీకు భోజన విషయంలోనే పురస్కారం. భోజన మెక్కడ? యుద్ధ మెక్కడ? యుద్ధం చేసి పౌరుషాన్ని చూపు. వృకోదరా! యుద్ధభూమిలో నాచేత చంపబడి, గదను కౌగిలించుకొని పడుకొంటావు. సభలో నీవు వేసిన గంతులన్నీ వృథాయే. ఉలూకా! నామాటగా నకులునితో ఇలా చెప్పు - స్థిరంగా నిలిచి ఇపుడు యుద్ధం చేయి. నీ పౌరుషాన్ని చూద్దాం. ఈ సమయంలో ధర్మరాజుపై ప్రేమనూ, నామీది ద్వేషాన్నీ, ద్రౌపది బాధలనూ యథాతథంగా స్మరించుకో. రాజుల సమక్షంలో నామాటగా సహదేవునితో ఇలా చెప్పు - గతంలోని మీ బాధలను తలచుకొని సంసిద్ధుడవై ఇప్పుడు రణభూమిలో పోరాడు.

విరాటద్రుపదులకు కూడా నామాటగా ఇలా చెప్పు– బ్రహ్మ ప్రజలను సృష్టించిన నాటినుండీ ఎంతో మంచిసేవకులు కూడా తమ యజమానులను సరిగా పరీక్షించలేదు. వారి గుణాగుణాలను సరిగా తెలిసికొనలేదు. అట్లే ప్రభువులు కూడా భృత్యులను సరిగా తెలిసికొనలేదు. యుధిష్ఠిరుని పక్షానికి మీరు వచ్చారు కానీ ఆయన అంతగా సేవింపదగిన వాడు కాదు. కాబట్టి మీరంతా ఒక్కటై నన్ను చంపటానికి సిద్ధంకండి. మీకోసం పాండవులకోసం నాతో యుద్ధం చేయండి. పాంచాలరాజైన ధృష్టద్యుమ్ననితో కూడా నా మాటగా చెప్పు – నీకు తగిన అవకాశం వచ్చింది. ద్రోణుడు కూడా నీకు దొరుకుతాడు. యుద్ధంలో ద్రోణున కెదురు నిలిచినప్పుడు నీకు ఏది హితకరమో తెలిసికొనగలవు. స్నేహితులతో కలిసి యుద్ధానికి రా. దుష్కరమైన గురువధ రూపమైన, పాపకృత్యాన్ని చేయి. ఉలూకా! ఆ తరువాత నా మాటగా శిఖండికి కూడా ఇలా చెప్పు. గొప్పవిలుకాడై, మహాబాహువయిన గాంగేయుడు నిన్ను స్త్రీగా భావించి చంపడు. కాబట్టి నీవు నిర్భయంగా యుద్ధంచేసి రణభూమిలో నీ పరాక్రమాన్ని ప్రకటించు. నీ పౌరుషాన్ని చూద్దాం."

"ఆ మాటలు చెప్పి దుర్యోధనుడు నవ్వి మరలా ఉలూకునితో ఇలా అన్నాడు – వాసుదేవుడు వింటుండగా మరలా అర్జునునితో ఇలా చెప్పు. వీరా! నీవు మమ్ములను చంపి ఈ భూమిని పరిపాలించు. లేదా మాతో ఓడిపోయి రణభూమిలో శాశ్వతంగా నిదురించు. పాండుకుమారా! రాజ్యభ్రంశక్లేశాన్నీ, వనవాసాన్నీ, ద్రౌపదీ పరాభవక్లేశాన్నీ స్మరిస్తూ పౌరుషాన్ని ప్రదర్శించు. క్షత్రియుడు ఎందుకోసం పుడతాడో దానిని ప్రదర్శించవలసిన కాలం వచ్చింది. బలాన్ని, పరాక్రమాన్ని, శౌర్యాన్ని, అస్త్రప్రయోగలాఘవాన్ని, పౌరుషాన్ని ప్రదర్శిస్తూ యుద్ధంలో క్రోధాన్ని ఉపశమింపజేసికో. అనేకక్లేశాల ననుభవించి, దీనుడై, చిరకాలం రాజ్యానికి దూరమై, ఐశ్వర్యాన్ని కోల్పోయిన ఎవరి హృదయమైనా బ్రద్దలవుతుంది. ఉత్తమవంశంలో పుట్టి, శూరుడై, పరులసొమ్ముల కాసింపని వాని రాజ్యాన్ని ఇతరులు ఆక్రమిస్తే అది ఏ వీరుని కోపాన్ని ఉద్దీపింపజేయదు? అప్పుడు పెద్ద పెద్ద మాటలు మాటాడావు. వాటిని చేతలలో చూపించు. ఆచరణ లేకుండా మాటలు మాత్రమే చెప్పేవాడిని దుర్జనుడు అంటారు. మీ స్థానమూ, రాజ్యమూ శత్రువుల అధీనంలో ఉన్నాయి. వాటిని పునరుద్ధరించుకో. యుద్ధం చేయదలచినవానికి ఇవి రెండే ప్రయోజనాలు. కాబట్టి వాటికై పౌరుషాన్ని ప్రదర్శించు.

నీవు జూదంలో ఓడిపోయావు. ద్రౌపదిని సభ కీడ్పించాము. తనను మగవాడుగా భావించుకొనే వాడిలో కోపం కలగటానికి ఇది చాలు. పండ్రెండు సంవత్సరాలు రాజ్యంనుండి తొలగింపబడ్డావు, అరణ్యంలో ఉన్నావు. సంవత్సరకాలం విరాటునకు దాసుడవై జీవించావు. రాజ్యభ్రష్టతవలన ఏర్పడిన బాధనూ, వనవాసం వలన ఏర్పడిన కష్టాన్నీ, ద్రౌపదీ పరాభవక్లేశాన్నీ తలచుకొంటూ పౌరుషాన్ని ప్రదర్శించు.

మేము మాటిమాటికీ అప్రియాలు పలుకుతూ ఉంటే నీవు నీ కోపాన్ని ప్రదర్శించు– క్రోధమే పౌరుషం గదా! క్రోధమే బలం, వీర్యం, జ్ఞానం, యోగం, అస్త్రలాఘవమూను. ఇప్పుడే నీవు వానిని ప్రదర్శించు. యుద్ధం చెయ్యి. పురుషుడవు కమ్ము. ఆయుధపూజ జరిగింది. కురుక్షేత్రం బురద లేకుండా ఉంది. గుర్రాలు బలిసి ఉన్నాయి. సైనికులు చక్కగా పోషితులయ్యారు. కేశవునితో సహా వచ్చి రేపే యుద్ధం చెయ్యి. యుద్ధంలో భీష్మునితో తలపడకుండానే ప్రగల్భాలు పలుకుతున్నావే! కుంటివాడు గంధమాదనపర్వతం ఎక్కాలి అనుకొన్నట్లే ఉంది. కుంతీకుమారా! ఎందుకిలా ప్రగల్భాలు పలుకుతావు? బడాయి మాటలు విడిచి పురుషుడివి కమ్ము. అణచరాని కర్ణునీ, బలవంతుల్లో ఉత్తము డయిన శల్యునీ, మహేంద్రసమానుడయిన ద్రోణునీ జయించకుండానే రాజ్యం ఎలా ఆశిస్తున్నావు? ద్రోణుడు వేదంలోనూ, ధనుర్వేదంలోనూ ఆచార్యుడు. రెండింటినీ చివరిదాకా చూసిన వాడు. యుద్ధంలో సర్వభారమూ వహిస్తాడు.. చలించకుండా, స్థిరంగా సేనలో తిరుగుతూ, పొరబడని వాడు. అటువంటి మహాతేజస్వినిని జయించాలను కొంటున్నావు. కాని అది జరిగేదికాదు. మేరు పర్వతాన్ని గాలి కుదిపినట్లు ఎప్పుడూ మనం వినలేదు కదా! నన్ను నీవు అన్నట్లే జరిగితే మేరు పర్వతాన్ని గాలి ఎగురగొట్టుతుంది. ఆకాశం నేలకూలుతుంది. కాలచక్రం వెనక్కు తిరుగుతుంది. బ్రతుకుమీద ఆశ ఉన్నవా డెవడయినా సరే.. అర్జునుడు కానీ, మరొకడు కానీ ద్రోణుని ఎదిరించి సుఖంగా ఇంటికి చేరగలడా? ఈ భీష్మద్రోణులు ఎవరినయినా చంపాలనుకొంటే దారుణ మయిన వారి అస్త్రం తాకిన తరువాత వాడు ప్రాణాలతో బయటపడతాడా? వాడి కాళ్లు నేలమీద నిలుస్తాయా?

ఇక్కడి మా సేనను ఎవరూ ఎదుర్కొనలేరు. దేవతల సేనలాగా వెలిగిపోతోంది. స్వర్గాన్ని దేవతలలాగా రాజులంతా రక్షిస్తున్నారు. ఇంతటి సేనను నూతిలో కప్పలాగా తెలుసుకోలేక పోతున్నావు. నాలుగుదిక్కుల రాజులూ, కాంభోజులు, శకులు, ఖశులు,

శాల్వులు, మత్స్యులు, కురుమధ్య దేశీయులు, మ్లేచ్ఛులు, పుళిందులు, ద్రావిడులు, ఆంధ్రులు, కాంచీదేశీయులు... అంతా నా సేనను రక్షిస్తున్నారు. వివిధ దేశస్థులతో పెరిగిపోయి ఉన్న నాసేన గంగావేగం లాగా దాటశక్యం కాకుండా ఉంది. ఏనుగుల యూథం మధ్యలో ఉన్న నాతో యుద్ధం చెయ్యాలనుకొంటున్నావు. ఎంత తెలివి తక్కువతనమో! నీవి అక్షయతూణీరాలు, నీరథం అగ్ని ఇచ్చినది- నీ జెండా దివ్య మయిందని తెలుసును మాకు. అర్జునా! అన్ని గొప్పలెందుకు? మాటలు మాని యుద్ధం చెయ్యి- విజయం అనేది మానవ ప్రయత్నంతో వస్తుంది కాని ఇలా గొప్పలు చెప్పుకుంటే రాదు. అర్జునా! కేవలం గొప్పలు చెప్పుకొంటేనే పనులు జరిగిపోతే అందరికీ ప్రయోజనం సమకూరినట్లే ! గొప్పలు చెప్పుకోవడం చేతకాని దెవరికి? నీకు కృష్ణుడు తోడు ఉన్నాడనీ తెలుసు. తాటిచెట్టంత విల్లు నీకుందనీ తెలుసు. నీలాంటి యోద్ధ లేడనీ తెలుసు. అంతా తెలిసే నీ రాజ్యం హరిస్తున్నాను. మానవుడు మానవప్రయత్నంతో కూడా రాజ్యం పొందలేడు. బ్రహ్మ తన మనస్సంకల్పానికి అనుకూలంగా పనులు నెరవేరేటట్లు చేస్తాడు. నీవు ఏడుస్తూ ఉంటే పదుమూడేళ్లూ రాజ్యం మేము అనుభవించాము. ఇపుడు నిన్ను బంధుసహితంగా చంపి మరీ అనుభవిస్తాను.

అర్జునా! మిమ్మల్ని జూదంలో ఓడించి దాసుల్ని చేసిననాడు ఈ గాండీవం ఎక్కడికి పోయింది? భీముని బలం ఎక్కడుంది? గద దాల్చిన భీముని వల్ల గానీ, గాండీవం దాల్చిన అర్జునుని వల్ల గానీ ఆనాడు మీకు ముక్తి కలగలేదు. పాపం ఏమీ ఎరగని ఆ ద్రౌపది మీకు గతి అయింది. పౌరుషం విడిచి దాస్యం చేసే మిమ్మల్ని ఆనాడు ద్రౌపది విడిపించింది. నపుంసకులని నేను ఆనాడు సభలో మిమ్మల్ని అన్నమాట నిజమే అయింది. విరాటనగరంలో అర్జునుడు సిగ చుట్టాడు కదా! విరాటుని వంటశాలలో భీమసేనుడు వంటలు చేసి అలసి పోయాడు గదా! అదికూడా నా పనితనమే. ఇలా రాజులు తమ శత్రువుల మీద దండాన్ని ఎల్లప్పుడూ ప్రయోగిస్తారు. అందుచేతనే నీవుకూడా నపుంసకుడివై, సిగచుట్టి, కన్యలకు ఆటలు నేర్పావు. కృష్ణునిమీది భయంతోనో, నీమీది భయంతోనో నేను రాజ్యం ఇవ్వను. ఆ కేశవునితో వచ్చి యుద్ధం చెయ్యి. నేను ఆయుధం ధరించి యుద్ధంలో నిలిస్తే ఎదుర్కొనడమే తప్ప అక్కడ మాయలూ, ఇంద్రజాలాలూ, మోసాలూ, బెదిరింపులూ పని చెయ్యవు. అమోఘ

మయిన ఆయుధంతో నిలిచిన నన్ను ఎదిరిస్తే వేయిమంది కృష్ణ లయినా వందలకొద్దీ అర్జును లయినా సరే దిక్కులు పట్టి పారిపోవలసిందే! భీష్మునితో యుద్ధాని కయినా సిద్ధపడు లేదా కొండతో తలను పగులగొట్టుకో. లేదా అగాధ మయిన సేనా సముద్రాన్ని చేతులతో ఈది దాటు - తెలుస్తుంది. ఈ మహాసేనా సముద్రంలో కృపుడనే పెద్ద చేప ఉంది. వివింశతి అనే సర్పం ఉంది. బృహద్బలుడనే పెద్ద కెరటాలూ, భూరిశ్రవుడనే తిమింగిలమూ ఉన్నాయి. భీష్ము డనే ఆగని ప్రవాహవేగం, ద్రోణు డనే మొసలి ఉన్న ఈ సేనాసముద్రంలో ఎవరూ ప్రవేశించలేరు. పైగా కర్ణు డనే మత్స్యం ఉంది. శల్యు డనే సుడిగుండం ఉంది. కాంభోజరాజు అనే బడబాగ్ని ఉంది. దుశ్శాసను డనే ప్రవాహమూ, శలుడు, శల్యుడు అనే చేపలూ, సుషేణుడు అనే ఏనుగు, చిత్రాయుధుడు అనే మొసలి ఉన్నాయి. సైంధవు డనే పర్వతం ఉంది. పురు మిత్రు డనే అగాధం ఉంది. దుర్మర్షణుడనే నీరుంది. శకుని అనే జలపాతం ఉంది. ఈ సేనా సముద్రంలో శస్త్రా లనే ప్రవాహాలున్నాయి. అవి పెరుగుతాయే కాని తరగవు. దాంట్లోకి దిగితే ఎంతో శ్రమ. మనసు నశిస్తుంది. బంధువులంతా చచ్చిపోతారు. అపుడు నీ మనసుకు పరితాపం కలుగుతుంది. అర్జునా! అపవిత్రుడు స్వర్గం నుండి గెంటి వేయబడినట్లుగా నీ మనస్సు రాజ్యపాలనం నుండి వెనుదిరుగుతుంది. **తపస్సు చేయని వానికి స్వర్గం దుర్లభం. అలాగే నీకూ రాజ్యం దుర్లభం.**"

161. ఉలూకుడు దుర్యోధనుని సందేశమును పాండవులకు వినిపించుట.

ఉలూకుడు పాండవుల శిబిరంలోకి వెళ్లి పాండవులను కలిసి ధర్మరాజుతో ఇలా అన్నాడు. "దూతల మాటలు ఎలా ఉంటాయో బాగా తెలిసినవాడవు. దుర్యోధనుడు ఆజ్ఞాపించినట్లు చెప్పే నా మాటలు విని నీవు కోపపడరాదు." అనగానే యుధిష్ఠిరుడు ఇలా అన్నాడు. "ఉలూకా! నీకేమీ భయంలేదు. ఆవేశపడకుండా చెప్పు. ముందు చూపులేని లుబ్ధు డయిన దుర్యోధనుని అభిప్రాయం చెప్పు." తేజస్సులు, మహాత్ములూ అయిన పాండవులూ, సృంజయులూ, మత్స్యులు, యశస్వి అయిన కృష్ణుడు, పుత్ర సహితులయిన విరాట ద్రుపదులూ, మిగిలిన రాజులూ అందరి మధ్య ఉలూకుడు ఇలా అన్నాడు. "యుధిష్ఠిరా! కౌరవ వీరులంతా వింటూ ఉండగా మహామనస్వి

అయిన దుర్యోధనుడు నీతో చెప్పమన్నాడు - విను. నీవు జూదంలో ఓడింపబడ్డావు- ద్రౌపదిని సభలోకి లాక్కువచ్చాం. మగతనం ఉన్న మానవు డెవరి కయినా అపుడు కోపం వచ్చి తీరుతుంది. పన్నెండేళ్ళు మిమ్మల్ని ఇంటినుండి అడవులకు వెడలగొట్టాం- సంవత్సరం పాటు విరాటునికి దాస్యం చేస్తూ పడి ఉన్నారు. పాండుపుత్రా! రాజ్యాపహరణం, అరణ్యవాసం, ద్రౌపదీ పరాభవం వీటి నన్నిటినీ తలచుకొంటూ అయినా కోపంతో పురుషుడివిగా ప్రవర్తించు.

అసమర్థు డయిన భీముడు ప్రతిజ్ఞ చేశాడుగా! చేతనైతే దుశ్శాసనుని రక్తం త్రాగమను. ఆయుధ పూజ జరిగింది. కురుక్షేత్రం అంతా బురద లేకుండా తయారైంది. మార్గాలన్నీ సమంగా చేశారు. గుర్రాలు చక్కగా బలిసి ఉన్నాయి. కృష్ణునితో సహా రేపు యుద్ధానికి రా! కుంటివాడు గంధమాదన పర్వతం ఎక్కాలనుకొన్నట్లు భీష్మునితో యుద్ధంలో తలపడకుండానే బడాయి మాటలు పలుకుతున్నావే! ఎందుకిలా వాగుతావు భీమా! మాటలు ఆపి మగవాడివికమ్ము- అణచరాని కర్ణునీ, బలవంతుల్లో ఉత్తము డయిన శల్యునీ, మహేంద్ర సమాను డయిన ద్రోణునీ జయించకుండానే రాజ్యం ఎలా ఆశిస్తున్నావు? ద్రోణుడు వేదంలోనూ, ధనుర్వేదంలోనూ ఆచార్యుడు. రెండింటి అంతం చూసినవాడు, యుద్ధంలో సర్వభారమూ వహిస్తాడు. చలనంలేకుండా స్థిరంగా సేనలో తిరుగుతూ పొరబడనివాడు. అటువంటి మహాతేజస్విని జయించా లనుకొంటున్నావు కాని అది జరిగేదికాదు. మేరు పర్వతాన్ని గాలి కుదిపినట్లు ఎప్పుడూ మనం వినలేదు కదా! నన్ను నీవు అన్నట్లే జరిగితే మేరు పర్వతాన్ని గాలి ఎగురకొట్టుతుంది. ఆకాశం నేలకూలుతుంది. కాలచక్రం వెనక్కు తిరుగుతుంది. బ్రతుకుమీద ఆశ ఉన్న వాడెవడయినా సరే-ఏనుగు నెక్కికానీ, గుర్రమెక్కికానీ, రథమెక్కికానీ ద్రోణుని ఎదిరించి, సుఖంగా యింటికి చేరగలడా? ఈ భీష్మద్రోణులు, ఎవరినయినా చంపాలనుకొంటే దారుణ మయినవారి అస్త్రం తాకిన తరువాత వాడు ప్రాణాలతో బయట పడతాడా? వాడి కాళ్లు నేల మీద నిలుస్తాయా.? ఇక్కడి మాసేనను ఎవరూ ఎదుర్కొనలేరు- దేవతల సేనలాగా వెలిగిపోతోంది. స్వర్గాన్ని దేవతల లాగా రాజులంతా మా సేనను రక్షిస్తున్నారు. ఇంతటి సేనను నూతిలో కప్పలాగా తెలుసుకోలేక పోతున్నావు. నాలుగు దిక్కుల రాజులూ, కాంబోజులు, శకులు, ఖశులు, శాల్వులు, మత్స్యులు, కురుమధ్య దేశీయులు, మ్లేచ్ఛులు, పుళిందులు, ద్రావిడులు, ఆంధ్రులు, కాంచీ

దేశీయులు - అంతా నా సేనను రక్షిస్తున్నారు. వివిధ దేశస్థులతో పెరిగిపోయి ఉన్న నా సేన గంగా వేగంలాగా దాటశక్యం కాకుండా ఉంది. ఏనుగుల యూథం మధ్యలో ఉన్న నాతో యుద్ధం చెయ్యాలనుకొంటున్నావు- ఎంత తెలివి తక్కువతనమో!"

యుధిష్ఠిరునితో ఇలా అని ఉలూకుడు మళ్లీ అర్జునుని వైపు తిరిగి ఇలా అన్నాడు. "అర్జునా! అన్ని గొప్పలెందుకు? మాటలు మాని యుద్ధం చెయ్యి. విజయం అనేది మానవ ప్రయత్నంతో కలుగుతుంది కాని గొప్పలు చెప్పుకుంటే రాదు. అర్జునా! కేవలం గొప్పలు చెప్పుకొంటేనే పనులు జరిగితే అందరికీ ప్రయోజనం సమకూరినట్లే. గొప్పలు చెప్పుకోవటం చేతకాని దెవరికి? నీకు కృష్ణుడు తోడున్నాడనీ తెలుసు. తాటిచెట్టంత విల్లు నీకుందనీ తెలుసు- నీలాంటి యోధ లేకపోవడమూ తెలుసు. అంతా తెలిసే నీరాజ్యం హరిస్తున్నాను. మానవుడు పర్యాయ ధర్మంతో కూడా రాజ్యం పొందలేడు. బ్రహ్మ తనమనస్సంకల్పానికి అనుకూలంగా పనులు నెరవేరేటట్లు చేస్తాడు. నీవు ఏడుస్తూ ఉంటే పదమూడేళ్లూ రాజ్యం మేము అనుభవించాము. ఇపుడు నిన్ను బంధుసహితంగా చంపి మరీ అనుభవిస్తాను. అర్జునా! నిన్ను జూదంలో ఓడించి దాసుని చేసిననాడు ఈ గాండివం ఎక్కడికి పోయింది? భీమసేనుని బలం ఎక్క డుంది? గద దాల్చిన భీముని వల్లగాని, గాండివం దాల్చిన అర్జునుని వల్లగాని ఆ నాడు మీకు ముక్తి లభించలేదు. పాపం ఏమీ ఎరగని ఆ ద్రౌపది మీకు గతి అయింది.

పౌరుషం విడిచి దాస్యం చేసే మిమ్మల్ని ఆ నాడు ద్రౌపది విడిపించింది. నపుంసకులని నేను ఆనాడు సభలో మిమ్మల్ని అన్నమాట నిజమే అయింది. విరాట నగరంలో అర్జునుడు సిగచుట్టాడు కదా! విరాటుని వంటశాలలో భీమసేనుడు వంటలు చేసి అలసిపోయాడు గదా- అదికూడా నా పనితనమే. ఇలా రాజులు తమ శత్రువుల మీద దండాన్ని ఎల్లప్పుడూ ప్రయోగిస్తారు. అందుచేతనే నీవు కూడా నపుంసకుడివై సిగచుట్టి కన్యలకు ఆటలు నేర్పావు. కృష్ణుని మీద భయంతోనో, నీమీది భయంతోనో నేను రాజ్యం ఇవ్వను. ఆ కేశవునితో వచ్చి యుద్ధం చెయ్యి. నేను ఆయుధం ధరించి యుద్ధంలో నిలిస్తే ఎదుర్కొనడమే తప్ప అక్కడ మాయలూ, ఇంద్రాజాలాలూ, మోసాలూ, బెదిరింపులూ పని చెయ్యవు. అమోఘమైన ఆయుధంతో నిలిచిన నన్ను ఎదిరిస్తే వేయిమంది కృష్ణ లయినా, వందల కొద్దీ అర్జును లయినా సరే దిక్కుల వెంట

పారిపోవలసిందే! భీష్మునితో యుద్ధాని కయినా సిద్ధపడు! లేదా కొండతో తలను పగులగొట్టుకో – లేదూ అగాధమయిన సేనా సముద్రాన్ని చేతులతో ఈది దాటు- తెలుస్తుంది. ఆ మహాసముద్రంలో కృపుడనే పెద్దచేప ఉంది. వివింశతి అనే సర్పం ఉంది- బృహద్బలు డనే పెద్ద కెరటాలు, భూరిశ్రవు డనే తిమింగిలమూ ఉన్నాయి. భీష్ము డనే ఆగని ప్రవాహవేగం, ద్రోణు డనే మొసలి ఉన్న ఈ సేనా సముద్రంలో ఎవరూ ప్రవేశించలేరు. పైగా కర్ణు డనే మత్స్యం ఉంది. శల్యు డనే సుడిగుండం ఉంది. కాంభోజరాజు అనే బడబాగ్ని ఉంది. దుశ్శాసను డనే ప్రవాహం, శలుడు, శల్యుడు, అనే చేపలూ, సుషేణుడు, చిత్రాయుధుడు అనే ఏనుగు, మొసలి ఉన్నాయి. సైంధవు డనే పర్వతం ఉంది. పురుమిత్రు డనే అగాధం ఉంది. దుర్మర్షణు డనే నీరుంది. ఈ సేనా సముద్రంలో శస్త్రా·లనే ప్రవాహాలున్నాయి. అవి పెరుగుతాయే కాని తరగవు. దాంట్లో దిగితే ఎంతో శ్రమ. మనసు నశిస్తుంది. బంధువులంతా చచ్చిపోతారు. అపుడు నీ మనసుకు పరితాపం కలుగుతుంది. అర్జునా! అపవిత్రుడు స్వర్గం నుండి గెంటివేయ బడినట్లుగా నీ మనస్సు రాజ్యపాలనం నుండి వెనుదిరుగు తుంది. తపస్సు చేయనివానికి స్వర్గం దుర్లభం, అలాగే నీకూ రాజ్యం దుర్లభం."

162. పాండవుల ప్రతిసందేశము.

మాటల ములుకులతో పొడుస్తూ ఉలూకుడు త్రాచుపాములా బుసకొట్టుతున్న అర్జునునితో ఇలా అనడంతో అప్పటికే ఆ మాటలు విని, పాండవులందరికీ ఎంతో కోపం వచ్చింది. ఆ జనాల్లోంచి లేచి నిలుచుని చేతులు చాపుతూ, బుసలు కొడుతూ, ఒకరిమొగాలు ఒకరు చూసుకొంటున్నారు. ఒక్కసారిగా భీముడు తల అడ్డంగా తిప్పి కృష్ణుని వైపు చూశాడు. కనులతుదలలో ఎర్రజీరలు కనిపిస్తున్నాయి. పాములా బుసకొడుతున్నాడు భీముడు. అలా కోపం మూర్తీభవించి నిలిచిన భీముని చూసి, ఉలూకుని పరిహసిస్తున్నట్లు కృష్ణుడు ఇలా అన్నాడు. "ఉలూకా! త్వరగా వెళ్ళు. సుయోధనునితో ఇలా చెప్పు. నీవు చెప్పించిన మాటలు విన్నాం. అర్థం తెలిసింది. నీ యిష్టమే జరుగుతుందిలే" అని చెప్పు." కేశవుడు ఇలా అని మళ్లీ ఒకసారి మహామేధావి అయిన యుధిష్ఠిరుని వైపు చూశాడు. సృంజయు లందరూ, యశస్వి అయిన కృష్ణుడూ, పుత్రసహితు లయిన విరాటద్రుపదులూ, రాజు లందరూ ఉండగా

ఉలూకుడు మళ్లీ వాగ్బాణాలతో పొడుస్తూ, పాములా బుసకొడుతున్న అర్జునునితోనూ, కృష్ణాదులతోనూ దుర్యోధనుడు చెప్పినట్లు అన్నాడు.

ఉలూకుని దారుణ వచనాలు, విని అర్జునుడు ఉడికిపోయి క్షోభించిపోయాడు. నుదుటి చెమట తుడుచుకొన్నాడు. మహారాజా! అర్జునుని ఆ అవస్థలోచూసి పాండవ మహారథుల సముదాయ మంతా సహించలేకపోయింది. మహాత్ము లయిన కృష్ణార్జునులను అధిక్షేపించడం విని, అక్కడి పురుషశ్రేష్ఠులంతా క్రోధంతో మండిపోయారు. ధృష్టద్యుమ్నుడు, శిఖండి, సాత్యకి, కేకయ రాజులు అయిదుగురు, ఘటోత్కచుడు, ఉపపాండవులు, అభిమన్యుడు, ధృష్టకేతుడు, భీమసేనుడు, నకుల సహదేవులు - వీరంతా క్రోధంతో ఎరుపెక్కిన కళ్లతో ఆసనాల మీద నుండి లేచారు. చందన చర్చలు చేసుకొన్న చేతులెత్తి నిలిచారు. వారపుడు అంగదాలతో, కేయూరాలతో ప్రకాశిస్తూ (కోపంతో) పళ్లు పటపట కొరుకుతూ, సెలవులు నాకుతూ నిలిచారు. ఆ రాజుల ఆకారాలను, మనోభావాలనూ తెలిసిన భీముడు వెంటనే క్రోధంతో మండిపోతూ లేచి నిలిచాడు. కనులు పెద్దవిచేసి, దంతాలు పటపటా కొరుకుతూ, అరచేతులు పిండుతూ ఉలూకునితో ఇలా అన్నాడు భీముడు.

"మూర్ఖా! మమ్మల్ని అశక్తుల నుకొని ప్రోత్సహిస్తున్నట్లు నీకు దుర్యోధనుడు చెప్పిన మాటలు విన్నాముర! మూర్ఖా! నేను చెపుతున్న మాటనిను- రాజులందరి మధ్య దాన్ని నీవు, కర్ణుడూ, నీ తండ్రి శకునీ వింటూ ఉండగా సుయోధనుడితో చెప్పు. దురాచారా! మా పెద్దన్నగారికి సదా ప్రీతి కలిగించాలని మేము నీపనులన్నీ సహించాం. అది నీవు తెలుసుకోలేకపోతున్నావు. బుద్ధిమంతుడైన ధర్మరాజు శాంతికోరుతూ, కులానికి హితం చేకూర్చాలని శ్రీకృష్ణుని కురుసభకు కూడా పంపాడు. కాని నీవు నిజంగానే కాలచోదితుడవై ,యమపురికి పోవాలనుకొంటున్నావు. మాతో యుద్ధానికి రా! అదికూడా రేపే జరుగుతుంది. తప్పకుండా! పాపీ! నేను నిన్నూ, నీ తమ్ముళ్లనూ చంపుతానని ప్రతిజ్ఞ చేశా. అది అలాగే జరుగుతుంది. ఇక దాన్ని గురించి ఆలోచనే లేదు. నేను చెప్పినది జరగకపోతే సముద్రం చెలియలికట్ట దాటినట్లే, పర్వతాలు బ్రద్దలవుతాయి. దుర్మతీ! నీకు సహాయంగా యముడు వచ్చినా, కుబేరుడు వచ్చినా, రుద్రుడే వచ్చినా సరే పాండవులు వారి ప్రతిజ్ఞలు నెరవేర్చుకొంటారు. అనుకొన్నట్లు దుశ్శాసనుని రక్తం త్రాగుతాను కూడా. అపుడు భీష్ముని ముందుంచుకొని అయినా

ఏ క్షత్రియుడు వచ్చినా వాడిని యమలోకానికి పంపుతాను. ఈ రాజుల సమక్షంలో నేను చెప్పిన దంతా జరిగితీరుతుంది. నా మీద ఒట్టు." భీముని మాటలు విని సహదేవునికి కూడా కోపంతో కనులు ఎర్రబడ్డాయి. అతడు ఇలా అన్నాడు. "పాపీ! సేనాసముదాయ మున్న ఈ సభల వీరోచిత మయిన మాటలు చెపుతున్నాను. ఆ మాటలు నీవు నీతండ్రితో చెప్పు. ధృతరాష్ట్రుడితో నీకు సంబంధం లేకపోతే మాకు కౌరవులతో ఎన్నడూ భేదం వచ్చేదే కాదు. నీవు ధృతరాష్ట్రుని వంశానికీ, లోకానికీ వినాశం కోసం పుట్టిన వైరపురుషుడివి, పాపివి. నీకులాన్ని కూడా నాశనం చేసుకొంటున్నావు. పుట్టినప్పటినుండీ నీ తండ్రి పాపాత్ముడై, ప్రతిదినమూ మాకు వ్యతిరేకంగా క్రూరకృత్యాలే చేయాలనుకొనేవాడు. ముందుగా నీతండ్రి చూస్తూ ఉండగా నిన్నూ, విలుకాండ్రందరూ చూస్తూ ఉండగా నీతండ్రినీ చంపి ఈవైరానుబంధానికి అంతం చూస్తాను."

భీమ, సహదేవుల మాటలు విని అర్జునుడు భీమునితో నవ్వుతున్నట్లు ఇలా అన్నాడు "భీమసేనా! నీతో వైరం పెట్టుకొన్నవాళ్లు ఇళ్లలో సుఖంగా కూర్చున్నా మృత్యువుకు వశమై చచ్చిపోతారు. వారిక లేనట్లే. పురుషోత్తమా! ఈ ఉలూకుడితో కఠినంగా మాట్లాడకు- దూతలు ఏమి తప్పు చేస్తారు? వాళ్ళు చెప్పినట్లు చెపుతారు. అంతేకదా!" ఆజానుబాహు వయిన అర్జునుడు భీమునితో ఇలా అని ధృష్టద్యుమ్నాదు లయిన వీర స్నేహితులతో ఇలా అన్నాడు. "పాపి అయిన దుర్యోధనుని మాటలు మీరు విన్నారుగా- ముఖ్యంగా నన్నూ కృష్ణునీ నిందించటం విని మీరంతా మాకు హితం చేయాలని సన్నద్ధులయ్యారు కదా! కృష్ణుని ప్రభావం చేతనూ, మీ అందరి ప్రయత్నం చేతనూ నేను లోకంలోని రాజు లెవరినీ కూడా లెక్కచెయ్యను. మీ అనుమతితో ఉలూకునికీ, వాని ద్వారా సుయోధనునికీ చెప్పవలసిన సమాధానమూ చెపుతాను. వీడు పేలిన మాటలకు సమాధానం తెల్లవారేసరికి సేనాముఖంలో గాండీవంతో చెపుతాను. వట్టిమాటలు చెపితే నపుంసకులక్రింద లెక్క." రాజులంతా ఆ మాటలతీరు విని అర్జునుని ప్రశంసించారు. అంతేకాదు ఆ సమాధానం అందరినీ ఆశ్చర్యపరిచింది. తరువాత ధర్మరాజు వారినందరినీ వారివారి గౌరవాలకూ, వయసులకూ తగినట్లు శాంతపరచి దుర్యోధనుని కివ్వదగిన సందేశం ఇలా చెప్పాడు. "రాజు తనను తాను తక్కువ చేసుకోకూడదు. అందుచేత నీ సత్కారంలో మనసుంచి సమాధానం చెపుతున్నాను." ధర్మరాజు ఉలూకుని మొదట ఇలా మృదువుగా పలికి తరువాత

తీవ్రంగా ప్రారంభించాడు. దుర్యోధనుని మాటలు వినేసరికి ధర్మరాజు కనులు ఎర్రబడ్డాయి. నాగుపాములా బుసలుకొడుతూ క్రోధంతో పెదవులు నాకి కొరుకుతూ కృష్ణునీ, తమ్ములనూ చూస్తూ చేతి నెత్తి ఉలూకునితో ఇలా అన్నాడు. "ఉలూకా! వెళ్ళు - వెళ్లి కృతఘ్నుడూ, వైరపురుషుడూ, దుర్మతీ, కులనాశకుడూ అయిన దుర్యోధనునితో చెప్పు. ఆ పాపి ఎల్లప్పుడూ పాండవులతో కుటిలంగానే ప్రవర్తిస్తాడు. తన శౌర్యంతో విక్రమించి శత్రువులను ఆహ్వానించేవాడు నిర్భయంగా మాట నిలుపుకొంటాడు. వాడే క్షత్రియపురుషుడు. కులాధమా! క్షత్రియుడవై పాపి వయిన నీవు మమ్మల్ని యుద్ధానికి ఆహ్వానిస్తూ మాన్యులను, అమాన్యులనూ ముందుంచుకొని యుద్ధానికి రాకు! నీ పరాక్రమాన్ని ఆధారం చేసుకొని, సేవకుల పరాక్రమం కూడా ఆధారం చేసుకొని పాండవులను యుద్ధానికి ఆహ్వానించు. సర్వథా క్షత్రియుడవుకా! ఇతరుల పరాక్రమాన్ని ఆశ్రయించుకొని శత్రువులను యుద్ధానికి పిలిచేవాడు స్వయంగా శత్రువులను లొంగదీసుకోలేడు, నపుంసకత్వం అంటే అదే! అటువంటి నీవు పరుల పరాక్రమంతో నిన్ను గొప్పగా భావించుకొంటున్నావు. అశక్తుడవైన నీవు మామీద ఎలా గర్జిస్తావు? విరుచుకుపడతావు?"

కృష్ణుడు ఇలా అన్నాడు.- "నామాట కూడా మళ్లీ ఆ దుర్యోధనునికి చెప్పు. రేపే యుద్ధానికి రా! దుర్మతీ! పురుషుడవై ప్రవర్తించు. మూఢా! కృష్ణుడు యుద్ధం చేయడు. పాండవులు అతడిని సారథ్యం చెయ్య మన్నారు. అంతే. అని నీవు భయపడకుండా ఉన్నావు. ఇది పిదపకాలమే కాకపోతే గడ్డిపరకల్ని అగ్నిహోత్రుడు దహించివేసినట్లు నేను ఈ రాజుల నందరినీ క్రోధంతో భస్మంచేసి పారేస్తాను. ధర్మరాజు యొక్క ఆజ్ఞ వలననే యుద్ధం చేసే మహాత్ముడు అర్జునుడికి సారథ్యం చేస్తున్నా నంతే. నీవు ముల్లోకాలకూ ఎగిరిపోయినా, భూమిలోకి దూరిపోయినా సరే తెల్లవారేసరికి నీ ఎదుటనే అర్జునుని రథాన్ని చూసి తీరుతావు. దుశ్శాసనుని రక్తం త్రాగుతానని భీముడన్న మాట జరుగదనుకొంటున్నావు కాని - ఇప్పటికే ఆ పని జరిగిపోయిం దనుకో. ఇలా ప్రతికూలంగా మాట్లాడే నిన్ను అర్జునుడు కాని, ధర్మరాజు కాని, భీముడు కాని, కవలు కాని లెక్కచేయటం లేదు.

163. దుర్యోధనుడు తన సైన్యమును యుద్ధమునకు ఆదేశించుట.

అర్జునుడు దుర్యోధనుడన్న మాట గుర్తు తెచ్చుకొని కనులు ఎర్రనై పైకెత్తి ఉలూకుని చూశాడు. కీర్తిశాలి అయిన అర్జునుడు కృష్ణునివైపు చూసి, చెయ్యి పైకెత్తి, ఉలూకునితో ఇలా అన్నాడు. "తన పరాక్రమాన్ని ఆశ్రయించుకొని శత్రువులను పిలిచి నిర్భయంగా యుద్ధం చేసేవాడే పురుషు డనిపించుకొంటాడు. ఇతరుల పరాక్రమాన్ని ఆశ్రయించి, శత్రువులను ఆహ్వానించేవాడు శక్తిహీనుడవడం వల్ల క్షత్రియాధముడు, పురుషాధముడు అనిపించుకొంటాడు. అటువంటి నీవు ఇతరుల పరాక్రమాన్ని నీపరాక్రమం అనుకొంటున్నావు. మూఢా! నీవు స్వయంగా దుర్మార్గుడవు. నీచుడవు, పైగా ఇతరులను ఆక్షేపిస్తున్నావు. రాజులందరికి మేలు చేసేవాడు, ఇంద్రియ నిగ్రహం కలవాడు, పెద్దవాడు అయిన భీష్మునికి "మరణదీక్ష" నిచ్చి ఇక్కడ గొప్పలు చెపుతున్నావు. దుర్మతీ! కులనాశకా! నీ భావం మాకు తెలిసింది. పాండవులు జాలితో తాతగారిని చంపరని అనుకొంటున్నావు. ఆయనయొక్క పరాక్రమం చూసుకొనే నీవు ప్రగల్భాలు పలుకుతున్నావు. కాని విలుకాండ్రందరూ చూస్తూ ఉండగానే మొట్టమొదట భీష్మునే పడగొడతాను.

ఉలూకా! నీవు వెళ్లి కౌరవులను కలిసి దుర్యోధనునితో చెప్పు. "సవ్యసాచి అయిన అర్జునుడు 'అలాగే' అన్నాడు - తెల్లవారగానే యుద్ధం ప్రారంభం అవుతుంది" అని. మహాశక్తిశాలి, సత్యసంధుడూ అయిన భీష్ముడు కౌరవులకు సంతోషం కలిగిస్తూ చెప్పిన మాట ఉందిగదా! "సృంజయులను శాల్వేయులను చంపే భారం నాది. ద్రోణుడు లేకపోయినా సరే లోక మంతటినీ నేనే సంహరించగలను - నీకు పాండవుల వల్ల భయంలేదు." అని భీష్ముడు అన్నాడుగా! ఆ మాట విని నీకు రాజ్యం వచ్చేసింది అనుకొంటున్నావు. పైగా పాండవులకు ఆపదలు కల్గినట్లే అని అనుకొంటున్నావు. అందుచేత నీవు గర్వంతో నీలోనే దోషం ఉన్నా, నిన్ను నీవు పరిశీలించుకోవటం లేదు. కాబట్టి నీముందే ఆ కురువృద్ధుని ముందుగా చంపుతాను. సూర్యోదయం అయ్యేసరికి సేనలతో ధ్వజాన్ని, రథాన్ని చక్కజేసికొని ఆ భీష్ముని రక్షించుకొనేందుకు సిద్ధంగా ఉండు. మీ సేనా సముద్రానికి ద్వీపం లాంటి ఆ భీష్ముని మీరంతా చూస్తూ ఉండగా రథం నుండి పడగొడతాను. రేపు నా బాణాలతో నిండి ఉన్న భీష్ముని చూశాక దుర్యోధనుడికి తన ప్రజ్ఞావాక్యాలు ఎంతటివో తెలుస్తాయి. తక్కువచూపు ఉన్న అధర్మపరుడు, నిత్యవైరి, పాపబుద్ధి అయిన నీ తమ్ముడు దుశ్శాసనుని గురించి

భీముడు చేసిన ప్రతిజ్ఞ నిజమైందని త్వరలోనే తెలుసుకొంటావు. దుర్యోధనా! నీ దురభిమానానికీ, గర్వానికీ, క్రోధానికీ, కాఠిన్యానికీ, నిష్ఠురత్వానికీ, అహంకారానికీ, ఆత్మస్తుతికీ, క్రూరత్వానికీ, తీక్ష్ణతకూ, ధర్మద్వేషానికీ, అధర్మానికీ, అతివాదానికీ, వృద్ధులను లెక్కచేయకపోవడానికీ, వక్రదృష్టికీ, అవినీతికీ,... అన్నిటికీ తగిన ఫలం త్వరలోనే అనుభవిస్తావు. నరాధమా! కృష్ణునితో కూడి నేను కోపిస్తే నీకింక జీవితాశే ఉండదు. రాజ్యం మీద ఆశ ఎందుకు ఉంటుంది? భీష్ముడూ, ద్రోణుడూ, కర్ణుడూ పడిపోయాక జీవితం మీదా, రాజ్యం మీదా, పుత్రుల మీదా కూడా నిరాశే మిగులుతుంది. భీమసేనుడు నీ తమ్ముళ్లనూ, కొడుకులనూ చంపేశాడని విన్నాక నీ తప్పుడు పనులు గుర్తుకువస్తాయి.

ఉలూకా! మళ్లీ రెండో ప్రతిజ్ఞ చేయవలసిన పనిలేదు. నిజమే చెపుతున్నాను– ఇదంతా జరిగితీరుతుంది." తరువాత ధర్మరాజు కూడా ఉలూకునితో ఇలా అన్నాడు. "ఉలూకా! నీవు వెళ్లి దుర్యోధనునితో నా మాట చెప్పు. సుయోధనా! నీ ప్రవర్తనతో నా ప్రవర్తనను దాటలేవు. మన యిద్దరికీ అసత్యానికీ, సత్యానికీ ఉన్నంత దూరం ఉంది. ఇది నాకు తెలుసు. నేను పురుగులకూ, చీమలకూ కూడా కష్టం కలిగించాలని అనుకోను. అటువంటప్పుడు జ్ఞాతులను చంపుకుందా మనుకుంటానా? అందుకే నేను అయిదు గ్రామాలు అడిగాను - దానిలోని కష్టం ఏమిటో తెలుసుకోలేకపోతున్నావు. అటువంటి నీవు కామంతో నిండిపోయి, మూఢుడవై గొప్పలు చెప్పుకొంటున్నావు. నీకు హితం చెప్పిన కృష్ణుని మాటలు కూడా నీవు వినలేదు. ఇక (అన్నీ అయిపోయాక) ఇపుడు ఎన్నిమాటలు చెపితే మాత్రం ఏ ప్రయోజనం? బంధువులతో కలిసి పోరాడు. ఉలూకా! నాకు అప్రియం చేస్తున్న దుర్యోధనునితో ఇలా చెప్పు. నీ మాటలు వినిపించాయి. అర్థం తెలిసింది. నీ యిష్టం ఏదయితే అదే జరుగుగాక!" తరువాత భీముడు ఉలూకునితో మళ్లీ ఇలా అన్నాడు. "ఉలూకా! దుర్బుద్ధి, పాపి, మూర్ఖుడు, అపకారపరుడు, దురాచారుడూ అయిన దుర్యోధనునితో నా మాట చెప్పు. గ్రద్ద కడుపులో/ (అడవిలోకి పారిపోయి) దాక్కున్నా, హస్తినాపురంలో దాక్కున్నాసరే దుశ్శాసనుని లాక్కువచ్చి యుద్ధంలో చంపి రక్తం త్రాగుతానని చేసిన శపథం నిజమే అవుతుంది. సత్యం మీద ఒట్టువేసి చెపుతున్నాను. దుర్యోధనా! నీ తొడలు విరగగొట్టి చంపి, నీ సోదరు లందరి పాలిట మృత్యువు నవుతాను. కోపంతో

నిండిన నేను రాజపుత్రు లందరికీ సంతోషం చేకూరుస్తాను- ఇంకా నా మాట విను. దుర్యోధనా! నీ సోదరులందరితో నిన్ను చంపి, ధర్మరాజు చూస్తూ ఉండగా నీ తలను కాలితో తన్నుతాను." రాజా! అపుడు నకులుడిలా అన్నాడు. "ఉలూకా! సుయోధనుడికి ఈ మాట చెప్పు. యథాతథంగా చెప్పిన నీమాటలు విన్నాను. నీవు చెప్పినట్లే చేస్తాను." రాజా! అనంతరం సహదేవుడిలా అర్థవంతంగా అన్నాడు. "దుర్యోధనా ! నీవు తలచినది జరుగదులే. రాజా! కుమారులతో, జ్ఞాతులతో, బంధువులతో కలిసి చివరకు నీవే విచారిస్తావు. మా కష్టం చూసి సంతోషిస్తూ ప్రగల్భాలు పలుకుతున్నావుగా!"

అపుడు విరాట ద్రుపదులు ఉలూకునితో ఇలా అన్నారు. "మేము సజ్జనులకు దాసులం. అదే మాశాశ్వత భావన- మేము దాసులమో కామో, ఎవరి పౌరుషం ఎటువంటిదో!" తరువాత శిఖండి ఉలూకునితో ఇలా అన్నాడు. "పాపాసక్తు డయిన దుర్యోధనునికి ఇది చెప్పు. రాజా! దారుణ కర్మ చేస్తున్న నన్ను యుద్ధంలో చూడు. అతడి పరాక్రమంతోనేగా నీవు విజయం కోరుకొంటున్నావు. ఆ పితామహుని నేనే పడగొడతాను. నిజంగా బ్రహ్మ నన్ను భీష్మవధకోసమే సృష్టించాడు. అందుచేత అందరూ చూస్తూ ఉండగా నేనే భీష్ముని పడగొడతాను." ధృష్టద్యుమ్నుడు కూడా ఉలూకునితో ఇలా అన్నాడు. "రాజకుమారుడు దుర్యోధనునితో నామాట చెప్పు. బంధు సేనాసమేతు డయిన ద్రోణుని నేను వధిస్తాను. పూర్వుల చరిత్రను అనుకరించేవాడిని నేను. ఇతరు లెవరూ ఆచరించని రీతిలో నేను పనిచేస్తాను."

ఉలూకునితో ధర్మరాజు కారుణ్యబుద్ధితో మంచిమాటగా ఇలా అన్నాడు. "రాజా! నేను ఎన్నడూ జ్ఞాతుల వధను కోరుకోను. దుర్మతీ! ఇదంతా నీ దోషం వల్లనే జరుగుతోంది అనేది స్పష్టం. నాయనా ఉలూకా! ఆలస్యం చేయకు. ఉండాలంటే ఇక్కడ ఉండు. నీకు మేమూ బంధువులమే. నీకు శుభం కలుగుగాక." రాజా! తరువాత ఉలూకుడు ధర్మరాజును వీడ్కొని దుర్యోధను డున్న చోటికి వెళ్లాడు. ఉలూకుడు వచ్చి క్రోధి అయిన దుర్యోధనునితో అర్జును డన్నమాటలు ఉన్న వున్నట్లు అన్నీ చెప్పాడు. వాసుదేవుడు, భీముడు, ధర్మరాజు పలికిన పౌరుషవాక్యాలూ, నకులుడు, విరాటుడు, ద్రుపదుడు, సహదేవుడు, ధృష్టద్యుమ్న శిఖండులు, కేశవార్జునులు వీరి మాటలూ అన్నీ యథాతథంగా చెప్పాడు. ఉలూకుడు చెప్పిన మాటలు విని దుర్యోధనుడు దుశ్శాసనునికి, కర్ణునికి, శకునికి, ఇతరరాజులకు. తెల్లవారేలోపులో సేనల మోహరింపును

గురించి ఆజ్ఞాపించాడు. కర్ణుని ఆదేశంతో దూతలు రథాలమీద, ఒంటెల మీద, గుర్రాల మీద సేనలను చుట్టివచ్చారు. తెల్లవారకముందే యుద్ధానికి సేనలన్నీ సిద్ధంగా ఉండాలని రాజులందరికీ రాజుగారి ఆజ్ఞను కర్ణశాసనాన్నీ తెలియజేశారు.

164. పాండవసేన యుద్ధమున కేగుట.

ఉలూకుని మాటలు విని, ధర్మరాజు ధృష్టద్యుమ్నుని ముందుంచుకొని సైన్యాన్ని బయలుదేరదీశాడు. పదాతిదళాలు, ఏనుగులు, రథాలు, గుర్రాలు ఇలా చతుర్విధబలాలతో భయంకరమై కదల్చరాని భూమిలాగా ఉన్నది సైన్యం. అది భీమసేనుని రక్షణలో మహారథులయిన అర్జునుడు, ధృష్టద్యుమ్నుడు, వీరికి వశమయి, స్తిమితంగా ఉన్న సముద్రంలా ఉంది. దానిముందు ధనుర్విశారదుడు ధృష్టద్యుమ్నుడు ద్రోణుని వధ కోసం సేనలను నడిపిస్తున్నాడు. వారి వారి బలానికీ, ఉత్సాహానికీ తగినట్లు రథికులను ప్రోత్సహించాడు. అర్జునుని కర్ణుడికోసం, భీముని దుర్యోధనుడి కోసం, ధృష్టకేతుని శల్యుడికోసం, ఉత్తమౌజుని కృపుని కోసం, నకులుని అశ్వత్థామ కోసం, శైబ్యుని కృతవర్మ కోసం, సాత్యకిని సైంధవునికోసం నిలబెట్టాడు. ప్రముఖు డయిన భీష్మునికోసం శిఖండిని నిలిపాడు. శకునికోసం సహదేవుని, శలుని కోసం చేకితానుని, త్రిగర్తులకోసం ఉపపాండవు లయిదుగురినీ ఆజ్ఞాపించాడు. వృషసేనుడికోసం అభిమన్యుని నియమించాడు. శేషులనే రాజులకోసం అతడే చాలు ననుకొన్నాడు ధృష్టద్యుమ్నుడు. అభిమన్యుడు యుద్ధంలో అర్జునుని మించిన వాడని ధృష్టద్యుమ్నుడు భావించాడు. యోధు లందరినీ ఇలా వేర్వేరుగానూ సామూహికంగానూ నియమించి, తనవంతు ద్రోణు డని ధృష్టద్యుమ్నుడు భావించాడు. ధనుర్ధరుడూ, సర్వసేనాపతి అయిన ధృష్టద్యుమ్నుడు యథావిధిగా వ్యూహనిర్మాణం చేసి వారి వారి ప్రదేశాల్లో పాండవ సైన్యాలను నిలిపాడు. పాండవుల విజయం కోసం తాను సైన్యం ముందు నిలిచాడు.

165. భీష్ముడు కౌరవసేనలో రథాతిరథులను నిర్ణయించుట.

ధృతరాష్ట్రుడు అడిగాడు. "సంజయా ! అర్జునుడు యుద్ధభూమిలో భీష్ముని చంపుతానని ప్రతిజ్ఞ చేసినపుడు నా తెలివిమాలిన పుత్రులు దుర్యోధనాదులు ఏం చేశారు? అర్జునుడు మిక్కిలి దృఢమైన ధనుస్సు ధరించినవాడు. అతనికి భగవంతు

డయిన వాసుదేవుడు సహాయకుడు. కాబట్టి భీష్ముడు అర్జునుని చేతిలో చనిపోతాడను కొంటున్నాను. అర్జునుడు చేసిన ప్రతిజ్ఞను విని, అమిత బుద్ధిమంతుడు, యోధులలో శ్రేష్ఠుడు, మహాధనుర్ధరుడు అయిన భీష్ముడు ఏమన్నాడు? కౌరవ వంశభారాన్ని వహించే పరమ బుద్ధిమంతుడు, పరాక్రమవంతుడు అయిన భీష్ముడు సేనాపతి పదవి పొందిన తరువాత ఏంచేశాడు?" తరువాత సంజయుడు అమిత తేజస్వీ, కురువృద్ధుడూ అయిన భీష్ముడు చెప్పిన విషయమంతా ధృతరాష్ట్రునకు చెప్పాడు. సంజయు డన్నాడు. "నరేశ్వరా ! సేనాపతి పదవిని పొందిన భీష్ముడు దుర్యోధనునికి సంతోషం కలిగించేటట్లు ఇలా అన్నాడు. 'రాజా ! చేతితో శక్తి అనే ఆయుధాన్ని ధరించి దేవసేనాపతి అయిన కుమారస్వామికి నమస్కారం చేసి, ఇపుడు మీ సేనకు అధిపతి నవుతాను. దీనిలో సంశయం లేదు. నాకు సేనకు సంబంధించిన జ్ఞానం ఉంది. నేను చాలా రకాల వ్యూహాల నిర్మాణంలో కుశలుడను. నీ సైన్యంలో జీతం తీసుకొనేవారు, జీతం తీసుకొనని మిత్ర సైనికులు ఉన్నారు. వారందరి చేత వారికి యోగ్యమయిన పనిచేయించే కళ కూడా నాకు తెలుసు. మహారాజా ! యుద్ధయాత్ర విషయంలో, యుద్ధ విషయంలో, శత్రువులు వేసిన అస్త్రాలకు ప్రతీకారం చేసే విషయంలో, ప్రయాణం, రథాదులు వీటి విషయంలోను బృహస్పతికి తెలిసినంత విషయం నాకూ తెలుసు. దేవతలు, గంధర్వులు, మానవులు చేసే వ్యూహరచనజ్ఞానం నాకు ఉంది. వాటితో నేను పాండవులను మోహింపచేస్తాను చింతించకు / పరితపించకు. రాజా ! నేను నీ సేనను రక్షిస్తాను. శాస్త్రీయ విధానాన్ననుసరించి యథార్థంగా పాండవులతో యుద్ధం చేస్తాను. కాబట్టి నీ మనోవ్యథ పోవుగాక.' దుర్యోధనుడు చెప్పాడు. 'గంగా నందనా! నేను మీకు సత్యం చెపుతున్నాను. నాకు దేవతలు, అసురులు వీరెవరివల్ల భయం లేదు. ఎదిరించడానికి వీలు కాని మీరు మాకు సేనాపతిగా ఉన్నారు. యుద్ధాన్ని అభినందించే పురుషశ్రేష్ఠుడు ద్రోణాచార్యుడు నా కోసం యుద్ధభూమి యందున్నాడు. ఇంకా నాకు భయ మెలా కలుగుతుంది? పురుషశ్రేష్ఠ లయిన మీరిద్దరు నా విజయం కోసం రణరంగంలో నిలబడి ఉండగా నాకు దేవరాజ్యం లభించడం కూడా దుర్లభమేమీ కాదు. కురుశ్రేష్ఠా! ఇది ధ్రువం. కురునందనా ! మీరు శత్రుపక్షంలోను, మన పక్షంలోను గల రథికుల, అతిరథుల సంఖ్యను పూర్తిగా ఎరుగుదురు. మీ నుండి ఈ విషయం తెలుసుకోవా లనుకొంటున్నాను.

మీరు స్వ పరపక్షాల అన్ని విషయాల జ్ఞానంలో నిపుణులు. నేను, ఈ రాజులందరూ మీ నోట ఈ విషయాలను వినాలని కోరుకొంటున్నాం.

భీష్ముడన్నాడు. 'గాంధారీ కుమారా ! మన సేనలో రథికులను, అతిరథులను వర్ణిస్తాను విను. నీ సేనలో రథికులు వేలు, లక్షలు, కోట్లు ఉన్నారు. వారిలో ముఖ్యమయిన వారి పేర్లు విను. అందరికంటె ముందు దుశ్శాసనుడు మొదలయిన నూరుగురు సహోదరులతో కూడ నీవు గొప్ప ఉదారరథికుడవు. మీరందరూ అస్త్రవిద్య నెరిగినవారు, ఛేదన భేదనాల్లో నిపుణులు. రథం మీద, ఏనుగు మీద కూర్చుని యుద్ధం చేయగలరు. గద, ఈటె, కత్తి, డాలు ప్రయోగించడంలో నిపుణులు. మీరు రథాన్ని నిపుణంగా నడపగలరు. అస్త్రాలతో వేధించగలరు. అస్త్ర విద్య నెరిగినవారు, కార్యభారంలో సమర్థులు. ధనుర్విద్యలో మీరు ద్రోణాచార్యునికి, కృపాచార్యునికి యోగ్య లయిన శిష్యులు. మనస్వులు అయిన ధృతరాష్ట్రకుమారులు పాండవులతో వైరం పెట్టుకుని ఉన్నారు. యుద్ధంలో ఉన్మత్తులయిన వీరు పోరాడే పాంచాలయోధులను రణభూమిలో చంపుతారు.

భరతవంశోత్తమా ! నేను నీ సేనకు ప్రధానసేనా నాయకుడను. కాబట్టి పాండవులకు కష్టం కలిగించి, శత్రువులను సంహరిస్తాను. నేను నా ముఖంతో నా సుగుణాలను చెప్పుకోవడం ఉచితం కాదు. నీవు నన్నెరుగుదువు. శస్త్రధరులలో శ్రేష్ముడు, భోజవంశంవాడైన కృతవర్మ మీ సైన్యంలో అతిరథుడు. ఇతడు యుద్ధంలో నీ అభీష్టార్థాన్ని సిద్ధింపజేస్తాడు. దీనిలో సంశయం లేదు. గొప్ప గొప్ప శస్త్రవేత్తలు కూడా ఇతని నోడించలేరు. ఇతని ఆయుధాలు మిక్కిలి దృఢమైనవి. ఇతడు దూరంలోని లక్ష్యాన్ని కొట్టడంలో సమర్థుడు. దేవరా జయిన ఇంద్రుడు దానవులను సంహరించినట్లు ఇతడు పాండవులసేనను వినాశం చేస్తాడు. మహాధనుర్ధరు డైన మద్రరాజు శల్యుడు కూడా అతిరథుడే. ఆయన ప్రతి యుద్ధంలో భగవంతుడైన శ్రీకృష్ణునితో పోటీపడుతూ ఉంటాడు. అతడు తన మేనల్లుళ్ళయిన నకుల సహదేవులను విడచి, మిగిలిన పాండవ మహారథికు లందరితోను రణరంగంలో యుద్ధం చేస్తాడు. అతడు సముద్రతరంగాల వంటి తన బాణాలతో శత్రుసైనికులను ముంచివేస్తూ యుద్ధం చేస్తాడు. అతడు నీ సైన్యంలో అతిరథుడని నా అభిప్రాయం. సోమదత్తుని కుమారుడు భూరిశ్రవుడు కూడా అస్త్రవిద్యలో పండితుడు, మీ హితాన్ని కోరే సుహృత్తు. అతడు

రథికులలో యూథపతులలో కూడా యూథపతి. నీ శత్రుసైన్యాన్ని సంహారం చేస్తాడు. మహారాజా ! జయద్రథుడు ఇద్దరు రథికులతో సమానమైన వాడని భావిస్తున్నాను. అతడు గొప్ప పరాక్రమవంతుడు, రథికుడు. అతడు కూడా విక్రమించి యుద్ధం చేస్తాడు. ద్రౌపదీహరణ సమయంలో పాండవుల వల్ల ఇతడు చాలా క్లేశాన్ని పొందాడు. జయద్రథుడు ఆ కష్టాన్ని తలచుకొని పాండవులతో యుద్ధం చేస్తాడు. రాజా ! ఆ సమయంలో అతడు కఠిన తపస్సు చేసి, పాండవులతో యుద్ధం చేయడానికి మిక్కిలి దుర్లభ మయిన వరాన్ని పొందాడు. నాయనా ! రథికులలో శ్రేష్ఠ డయిన జయద్రథుడు ఆ పాత వైరాన్ని గుర్తుంచుకొని విడవరాని ప్రాణాలను గూడా విడవటానికి సిద్ధపడి పాండవులతో యుద్ధం చేస్తాడు.'

166. కౌరవ రథాతిరథ సంఖ్యానము - 2.

'కాంభోజదేశరాజు సుదక్షిణు డొక రథికుడు. అతడు నీ కార్యసిద్ధి కోరుతూ రణంలో శత్రువులతో పోరాడుతాడు. రాజోత్తమా ! రథికోత్తము డయిన ఈ కాంభోజరాజు యుద్ధంలో మహేంద్ర సమాన పరాక్రమాన్ని ప్రదర్శించడం కౌరవులందరూ చూస్తారు. ప్రచండవేగంతో శత్రువులను కొట్టే యీ కాంబోజరాజు యొక్క రథికుల సమూహంలో సైనికులు మిడతల దండువలె విస్తారంగా కనబడుతున్నారు. మాహిష్మతీపురంలో నివసించే నీలుడు నీ సైన్యంలో రథికుడు. నీలంరంగు కవచం ధరించి అతడు తన రథసమూహం ద్వారా శత్రుసంహారం చేస్తాడు. కురునందనా ! పూర్వం సహదేవునితో ఇతనికి శత్రుత్వం ఏర్పడింది. రాజా ! ఇతడు నీ కోసం శత్రువులతో యుద్ధం చేస్తాడు. అవంతిదేశ రాజకుమారులు విందుడు, అనువిందుడు అనే ఇరువురూ శ్రేష్ఠ లయిన రథికులు. నాయనా ! యుద్ధ కళలో వారు పండితులు. మిక్కిలి దృఢమయిన బలమూ, పరాక్రమమూ కలవారు. ఈ పురుషశ్రేష్ఠ లిద్దరూ గద, ఈటె, కత్తి, బాణాలతో; చేతులతో విసిరే తోమరాలతో శత్రుసైన్యాన్ని తగుల బెడతారు. మహారాజా ! గజరాజు ఏనుగుల నడుమ క్రీడిస్తూ సంచరిస్తున్నట్లు యుద్ధాభిలాష గల విందానువిందులు రణభూమిలో యమధర్మరాజువలె సంచరిస్తారు. త్రిగర్త దేశీయులైన ఈ అయిదుగురు సోదరులను నేను ఉదారరథికు లనుకొంటున్నాను. విరాటనగరంలో దక్షిణగోగ్రహణానికి వెళ్ళినపుడు యుద్ధసమయంలో, వీరికి నలుగురు పాండవులతో

వైరం కలిగింది. రాజేంద్రా ! ఎత్తయిన తరంగాలు కలిగిన గంగను మొసళ్లు క్షోభింప చేసినట్లుగా, త్రిగర్త దేశానికి చెందిన అయిదుగురు క్షత్రియవీరులు పాండవుల సైన్యాన్ని క్షోభింపచేస్తారు. మహారాజా ! ఈ అయిదుగురు రథికులు సోదరులు. వీరిలో సత్యరథుడు ప్రధానుడు. భారతా ! తెల్లని గుఱాలున్న అర్జునుడు దిగ్విజయ సమయంలో త్రిగర్తులకు అప్రియం చేశాడు. ఆ పాతవైరాన్ని గుర్తుంచుకొని యీ అయిదుగురువీరులు యుద్ధం చేస్తారు. వీరు పాండవులలో గొప్ప గొప్ప మహారథికుల దగ్గరకు వెళ్ళి మహాధనుర్ధారులు, క్షత్రియ శిరోమణులు అయిన వారిని సంహారం చేస్తారు.

నీ కుమారుడయిన లక్ష్మణుడు, దుశ్శాసనుని కుమారుడు, వీరిద్దరూ పురుషశ్రేష్ఠులు. యుద్ధంలో పారిపోరు. తరుణులు, సుకుమారులు అయిన ఈ రాజపుత్రులు మిక్కిలి వేగశాలులు. వీరనేక యుద్ధాల విశేషాల నెరిగిన వారు. వీరన్ని విధాలా సేనానాయకులు కాదగినవారు. కురుశ్రేష్ఠా ! ఈ వీరు లిద్దరూ రథికులు మాత్రమే కాదు. రథికులలో శ్రేష్ఠులు. వీరు క్షత్రియ ధర్మాసక్తులు. యుద్ధంలో బాగా పరాక్రమిస్తారు. మన సైన్యంలో దండధారు డొక రథికుడు. అతడు తన సైన్యం చేత రక్షింపబడుతూ నీ కోసం రణరంగంలో యుద్ధం చేస్తాడు. నాయనా ! గొప్పవేగమూ, పరాక్రమమూ కలిగిన కోసల దేశరాజు బృహద్బలుడు కూడా నా అభిప్రాయంలో రథికుడే. రథికులలో ఇతని స్థానం మిక్కిలి ఉన్నతమైనది. ఇతడు ధృతరాష్ట్ర పుత్రులకు హితం చేసే ఆసక్తి కలవాడు. భయంకర మయిన అస్త్ర శస్త్రాలనూ, గొప్ప ధనుస్సునూ ధరించి, తమ బంధువులకు బాగా సంతోషం కలిగిస్తూ సమరాంగణంలో యుద్ధం చేస్తాడు. రాజా ! శరద్వంతుని కుమారుడైన కృపాచార్యుడు రథయూథపతులకు అధిపతి. అతడు తన ప్రియమయిన ప్రాణాలను లెక్క చేయకుండా నీ శత్రువులను తగులబెట్టగలడు. గౌతమ వంశ మహర్షి ఆచార్య శరద్వంతుని కుమారుడు కృపాచార్యుడు కార్తికేయుని వలె తెల్లుపొదలో ఆవిర్భవించాడు. అతనివలెనే ఈతడూ అజేయుడు. నాయనా ! అనేక విధాల అస్త్రశస్త్రాలనూ, ధనుస్సునూ ధరించి కృపాచార్యుడు చాలాసేనలను అగ్నివలె తగులబెడుతూ రణరంగంలో సంచరిస్తాడు.'

167. కౌరవ రథాతిరథ సంఖ్యానము - 3.

భీష్మ డంటున్నాడు. 'నరేశ్వరా ! మీ మేనమామ శకుని కూడా ఒక రథికుడు. ఇతడు పాండవులతో వైరం పెట్టుకుని యుద్ధం చేస్తాడు. దీనిలో సందేహం లేదు. రణరంగంలో ఎదురుదాడి చేసే శకుని సైన్యం బెదిరింపరానిది. ఈ సేన వాయువేగం కలది. వివిధ ఆకారాలు కల అనేక ఆయుధా లీ సైన్యానికి ఉన్నాయి. మహాధనుర్ధరు డైన ద్రోణకుమారుడు అశ్వత్థామ ధనుర్ధరు లందరి కంటె గొప్పవాడు. అతడు విచిత్రంగా యుద్ధం చేస్తాడు. దృఢమయిన అస్త్రసంపదకల అశ్వత్థామ మహారథుడు. మహారాజా! గాండీవధారి అయిన అర్జునునివలె ఇతని ధనుస్సు నుండి వెలువడిన బాణాలు ఒక దానికొకటి తగులుతూ ముందుకు దూసుకుపోతాయి. రథికులలో శ్రేష్ఠుడైన ఈ వీరపురుషుని మహత్త్వాన్ని లెక్కించడం శక్యం కాదు. ఇతడు అనుకుంటే ముల్లోకాలను దగ్ధం చేయగలడు. ఇతనికి క్రోధమూ, తేజస్సూ, మహర్షులకు యోగ్యమయిన తపస్సూ కూడా ఉన్నాయి. ఇతని బుద్ధి ఉదారం. ద్రోణాచార్యుడు సంపూర్ణంగా దివ్యాస్త్ర జ్ఞానాన్నిచ్చి ఇతనిపై గొప్ప అనుగ్రహం చూపాడు. ఇతనిలో ఒక గొప్పదోషం ఉంది. కాబట్టి ఇతనిని అతిరథుడని కాని, రథికుడని గాని నేను భావించను. ఈ బ్రాహ్మణునికి తన జీవితం చాలా ఇష్టం. ఇత డెప్పుడూ దీర్ఘాయుష్మంతుడు కావాలని కోరతాడు. (ఇదే ఇతని దోషం). రెండు సేనలలో నిజానికి ఇతనితో సమానుడయిన శక్తిశాలి ఎవడూ లేడు. అతడు ఒక్కరథంతో దేవతల సైన్యాన్ని గూడా సంహరించగలడు. దృఢశరీరంకల ఇతడు ఒక్క చఱుపుతో పర్వతాలను సయితం పగులగొట్టగలడు. ఈ వీరునిలో లెక్కించలేనన్ని గుణాలున్నాయి. ఇతడు కొట్టడంలో నేర్పరి. భయంకర తేజస్సు కలవాడు. దండాన్ని ధరించిన యమునితో సమానంగా, సహింపరాకుండా యుద్ధభూమిలో సంచరిస్తాడు. కోపంలో ఇతడు ప్రళయకాలాగ్నితో సమానుడు. ఇతనిది సింహం మెడ. మహాతేజస్వి అయిన అశ్వత్థామ యుద్ధంలో మిగిలిన భాగాన్ని పూర్తిగా శమింపజేస్తాడు.

అశ్వత్థామ తండ్రి ద్రోణాచార్యుడు గొప్ప తేజస్సు కలవాడు. అతడు ముసలివాడైనా నవయువకుల కంటె శ్రేష్ఠుడు. ఈ యుద్ధంలో ఇతడు తన గొప్ప పరాక్రమాన్ని చూపుతాడు. దీనిలో నాకు సంశయం లేదు. సమరభూమిలో ద్రోణాచార్యుడు అగ్ని సమానుడు. అస్త్రాలవేగం అనే వాయు సహాయంతో ఉద్దీప్తుడై, యుధిష్ఠిరుని సేనలను

బూడిద చేయగలడు. నరశ్రేష్ఠ డయిన ద్రోణాచార్యుడు రథయూథపతుల సముదాయానికి యూథపుడు. అతడు నీ హితం కోసం తీవ్ర పరాక్రమాన్ని చూపుతాడు. పట్టాభిషిక్తులయిన రాజు లందరికీ ద్రోణాచార్యుడు వృద్ధ గురువు. ఈయన సృంజయుల వంశాన్ని నాశనం చేస్తాడు. కాని అర్జునుడు ఈయనకు ఎంతో ఇష్టుడు. మహాధనుర్ధరు డయిన ద్రోణాచార్యుని ఆచార్యత్వం అర్జునుని సుగుణాలతో జయింపబడింది. అనాయాసంగా గొప్పకార్యాలను చేసే ద్రోణాచార్యుడు దాన్ని తలచుకొని అర్జునుని ఎప్పుడూ చంపడు. ఆచార్యు డయిన ద్రోణుడు అర్జునుని సుగుణాలను ఎల్లప్పుడూ ప్రశంసిస్తాడు. అతణ్ణి కుమారుని కంటె అధికంగా భావిస్తాడు. ప్రతాపవంతు డయిన ద్రోణాచార్యుడు రణభూమిలో దేవతలూ, గంధర్వులూ, మనుష్యులూ కలిసికట్టుగా వచ్చినా, వారిని ఒక్కడూ దివ్యాస్త్రాల ద్వారా నాశం చేయగలడు.

రాజా ! మీ సైన్యంలో నృపశ్రేష్ఠుడు పౌరవుడు. అతడు నా అభిప్రాయంలో రథికులలో ఉదారుడయిన మహారథుడు. అతడు శత్రుసైన్యంలోని రథికులను పీడించడంలో సమర్థుడు. పౌరవరాజు తన విశాల సైన్యంతో శత్రుసైన్యాన్ని బాగా తపింపజేస్తూ నిప్పు గడ్డిని కాల్చినట్లు పాంచాలురను భస్మం చేస్తాడు. రాజకుమారు డయిన బృహద్బలుడు కూడా రథికుడు. అతని సత్యకీర్తి ప్రపంచంలో విస్తరించింది. అతడు మీ శత్రుసైన్యంలో కాలునితో సమానంగా సంచరిస్తాడు. అతని సైనికులు విచిత్రకవచాలు, అస్త్రశస్త్రాలు ధరించి, మీ శత్రువులను సంహరిస్తూ రణరంగంలో విహరిస్తారు. కర్ణుని కుమారుడు వృషసేనుడు కూడా ఒక శ్రేష్ఠుడైన రథికుడు. ఇతణ్ణి మహారథుడని చెప్పగలం. బలిష్ఠ డయిన వృషసేనుడు మీ శత్రువుల సైన్యాన్ని భస్మం చేస్తాడు. రాజా ! మధువంశంలో పుట్టిన, మహాతేజస్వి జలసంధుడు మీ సేనలో శ్రేష్ఠ డయిన రథికుడు. అతడు యుద్ధంలో నీ కోసం ప్రాణాలు ఇస్తాడు. మహాబాహు వయిన జలసంధుడు రథంపై గాని, ఏనుగు అంబారీ మీద గాని ఉండి యుద్ధం చేయగల నిపుణుడు. ఇతడు రణరంగంలో శత్రుసైన్యాన్ని నాశనంచేస్తూ యుద్ధం చేస్తాడు. మహారాజ ! నృపశ్రేష్ఠ ! నా అభిప్రాయంలో ఇతడు రథికుడు. ఈ మహాయుద్ధంలో నీ కోసం తన సేనతో కూడ ప్రాణత్యాగం చేస్తాడు. ఇతడు రణరంగంలో బాగా పరాక్రమిస్తాడు. విచిత్రంగా యుద్ధం చేస్తాడు. నీ శత్రువులతో నిర్భయంగా సమరం సాగిస్తాడు. బాహ్లీకుడు అతిరథుడైన వీరుడు. రణరంగంలో ఇతడు

యమధర్మరాజుతో సమానుడని భావిస్తాను. ఇతడు యుద్ధానికి వచ్చాక ఎట్టి పరిస్థితుల్లోను వెనుదిరగడు. రాజా! వాయువుతో సమమయిన వేగంతో ఇతడు రణరంగంలో శత్రువులను సంహరిస్తాడు. మహారాజ! యుద్ధంలో రథం మీద అద్భుతంగా విక్రమించడం, శత్రుపక్షంలో రథికులను సంహరించడం చేయగల మీ సేనాపతి సత్యవంతుడు మహారథికుడు. యుద్ధాన్ని చూడడంవల్ల ఏవిధంగాను ఇతనికి భయం కాని దుఃఖం కాని కలుగవు. రథమార్గంలో ఉండే శత్రువులపై నవ్వుతూ దూకుతా డితడు. పురుష శ్రేష్ఠుడయిన సత్యవంతుడు శత్రువులపై గొప్పగా పరాక్రమిస్తాడు. అతడు యుద్ధంలో నీ కోసం సత్పురుషులకు తగిన ఘనకార్యం చేస్తాడు. రాజా! క్రూరకర్ము డయిన రాక్షసరాజు అలంబుషుడు కూడా మహారథుడు. ఇతడు పూర్వవైరాన్ని గుర్తుంచుకొని శత్రు సంహారం చేస్తాడు. రథికు లందరిలో శ్రేష్ఠ డయిన ఇతడు మాయావి. దృఢ మయిన వైరం కల ఇతడు రణరంగంలో నిర్భయంగా సంచరిస్తాడు.ప్రాగ్జ్యోతిషపురానికి రాజయిన భగదత్తుడు గొప్పవీరుడు, ప్రతాపవంతుడు. చేతితో అంకుశం పట్టుకుని ఏనుగును నడిపే వారిలో శ్రేష్ఠుడు. ఇతడు రథయుద్ధంలో కూడా నేర్పరి. రాజా ! పూర్వం ఇతనితో గాండీవధారి అయిన అర్జునునకు యుద్ధం జరిగింది. ఆ రణంలో ఇరువురు తమకు విజయం కోరుతూ చాలా రోజులు యుద్ధం చేశారు. కొన్ని దినాల తరువాత భగదత్తుడు తన స్నేహితు డయిన ఇంద్రుని గౌరవిస్తూ మహాత్ముడు, పాండునందనుడు అయిన అర్జునునితో సంధి చేసుకున్నాడు. భగదత్తుడు ఏనుగు అంబారీ మీద నుండి యుద్ధం చేయడంలో నిపుణుడు. అతడు ఐరావతం మీది ఇంద్రునితో సమానంగా రణరంగంలో నీ శత్రువులతో యుద్ధం చేస్తాడు.'

168. భీష్మ కర్ణ సంవాదము.

భీష్ముడు చెపుతున్నాడు. 'అచలుడు, వృషకుడు కలిసి ఉండే సోదరులు. వారు దుర్ధర్ష లయిన రథికులు. వారు నీ శత్రువులను ధ్వంసం చేస్తారు. వీరు గాంధార దేశ ప్రధాన వీరుల్లో పరాక్రమమూ, బలమూ కలవారు. గట్టి కోపం కలవారు. శత్రువులను కొట్టడంలో నిపుణులు. యువకులు. చూడముచ్చట అయిన వారు. రాజా ! మీ ప్రియ స్నేహితు డయిన కర్ణుడు నిన్ను పాండవులతో యుద్ధం కోసం ప్రోత్సహిస్తాడు. రణరంగంలో క్రూరత్వం చూపుతాడు. బాగా కటువుగా మాట్లాడుతూ

ఆత్మప్రశంస చేసుకొంటాడు. అతడు నీచుడు. ఆ కర్ణుడు నీకు మంత్రి, నాయకుడు, బంధువు. ఆ అభిమానవంతుడు నీ ఆశ్రయాన్ని పొంది, మిక్కిలి ఉన్నతిని పొందాడు. ఈ కర్ణుడు యుద్ధభూమిలో అతిరథుడు, రథికుడు అని చెప్పడానికి యోగ్యుడు కాడు. ఈ మూర్ఖుడు తన సహజ కవచకుండలాలు కోల్పోయాడు. ఇతరుల పట్ల సదా దయతో ఉంటాడు. పరశురాముని శాపంవల్ల, బ్రాహ్మణుని శాపం వల్ల, విజయాన్ని సాధించే ఉపకరణాలు పోవడంవల్ల నాదృష్టిలో కర్ణుడు అర్ధరథుడు. అర్జునునితో ఎదిరించి ఇతడు బ్రతికి బయటపడడు. ఇది విని సర్వశస్త్రధారులలో శ్రేష్ఠుడయిన ద్రోణాచార్యుడు కూడా "మీరు చెప్పేది నిజం. మీ అభిప్రాయం ఎపుడూ మిథ్య కాదు" అన్నాడు. ఇతనికి ప్రత్యేక యుద్ధంలో అభిమానం చాలా ఉంది. కాని ఆ రణాన్నుండి వెనక్కి వెళ్ళిపోవడం కూడా కద్దు. దయగలవాడు, పొరపడేవాడు అయిన కర్ణుడు నా అభిప్రాయంలో అర్ధరథుడే.'

ఇది విని రాధానందనుడయిన కర్ణుడు కన్నులు క్రోధంతో పెద్దవి చేసి చూస్తూ, ముల్లు కర్రతో కొట్టినట్లు మాటలతో పొడుస్తూ, భీష్మునితో ఇలా అన్నాడు. 'తాతా ! నేను నీకే అపకారమూ చేయలేదు. అయినా నేనంటే ద్వేషం చేత ఇదే విధంగా అడుగడుగునా నీ ఇష్టం వచ్చినట్లు నన్ను మాట లనే బాణాలతో పొడుస్తున్నావు. నేను దుర్యోధనుని కారణంగా అదంతా సహిస్తున్నాను. కాని నీవు నన్ను మూర్ఖునితోను, నీచునితోను సమంగా భావిస్తున్నావు. నన్ను అర్ధ రథుడని నీ అభిప్రాయం చెప్పావు. గంగానందనుడు అసత్యం చెప్పడు కాబట్టి లోకం అంతా నిస్సందేహంగా ఈ అభిప్రాయమే నమ్ముతుంది. నీవు కౌరవుల కెప్పుడూ అహితమే చేస్తున్నావు. కాని దుర్యోధనుడు ఈ విషయం గ్రహించడం లేదు. నీవు నా గుణాలను ద్వేషిస్తున్న కారణంగా రాజులకు నాపై విరక్తి కలిగించాలని అనుకొంటున్నావు. ఈ ప్రయత్నం నీవు తప్ప మరెవరు చెయ్యగలరు? ఇపుడు యుద్ధానికి సమయం వచ్చింది. సమానస్థాయి రాజు లొకచోట సమకూడారు. ఈ పరిస్థితిలో పరస్పరం భేదం కలిగించాలని మనపక్షంలో యోధులకు ఉత్సాహం, తేజస్సు నశించేలా మరెవరు చేస్తారు? కేవలం పెద్ద వయస్సు చేత, జుట్టు నెరవడం చేత, ఎక్కువ డబ్బు సంపాదించడం చేత, ఎక్కువ బంధువులుండడం చేత ఏ క్షత్రియుని మహారథునిగా లెక్కించలేము. క్షత్రియజాతిలో

బలం కలవారు అధికులు. బ్రాహ్మణులలో వేదమంత్ర జ్ఞానం అధికంగా కలవారు అధికులు. వైశ్యులలో అధిక ధనం కలవారు, శూద్రులలో ఎక్కువ వయస్సు కలవారు శ్రేష్ఠులు. నీవు రాగద్వేషాలతో నిండినవాడవు. కాబట్టి మోహవశంచేత నీకు తోచినట్లు రథికులను, అతిరథులను విభాగం చేస్తున్నావు.

దుర్యోధనా ! నీవు బాగా విచారించి చూడు. ఈ భీష్ముడు దుష్టభావం కలవాడు. అతడు నీ కపకారం చేస్తున్నాడు. నీ వీతనిని ఇపుడే వదిలివెయ్యి. రాజా ! ఒకసారి సైన్యంలో భేదం కలిగితే మరల కలపడం కష్టం. ఆ స్థితిలో మూలబలంలో సైనికులు కూడా తొలగిపోతారు. వేరు వేరు చోట్ల ఉండే సైనికులు ఒక పని చేయడం కోసం ఒక చోట కలిసిన సందర్భంలో, వారిలో భేదం కలిగితే, వా రాపైన కలవడం చాలా కష్టమని వేరే చెప్పేదేమిటి? ఈ యుద్ధపరిస్థితిలో యోధులలో భేదం పుట్టింది. మన తేజస్సు, ఉత్సాహమూ దెబ్బతింటున్నాయి. విశేషించి మన ఎదుటనే. రథికులను తెలుసుకొనే జ్ఞానం ఎక్కడ ? అల్పబుద్ధి అయిన భీష్ము డెక్కడ ? నేను ఒంటరిగా పాండవుల సైన్యాన్ని అడ్డగిస్తాను. నా బాణం అమోఘం. పెద్దపులిని చూసి ఎద్దులు పారిపోయినట్లు పాండవులూ, ద్రుపదుడూ నన్ను చూసి పది దిక్కులకూ పారిపోతారు. యుద్ధ మెక్కడ ! సంఘర్షణ మెక్కడ ! మంత్రాలోచనలో మంచి మాటలు మాట్లాడట మెక్కడ? వయస్సు చెల్లినవాడు, మందబుద్ధి, కాలంచే ప్రేరేపింపబడిన భీష్ము డెక్కడ? ఇతడు ఒంటరివా డయి ప్రపంచమంతటితోనూ పోటీ పడుతున్నాడు. తన వ్యర్థదృష్టిచేత మరొకణ్ణి ఎవనినీ పురుషునిగా భావించడం లేదు. పెద్దల మాటలు వినాలని శాస్త్రం ఆదేశం గదా ! కాని బాగా వృద్ధుల మాటలు పాటించరాదు. వారిని బాలురుగా భావించాలి. నృపశ్రేష్ఠా! నేనీ యుద్ధంలో ఒక్కడనే పాండవుల సైన్యాన్ని చంపుతాను. కానీ కీర్తి మాత్రం భీష్ముడికి దక్కుతుంది. నరేశ్వరా ! నీ వీ భీష్ముని సేనాపతిగా చేశావు. విజయకీర్తి యీ సేనాపతికే లభిస్తుంది. యోధుల కేవిధంగానూ లభించదు. రాజా ! కాబట్టి భీష్ముడు బ్రతికి ఉండగా నేను ఏ విధంగానూ యుద్ధం చేయను. భీష్ముడు మరణించిన తర్వాత మహారథు లందరితోనూ యుద్ధం చేస్తాను.'

అపుడు భీష్ముడు ఇలా అన్నాడు. 'సూతకుమారా ! ఈ యుద్ధంలో సముద్రమంత పెద్దభారం దుర్యోధనుడిది. అది నా భుజాల మీద కెత్తబడింది. దీని కోసం నేను

చాలా సంవత్సరాల నుండి చింతిస్తున్నాను. మనసుకు సంతాపాన్ని, ఒడలికి గగుర్పాటు కలిగించే ఆ సమయం వచ్చి ఉంది. ఈ సమయంలో నేను పరస్పర భేదాన్ని కలిగించకూడదు. అందుచేత నీవు బ్రతికిపోయావు. సూతపుత్రా ! లేకపోతే నేను వృద్ధు ణ్ణయినా బాలుడ వయిన నీకు యుద్ధ విషయంలో శ్రద్ధను, జీవితంపై ఆసక్తిని ఒకసారే నరికివేసేవాడను. జమదగ్ని కుమారు డయిన పరశురాముడు నా పై పెద్ద పెద్ద అస్త్రాలు ప్రయోగించాడు. అవి కూడా నాకు బాధను కలిగించలేకపోయాయి. నన్ను నీవేం చేయగలవు? నీచ వంశజుడా ! సత్పురుషులు ఎవరూ తమ బలాన్ని పొగడుకోవడం మంచిదని భావించరు. అయినా నీ వ్యవహారం చేత సంతాపాన్ని పొంది, నా గొప్పదనం చెపుతున్నాను. కాశీరాజు జరిపించిన స్వయంవరసభకు భూమండలం లోని రాజులందరూ ఒకచోట చేరారు. నేనొక్కడనే ఒక రథంపై ఉండి, వారందరినీ ఓడించి కాశీరాజు పుత్రికలను శీఘ్రంగా తీసుకువచ్చాను. ఇటువంటివారు, ఇంతకంటే గొప్పవారు అయిన రాజులను, వేలమందినీ, వారి సైన్యాలనూ నేను ఒంటరిగా రణరంగంలో ఓడించాను. నీవు రూపం ధరించిన శత్రుత్వానివి. నీ మూలంగా కురువంశానికి వినాశరూప మయిన గొప్ప అన్యాయం జరుగనుంది. నీ విపుడు కురువంశ రక్షణకు నడుంబిగించి, నీ మగతనం చూపించు. దుర్బుద్ధీ ! నీవు ఎల్లప్పుడూ పోటీపడే అర్జునునితో యుద్ధం చెయ్యి. (నీవీ యుద్ధాన్నుండి తప్పించు కొంటునట్లు నాకు కనబడుతోంది.) తల త్రిప్పడానికి కూడా సమయం దొరకని యీ యుద్ధాన్నుండి నీవు ఎలా తప్పుకుంటావో నేను చూస్తాను.'

తరువాత దుర్యోధనుడు భీష్మునితో ఇలా అన్నాడు "గంగానందనా ! తమరు నన్ను చూడండి. ఇపుడు చాలా గొప్ప పని వచ్చి పడింది. మీరు ఏకాగ్రచిత్తులై నాకు పరమశుభం కలిగే విషయం ఆలోచించండి. మీరూ, కర్ణుడూ ఇద్దరూ నా గొప్పకార్యాన్ని నెరవేర్చండి. ఇపుడు నేను మరల శత్రుపక్షంలో ఉండే రథికుల, అతిరథికుల, రథయూథపతుల పరిచయం వినాలని కోరుతున్నాను. శత్రువుల బలాన్ని బలహీనతను వినాలని నా కోరిక. ఈ రాత్రి తెల్లవారగానే, రేపు ప్రాతఃకాలంలో ఈ యుద్ధం ప్రారంభమవుతుంది గదా !"

169. పాండవ పక్షమున రథాతిరథ సంఖ్యానము.

భీష్ముడు చెప్పాడు. "వీరు నీ పక్షంలో రథికులు, అతిరథులు, అర్ధరథులు. ఇపుడు నీవు పాండవ పక్షంలో రథికులు మొదలయినవారి వర్ణనం విను. పాండవసైన్యం విషయంలో నీ మనస్సులో కుతూహలం ఉంటే ఈ భూపాలురతో కూడా రథికుల సంఖ్య విను. నాయనా ! యుధిష్ఠిరుడు శ్రేష్ఠ డయిన రథికుడు. ఆయన సమరభూమిలో అగ్నితో సమానంగా అన్ని దిక్కులా సంచరిస్తాడు. సందేహం లేదు. భీమసేనుడు ఎనిమిమంది రథికులతో సమానుడు. గదతో, బాణాలతో చేసే యుద్ధంలో అతనితో సమానుడు మరొకడు లేడు. అతనికి పదివేల యేనుగుల బలం ఉంది. బాగా అభిమానవంతుడు. అలౌకిక తేజస్సు కలవాడు. మాద్రి ఇద్దరు కుమారులు అశ్వినీ కుమారులతో సమమైన రూపమూ, తేజస్సూ కలవారు. వారు పురుషశ్రేష్ఠ లయిన రథికులు. ఈ నలుగురు సోదరులూ తమకు కలిగిన గొప్ప కష్టాలను తలచుకొంటూ మీ సైన్యంలో రుద్రునితో సమానంగా సంచరిస్తారు. సందేహం లేదు. మహాత్ము లయిన పాండవు లందరూ సాలవృక్ష స్తంభంవలె ఎత్తయినవారు. ఇతర పురుషులకంటె వారొక జానెడు ఎక్కువ. పాండవు లందరూ సింహం వంటి శరీరమూ, బలమూ కలవారు. నాయనా ! వారందరూ బ్రహ్మచర్యవ్రతాన్ని పాలించారు. సింహ పరాక్రమం కలిగిన పాండవులు తపస్సు, వినయమూ కలవారు. పెద్దపులులవలె అత్యధిక బలం కలవారు. భరతశ్రేష్ఠుడా ! వేగంలో, కొట్టడంలో, యుద్ధంలో, అమానుషశక్తి కలవారు. వారందరూ దిగ్విజయ సమయంలో చాలామంది రాజులను జయించారు. కురునందనా ! వీరి ఆయుధాల, గదల, బాణాల దెబ్బలను ఎవరూ సహించలేరు. వారి ధనుస్సులను ఇతరు లెక్కుపెట్టలేరు. యుద్ధంలో వారి బరువైన గదలను ఇతరులు ఎత్తలేరు. వారి బాణాలను ఇతరులు ప్రయోగించ లేరు. వేగంగా పరుగుపెట్టడం, లక్ష్యాన్ని భేదించడం, తినడం, త్రాగడం, ధూళిలో ఆడడం మొదలయిన వాటి విషయంలో బాల్యంలో కూడా వారు మిమ్మల్ని ఓడించేవారు. ఇప్పుడు సైన్యాన్ని పొంది, వారు మిక్కిలి బలవంతు లయ్యారు. రణంలో వారు మీ సైన్యాన్ని ధ్వంసం చేస్తారు. వారితో నీకు రణరంగంలో ముఖాముఖియుద్ధం కలుగకూడదని నేను కోరుకొంటాను. వారొక్కొక్కరు యుద్ధంలో రాజుల నందరినీ చంపగలరు. రాజేంద్రా! రాజసూయయాగంలో జరిగినదంతా నీ కళ్లతో చూశావు గదా ! ద్యూతక్రీడా సమయంలో ద్రౌపదికి గొప్ప

కష్టం కలిగించడం, పాండవుల గురించి కఠోరంగా మాట్లాడడం అవన్నీ గుర్తుంచుకొని వారు సంగ్రామరంగంలో రుద్రునివలె సంచరిస్తారు.

ఎర్రటికళ్ళు కలిగి నిద్రను జయించిన అర్జునునికి స్నేహితుడు నారాయణుడు. కౌరవ పాండవుల సైన్యాలు రెంటిలోను అర్జునునితో సమానుడైన రథికుడు మరియొకడు లేడు. దేవత లందరిలోను, అసురులలోను, నాగులలోను, రాక్షసులలోను, యక్షులలోను కూడా అర్జునునితో సమానుడు లేడు. మనుష్యులలో ఎలా ఉంటాడు ? భూత భవిష్యకాలాల్లో ఇలాంటి రథికుని గురించి నేను వినను. మహారాజా ! బుద్ధిమంతు డైన అర్జునుని రథం పూన్చబడింది. భగవంతు డైన శ్రీకృష్ణు డతని సారథి. యుద్ధకుశలు డైన ధనంజయుడు రథికుడు. దివ్యమయిన గాండీవం ధనుస్సు. వాయువేగం కలవి గుఱ్ఱాలు. భేదింపరాని దివ్య కవచం, అక్షయ మయిన బాణాలతో నిండినవి రెండు అమ్ములపొదులు. మాహేంద్రం, రౌద్రం, కౌబేరం, యామ్యం, వారుణం అనే అస్త్రాలు అతని రథంలో ఉన్నాయి. భయంకరంగా కనబడే గద కూడా ఉంది. శ్రేష్ఠము లయిన వజ్రాది ఆయుధాలు అతని రథంలో ఉన్నాయి. అర్జునుడు యుద్ధంలో ఒక్క రథంతోనే హిరణ్యపురంలో నివసించే వేల దానవులను సంహరించాడు. అతనితో సమాన రథికు డెవడున్నాడు? బలవంతుడై, సత్యపరాక్రముడై గొప్ప బాహువులు కల అర్జునుడు తన సైన్యాన్ని రక్షించుకొంటూ నీ సైన్యాన్ని కోపంతో సంహరిస్తాడు. నేను కాని, ద్రోణాచార్యుడు గాని, యుద్ధం చేసే ధనంజయుని ఎదిరించగలం. రాజేంద్రా ! బాణవర్షాన్ని కురిపించే అర్జునుని ఎదిరించగల మూడవ వాడెవడూ రెండు సేనల్లోనూ లేడు. గ్రీష్మ ఋతువు చివర ప్రచండ వాయువుచే ప్రేరేపింపబడిన మహామేఘం వలె శ్రీకృష్ణ సహితుడైన అర్జునుడు యుద్ధానికి సిద్ధం అయ్యాడు. అతడు అస్త్రాల నెరిగినవాడు, యువకుడు. మీ పక్షాన మేమిద్దరం వృద్ధులమయ్యాం.'

జనమేజయా! భీష్ముని యీ వచనాలను విని రాజులు పాండవుల మునుపటి బలపరాక్రమాలను గుర్తుకు తెచ్చుకొన్నారు. రాజులు బంగారు భుజకీర్తులతో అలంకరింపబడి చందనం పూసుకున్నవారి భుజాలూ, మనస్సూ కూడా పాండవుల బలపరాక్రమాలను ప్రత్యక్షంగా చూడడం చేత శిథిల మయినట్లు శిథిలమయ్యాయి.

170. పాండవ రథాతిరథ సంఖ్యానము - 2.

భీష్ముడు చెప్పాడు. టమహారాజా ! ద్రౌపదీ కుమారు లయిదుగురూ మహారథికులే. విరాట పుత్రు డయిన ఉత్తరుని గొప్పరథికుడని తలుస్తాను. మహాబాహు వయిన అభిమన్యుడు రథయూథ నాయకులకు గూడ యూథపతి. శత్రువులను నాశం చేసే ఆ వీరుడు సమరభూమిలో అర్జునునితోను, శ్రీకృష్ణునితోను సమానుడు. అతడు అస్త్రవిద్యలో శాస్త్రీయ పద్ధతిలో శిక్షణను పొందాడు. అతడు యుద్ధానికి చెందిన విచిత్ర కళల నెరుగును. దృఢ దీక్షకల మనస్వి అభిమన్యుడు. తన తండ్రి పొందిన కష్టాలను గుర్తుచేసికొని పరాక్రమిస్తాడు. మధువంశంలో పుట్టిన వీరు డయిన సాత్యకి రథయూథ పతులకు గూడ యూథపతి. వృష్ణివంశ వీరులలో సాత్యకి అమర్షశీలం కలవాడు. ఇతడు భయం ఎరగడు. రాజా ! ఉత్తమౌజుని గూడా గొప్ప రథికుడని భావిస్తాను. పరాక్రమవంతు డయిన యుధామన్యువు నా అభిప్రాయంలో శ్రేష్ఠ డయిన రథికుడు. ఇతనికి చాలా వేల రథాలు, ఏనుగులు, గుర్రాలు ఉన్నాయి. ఇతడు యుధిష్ఠిరునకు ప్రియం కలిగించాలనే కోరికతో తన శరీరాన్ని వదిలి అయినా యుద్ధం చేయడానికి సిద్ధంగా ఉన్నాడు. రాజేంద్రా ! వారు పాండవులతో కలిసి మీ సైన్యంలో ప్రవేశించడం కోసం ఒకరినొకరు ఆహ్వానించుకొంటూ అగ్ని వాయువులవలె సంచరిస్తారు.

వృద్ధరాజు లయిన విరాటుడు, ద్రుపదుడు యుద్ధంలో అజేయులు. నరశ్రేష్ఠులు, మహాపరాక్రమవంతులూ అయిన ఆ యిద్దరినీ మహారథులుగా తలుస్తున్నాను. వయస్సు దృష్టిలో ముసలివారైనా వారు క్షత్రియధర్మాన్ని ఆశ్రయించి, వీరులబాటలో ఉండి తమ శక్తి మేరకు యుద్ధప్రయత్నం చేస్తారు. రాజేంద్రా ! వీరిద్దరూ వీర్యం, బలం, శ్రేష్ఠవంశం గల పురుషులతో సమానమైన సదాచారం కలవారు, గొప్ప ధనుర్ధరులు. పాండవులతో బంధుత్వం ఉన్న కారణంగా వారు స్నేహబంధంలో బంధింపబడి ఉన్నారు. కురుశ్రేష్ఠా ! ఏదో కారణం వల్ల తరచుగా మహాబాహువు లయిన మానవులు శూరులుగానో, పిరికివారు గానో అవుతూ ఉంటారు. పరంతపా! దృఢంగా ధనుస్సు ధరించే విరాట ద్రుపదులు వీరమార్గాన్ని మాత్రమే ఆశ్రయించారు. వారు ప్రాణాలను లెక్క చేయకుండా తమ పూర్ణబలంతో మీ సేనతో యథాశక్తిగా యుద్ధం చేస్తారు. వారిద్దరూ యుద్ధంలో మహా భయంకరులు. తమ బంధువుల రక్షణం కోసం ఒక్కొక్క

అక్షౌహిణితో బాగా పరాక్రమిస్తారు. ఆ యిద్దరు నరేశ్వరులూ, తమ పట్ల గల విశ్వాసాన్ని, గౌరవాన్ని రక్షించుకొంటూ యుద్ధభూమిలో ప్రాణాలకు తెగించి గొప్ప యుద్ధం చేస్తారు.'

171. పాండవ రథాతిరథ సంఖ్యానము - 3.

భీష్ముడిలా అన్నాడు. 'రాజా ! పాంచాల రాజయిన ద్రుపదుని కుమారుడు శిఖండి శత్రువుల నగరాలపై విజయాన్ని పొందేవాడు. యుధిష్ఠిరుని సేనలో శిఖండి ఒక ప్రముఖరథికు డని నే ననుకొంటున్నాను. భారతా ! అతడు మీ సేనలో ప్రవేశించి తన పూర్వపు అపకీర్తి పోగొట్టుకొని, మంచి పేరును విస్తరిస్తూ గొప్ప ఉత్సాహంతో యుద్ధం చేస్తాడు. ఇతని వెంట చాలా పాంచాలసైన్యం, ప్రభద్రసైన్యం ఉంది. అత డారథికుల సముహం ద్వారా మహాయుద్ధం చేస్తాడు. పాండవుల సైన్యాని కంతటికీ అధిపతి, ద్రోణాచార్యుని మహారథికశిష్యుడు అయిన ధృష్టద్యుమ్నుడు నా అభిప్రాయంలో అతిరథుడు. పినాక ధనుస్సును ధరించిన భగవంతు డయిన రుద్రుడు ప్రళయకాలంలో కోపించి ప్రజాసంహారం చేసినట్లుగా ఇతడు రణరంగంలో శత్రువులను చంపుతూ యుద్ధం చేస్తాడు. ఇతని దగ్గర దేవసేనతో సమాన మయిన విశాల రథికసేన ఉంది. ఆ సేన చాలా ఉన్నందువల్ల యుద్ధప్రియు లయిన సైనికులు రణంలో అతని సేన సాగరం వంటి దంటారు. రాజేంద్రా ! ధృష్టద్యుమ్నుని కుమారుడు క్షత్రధర్ముడు నా అభిప్రాయంలో అర్ధరథుడు. బాల్యావస్థలో ఉన్నందున అతడు అస్త్ర విద్యలో అధిక పరిశ్రమ చేయలేదు. శిశుపాలుని కుమారుడు చేదిరాజు ధృష్టకేతువు. మహాధనుర్ధరుడు, వీరుడు, యుధిష్ఠిరుని బంధువు, మహారథుడు. భారతా ! ఈ శౌర్యసంపన్ను డయిన చేదిరాజు తమ పుత్రులతో కూడా వచ్చి మహారథికులకు సహజమైన పరాక్రమం చూపి యుద్ధం చేస్తాడు.

రాజేంద్రా ! శత్రునగరాలను జయించే క్షత్రియ ధర్మపరాయణుడు క్షత్రదేవుడు. నా అభిప్రాయంలో పాండవసైన్యంలో ఒక శ్రేష్ఠరథికుడు. జయంతుడు, అమితౌజుడు, మహారథుడయిన సత్యజిత్తు వీరందరూ పాంచాలురలో శ్రేష్ఠులు, మహాత్ములు, మహా రథికులు. నాయనా ! వీరు అందరూ కోపంతో నిండిన గజరాజుల్లా రణరంగంలో యుద్ధం చేస్తారు. పాండవుల కోసం గొప్ప పరాక్రమం చూపేవారు, బలవంతులు,

శూరవీరులూ అయిన అజుడు, భోజుడు మహారథికులు. వారు సంపూర్ణ శక్తితో యుద్ధం చేస్తారు. వేగంగా అస్త్రాల్ని ప్రయోగిస్తూ, విచిత్రంగా యుద్ధం చేసే సమరంలో నిపుణులు, దృఢపరాక్రమం కలవారు, అయిదుగురు కేకయ రాజకుమారులు. వారందరూ గొప్ప రథికులు. వారందరి జెండాలు ఎర్రనివి. సుకుమారుడు, కాశికుడు, నీలుడు, సూర్యదత్తుడు, శంఖుడు, మదిరాశ్వుడు వీరందరూ ఉదారు లయిన రథికులు. యుద్ధం వీరి కందరికీ శౌర్యాన్ని సూచించే లక్షణం. వీరందరూ అన్ని అస్త్రాలను ఎరిగిన వారు. మహా మనస్వులు అని నేను భావిస్తున్నాను. వార్ధక్షేమి మహారథికు డని నే ననుకొంటున్నాను. చిత్రాయుధరాజు నా అభిప్రాయంలో శ్రేష్ఠరథికుడు. చిత్రాయుధుడు సంగ్రామంలో శోభించేవాడు, అర్జునుని పట్ల భక్తి భావం కలవాడు. చేకితానుడు, సత్యధృతి ఈ పురుషశ్రేష్ఠులు పాండవ సైన్యంలో మహారథికులు. నేను వీరిని శ్రేష్ఠరథికులని భావిస్తాను. వ్యాఘ్రదత్తుడు, చంద్రసేనుడు అనే యిద్దరు రాజులూ నా అభిప్రాయంలో పాండవసేనలో శ్రేష్ఠరథికులు. సంశయం లేదు.

రాజేంద్రా! సేనాబిందురాజు రెండవ పేరు క్రోధహంత. ప్రభూ ! అతడు భగవంతు డయిన శ్రీకృష్ణునితో, భీమసేనునితో సమానుడు. అతడు రణరంగంలో పరాక్రమించి నీ సైన్యంతో యుద్ధం చేస్తాడు. నీవు నన్ను, ద్రోణాచార్యుని, కృపాచార్యుని ఎలా భావిస్తావో అలా భావించదగినవాడు కాశిరాజు. అతడు రణంలో చాలా వేగంగా అస్త్ర శస్త్రాలను ప్రయోగిస్తాడు. ప్రశంసింపదగిన వాడు, ఉత్తమ రథికుడు, నరశ్రేష్ఠుడు. శత్రునగరాలను జయించే సమయంలో కాశీరాజు నా దృష్టిలో రథికుడు. కాని యుద్ధంలో విక్రమించే సమయంలో అతడు ఎనమండుగురు రథికులతో సమానుడు. ద్రుపదుని కుమారుడు సత్యజిత్తు యువకుడు. అత డెప్పుడూ యుద్ధాన్ని కోరుతాడు. అతడు ధృష్టద్యుమ్నునితో సమానంగా అతిరథత్వం పొందదగిన వాడు. అతడు పాండవుల యశస్సును కోరి గొప్ప యుద్ధం చేస్తాడు. పాండవ పక్షభారం వహించేవాడు, మహాపరాక్రమ వంతుడూ అయిన పాండ్యరా జొక మహారథుడు. పాండవుల యెడ అనురాగం కల యితడు శూరుడు. దృఢమైన పెద్దవిల్లు దాల్చిన ఇతడు పాండవసేనలో గౌరవింపదగిన మహారథికుడు. కౌరవశ్రేష్ఠ ! శ్రేణిమంతుడు, వసుదానుడు ఇద్దరూ అతిరథు లయిన వీరులు. వీరు శత్రు పట్టణాలను జయించడంలో సమర్థులు.'

172. పాండవ రథాతిరథ సంఖ్యానము - 4.

భీష్ముడు చెప్పాడు. 'మహారాజా ! పాండవపక్షంలో రోచమానుడు మహారథుడు. అతడు యుద్ధరంగంలో శత్రుసేనలతో దేవతల వలె యుద్ధం చేస్తాడు. కుంతిభోజకుమారుడు పురుజిత్తు భీమసేనునకు మేనమామ. అతడు గొప్ప విల్లు కలవాడు. మిక్కిలి బలవంతుడు. నేనతనిని అతిరథు డని భావిస్తాను. ఇతని ధనుస్సు గొప్పది. అస్త్ర విద్యలో పండితుడు, యుద్ధ నిపుణుడు, రథికులలో శ్రేష్ఠుడు, శక్తిశాలి అయిన ఈ వీరుడు విచిత్ర యుద్ధం చేస్తాడు. ఇంద్రుడు పరాక్రమించి దానవులతో యుద్ధం చేసినట్లు ఇతడు శత్రువులతో సమరం చేస్తాడు. ఇతని సైనికులు కూడా యుద్ధవిద్యలో నిపుణులు, ప్రఖ్యాతులు. వీరుడైన పురుజిత్తు పాండవులకు ప్రియాన్ని, హితాన్ని కలిగించడంలో తత్పరుడు. అతడు మేనల్లుని కోసం రణరంగంలో గొప్ప యుద్ధం చేస్తాడు. హిడింబా భీమసేనుల కుమారుడు ఘటోత్కచుడు గొప్ప మాయలు కలవాడు. నా అభిప్రాయంలో అతడు రథయూథాధిపతుల కంటె యూథపతి. అతనికి యుద్ధం చాలా ఇష్టం. నాయనా ! మాయావి అయిన ఆ రాక్షసుడు సమరభూమిలో ఉత్సాహంతో యుద్ధం చేస్తాడు. అతని వెంట వీరులయిన రాక్షసులు సచివులుగా ఉన్నారు. వారందరూ అతని వశంలో ఉంటారు. వీరు, అనేక జనపదాలకు అధిపతులయిన ఇతర క్షత్రియ వీరులు, వీరందరూ శ్రీకృష్ణునితో కూడి పాండునందనుడయిన ధర్మరాజు కోసం ఒక చోట సమకూడారు. రాజా! మహోత్ముడు, పాండునందనుడు అయిన యుధిష్ఠిరునికి సంబంధించిన ముఖ్య రథికులు, అతిరథులు, అర్ధరథులు వీరు. నరేశ్వరా! దేవరాజయిన ఇంద్రునితో సమానమయిన తేజస్వి అర్జునుని ద్వారా సురక్షిత మయిన యుధిష్ఠిరుని భయంకర మయిన సేనను సమరభూమిలో పై వీరులు నడిపిస్తారు.

వీరా ! నేను మీ పక్షాన రణభూమిలో మాయావేత్తలు, విజయాభిలాషులు అయిన ఆ పాండవవీరులతో నీకు విజయమో, నాకు వీరమరణమో కోరుతూ యుద్ధం చేస్తాను. శ్రీకృష్ణుడు, అర్జునుడు రథికులలో శ్రేష్ఠులు. శ్రీ కృష్ణుడు చక్రం, అర్జునుడు గాండీవం ధరిస్తారు. వారు సంధ్యాకాలంలో సూర్యచంద్రుల వలె పరస్పరం కలిసి యుద్ధానికి వస్తారు. ఆ సమయంలో నేను వారిని ఎదిరిస్తాను. పాండుపుత్రుడయిన యుధిష్ఠిరుని పక్షంలో ఉన్న శ్రేష్ఠరథిక యోధులను, వారి సేనలను రణాగ్రాన

ఎదిరిస్తాను. భారతా ! అర్జునుడు, శ్రీకృష్ణుడు, ఇంకా ఇతర రాజులు ఇలా నాకు కనబడిన వారినందరినీ ముందుకు రాకుండా నిరోధిస్తాను. కాని పాంచాల రాజకుమారుడయిన శిఖండి రణంలో వింటికి బాణాన్ని సంధించి, నన్ను ఎదిరించడం చూస్తే నేనతనిని కొట్టను. నా తండ్రికి ప్రీతి కలిగించడం కోసం నాకు లభించిన రాజ్యాన్ని వదిలి, నేను బ్రహ్మచర్య వ్రతాన్ని పాటించడం లోకమెరుగును. కౌరవుల రాజ్యానికి చిత్రాంగదుని అధిపతిగా పట్టాభిషేకం చేశాను. బాలకుడైన విచిత్రవీర్యుని యువరాజుగా అభిషేకించాను. రాజులందరిలో దేవవ్రతునిగా ప్రఖ్యాతిని పొంది, నేనెప్పుడూ స్త్రీని గాని, ముందు స్త్రీగా ఉండి, తరువాత పురుషునిగా మారిన వానిని గాని చంపను. రాజా ! అతడు మొదట స్త్రీగా పుట్టాడు. ఇలా ముందు కన్యగా ఉండి, తరువాత పురుషునిగా అయ్యాడు. ఈ విషయం నీవు విని ఉంటావు. కాబట్టి ఇతనితో నేను యుద్ధం చేయను. నా ఎదుటపడిన ఇతర రాజులందరినీ నేను చంపుతాను. కుంతీ కుమారులను మాత్రం చంపను.'

173. భీష్ముడు కాశీరాజు దుహితలను అపహరించి తెచ్చుట.

దుర్యోధనుడు అడిగాడు - 'భరతశ్రేష్ఠుడా! శిఖండి యుద్ధంలో విల్లెక్కుపెట్టి ఆతతాయిలా నిన్ను చంపాలనుకొని వస్తూంటే చూసి కూడా, నీవు అతడిని ఎందుకు చంపలేవు? పితామహా! సోమకులతో సహితంగా పాంచాలుర నందరినీ చంపుతానని పూర్వం చెప్పి ఉన్నావు కదా! మరి శిఖండిని ఎందుకు చంపలేవో నాకు చెప్పు.' అన్నాడు.

భీష్ముడు ఇలా చెప్పాడు. 'దుర్యోధనా! యుద్ధంలో నన్నెదిరించడానికి వచ్చిన శిఖండిని చూసి కూడా నేను ఎందుకు చంపలేనో, ఆ కథ చెప్తాను. ఈ రాజులందరితో కలిసి విను. ధర్మాత్ముడు, లోకవిఖ్యాతుడు అయిన నా తండ్రి శంతనుడు, మరణించాడు. అప్పుడు నేను నా ప్రతిజ్ఞను నిలబెట్టుకొంటూ తమ్ముడైన చిత్రాంగదుని మహారాజుగా పట్టాభిషిక్తుని చేశాను. అతడు కూడా చనిపోవడంతో తల్లిగారైన సత్యవతి యొక్క సమ్మతితో విచిత్రవీర్యుని శాస్త్రోక్తంగా రాజుగా అభిషిక్తుని చేశాను. రాజేంద్రా! చిన్నవా డైనప్పటికీ నా చేత పట్టాభిషిక్తుడయిన ధర్మాత్ముడు ఆ విచిత్రవీర్యుడు. ధర్మానుసారంగా నా సమ్మతితోనే రాజకార్యాలను చక్కబెట్టేవాడు. నాయనా! అప్పుడు

నేను అనుకూలమైన యోగ్యమైన వంశంనుండి కన్యను తెచ్చి అతనికి వివాహం చేయాలని నిశ్చయించుకొన్నాను. ఆ రోజుల్లోనే - సాటిలేని సౌందర్యం కల కాశీరాజు కూతుళ్లు ముగ్గురు స్వయంవరానికి సిద్ధంగా ఉన్నారని విన్నాను. వారే అంబ, అంబిక, అంబాలికలు. రాజేంద్రా! ఆ స్వయంవరానికి భూమండలంలోని రాజు లందరినీ పిలిచారు. అంబ అందరికంటె పెద్దది. అంబిక మధ్యది. అంబాలిక అందరికంటె చిన్నది. పిలుపు అందుకొని నేను ఒంటరిగా రథం మీద కాశీరాజు పట్టణానికి వెళ్లి, చక్కగా అలంకరింపబడిన ఆ ముగ్గురు కన్యలను చూశాను. అంతే కాదు, ఆహ్వానంపై అక్కడికి విచ్చేసి ఉన్న క్షత్రియులను, నృపులను కూడా చూశాను. భరతశ్రేష్ఠుడా! తరువాత నేను యుద్ధంకోసం నిలిచిఉన్న ఆ రాజులందరినీ హెచ్చరించి, ఆ ముగ్గురు కన్యలను నా రథం మీదకు ఎక్కించాను. ఆ ముగ్గురు కన్యలు పరాక్రమమే శుల్కంగా కలవారని తెలిసికొని అక్కడకు చేరిన సమస్త రాజులను ఉద్దేశించి, నేను "రాజశ్రేష్ఠులారా! శంతనుని కుమారుడైన భీష్ముడు ఈ రాజకన్యలను అపహరించుకు పోతున్నాడు." అని వారికి పదే పదే చెప్పాను. అప్పుడు ఆ రాజు లందరూ కోపంతో ఆయుధాలు అందుకుని విరుచుకుపడుతూ, తమ తమ సారథులకు రథాలను సిద్ధం చేయమని ఆజ్ఞాపించారు. ఆ విధంగా కోపించిన రాజు లందరూ ఏనుగుల వంటి రథాల మీద, గజాలమీద, బలిష్ఠమైన గుర్రాలమీద ఎక్కి, శస్త్రాస్త్రాలు ధరించి, నామీద దాడికి దిగారు. అందులో గజయోధులే ఎక్కువగా ఉన్నారు. రాజా! అప్పుడు ఆ రాజు లందరూ నన్ను అన్ని వైపులనుండి చుట్టుముట్టారు. నేను కూడా వారిని బాణవర్షంతో అన్నివైపుల ముంచెత్తాను. దేవేంద్రుడు దానవులను వలె ఆ రాజు లందరినీ ఓడించాను. నా హస్తలాఘవాన్ని గమనించి, వారంతా వెనుతిరిగి పారిపోయారు. వారంతా తలలు వంచి, నన్ను ప్రశంసించారు. ఓడిపోయిన రాజు లందరినీ అక్కడే వదిలి, ఆ కన్యలను తీసుకుని హస్తినాపురానికి వచ్చాను. అప్పుడు నేను ఆ కన్యలను నా తమ్ముడితో వివాహంకోసం సత్యవతీ దేవికి అప్పగించి, ఆ నా యుద్ధవిషయాలను కూడా ఆమెకు చెప్పాను.'

174. అంబ సాళ్వుని కడకు వెళ్లుటకు భీష్ముని అనుమతి కోరుట.

'అనంతరం నేను వీరమాత అయిన తల్లి దగ్గరకు వెళ్లి ఆమె పాదాలకు మ్రొక్కి ఇలా చెప్పాను. అమ్మా! వీళ్లు కాశీరాజు కూతుళ్లు. పరాక్రమమే వీరికి

శుల్కం. కనుక నేను సమస్తరాజులను జయించి విచిత్రవీర్యుడి కోసం వీళ్లను తెచ్చాను. ఆ మాటలు విన్న సత్యవతికి ఆనందంతో కళ్లు చెమర్చాయి. నా శిరసు మూర్కొని హర్షంతో "నాయనా! నా అదృష్టవశాత్తు నీవు విజయుడవై వచ్చావు" అన్నది. సత్యవతి యొక్క అనుమతితో వివాహం జరుగ బోతూ ఉండగా, కాశిరాజు పెద్దకూతురు అంబ సిగ్గుతో నాతో ఇలా అంది. "నీవు ధర్మజ్ఞుడవు. సర్వశాస్త్ర విశారదుడవు. నేను చెప్పబోయే మాట విని నాకు ధర్మం చేస్తావని ఆశిస్తున్నాను. నేను సాల్వపతిని ఇంతకుముందే మనసారా భర్తగా వరించాను. అతడు కూడా నన్ను వరించాడు. ఇది నా తండ్రికి తెలియదు.

నేను ఇతరుని కోరుకొన్నదానిని. విశేషించి కురువంశంలో పుట్టిన నీవు రాజధర్మాన్ని ఉల్లంఘించి నన్ను ఇంట్లో ఎలా నిలుపుకొంటావు? భరతశ్రేష్ఠా! బుద్ధితో, మనసుతో ఈ విషయమై బాగా ఆలోచించి, నీవు ఉచిత మయిన దానిని చెయ్యి. సాల్వరాజు నా కోసం తప్పక ఎదురుచూస్తూ ఉంటాడు. కాబట్టి అతనిదగ్గరకు వెళ్లడానికి నన్ను అనుమతించు. వీరా! నామీద దయచూపు. ఈ భూమిమీద నీవు సత్యవ్రతుడ వని విని ఉన్నాను."

175. అంబ సాళ్వునిచే తిరస్కరింపబడి తపోవనమునకు చేరుట.

అప్పుడు తల్లివద్ద నేను అనుమతి తీసుకుని, మంత్రులు, ఋత్విజులు, పురోహితులను కూడా అడిగి అంబను వెళ్ళటానికి అనుమతించాను. అంబ సాల్వరాజు యొక్క పట్టణానికి బ్రాహ్మణుల సంరక్షణలో బయల్దేరింది. ఆమె దాది కూడా ఆమెను అనుసరించింది. ఆమె సాళ్వుని చేరి "మహామతీ! మహాబాహూ! నీ గురించే వచ్చేశాను

(రాజా! ఎప్పుడూ నీకు మేలు, ప్రియం కలగాలని కోరుకొనే నన్ను అభినందించు. ధర్మం కోసం ధర్మానుసారంగా నన్ను భార్యగా స్వీకరించు. నిన్నే ఎప్పుడూ మనసులో ధ్యానిస్తూ ఉంటాను. నీవు కూడా ఏకాంతంలో వివాహప్రస్తావన చేశావు.")

రాజా! అంబ మాటలు విన్న సాళ్వుడు నవ్వు తెచ్చిపెట్టుకుని "సుందరీ! ఇంతకు ముందే పరాయిదానివైన నిన్ను భార్యగా స్వీకరించడం నాకిష్టం లేదు తిరిగి అక్కడికే ఆ భీష్ముడి వద్దకు వెళ్లు. భీష్ముడు నిన్ను బలవంతంగా పట్టుకొన్నాడు. నిన్ను నేను భార్యగా స్వీకరించడానికి ఇష్టపడను. భీష్ముడు ఆ మహాయుద్ధంలో

రాజులందరినీ జయించి నిన్ను తనతో తీసుకుపోయాడు. ఆ సమయంలో నీవు కూడా సంతోషంగానే ఉన్నావు. పూర్వమే నీవు ఇతరుల సొత్తు అయిపోయావు - ఇక నాకు భార్య అక్కరలేదు. అన్ని విషయాలూ తెలిసి ఇతరులకు ధర్మాన్ని బోధించే నావంటి రాజు పరాయి స్త్రీకి ఎలా చోటు ఇస్తాడు ? నీయిష్టం వచ్చిన చోటికి వెళ్లు. ఇక్కడ సమయాన్ని వ్యర్థం చేసుకోకు." అంటూ తిరస్కరించాడు.

ఆ మాటలు విన్న అంబ మన్మథతాపంతో (ప్రేమచంపుకోలేక) సాళ్వరాజుతో ఇలా అంది. "రాజా! అలా అనకు. అలా ఎప్పటికీ జరగదు. నేను భీష్ముడితో ఆనందంగా వెళ్లలేదు. అతడు రాజు లందరినీ పారద్రోలి, ఏడుస్తున్న నన్ను బలవంతంగా తీసుకువెళ్లాడు. ఏ తప్పూ చేయని బాలికను. నన్ను స్వీకరించు. నీ పట్ల అనురాగం కలదానిని. భక్తులను విడిచిపెట్టడం మంచిదని ఏ ధర్మమూ చెప్పదు. యుద్ధంలో ఎప్పుడూ వెన్నుచూపని భీష్ముడిని అడిగి, అతని అనుమతితోనే నేనిప్పుడిక్కడికి ఎంతో ఆశగా వచ్చాను. ఆ భీష్ముడు నన్ను కోరుకోలేదు. అతని ఈ ప్రయత్నమంతా తన తమ్మునికోసం అని విన్నాను. నా చెల్లెళ్లు అంబిక, అంబాలికలను తన తమ్ము డైన విచిత్రవీర్యునికి ఇచ్చి పెళ్లి చేశాడు. సాళ్వరాజా! నేను నా మీద ఒట్టువేసి చెపుతున్నాను. నిన్ను తప్ప ఇతరుని ఎవరినీ భర్తగా ఎప్పుడూ నేను ధ్యానించలేదు. (మనసులో ఊహించలేదు). రాజేంద్రా! నామీద ఇంతవరకు ఎవరికీ అధికారం లేదు. (నేను ఎవరికీ వశం కాలేదు) మొదటినుండీ ఇష్టపూర్వకంగా నిన్నే చేరాను. నేను నిజం చెప్తున్నాను. ఆ నిజాన్ని నా శరీరం మీద ఒట్టువేసి మరీ చెప్తున్నాను. నేను ఈ క్షణం వరకు ఇతరుని ఎవరినీ కూడా భర్తగా భావించలేదు. నీదయకోసమే కోరుకొంటున్నాను. స్వయంగా నిన్ను చేరిన కన్యనైన నన్ను భార్యగా స్వీకరించు, ఈ రీతిగా నచ్చచెప్తూ వేడుకొంటూ ఉన్న కాశీరాజు కూతురు అంబను సాళ్వుడు పనికిరాని కుబుసాన్ని పాము విడిచినట్లుగా విడిచిపెట్టేశాడు.

అప్పుడు ఆ అంబ కోపంతో, దుఃఖంతో, నీళ్లు నిండిన కళ్లతో, బొంగురుపోయిన గొంతుతో ఇలా అంది. 'రాజా! నేను చెప్పినది సత్యమూ, శాశ్వతమూ అయితే నీచేత వదిలివేయబడిన నేను ఎక్కడెక్కడ తిరుగుతానో అక్కడక్కడ సాధువులందరూ నాకు రక్షకు లవుదురుగాక!' దీనంగా విలపిస్తూ మాట్లాడుతున్న కన్య అయిన అంబను అప్పుడు సాళ్వపతి పూర్తిగా విడిచిపెట్టేశాడు. "వెళ్లు, వెళ్లు, భీష్ముని వల్ల భయపడుతున్నాను.

భీష్ముడు నిన్ను పరిగ్రహించాడు" - అని సాళ్వుడు ఆమెతో పదేపదే అన్నాడు. దూరదృష్టిలేని సాళ్వుడు ఇలా అనగానే అంబ దీనురాలై ఏడుస్తూ ఆ పట్టణంనుండి బయలుదేరింది. ఆ నగరాన్నుండి దుఃఖితురాలై తిరిగివెళ్తూ అంబ తన మనసులో "నాలా ఇంత సంకటస్థితిలో పడిన యువతు లెవరూ ప్రపంచంలో ఉండరు. బంధువులకు ఇంతకుముందే దూరమయ్యాను. సాళ్వుడు కూడా నన్ను నిరాకరించాడు. తిరిగి హస్తినాపురానికి వెళ్లలేను. ఎందుకంటే సాళ్వునిపై నాకుగల ప్రేమను కారణంగా చూపి, భీష్ముని అనుమతి తీసుకుని అక్కడినుండి వచ్చాను. ఇప్పుడు నన్ను నేను నిందించుకోనా? లేక యుద్ధంలో గెలుపు పొందిన వీరుడైన భీష్ముడిని నిందించనా? లేక నాకు స్వయంవరం ప్రకటించిన మూఢుడైన మా తండ్రిని నిందించనా? అసలు ఆనాడు దారుణమైన యుద్ధం జరుగుతూంటే సాళ్వుడికోసం భీష్ముని రథం నుండి దూకి వేయకపోవడమే నేను చేసిన పెద్ద తప్పు. ఆ తప్పుకు ఫలితంగానే ఇప్పుడు మూడురాలిలాగా ఆపదలో చిక్కుకున్నాను. పరాక్రమం శుల్కంగా నిర్ణయించి నన్ను ఒక బజారు స్త్రీలాగ (వేశ్యవలె) జనుల మధ్యలోకి నెట్టిన మందబుద్ధి, వివేక శూన్యుడు అయిన నా తండ్రికీ, భీష్మునికీ కూడా బుద్ధి లేదు. నాకూ బుద్ధిలేదు. సాళ్వరాజుకూ బుద్ధిలేదు. ఎవరి దుర్నయంతో ఇంత గొప్ప ఆపదలో చిక్కుకున్నానో ఆ విధికి అసలే బుద్ధిలేదు. మానవుడు తన అదృష్టంలో ఉన్నదానినే పొందుతాడు. అయినా నాకు జరిగిన ఈ అన్యాయానికి శంతనుపుత్రుడైన భీష్ముడే ముఖ్య కారణం. కాబట్టి ఈ సమయంలో తపస్సు చేసి కాని, యుద్ధం చేసి కాని భీష్మునిపై ప్రతీకారం తీర్చుకోవడమే ఉచితంగా కనిపిస్తోంది. అతడే నా ఈ దుఃఖానికి ప్రధాన కారకుడు. యుద్ధంలో భీష్ముని జయించడానికి ఉత్సాహం చూపే రాజు ఎవరున్నారు?" అని ఆలోచించుకొంటూ ఆమె నగరం వెలుపలికి వచ్చింది.

ఆమె అలా పుణ్యాత్ములై మహాత్ములైన ముసుల ఆశ్రమానికి వెళ్లి ఆ రాత్రి అక్కడ గడిపింది. అక్కడి ముసు లందరూ చేరి ఆమెను కాపాడారు. ఆ అంబ తనపట్ల జరిగిన వృత్తాంతాన్ని యావత్తూ, భీష్ముడు తన్ను ఎలా అపహరించాడో, అతని నుండి ఎలా విముక్తి కలిగిందో, తరువాత సాళ్వుడు తన్ను ఎలా వదిలిపెట్టాడో, అంతా సవిస్తరంగా వారికి చెప్పింది. ఆ ఆశ్రమంలో శాస్త్రాలలోను, ఉపనిషత్తులలోను గురువై ఉన్న శైఖావత్యుడనే ఒక తపోవృద్ధుడు ఉన్నాడు. అతడు కఠోరవ్రత నియమాలు

ఆచరించే బ్రాహ్మణుడు. మహాతపస్వి అయిన ఆ శైఖావత్యముని ఆర్తురాలై, ఉన్న ఆ బాలికతో ఇలా అన్నాడు. 'పూజ్యురాలా! ఈ స్థితిలో ఆశ్రమ వాసులై, తపస్సు చేసుకునే మహాత్ములైన ఈ మునులు నీకు ఏమి సహాయం చేయగలుగుతారు?' అన్నాడు. అప్పుడు అంబ ఇలా అంది. "నా మీద దయ చూపండి. నేను సన్యాసం తీసుకోవా లనుకొంటున్నాను. ఇక్కడ ఉండి దుష్కరమైన తపస్సు చేస్తాను. పూర్వజన్మలో మూఢురాలైన నేను చేసిన పాపకృత్యాలకు ఫలితమే నిశ్చయంగా ఇది. మునులారా! సాళ్వుడు నిరాకరించి తిరస్కరించడంతో ఆనందం కోల్పోయిన నాకు తిరిగి మా వాళ్ల దగ్గరికి వెళ్లడం ఇష్టం లేదు. తాపసులారా! దేవ సమానులైన మిమ్మల్ని నాకు తపోదీక్ష ఇవ్వమని వేడుకొంటున్నాను. నామీద దయ చూపండి." అపుడు శైఖావత్యముని లోకంలో దృష్టాంతాలను, శాస్త్రవచనాలను యుక్తియుక్తంగా చెప్పి ఆమెను ఓదార్చి ధైర్యం చెప్పి, బ్రాహ్మణులందరితో కలిసి ఆమెకార్యం సానుకూలమయ్యే ప్రయత్నం చేయడానికి ప్రతిజ్ఞ చేశాడు.

176. హోత్రవాహన అకృతవ్రణులతో అంబ సంభాషించుట.

భీష్ముడు చెప్తున్నాడు. 'రాజా! తరువాత ధర్మాత్ములైన ఆ మును లందరూ కార్యోన్ముఖులై ఇప్పుడు ఈ అంబ విషయమై ఏదో ఒకటి చేయాలని గట్టిగా నిర్ణయించు కొన్నారు. కొందరు మునులు ఆమెను తండ్రి ఇంటికి పంపేయా లని అన్నారు. ఇంకొందరు కన్యను అపహరించిన నన్ను నిందించా లని భావించారు. కొంతమంది సాల్వుని దగ్గరకు వెళ్లి ఈమెను స్వీకరించేలా నియోగించా లని తలచారు. ఇంతకుముందే సాళ్వుడు ఆమెను నిందించి తిరస్కరించాడు కనుక ఈ ఆలోచనను కొందరు కాదన్నారు. "అమ్మాయీ! ఈలాంటి స్థితిలో మావంటి మునీశ్వరులు ఏం చేయగలరు?" అంటూనే వ్రతనిష్ఠగల ఆ తాపసులందరూ తిరిగి ఆమెతో ఇలా అన్నారు. "శుభాంగీ! సన్యాసం స్వీకరించవద్దు. మా హిత వచనాలు విను. నీకు మేలు కలుగుతుంది. నీవు ఇక్కడ నుండి నీతండ్రి ఇంటికే వెళ్లు. తరువాత ఏమి చేయాలో నీతండ్రి అయిన కాశీరాజే ఆలోచిస్తాడు. అక్కడ నీవు సర్వగుణసంపన్నురాలవై సుఖంగా జీవించ గలుగుతావు. తండ్రి యొక్క ఆశ్రయంలాగా నీకు మరి ఏ ఇతర ఆశ్రయమూ న్యాయం కాదు. వరవర్ణినీ! స్త్రీలకు భర్తగాని, తండ్రి కాని గతి (ఆశ్రయం).

సుఖాలు అనుభవించే కాలంలో భర్త ఆశ్రయం, కష్టకాలంలో తండ్రి యొక్క ఆశ్రయం పొందడం స్త్రీలకు ఉచితం. విశేషించి సుకుమారివైన నీకు ఈ సన్యాసం మిక్కిలి కష్టాన్ని కల్గిస్తుంది. నీవు రాజకుమారివి. పైగా స్వభావం చేత సుకుమారివి. సుందరీ! ఆశ్రమంలో ఉంటే అనేక దోషాలు కలుగుతాయి. అదే నీ తండ్రి ఇంట్లో ఉంటే ఆ దోషాలు కలగవు." మరికొందరు తాపసులు ఆ తపస్వినితో ఇలా అన్నారు. 'నీవిక్కడ ఒంటరిగా నిర్జనమైన దట్టమైన అడవిలో ఉండడం చూసి ఏ రాజు లయినా నిన్ను కోరవచ్చు. కాబట్టి వనవాసం చేయాలనే ఆలోచన మానుకో.'

అపుడు అంబ ఇలా సమాధానం చెప్పింది. "మహాత్ములారా! తిరిగి నేను నా తండ్రి ఇంటికి కాశీనగరానికి వెళ్లలేను. ఎందుకంటే బంధువు లందరిలో అవమానం పాలవుతాను. ఇందుకు సందేహం లేదు. తాపసులారా! అప్పుడలా బాల్యంలో తండ్రి ఇంట్లో ఉన్నానే కాని ఇప్పుడు నా తండ్రి ఉన్నచోటికి వెళ్లను. మీకు పుణ్యం ఉంటుంది. మీ తాపసులందరి రక్షణలో తపస్సు చేయడానికే నేను కోరుకొంటున్నాను.

ఇలాంటి గొప్ప కష్టం, దౌర్భాగ్యం నాకు పరలోకంలో నైనా కలగకూడదనే నేను ఇప్పుడు తపస్సు చేస్తా నంటున్నాను."

భీష్ముడు కొనసాగిస్తున్నాడు. "రాజా! ఈ రీతిగా ఆ విప్రులందరూ చింతామగ్నులై ఉన్న సమయంలోనే రాజర్షి, మునిపుంగవుడు అయిన హోత్రవాహనుడు ఆ వనానికి వచ్చాడు. అప్పుడు ఆ మును లందరూ ఆ రాజును స్వాగతం పలకడం, ఆసనం సమర్పించడం, నీళ్లివ్వడం - మొదలైన ఉపచారాల ద్వారా ఆదరంతో పూజించారు. అతడు కూర్చుని విశ్రాంతి తీసుకొంటున్నాడు. అతడు వింటూండగానే ఆ వనవాసులందరూ తిరిగి అంబను గురించి మాట్లాడుకోవడం ప్రారంభించారు. రాజా! అంబ యొక్క, కాశీరాజు యొక్క ఆ కథ విని రాజర్షి, మహాతేజస్వి అయిన ఆ హోత్రవాహనుడు విచారగ్రస్తు డయ్యాడు. ఆ విధంగా దైన్యంతో తన గురించి చెప్పుకొన్న ఆమెను చూసి, ఆమె కథ విని మహాత్ముడు మహాతపస్వి, రాజర్షి అయిన హోత్రవాహనుడు జాలితో కరిగిపోయాడు. రాజా! అంబ యొక్క తల్లికి తండ్రి అయిన అతడు (తాతగారు - మాతామహుడు) చలించిపోతూ, లేచి ఆమెను తన ఒళ్లో కూర్చోబెట్టుకొని ఓదార్చసాగాడు. అతడు ఆమెకు ఇంతటి కష్టం కలగడానికి గల కారణాన్ని మొదటినుండి పూర్తిగా చెప్పుమని అడిగాడు. ఆమె కూడా జరిగినది

జరిగినట్లుగా, ఆ వృత్తాంతమంతా అతనికి సవిస్తరంగా చెప్పింది. అంతట ఆ రాజర్షి దుఃఖంతో, శోకంతో కర్తవ్యం మనసులోనే నిశ్చయించుకొన్నాడు.

దుఃఖంతో చలించిపోయిన అతడు ఆర్తురాలైన ఆ కన్యతో "అమ్మాయీ! నీవు (వెళ్లదలచుకోకపోతే) నీ తండ్రి ఇంటికి వెళ్లవద్దు లే. నేను నీతల్లికి తండ్రిని. అమ్మాయీ! నీ దుఃఖాన్ని నేను తీరుస్తాను. నీవు నా దగ్గర ఉండు. నీ మనసులోని దుఃఖం నిన్ను శుష్కింపచేసేదిగా ఉంది. నామాటను పాటించి, తపస్సు చేసుకొంటున్న జమదగ్ని కుమారుడైన పరశురాముని దగ్గరకు వెళ్లు. ఆ రాముడు నీ తీవ్ర దుఃఖాన్ని, శోకాన్ని కూడా పోగొడతాడు. తాను చెప్పినట్లు చేయకపోతే ఆ భీష్ముడిని అతడు యుద్ధంలో సంహరిస్తాడు. కాలాగ్నివంటి తేజస్సు గల ఆ భృగువంశశ్రేష్ఠుడిని శరణు పొందు. మహాతపశ్శక్తి కల అతడు నిన్ను చక్కని మార్గంలో నిలుపుతాడు. (మంచి దారి చూపగలడు)' – అని చెప్పగానే ఆమె మరింతగా కన్నీరు కారుస్తూ, చక్కని కంఠంతో తన తల్లికి తండ్రి అయిన ఆ హోత్రవాహనునికి తలవంచి నమస్కరిస్తూ ఇలా అంది. "నీ మాట పాటించి వెళ్తాను. ఇప్పుడు నేను లోకవిఖ్యాతు డైన ఆ పూజ్యుడిని ఎలా దర్శించగలను? ఆ భార్గవుడు నా ఈ తీవ్రమైన దుఃఖాన్ని ఎలా పోగొట్టగలడు? అక్కడికి నేను ఎలా వెళ్లగలను ? ఇవన్నీ నేను తెలుసుకోవా లనుకొంటున్నాను". హోత్రవాహనుడు చెప్పాడు. 'అతడు మహారణ్యంలో ఉగ్రమైన తపస్సు చేసుకొంటున్నాడు. అతడు సత్యసంధుడు, మహాబలవంతుడు, జమదగ్ని కుమారుడు. ఆ రాముడిని నీవు దర్శించగలవు. ఆ పరశురాముడు పర్వతశ్రేష్ఠ మయిన మహేంద్రగిరిమీద ఎల్లప్పుడూ నివసిస్తూ ఉంటాడు. అక్కడే వేదవేత్త లయిన ఋషులు, గంధర్వులు, అప్సరసలు కూడా ఉంటారు. అమ్మాయీ! అక్కడకు వెళ్లు. నీకు మేలు కలుగుతుంది. దృఢదీక్ష కలిగిన ఆ తపోవృద్ధునికి శిరసు వంచి నమస్కరించి నాగురించి, నా మాటల గురించి అతనికి చెప్పు. తరువాత నీవు ఏది కోరుకొంటున్నావో అది చెప్పు. నా గురించి చెప్పగానే రాముడు నీకు అన్నిపనులు చేసిపెడతాడు. ఆయుధం పట్టినవారందరిలో శ్రేష్ఠుడు, వీరుడు అయిన ఆ జమదగ్నిసుతుడు నాకు స్నేహితుడు. నా యందు ప్రీతి, సద్భావమూ కలవాడు.' రాజైన హోత్రవాహనుడు అంబను ఉద్దేశించి ఇలా చెప్తూ ఉండగానే ఆ పరశురామునికి ఇష్టుడు, అనుచరుడు అయిన అకృతవ్రణుడు అక్కడ ప్రత్యక్షమయ్యాడు. అంతట వేల సంఖ్యలో అక్కడ

ఉన్న మునులూ, సృంజయవంశానికి చెందిన వయోవృద్ధుడైన హోత్రవాహనుడూ, అందరూ లేచి నిలబడ్డారు. భరతశ్రేష్ఠుడా! ఆ వనవాసులైన మునులందరూ అతనికి ఆతిథ్యమిచ్చి సత్కరించిన అనంతరం, పరస్పరం చూసుకొంటూ అతని చుట్టూ చేరి, కలిసి, ఒక్కటిగా కూర్చున్నారు. రాజేంద్రా! అనంతరం వాళ్లందరూ మనసుకు నచ్చిన, ధన్యమైన, దివ్యమైన, హర్షాన్ని, ఆనందాన్ని, ప్రీతినీ కలిగించే కథలను (విషయాలను) చెప్పుకోసాగారు. అలా ఆ సంభాషణలు ముగిసిన తరువాత రాజర్షి మహాత్ముడు అయిన హోత్రవాహనుడు మహర్షులలో శ్రేష్ఠుడయిన పరశురాముని గూర్చి అకృతవ్రణుని అడిగాడు. 'మహాబాహూ! అకృతవ్రణా! వేదవేత్తలలో శ్రేష్ఠుడు, పరాక్రమశాలి అయిన ఆ జమదగ్నిసుతుని ఇప్పుడు ఎక్కడ చూడడానికి వీలవుతుంది.?' అకృతవ్రణుడు చెప్తున్నాడు - 'రాజా! ఆ రాముడు నిన్నే ఎల్లప్పుడూ ప్రశంసిస్తూ ఉంటాడు. సృంజయవంశానికి చెందిన రాజర్షి నాకు ప్రియసఖుడు" అని చెప్తూఉంటాడు. రేపు తెల్లవారేసరికి రాముడు ఇక్కడ ఉంటాడని నేను అనుకొంటున్నాను. నిన్ను చూడాలనే కోరికతో వస్తున్నాడు. అతనిని నీవు ఇక్కడే చూడవచ్చు. రాజర్షీ ! ఈ కన్య అడవికి ఎందుకు వచ్చింది. ఈమె ఎవరి కూతురు? నీకేమవుతుంది? తెలుసుకోవాలనుకొంటున్నాను.'

హోత్రవాహనుడంటున్నాడు - 'అయ్యా! ఈమె నా దౌహిత్రి, (కూతురు కూతురు- మనుమరాలు) కాశీరాజు కూతురు. అతనికి ఇష్టురాలు. పెద్దది అయిన ఈమె తన చెల్లెళ్లతో కలసి స్వయంవరంలో పాల్గొంది. తపోధనా! కాశీరాజు పెద్ద కూతు రయిన ఈమె అంబ అనే పేరుతో విఖ్యాతి చెందింది. అంబిక, అంబాలికలు- ఇద్దరూ చిన్నవాళ్లు. బ్రహ్మర్షీ! ఈ కన్యల నిమిత్తంగా భూమండలంలోని సకలక్షత్రియులు కలిసి కాశీపట్టణానికి విచ్చేశారు. అప్పుడు అక్కడ గొప్ప స్వయంవరోత్సవం జరిగింది. అప్పుడు మహావీరుడు మహాతేజస్వి, శంతను పుత్రుడు అయిన భీష్ముడు రాజులందరినీ తృణీకరించి ఆ ముగ్గురు కన్యలను ఎత్తుకొని వెళ్లాడట. నిర్మలమనస్కుడైన ఆ భరతవంశీయుడు భీష్ముడు రాజులందరినీ జయించి, కన్యలతో సహితంగా హస్తినాపురానికి వచ్చాడు. శక్తిశాలియైన భీష్ముడు సత్యవతికి ఆ కన్యలను అప్పగించిన అనంతరం, తన తమ్ముడైన విచిత్రవీర్యునితో వారి వివాహానికి ఆజ్ఞాపించాడు. ద్విజశ్రేష్ఠా! పెళ్లికి ఏర్పాట్లు జరుగుతుండడం చూసి, ఈ కన్య మంత్రులందరిమధ్య

ఉన్న భీష్మునితో ఇలా అంది. 'ధర్మజ్ఞా! వీరుడైన సాల్వపతిని నేను మనసారా పతిగా వరించాను. ఇతరునియందు మనసు కలిగిన నన్ను నీ తమ్మునికి ఇవ్వడం ఉచితం కాదు.' ఆ మాట విని భీష్ముడు మంత్రులతో సంప్రదించి, సత్యవతితో కలిసి ఆలోచించి, మనసులో ఒక నిశ్చయానికి వచ్చి, ఈమెను వదిలాడు. భీష్ముని అనుమతి పొందిన ఈమె సంతోషించి సౌభమనే విమానానికి అధిపతి అయిన సాల్వుని దగ్గరకు వెళ్లి ఆ సమయంలో అతనితో ఇలా అంది. 'రాజేంద్రా! భీష్ముడు నన్ను విడిచాడు. ఇంతకు ముందే నిన్ను నేను మనసారా వలచి ఉన్నాను. కాబట్టి నాపట్ల ధర్మాన్ని ఆచరించు. (నాకు న్యాయం చెయ్యి)' ఈమె శీలాన్ని శంకించిన సాల్వుడు ఈమెను తిరస్కరించాడు. అందుకని ఈమె తపస్సు చేయాలనే గట్టి కోరికతో తపోవనానికి వచ్చింది. ఈమె వంశం గురించి ప్రస్తావించడంతో నేను ఈమెను గుర్తుపట్టాను. ఈ దుఃఖానికంతటికీ మూల కారణం భీష్ముడే అని ఇప్పు' డీమె అనుకొంటోంది.' అప్పుడు అంబ అన్నది - 'భగవాన్! నా తల్లికి తండ్రి అయిన, సృంజయ వంశానికి చెందిన రాజు హోత్రవాహనుడు చెప్పినట్లుగానే అంతా జరిగింది. తపోధనా! అవమాన భయం చేతను, సిగ్గుచేతను మా నగరానికి వెళ్లడానికి నాకు ఉత్సాహంగా లేదు. విప్రశ్రేష్ఠుడా! భగవానుడైన పరశురాముడు నన్ను ఏది చేయమని ఆదేశిస్తాడో అదే అత్యుత్తమ కార్యమని నా ఉద్దేశ్యం.'

177. అకృతవ్రణుడు, పరశురాముడు అంబతో సంభాషించుట.

అకృతవ్రణుడు అంబతో ఇలా అన్నాడు. "అమ్మాయీ! నీకిప్పుడు రెండు దుఃఖ కారణాలున్నాయి. (ఒకటి సాళ్వుడు, రెండు భీష్ముడు - వలన కలిగినవి) ఈ రెండిటిలో దేనికి ప్రతీకారం చేయదలచుకొన్నావు? అది నాకు నీవు చెప్పు. అమ్మా! నీకిష్టమయితే మహాత్ము డయిన ఆ రాముడు నీ మేలుకోరి సౌభపతి అయిన సాల్వుని నిన్ను పెళ్లి చేసుకోమని ఆజ్ఞాపించగలడు. అలా కాకుండా ధీమంతు డయిన రాముడు గంగా సుతు డయిన భీష్ముని యుద్ధంలో ఓడించడం చూడాలని నీవు కోరుకొంటే, అదికూడా భార్గవరాముడు చేయగలడు. సృంజయవంశీకుడయిన హోత్రవాహనుని మాటలు చెవినిడి, నీ మనసులోని అభిప్రాయాన్ని కూడా పరిగణించుకొని ఇప్పుడు ఏది తప్పనిసరిగా చేయాలో అది ఇప్పుడే నిశ్చయించుకో." అంబ అన్నది

– "భగవన్! నా మనసు సాల్వుని వశం అయిందని భీష్ముడు తెలియకుండానే అతడు నన్ను ఎత్తుకొని వచ్చాడు. ఇది కూడా మనసులో ఉంచుకొని మీరే ఏమి చేయాలో నిశ్చయించండి. ఎలా న్యాయమో అలా ప్రతీకారం చేయండి. బ్రాహ్మణోత్తమా! కురుశ్రేష్ఠుడయిన భీష్ముని పట్ల గాని, సాల్వరాజు పట్లగాని, లేదా ఇద్దరిపట్లగాని ఏది యుక్తమో అది చేయండి. దేవా! నా ఈ దుఃఖానికి మూలమైన విషయాన్ని యథాతథంగా మీకు నివేదించాను. ఈ విషయంలో మీరు యుక్తిగా (న్యాయంగా) ప్రతీకారం చేయగలరు."

అప్పుడు అకృతవ్రణుడన్నాడు – "అమ్మాయీ! నీవు చెప్పినదంతా ధర్మబద్ధంగా, ఉచితంగా ఉంది. నేను చెప్పేది కూడా విను. పిరికిదానా! ఆ గంగాసుతుడు నిన్ను కరినగరానికి తీసుకుపోకపోతే, సాల్వుడు నిన్ను పరశురాముని మాట తలదాల్చి స్వీకరించేవాడు. భీష్ముడు నిన్ను జయించి తీసుకొని వెళ్లడం వల్లనే సాల్వరాజుకు నీమీద సంశయం కలిగింది. భీష్ముడు ధర్మపురుషార్థం పట్ల పట్టుదల గలవాడు. అంతేకాదు. జయకాంక్ష కలవాడు కూడా. కాబట్టి నీవు భీష్మునిపట్ల ప్రతీకారం తీర్చుకోవడమే యుక్తం.' అప్పుడు అంబ ఇలా అన్నది. బ్రాహ్మణోత్తమా! నాకు కూడా మనసులో ఇదే కోరిక ఉంది. భీష్ముడిని యుద్ధంలో చంపించాలని ఇప్పుడూ అనుకొంటున్నాను. మహాబాహూ! భీష్ముడయినా, సాల్వరాజయినా ఎవరివల్ల నేనింత దుఃఖం అనుభవిస్తున్నానో వాడిని శాసించు. దోషం చేసినవాడు, వాళ్లు ఇలా మాట్లాడుకొంటూ ఉండగానే ఆ పగలు గడిచిపోయింది. రాత్రికూడా సుఖకరమై నులి వెచ్చని, చల్లని గాలులతో గడిచిపోయింది. అప్పుడు శిష్యులతో కూడి, నారచీరలు, జడలు ధరించిన ముని ఆ భార్గవరాముడు తన తేజస్సుతో ప్రకాశిస్తూ ప్రత్యక్షమయ్యాడు. రాజేంద్రా! ఆ పరశురాముడు చేతిలో విల్లు, పరశువు, ఖడ్గమూ ధరించి, ధీరుడై, రజోగుణరహితుడై సృంజయవంశానికి చెందిన ఆ హోత్రవాహనుని సమీపించాడు. అంతట అక్కడున్న మునులు, మహాతపస్వి అయిన ఆ రాజు, తాపసవేషంతో ఉన్న ఆ అంబ అందరూ అంజలి ఘటించి, లేచి, నిల్చున్నారు. వారు స్వస్థచిత్తులై భార్గవరాముని మధుపర్కం ఇచ్చి పూజించారు. అలా విధిపూర్వకంగా పూజింపబడిన అతడు వారందరితో కలిసి కూర్చున్నాడు. జమదగ్నికొడుకు పరశురాముడు, సృంజయ వంశపురాజు హోత్రవాహనుడు ఇద్దరూ గడిచిపోయిన సంగతులను గూర్చి ముచ్చటించుకొంటూ

కూర్చున్నారు. ఆ మాటలు ముగిశాక రాజర్షి హోత్రవాహనుడు భృగువంశశ్రేష్ఠుడూ, మహాబలవంతుడూ అయిన పరశురామునితో ఆ సమయంలో మధురంగా అర్థవంతంగా ఇలా అన్నాడు.

'ప్రభూ! రామా! ఈమె నా మనుమరాలు. కాశీరాజు కూతురు. కార్యకుశలుడా! ఈమె కార్యం ఏమిటో, విషయమంతా ఈమె ద్వారానే విను, అనగానే సరే, చెప్పు' అన్నాడు పరశురాముడు. వెంటనే ఆమె అగ్నిలా జ్వలిస్తున్న రాముడిని సమీపించింది. అతని శుభకరమైన పాదాలమీద తలవాల్చి, తామరరేకులవంటి చేతులతో స్పృశించి, నమస్కరించి ఎదుట నిలిచింది. నీళ్లు నిండిన కళ్లతో, దుఃఖంతో, ఏడుస్తూ ఆమె శరణుకోరదగిన ఆ పరశురాముని శరణు వేడింది. రాముడిలా అన్నాడు. 'రాకుమారీ! నీవు సృంజయునికి ఎలాగో నాకూ అలాగే (మనుమరాలివి). నీ మనసులోని బాధ ఏమిటో చెప్పు. నీ మాట నెరవేరుస్తాను.' అంబ అన్నది. 'ప్రభూ! మహానియమవంతుడవైన నిన్ను ఇప్పుడు శరణు పొందుతున్నాను. ఘోరమైన శోకమనే ఊబిలో మునిగిపోతున్న నన్ను ఉద్ధరించ.' ఆమె రూపాన్ని, లేత శరీరాన్ని, మిక్కిలి సౌకుమార్యాన్ని చూసి పరశురాముడు చింతా క్రాంతుడయ్యాడు. ఈమె ఏం చెపుతుందా అని అనుకోసాగాడు. దయతో కరిగిపోయిన అతడు చాలాసేపు అలాగే ఉండిపోయాడు. చెప్పవలసిందని మళ్లీ రాముడు అడగగానే ఆమె సర్వవృత్తాంతాన్ని ఉన్నది ఉన్నట్లుగ రామునికి నివేదించింది. రాకుమారి అంబ చెప్పిన ఆ మాటలు విని పరశురాముడు చేయగల కార్యాన్ని నిశ్చయించి, ఆ సుందరాంగితో ఇలా అన్నాడు. 'సుందరీ! కురుశ్రేష్ఠుడు అయిన భీష్ముని దగ్గరకు నిన్ను పంపుతాను. ఆ రాజు నా మాట తప్పక పాటిస్తాడు. భద్రా! గంగాసుతుడు నేను చెప్పింది చేయకపోతే యుద్ధంలో నా శస్త్రతేజస్సుతో అతనిని మంత్రిసహితంగా కాల్చివేస్తాను. రాజపుత్రీ! ఒకవేళ ఇది నీకు ఇష్టం లేకపోతే ముందే వీరుడైన సాల్వుడిని ఈ పని చేయమని నియోగిస్తాను.'

అపుడు అంబ అన్నది – 'నా మనసు సాల్వరాజునందు లగ్నమైందని పూర్వమే అతనిని కోరుకొన్నానని విన్నవెంటనే భీష్ముడు నన్ను వదిలివేశాడు. సౌభరాజు సాల్వుని దగ్గరకు వెళ్లి నేను చెప్పరాని రీతిలో (సిగ్గుపడే విధంగా) అనేక విధాలుగా చెప్పాను. అయినా అతడు నా శీలాన్ని శంకించి, నన్ను తిరస్కరించాడు. భృగునందనా! ఇదంతా మీకు మీరుగా ఆలోచించి ఇప్పుడు ఏది యుక్తమో అది చేయవలసిందిగా కోరుతున్నాను.

మహామునీ! నా ఈ దుఃఖానికి భీష్ముడే కారణం. అతడు నన్ను బలవంతంగా తీసుకొనివచ్చి తన వశం చేసుకున్నాడు. మహాబాహూ! ఎవరివల్ల నేనింతటి దుఃఖం పొందానో, ఇలా ఏమాత్రం ఇష్టం లేని పరిస్థితులలో తిరగవలసి వచ్చిందో ఆ భీష్ముడిని చంపండి. పుణ్యాత్ముడవైన పరశురామా! ఆ భీష్ముడు లోభి, నీచుడు, జయకాంక్ష కలవాడు. కాబట్టి అతనిమీదే మీరు ప్రతీకారం చేయడం యుక్తంగా ఉంటుంది. భీష్ముడు నన్ను ఇలా చేసినప్పటినుండి, ఆ నియమశీలుడిని చంపాలనే ఉద్దేశం నా మనసులో కలిగింది. కాబట్టి రామా! నా ఈ కోరికను ఇప్పుడు తీర్చు. మహాబాహూ! ఇంద్రుడు వృత్రాసురుడిని చంపినట్లుగా భీష్ముడిని నీవు వధించు.'

178. భీష్మ పరశురాములు యుద్ధమునకు సిద్ధమై కురుక్షేత్రము చేరుట.

ఈ రీతిగా "భీష్ముడిని చంపండి" అని పదే పదే ప్రేరేపిస్తూ ఏడుస్తూ ఉన్న ఆ కన్యతో పరశురాముడు అప్పుడు ఇలా అన్నాడు. "కాశీరాజ పుత్రీ! వేదవేత్తలైన వారి గురించి తప్ప నేను ఇచ్ఛానుసారంగా శస్త్రం పట్టడానికి ఎంతమాత్రం అంగీకరించను. ఇది కాక ఇంకేం చేయగలను నీకు? రాకుమారీ! భీష్ముడు, సాల్వుడు కూడా నా మాట వింటారు. నేను నీపని నెరవేరుస్తాను. ఏడవకు. సుందరీ! బ్రాహ్మణుల ఆజ్ఞ లేనిదే నేను ఏ రీతిగా ఆయుధం పట్టను. ఇది నా నియమం." అంబ అన్నది. "ప్రభూ! నా దుఃఖాన్ని ఏదో ఒకరకంగా మీరే పోగొట్టాలి. అదికూడా భీష్మునివల్లనే కలిగింది. కాబట్టి అతనిని చంపండి. ఆలస్యం చేయకండి." పరశురాముడు అన్నాడు. "కాశీరాజ పుత్రీ! బాగా ఆలోచించుకొని చెప్పు. అందరికీ వందనీయుడైనా, భీష్ముడు నామాటమీద నీపాదాలు పట్టుకొంటాడు." అంబ అన్నది. 'రామా! నీవు నాకు సంతోషం కలిగించాలంటే భీష్ముడిని యుద్ధానికి పిలు. ఆ యుద్ధంలో గర్జిస్తున్న రాక్షసుడిలా ఉన్న భీష్ముడిని చంపు. నీవు చేసిన ప్రతిజ్ఞను నిలబెట్టుకో.' ఈ విధంగా అంబా పరశురాములు సంభాషించుకుంటూ ఉండగా పరమధర్మాత్ముడైన ఋషి అకృతవ్రణుడు ఇలా అన్నాడు.

"రామా! నిన్ను శరణుకోరి వచ్చిన ఈ కన్యను విడిచిపెట్టతగదు. భీష్ముడిని నీవు యుద్ధానికి పిలిచినపుడు అతడు వచ్చి "యుద్ధంలో నీ చేతిలో ఓడిపోయా"నని చెప్పాలి. లేదా నీ మాట పాటించాలి. అప్పుడే ఈ అమ్మాయి కార్యం నెరవేరుతుంది.

అప్పుడు నీవాడిన మాట కూడా నిజమవుతుంది. మహామునీ! క్షత్రియులందరిని జయించిన పిమ్మట బ్రాహ్మణుల మధ్య నీవు చేసిన ప్రతిజ్ఞ ఇది. "బ్రాహ్మణ క్షత్రియ వైశ్య శూద్రులెవరైనా సరే బ్రాహ్మణ ద్వేషి అయితే అతనిని యుద్ధంలో చంపుతాను. భయంతో శరణుకోరి వచ్చిన శరణార్థులను నేను బ్రతికి ఉండగా ఏవిధంగానూ వదిలివేయను. మూకుమ్మడిగా కూడివచ్చిన క్షత్రియు లందరినీ జయించి పరాక్రమంతో వెలిగిపోయేవాడిని కూడా యుద్ధంలో చంపుతాను". పరశురామా! కురుకుల భారాన్ని వహిస్తున్న భీష్ముడు ఇలా క్షత్రియు లందరినీ జయించి ఉన్నాడు. కాబట్టి భృగునందనా! అతని నెదుర్కొని యుద్ధం చెయ్యి."

అపుడు పరశురాముడన్నాడు - "ఋషిపుంగవా! పూర్వం నేను చేసిన ప్రతిజ్ఞ జ్ఞాపకం ఉంది. అయినా సామోపాయం చేతనే కార్యం సానుకూలపడేలా ప్రయత్నం చేస్తాను. బ్రాహ్మణుడా! ఈ కాశీకన్య అంబ మనసులో కోరుకొన్న పని చాలా గొప్పది. కాబట్టి ఈమెను తీసుకుని స్వయంగా నేను భీష్ముని దగ్గరకు వెడతాను. భీష్ముడు కనుక యుద్ధానికే మొగ్గు చూపి, నా మాట పాటించకపోతే గర్వియైన అతనిని చంపాలని నా నిశ్చయం. నేను విడిచిన బాణాలు శత్రువుల శరీరాలలో గ్రుచ్చుకొని ఉండిపోవు. (చీల్చుకొని బయటకు వస్తాయి). ఈ సంగతి పూర్వం క్షత్రియులతో జరిగిన యుద్ధంలోనే మీకు తెలుసు." ఇలా అని మహాతపస్వి అయిన రాముడు ఆ బ్రహ్మవాదులతో కలిసి ప్రయాణ మవ్వాలని తలచి అందుకు సన్నద్ధు డయ్యాడు. ఆ తాపసు లందరూ అక్కడే ఆ రాత్రి గడిపి, తెల్లవారగానే అగ్ని కార్యాలు, గాయత్రీ జపాలు చేసికొని నన్ను చంపాలనే కోరికతో బయలుదేరారు. పిమ్మట రాముడు ఆ బ్రహ్మజ్ఞాను లందరితో కలిసి అంబను వెంటపెట్టుకొని కురుక్షేత్రానికి చేరాడు. మహాత్ము లయిన ఆ తాపసులందరూ భృగుశ్రేష్ఠు డయిన పరశురాముని ముందుంచుకుని సరస్వతీ నదీ తీరంలో విడిది చేశారు.

భీష్ముడు చెప్తున్నాడు. "అనంతరం మూడో రోజున హస్తినాపురం బయట ఒకచోట ఉండి, ఆ పరశురాముడు "రాజా! నేను వచ్చాను. నాకు ప్రియమైనది చేయి" అని సందేశం పంపించాడు. తేజోనిధి, మహాబలవంతుడు, ప్రభువు అయిన ఆ రాముడు రాజ్యం పొలిమేరలలోకి వచ్చాడని విని, నేను హర్షంతో శీఘ్రంగా

వెంటనే అక్కడికి వెళ్లాను. రాజేంద్రా! ముందు గోవు నడుస్తూఉండగా బ్రాహ్మణు లందరూ పరివేష్టించగా దేవతాసమాను లయిన ఋత్విక్కులతోను, పురోహితులతోను కలిసి వెళ్లాను. పరాక్రమశాలి అయిన రాముడు సమీపించిన నన్ను చూసి, నేను చేసిన సత్కారాన్ని స్వీకరించి ఇలా అన్నాడు. రాముడన్నాడు - 'భీష్మా! ఆ నాడు ఏ ఉద్దేశ్యంతో కాశీరాజుకూతురు అంబను భార్యగా చేసుకోవాలనే కోరిక లేకుండానే తీసుకొనివచ్చావు? మళ్లీ ఆమెను ఎందుకు వదిలిపెట్టేశావు? ఈ కీర్తిశాలిని నీ చేతనే ధర్మభ్రష్టురాలు అయింది. నీవు స్పృశించిన ఈమెను ఎవరు చేపడతారు? నీచేత అపహరింపబడింది అనే కారణంగానే సాల్వు డీమెను తిరస్కరించాడు. కాబట్టి నా ఆదేశం మేరకు ఈమెను తిరిగి గ్రహించు. పురుషసింహమా! ఈ రాజపుత్రి తన ధర్మాన్ని తాను ఆచరించగలగాలి. నీవయినా రాజు లందరినీ ఇలా అవమాన పరచడం తగని పని." అప్పుడతడు క్రోధావిష్టుడై ఉండడం చూసి నేను ఇలా అన్నాను. "బ్రహ్మర్షీ! నేను నా తమ్ముడికి ఈమెను ఇచ్చి ఎలాగూ వివాహం చేయలేను. భార్గవరామా! పూర్వమే తాను సాళ్వునిదానను అని నాతో చెప్పింది. నేను కూడా అనుమతించాను. ఆమె సాళ్వుని నగరానికి వెళ్లింది. "భయంచేత కాని, దయచేత కాని, ధనలోభం చేత గాని, ఇష్టంకోసం కాని నేను క్షాత్రధర్మాన్ని విడిచిపెట్టను" అని నేను వ్రతం పూనాను. "అపుడు క్రోధం నిండిన చూపులతో రాముడు నన్నుద్దేశించి ఇలా అన్నాడు. "నరశ్రేష్ఠుడా! నా ఈ మాటను నీవు పాటించకపోతే మంత్రిసహితంగా ఇప్పుడే నిన్ను చంపగలను" అని పదే పదే అన్నాడు. కోపం నిండిన చూపులతో క్రోధావిష్టుడై రాముడు ఇలా అనగానే నేను మరల మరల ఆ భృగువంశశ్రేష్ఠుని అనునయ వాక్యాలతో యాచించాను. అయినా అతడు చల్లబడలేదు. ఆ బ్రాహ్మణోత్తమునికి మరల శిరసు వంచి నమస్కరించి, 'మీరు నాతో యుద్ధం చేయాలని కోరుకోవడానికి కారణ మేమిటి? బాలుడినైన నాకు చతుర్విధ శస్త్రాస్త్రములూ మీరే ఉపదేశించారు. నేను మీకు శిష్యుడిని' అన్నాను కోపంతో ఎర్రబడిన కళ్లతో భార్గవరాము డప్పుడు నాతో అన్నాడు - "మహామతీ! నన్ను గురువుగా గుర్తిస్తున్నావు. కాని కాశీ రాజకన్యను నా ప్రీతికోసం స్వీకరించవు. కురునందనా! నీకు మరొక విధంగా (ఈమెను స్వీకరించక) శాంతి లభించదు. మహాబాహూ! ఈమెను స్వీకరించి నీ వంశాన్ని రక్షించుకో. ఈమె నీచేతనే భ్రష్టురాలయింది. భర్తను పొందలేకపోతోంది."

అలా అంటున్న ఆ రాముడిని చూచి నేను "బ్రహ్మర్షీ ఇది మళ్లీ జరిగే పని కాదు. మీకు శ్రమ ఎందుకు? భగవన్! పురాతనమైన మీ గురుత్వాన్ని చూసి నేను మిమ్మల్ని అర్థిస్తున్నాను. ఈమెను నేను పూర్వమే విడిచిపెట్టాను. పరపురుషునియందు అనురాగం కలిగి ఆడుపాములాగ ఉన్నటువంటి స్త్రీని తెలిసి తెలిసి ఎవరు ఇంటిలో ఉంచుకొంటారు? స్త్రీలయొక్క ఈ దోషం గొప్ప అనర్థం కలిగిస్తుంది. మహావ్రతా! ఇంద్రునివలన భయంతోనైనా సరే నేను ధర్మాన్ని విడువను. నాపట్ల అనుగ్రహించినా, మానినా సరే, నీవు చేయదలచుకొన్నది వెంటనే చేయి. విశుద్ధహృదయుడవు, బుద్ధిమంతుడవు అయిన రామా! మహాత్ముడైన మరుత్తుడు చెప్పిన శ్లోకంలోని ఈ విషయం కూడా పురాణంలో వినబడుతూ ఉంది. **కార్యా-కార్యాలు తెలియక చెడుమార్గంలో నడుస్తున్న అహంకార పూరితుడైన వాడు గురువు అయినా విడిచిపెట్టేయాలి.** గురువని నిన్ను ప్రేమతో ఎంతో గౌరవించాను. అట్టి నీవు గురుధర్మాన్ని తెలుసుకోలేకపోయావు. కాబట్టి నీతో యుద్ధం చేస్తాను. గురువును యుద్ధంలో చంపను. పైగా బ్రాహ్మణుడవు. విశేషించి తపస్సులో పండిపోయిన వాడవు. కనుక ఇంతవరకు నిన్ను సహించాను. **బ్రాహ్మణుడై ఉండి క్షత్రియునిలాగ యుద్ధంలో ధనుర్బాణాలు ఎక్కుపెట్టి క్రోధంతో వెన్ను చూపకుండా యుద్ధం చేస్తూ ఉంటే, అతనిని సంహరించిన వాడికి బ్రహ్మహత్యా దోషం అంటదని ధర్మశాస్త్రాలు నిశ్చయంగా చెప్తున్నాయి.** తపోధనా! నేను క్షత్రియుడిని, క్షత్రధర్మంలో ఉన్నవాడిని. ఎవరు ఎవరిపట్ల ఎలా ప్రవర్తిస్తారో, వారి పట్ల అలానే ప్రవర్తించడం అధర్మం కాబోదు. అందువల్ల అనర్థం కలగబోదు. అర్థాన్ని గాని (ప్రయోజనం), ధర్మాన్ని గాని సాధించగల సమర్థుడు, దేశకాలా లెరిగినవాడై, అర్థవిషయమై సంశయం పొందినపుడు నిస్సంశయమైన ధర్మాన్ని ఆచరించి శ్రేష్ఠుడవుతాడు. రామా! సంశయింపదగిన విషయంలో కూడా న్యాయాన్ని అతిక్రమించి ప్రవర్తిస్తున్నావు. కాబట్టి మహాయుద్ధంలో నీతో ఎదిరించి పోరాడతాను. భృగునందనా! బాణాలు సంధించడంలో నా బాహుబలాన్ని, అతిమానుషమైన పరాక్రమాన్ని చూడు. ఈ స్థితిలో కూడా నా చేతనైనది నేను చేస్తాను. విప్రుడా! కురుక్షేత్రంలో నీతోయుద్ధం చేస్తాను. తేజశ్శాలీ! నాకిష్టమైన రీతిగా నీవు సిద్ధపడు. రామా! అక్కడ నీవు నా వందల కొద్దీ బాణాల చేత పీడింపబడి, మహారణంలో శస్త్రాల చేత పవిత్రుడవై దివ్యలోకాలను పొందుతావు. తపోధనా! వెనుతిరుగు. కురుక్షేత్రానికి

వెళ్లు. అక్కడే యుద్ధం కోసం నిన్ను కలుసుకొంటాను. భార్గవరామా! పూర్వం నీ తండ్రి శౌచం పొందిన చోటనే (తండ్రి మరణిస్తే ఆ అశౌచాన్నుండి రాజుల రక్త తర్పణం ద్వారా శుచి అయ్యాడు) నేను కూడా నిన్ను చంపి శుచి అవుతాను. అక్కడికి వెంటనే రా ! పూర్వం గడించుకున్న నీ దర్పాన్నంతటినీ పోగొడతాను. రామా! అనేక సభలలో "నేను ఒక్కడినే లోకంలోని క్షత్రియులందరినీ సంహరించాను. అని చెప్పుకొంటున్నావు. దానికి సమాధానం విను. అప్పుడు భీష్ముడు, లేదా నావంటి క్షత్రియుడు పుట్టి ఉండలేదు. తరువాత వీరులు పుట్టారు. నీవు గడ్డిపరకలలో మండావు. (గడ్డి పరకలవంటి రాజులను చంపగలిగావు). మహాబాహూ! నీ యుద్ధ సంబంధమైన దర్పాన్ని, కోరికను పోగొట్టగలిగిన శత్రుపురంజయుడైన భీష్ముడిని నేను పుట్టాను. రామా! యుద్ధంలో నీ దర్పాన్ని నాశనం చేస్తాను. సందేహం లేదు."

అప్పుడు రాముడు పరిహాసపూర్వకంగా నాతో ఇలా అన్నాడు. "భీష్మా! అదృష్టంకొద్దీ యుద్ధంలో నాతో తలపడా లనుకొంటున్నావు. కురునందనా ! ఇదిగో! నీతో కలిసి కురుక్షేత్రానికి వెళ్తున్నాను. అక్కడికి రా ! నీ మాట నెరవేరుస్తాను. అక్కడ నాచేత చచ్చి వందలకొద్దీ బాణాలు గ్రుచ్చుకుని కాకులకు గ్రద్దలకు ఆహారమయ్యే నిన్ను నీ తల్లి గంగాదేవి చూస్తుందిలే. రాజా! సిద్ధులచేత, చారణులచేత సేవింపబడే ఆ గంగాదేవి దీనుడవై నాచేత చచ్చిన నిన్ను చూసి ఏడ్చునుగాక! మహాభాగురాలు, పాపరహిత అయిన భాగీరథి దీనికి అర్హురాలు కాకపోయినప్పటికీ (ఇలాంటి దుఃఖం పొందడానికి) నీలాంటి యుద్ధకాముకుడిని, తొందర పాటు కలవాడిని కన్నందుకు తప్పదు. భీష్మా! రా! నాతో యుద్ధానికి, నీ రథాది సామగ్రినంతటినీ తెచ్చుకో. ఇలా అంటున్న ఆ రాముడిని చూసి నేను శిరసువంచి నమస్కరించి "రామా! ఏవమస్తు (అలాగే అగుగాక)" అని పలికాను. ఇలా చెప్పిన రాముడు యుద్ధం చేయాలనే కోరికతో కురుక్షేత్రానికి బయల్దేరాడు. నేను కూడా నగరానికి వెళ్లి సత్యవతికి విషయాన్ని నివేదించాను.

అప్పుడు తల్లి "స్వస్త్యయనం" చేయించి నన్ను అభినందించింది. బ్రాహ్మణులు పుణ్యాహ, స్వస్తివాచనాలు చేశారు. తెల్లని గుర్రాలతో ప్రకాశించే అందమైన రథం సిద్ధమయింది. అందులో ఖడ్గం, చక్రం ఉన్నాయి. వ్యాఘ్రచర్మం కప్పబడి ఉంది. గొప్ప ఆయుధాలు, సమస్త ఉపకరణాలతో నిండి ఉంది. యుద్ధంలో అనేక పర్యాయాలు

పరీక్షింపబడిన, అశ్వ శాస్త్రవేత్త విశిష్టుడు, కులీనుడు, వీరుడు అయిన సూతుడు నియమితు డయ్యాడు. భరతవీరుడా! శరీరాన్ని ఆవరించిన తెల్లని కవచం ధరించి, తెల్లని ధనుస్సు పట్టుకొని నేను యుద్ధయాత్రకు బయలుదేరాను. రాజా! తెల్లని ఛత్రం శిరసుపై వెలుగొందుతూ ఉండగా, తెల్లని చామరాలతో వీచబడుతూ, తెల్లని వస్త్రాలు, తెల్లని శిరస్త్రాణం, తెల్లని ఆభరణాలన్నీ ధరించి బయల్దేరాను. జయాశీస్సులతో ప్రశంసిస్తూండగా కరిపురాన్నుండి వెలువడి, రణభూమి అయిన కురుక్షేత్రాన్ని చేరుకొన్నాను. గాలితో, మనసుతో సమానమైన వేగం కల ఆ గుర్రాలు సూతుడు తోలగానే నన్ను సరిగ్గా యుద్ధరంగానికి కొనిపోయాయి. అప్పుడు నేను, రాముడు కురుక్షేత్రానికి చేరుకొని పరస్పరం యుద్ధానికి పరాక్రమించాం. అప్పుడు మిక్కిలి తపోనిష్ఠకల ఆ రాముని ఎదుట నిలబడి నేను శ్రేష్ఠమయిన శంఖాన్ని ఊదాను. రాజా! ఆ సమయంలో బ్రాహ్మణులు, తాపసులు, అరణ్యవాసులు, ఇంద్ర సహితంగా దేవగణాలు దివ్యమైన ఆ యుద్ధాన్ని చూడసాగారు. అప్పుడు దివ్యమైన మాలలు అక్కడక్కడ వెలిశాయి. దివ్యవాద్యాలు మ్రోగాయి. మేఘపంక్తులు కనిపించాయి. భార్గవరాముని అనుయాయులైన ఆ తాపసు లందరూ యుద్ధభూమిని ఆవరించి ప్రేక్షకు లయ్యారు.

రాజా! సమస్తప్రాణులకు మేలు చేయగోరే దేవి నా తల్లి గంగ స్వరూపంతో వచ్చి "నాయనా! ఏమి చేయాలనుకొంటున్నావు?" అని నన్నడిగింది. నేను జమదగ్ని సుతుడయిన రాముని వద్దకు వెళ్లి నీ శిష్యుడయిన భీష్మునితో యుద్ధం చేయవద్దని పదే పదే యాచిస్తాను" అని అన్నది. "నాయనా! ఇలాంటి పంతం పట్టకు. జమదగ్నిసుతునితో యుద్ధం చేయాలని కోరుకోకు" అని నిందించసాగింది. 'ఆ రాముడు రుద్రునితో సమానమైన పరాక్రమం గలవాడు. క్షత్రియ సంహారకుడు. ఇది నీవెరిగినదే కదా! అతనితో యుద్ధం ఎందుకు చేయా లనుకొంటున్నావు, అంది. అప్పుడు నేను ఆ దేవికి మ్రొక్కి, దోసిలొగ్గి, స్వయంవరంలో జరిగినదంతా యథాతథంగా చెప్పాను. రాజేంద్రా! నేను ఇంతకు ముందు పరశురామునితో మాట్లాడిన మాటలు, కాశీరాజు కూతురు చేసిన పని అంతా విశదంగా చెప్పాను. అంతట నా తల్లి అయిన ఆ మహానది గంగ పరశురాముని సమీపించి, అతడిని చూసి నాకోసం క్షమించమని వేడుకొంది. అతడు కూడా అలా ప్రార్థించిన ఆమెతో "భీష్ముడిని మరల్చు. అతడు నేను కోరినట్లు చేయలేదు. కాబట్టి అతడితో పోరుకు సిద్ధమయ్యాను"

అన్నాడు. అప్పుడు గంగాదేవి పుత్రవాత్సల్యంతో మళ్లీ నా దగ్గరకు వచ్చింది. కాని కోపంతో నిండిన కళ్లతోఉన్న నేను కూడా ఆమె వాక్యాన్ని పాటించలేదు. అంతలోనే ధర్మాత్ముడు, మహాతపస్వి, బ్రాహ్మణోత్తముడు అయిన భృగువంశరాముడు యుద్ధానికి పిలుస్తూ అక్కడ ప్రత్యక్షమయ్యాడు.

179. పరశురామునితో భీష్ముని యుద్ధము ప్రారంభమగుట.

భీష్ముడన్నాడు- రణభూమిలో యుద్ధం కోసం నిలబడి ఉన్న పరశురామునితో "గర్వించినట్లుగా రథమెక్కిన నేను భూమిపై నిలిచి ఉన్న మీతో యుద్ధం చేయడానికి ఇష్టపడను" అన్నాను. రామా! యుద్ధంలో నాతో తలపడాలంటే రథం ఎక్కు... కవచం తొడుక్కో. అప్పుడు ఆ రణభూమిలో పరశురాముడు చిరునవ్వు నవ్వుతూ నాతో ఇలా అన్నాడు. "కురునందనా! భీష్మా! నాకు భూమే రథం. ఉత్తమమైన గుర్రాలవంటి వేదాలే వాహనాలు. వాయువే సారథి. గాయత్రి, సావిత్రి, సరస్వతి అనే వేదమాతలే నాకు కవచం, వీటన్నిటితో కూడి సురక్షితుడనై యుద్ధం చేస్తాను." ఇలా అంటూనే సత్యపరాక్రముడైన ఆ రాముడు గొప్ప శరపరంపరలతో నన్ను అన్నివైపుల నుండి క్రమ్మేశాడు. అప్పుడు సమస్త ఆయుధాలతో ప్రకాశిస్తూ సాటిలేని రీతిగా రథమధ్యంలో గోచరించే పరశురాముని చూశాను. ఆ రథం నగరంతో పోల్చదగిన వైశాల్యం కలిగి ఉంది. ఆ పుణ్యరథం అతని మనసుచేత సృష్టించబడింది. అది దివ్యమైన అశ్వాలతో, స్వర్ణాలంకారాలతో సంసిద్ధమై ఉంది. మహాబాహూ! అతడు చంద్రసూర్య చిహ్నాలు గల కవచాన్ని ధరించాడు. ధనుస్సు ధరించాడు. వీపున అమ్ములపొది కట్టుకున్నాడు. చేతివ్రేళ్లకు రక్షణగా ఉడుము చర్మంతో చేసిన తొడుగు తొడుగుకున్నాడు. భార్గవునికి ఇష్టుడు, సఖుడు అయిన అకృతవ్రణుడు సారథిగా ఉన్నాడు. పదే పదే యుద్ధానికి రమ్మని నన్ను ఆహ్వానించే ఆ భార్గవరాముడు నాకు సంతోషాన్ని కలిగిస్తున్నట్లున్నాడు. ఉదయిస్తున్న సూర్యుడిలా ప్రకాశించే రాముడు ఒంటరిగా వచ్చాడు. కనుక నేనూ ఒంటరిగానే బయలుదేరాను. మూడు బాణాలు నామీద పడగానే గుర్రాలను నిలిపి, ధనుస్సు దించి, రథాన్నుండి దిగి ఋషిసత్తముడైన బ్రాహ్మణ శ్రేష్ఠుడైన పరశురాముడిని సమీపించి, గౌరవిస్తూ విధిపూర్వకంగా నమస్కరించి, మంచిమాటలతో ఇలా అన్నాను. "రామా! నాతో సమానుడవో, అధికుడవో, గురువైన

ధర్మశీలుడవైన నీతో యుద్ధం చేయాలని సిద్ధపడుతున్నాను. ప్రభూ! నాకు జయం కలగాలని ఆశీర్వదించు".

పరశురాముడు అన్నాడు. "కురువంశ శ్రేష్ఠుడా! అభివృద్ధిని కోరుకునేవారు ఇలాగే చేయాలి. మహాబాహూ! జాతిచేత, గుణం చేత అధికులైన విశిష్టులతో యుద్ధం చేయాలనుకొనే వారికి ఇది ధర్మం. రాజా! నీవు ఈ విధంగా రాకుంటే నిన్ను శపించి ఉండేవాడిని. కురువంశీయుడా! ధైర్యం చిక్కబట్టుకొని యుద్ధం చెయ్యి. నిన్ను జయించడానికే నేను ఇక్కడ నిలిచాను. కనుక నీకు జయం కలగాలని ఆశీర్వదించలేను. వెళ్లు. ధర్మబద్ధంగా యుద్ధం చెయ్యి. నీ నడవడికకు నేను ప్రీతి చెందాను." అప్పుడు నేను ఆయనకు నమస్కరించి, త్వరగా రథం ఎక్కి, బంగారు శంఖాన్ని పూరించాను. అప్పుడు నాకూ, ఆయనకూ మధ్య పరస్పర జయకాంక్షతో చాలా రోజులు యుద్ధం జరిగింది. అతడు ఆ యుద్ధంలో తొమ్మిది వందల అరవై బాణాలతో ముందుగా నన్ను కొట్టాడు. రాజా! నా నాలుగు గుర్రాలను, సూతుడిని కూడా అతడు నిలువరించాడు. అయినా నేను యుద్ధంలో కవచాన్ని ధరించి నిలిచే ఉన్నాను. దేవతలకు, విశేషించి బ్రాహ్మణులకు, నమస్కరించి, యుద్ధభూమిలో నిలిచి ఉన్న పరశురాముని చూసి నవ్వుతున్నట్లుగా ఇలా అన్నాను.

"బ్రాహ్మణోత్తమా! నీవు మర్యాదను ఉల్లంఘించినప్పటికీ నీ గురుత్వాన్ని నేను అంగీకరిస్తున్నాను. ధర్మసంగ్రహ విషయంలో నా ప్రతిజ్ఞా వాక్యాన్ని విను. నీ శరీరగతమైన వేదాల మీదగాని, గొప్పదైన నీ బ్రాహ్మణ్యం మీదగాని, గొప్పగా చేసిన నీ తపస్సు మీద గాని నేను దాడి చేయను. రామా! నీవు ఆశ్రయించిన క్షత్రియధర్మంమీద బాణ ప్రహారం చేస్తాను. బ్రాహ్మణుడు శస్త్రాలను ధరించడం ద్వారా క్షత్రియుడవుతాడు. నా వింటి పరాక్రమం, నా బాహుబలం చూడు. ఇదిగో వీరుడా! వాడి బాణంతో నీ ధనుస్సును ఖండిస్తున్నాను". అలా అని ఒక వాడియైన భల్లాన్ని అతనిపై వదిలాను. దానితో అతని వింటి కొప్పు తెగి భూమిమీద పడింది. బాణాలను నూరింటిని పరశురాముని రథంపై ప్రయోగించాను. అప్పుడు విషంతో కూడిన ఆ బాణాలు గాలిలో ఎగురుతున్న పాములవలె వచ్చి, రక్తాన్ని స్రవింపచేస్తూ, అతని శరీరంలో గ్రుచ్చుకొన్నాయి. అప్పుడు గాయాలనుండి కారుతున్న రక్తంతో తడిసిన, అవయవాలతో ఆ రాముడు యుద్ధంలో ధాతు జలాన్ని విడుస్తున్న

మేరు పర్వతంలా ప్రకాశించాడు. వసంతఋతువులో ఎఱ్ఱని పూలగుత్తులతో ప్రకాశించే అశోకవృక్షంలాగ, పూచిన మోదుగు చెట్టులాగ ఆ రాముడు ప్రకాశించాడు.

వెంటనే రాముడు క్రోధంతో ఇంకొక వింటిని తీసుకొని బంగారు పిడులు గల వాడిబాణాలను వర్షించాడు. ఆ బాణాలు అన్నీ భయంకరంగా నన్ను తాకి మర్మస్థానాలు ఛేదించాయి. అవి సర్పాల్లాగా, అగ్నిలాగా, విషంలాగా, నన్ను కంపింపచేశాయి. అప్పుడు యుద్ధరంగంలో నన్ను నేను నిలద్రొక్కుకొని, క్రోధంతో పరశురాముడిపై వందలసంఖ్యలో బాణాలు కురిపించాను. అగ్నివలె, సూర్యుడివలె ప్రకాశిస్తున్న విషసర్పాలవంటి వందల బాణాలతో పీడింపబడి పరశురాముడు నిశ్చేతనుడు అయిపోయాడు. నాకు జాలి కలిగి, నాకు నేను ధైర్యం తెచ్చుకొని క్షత్రియ ధర్మమైన యుద్ధాన్ని 'ఛీ ఛీ' అని నిందించుకున్నాను. శోకావేగంతో "గురువు, బ్రాహ్మణుడు, ధర్మాత్ముడు ఇలా బాణాలతో పీడింపబడినాడే. క్షత్రధర్మాన్ని ఆచరిస్తున్న నేను ఎంత పాపం చేస్తున్నాను" అని పదే పదే అనుకోసాగాను. ఆపై నేను మళ్లీ జమదగ్ని కుమారుడిపై బాణాలు వేయలేదు. సహస్రాంశుడైన సూర్యుడు భూమిని తపింపచేసి, పగలు గడిచిపోవడంతో అస్తమించాడు. దానితో యుద్ధం ఆగింది."

180. భీష్మ పరశురాముల యుద్ధము.

"రాజా! అనంతరం నేర్పుకల సూతుడు గుర్రాలకు, తనకు, నాకు గ్రుచ్చుకొన్న బాణపుములుకులను పెరికివేశాడు. గుర్రాలకు స్నానం చేయించి, నేలమీద విశ్రాంతి కలిగేలా పార్లనిచ్చి, నీళ్లు త్రాగించి అవి స్వస్థత, శాంతి పొందేలా చేశాడు సూతుడు. తెల్లవారి సూర్యోదయం కాగానే మళ్లీ యుద్ధం మొదలయింది. కవచం ధరించి, రథమెక్కి, శీఘ్రంగా వస్తున్న నన్ను చూసి పరశురాముడు తన రథాన్ని ఎంతో చక్కగా సిద్ధం చేశాడు. యుద్ధకాంక్షతో వస్తున్న రాముని చూసి నేను శ్రేష్ఠమైన నా ధనుస్సును వదిలి, వెంటనే రథం నుండి దిగాను. పూర్వంలాగే నేను నమస్కరించి, రథం ఎక్కి, రణోత్సాహంతో పరశురాముని ముందర భయం లేకుండా నిలిచాను. అప్పుడు నేను బాణవర్షంతో ఆయనను ముంచెత్తాను. ఆయనకూడా నన్ను తన బాణవర్షంలో ముంచెత్తాడు. క్రుద్ధుడైన జమదగ్నికుమారుడు తిరిగి నా మీద భయంకరంగా మండుతున్న అగ్రభాగాలతో పాములవలె ఉన్న వాడి బాణాలను ప్రయోగించాడు.

రాజా! అప్పుడే నేను వాడి భల్లా లనే బాణవిశేషాలతో వాటిని అంతరిక్షంలోనే వందలు వేలు తునుకలుగా ఖండించేశాను. ఇలా చాలాసార్లు జరిగింది. తరువాత పరాక్రమశాలి అయిన పరశురాముడు దివ్యాస్త్రాలను నామీద ప్రయోగించాడు. నేనుకూడా నా అధికపరాక్రమాన్ని ప్రకటించాలనే కోరికతో దివ్యాస్త్రాలతోనే వాటిని వారించాను. అప్పుడు ఆకాశంలో అంతటా గొప్ప కోలాహలం పుట్టింది. నేను పరశురాముని మీద వాయవ్యాస్త్రాన్ని ప్రయోగించాను. రాముడు గుహ్యకాస్త్రంతో దాన్ని నిర్వీర్యం చేశాడు. వెంటనే నేను ఆగ్నేయాస్త్రాన్ని అభిమంత్రించి, ప్రయోగించాను. ప్రభువైన రాముడు వారుణాస్త్రంతో దానిని నివారించాడు. ఇలా రాముడి దివ్యాస్త్రాలను నేను అడ్డుకొన్నాను. నా అస్త్రాలను రాముడు అడ్డుకొన్నాడు. అప్పుడు మిక్కిలి క్రుద్ధుడై రాముడు నాకు ఎడమ వైపు వచ్చి నన్ను వక్షఃస్థలం మీద కొట్టాడు. నేను నా శ్రేష్ఠమైన రథం మీద కూలబడిపోయాను. మూర్ఛపోయిన నన్ను సూతుడు వెంటనే దూరంగా తీసుకుపోయాడు.

రాముని బాణంతో పీడింపబడిన నేను మిక్కిలి వ్యాకులపడ్డాను. బాగా గాయపడి అచేతనావస్థలో యుద్ధభూమికి దూరంగా కానిపోబడ్డాను. అది చూసి రాముని అనుచరులైన అకృతవ్రణుడు మొదలైన వారు, కాశీకన్య అంబా అందరూ సంతోషంతో కోలాహలం చేశారు. అంతలో తెలివి వచ్చి నేను జరిగినది తెలుసుకుని సూతునితో "సూతా! నాకు బాధపోయింది. నేను సిద్ధంగా ఉన్నాను. రాముడు ఉన్న చోటికి నడు" అన్నాను. సూతుడు చక్కగా శోభిస్తూ, వాయువేగంతో నృత్యం చేస్తున్నట్లున్న గుర్రాలతో నన్ను యుద్ధభూమికి తీసుకుపోయాడు. సంసిద్ధుడై ఉన్న రాముని నేను సమీపించి జయకాంక్షతో మిక్కిలి కుపితుడనై బాణవర్షంతో ముంచెత్తాను. సూటిగా పడుతూఉండగానే ఆ బాణాలను ఒక్కొక్కదానిని మూడింటితో పరశురాముడు వెంటనే ఖండించివేశాడు. వందలు వేలకొద్దీ వాడిబాణాలను నేను ప్రయోగించాను. వాటినన్నిటినీ రాముడు రెండు రెండు ముక్కలుగా ఖండించివేశాడు. అప్పుడు నేను పరశురాముడిని అంతం చేయాలని కాలాగ్నివంటి తీక్ష్ణమైన మెఱుగులు చిమ్మే బాణాన్ని ప్రయోగించాను. ఆ బాణం యొక్క వేగంతో గాయపడిన పరశురాముడు యుద్ధంలో మూర్ఛపోయి నేలమీద పడిపోయాడు. రాముడు భూమిమీద పడిపోగానే సూర్యుడు తెగిపడినట్లుగా జగత్తంతా క్షోభించి హాహాకారాలు చేసింది. కురునందనా! అప్పుడు ఆ మునులు,

అంబ అందరూ ఎంతో దుఃఖంతో అతని వద్దకు పరుగెత్తుకువచ్చారు. అతనిని పాదివి పట్టుకొని చేతులతో వీస్తూ చల్లని నీళ్లతో జయాశీస్సులతో అతనిని సేద తీర్చారు. తేరుకున్న రాముడు లేచి వింటికి బాణం సంధించి విహ్వలస్వరంతో "నిలు భీష్మా! చచ్చావులే" అన్నాడు. వేగంగా విడిచిన ఆ బాణం యుద్ధంలో నాకు ఎడమవైపు పడింది. దానితో నేను పెకలింపబడిన చెట్టులాగ అల్లాడిపోయాను. అప్పుడు ఆ మహాయుద్ధంలో పరశురాముడు శీఘ్రాస్త్రంతో గుర్రాలను చంపి, నిర్భయంగా వేగవంత మయిన బాణాలతో నన్ను కొట్టాడు. నేను కూడా యుద్ధంలో శత్రువుల బాణాలను అడ్డగించగల శీఘ్రాస్త్రాన్ని వేశాను. మా ఇద్దరియొక్క ఆ బాణాలు ఆకాశం అంతా ఆవరించి పరస్పరం డీకొన్నాయి. బాణాల చేత కప్పబడి సూర్యుడు ప్రకాశించలేదు. మేఘాలచేత అడ్డగింపబడినట్లుగా గాలి స్తంభించిపోయింది. వాయుప్రకంపనాలతో, సూర్యకిరణాలతో, బాణాలు రాపిడి పొంది నిప్పు రగిలింది. ఆ బాణాలన్నీ తమలో పొందిన రాపిడివల్ల పుట్టిన అగ్నిలో మండిపోయి బూడిదగా మారి భూమిమీద పడిపోయాయి. మిక్కిలి క్రుద్ధు డయిన పరశురాముడు నామీద వేగంగా లక్షలు, పదిలక్షలు, కోటి, పదికోట్లు, వందకోట్లు, వేలకోట్లు బాణాలను వేశాడు. రాజా! నేను వాటిని కూడా ఆ యుద్ధంలో విషసర్పాల వంటి బాణాలతో ఖండించి చెట్లను వలె భూమిమీద పడేశాను. అలా ఆ యుద్ధం జరిగింది. సంధ్యాకాలం గడిచిపోతుంటే నా గురువు యుద్ధ భూమినుండి తొలగిపోయాడు."

181. భీష్మ పరశురాముల యుద్ధము - 2.

భీష్ముడు చెప్తున్నాడు - "మరుసటి దినం రాముడికి ఎదురుపడగానే తిరిగి అతిదారుణమైన యుద్ధం జరిగింది. ధర్మాత్ముడు అయిన పరశురాముడు ప్రతిదినం దివ్యాస్త్రాలను పెక్కింటిని ప్రయోగించసాగాడు. ఆ తుములయుద్ధంలో, అస్త్రాల నన్నింటినీ అరికట్టగల అస్త్రాలతో విడువశక్యంకాని ప్రాణాలను సైతం లెక్కించక నిరోధించాను. ఈ రీతిగా అస్త్రాలన్నీ అస్త్రాలతో అనేక విధాల నిర్వీర్యం కావడం చూసి పరశురాముడు కోపంతో ప్రాణాలకు తెగించి, యుద్ధం చేశాడు. ఆ జమదగ్ని కుమారుడు భయంకరాకారం గల ఒక శక్తిని విడిచిపెట్టాడు. అది కాలపురుషుడు వదిలిన ఉల్కలా ఉంది. దాని అగ్రభాగం మెరుగులు క్రక్కుతూ ఉంది. దాని

తేజస్సు లోకమంతా వ్యాపించింది. ప్రళయకాలసూర్యుడిలా వెలుగొందుతూ, వస్తున్న ఆ శక్తిని నేను బాణాలతో మూడు ముక్కలుగా ఖండించి భూమిమీద పడవేశాను. వెంటనే సుగంధంతో కూడిన వాయువు వీచింది. అది అలా ముక్కలు కాగానే క్రోధంతో మండి పడిన రాముడు ఇంకొక విధమయిన ఘోరశక్తులను పన్నెండింటిని ప్రయోగించాడు. ప్రకాశంలో, వేగంలో అవి చెప్పశక్యంకానట్లు ఉన్నాయి. లోకసంహారం కోసం ఉదయించిన ద్వాదశాదిత్యుల లాగా అనేకరూపాలతో, ఉగ్రమైన తేజస్సుతో, ప్రకాశిస్తూ, అగ్నిజ్వాలల్లా వ్యాపిస్తూ అన్ని దిక్కులనుండి వచ్చిపడుతున్న ఆ శక్తులను చూసి చలించిపోయాను. వ్యాపించే బాణమయ మయిన వలను చూసి శరసమూహంతో దానిని ఖండించాను. ఆ యుద్ధంలో నేను పన్నెండు బాణాలను ప్రయోగించాను. ఘోరాకృతి గల ఆ శక్తులన్నీ అప్పుడు అణగిపోయాయి. వెంటనే రాముడు భయంకరమైన శక్తులను ప్రయోగించాడు. అవి చూడ్డానికి చిత్రంగా ఉన్నాయి. బంగారు పిడులు కలిగి, బంగారు రేకులు తాపడం చేయబడి ఉన్నాయి. అవి మండుతున్న పెద్ద పెద్ద ఉల్కల్లాగ ఉన్నాయి.

వాటినన్నిటిని డాలుతో వారించి, కత్తితో యుద్ధభూమిలో పడేలా చేశాను. ఆ యుద్ధంలోనే దివ్యమైన బాణాలతో పరశురాముని దివ్యాశ్వాలను సూతులతో సహితంగా ముంచెత్తాను. కుబుసం విడిచిన పాములాంటి చిత్రమైన శక్తులన్నీ ఖండింపబడడం చూసి, ఆ మహాత్ముడు క్రోధావిష్టుడై దివ్యాస్త్రాన్ని పుట్టించాడు. ఆ దివ్యాస్త్రం నుండి మిడుతల దండులా బాణపంక్తులు వచ్చి పడ్డాయి. అవి భయంకరంగా మెరుగులు చిమ్ముతూ ఉన్నాయి. అవి నా శరీరాన్ని కప్పి గుర్రాలు, సూతునితో సహితంగా రథాన్ని కూడా కప్పి వేశాయి. ఆ బాణాలతో నా రథం అన్నివైపుల నుండి కప్పివేయబడింది. అలాగే గుర్రాలు, సారథి కూడా; నొగలు, రథ దండం కూడా అలాగే అయిపోయాయి. ఇరుసు బాణాల చేత భిన్నమై భగ్నమైపోయింది. అప్పుడా బాణవర్షం తగ్గిన తరువాత నేను కూడా శరవర్షాన్ని గురువుపై కురిపించాను. బ్రహ్మరూపు డయిన ఆ మహాత్మునికి నా బాణాలు తగిలి శరీరంనుండి ఎంతో రక్తం కారింది. పరశురాముడు బాణసమూహం వల్ల బాధపడినట్లు గానే నేను కూడా బాగా గాయపడ్డాను. సాయంకాల మయి సూర్యుడు అస్తాద్రి చేరుకోగానే యుద్ధం ఆగింది."

182. భీష్మ పరశురాముల యుద్ధము - 3.

భీష్ముడు చెప్తున్నాడు. - "రాజేంద్రా! తెల్లవారి సూర్యుడు బాగా ప్రకాశించే సమయంలో భార్గవునికీ, నాకూ తిరిగి యుద్ధం ప్రారంభం అయింది. పరశురాముడు మేఘ మండలమంత ఎత్తయిన రథం మీద నిలబడి, మేఘం కొండ మీద కురిసినట్లుగా నామీద బాణవర్షాన్ని కురిపించాడు. నా సూతుడు ఆ బాణాలు తగిలి నాకు విషాదం కలిగిస్తూ, మూర్ఛపోయి, భూమిమీద పడిపోయాడు. పరశురాముని బాణాలు తగిలి సూతుని ప్రాణాలు పోయాయి. ఒక్కక్షణం నాకు కూడా భయం కలిగింది. సూతుడు చనిపోగానే వ్యగ్రమనస్కుడనై రాముని బాణాలను ఛేదిస్తున్నాను. ఇంతలోకే అతడు మృత్యుసన్నిభమైన ఒక బాణాన్ని వేశాడు. సూతుని మరణంతో విలవిలలాడుతున్న నన్ను ఆ భార్గవరాముడు ధనుస్సును బాగా లాగి ఒక బాణంతో గాఢంగా కొట్టాడు.

రక్తాన్ని త్రాగే ఆ బాణం నా వక్షఃస్థలంలో గ్రుచ్చుకొని భూమిమీద పడింది. నేను చనిపోయాననే అనుకొని రాముడు మేఘంలా గట్టిగా గర్జించాడు. అతని శరీరం మాటిమాటికీ పులకించిపోయింది. రాజా! నేను అలా పడిపోగానే సంతోషించిన రాముడు తన అనుయాయులతో కలిసి మహానాదం చేశాడు.

నేను పడిపోగానే నా ప్రక్కన ఉన్న కౌరవరాజులు, యుద్ధాన్ని చూడటానికి వచ్చిన జనులూ కూడా మిక్కిలి ఆర్తిని పొందారు. నేను పడిపోగానే సూర్యునివంటి, అగ్నివంటి తేజస్సు కలిగిన ఎనిమిదిమంది బ్రాహ్మణులను (వసువులను) చూశాను. వారు నా చుట్టూ నిలిచి యుద్ధ భూమి మధ్యలోనే తమ చేతులతో నన్ను పొదివి పట్టుకొన్నారు. ఆ విప్రులచేత రక్షింపబడిన నేను భూమిని తాకలేదు. అంతరిక్షంలోనే బంధువుల్లాగ ఆ విప్రులు నన్ను పట్టుకొన్నారు. రాజా! అంతరిక్షంలో ఊపిరి తీస్తున్నట్లున్న నామీద నీటి బిందువులు చిలకరించి, ఆ బ్రాహ్మణులు నన్ను పట్టుకొని, ఇలా అన్నారు. వారంతా ఒక్కుమ్మడిగా "భయపడకు. నీకు శుభమగుగాక" అని చాలాసారులన్నారు. నేను వారి మాటలకు సంతృప్తి పడి వెంటనే లేచాను. రథం మీద సారథిగా ఉన్న నదీమతల్లి గంగను చూశాను. గంగాదేవి నా రథం మీద పగ్గాలు పట్టుకొని గుర్రాలను అదుపు చేసింది. నేను నా తల్లి పాదాలు స్పృశించి పితరుల (వంటి విప్రులను) స్మరించి రథాన్ని ఎక్కాను. ఆమె నా రథంతో సహా గుర్రాలను, ఇతర ఉపకరణాలను రక్షించింది. తిరిగి ఆమెకు నేను అంజలి

ఘటించి ఆమెను వీడ్కొలిపాను. అనంతరం నేను వాయువేగం గల ఆ గుర్రాలను స్వయంగా నడుపుతూ జమదగ్ని సుతునితో ప్రొద్దు తిరిగేవరకూ యుద్ధం చేశాను. అప్పుడా యుద్ధంలో దృఢమై, వేగవంతమై హృదయాన్ని చీల్చివేసే ఒక బాణాన్ని రామునిపై వదిలాను. నా బాణం చేత బాగా గాయపడిన పరశురాముడు మూర్ఛ వచ్చి, ధనుస్సు వదిలివేసి, మోకాళ్లమీద కూలబడి, నేలపై పడిపోయాడు. వేలమంది బ్రాహ్మణులకు భూరిదానా లిచ్చిన ఆ పరశురాముడు పడిపోగానే మేఘాలు రక్తాన్ని వర్షిస్తూ ఆకాశమంతా వ్యాపించాయి. పిడుగులతో, మెఱుపులతో కూడిన ఉల్కలు వందలకొద్దీ రాలాయి. చక్కగా ప్రకాశిస్తున్న సూర్యుడిని అప్పటికప్పుడు రాహువు కబళించివేశాడు. గాలి తీవ్రంగా వీచసాగింది. భూమి కంపించి పోయింది. గ్రద్దలు, బలాక పక్షులు, రాబందులు సంతోషంగా ఎగరసాగాయి. దిక్కులు మండసాగాయి. నక్కలు దారుణంగా పదే పదే అరవసాగాయి. దుందుభులు వాటంతట అవే మ్రోగసాగాయి. మహాత్ము డయిన రాముడు అచేతనంగా భూమి మీద పడగానే ఇంత మహాభయంకరమైన ఉత్పాతం సంభవించింది. అంతలో పరశురాముడు వెంటనే లేచి, కోపంతో ఒళ్లు తెలియక, వ్యాకులచిత్తంతో మరల యుద్ధం చేయడానికి నన్ను సమీపించాడు. మహాబాహువైన పరశురాముడు తాడి చెట్టంత విల్లు తీసుకొన్నాడు. దానితో కాలాగ్ని సదృశమైన బాణాన్ని నామీద ప్రయోగించబోతుంటే కృపాళువులైన మహర్షులు ఆ రాముని వారించారు. (వారి మాట విని) రాముడు దానిని ఉపసంహరించాడు. వాడి తగ్గిన కిరణాలతో సూర్యదేవుడు ధూళి పుంజంచేత కప్పబడి అస్తంగతు డయ్యాడు. రాత్రి అయింది. సుఖకరమైన చల్లని గాలి వీచింది. అప్పుడు మేమిద్దరం యుద్ధాన్ని ముగించాము. రాజా! ప్రతిదినం ఇలాగే యుద్ధం ముగింపు జరుగుతోంది. మళ్లీ తెల్లవారగానే మిక్కిలి ఘోరమైన యుద్ధం జరుగుతోంది ఇలా ఇరవై మూడు రోజులు గడిచాయి."

183. భీష్మునకు వసువులు ప్రస్వాపనాస్త్రమిచ్చుట.

"తరువాత నేను ఆ రాత్రిపూట బ్రాహ్మణులకు, పితరులకు, దేవతలకు, నిశాచరులకు, భూతాలకు, రాజపుంగవులకు అందరికీ శిరసు వంచి నమస్కరించి, ఏకాంతంగా శయ్యను చేరి మనసులో ఇలా అనుకోసాగాను. 'పరశురామునకు నాకు

మధ్య జరిగే ఈ యుద్ధం మిక్కిలి దారుణంగా, గొప్ప అనిష్టాన్ని కలిగించేదిగా ఉంది. చాలా దినాలు గడిచిపోయాయి ఇప్పటికి. కాని సమరభూమిలో యుద్ధానికి మోహరించి మహాబల పరాక్రమాలు కల విప్రుడు, పరశురాముడిని నాకు జయింపశక్యం కాదు. ప్రతాపశాలి అయిన జమదగ్ని కుమారుని నేను జయించగలిగేమాటుంటే నాకు ఈ రాత్రి దేవతలు ప్రసన్నంగా దర్శనం ఇత్తురు గాక.' అని అనుకున్న తరువాత బాణాలతో గాయపడిన నేను ఆ రాత్రి ప్రొద్దు పోయాక తెల్లవారుజామున కుడిప్రక్కకు తిరిగి పడుకొన్నాను. అప్పుడు యుద్ధంలో నేను రథాన్నుండి పడిపోతున్నపుడు ఏ బ్రాహ్మణోత్తము లయితే లేపి పట్టుకొని "భయపడకు" అని ధైర్యం చెప్పి ఓదార్చారో వారే నా కలలో కనపడి నా చుట్టూ చేరి ఇలా అన్నారు.

"గాంగేయా! లే. భయపడకు. నీకేమీ భయం లేదు. కురువంశీయుడా! నీవు మాలో వాడివే కదా! నిన్ను మేము రక్షిస్తాం. రాముడు యుద్ధంలో నిన్ను ఏవిధంగానూ జయించలేడు. యుద్ధంలో నీవే రాముడిని జయిస్తావు. ఇదిగో 'ప్రస్వాపం' అనే ఈ అస్త్రం నీకు ఇష్టమైనది. నీవు దీని ప్రయోగ, ఉపసంహారాలను ఎరుగుదువు. పూర్వజన్మలో (వసువుగా ఉన్నపుడు) దీని ఎరుక నీకు ఉంది. దీనికి ప్రజాపతి అధిష్ఠానదైవం. విశ్వకర్మచేత నిర్మించబడింది. ఈ అస్త్రాన్ని గురించి రాముడికి కూడా తెలియదు. అసలు భూమిమీద ఏ మానవుడికీ కూడా ఎప్పుడూ దీని గురించి తెలియదు. దీన్ని స్మరించు. దీన్ని బాగా ప్రయోగించు. ఇది నీకు స్వయంగానే సిద్ధిస్తుంది. కౌరవరాజా! దీనితో నీవు మహావీరు లైన రాజు లందరినీ శాసించగలవు. కాని రాముడు దీనితో నాశనం కాడు. కాబట్టి దీనివల్ల నీకు ఎప్పుడూ పాపం అంటదు. నీ బాణం తగిలి జమదగ్ని నందనుడు నిదుర పోయినట్లుంటాడు. భీష్మా! యుద్ధంలో ఈ నీ ప్రియమైన అస్త్రంచేత అతడిని జయించి, తిరిగి నీవే అతడిని సంబోధనాస్త్రం చేత మేల్కొలుపగలుగుతావు. కౌరవ్యా! తెల్లవారగానే రథం ఎక్కి, ఇలా చెయ్యి. ఎందుకంటే నిద్రపోయినవాడు, చనిపోయినవాడు ఒక్కటే అనుకొంటాము మేము. రాజా! పరశురాముడు ఎన్నటికీ మరణించడు. కనుక నీకు లభించిన ఈ ప్రస్వాపమనే అస్త్రాన్ని ప్రయోగించు". రాజా! ఇలా చెప్పి, ఒకే ఆకారంతో దివ్యమూర్తుల్లా ఉన్న ఆ ఎనిమిదిమంది బ్రాహ్మణోత్తములూ అంతర్ధానం అయిపోయారు."

184. భీష్మపరశురాముల అస్త్రప్రయోగాలు.

"రాత్రి గడవగానే మేలుకున్నాను. నాకు వచ్చిన స్వప్నం గురించి ఆలోచించి, మిక్కిలి సంతోషించాను. నాకు, అతనికి తుములయుద్ధం ఆరంభ మయింది. ఆ అద్భుతయుద్ధం చూచి సమస్త ప్రాణులకు శరీరం గగుర్పొడిచింది. అప్పుడు భార్గవరాముడు నామీద బాణవర్షం కురిపించాడు. దానిని నేను బాణ సమూహంతో వారించాను. దానితో రాముడు మిక్కిలి కుపితుడై, నిన్నటినుండి ఉన్న కోపంతో నా మీద శక్తిని ప్రయోగించాడు. ఆ శక్త్యాయుధం స్పర్శలో ఇంద్రుని వజ్రాయుధంలా, కాంతిలో యముని దండంలా అనిపిస్తూ మండుతున్న అగ్నిలా యుద్ధభూమిలో అంతటా నాలుకలు చాస్తూ నాకుతున్నట్లు ఉంది. ఆకాశంలో ఉండే నక్షత్రంలాగ ఆశక్తి వేగంగా వచ్చి, నా వక్షఃస్థలాన్ని తాకి, గాయపరిచింది. దుర్యోధనా! ఆ రాముడు వేసిన శక్తివల్ల కలిగిన గాయంనుండి కొండనుండి స్రవించే గైరికధాతుజలంలా రక్తం ప్రవహించసాగింది. నాకు బాగా కోపం వచ్చి, మృత్యుసమానమై పాము విషంతో సమానమైన ఒక బాణాన్ని జమదగ్నిసుతునిపై వేశాను. బ్రాహ్మణోత్తము డైన ఆ వీరునికి ఆ బాణం నుదుటి మీద గ్రుచ్చుకొంది. అప్పు డతడు శిఖరంతో కూడిన పర్వతంలా ప్రకాశించాడు. కుపితుడైన అతడు ప్రళయకాల యమునితో సమానమైన, భయంకర బాణాన్ని తీసుకుని బలంకొద్దీ లాగి ప్రయోగించాడు. ఆ ఉగ్రమైన బాణం బుసకొట్టే సర్పంలాగ వచ్చి, నా వక్షఃస్థలం మీద నాటుకుంది. నేను రక్తసిక్తమై నేల వ్రాలాను.

వెంటనే తెలివి తెచ్చుకుని జమదగ్నిసుతుని మీద మండుతున్న వజ్రాయుధం లాంటి తీక్ష్ణమైన శక్తిని ప్రయోగించాను. అది ఆ బ్రాహ్మణోత్తముని భుజాలమధ్య తగిలింది. అతడు విహ్వలు డైపోయాడు. అతని శరీరం కంపించిపోయింది. సఖుడు, విప్రుడు, మహాతపోధనుడు అయిన అకృతవ్రణుడు అప్పు డతనిని కౌగిలించుకొని మంచి మాటలతో అనేక విధాల ఊరడించాడు. బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించాడు. దానిని ప్రతిఘటించడానికి ఉత్తమమైన బ్రహ్మాస్త్రాన్నే నేనూ ప్రయోగించాను. అది ప్రళయకాలం అనిపించేలా మంటలు ఎగచిమ్మింది. ఆ రెండు బ్రహ్మాస్త్రాలు నన్ను గాని, రామునిగాని చేరకుండా మధ్యలోనే ఢీకొన్నాయి. అప్పుడు ఆకాశంలో కేవలం తేజస్సు మాత్రమే కనిపించసాగింది. సమస్తప్రాణులు ఆర్తి చెందాయి. ఋషులు, గంధర్వులు, దేవతలు

కూడా అస్త్ర తేజస్సుచేత పీడింపబడి, మిక్కిలి సంతాపాన్ని పొందారు. పర్వతాలు, వనాలు, వృక్షాలతో సహితంగా భూమి కంపించిపోయింది. తాపానికి గురైన ప్రాణులు మిక్కిలి విషాదాన్ని పొందాయి. ఆకాశమంతా మంటలు రేగాయి. దశదిశల పొగలు క్రమ్మాయి. ఆకాశచారులు అంతరిక్షంలో నిలవలేకపోయారు. దేవతలు, అసురులు, రాక్షసులతో సహితంగా లోకమంతా హాహాకారాలతో నిండిపోయింది. ఇదే తగిన సమయం అని ప్రస్వాపనాస్త్రాన్ని వేద్దామనుకొన్నాను. బ్రహ్మవాదులైన వసువుల మాట ప్రకారం విచిత్రంగా ఆ అస్త్రం వెంటనే నా మనసులో స్ఫురించింది."

185. భీష్మపరశురాముల యుద్ధసమాప్తి.

"అప్పుడు ఆకాశంలో "భీష్మా! ప్రస్వాపనాస్త్రం ప్రయోగించకు" అంటూ గొప్ప కోలాహలం పుట్టింది. అయినా ఆ అస్త్రాన్ని భార్గవరాముని పై ఎక్కుపెట్టాను. అలా ప్రస్వాపనాస్త్రాన్ని ప్రయోగించ బోతున్న నన్ను చూసి నారదుడు ఇలా అన్నాడు. "కౌరవ్యా! ఇరుగో ! ఆకాశంలో దేవతలందరూ నిలుచుని ఉన్నారు. వారంతా నిన్ను ఇప్పుడు వారిస్తున్నారు. కనుక ప్రస్వాపనాస్త్రం ప్రయోగించకు. రాముడు తపస్వి, బ్రహ్మజ్ఞుడు, పైగా బ్రాహ్మణుడు. ఆపై నీకు గురువు కూడా. అతనిని ఏ విధంగానూ అవమానపరచకు. ఆ తరువాత ఆకాశంలో నిలిచిఉన్న ఆ ఎనమండుగురు బ్రహ్మవాదులను చూశాను. వారు నవ్వుతూ నాతో మెల్లగా ఇలా అన్నారు.

"నారదుడు ఎలా చెప్పాడో అలాగే చేయి. అదే లోకాలకు మిక్కిలి శ్రేయస్సు సుమా!" అని చెప్పగానే ఆ ప్రస్వాపనాస్త్రాన్ని ఉపసంహరించి, ఆ యుద్ధంలో యథావిధిగా బ్రహ్మాస్త్రాన్నే వెలుగొంద చేశాను. రాజసింహా! అప్పుడు ఆ అస్త్రం నివర్తింపబడడం చూసి సంతోషించిన రాముడు "మందబుద్ధినైన నేను భీష్మునిచేత ఓడింపబడ్డాను." అన్నాడు. అప్పుడు అక్కడ పరశురాముడు తన తండ్రి జమదగ్నిని, అతనికి మన్నింపదగిన అతని తండ్రి ఋచీకుని చూశాడు. వారంతా అక్కడే అతని చుట్టూ నిలిచి అనునయ పూర్వకంగా అతనిని ఉద్దేశించి ఇలా అన్నారు.

ఎన్నడూ తిరిగి ఇలాంటి సాహసం చేయకు. భీష్మునితో, అందునా క్షత్రియునితో యుద్ధం చేయడం మంచిది కాదు. ఈ యుద్ధం అనేది క్షత్రియుని యొక్క ధర్మం. బ్రాహ్మణుని కైతే స్వాధ్యాయం, వ్రతానుష్ఠానం పరమమైన ధనం. పూర్వం ఒకసారి

ఇదే విషయమై నీకు మేము చెప్పి ఉన్నాం. ఆ శస్త్రధారణమనే అతిభయంకరమైన అకృత్యాన్ని నీవు చేశావు. వత్సా! భీష్మునితో చేసిన యుద్ధంలో ఇంతవరకు నీవు చేసిన విధ్వంసక కార్యం చాలు. ఇకనైనా యుద్ధం నుండి తొలగిపో. భార్గవా! నీకు శుభ మగుగాక! నీవు ఇంతవరకు విల్లు ఎక్కుపెట్టింది చాలు. ఇక దానిని విడిచిపెట్టు. తపస్సు చేసుకో ! 'దేవతలందరూ ఈ భీష్ముని కూడా నివారించారు. "ఈ యుద్ధం నుండి విరమించు మని వారు అతనిని అనునయించారు' 'నీ గురువైన పరశురాముడితో యుద్ధం చేయకు. కురువంశశ్రేష్ఠా! రాముడిని యుద్ధంలో జయించడం నీకు న్యాయం కాదు. గాంగేయా! యుద్ధ భూమిలో ఆ బ్రాహ్మణుని గౌరవించు' అని పదే పదే చెప్పారు. "నాయనా! మేము నీ పెద్దలం (తాత తండ్రులం) కాబట్టే నిన్ను వారిస్తున్నాం. భీష్ముడు వసువులలో ఒకడు. అదృష్టం కొద్దీ జీవించి ఉన్నావు. భార్గవా! గంగాసుతుడు, శంతనుపుత్రుడు అయిన ఈ కీర్తిశాలి వసువు సుమా! నీవు ఎలా జయించగలుగుతావు? కాబట్టి ఇక్కడినుండి తొలగిపో. దేవతలందరిలో పూర్వుడు, సనాతనుడు, అయిన నరుడు అర్జునుడుగా పుట్టి త్రిలోక వీరుడై సవ్యసాచి అని ప్రఖ్యాతి చెంది కాలానుసారంగా భీష్ముని మృతికి కారకు డవుతాడని బ్రహ్మ విధించాడు" అని ప్రకటించారు.

ఇలా చెప్పిన పితరులతో రాముడిలా అన్నాడు - 'నేను యుద్ధంలో వెనుకడుగు వేయను. ఇది నా వ్రతం. పితామహులారా! ఇంతకు పూర్వం కూడా ఎప్పుడూ యుద్ధభూమినుండి వెనక్కి తిరగలేదు. మీకు కోరిక ఉంటే గాంగేయుని యుద్ధంనుండి మరల్చండి. ఏవిధంగానూ నేను ఈ యుద్ధంనుండి మరలను.' రాజా! అప్పుడు ఋచీకుడు మొదలైన మునులు నారదునితో సహా వచ్చి నాతో 'నాయనా! యుద్ధాన్ని మాను. ఆ బ్రాహ్మణోత్తముని గౌరవించు' అన్నారు. క్షత్రియ ధర్మాపేక్షతో నేను వారి నుద్దేశించి ఇలా అన్నాను. 'ఈ లోకంలో నాకొక వ్రతం ఉంది. యుద్ధవిముఖుడనై వెనుక బాణాలు తగులుతూంటే యుద్ధం నుండి ఎప్పుడూ మరలిపోను. **లోభం వల్ల కాని, దైన్యం వల్ల కాని, భయం వల్లకాని, ధనం కోసం గాని శాశ్వతమైన ధర్మాన్ని ఎప్పుడూ విడిచిపెట్టనని నా దృఢనిశ్చయం.**' రాజా! తరువాత నారదాది మునులందరూ, నాతల్లి భాగీరథి యుద్ధరంగమధ్యంలోకి ప్రవేశించారు. నేను అలాగే విల్లెక్కుపెట్టి, బాణం చేత పుచ్చుకొని, అదే దృఢనిశ్చయంతో యుద్ధ రంగంలో యుద్ధం చేయడానికి స్థిరంగా నిలుచుని ఉన్నాను. అప్పుడు వారంతా మళ్లీ ఒక్కుమ్మడిగా

కలిసి, భార్గవరాముని సమీపించి అతనితో ఇలా అన్నారు. "రామా! విప్రుల మనసు నవనీతం లాంటిది. శాంతించు, ఈ యుద్ధాన్నుండి విరమించు. నీవు భీష్ముడినీ చంపలేవు. భీష్ముడు నిన్నూ చంపలేడు." ఇలా అంటూ ఆ పితరులందరూ రణ భూమిలో రాముని అడ్డగించి, శస్త్రసన్యాసం చేయించారు. అప్పుడు నేను మళ్లీ ఆ ఎనమండుగురు బ్రహ్మవాదులను చూశాను. వారు ఆకాశంలో ఎనిమిది గ్రహాలు పుట్టినట్లు ఉన్నారు.

వారంతా యుద్ధభూమిలో నిల్చున్న నాతో ప్రేమగా ఇలా అన్నారు. "మహాబాహూ! గురువైన రాముడి వద్దకు వెళ్లు. లోకహితం చెయ్యి." మిత్రవాక్యం చేత యుద్ధంనుండి మరలిన పరశురాముడిని చూచి లోకహితం చేయాలని నేను కూడా వారి మాటను ఆదరించాను. అపుడు బాగా గాయపడి ఉన్న నేను రాముడి వద్దకు వెళ్లి, నమస్కరించాను. మహాతపస్వి అయిన రాముడు కూడా చిరునవ్వు నవ్వుతూ ప్రేమగా నాతో "భీష్మా! ఈ లోకంలో నీతో సమానమైన క్షత్రియుడు లేడు. వెళ్లు. ఈ యుద్ధంలో నీ వలన నేను మిక్కిలి సంతోషం పొందాను." అన్నాడు. భార్గవరాముడు నా సమక్షంలోనే ఆ కాశిరాజు కన్యను పిలిచి ఆ మహాత్ముల మధ్య దీనవాక్యాలతో ఇలా అన్నాడు.

186. అంబ కఠోరతపము చేయుట.

"సుందరీ ! నేను నా శక్తి కొద్ది యుద్ధం చేశాననీ, గొప్ప పౌరుషం చూపించా "ననే విషయం లోకులందరూ ప్రత్యక్షంగా గమనించారు. ఉత్తమమైన అస్త్రాలను ఎక్కువగా ప్రయోగించినప్పటికి, ఆయుధధారులలో శ్రేష్ముడైన భీష్ముని మించడానికి నేను సమర్థుడిని కాలేదు. అమ్మాయీ! నా శక్తీ, బలమూ, ఇంత మాత్రమే. నీవు నీ ఇష్టమైన చోటికి వెళ్లవచ్చు. నీ కోసం ఇంక ఏమి చేయమంటావు? ఇక భీష్ముడినే శరణు పొందు. ఇక నీకు వేరే గతిలేదు. మహాస్త్రాలు ప్రయోగించి, భీష్ముడు నన్ను జయించాడు". గొప్ప మనసు కల ఆ రాముడు ఇలా చెప్పి, దీర్ఘంగా నిట్టూర్చి ఊరకుండిపోయాడు. అప్పుడు ఆ కాశిరాజు కన్య భృగునందనునితో ఇలా అంది. 'భగవన్! మీరు చెప్పినట్లుగానే ఇదంతా ఇంతే. ఉదారబుద్ధి అయిన భీష్ముని యుద్ధంలో దేవతలు కూడా జయించలేరు. మీ శక్తిని అనుసరించి ఉత్సాహం ఉన్నంతవరకు మీరు నా కార్యాన్ని నిర్వర్తించారు. యుద్ధంలో అనివార్యమైన పరాక్రమాన్ని

ప్రదర్శించారు. వివిధ అస్త్రాలను ప్రయోగించారు. అయినా చివరికి వచ్చేసరికి యుద్ధంలో భీష్ముని మించిపోవడానికి మీకు శక్తి చాలలేదు. నేను తిరిగి ఎలాగూ (ఎట్టి పరిస్థితులలోను) ఈ భీష్ముని వద్దకు వెళ్లను. తపోధనా! స్వయంగా నేను యుద్ధంలో భీష్ముని పడగొట్టగలిగే స్థాయికి చేరే చోటికే వెళ్తాను.' ఇలా అని ఆ కన్య అంబ రోషం నిండిన కళ్లతో వధించడం గూర్చే ఆలోచిస్తూ, తపస్సు చేయాలనే స్థిరసంకల్పంతో అక్కడి నుండి బయలుదేరింది. భారతా! పిమ్మట పరశురాముడు ఆ మును లందరితో కలిసి నన్ను వీడ్కొని ఎలా వచ్చాడో అలాగే మహేంద్ర పర్వతానికి వెళ్లిపోయాడు. నేను కూడా రథం ఎక్కి బ్రాహ్మణు లంతా కీర్తిస్తూ ఉండగా నగరాన్ని ప్రవేశించి తల్లి సత్యవతికి జరిగిన విషయమంతా నివేదించాను. మహారాజా! ఆమె కూడా నన్ను అభినందించింది. అంబ వృత్తాంతాన్ని తెలిసికొనే పనికి ప్రాజ్ఞులను నియోగించాను.

ఎల్లప్పుడూ నాకు ఇష్టులుగా, హితులుగా ఉంటూ వారు ప్రతిదినం ఆమె ఎక్కడకు వెళ్తోందో, ఏమి మాట్లాడుతోందో, ఏమి చేస్తోందో వచ్చి నాకు తెలుపసాగారు. ఆ అంబ తపస్సు చేయడానికి నిశ్చయించుకొని, వనానికి వెళ్లిన రోజే నేను దీనుడిలా వ్యథితుడిలా చైతన్యం లేనివాడిలా అయిపోయాను. నాయనా! తపస్సు చేత, నియమ వ్రతాలు పాటించే బ్రహ్మవేత్త అయిన పరశురాముడు తప్ప వేరే ఏ క్షత్రియుడూ యుద్ధంలో పరాక్రమంతో నన్ను జయించలేదు. రాజా! ఈ సంగతిని నేను నారదమహర్షికి, వ్యాసునికి కూడా నివేదించాను. వారిద్దరూ నాతో "భీష్మా! కాశీరాజు కూతురి విషయమై నీవు ఏమీ విషాద పడనక్కరలేదు. **విధి నిర్ణయాన్ని పురుష ప్రయత్నంతో మరల్చడానికి ఎవరు ఉత్సహిస్తారు ?**" అన్నారు. ఆ అంబ ఆశ్రమభూములను చేరుకొని, యమునా తీరంలో ఉండి అతిమానుషమైన తపస్సు చేయసాగింది. ఆమె ఆహారం మానివేసి కృశించిపోయింది. ఎండిపోయింది. జుట్టు జడలు కట్టింది. శరీరం మాలిన్యంతో నిండిపోయింది. ఆ తపస్వినీ ఆరునెలల పాటు వాయుభక్షణ చేసింది. కట్టెలా మారింది. ఆ శుభాంగి ఆ తరువాత ఏడాదిపాటు యమునానదీ జల మధ్యంలో నిరాహారంగా కాలం గడిపింది. తీవ్రకోపం కలిగిన ఆమె ఆపై సంవత్సరం పాటు కాలిబొటన వేలిపై నిలబడి, తపస్సు చేస్తూ రాలిన ఆకులతోనే గడిపింది. ఇలా పన్నేండేళ్లపాటు భూమ్యాకాశాల నడిమిభాగాన్నంతటినీ తపింపచేసింది. బంధువులు నచ్చచెప్పినా ఆమెను మరలించడం వారికి శక్యం కాలేదు. తరువాత ఆమె సిద్ధులు, చారణులు సేవించే,

పుణ్యాత్ములు మహాత్ములు అయిన తపస్సుల ఆశ్రమాలున్న వత్సదేశానికి చేరింది. అక్కడ పుణ్యతీర్థాల్లో స్నానమాచరిస్తూ రాత్రింబవళ్లు ఇచ్చవచ్చిన చోట తిరగసాగింది. శుభంకరమైన నందాశ్రమం, ఉలూకాశ్రమం, చ్యవనాశ్రమం, బ్రహ్మస్థానం, దేవతలు యజ్ఞం చేసిన ప్రయాగ, దేవారణ్యాలు, భోగవతి, కాశికాశ్రమం, మాండవ్యుని ఆశ్రమం, దిలీపుని ఆశ్రమం, రామహ్రదం, పైలగర్గాశ్రమం- ఈ అన్ని తీర్థాలలో ఆ కాశీరాజకన్య కఠిన నియమాలతో స్నానం చేసింది.

ఆ నీటిలో ఉన్న నా తల్లి గంగ ఆమెను "భద్రా! శరీరాన్ని ఎందుకిలా కృశింప చేసుకుంటున్నావు? నిజం చెప్పు నాకు" అని అడిగింది. అంతట అనిందిత అయిన ఆమె అంజలి ఘటించి గంగతో ఇలా అంది. "పరశురాముడు యుద్ధంలో భీష్ముని చేతిలో ఓడిపోయాడు. బాణం ఎక్కుపెట్టి నిలిచిన అతనిని జయించడానికి ఏరాజు ఉత్సాహం చూపుతాడు? కనుక నేను భీష్ముని నాశనం చేయడానికి దారుణమైన తపస్సు చేస్తున్నాను. దేవీ! ఆ రాజును చంపటానికే భూమి మీది ఈ పుణ్యక్షేత్రాలన్నీ తిరుగుతున్నాను. భగవతీ! ఈ లోకంలో నా పరమమైన వ్రతఫలం ఇదే సుమా!". అంతట సాగరగామిని అయిన గంగ ఇలా అంది. "భావిని! కుటిలంగా ప్రవర్తిస్తున్నావు. అబలా! ఈ కోరిక తీర్చుకోవడం నీకు శక్యం కాదు.

కాశీరాజ పుత్రీ! నీవు భీష్ముని వినాశం కోరుకునే ఈ వ్రతం ఆచరిస్తున్నట్లయితే, ఆ వ్రతంలో ఉండగానే నీవు శరీరం విడిచి ఒక నదిగా మారుతావు. అది కూడా వంకర టింకరగా ప్రవహించేది, కేవలం వర్షపునీటితో నిండేది, స్నానానికి దిగడానికి దుష్కరంగా ఉండేది అవుతుంది. వర్షాకాలపు నదిగా మాత్రమే నిన్ను గుర్తిస్తారు. మిగతా ఎనిమిది నెలలు ఎవరికీ నీ జాడ తెలియదు. క్రూరమైన మొసళ్లతో ఘోరమై సర్వప్రాణులకూ భయంకరంగా ఉంటుంది." రాజా! ఇలా కాశీరాజకన్యతో పలికి మహాభాగురాలు నా తల్లి గంగాదేవి చిరునవ్వు నవ్వుతూ మరలిపోయింది. తిరిగి ఆ సుందరాంగి కొన్నిసార్లు ఎనిమిదినెలల వరకు, కొన్నిసార్లు పదినెలల వరకు నీళ్లు కూడా త్రాగకుండా తపస్సు చేసింది. కురువంశీయుడా! కాశీరాజు కూతురు మళ్లీ మళ్లీ తీర్థ లాడాలనే లోభంతో వత్సభూమిలో అటుఇటు తిరుగుతూ పడిపోయింది. భారతా! వత్సభూమిలో ఆ నది 'అంబ' అనే పేరుతో ప్రసిద్ధిపొందింది. అది వర్షాకాలంలో మాత్రమే ఉంటుంది. మొసళ్లతో నిండి ఉండి, దిగడానికి కష్టంగా ఉంటుంది. మెలికలు

తిరుగుతూ ప్రవహిస్తూ ఉంటుంది. రాజా! రాజకన్య అంబ తపోబలం చేత వత్సరాజ్యంలో అర్ధశరీరంతో నదిగా వెలసింది. అర్ధ శరీరంతో కన్యగా పుట్టింది."

187. అంబ మహాదేవుని వరము పొంది, చితాగ్నిలో ప్రవేశించుట.

భీష్ముడు చెప్తున్నాడు- "అప్పుడు ఆ జన్మలో కూడా తపస్సు చేయాలనే దృఢనిశ్చయం కల ఆమెను చూచి తపస్వి జనులందరూ ఆమెను వారించారు. "నీవు ఏం చేయా లనుకొంటున్నావు?" అని అడిగారు. ఆ కన్య తపోవృద్ధులైన ఆ ఋషులతో అప్పుడిలా అంది. "భీష్ముని చేత తిరస్కరించబడి, పతిధర్మం నుండి తొలగింపబడ్డాను. తపోధనులారా! అతనిని వధించడానికే ఈ దీక్ష గాని లోకం కోసం కాదు. భీష్ముడిని చంపితేనే శాంతి కలుగుతుంది అని నా నిశ్చయం. తపస్వులారా! ఎవరి కారణంగా నేను శాశ్వతంగా ఇలాంటి కష్టస్థితిని పొందానో, పతిలోకం లేనిదాననై అటు స్త్రీని కాకుండా, పురుషుడినీ కాకుండా అయ్యానో ఆ భీష్ముడిని యుద్ధంలో చంపకుండా వెనక్కి తిరగను. ఇది నా హృదయంలో పుట్టిన సంకల్పం. అదే మీకు నేను చెప్పాను. స్త్రీత్వంపై విరక్తి కలిగింది. పుంస్త్వం పొందాలని కృత నిశ్చయంతో ఉన్నాను. భీష్మునిపై పగ తీర్చుకొంటాను. మీరు నన్ను వారించలేరు." ఆ మహర్షులమధ్యనుండి శూలపాణి, ఉమాపతి అయిన శంకరుడు స్వస్వరూపంతో తపస్వినీ అయిన ఆమెకు ప్రత్యక్షం అయ్యాడు. వరం కోరుకోమని అడిగిన పిమ్మట ఆమె నా పరాజయాన్ని కోరుకొంది. శంకరుడు ఆ మనస్వినితో "భీష్ముని చంపగలవు" అని పలికాడు. అప్పుడామె తిరిగి రుద్రుని ఇలా అడిగింది. "దేవా! స్త్రీనైన నాకు యుద్ధంలో జయం ఎలా సమకూడుతుంది. ఉమాపతీ! భూతేశా! స్త్రీభావంతో నా మనసు, గాఢమైన శాంతత్వాన్ని పొంది ఉంది. నీవు భీష్మ పరాజయాన్ని వాగ్దానం చేశావు. వృషధ్వజా! ఈ వరం నిజం అయ్యేలా చెయ్యి. శంతనుని కుమారుడైన భీష్ముడిని యుద్ధంలో ఎదుర్కొని చంపగలిగేలా చెయ్యి."

వృషధ్వజుడైన మహాదేవుడు ఆ కన్యతో ఇలా అన్నాడు. 'నా మాట ఎప్పుడూ పొల్లుపోదు. నిజంగానే జరుగుతుంది. యుద్ధంలో భీష్ముని చంపుతావు. అందుకోసం పురుషత్వాన్ని కూడా పొందుతావు. దేహాంతరం పొందినప్పటికీ (మరుసటి జన్మలో కూడా) జరిగినదంతా స్మరించగలుగుతావు. ద్రుపదుని వంశంలో పుట్టి మహారథుడవు

అవుతావు. శీఘ్రంగా అస్త్రాలు ప్రయోగిస్తూ అందరి మెప్పు పొంది చిత్రమైన యుద్ధం చేయగలుగుతావు. కల్యాణీ! అంతా చెప్పినట్లుగానే జరుగుతుంది. (ముందు కన్యగానే పుట్టినా) తరువాత కొంతకాలం గడిచాక పురుషుడవు అవుతావు.' జటాజూటధారి, వృషభధ్వజుడు అయిన ఆ మహాదేవుడు ఇలా చెప్పి, ఆ విప్రులందరూ చూస్తుండగానే అక్కడే అంతర్ధానమయ్యాడు. మహారాజా! అనిందితురా లయిన ఆ అంబ ఆ మహర్షులు అందరూ చూస్తూండగా ఆ వనం నుండి కట్టెలు తీసికొనివచ్చి చితిని పేర్చి అగ్నిని రగుల్కొల్పింది. యమునాద్వీపంలో ప్రజ్వరిల్లుతున్న ఆ అగ్నిలో రోషపూరితమైన మనస్సుతో ఆ కాశీరాజు పెద్దకూతురు "భీష్మవధకోసం" అని అంటూ అగ్నిప్రవేశం చేసింది."

188. అంబ స్త్రీగా పుట్టి శిఖండి పేరుతో కుమారునిగా పెరుగుట.

దుర్యోధనుడు పితామహా ! "శిఖండి మొదట కన్యగా ఉండి, తరువాత పురుషుడుగా ఎలా మారాడు? నాకు చెప్పు". అని అడిగాడు. భీష్ముడు చెప్తున్నాడు - "రాజా! ద్రుపద మహారాజునకు ప్రియభార్య అయిన పట్టమహిషికి పుత్రులు లేరు. ఇదే సమయంలో ద్రుపదమహారాజు సంతానం కోసం శంకరుని సంతోష పరిచాడు. నన్ను చంపాలని నిశ్చయించుకొని, "మహాదేవా! కన్యకాక పుత్రుడే నాకు కావాలి" అంటూ ఘోరమైన తపస్సు చేశాడు. ప్రత్యక్షమైన అతనితో "భగవాన్! భీష్మునిపై ప్రతీకారం తీర్చుకోవడానికి పుత్రుని కోరుకొంటున్నాను" అన్నాడు. అంత దేవదేవుడు "మహీపాలా! నీకు మొదట స్త్రీ పుట్టి తరువాత పురుషునిగా మారుతుంది. వెళ్లు. ఇది తప్పక జరుగుతుంది. అన్యథా కానేరదు" అన్నాడు. అతడు నగరానికి వెళ్లి భార్యతో ఇదంతా చెప్పాడు. "నేను చాలా ప్రయత్నించి మహాదేవుని ఆరాధించాను. శంభుడు "కన్య పుట్టి తదనంతరం పురుషుడవుతాడతా"స్తాని చెప్పాడు. నేను పదే పదే యాచించినప్పటికి "ఇదే ఇచ్చాను. అది మరోలా జరుగదు. భవితవ్యం అలా ఉంది" అన్నాడు.

అంతట మనస్విని అయిన ద్రుపదమహారాజు భార్య నియమవతియై ఋతుకాలంలో ద్రుపదుని కలిసి గర్భం దాల్చింది. రాజా! నారదుడు నాకు చెప్పిన రీతిగానే విధ్యుక్త శుభకర్మలతో ఆమె యథాకాలంగా గర్భం మోసింది.

ద్రుపదుడు పుత్రుని మీది మమకారంతో ప్రియభార్య అయిన ఆమెకు సుఖంగా ఉండేలా పరిచరించాడు. ఆమె కోరిన కోరికలన్నీ తీర్చాడు. అపుత్రకుడైన ద్రుపదమహారాజు పట్టమహిషి యథాకాలంలో చక్కని రూపం కల కన్యను ప్రసవించింది. కాని మనస్విని అయిన భార్య "వీ డు నా కొడుకు" అని చాటింది. తరువాత ఆ ద్రుపదుడు రహస్యం దాచిపెట్టి ఆ కన్యకు పుత్రునిలాగే పుత్రకార్యాలన్నీ జరిపించాడు. ఆ ద్రుపదుని పట్టమహిషికూడా పుత్రుడే అని చెప్తూ రహస్యాన్ని రక్షించడానికి సమస్త ప్రయత్నాలూ చేసింది. ద్రుపదునికి తప్పించి ఈ విషయం నగరంలో ఎవరికీ తెలియదు. దేవదేవుని ఆ వాక్యం పట్ల నమ్మకం కలిగి, ఆ కన్యను పురుషునిగానే చెప్తూ అతడు దాచిపెట్టాడు. ఆమెకు జాతకర్మలన్నీ పురుషునికి చేయదగినట్లే ఆ రాజు చేయించాడు. ఆమె శిఖండిగా అందరికీ తెలిసింది. నేను చారుని ద్వారా, నారదుని మాటల వలన, దేవవాక్యం వలన, అలాగే అంబ యొక్క తపస్సు వలన ఈ విషయం (శిఖండి కన్యగా పుట్టిందనే విషయం) తెలుసుకొన్నాను."

189. శిఖండి వివాహము - ఆమె స్త్రీ అని తెలిసి మామ కోపించుట.

భీష్ముడు చెప్తున్నాడు - "అనంతరం ద్రుపదుడు తన కుమార్తెకు చిత్రలేఖనాది విషయాల్లోను, శిల్పకార్యాదులలోను అన్ని విషయాలూ నేర్పడానికి ప్రయత్నం చేశాడు. రాజేంద్రా! ధనుర్విద్యకోసం శిఖండి ద్రోణునికి శిష్యుడయ్యాడు. అతని తల్లి పుత్రుని వంటి ఆ కూతురికి భార్యను తెమ్మని రాజును ప్రేరేపించసాగింది. అంత ద్రుపదుడు యుక్తవయస్కురాలయిన ఆ కన్యను చూచి ఇంకా స్త్రీగానే ఉందని (శివుడు చెప్పినట్లు పురుషుడు కాలేదని) భార్యతో కలిసి చింతించసాగాడు. ద్రుపదుడంటున్నాడు - 'దేవీ! నా ఈ కూతురు సంప్రాప్తయౌవనురాలై నాకు శోకాన్ని మరింత పెంచుతోంది. భగవంతుడైన శూలపాణి మాటల వలన ఈమెను నేను మరుగుపరిచాను.' భార్య ఇలా అంది. - 'మహారాజా! అది ఎన్నటికీ మిథ్య కాబోదు. ముల్లోకాలు సృష్టించగలిగిన శివుడు వ్యర్థమైన మాటలు ఎందుకు చెపుతాడు? రాజా! నీకు ఇష్టమయితే నేను చెప్పేది విను. అది విని నీ బుద్ధికి తోచినట్లుగా గ్రహించు. ఇతనికి ప్రయత్నం చేసి శాస్త్రోక్తంగా భార్యను తీసుకురావాలి. ఆ శివుడు చెప్పిన మాటలు తప్పక నిజం అవుతాయని నా నిశ్చితాభిప్రాయం, ఆ పని జరిపించాలని ఆ దంపతులిద్దరూ నిశ్చయించుకొని, దశార్ణదేశపురాజు కూతురును తమ కొడుకుకి కన్యగా వరించారు.

ద్రుపదుడు సమస్త రాజుల కులగోత్రాలను తెలుసుకొని దశార్ణరాజు కూతురిని శిఖండికి భార్యగా ఎంపికచేశాడు. దశార్ణదేశానికి హిరణ్యవర్మ అనే రాజున్నాడు. ఆ మహీపాలుడు శిఖండికి తన కన్యను ఇచ్చాడు. దశార్ణదేశపు రాజు హిరణ్యవర్మ ఎవరికీ జయింపశక్యం కానివాడు. దుర్ధర్షుడు. చాలా సైన్యం కల మహా మనస్వి. ఆ హిరణ్యవర్మ కూతురు యుక్తవయస్కురాలు అయింది. శిఖండిని కూడా యౌవనవతి అయింది. వివాహం అయిన తరువాత భార్యను తీసుకుని, శిఖండి కాంపిల్యపురానికి తిరిగి వచ్చాడు. అప్పుడు కొంతకాలానికి ఆ రాకుమారి ఆ కన్యను స్త్రీగా తెలుసుకొంది.

హిరణ్యవర్మ యొక్క కూతురు శిఖండిని గూర్చి తెలిసికొని, సిగ్గు పడుతూ తన దాదులకు, చెలికత్తెలకు "పాంచాల రాజుయొక్క కూతురు శిఖండి స్త్రీయే కాని పురుషుడు కా"దని చెప్పింది. అప్పుడు ఆ దశార్ణదేశం నుండి వచ్చిన దాదులు, దాసీలు చాలా దిగులు చెంది తగ్గవారిని ఎంచి దశార్ణరాజు దగ్గరకు పంపారు. దశార్ణాధిపతి యొక్క దాసీలు జరిగిన మోసాన్ని యథాతథంగా వివరించారు. అది విని ఆ రాజుకు కోపం వచ్చింది. మహారాజా! శిఖండి కూడా పురుషుడిలాగే రాజవంశంలో సంతోషంగా తిరుగుతున్నాడు. కాని అతనికి స్త్రీత్వం ఏమాత్రం రుచించడంలేదు. భరతశ్రేష్ఠా! రాజోత్తమా! తరువాత కొన్నాళ్లకు ఈ సంగతి విన్న హిరణ్యవర్మ క్రోధావేశం పొందాడు. తీవ్రమైన కోపంతో దశార్ణరాజు ద్రుపదుని యొక్క భవనానికి ఒక దూతను పంపాడు. ఆ హిరణ్యవర్మయొక్క దూత ఒక్కడే ద్రుపదుని దగ్గరకు వచ్చి అందరినీ బయటకు పంపి ఏకాంతంలో రహస్యంగా అతనితో ఇలా అన్నాడు. 'రాజా! వివాహసంబంధంలో నీచేత మోసగింపబడి, ఎంతో కుపితుడైన దాశార్ణరాజు నీతో ఇలా చెప్పమన్నాడు రాజా! నా కూతురిని నీ కూతురి కోసం మూర్ఖంగా యాచించావు. నన్ను అవమానపరిచావు. ఇది తప్పకుండా నీ కుతంత్రమే. దుర్మతీ! మోసానికి తగ్గ ఫలాన్ని అనుభవించు. ఇదిగో నిన్ను నీ ప్రజలతో, అమాత్యులతో సహితంగా పెల్లగించివేస్తాను. స్థిరచిత్తుడవై ఉండు అన్నాడు.'

190. ద్రుపదుడు భయపడి తన రాణిని ఉపాయ మడుగుట.

"రాజా! దూత ఇలా అనగానే పట్టుబడిన దొంగలాగా ద్రుపదునికి నోటమాట రాలేదు. మధురంగా సంభాషించగల దూతల ద్వారా సంశయం కలిగిన వియ్యంకునకు

అటువంటిదేమో లేదని సందేశం పంపుతూ అతనిని నమ్మించడానికి తీవ్రమైన ప్రయత్నం చేశాడు ద్రుపదుడు. ఆ హిరణ్యవర్మ మళ్లీ విచారించి తెలుసుకొని పాంచాలరాజు కూతురు స్త్రీయే అని నిర్ధారించుకొన్నాడు. కోపంతో తొందరగా ద్రుపదునిపైకి బయల్దేరాడు. దాదుల మాటలద్వారా తన కూతురికి జరిగిన మోసాన్ని గురించి మిక్కిలి పరాక్రమవంతులైన మిత్రులకు సమాచారం పంపాడు. ఆ రాజశ్రేష్ఠుడు బలాల నన్నిటినీ పోగుచేసు కొని, ద్రుపదుని మీదికి దండెత్తడానికి నిశ్చయించుకున్నాడు. ఆ హిరణ్యవర్మ "పాంచాలరాజైన ద్రుపదునితో ఎలా వ్యవహరించాలి"? అని మంత్రులతో కూడి ఆలోచించాడు. మహాత్ములైన మిత్రరాజు లందరూ తమ నిశ్చితాభిప్రాయాన్ని ఇలా వినిపించారు. "రాజా! ద్రుపద రాజు సంతానం శిఖండిని స్త్రీ అవడం నిజమయితే పాంచాలరాజును బంధించి మన ఇంటికి తీసుకువస్తాం. ఆ పాంచాల సింహాసనం మీద ఇతరుని రాజుగా తెచ్చి కూర్చుండ పెడతాం. ఆ ద్రుపదుని శిఖండితో సహితం చంపివేస్తాం." ఆ రాజోత్తముడు మళ్లీ దూతలను ఆజ్ఞాపించి ఆ విషయం అలాగే అని (పురుషుడు కాదు స్త్రీయే- అని) నిర్ధారించుకుని "నిన్ను సంహరిస్తాను. ధైర్యంగా ఉండు" అని ద్రుపదుని వద్దకు దూతను పంపాడు.

ఆ ద్రుపదమహారాజు సహజంగానే భీరువు. పైగా తప్పు చేసి ఉన్నాడు. కనుక తీవ్రమైన భయాన్ని పొందాడు. ద్రుపదరాజు దశార్ణరాజు దగ్గరకు దూతలను పంపి, శోకంతో ఒళ్లు తెలియనివాడై ఏకాంతంలో భార్యతో సమావేశమయ్యాడు. పాంచాలరాజుకు గొప్ప భయం ఆవహించింది. హృదయం శోకంతో పీడింపబడుతోంది. అప్పుడు (శిఖండి తల్లి అయిన) తన ప్రియభార్యతో ఇలా అన్నాడు. మన వియ్యంకుడు గొప్ప బలవంతుడు. ఆ హిరణ్యవర్మ కోపంతో సైన్యాన్ని కూడదీసుకొని నామీదికి దండెత్తి వస్తాడు. ఈ కన్య గురించి ఏం చేయాలో మనిద్దరికీ పాలుపోవడం లేదు. నీ కొడుకు శిఖండి కన్యయే అని శంకించాడు హిరణ్యవర్మ. ఇప్పుడేమి చేద్దాం ఇద్దరం? ఈ విషయమై ఆలోచించి, మోసపోయానని తలుస్తూ హిరణ్యవర్మ మిత్రులతో, సైన్యంతో కలిసి నన్ను వెకలించి వేయడానికి ప్రయత్నిస్తున్నాడు. ఇందులో నిజమేమిటి? భగవంతుడు అబద్ధం ఎందుకు చెప్తాడు? నీవు చెప్పిన మంచి మాటను విని, నేను అలాగే చేస్తాను. నాకు కూడా సందేహంగానే ఉంది. ఈ శిఖండిని స్త్రీగానే ఉంటుంది. మహారాణీ! నీకు కూడా గొప్ప కష్టమే వచ్చింది. కాబట్టి నీవు ఈ సంకటాలన్నీ తీరేలాగ ఒక

ఉపాయాన్ని చెప్పు. నేను అడుగుతున్నాను. నీవు చెప్పినది వెంటనే చేస్తాను. వరారోహా! శిఖండివిషయంలో నీవు భయపడకు. ఆ విషయంలో నేను నిజానికి దయతోనే వ్యవహరిస్తాను. నేను పుత్రధర్మాన్నుండి వంచింపబడ్డాను. నేను దశార్ణరాజును వంచించాను. కాబట్టి ఈ విషయంలో ఏది మేలో అది చెప్పు. దానిని చేస్తాను." ద్రుపదునికి విషయం అంతా తెలిసినా, ఇతరుల దృష్టిలో తన నిర్దోషిత్వాన్ని నిరూపించుకోవడానికి పైకి అలా అన్నాడు. రాణి ఆతనికి ఇలా బదులిచ్చింది.

191. శిఖండి స్థూణాకర్ణుడను యక్షుని కలిసికొనుట.

"మహాబాహూ ! అప్పుడు శిఖండియొక్క తల్లి "శిఖండి కన్యయే" అనే యథార్థ విషయాన్ని భర్తకు చెప్పసాగింది. రాజా ! పుత్రులు లేని నేను సవతులకు భయపడి ఆడపిల్లగా పుట్టిన శిఖండిని మగపిల్లవాడుగా చెప్పాను. నీవు కూడా సంతోషంతో దానిని అంగీకరించావు. ఆ పిల్లకు పుత్రునికి చేసే విధంగానే జాతకర్మలు జరిపించావు. రాజా! దశార్ణాధిపతి హిరణ్యవర్మయొక్క కూతురిని నీవు భార్యగా చేశావు. భగవంతుని మాటలపై నమ్మకం ఉంచి నేను కూడా అలాగే చెప్పాను. ముందు కన్యగా పుట్టి, తరువాత పురుషుడవుతాడని దైవం చెప్పడం వలన కూడా ఈ విషయమై ఉపేక్షించడం జరిగింది." ఇది విని యజ్ఞసేనుడైన ద్రుపదుడు సమస్త విషయాన్ని మంత్రులకు నివేదించాడు. రాజా ! తరువాత ప్రజారక్షణ విషయంలో తగినరీతిగా మంత్రులతో ఆలోచన చేశాడు. దశార్ణ రాజుతో తాను నెరపిన వియ్యాన్ని సమర్థించుకొని, తాను స్వయంగా అతనిని వంచించినప్పటికీ, ఏకాగ్రచిత్తుడై ఆలోచించి అతనితో మృదువుగా వ్యవహరించడానికి ఒక నిశ్చయానికి వచ్చాడు. నగరం స్వతహాగానే ఆపత్కాలం వస్తే సురక్షితంగా ఉండేలా చేయబడినదే. అయినా మరల అంతటా కట్టుదిట్టంగా సురక్షితం చేశాడు. దశార్ణదేశపు రాజుతో విరోధం వచ్చినందుకు భార్యాసహితంగా ఆ రాజు మిక్కిలి వ్యథ చెందాడు. వియ్యంకునితో కయ్యం తనకు ఎలా తప్పిపోతుందా అని మనసులోనే ఆలోచిస్తూ, దేవతలను పూజించడం మొదలుపెట్టాడు. రాజా ! దేవతారాధనలో తత్పరుడై పూజలు చేస్తున్న అతనిని చూచి, అప్పుడు భార్య ఇలా అంది.

'శుభాలు కావాలని కోరుకునే సత్పురుషులకు దేవతలను పూజించడం

ఎప్పుడూ ఉత్తమమే. ఇక శోక సముద్రంలో మునిగినపుడు చెప్పవలసివదేముంది? కాబట్టి నీవు గురువులను, సమస్త దేవతలను భూరిదక్షిణ ఇచ్చి పూజించు. దశార్ణరాజుతో యుద్ధాన్ని ఆపడానికి అగ్నులలో హోమం చేయి. ప్రభూ ! దశార్ణరాజు యుద్ధం చేయకుండానే మరలి పోవాలని మనసులోనే కోరుకో. దేవతల అనుగ్రహంచేత ఇదంతా జరుగుతుంది. ఈ నగరం వినాశం పొందకుండా ఉండేందుకు నీవు మంత్రులతో ఏమంత్రాంగం చేశావో అది పాటించు. **దైవం కూడా పురుషయత్నంతో కూడినపుడే బాగా సిద్ధిస్తుంది. ఆ దైవమానుషాలు రెండూ పరస్పరం విరోధించుకొంటే అవి సిద్ధిని పొందజాలవు.** కాబట్టి రాజా! మంత్రులతో కలిసి నగరంలో కావలసిన ఏర్పాట్లు చేసి నా కోరికకు తగ్గట్టుగ దేవతలను అర్చించు, శోకమగ్నులై ఇలా మాట్లాడుకుంటూ ఉన్న వారిద్దరినీ చూచి తపస్విని అయిన వారి కూతురు శిఖండిని సిగ్గుతో నా గురించే కదా వీరిద్దరూ దుఃఖాన్ని పొందుతున్నారు అనుకొని చింతించింది. అప్పుడామె ప్రాణత్యాగం చేయడానికి నిశ్చయించుకొంది. ఇలా నిశ్చయించుకొని మిక్కిలి దుఃఖంతో ఆమె ఇల్లు వదిలి నిర్జనమైన అడవికి వెళ్లింది. రాజా ! ఆ వనాన్ని సంపన్నుడైన స్థూణాకర్ణుడనే యక్షుడు రక్షిస్తున్నాడు. అతని భయం చేతనే జనులు అక్కడికి వెళ్లడం మానేశారు. ఆ అడవిలో స్థూణాకర్ణుని భవనం ఉంది. అది సున్నం వంటి మట్టితో మెత్తబడింది. ఎత్తయిన ప్రాకారాలతో గృహద్వారాలు కలిగి ఉంది. లాజలు (పేలాలు), వట్టి వేళ్లు కలిపి వేసిన సుగంధ భరితమైన ధూమంతో నిండి ఉంది.

రాజా ! ద్రుపదుని కూతురయిన ఆ శిఖండిని అందులో ప్రవేశించి, చాలా రోజులు తిండి తినకుండా శరీరాన్ని కృశింపచేసుకొంది. యక్షుడైన స్థూణాకర్ణుడు ఆమెను చూశాడు. అతని మనసు మెత్తబడింది. 'అమ్మాయి ! ఈ నీ ఉపవాసప్రయత్నం ఎందుకోసం? వెంటనే చెప్పు చేస్తాను.' అన్నాడు. ఇది అశక్యమని ఆమె పదే పదే యక్షునికి చెప్పింది. అయినా ఆ యక్షుడు 'వెంటనే చేయగలను' అని బదులు చెప్పాడు. "రాజకుమారీ! ధనేశ్వరుడయిన కుబేరుని అనుచరుడను. వరాలు ఇవ్వగలను. ఇవ్వరానిది కూడా ఇవ్వగలను. చెప్పు నీకేం కావాలో" అన్నాడు. అప్పుడు శిఖండిని యావత్ వృత్తాంతాన్ని ఆ యక్షముఖ్యుడైన స్థూణాకర్ణునికి నివేదించింది. శిఖండిని అంది "యక్షా ! నా తండ్రికి కొడుకులు లేరు. అచిరకాలంలోనే నాశాన్ని పొందబోతున్నాడు.

దశార్ణాధిపతి క్రోధంతో అతని మీదికి వస్తున్నాడు. ఆ హేమవర్ముడు అనే రాజు మహాబలవంతుడు. మహోత్సాహం కలవాడు. కాబట్టి యక్షా ! నా తల్లిదండ్రులను అతని బారినుండి రక్షించు. యక్షుడా ! నా దుఃఖాన్ని తీరుస్తా నని మాట ఇచ్చిఉన్నావు. నీ అనుగ్రహంచేత నేను ఏలోపమూలేని పురుషుడిని కావాలి. గుహ్యకా ! ఆ రాజు మా నగరాన్ని సమీపించకముందే నన్ను అనుగ్రహించు."

192. శిఖండి పుంస్త్వమును పొందుట.

"శిఖండి యొక్క మాటలు విన్న తరువాత ఆ యక్షుడు దైవోపహతుడై, మనసులోనే కొంత ఆలోచించుకొని ఆమెతో ఇలా అన్నాడు. "భద్రా ! భవితవ్యం అలా ఉంది. ఇది నాకు దుఃఖకారణమే అయినా నీ కోరిక తీరుస్తాను. నా నియమం (షరతు) చెప్తాను. విను. నా పుంస్త్వం నీకిస్తాను. నీ స్త్రీత్వం నేను తీసుకుంటాను. కాని కొద్ది కాలానికి మాత్రమే నా పుంస్త్వం నీకిస్తాను. గడువులోపు నీవు రావాలి. ఇది సత్యమని, తప్పనని మాట ఇయ్యి. నేను సమర్థుడిని. సంకల్పసిద్ధుడిని. ఇచ్చవచ్చిన రీతిలో తిరగ గలను. ఆకాశచారిని కూడా. నా అనుగ్రహం వల్ల నగరాన్ని బంధువులను కూడా రక్షించుకో. రాకుమారీ ! ఈ ప్రకారంగా నేను స్త్రీత్వాన్ని ధరిస్తాను. నీవు నాకు సత్యప్రతిజ్ఞ చెయ్యి 'గడువు లోపల తిరిగి వచ్చి పుంస్త్వాన్ని ఇస్తా' నని. నీకు నేను ప్రియం చేస్తాను. శిఖండిని ఆటోంది 'సువ్రతా! భగవాన్ ! నీకు పుంస్త్వాన్ని తిరిగి ఇస్తాను. నిశాచరా ! కొద్దికాలం స్త్రీత్వాన్ని ధరించు. దశార్ణరాజు హేమవర్మ తిరిగి వెళ్లి పోగానే నేను కన్యనే అవుతాను. నీవు పురుషుడ వవుతావు.' రాజా ! ఇలా అనుకొని వారిద్దరూ ఒక నియమం (ప్రతిజ్ఞ) చేసుకున్నారు. తరువాత వారిద్దరూ పరస్పరం ఒకరి చిహ్నాన్ని ఒకరు పొందారు. భారతా ! యక్షుడైన స్థూణాకర్ణుడు స్త్రీ చిహ్నాన్ని ధరించాడు. శిఖండి తేజస్వంతమైన యక్ష రూపాన్ని పొందింది.

రాజా ! అనంతరం పాంచాలరాజకుమారుడు శిఖండి పుంస్త్వాన్ని పొంది సంతోషంతో నగరాన్ని ప్రవేశించి, తండ్రిని కలిసికొన్నాడు. జరిగిన వృత్తాంతం యావత్తు ద్రుపదునికి చెప్పాడు. అది విని ద్రుపదుడు మిక్కిలి సంతోషించాడు. ద్రుపదుడు, అతని భార్య కూడా అప్పుడు మహేశ్వరుని మాటలను జ్ఞప్తికి తెచ్చుకున్నారు. అనంతరం ద్రుపదుడు దశార్ణాధిపతి దగ్గరకు "ఈ నా సుతుడు పురుషుడే. మీరు

నా మాటను విశ్వసించ వచ్చును" అని చెప్పి దూతను పంపించాడు. అయితే దుఃఖశోకాలను పొందిన దశార్ణరాజు వెంటనే పాంచాల రాజు ద్రుపదునిపైకి వచ్చిపడ్డాడు. కాంపిల్యనగర సమీపానికి వచ్చిన వెంటనే దశార్ణాధిపతి బ్రహ్మవేత్తలలో శ్రేష్ఠుడైన వానిని ఒక్కనిని సత్కరించి, దూతగా పంపాడు. "దూతా ! ఆ రాజాధముడైన పాంచాలునికి నా మాటగా ఇలా చెప్పు. దుర్మతీ ! నా కూతురిని నీ కూతురికి భార్యగా చేశావు. నేడు ఆ గర్వానికి తగిన ఫలాన్ని చూస్తావు. సందేహం లేదు." ఇలా చెప్పి పంపగా బ్రాహ్మణుడైన ఆ దూత దశార్ణరాజుచేత ప్రేరితుడై నగరానికి బయలు దేరాడు. రాజేంద్రా ! పురోహితుడు పట్టణంలో ద్రుపదుని కలుసుకొన్నాడు. అతనికి పాంచాలరాజు గోవును, అర్ఘ్యమూ ఇచ్చి సత్కరించాడు. శిఖండిని కూడా అక్కడే కలుసుకొన్నాడు. రాజు చేసిన ఆ సత్కారాన్ని స్వీకరించక, అతడు ఇలా అన్నాడు.

వీరుడైన ఆ రాజు కాంచనవర్మ చెప్పినది వినండి. 'పాపాచారుడా ! దుర్మతీ ! రాజా ! నీ కూతురు నన్ను వంచించింది. ఆ పాపకార్యానికి ఫలాన్ని అనుభవించు యుద్ధరంగంలో నిలిచి నాతో యుద్ధం చేయి. వెంటనే (ఇప్పుడే) మంత్రులు, సుతులు, బంధువులతో కూడా అందరినీ పెకలించివేస్తాను. ఈ రీతిగా పురోహితుడు మంత్రులమధ్యలో ఉన్న రాజునకు దశార్ణపతి పలికిన నిందాత్మకమైన మాటలను వినిపించాడు.' ద్రుపదుడు అది విని ప్రేమతో అవనతు డయ్యాడు. అతనితో ఇలా అన్నాడు. 'బ్రహ్మన్! మా వియ్యంకుడు చెప్పమన్నట్లుగా మీరు చెప్పిన దానికి ప్రత్యుత్తరంగా మా దూత ఆ రాజుకు సమాధానం చెప్తాడు.' ఇలా అని ద్రుపదుడు వెంటనే మహాత్ముడైన హిరణ్యవర్మ దగ్గరకు వేదపారగుడైన బ్రాహ్మణుని దూతగా పంపాడు. రాజా ! అప్పుడు దశార్ణాధిపతి అయిన ఆ హేమవర్మ దగ్గరకు వచ్చి ఆ దూత ద్రుపదుడు చెప్పిన మాటలను చెప్పాడు. "ఈ నా పుత్రుడు కుమారుడే (కుమార్తె కాదు). స్పష్టంగా పరీక్షించుకోవచ్చును. ఎవరో చెప్పినది అబద్ధం, దానిని మీరు నమ్మనక్కరలేదు." ద్రుపదుని సందేశాన్ని విని రాజు ఆలోచనలో పడి చక్కని అందమైన రూపాలు గల శ్రేష్ఠమైన యువతులను "శిఖండి స్త్రీయా పురుషుడా" అని తెలుసుకోవడానికి పంపాడు. కౌరవేంద్రా ! అలా పంపబడిన వారు వాస్తవికవిషయాన్ని తెలుసుకుని ఆనందంగా రాజుకు అంతా వివరించి చెప్పారు. దశార్ణరాజు హేమవర్మకు

శిఖండి మహానుభావుడైన పురుషుడని విన్నవించారు. ఆ రాజు పరీక్షించిన తరువాత ప్రీతిని (తృప్తిని) పొందాడు. బంధువుతో కలిసి ఆనందంగా అక్కడ ఉండి పోయాడు. ఆ నరేశ్వరుడు సంతోషించి శిఖండికి ధనం, ఏనుగులు, గుఱ్ఱాలు, గోవులు, దాసీలు మిక్కిలిగా సమర్పించాడు. కూతురిని నిందించి (అబద్ధపువార్త పంపినందుకు), వారిచేత సత్కారాలు పొంది తిరిగి వెళ్లాడు. దశార్ణరాజు హేమవర్మ కోపం పోయి సంతోషంగా తిరిగివెళ్లగానే శిఖండి కూడా సంతోషించింది.

అక్కడ కొంతకాలానికి నరవాహనుడైన కుబేరుడు లోకసంచారం చేస్తూ స్థూణాకర్ణుని ఇంటికి వచ్చాడు. కుబేరుడు ఆ గృహానికి పైభాగాన (ఆకాశంలో) ఉండి పరికించాడు. ఆ భవనం విచిత్రమైన హారాలతో బాగా అలంకరింపబడి ఉంది. పేలాల పరిమళాలు, ఇతరసువాసనలు వ్యాపించి ఉన్నాయి. పైన చాందినీలు కట్టబడి ఉన్నాయి. ధూపాలతో పొగవేయబడి ఉంది. ధ్వజాలతో, పతాకాలతో అలంకరింపబడి ఉంది. అగ్నిహోత్రునికి ఆహుతి చేయాలని అనిపించే భక్ష్యాన్నాలతో పానీయాలతో, ఆమిషంతో (మాంసంతో) నిండి ఉంది. అటువంటి స్థూణాకర్ణుని గృహాన్ని ప్రవేశించాడు కుబేరుడు. అన్నివైపుల చక్కగా అలంకరింపబడి, మణిరత్న సువర్ణహారాలతో పరిపూర్ణమై ఆ భవనం అనేక విధాల పూలసువాసనలతో కూడి ఉంది. గంధాదులతో తడిసి, వస్త్రాదులతో సమృద్ధి పొందింది. లేఖన చిత్రాలతో శోభిస్తూ ఉన్న స్థూణుని ఆ నివాసస్థానం చూచి, యక్షపతి అనుచరులతో అప్పుడిలా అన్నాడు. "మిక్కిలి పరాక్రమవంతుడైన స్థూణుని యొక్క ఈ గృహం చక్కగా అలంకరింపబడి ఉంది. కాని ఆ మందబుద్ధి ఇప్పుడు ఎందుకు నా దగ్గరకు రావడం లేదు ? ఈ మందబుద్ధి నా గురించి తెలిసి కూడా రాలేదు కనుక అతనికి గొప్ప శిక్షను విధించాలని అనుకొంటున్నాను." అన్నాడు. యక్షులు "రాజా ! ద్రుపదరాజుకు శిఖండిని అనే కూతురు కలిగింది. ఒకానొక కారణంగా ఆమె కొఱకు తను పురుషలక్షణాన్ని ఇతడు ఇచ్చాడు. ఆమె యొక్క స్త్రీ లక్షణాన్ని తాను గ్రహించి స్త్రీ రూపంతో గృహంలోనే ఉంటున్నాడు. ఆ కారణంగా స్త్రీరూపధారియైన అతడు సిగ్గుతో మీ దగ్గరకు రాలేదు. ఇది విన్న తరువాత ఏది న్యాయమో అది చేయండి. మీ విమానం ఇక్కడే ఉండనివ్వండి." అప్పుడు కుబేరుడు స్థూణుని 'తీసుకురండి అతనికి నేను దండన విధిస్తాను' అని పదే పదే పలికాడు. అలా పిలిచిన మీదట అతడు కుబేరుని

దగ్గరకు వెళ్లాడు. స్త్రీరూపంలో ఉండడం చేత సిగ్గుతో నిలబడ్డాడు. అతనిని చూడగానే మిక్కిలి కోపించిన కుబేరుడు అతనిని శపించాడు. "గుహ్యకులారా ! ఈ పాపికి స్త్రీత్వం ఇప్పుడిక ఇలాగే ఉండుగాక!"

తరువాత మహాత్ముడైన కుబేరుడు అతనితో ఇలా అన్నాడు. 'యక్షులను అవమానపరచి శిఖండికి నీ పురుష లక్షణాన్ని ఇచ్చి వేశావు. స్త్రీ లక్షణాన్ని గ్రహించావు. జరగకూడని ఈపని నీవు చేశావు. ఈ కారణంగా ఈనాడు మొదలుకొని నీవు స్త్రీగానే, ఆమె పురుషునిగానే ఉంటారు.' అప్పుడు యక్షులందరూ కుబేరుని శాపాంతాన్ని చెప్పమని స్థూణునికోసం పదే పదే ప్రార్థించారు. నాయనా ! అప్పుడు మహాత్ముడైన యక్షేంద్రుడు శాపాంతం చేయాలనే కోరికతో తన అనుచరులైన సమస్త యక్ష సమూహానికి ఇలా బదులిచ్చాడు. "యక్షులారా ! శిఖండి చనిపోయాక స్థూణుడు తన రూపాన్ని పొందుతాడు. కనుక అతడు ఇప్పుడు నిర్భయంగా ఉండును గాక" అని పలికి మహాత్ముడు, భగవంతుడు అయిన యక్షరాజు వారిచే చక్కగా పూజితుడై నిమేషకాలంలోనే స్వస్థానానికి చేరుకోగల తన సమస్తపరివారంతో కూడి బయల్దేరాడు. శాపాన్ని పొందిన స్థూణుడు అక్కడే నివసించసాగాడు. సమయం కాగానే శిఖండి వెంటనే ఆ నిశాచరుని దగ్గరకు వచ్చాడు. అతడు సమీపించి "భగవన్ ! నేను వచ్చేశాను" అని చెప్పాడు. అంతట స్థూణుడు "సంతోషించాను" అని పదే పదే అతనితో అన్నాడు. రాజపుత్రుడు శిఖండి నిజాయితీగా రావడం చూసి అతనికి జరిగిన సమస్తాన్ని ఉన్నదున్నట్లుగా చెప్పాడు. యక్షుడు చెప్తున్నాడు. "రాకుమారా ! నీ గురించి నేను కుబేరుని చేత శాపాన్ని పొందాను. ఇప్పుడు నీవు స్వేచ్ఛగా వెళ్లవచ్చు. సుఖంగా లోకాలన్నీ తిరుగు. ఇది నా పురాతన ప్రారబ్ధం అనుకొంటున్నాను. నీవు ఇక్కడినుండి అటు వెళ్లగానే కుబేరుడు ఇటు వచ్చి కనిపించడం, విధివిలాసం". స్థూణయక్షుడు ఇలా చెప్పగానే శిఖండి పట్టరాని సంతోషంతో నగరానికి తిరిగి వచ్చాడు.

కోరిక సిద్ధించిన కొడుకు శిఖండితో కలిసి ద్రుపదుడు బ్రాహ్మణులను, దేవతలను, గ్రామమధ్యంలో పూజింపబడే రావివంటి చెట్లను, కూడళ్లను వివిధ రకాలైన గంధమాల్యాదుల చేత, ధనరాసుల చేత పూజించాడు. ఆ పాంచాలరాజు బంధువులతో కలసి పరమానందాన్ని పొందాడు. మహారాజా ! పూర్వం స్త్రీగా

ఉండి కొడుకుగా మారిన శిఖండిని శిష్యరికం కోసం ద్రోణునికి అప్పగించాడు. ద్రుపదరాజు కొడుకు అయిన శిఖండి, ధృష్టద్యుమ్నుడు కూడా మీతో కలిసి చతుష్పాదమైన ధనుర్వేదాన్ని నేర్చుకున్నారు. నాయనా ! ద్రుపదుని నగరానికి నేను పంపిన గూఢచారులు జడులులాగ, గ్రుడ్డివారులాగ, చెవిటివారు వలె ఆకారాలు ధరించి సంచరిస్తూ ఈ వృత్తాంతాన్ని జరిగినది జరిగినట్లుగ నాకు నివేదించారు. ఈ రీతిగా ద్రుపదాత్మజుడు, రథికశ్రేష్ఠుడు అయిన ఈ శిఖండి స్త్రీగా పుట్టి, పురుషు డయ్యాడు. అంబ అనే పేరుతో ప్రఖ్యాతి చెందిన కాశీరాజు పెద్ద కూతురు ద్రుపదుని వంశంలో శిఖండిగా పుట్టింది. ధనుస్సు చేతితో పట్టుకొని యుద్ధం చేయాలనే కోరికతో ఎదుటికి వచ్చి నిలిచిన ఇతనిని ముహూర్తకాలం కూడా చూడను. కొట్టనుకూడా కొట్టను. స్త్రీ మీద గాని, పూర్వం స్త్రీగా ఉన్నవాని మీద గాని, స్త్రీ పేరు ఉన్నవాని మీదగాని స్త్రీ రూపం గలవాని మీదగాని నేను బాణం విడువను. ఇది ఎల్లప్పుడూ నేను పాటించే వ్రతం. ఇది లోకంలో అందరికీ తెలిసినదే. నాయనా ! ఈ కారణంగానే శిఖండిని నేను చంపను. శిఖండి యొక్క ఈ జన్మ వాస్తవాన్ని నేను ఎరుగుదును. కాబట్టి యుద్ధరంగంలో అతడు చంపడానికి సిద్ధమై వచ్చినా నేను అతనిని చంపను. భీష్ముడు స్త్రీని చంపాడంటే సత్పురుషులు నిందిస్తారు. అందువల్ల యుద్ధంలో నిలవడం చూచినా గాని నేను అతనిని చంపను. వైశంపాయనుడు అంటున్నాడు. ఇది విని కౌరవరాజు అయిన దుర్యోధనుడు అప్పుడు ముహూర్తకాలం మనసులో ఆలోచించుకొని 'భీష్మునిపట్ల ఇది యుక్తమే' (శిఖండిని చంపకపోవడం) అనుకొన్నాడు."

193. దుర్యోధనునకు భీష్మాదులు తమ తమ శక్తులను ఎరిగించుట.

సంజయుడు చెప్తున్నాడు. తెల్లవారిన తరువాత తిరిగి నీ కొడుకు సమస్త సైన్యమధ్యంలో భీష్ముడిని ఇలా అడిగాడు. "గాంగేయా ! యుద్ధానికి సిద్ధంగా ఉన్న పాండవుల యొక్క ఈ సైన్యంలో గొప్ప కాల్బలం, గజసైన్యం, అశ్వసైన్యం ఉంది. గొప్పరథాలతో నిండి ఉంది. మహాబలవంతులైన లోకపాలురతో సమానమైన భీమార్జునులు మొదలైన విలుకాండ్రచేత ముందునడిచే ధృష్టద్యుమ్నునిచేత రక్షించబడుతోంది. పోటెత్తిన సముద్రంలా అది సమీపించటానికి గాని వారించడానికి గాని సాధ్యం కాదు. మహాయుద్ధంలో దేవతలు కూడా ఈ సేనాసాగరాన్ని కలతపెట్టలేరు. గంగానందనా!

ఎంత కాలంలో ఈ సైన్యాన్ని సంహరించగలవు. గొప్ప విలుకాడైన ఆచార్య ద్రోణుడు గాని బలవంతుడైన కృపాచార్యుడు గాని, యుద్ధాన్ని కొనియాడుతూ ఉండే కర్ణుడు గాని, బ్రాహ్మణోత్తముడైన అశ్వత్థామ గాని, ఎంతకాలంలో సంహరించగలరు ? మీరందరూ నా సైన్యంలో దివ్యాస్త్రకోవిదులు. ఇది తెలుసుకోవాలని కోరికగా ఉంది. నిత్యమూ నా మనసులో ఉండే గొప్ప కుతూహలం ఇది. కాబట్టి నాకు నీవు చెప్పాలి." అనగానే భీష్ముడు చెప్తున్నాడు - "కురుశ్రేష్ఠ శత్రువుల బలాబలాలను అడిగావు. ఇది నీకు తగినదే. రాజా ! నాకు యుద్ధంలో ఉండే అధికమైన శక్తి, శస్త్రపరాక్రమం, భుజబలం అన్నీ చెప్తాను విను. సాధారణ జనులతో సరళంగా యుద్ధం చేయాలి. మాయావులతో మాయాయుద్ధం చేయాలి. ఇది ధర్మశాస్త్రాలు నిశ్చయించినది. ప్రతిదినం పాండవసైన్యాన్ని భాగాలుగా చేసి పగటి పూర్వభాగంలోనే చంపుతాను. పదివేల యోధులు, వేయి రథికులు ప్రతిదినం నా పాలికి ఒక భాగం అనుకొంటున్నాను. ఈ విధానం అవలంబించి సన్నద్ధుడనై, ఎల్లప్పుడూ సంసిద్ధంగా ఉండి, ఆ మహాసైన్యాన్ని అనతి కాలంలోనే సంహరించగలను. నేను యుద్ధంలో నిలబడి లక్షమందిని చంపగల మహాస్త్రాలను వేస్తే ఒక నెలలో పాండవ సైన్యాన్ని చంపగలను."

భీష్ముని ఆ మాటలు విని దుర్యోధనుడు తరువాత ద్రోణుని అడిగాడు - "ఆచార్యా! పాండుపుత్రుని సైనికులను ఎంత కాలంలో చంపగలరు?" అని. ద్రోణుడు నవ్వుతూ ఇలా బదులు చెప్పాడు. "మహాబాహూ! నేను వృద్ధుడి నయ్యాను. ప్రాణశక్తి, చురుకుతనం తగ్గిపోయాయి. అయినా పాండవసైన్యాన్ని నా శస్త్రాగ్నిచేత దహించివేయగలను. శాంతనవుడైన భీష్మునివలెనే నాకూ నెల రోజులు పడుతుందని నా ఉద్దేశ్యం. ఇది నాకున్న శక్తి . ఇది నాకున్న పరమబలం." శారద్వతుడైన కృపుడు **రెండు నెలలని** చెప్పాడు. ద్రోణసుతుడు మాత్రం **పదిరోజుల్లోనే** సేనాసంహారం చేస్తానని ప్రతిజ్ఞ చేశాడు. మహాస్త్రవిదుడైన కర్ణుడైతే ఐదు రోజులే అని ప్రతిజ్ఞ చేశాడు. సూతపుత్రుని ఆ మాట విని గంగాసుతుడైన భీష్ముడు పెద్దగా బిగ్గరగా నవ్వాడు. ఇలా కూడా అన్నాడు. "రాధేయా ! యుద్ధభూమిలో బాణాలు, శంఖం, ధనుస్సు ధరించి, వాసుదేవునితో కూడి రథం మీద వచ్చే పార్థుడిని కలుసుకోనంతవరకు ఇలాగే గర్వపడుతూ ఉంటావు. ఇష్టానుసారంగా పెక్కుమాటలు ఇలా మాట్లాడడానికీ వీలవుతుంది లే."

194. అర్జునుడు ధర్మజునకు తమవారియొక్క శక్తులను వివరించుట.

ఇది విన్న యుధిష్ఠిరుడు తన తమ్ములందరినీ ఏకాంతంగా పిలిచి ఇలా అన్నాడు. "దుర్యోధనుని సైన్యంలో ఉన్న నా గూఢచారులు ఈ ప్రభాతసమయంలో అక్కడి వార్తను నాకు తెల్పారు. దుర్యోధనుడు మహావ్రతుడైన భీష్ముని "ప్రభూ! పాండవులసైన్యాన్ని ఎంత కాలంలో చంపగలవు?" అని అడిగాడుట. ధృతరాష్ట్రసుతుడైన ఆ దుర్మతికి నెలరోజులు అని సమాధానం చెప్పాడుట భీష్ముడు. అంతేకాలం అని ద్రోణుడు నొక్కి చెప్పాడు. రెట్టింపుకాలం అని కృపాచార్యుడు చెప్పాడని నాకు తెలిసింది. మహాస్త్రకోవిదుడైన అశ్వత్థామ పదిరోజులని ప్రతిజ్ఞ చేశాడట. అనంతరం కురుసభలో అడిగిన వెంటనే కర్ణుడు ఐదురోజులలో ససైన్యంగా చంపుతానని ప్రతిజ్ఞ చేశాడట. అర్జునా ! కాబట్టి నేను కూడా నీ మాటలను వినాలనుకొంటున్నాను. ఎంతకాలంలో శత్రువులను సంహరించగలవు ?

రాజు ఇలా అడగగానే ధనంజయుడు వాసుదేవునివైపు చూసి ఇలా బదులిచ్చాడు. "మహారాజా ! నిస్సంశయంగా ఈ మహాత్ము లందరూ అస్త్రవిద్యలో ఆరితేరినవారు. చిత్రవిచిత్రంగా యుద్ధం చేయగలిగినవారు. చంపగలరు. సందేహం లేదు. నీవు మనసులో దిగులుపడకు. నేను ఉన్న నిజాన్ని చెపుతున్నాను. వాసుదేవుని సహాయంతో ఒకే ఒక్క రథంతో దేవతలతో సహితంగా ముల్లోకాలను, సమస్త చరాచర ప్రాణులను, భూతవర్తమాన భవిష్యత్తులను కూడా నిమేషమాత్రకాలంలోనే మట్టుపెట్టగలనని నా నిశ్చయం. కిరాతవేషంలో ద్వంద్వయుద్ధసమయంలో పశుపతి నాకు ఇచ్చిన ఘోరమైన మహాస్త్రం నా దగ్గర ఉంది. యుగాంతంలో పశుపతి సర్వ భూతసంహారం చేస్తూ ప్రయోగించే ఆ అస్త్రం నా దగ్గర ఉంది. రాజా ! ఆ అస్త్రాన్ని గూర్చి గాంగేయుడు గాని, ద్రోణుడు గాని, ద్రోణసుతుడైన అశ్వత్థామ గాని ఎరుగరు. ఇక సూతపుత్రుడు కర్ణు డెక్కడ ? అయినా యుద్ధంలో ఇతర సాధారణజనాన్ని దివ్యాస్త్రాలతో చంపడం ఉచితం కాదు. మేము సరళంగా చేసే యుద్ధంతోనే శత్రువులను జయించగలం. రాజా ! అలాగే ఈ పురుషసింహు లందరూ నీకు సహాయం చేయడం కోసమే ఉన్నారు. అందరూ దివ్యాస్త్రకోవిదులు. అందరూ యుద్ధం మీద మక్కువ కలవారు. పాండుపుత్రా ! ఈ అందరూ వేదాధ్యయనం చేసి చివర అవబృథస్నానం (పవిత్రస్నానం) చేసినవారు. యుద్ధంలో పరాజయం ఎరుగరు. దేవతల సైన్యాన్ని కూడా యుద్ధంలో

నాశనం చేయగలరు. శిఖండి, సాత్యకి, ధృష్టద్యుమ్నుడు, భీమసేనుడు, కవల లిద్దరు (నకులసహదేవులు) యుధామన్యుడు, ఉత్తమౌజుడు, విరాట ద్రుపదు లిద్దరూ యుద్ధంలో భీష్మద్రోణులతో సమానులు. శంఖుడు, ఘటోత్కచుడు, (అతని కొడుకు)అంజనపర్వుడు, సాత్యకి నీకు సహాయులుగా ఉన్నారు. అభిమన్యుడు, ద్రౌపది యొక్క ఐదుగురు కుమారులు నీవెంట ఉన్నారు. స్వయంగానే నీవు ముల్లోకాలను నాశనం చేయగల సమర్థుడవు. ఇంద్ర సమాన తేజస్సు కల కురుపుంగవా! నీవు క్రోధంతో ఎవరిని చూస్తే అతడు వెంటనే నశిస్తాడు. నీలో ఉన్న ఈ శక్తిని నేను ఎరుగుదును."

195. కౌరవసేన యుద్ధమునకు బయలుదేరుట.

తదనంతరం బాగా తెల్లవారాక ధృతరాష్ట్రసుతు డైన దుర్యోధనుడు ప్రేరేపించగా రాజు లందరూ పాండవులమీదికి బయల్దేరారు. వారందరూ స్నానం చేసి శుచులై పుష్పమాలలు, తెల్లని వస్త్రాలు ధరించి ఉన్నారు. బ్రాహ్మణులచేత స్వస్తివాచకాలు చెప్పించుకొన్నారు. అగ్నులలో హోమాలు చేశారు. పతాకాలు కట్టుకున్నారు. శస్త్రాలు ధరించారు. వాళ్లంతా బ్రహ్మవిద్యావేత్తలు. పరాక్రమవంతులు. వ్రతనియమాలను చక్కగా పాటించేవారు. అందరూ కవచధారులు. అందరూ యుద్ధలక్షణాలు కలిగినవారు. వారంతా మహాబలవంతులు. యుద్ధాలలో శత్రు సమూహాలను గెలవా లనుకొనేవారు. ఏకాగ్రమనస్కులు. పరస్పర విశ్వాసం కలిగినవారు. అవంతీరాకుమారులు విందుడు, అనువిందుడు, బాహ్లికులతో పాటు కేకయులు – వీరందరూ భరద్వాజ వంశీయుడైన ద్రోణుని ముందుంచుకొని బయల్దేరారు. అశ్వత్థామ, భీష్ముడు, జయద్రథుడు, దక్షిణదిక్కు నుండి, పడమటిదిక్కునుండి వచ్చిన రాజులు, పర్వతీయులైన రాజులు, శకుని, తూర్పున ఉత్తరానగల రాజులు, శకులు, కిరాతులు, యవనులు, శిబి,వసాతి వంశస్థులు – ఈ మహారథులందరూ తమ తమ సేనలతో సహితంగా మహారథికుడైన భీష్ముని చుట్టూ కూడి, ద్వితీయదళంగా బయలుదేరారు. సైన్యసహితుడైన కృతవర్మ, మహారథుడైన త్రిగర్తుడు, తమ్ముళ్లతో పరివేష్టింపబడిన దుర్యోధనుడు, శలుడు, బృహద్రథుడు వీరంతా దుర్యోధనుని ముందుంచుకొని వెనుకనే అనుసరించారు. మహాబలు లైన ధృతరాష్ట్రపుత్రు లందరూ కలిసి యథోచితంగా కవచధారులై, కురుక్షేత్రానికి పశ్చిమ దిక్కున నిలిచిఉన్నారు.

చక్కగా అలంకరింపబడిన రెండవ హస్తినా పురమా అనిపించేటట్లు దుర్యోధనుడు శిబిరాన్ని ఏర్పాటు చేయించాడు. నగరవాసులై, నేర్పరులైన నరులు కూడా పట్టణానికి, శిబిరానికి తేడా ఏమిటో తెలుసుకోలేకపోయారు. దుర్యోధన మహారాజు ఇతరరాజులకు కూడా అటువంటివే వందల వేలకొద్దీ దుర్గాలు, శిబిరాలు నిర్మింప చేశాడు. రాజా! ఆ రణభూమికి చుట్టూ ఐదుయోజనాల దూరం వదిలివేసి, వందలకొద్ది సేనా శిబిరాలను వేయించాడు. అక్కడి ఆ రాజు లందరూ తగిన ఉత్సాహంతో, తగిన బలంతో, సామగ్రితో నిండిన ఆ వేల కొద్దీ శిబిరాలలోకి యుద్ధసన్నద్ధులై ప్రవేశించారు. దుర్యోధనమహారాజు సైన్యసమేతు లైన ఆ మహాత్ములకు వారి గుఱ్ఱాలకు, మనుష్యులు అందరికీ, శిల్పకర్మలకు, ఇంకా అనుసరించివచ్చిన సూతమాగధ వంది జనాలకు అత్యుత్తమమైన భక్ష్యభోజ్యాలు ఆదేశించాడు. వణిజులు, గణికలు, గూఢచారులు ఇంకా జను లందరిని కౌరవరాజు శాస్త్రోక్తంగా పరిశీలించాడు.

196. పాండవసేన యుద్ధమువకు బయలుదేరుట.

వైశంపాయనుడు చెప్తున్నాడు - భారతా ! అదే సమయంలో యుధిష్ఠిరుడు, ధృష్టద్యుమ్నుడు మొదలైన వీరులను కదలమని ఆదేశించాడు. చేది, కాశి, కరూష దేశాలకు అధిపతులను, ధృష్టకేతుని కూడా ఆజ్ఞాపించాడు. విరాటుడు, ద్రుపదుడు, యుయుధానుడు, శిఖండి, పాంచాల రాజకుమారులు యుధామన్యుడు, ఉత్తమౌజసుడు కూడా ఆదేశాలు పొందారు. ఆ వీరులందరూ చిత్రవిచిత్రమైన కవచాలు, బంగారు కుండలాలు ధరించిఉన్నారు. హోమ కుండాలలో నేతితో తడిసిన అగ్నులవలె ప్రజ్వరిల్లుతున్నారు. మహాధనుర్ధారులై ఆకాశంలో వెలుగొందుతున్న గ్రహాల్లా శోభిస్తున్నారు. యుధిష్ఠిరుడు ఆ సైన్యాన్ని యోగ్యతానుసారంగా పూజించి, సేనావాహినిని ప్రయాణానికి ఆదేశించాడు. ఆ మహాత్ములకు వారి సైన్యానికి, వారి వాహనాలకు, వారితో ఉన్న గజాలకు, అశ్వాలకు, మనుష్యులకు, శిల్పకారులకు కూడా ఉత్తమోత్తమ మయిన భక్ష్యభోజ్యాల కోసం ఆదేశించాడు. పాండునందనుడు ధృష్టద్యుమ్నుని ముందుంచి అభిమన్యుని, బృహంతుని, ద్రౌపదీసుతులను - వీరందరిని మొదట పంపాడు. భీముని, సాత్యకిని, ధనంజయుని ముందుంచి సేనాసముదాయాన్ని ద్వితీయ దళంగా యుధిష్ఠిరుడు పంపాడు. అక్కడ సంతోషంగా యుద్ధసామగ్రిని సిద్ధం చేస్తున్న గుఱ్ఱాలను

అదిలిస్తూ అటు ఇటు పరిగెడుతున్న యోధులు చేసే శబ్దం ఆకాశాన్ని తాకుతున్నట్లుగా ఉంది.

ఆ వెనుక మిగిలిన ఇతర రాజులతో కలిసి, విరాటుడు, ద్రుపదుడు తోడు రాగా స్వయంగా యుధిష్ఠిరుడు బయలుదేరాడు. భయంకరమైన ధనుర్ధారులతో కూడి, ధృష్టద్యుమ్నుని చేత రక్షింపబడుతున్న ఆ సేన గంగానదిలా నిండుగా ఒకప్పుడు స్తిమితంగా, ఒకప్పుడు ప్రవహిస్తూ (కదులుతూ) కనిపిస్తోంది. యుధిష్ఠిరుడు ధృతరాష్ట్రకుమారుల యొక్క బుద్ధి నిశ్చయాన్ని మోహపెడుతూ, వారి మనో నిశ్చయాన్ని కలత చెందిస్తూ, సేనా వాహినిని మరల సంయోజన చేశాడు. యుధిష్ఠిరుడు ద్రౌపదీసుతులను, అభిమన్యుని, నకుల సహదేవులను, సమస్త ప్రభద్రక వీరులను, పదివేల ఆశ్వికసైన్యాన్ని, రెండు వేల గజసైన్యాన్ని, పదివేల కాల్బలాన్ని, ఐదువందల రథాలను ప్రథమ దళంగా చేసి భీమసేనునికి అప్పగించాడు. యుధిష్ఠిరుడు మధ్యమదళంలో విరాటుని, జయత్సేనుని, యుధామన్యు ఉత్తమౌజసులను ఉంచాడు. ఆ పాంచాల వీరులు పరాక్రమవంతులు. మహాత్ములు. గదా కార్ముకాలను ధరించినవారు. మధ్యలో వాసుదేవుడు, అర్జునుడు వారిని అనుసరించి వెళ్తున్నారు. ఇంతకు మునుపు యుద్ధంలో పాల్గొన్న నరులు మిక్కిలి ఆవేశపూరితు లయ్యారు. ఇరవై వేల గుఱ్ఱాల మీద శూరులు అధిష్ఠించి ఉన్నారు. ఐదువేల గజసైన్యం రథికులు వారి కన్నివైపుల ఉన్నారు. ధనుస్సులు, కత్తులు, గదలు ధరించిన పదాతులు వేలకొద్దీ ముందువెనుకల నడుస్తున్నారు. ఆ సేనా సముద్రంలో స్వయంగా యుధిష్ఠిరుడు ఉన్న చోట పృథివీపాలురు అధికసంఖ్యలో అతనిని చుట్టు ముట్టి ఉన్నారు. అక్కడ వేయి ఏనుగులు, పదివేల గుఱ్ఱాలు, వేయి రథాలు, పదాతి సైన్యం ఉన్నాయి. తన గొప్ప సైన్యంతో చేకితానుడు, చేదిదేశపురాజు ధృష్టకేతుడు బయలుదేరారు. వృష్ణివంశంలో శ్రేష్ఠుడు, సాత్యకి లక్షమంది సైన్యం చుట్టూ చేరి ఉండగా గర్జిస్తూ బయలుదేరాడు. క్షత్రదేవుడు, బ్రహ్మదేవుడు రథస్థులయి సేన వెనుక భాగాన్ని రక్షిస్తూ వెనుకనే బయలుదేరారు. బళ్లు, అంగడివస్తువులు, వస్త్రభూషణాదులు, యుద్ధానికి కావలసిన వాహనాలు అన్నిటిని, ఇంకా వేయి ఏనుగులు, పదివేల గుఱ్ఱాలను, బాలురు మొదలైన వారిని స్త్రీలను, కొద్దిగ కృశించి దుర్బలంగా ఉన్నవారిని, ధనరాసులను మోసేవారిని, ధాన్యాగారాన్ని వీటన్నిటిని సమీకరించుకొని గజసైన్యంతో యుధిష్ఠిరుడు మెల్లగా బయలుదేరాడు.

అతనిని అనుసరించి సత్యధృతి, శ్రేణిమానుడు, వసుదానుడు, కాశీరాజు కొడుకు బయలుదేరారు. ఇరవై వేల రథసైన్యం, గొప్ప కింకిణీనాదాలతో పదికోట్ల ఆశ్వికసైన్యం, పొడవైన దంతాలు కలిగి మదజలం స్రవిస్తూ మేఘాల్లా వ్యాపించి నడుస్తున్న ఇరవైవేల గజబలం వారిని అనుసరించాయి. ఇవి కాక యుద్ధంలో మహాత్ముడైన యుధిష్ఠిరునికి ప్రత్యేకంగా డెబ్భైవేల గజసైన్యం ఉంది. అవి కురుస్తున్న మేఘాల్లా మదజలం స్రవిస్తూ ఉన్నాయి. కనలుతున్న పర్వతాల్లా రాజును వెన్నంటి వస్తున్నాయి. ఈ విధంగా ధీమంతు డయిన ఆ కుంతీపుత్రుని దగ్గర భయంకరమైన సైన్యం ఉంది. దానిని ఆసరాగా చేసుకుని ధృతరాష్ట్రుని కుమారుడైన దుర్యోధనునితో యుద్ధానికి సిద్ధపడ్డాడు. వీటిని మించి వెనుక లక్షల కొద్దీ కాల్బలం, వారి సేనలూ హుంకరిస్తూ బయలుదేరాయి. ఆ యుద్ధభూమిలో లక్షలమంది నరులు హర్షంతో వేలకొద్దీ భేరీలను, శంఖాలను మ్రోగించసాగారు.

ఇది ఉద్యోగపర్వం


A.C.NO 96358

భారతం ఎందుకు చదవాలి ?

1. మనం భారతీయులం కనుక. భారతీయులుగా పెరగాలంటే భారతీయులుగా మిగలాలంటే భారతం చదివి తీరాలి.
2. నీవు - నేను అనే భేదం విడిచి మనం అనే భావం పెరగాలంటే... భారతం చదివి తీరాలి.
3. మనల్ని మనం చక్కగా పరిపాలించుకోవాలంటే... భారతం చదివి తీరాలి.
4. ప్రపంచంలో మన ఉనికిని నిలుపుకోవాలంటే... భారతం చదివి తీరాలి.
5. ప్రజలంతా నా బంధువులు, మిత్రులు అనే భావం పెరగాలంటే... భారతం చదివి తీరాలి.
6. దేవ, ఋషి, పితృఋణాలతో పాటు మనుష్యఋణం తీర్చుకోవాలంటే... భారతం చదివి తీరాలి.
7. పాలించడమంటే చెప్పుకిందకి తొక్కడం కాదనీ రక్షించడమనీ తెలియాలంటే... భారతం చదివి తీరాలి.
8. బుద్ధిజీవి అయిన మానవుడు వయసులో ఉన్నప్పుడే భారతం చదివితే ఇహపర శ్రేయస్సులు రెండూ అందుకోగలడు. కనుక ముందుగా యువతరం భారతం చదివి తీరాలి.
9. తీవ్రబుద్ధి మనిషి మనస్సును చీలుస్తుంది - సద్బుద్ధి మనుషుల మనస్సులను బుద్ధులను కలుపుతుంది. ఆ భావన కోసం... భారతం చదివి తీరాలి.